


శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 44



# వెల్చేరు చంద్రశేఖర్ కథలు

### రచయిత ఇతర రచనలు

# గృహ నిర్మాణ శాస్త్రం (వాస్తు)

**ఈ పుస్తకంలో .....**

- గృహనిర్మాణ సాంకేతిక విషయములకు సులభమైన వివరణ
- బంకమన్ను నేలల్లో ప్రత్యేకమైన పునాదులు
- ఇంట్లో చెమ్మ నివారించుటకు పరిష్కారములు
- ఇరవై ప్లానులు, వాటి ఎస్టిమేటులు, వాటి ముఖద్వారము, ఏ దిక్కుగా వచ్చిన వాస్తు సరిపోవును అన్న విషయ వివరణ.
- ప్రాచీన వాస్తు, దాని అంగములు
- ఇటిక కట్టు, రాతి కట్టు వాటి సాంకేతిక వివరణ.
- గృహములో నిర్మించు బాత్రూము, కిచెను నందు ఏర్పరచుకొను సదుపాయముల గురించి సాంకేతిక పరిచయం
- పలురకములు గచ్చు నిర్మాణ పద్ధతులు

వెల: రు 100 (పోస్టేజి అదనం)

**హోపీహోమ్ పబ్లికేషన్స్**

**HIG-II-39 SFS (Upstairs)**
**(Near Saibaba temple)**
**Housing Board Colony, P.M. Palem,**
**VISAKHAPATNAM - 530 041**
**velcherucs@rediffmail.com**

# వెల్చేరు చంద్రశేఖర్ కథలు



హాపీహోమ్ పబ్లికేషన్స్
విశాఖపట్నం

# వెల్చేరు చంద్రశేఖర్ కథలు

వెల్చేరు చంద్రశేఖర్

---

ముద్రణ - సెప్టెంబర్ 2009

ప్రతులకు: హాపీహోమ్ పబ్లికేషన్స్
HIG-II-39 SFS (upstairs)
(Near Saibaba temple)
Housing Board Colony
P.M. Palem, VISAKHAPATNAM - 530 041
velcherucs@rediffmail.com

ముద్రణ :
ఆకాష్ ఆఫ్‌సెట్, సామర్లకోట.
ఫోన్ : 0884 - 2329454.

# వెల

పై కేప్షన్ వుండవలసిన స్థానంలో కాక, ఇలా వెలిసిందని ఆలోచిస్తున్నారా. ఇదే కథల సంపుట్ల ఫ్యూచరు.

ఈ పుస్తకాన్ని చాలామంది కొనరు, కొన్నా చదవరు. అందుకని దీనికి వెల పెట్టలేదు.

కొనని వాళ్ళది, చదవని వాళ్ళది తప్పుకాదు. ఈనాటి కథల్లో ఆ సత్తా లేదు, ఈ నాటి జనరేషనుకి అవసరం లేవు.

ఇది వొక మార్పు. దీన్ని నేను వొప్పుకున్నాను. కానీ ఏ కొద్దిమంది కోసమో రాసి, వాళ్ళకి అమ్ముదామనే తాపత్రయం నాకులేదు.

ఇంక ఈ కథల కొస్తే -

"జనాభా", మనుషులు, మానవ సంబంధాలు, దానవ పరిస్థితులు, ధన సామ్రాజ్యం, విలువల రెలిటివిటీ, నిజాయితీ కొడిగట్టుతనం చేసిన ఎలిమెంట్స్‌గా ఈ కథలు వుంటాయి.

నేను చెప్పలేనివి ఈ కథల వెనక అట్ట మీద ఒక గొప్పరచయిత చెప్పారు.

కాబట్టి వీటికి వెలలేదు. మీ ఇష్టం ఎక్కడైనా ఈ పుస్తకం కొనాల్సి వస్తే మీకు తోచిన వెల నిచ్చి తీసుకోండి. అది వుపయోగపడొచ్చు. కాని ఇది ఏ పుస్తకాల షాపుల్లో దొరకదు.

ఇది కొనదల్చుకోకపోతే ఈ పుస్తకం ఇంటర్నెట్‌లో దొరుకుతుంది. నన్ను పంపమంటే మీ e-mail address కి పంపుతాను. లేదా కౌముది అని e-పత్రిక వస్తోంది. దాని లైబ్రరీలో వుంటుంది.

- (velcherucs@rediffmail.com)

## విషయసూచిక...


| | | |
|---|---|---|
| పిడచ | - | 5 |
| తంతు | - | 40 |
| ఫెమినిటీ | - | 58 |
| మండీ | - | 64 |
| ది వూండ్ | - | 70 |
| హత్య | - | 85 |
| దహతి | - | 94 |
| టచ్ | - | 101 |
| గోరింత దీపం | - | 106 |
| హింస | - | 109 |
| త్రిబుల్ ఎక్స్ గర్ల్ | - | 112 |
| బతుకు భయం | - | 124 |
| బురద బ్రాండ్ మసాలా! | - | 131 |
| ఇదీ వొక తెలివే..... | - | 133 |
| మార్పుకి మూలం... | - | 140 |
| చివరికోరిక | - | 147 |
| ముల్లు | - | 159 |
| స్వీకృతి | - | 171 |
| ప్రేతాత్మ | - | 183 |
| అయిదో దొంగ | - | 192 |
| విలువలు | - | 199 |
| కష్టం | - | 203 |
| అతిధి మానవోభవ | - | 207 |
| వలస | - | 211 |

# పిడచ

"దుర్గొచ్చాడు"

వార్తే గుప్పుమంది.... యింగువ డబ్బా తెరిచినట్టు... ఇల్లంతా హడావిడిగా వుంది. అది శవం లేచిన యిల్లు... ఇంటి పెద్ద కాలం చేసాడు. నేటికి మూడో రోజు, తొంభై యేళ్ళు బతికి, వయసు చివికి, నిండు జీవితానికి, యిహానికి స్వస్తి పలికి, కాలం చేసాడు. అందుకే అది పెళ్ళి వారిల్లులా చిన్నాన్నలూ, పెదనాన్నలు, మావయ్యలు, అత్తయ్యలూ, అక్కలూ, తమ్ముళ్ళూ, అన్నయ్యలూ, వదినలూ, వొకరేమిటి? మానవ కుటుంబాల్లో యెన్ని బంధుత్వాలుండాలో అన్నీ పెనవేసుకుని కోలాహలంగా వుంది. అందరూ అభిమానాలు పంచుకుంటూ మాటల్లో విసుక్కుంటూ... చిరుకోపాలు ప్రదర్శించుకుంటూ .... హాస్యాలు ఆడుకుంటూ, వొకర్ని వొకరు దెప్పుకుంటూ, పోయిన ఇంటి పెద్దకి శ్రద్ధాంజలి ఘటించడానికి వచ్చారు. విచారం... శోకం... యెందు కుంటాయి? అందరూ కలిసిన సందడే. పరిపూర్ణ జీవితం యెలా ముగుస్తుందో, ఆ యింట్లో సందడి చూస్తే తెలుస్తుంది.

'ఇంతమంది వచ్చినా దుర్గ రాడేమో?' అన్న అనుమానం కొందరికి వుంది. ఆ అనుమానానికి తెర దించుతూ... దుర్గొచ్చాడు.

"వచ్చాడూ బూతులకి కొదవుండదు" అంది పెద్ద వదిన నవ్వుతూ... ఆ నవ్వులో వెక్కిరింపు తొంగి చూసింది.

"మసాలాకి కొదవుండదు" అంది లక్ష్మక్క.

'నీకేం మసాలా కావాలే?' అంది భారతక్క నవ్వుతూ.

"నీకేం బూతులు కావాలొదినా?" అని అడుగుదామని అనుకున్నా, కానీ వొదిన పెద్దరికం పీట మీదుంది...నేనావిడ్ని చిన్నబుచ్చుకోడదు.

ఈ బూతుల విషయంలో నాకో డౌటు పైకెన్ని నీతులు చెప్పినా మనోకుహరాల్లో యెక్కడో అన్‌విజువల్ యిష్టం వుంటుందేమో మనిషికి... బూతులు కూడా మామూలుగా పెదవుల మీదికి రావు... మనిషిలో కసి పేరుకుపోయి, మస్తిష్కంలోంచి వొక 'అర్జ్' బూతులుగా పెదవుల మీదకి వస్తుందేమో! వొక్కొక్కప్పుడు చేతగానితనం బూతులుగా మార్పు చెందుతాయేమో...అందుకే శోషణకి గురైన జనంలో, ఈ బూతుల కసి యెక్కువగా వుంటుంది.

"దుర్గొచ్చాడూ - యింక మూకుడ్లో పేలాలు పేలినట్టుంటుంది... యిల్లు" అందత్త.

దుర్గన్నయ్యని అందరూ అలా అనుకోడం నాకు నచ్చలేదు. తరుగుతున్న ఉల్లిపాయలు పక్కకి తోసి వరండాలోకి... పరిగెట్టా...

"యెందుకో అంత పరుగు? వచ్చిన వాడు యెక్కడికి పోతాడూ?''అంది పెద్దొదిన వెనక నించి.

"ఆయన పాండిత్యానికి ఈవిడ ముసుముసులకి...సరి'' చిన్నొదిన కామెంటు.

"వచ్చినవాడు పైవాడేం కాదుగా....? అలా అంటావేం వొదినా?...'' అంటూ చేస్తున్న పనిని పక్కకి పెట్టి, చీర చెంగుకి చెయ్యి తుడుచుకుంటూ నా వెనుకే వచ్చింది భారతక్క....

నడవలో గుడ్డి ఎలక్ట్రిక్ దీపాల వెలుగు నీడల్లో దుర్గన్నయ్యని చూస్తే, మనసులో యెక్కడో కలుక్కుమంది. మెడ మీదకి జారుతున్న జులపాల్లాంటి జుత్తు... మాసిన గెడ్డం... తనది కాని షర్టూ, చెప్పుల్లేక పగిలిన పాదాలూ, యెండిపోయిన చెట్టుకొమ్మలా వున్నాడు. 'కొల్లాయుంచితి కోక సుట్టితిన్, మహోకూర్పాసనమున్ దొడివితిన్' అన్నట్టుగా వున్నాడు.

నడవలో దుర్గని చూసినవాళ్ళెవ్వరూ కౌగిలించుకు యేడిచెయ్యలేదు. భారతక్క మాత్రం "నాన్న పోయాడ్రా..'' అంది గాద్గదికంగా... చెమర్చిన కళ్ళు తుడుచుకుంటూ...

భారతక్క అందరిలోకీ ప్రత్యేకం, అక్కలా వుండదు...కుటుంబం అనిపిస్తుంది. తనదీ అంటూ వో ప్రత్యేకమైన పెద్దరికం అందరి మీద మృదువుగా, సహజంగా రుద్దేస్తుంది....అందరూ సహిస్తారు, అదీ గమ్మత్తు! అంతవరకూ నడవలో కూర్చున్న పెద్దన్నయ్య... అక్కడ్నించి లేచి వెళ్ళిపోయాడు. దుర్గన్నయ్యని పలకరించలేదు.

భారతక్క పరామర్శకి దుర్గ స్పందించలేదు. జేబులోంచి బీడి తీసి... వెలిగించి... వొక్క పీల్పు పీల్చాడు. పొగ బైటికి వదిలాడు... పొగతోపాటూ దగ్గు... తెరలు తెరలుగా దగ్గు... నడవ గుమ్మం దగ్గర నిలబడ్డవాడు.... అక్కడే కూలబడ్డాడు.

భారతక్క విలవిల్లాడింది.... "స్నేహా మంచినీళ్ళు పట్రా'' అంటూ పురమాయించింది. మంచినీళ్ళు తెచ్చి దుర్గన్నయ్య కిచ్చా... మంచినీళ్ళు చేత్తో పట్టుకుని.... వుక్కిరిబిక్కిరవుతున్న వూపిర్ని సరిచేసుకో ప్రయత్నం చేస్తున్నాడు. కాసేపటికి వూపిరి తేరింది..... దగ్గాగింది..... మంచినీళ్ళు తాగాడు.

"కాఫీ తాగుతావేమిరా దుర్గా'' భారతక్క.

వద్దన్నట్టు తలూపి... "అమ్మేదీ?'' అనడిగాడు, ఏదో నూతిలోంచి గొంతు చించినట్టుంది.

"అమ్మ వెనక పంచలో వుంది''

దుర్గన్నయ్య చటుక్కున లేచి పంచలోకి వెళ్ళాడు. దుర్గని చూడగానే మంచంలో లేచి కూర్చుంది అమ్మ.

ఆకాశం వైపు చూస్తూ "దుర్గా....ప్చ్'' అంది. నాన్న చనిపోయిన రోజునున్న దుఃఖం తీవ్రత తగ్గింది. అసలు దుఃఖం తక్కువ వెలితి ఎక్కువ. నాన్న మంచం యెక్కిన

దగ్గర్నించి, అందరికి తెలుసు ఆయన వయసుకి తిరిగి తేరుకోడం వుండదని, అది అనారోగ్యం కాదని, ముసలితనం అని!... దుర్గన్నయ్య అమ్మనోసారి దీర్ఘంగా చూసి, అక్కడ నిలబడ్డ వాళ్ళందర్నీ చూసాడు. అందరం దుర్గనే చూస్తున్నాం, దుర్గెలా రియాక్ట్ అవుతాడా? అని.

దుర్గ బొంగురు గొంతుకతో "యెంతిచ్చి పొయ్యాడేం?'' అన్నాడు.

అదీ దుర్గన్నయ్యంటే, అనేక పొరల్ని... తెరల్ని ఛేదించి...వాస్తవంలోకి వచ్చేస్తాడు. ఆ రియాలిటీ యెలాంటిదంటే కాల్తున్న పెనం మీద నీటిచుక్క లాంటిది. భరించడం కష్టం... కానీ కొందరికి ఆనందం కలిగిస్తుంది. కొందరికి కోపం తెప్పిస్తుంది. యెదుటివాళ్ళ మనసుని కానీ... బంధుత్వాన్ని కానీ లెక్క చెయ్యకుండా....తనకి తోచింది, నోటికొచ్చినట్టూ అనెయ్యడమే దుర్గన్నయ్య గొప్పతనం. పెద్దాయన పోయాక ఈ గూటికి చేరిన వాళ్ళందరికీ, ఆయన తగలేసిన సొమ్ము గురించి, సంపాదించిన ఆస్తి గురించి, వివరాల్లోకి వచ్చేసరికి... రెండు రోజులు పట్టింది. వచ్చిన రెండ్రోజుల వరకూ.... నాన్నని... ఆయన గుణగణాల్ని నెమరు వేసుకున్నారు. ఆ మాటలు యెందుకో అంత సహజంగా అనిపించలా... కబుర్లలో పొల్లు యెక్కువ... అతిశయోక్తుల మాట చెప్పక్కర్లేదు! రెండోరోజు చెప్పుకునే కబుర్లలో చివరినీతి లాభపడిందెవరు? అన్న విషయంతో మొదలై... ఆయన యేయే యేర్పాట్లు చేసిపోయాడు? అన్న విషయ సేకరణగా మార్పు చెందాయి.

దుర్గన్నయ్య ప్రశ్నకి, అమ్మకి కోపం వచ్చింది.... "వైధవ్యం'' అంది విసురుగా. అన్నకు తగ్గ తల్లే, మాటల్లో వెనకడుగుండదు.

"అదాయనిచ్చి పోయేదేమిటి? ఆయన పోయాక మనమందరం అదే''

అమ్మకి చిరాకేసింది "వొరేయ్ నా దగ్గర వాగమోకు ఫో'' అంది.

దుర్గేం పెడుసు సమాధానం చెప్పలేదు. మంచం పక్కగా స్టూలు మీద కూర్చున్న వాడు లేచి, "భారతక్కా పది రూపాయలుందే?....నాలుక లాగేస్తోంది....''అన్నాడు.

"నువ్విప్పమోక...అసలెందుకొచ్చా... చచ్చినాడితో సమానం అని వొట్టు పెడితివి కదా?'' అంది అమ్మ విసుక్కుంటూ.

"చచ్చినాడితో సమానం అంటిగానీ చావలేదుగా?'' దుర్గ నవ్వు.

"నువ్వు తాగొచ్చి... అల్లరి పెట్టమాకు'' అమ్మ వార్నింగ్.

"నువ్వూరుకో అమ్మా..'' అని భారతక్క లోపలికెళ్ళి, వచ్చి దుర్గ చేతిలో పది రూపాయలు పెట్టింది. దానికీ యిల్లన్నా...ఈ మనుషులన్నా అభిమానం. ఆ అభిమానపు పొరలలోతుల్లో... పెద్దరికపు మరుగున...యింష్టింక్ట్‌గా దుర్గచెప్పే నిజాలమీద మోజుందేమో?

దుర్గ భారతక్కిచ్చిన పది రూపాలుచ్చుకుని, అమ్మనోసారి చూసి పంచ వెనక

వాకిలి గుండా రావిచెట్టు నీడల్లో కలిసిపోయాడు.

*     *     *

"యేమ(్రా యికయికలూ పకపకలేనా.....కాస్త పిండాకూడు పెట్టే కార్యక్రమం యేదేనా వుందా?''...అన్నకేక వీధి సావిడ్లోంచి వినిపిస్తే దుర్గ ఊరి చివర్నించినుండి వచ్చాడని అర్థం అయింది. యెందుకంటే పది రూపాయలకి గవర్నమెంటు వారి మందు అక్కడే దొరుకుతుంది.

"చచ్చినాళ్ళకిరా పిండం.... దున్నపోతులా వున్నావ్... అంత తొందరేం వచ్చింది'' అన్నాడు చిన్నన్నయ్య.

దుర్గన్నయ్య వచ్చినప్పుడు చిన్నన్నయ్య యింట్లో లేడు. దుర్గొచ్చాడని భారతక్క చెప్తే "ఊహు'' అన్నాడు. చిన్నన్నయ్యకి తెల్సు దుర్గ 'థార్న్‌యిన్ ది ఫ్లెష్' అని. ముల్లూరుకుంటుందా?

"నేనడిగింది కూడు... మా అందరికీ పిండం పెట్టెయ్యడానికి నీకు తొందరగానే వుంటుంది. కర్మకాండంతా నీ పెత్తనమేగా, యెంత మిగుల్తోంది? యేమిటి? ''

"తాగుబోతు వెధవా, నిన్నెవడ్రా రమ్మన్నాడూ?''

"ఇది నా యిల్లు... మా నాన్నపోతే వచ్చా... నువ్వెవడివోయ్ రమ్మండానికి? పొమ్మండానికి''

"వచ్చినవాడివి తిండి తిని మూల పడ్కో... లేనిపోని వాగుడు వాగావో వళ్ళు హూనం అయిపోద్ది''

"లేనిపోని పన్లు చెయ్యగాలేంది చెప్పుకుంటే వచ్చిందా?.....ఈ ఇంటి వాళ్ళ కోసం నువ్వు చేసే ప్రతి పనిలో అంతో ఇంతో మిగుల్చుకు సంపిడీకరణంలా నీ జేబులో వేసుకోవడం నీకలవాటేగా!''

చిన్నన్నయ్య సరెండర్ అయిపోయాడు. దానికి కారణం అమ్మ పొద్దున్నే చెప్పింది. 'దుర్గతో గొడవ పెట్టుమోక' అని అందుకే కోపాన్ని దిగమింగి, అక్కడ్నించి లేచి వెళ్ళిపోయాడు.

"కుడి యెడమైతే పొరపాటు లేదోయ్... అంతా మనదేనోయ్... వంచనే మన దారోయ్.... రోయ్'' దుర్గ పాట.

అంతవరకూ అక్కడ నిలబడి చోద్యం చూస్తున్న పెద్దొదిన, "అది సర్లే అన్నం తింటావా? ఫలహారం చేస్తావా?'' అనడిగింది. చిన్నన్నయ్య పెత్తనం పెద్దొదినకి నచ్చదు, అలాంటి మాటలు విన్నప్పుడల్లా చిన్నన్నయ్య తమ ఆస్తి తినేస్తున్నాడేమో? అన్న అనుమానంతో పీక్కుంటుంది. వదినెంత మొరపెట్టుకున్నా పెద్దన్నయ్య పట్టించుకోలేదు. చిన్నన్నయ్యని పెత్తనం నుండి తప్పించనూ లేదు.

"ఫలహారమే పెట్టు."

పెద్ద-వదిన లోపలికెళ్ళి వొక ప్లేట్లో అట్లు పెట్టి పట్టుకొచ్చింది. నడవలో వో మూలకి చేరగిలబడి అట్లు తెంపుతున్నాడు దుర్గ. వెనకాలే మంచినీళ్ళు పట్టుకొచ్చింది చిన్నొదిన. దుర్గకెదురుగా చతికిలబడింది. వీళ్ళిద్దరి కాంబినేషను బావుంటుంది. దుర్గలో తప్పులెంచుదామని ఈవిడ తాపత్రయం.... ఈవిడ్ని ఆటపట్టిద్దామని దుర్గ వుద్దేశ్యం.

"దుర్గా పిల్లలెక్కడున్నారోయ్!".... పలకరింపా? కాదు. క్షేమం తెలుసుకోడమా? కాదు... దెప్పుడు.... మొగుడికి సపోర్ట్... నీ జీవితం వొకటి సవ్యంగా వుంటే యెదుటి వాళ్ళని యెత్తి చూపు అన్న వెక్కిరింత.

"ఛీ దాన్నే వదిలేసాక... ఆళ్ళెందుకు నాకు..." దుర్గన్నయ్య ఛీదరింపు.

"చుక్కలాంటి పెళ్ళాన్ని" అని వదినేదో అనబోయింది.

"చుక్కలాంటి పెళ్ళామా?... పాడా? చుక్కలా వుంటే సరిపోద్దా... చుక్కేసుకున్నట్టు కూడా వుండాలి. అమ్మ శక్తిలా వుండకోడదు... నాకేం తెలీదనుకోకు... అది నాకన్నా అయిదేళ్ళు పెద్దది. నీకూ మీ ఆయనకి కట్నం పేరుతో ముట్ట చెప్పినంత మాత్రాన అది బాలాకుమారి అవదు. దాన్నెందుకొదిలేసానో తెలుసా, నాకన్నా పెద్దదని కాదు. తిరుపతి వెంకటకవులు చెప్పినట్టు...."

ఇల్లంతా పిన్‌డ్రాప్ సైలెన్స్....

అదే దుర్గన్నయ్య గొప్పతనం... పద్యం మొదలైంది....

"*వొరిగిన చనుగవ గలిగిన*
తరుణింగవగూడు కన్న దరచై కడు గ్రి
క్కిరిసిన చనుగవ కలిగిన
*తరుణుల పద తాడనము శతగుణము మెరుగౌ!*"

వదిన కదా కొంటె సమాధానం. వంటింటిలోంచి కిచకిచ నవ్వులు. వదిన నోరెత్తలేదు. కానీ పెద్దన్నయ్య వూరుకోలేదు. చిన్నొదిన నోరెత్తితే, దుర్గ పద్యానికి ప్రతి పదార్థం చెప్పడం మొదలు పెట్టాడు. అది చిన్నొదినకి కష్టం అయిపోతుంది.

"అద్సరల్లేవోయ్... యిప్పుడు నువ్వు లేపుకొచ్చిందానికి కూడా యిద్దరు పిల్లల్ట కదా... అయినా కిక్కిర్సున్నాయా?..."

"పిల్లల్లేరే..." భారతక్క ఆశ్చర్యం...దుర్గింటికి వెళ్లంటుంది. చాలమంది దుర్గని పట్టించుకోడం మానేసారు... ఇంక రాకపోకలెక్కడుంటాయ్. రెండు మూడేళ్ళ క్రితం దుర్గ మాయింటి కొచ్చాడు. రాత్రి పనంతా పూర్తయ్యాక మేడ మీద దుర్గతో కబుర్లు చెప్తూ కూర్చుని... సమయం మర్చిపోయా, మధుకి కోపం వచ్చి...కింద నుండి.... "పక్కబట్టలు పట్టుకెళ్ళి... అక్కడే శయనించండి యిద్దరూ...." అన్నాడు. ఆ మాటలో

విరుపు... ద్వంద్వం... అర్థం చేసుకోగల సమర్థుడు దుర్గ.. ఆనాటి నుండి నా దగ్గరికి రావడం మానేసాడు.

"వాడికా ముండ కావాలి... పిల్ల లెందుకు? యే బజార్లోనో వదిలేసుంటాడు" భారతక్క ప్రశ్నకి సమాధానంగా పెద్దన్నయ్య మాటలో విసురుకి అంతా నిశ్శబ్దం... వివరాల కోసం యెదురుచూత. ఆ నిశ్శబ్దాన్ని అర్థం చేసుకున్నాడు... ఎవరి పని వాళ్ళు చేసుకుపోతున్నా, అందరి చెవులూ ఇటే వుంటాయని తెలుసు పెద్దన్నయ్యకి.

"వీడు ఆ పిల్లలిద్దర్నీ... యే యింటి అరుగు మీదో కూర్చోపెట్టి... వాళ్ళకిప్పుడే వస్తామన్చెప్పి... ఆ ముండని తీస్కొని రైలెక్కేసాడు."

వింటున్న వాళ్ళందరి మనస్సులూ చివుక్కుమన్నాయి. దుర్గతో పరిచయం వున్న వాళ్ళందరికీ దుర్గ ప్రవర్తలో కరుకుతనం, మోటుతనం మీద అసహ్యం వేసింది.

"దాని మనసెలా వొప్పిందో?" చిన్నొదిన పెదిమల్నుండి జాలి భాష, గొంతులో వెక్కిరింపు దుర్గన్నయ్యని తప్పుపట్టగలిగామన్న విచిత్రమైన ఆనందం.

"దాని మనసంతా, వీడి మొగసిరి మీదుంటే పిల్లలెలా కన్పిస్తారు.... లంజకు పిల్ల తగలాటం అని వూర్కే అన్నారా?"

పెద్దన్నయ్య దుర్గని అనగలిగినందుకు గర్వం... దుర్గే హుతవాహకుడు... అందులో అజ్యం.

"యెవర్రా లంజలు, అది నీ మర్దలవుతుంది.. నా పెళ్ళాం...."

"నువ్వు తగుల్కున్నవాళ్ళు, లేపుకొచ్చిన వాళ్ళు నా మర్దళ్ళవరు..." - పెద్దన్నయ్య దెప్పుడు. అప్పటికే అక్కడికి చాలా మంది చేరారు.

"వోహో నువ్వు కుదిర్చిన వాళ్ళే నీకు మరదళ్ళు, మే చూసుకుంటే లంజలూ కావాలి?"

యింక ఆ సంభాషణ యే దెబ్బలాటకి దారితీస్తుందనుకుందో, "పిల్లలేర్రా? దుర్గా" అంటూ మాట మార్చేసింది భారతక్క.

"ఇద్దరం... కాకినాడ పారిపోయొద్దాం... అనుకున్న రోజున... నేను ముందుగా పిల్లల్ని తెచ్చి కంపార్ట్‌మెంటులో కూర్చోపెట్టాను. దానికోసం నేను బండి దిగి ప్లాట్‌ఫాం మీద వెయిట్ చేస్తున్నా... అది రావడం లేటయింది బండి కదుల్తుండగా వచ్చింది. ఇద్దరం బండెక్కాం... ఆ కంపార్ట్‌మెంటులోనే కూర్చోపెట్టిన చోట పిల్లల్లేరు! ఆ బండిలో యెంత వెదికినా పిల్లలు కనబడలేదు... బండి దిగి ప్లాట్‌ఫారమ్ మీద వెదకడానికి బండి వేగం పుంజుకుంది."

"తర్వాత యే ప్రయత్నం చెయ్యలేదా?"

"చేసాం దుఃఖం ఆపుకోడానికి... మనసుని సరిపెట్టుకోడానికి."

దుర్గన్నయ్య చెప్పిందానికి ... పెద్దన్నయ్య యిచ్చిన సమాచారానికి చాలా తేడా వుంది. యేది నిజం... యేది నమ్మడం? యెందుకో దుర్గన్నయ్య చెప్పిందే నమ్మ బుద్ధేసింది. నమ్మడం నమ్మకపోవడం కూడా... మన యిష్టాయిష్టాల మీద ఆధారపడి వుంటుందా? లేక తత్వాన్ని బట్టి నమ్మ బుద్ధేస్తుందా? దుర్గలో ఢోకా లేని నిజాయితీ వుంది.! మరి పెద్దన్నయ్య ఋజు ప్రవర్తన డౌటా? పెద్దన్నయ్య అవకాశవాది, పిల్లికి బిచ్చం పెట్టని పిసినారి! పెద్దరికం పోజు మాత్రం బారెడు. తన పని జరిగిపోతుంది అంటే, యెంతటి అబద్ధమాడడానికీ వెనుదియ్యడు...

"లేనోపోని కథల్చెప్పకోయ్... అంతమాత్రం నాకు తెలీదనుకోకు" పెద్దన్నయ్య దుర్గని నమ్మడు... దానికి కారణం దుర్గన్నయ్యతో వచ్చేసినావిడ పెద్ద వదినకి దూరపు చుట్టం. ఆవిడ మొగుడు పోయాక అత్తవారింట్లో బాగా బాధలు పెట్టేవారని చెప్పుకునేవారు. దుర్గన్నయ్య యేదో పని మీద ఆ వూరు వెళ్ళి వాళ్ళింటిలో వారం రోజులున్నాడు. ఆ వారం రోజుల్లో చేసిన పని యిది. వాళ్ళ అడ్రసు వదినే యిచ్చింది.

నేను నా ఆలోచనలో వుండగానే దుర్గన్నయ్య పెద్దన్నయ్య సంభాషణ చాలాదూరం పోయింది.

"యేమిటి నీకు తెల్సేది?... అంత యింగితం వుంటే... నీ యింట్లో పన్చేసే దాని కూతుర్ని కక్కుర్తి పడవు.. పడితే పడ్డావ్... రోడ్డున పడవు..."

అందరికీ వుత్సాహం పెరిగింది... కొత్త విషయం... మరుగు వీడి ముందుకొచ్చింది.

"అయ్యో... అయ్యో... అన్నగార్ని యెంతమాటంటే, అంతా అనెయ్డమే. పెద్దా... చిన్నా అంతరం లేదూ?" పెద్దొదిన వగర్పు.

"చేసినప్పుడు లేదు గానీ... చెప్పుకుంటే వచ్చిందా ఈ అంతరం... " దుర్గ సమర్ధన యెదుటి మనిషి యెంతటివాడైనా... నిల్దీసి ప్రశ్నించే తెగింపు... ఆ తెగింపుకే భయం వేస్తుంది. కానీ తప్పించుకోలేం... అడిగిన తీరులో పెళుసుదనానికి మాత్రం మనసు చివుక్కుమంటుంది.

పెద్దన్నయ్య అసలు తట్టుకోలేడు...ఆవేశంగా లేచి వెళ్ళిపోయాడు. దుర్గ నవ్వుతూ నిలబడ్డాడు. అనుకున్నది సాధించానన్న ఆనందం కళ్ళలో కనిపిస్తోంది. యేదో గొణుక్కుంటూ వీధిలోకి వెళ్ళి... చీకట్లో మాయమయ్యాడు.

ఆ సీనుకి తెర పడింది. తెర మరుగున అన్నయ్యల గౌరవం అన్నయ్యలకి వదినెల పెద్దరికం వదినలకి వచ్చేసింది. అందరూ సొల్లు కబుర్లతో... అర్థం పర్థం లేని అభిమానపు పోకడ్లతో... యెవరి తెరచాటుకి వాళ్ళు జారుకున్నారు.

* * *

పొద్దున్నే కాఫీల హడావిడి, అన్నయ్య లిద్దరూ కర్మ చేసే హడావిడి. భారతక్క సామాన్లందిస్తోంది. లక్ష్మక్క వంటింట్లో కాఫీలు పెట్టి, 'ఎవరెవరికి యింకా ఇవ్వలేదో చూడవే' అని పురమాయించింది.

నడవలోకి వెళ్ళా... నడవ గుమ్మం పక్కగా అరుగు మీద... రామమన్నయ్య... దుర్గన్నయ్య కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"అక్కా అన్నయ్యకి కాఫీ" అంటూ వంటింట్లోకి వెళ్ళా.

"వచ్చాడూ... " అంది పెద్దొదిన దీర్ఘం తీస్తూ... వచ్చినవాడు యే నిజాలు చెప్తాడో అన్న బెరుకు స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే గుట్టుగా సంసారం అన్నారేమో? గుట్టంటే చేసిన తప్పులన్నీ బయటకి రాకుండా దాచెయ్యడమేనా?

రెండు గ్లాసుల్లో కాఫీ తీసుకెళ్ళే సరికి...

"యెందుకురా... లేనిపోని గొడవలు... ఈ బూతు వార్తలు తప్పు... నీకింకేం తెలియవా?.. పెద్దన్నయ్యకి కోపం వచ్చిందట కదా" రామం అన్నయ్య అడుగుతున్నాడు నవ్వుతూ.

"బూతా... భతృహరి యేమన్నాడో తెల్సా.. 'సదాచారము బూను, యింద్రియ ములన్ శాసించు, లజ్జాన్వితుడై... ప్రశాంతి జేకొను నరుడందాక!' ఎందాకా? 'నారీ వీక్షణ బాణముల్ చారపు విన్నాణంబుగా డెందమున్! అందాక"

"యేం నీకు నారీ వీక్షణ బాణాలు తగల్లేదా?... లేనిపోని వార్తలు మోసుకొస్తావ్"

"తగిలాయి కానీ... రొక్కము లేక కాదు.. నిను రోసియు కాదు... మరొక్క లేమకున్ దక్కియు కాదు... చెప్పెద యదార్థపు సంగతి... చిత్తకార్తెలో కుక్కల రీతి వొక్క వెల కోమలికై పలుమంది చేరినన్ చిక్కులనేకముల్ కల్గు...ఛీ అనిపించి విరక్తి చెందితిన్"

రామం నవ్వుతున్నాడు- "ఏం యేదేనా అంటుకుందా?"

"కక్కుర్తికి పోతే కక్కులు తప్పవని వూరికే అంటారా?"

"వెల కోమలి నుండేనా అంటింపు" రామమన్నయ్య కుతూహలం.

"అన్నయ్యా కాఫీ..." ఇద్దరూ కాఫీ అందుకున్నారు... తాగుతున్నారు.

"నువ్వో పెద్ద సూడో... అర్థమైనా అర్థం కానట్టు అమాయకంగా మొహం పెట్టి ప్రశ్నలడుగుతావ్... నీ స్వార్థం నీది... చిన్నన్నయ్య నిన్ను భూమి అమ్మకం విషయంలో ముంచేసాడని తెలుసు... అయినా అమాయకంగా చిన్నన్నయ్య చెప్పిందంతా వింటూ నిల్చడతావు... వాడు మధ్యవర్తిత్వం నెరిపినందుకు కొంత మింగేస్తాడు..." దుర్గ మాట మార్చు.

రామం యిబ్బందిగా మొహం పెట్టాడు. యిందాకట్నుండి యిబ్బందిగానే వున్నాడు. యెందుకంటే రామం మెల్లగా అడిగే ప్రతి ప్రశ్నకీ పెద్ద గొంతుకతో సమాధానం చెప్తునాడు దుర్గన్నయ్య. రామంకి చిన్నన్నయ్యతో పనుంది... చిన్నన్నయ్యకి వూళ్ళో తిరుగులేదు.

దుర్గమాట పట్టించుకోలేదు రామం. "యింత చదువూ చదివి యిలా భ్రష్టుడి

వయావేగ్రమా...''

"భ్రష్టత్వమే బెష్టు'' దుర్గ నవ్వు.

ఆ సమయంలోనే కర్మ చేయించడానికి బ్రాహ్మడొచ్చాడు... స్మశానం, కర్మ చేసే చోటు...వొకటే. అక్కడే యెప్పుడూ తిరుగుతూండడం వల్ల.. వాడికి ప్రేతకళ వచ్చేసింది, అని దుర్గ అభిప్రాయం.

బ్రాహ్మడ్ని చూస్తూనే, "ప్రేతాలకి కూడా కళుంటుంద్రోయ్'' అన్నాడు దుర్గన్నయ్య.

అది విన్నా పట్టించుకోకుండా, "యేరా దుర్గా యెప్పుడొచ్చావ్?'' అంటూ పలకరించాడు బ్రాహ్మడు.

"నిన్నొచ్చాగానీ శవాల మీద సంపాదన బావుందా?''

ఇద్దరూ చిన్నప్పటి ఫ్రెండ్స్... కలిసి చదువుకున్నారు... వాడు చదువాపి వాళ్ళ నాన్న బ్రాహ్మణీకం వాడుచ్చుకున్నాడు. దుర్గన్నయ్య అడిగిందానికి సమాధానం యేం చెప్తాడు. మాట మారుస్తూ "దుర్గా కాకినాడ్లో కాపరం పెట్టావటగా?'' అనడిగాడు.

"యేం చుడ్డానికొస్తావా?''

వీళ్ళిద్దరి ధోరణి పెద్దన్నయ్యకి చిరాకేసి నట్టుంది. "ఈ రోజు కర్మసామాన్లేమిటో, యేం తీసుకెళ్ళాలో చూడ్రా జోగా'' అంటూ పురమాయించాడు.

అదే క్షణంలో వీధిలో రిక్షా ఆగింది. అందులోంచి శేషు దిగాడు. వాడ్ని చూడగానే... ఆ రోజు కర్మకి కావల్సిన సామాన్లని బుట్టలో సర్దుతున్న చిన్నన్నయ్య, ఆవేశంగా లేచివెళ్ళి శేషుని లెంపకాయ కొట్టాడు. యింకా కొట్టును... పక్కనే సామాన్లందిస్తున్న భారతక్క పట్టుకుంది. అంత పెద్దవాడూ నలుగుర్లో దెబ్బతినేసరికి నిశ్చేష్టుడైపోయాడు శేషు.

"మీ నాన్న కసంతా... నీ పెళ్ళి చేసి కట్నం రాబట్టలేకపోయానని... నువ్వు చేసిన పనికి కాదులే నువ్వు లోపలికెళ్ళు'' అన్నాడు దుర్గన్నయ్య.

శేషు దుర్గన్నయ్య మాటని పట్టించుకోలేదు. చటుక్కున వెనక్కి తిరిగి... వెళ్ళి పోతున్న రిక్షాని ఆపి... అందులో టౌనెళ్ళి పోయాడు. యెవరాపినా ఆగలేదు.

"శేషు చేసిన పన్నేమంటావురా రామం...'' అన్నాడు దుర్గ నవ్వుతూ.

"దుర్గా నోర్మూస్తావా? నీకూ...'' అన్నాడు చిన్నన్నయ్య కోపంగా.

"వాడు కొట్టిన దెబ్బకి తట్టుకోలేక పోతున్నావ్... నా మీదెందుకరుస్తావ్'' అంటూ దుర్గ అక్కడ్నించి లేచి వీధిలోకి వెళ్ళిపోయాడు.

దుర్గ మీద కోపం బ్రాహ్మడి మీద చూపిస్తూ "యేమేం తీసుకెళ్ళాలో చెప్పరా జోగా... గుడ్లప్పగించి యేం చూస్తావ్'' అంటూ గసిరాడు చిన్నన్నయ్య.

"దుర్గా నువ్వూ రా తల గొరిగించుకోవాలి...'' అంటూ వెనక నుండి కేకేసాడు

పెద్దన్నయ్య.

దుర్గ వినిపించుకోలా, అదే పోక పోయాడు... సందు మలుపులో మాయమయ్యాడు.

"ఈ వెధవ రావడమే దండగ... వీడేం కర్మచేస్తాడూ... వాడొస్తే కాకులు పిండం ముట్టవు కూడా... పదరా చిన్నా మళ్ళీ లేటయిపోతుంది'' అన్నాడు పెద్దన్నయ్య, ఆ పాటికి కాకులు దుర్గన్నయ్యని గుర్తుపట్టి కోపగించినట్టు! నల్గురూ శ్మశానానికి పోయారు.

* * *

అలా పోయిన దుర్గ పదకొండు గంటలకి యింటికొచ్చాడు. దుర్గని చూడగానే, భారతక్క ఆదుర్దాగా, "శేషం చేసేద్రా'' అనడిగింది.

"చెప్తాలేవే, ఆకలేస్తోంది... టిఫిను పెట్టు...'' అంటూ అరుగు మీద చతికిలపడ్డాడు.

"స్నేహా దుర్గకి వుప్మా పట్రా'' భారతక్క పురమాయించింది. నేనుప్మా తీసుకెళ్ళేసరికి... "దుర్గా అమ్మ పిలుస్తోంది'' అంటూ లక్ష్మక్క సందేశం పట్టుకొచ్చింది.

"ఆకల్తో చస్తోంటే... నీతులు పెడ్తుంది గావల్ను...'' దుర్గ విసుగు.

"చిన్నప్పట్నించీ నీతులు విని విని... యిలా తయారయ్యావు....'' మేనత్తగారి చురక.

టిఫిన్ తింటూనే దుర్గ పంచలోకెళ్ళాడు.

పంచలో-

"వచ్చిన వాడివి సక్రమంగా కర్మ చెయ్యి...'' అమ్మ విసుగు

"గుండు చేయించుకుంటే సక్రమంగా కర్మచేసినట్టేనా?'' దుర్గ లాజిక్

"గుండు చేయించుకో - ఝుం ఝుం వేసుకో... మొల్తాడు చుట్టుకో... అన్నీ విలక్షణాలే... అయినా జన్మనిచ్చిన తండ్రి కర్మ చెయ్యనంటావేమిటి?'' కర్మ చెయ్యడానికి అమ్మ స్టాండర్డ్స్.

"ఆస్తేవిచ్చాడే?''

"వుండి చస్తేగా యివ్వడాన్కి...'' అమ్మ మొహం చిమచిమలాడుతోంది.

"మరి పెద్దాడూ, చిన్నన్నయ్య... భారతక్క... లక్ష్మక్క... దోచుకోలా?''

"అప్పుడుంది వాళ్ళకి జరిగింది...''

"ఆ తర్వాతవాళ్ళకి లేకుండా చేసింది.... వాళ్ళేగా...''

"నీకూ, రామానికి, స్నేహకి చదువు చెప్పించలా....''

"మీరు చెప్పించేదేమిటి? మేం చదువుకున్నాం...''

"దానికైన ఖర్చు ఆకాశం నుండి రాలిందనుకుంటున్నావా?... వున్న భూమి చెక్కలమ్మితేనేగా వెసులుబాటు జరిగింది''

"వంద రూపాయల ఫీజు కట్టి- లక్ష రూపాయల భూమి - చెక్క లెక్క రాసేయడమేనా వెసులుబాటంటే"

అలా మాట్లాడేవాడితో... అమ్మ యేం మాట్లాడుతుంది?

"వెళ్ళు వెళ్ళీ తండ్రికిన్ని నీళ్ళొయ్యి... సమయానికెలాగూ తగలడ్లా!"

"యే సమయాన్కి?...."

"యే సమయానికేమిటి?... చచ్చే సమయాన్కి!" అమ్మ కూడా తీసిపోదు...

"ముసిలాడు నా దృష్టిలో యెప్పుడో చచ్చాడు..."

"కన్నతండ్రినే అలా అంటున్నావ్..." అమ్మ ఆశ్చర్యం.

"కన్నతండ్రి... కన్నతల్లి... నే నీళ్ళోస్తానో లేదో తెల్సుకు సృష్టికార్యానికి దిగాల్సింది"

"ఫో వెధవా... నీ యిష్టం వచ్చినట్టా చేసుకు తగలడు...."

అప్పుడే అమ్మకి కాఫీ తెచ్చిన భారతక్క దుర్గ ఆఖరి మాట వింది. అంతవరకు జరిగిన సంభాషణ యేమిటో అంచనా వేసింది.

"దుర్గా రేపు ధర్మోదకాలు, అందరూ వస్తారు...బావుండదు" అంటూ దుర్గ వేపు చూసింది.

కర్మ యెవరి కోసం చెయ్యాలి బంధువుల కోసం...వూళ్ళో వాళ్ళకోసం... మెప్పు కావాలి! తండ్రి కోసం యెంతమాత్రం కాదు... ఆయన వైతర్ణి కీవలుంటేనేం... ఆవలుంటేనేం... చచ్చినా సరే వైతర్ణికి ఈవలే... పన్నెండో రోజు వరకూ వైతర్ణికి ఈవలే... గోదానం చేసే వరకూ వైతర్ణికీవలే! గోదానం చెయ్యని వాళ్ళంతా వైతర్ణికీవలి గట్టునుంటే!... వాళ్ళంతా మంచి హడావిడిగా వో పెద్ద మేలాలా వుంటుందేమో?... వైతరిణీ నదికి పుష్కరాలొచ్చినట్టు.. ప్రేతాల మేలా! బ్రాహ్మడు ఆవు నొట్టుకుపోతే, నాన్న వైతరణి యెలా దాటినట్టో.. అంతా నాటకం.. నానాటి బతుకూ నాటకమూ... కానక కన్నది కైవల్యమూ... నేను యిప్పుడే కేవలం.. వీళ్లంతా నా వాళ్ళే అన్న భ్రమ. కన్ను చెమర్చదు... బాధ కలగదు. యెందుకు? యేదో నిర్లిప్తత.. అందుకే దుర్గని చూస్తే ఆనందం కలుగుతుంది. "ఋజుస్వభావరో జనో దుర్లభః"... అందులో దుర్లభుల్లో... దుర్లభుడు.. దుర్గ... అలాంటి వాడు లొంగేడు.. యేదో గొణుక్కుంటూ... యింట్లోంచి.. వెళ్ళిపోయాడు.

* * *

చిరాగ్గా యింట్లో అడుగుపెట్టి.. హోమం చెయ్యగా మిగిలిన పేళ్ళ కట్ట గదిలో మూలకి విసిరి "వీడింక బాగుపడ్డే.. వీడు కర్మ చేస్తేనేం, చెయ్యకపోతేనేం... " అంటూ విరుచుకుపడ్డాడు పెద్దన్నయ్య.

"యేమైంది అన్నయ్యా?" భారతక్క.

“యేమవుతుందీ, దుర్గ వచ్చాడా, వచ్చినవాడు గుండు చేయించుకు వోమూల కూర్చోవచ్చుగా, మేం కాకులకి పిడచ పెట్టడానికి గోడ దగ్గరికి వెళ్ళాం.. మాతో బ్రాహ్మడూ వచ్చాడు... వీడు అదే సమయం అనుకున్నాడేమో! బ్రాహ్మడి కేసిన దక్షిణలో రూపాయి కాసులు పదిపైనే వుంటాయి, పట్టుకుపోయాడు”

“యెక్కడకి పోతాడూ... తాగడానికి పోయుంటాడు... సాయంకాలానికి తేల్తాడు.” మేనత్త.

“అక్కడ జోగారావు (బ్రాహ్మడు) లబో దిబోమంటున్నాడు. అయినా వాడికి గొంతు ముడి లేదులెద్దూ. నాలుగు రోజులు మంత్రాలు చదవడానికి మూడు వేలుచ్చుకుంటున్నాడు... పైగా అల్లక్కడ పదవసరం యిక్కడ ఐదవసరం అని దోచేస్తున్నాడు.” చిన్నన్నయ్య అంతర్లీనంగా దుర్గని సమర్ధిస్తున్నాడు.

కర్మ చెయ్యడానికి జోగారావుతో సాగిన బేరసారాల్లో జోగారావు మూడు వేలకి దిగి రాలేదు. చిన్నన్నయ్య రెండు వేల ఐదు వందలకి పైగా పెంచలేదు. వీళ్ళిద్దరూ యిలా రాసుకుంటూ గీసుకుంటూ బేరా లాడుకుంటుంటే... అమ్మ కలుగచేసుకుని మూడు వేలకి వొప్పేసుకుంది. అది చిన్నన్నయ్యకి నచ్చలా, జోగారావు తమ పరిస్థితిని యెక్స్ప్లాయిట్ చేసాడనుకున్నాడు. అందుకే దుర్గని సమర్ధించాడు.

“వాడీ పల్లెన్నమ్ముకుని బతుకుతున్నాడు, ఇక్కడ చావులకీ, పెళ్ళిళ్ళకీ గిరాకీ వుండదు. వాడికా యిదే ఆధారం.. యేదో కక్కుర్తి పడతాడు... అర్ధం చేసుకోవాలి” అమ్మ సమర్ధింపు.

ఈ సంభాషణ వాదనలోకి దారి తీయకూడదు అనుకుందేమో, భారతక్క “సరి భోజనాలకి లెండి.. చాలా టైమైంది...” అంటూ అందర్నీ లేవగొట్టేసింది.

* * *

భోజనాలయాయ్... సద్దుమణిగింది. యెవరికి దొరికినచోట్లో వాళ్ళు... గుర్రుల్లో... బుసల్లో... మగతలోకి జారుకున్నారు. ఆడవాళ్ళంతా నడవ పక్క రూములో చేరారు. వొకటే కబుర్లు.. శేషు విషయాలు... తెలిసీ తెలియని అంచనాలు... శేషు విషయంలో భారతక్కకే అత్రుత. తన కూతుర్ని యిద్దామనుకుంటోంది. శేషుని చిన్నన్నయ్య కొట్టడం... భారతక్కకి నచ్చలా... శేషం చేసాడో యెవరికీ స్పష్టంగా తెలీదు... మేనత్తకి తెలుసు... యెందుకంటే... వైజాగ్ అన్నయ్య కూతురే ఢిల్లీలో వుంది. వైజాగ్లో వున్నది నాన్నకి స్వయానా తమ్ముడు... ఆయన పోయి చాలాకాలమైంది. అతని పెద్దకొడుకునే వైజాగ్ అన్నయ్య అంటాం! నాన్న పోయాడని తెల్సీ ఆయన కుంటిసాకు చెప్తూ, రాలేకపోతున్నానని వుత్తరం రాసి వూరుకున్నాడు. ఆ వైజాగన్నయ్య కూతురే రాజ్యం - ఢిల్లీలో వుంది. అది లింకు. అవన్నీ మేనత్తకి తెలుసు... కానీ కబురు చెప్పడానికి వూరిస్తోంది. యెంత వూరిస్తోన్నా... యెవరికి తోచినట్టు వాళ్ళు వూహించుకోడం ఆవిడకి నచ్చలేదు.

"శేషు ప్రస్తుత్తం ఢిల్లీలో వున్నాడుతెలుసా?" అంది యేదో రహస్యం చెప్తున్నట్టు.

"యేం అక్కడ వాడెవర్తినో చూసుకున్నాడా? యేమిటి?" లక్ష్మక్క హాస్యం.

"యెవర్నో యేం కర్మ... మీ వైజాగన్నయ్య కూతురు అక్కడే వుందిగా..."

"రాజ్యమా... అది వీడికన్న రెండేళ్ళు పెద్ద... అక్కవుతుంది కదత్తా!" లక్ష్మక్క ఆశ్చర్యం.

"నిన్నటి వరకూ అక్కే అయింది..." మేనత్త వెటకారం.

"మరిప్పుడు?" కబుర్లో వున్న మెలిపై వుత్సాహం.

"ఢిల్లీలో యిళ్ళ అద్దెలు చాలా యెక్కువ... వీడక్కడికెళ్ళాక... యిద్దరూ వొకే గదిలో వున్నారు... యేడాది వరకూ బాగానే వున్నారు..."

"మరిప్పుడో..." లక్ష్మక్క ఆతృత.

నాకు చిరాకేసింది "చిన్నన్నయ్యని పిల్వనా చెప్తాడు" అన్నా....

మేనత్తగారు మరి మాట్లాడలేదు... వదినలిద్దరూ నిద్ర నటిస్తున్నారు.

"పంచబాణుడు ఆవహించాకా, వయసు.. వరస వావి... యేం అడ్డురావు-" అంది అత్త కూతురు తల్లికి సపోర్టుగా....

"ఈ మధ్య జండర్భేదం కూడా లేకుండా పోతుంది..." అంది భారతక్క కూతురు ఇంగ్లీషు నవలలు తెగ చదువుతున్నట్టుంది. 'ఫైర్' సిన్మా కూడా చూసుంటుంది.

"యేమే నీ కెవర్తేనా తగిలిందా?" అత్త కూతురి హాస్యం.

వీళ్ళ హాస్యాలు నచ్చినట్టు లేదు. "పిల్లలు మీకిక్కడేం పని, పోండి" అంటూ గసురుకుంది భారతక్క.

అక్కడితో వదిలెయ్యలేదు - "రాజ్యంకి... వీపు మీద మొల్దగ్గర తెల్లటి మచ్చ లున్నాయట కదా" అంది.

భారతక్క మనసు తెలిసినవాళ్ళం కాబట్టి మేం మాట్లాడలేదు. కానీ మేనత్తగారు మాత్రం వూరుకోలేదు - "శేషు నడగవలసింది..." అంది ముసి ముసిగా నవ్వుతూ.. దాంతో అందరూ అంతో యింతో నవ్వారు.

"వూరుకోండి వదిన లేస్తుంది" అంటూ మందలించింది భారతక్క.

అందరూ నవ్వాపి సీరియస్ అయ్యారు. సమావేశం ముగిసింది.

"స్నేహా తలుపెయ్యి - చీర మార్చుకోవాలి..." అంటూ లేచింది లక్ష్మక్క.

"తలుపెయ్యక్కరలేదు... ఆ మూల కెళ్ళి అటు తిరిగి కట్టేసుకో" అంది భారతక్క.

"స్నేహా జాకెట్టియ్యే... నా పెట్టె మీదుంది..."

"అన్నీ దగ్గర పెట్టుకు కట్టుకోవల్సింది..." అని విసుక్కున్నా, జాకెట్టివ్వక తప్పలేదు జాకెట్టందిస్తూ... చూడకోడదని అనుకున్నా... యింస్టింక్టివ్ యెంతూజియాజమ్ వూరుకోలా... దాని రొమ్ముల మీదకి పోయింది చూపు... అప్పుడు కనబడింది నల్లటి మచ్చ... "అదేమిటే అంత నల్లగా వుంది" అన్నా... అందరూ యిటువేపు తిరిగారు... అనవసరంగా అందరి మధ్యా ఈ విషయం యెత్తాను అనుకున్నా... కానీ గోడపక్కకి తిరిగున్న లక్ష్మక్క "మీ బావగారి సరసంలే..." అంది.

హింస మనిషి తత్వంలో వుంది. అది శరీరం, మనసు మైమరపుల హద్దులు దాటి యింగితం విడిచి మృగప్రాయమైనప్పుడు యిలాంటివి తప్పవేమో?... హింసలో కూడా ఆనందముంది. లేకపోతే సెక్స్ హింసాత్మక మెందుకవుతుంది... నా ఆలోచన తెగే లేదు...

"సుధీర్ వచ్చాడే?" అనడిగింది మేనత్త.

"నాన్న పోయిన్నాడు వచ్చాడు.. మళ్ళీ ధర్మోదకాలకి వస్తానన్నాడు" అంటూ సమాధానం చెప్పేసింది భారతక్క.

సుధీర్ పెద్దన్నయ్య కొడుకు... యింజనీరింగ్ చదువుతున్నాడు. అందర్నీ ఆట పట్టిస్తూ కలివిడిగా తిరుగుతాడు. నాతో మాత్రం "స్నేహత్తా వో ముద్దియ్యవా? పై వాడ్నా, మేనల్లుడ్నేగా..." అంటాడు. అది హాస్యమో? నిజమో? కూడా తెలీదు! ఈ విషయం మధుతో చెప్పలేదు. యెందుకు? యిక్కడ జరిగే అన్ని విషయాలూ చెప్తాను కానీ ఈ విషయాన్ని గుండెల్లోంచి పెదవుల మీదకి రానియ్యలేదు. రహస్యమా?... దీన్ని రహస్యంగా వుంచవలసిన అవసరం ఏమొచ్చింది. అప్పుడప్పుడు ఈ మనసంటే భయం వేస్తుంది. గుండె చప్పుడు పెరుగుతుంది. మనసుకి, మోరల్ యాస్పెక్ట్‌కి యే విధంగానూ పొంతన కుదర్దు. అలాంటి హాస్యాలు వాడితో ఆడకోడదా?... కాని వాడలా హాస్యాలాడుతూ నా చుట్టూ తిరిగితే నాకే హాయినిస్తుంది. అప్పుడే మోరల్ యేస్పెక్టూ ఆలోచనల్లోకి రాదు. యెక్కడో యేదో తేడా లేకపోతే యీ విషయం, మధూకి యెందుకు చెప్పలేదు! నా మనసుకీ గిరులున్నాయ్! మనసులో నేనే సతమతమవుతాను సుఖమవనీ, దుఃఖం అవనీ... ఆ గిరి దాటి లోపలికి ప్రవేశించగల సత్తా దుర్గన్నయ్యకుంది... అందుకే దుర్గన్నయ్య "స్నేహ నీ ముద్దుల మేనల్లుడొచ్చాడే..." అంటూ గిరిలోకి చొరబడ్తాడు.. అది నాకు నచ్చదు. అనీజీగా వుంటుంది. అప్పుడే దుర్గన్నయ్యంటే పడదు... యిది యిమ్మోరల్ హాపినెస్ అవుతుందా? మోరల్‌కీ యిమ్మోరల్‌కీ సరిహద్దెక్కడ? హాపినెస్ అంతా వొకటి కాదా? రామం దుర్గన్నయ్యలతో కలిసి తిరుగుతున్నప్పుడు దుర్గన్నయ్యంటే విచిత్రమైన ఆకర్షణ వుండేది. దానికి కారణం దుర్గన్నయ్య చూపే స్వతంత్ర భావాలు... ఆలోచనల్లో, మాటల్లో, ప్రవర్తనలో యెక్కడా హిపోక్రసీ వుండని దుర్గన్నయ్యంటే అదో విచిత్రమైన ఆరాధనా భావం... మనసులో పొంగేది... నా ఆలోచన తెగనే లేదు.

"పెద్దన్నయ్య లేచినట్టున్నాడు... లెండి లెండి కాఫీలు పెట్టాలి" అంటూ భారతక్క అందర్నీ లేపి తొందర పెట్టింది.

కాఫీల హడావిడి మొదలయ్యింది... కాఫీ తీసుకుని అమ్మ దగ్గర కెళ్ళా.. అమ్మ కాఫీ చప్పరిస్తోంటే... "దుర్గన్నయ్య భోజనానికి రాలా... " అన్నా అమ్మతో.

"వాడి వూసు నా దగ్గరెత్తమోకు... వాడొస్తే యింత తిండి పడేయండి అంతే..." అంటూ విసుక్కుంది అమ్మ.

అమ్మ యెందుకు విసుక్కుంది? అసందర్భంగా! ఈవిడకి యెవరి మీద ప్రేమ ఎప్పుడు పుడుతుందో, కోపం ఎప్పుడు వస్తుందో చెప్పడం కష్టం. కోపం, ప్రేమ, విసుగు మొదలైనవన్నీ మనోజనితాలు. వీటికి కార్యకారణ సంబంధాలు వెదకడం దుస్సాహసం అవుతుందేమో?

"స్నేహా పంతులుగారొచ్చారు... కాఫీ పట్రా..." చిన్నన్నయ్య పిలుపుతో ఆలోచన తెగింది. పంచలోంచి వంటింట్లోకి వెళ్ళేసరికి, భారతక్క పంతులుగారికి కాఫీ తీసుకుని నడవలోకి వెళ్ళింది. నేనూ నడవలోకి నడిచా...

కాఫీ కాస్త చప్పరించి, "రేపటి కార్యక్రమం కొంచెం ముందుగా మొదలు పెట్టాలి..." అంటూ జోగారావు వుపోద్ఘాతం చదివాడు.

అప్పుడే వీధి గుమ్మం తలుపు తీసుకు లోపలికొచ్చాడు దుర్గన్నయ్య... వస్తూనే... "యేరా జోగా... పది రూపాయలు పోయాయని... చిందులేస్తున్నావట..." అన్నాడు.

"వాడు యీ యింటి పురోహితుడు... వాడికిచ్చిన దక్షిణ డబ్బులు పట్టుకు పోతావేమిటీ?" పెద్దన్నయ్య మందలింపు.

"సున్నా లేకుండా పంచాంగము అని రాయలేడు... వీడు పురోహితుడేంటి... అయినా యిచ్చిన మూడు వేలూ చాలవా? పైగా దక్షిణంటావ్?"

యిదంతా చిన్నన్నయ్యకి చికాకనిపించింది. "ఆ సంగతొదిలెయ్. రేపటి కార్యక్రమం యేమిటో చెప్పు" అంటూ జోగారావు వేపు తిరిగాడు.

"రేపు మీ అమ్మగార్ని చెరువు గట్టుకు తీసుకెళ్ళి, పసుపు కుంకుమ తీసేసి, మెళ్ళో నల్లపూసలు మంగళసూత్రం తెంచెయ్యాలి... ఆ కార్యక్రమం తర్వాత ధర్మోదకాలు...ధర్మోదకాలు అయింతర్వాత మీరంతా యింటికి వచ్చి మీ అమ్మగారికి కొత్త బట్టయిచ్చి ఆవిడ మొహం చూడాలి... " అంటూ మర్నాడు జరిగే తంతు వివరించాడు జోగారావు.

"ఆ కార్యక్రమం చెరువు దగ్గరే చెయ్యాలా?" చిన్నన్నయ్య సందేహం.

"అలాంటి కార్యక్రమాలు చెరువు దగ్గరే చేస్తారు, యింట్లో చెయ్యరు... చెడుపు కదా... బెడిసి కొడుతుందని భయం" జోగారావు వివరణ.

"భారతీ అమ్మతో చెప్పు..."

"అమ్మ చెరువు గట్టుకి రాదట" భారతక్కకి ముందే తెలిసినట్టుంది.

"రానంటే యేలా?.. యింట్లో చెయ్యకూడదంటుంటే..."దుర్గన్నయ్యకి పాయింటు దొరికింది.

"ఆవిడకా పట్టింపులేమీ లేవట..."

"ఇందులో ఆవిడ పట్టింపుల ప్రసక్తే లేదు... నన్ను కర్మ చెయ్యమని పెద్ద స్పీచిచ్చింది.. అంతట్లోకే మర్చిపోయినట్టుంది. యిలాంటి వాళ్ళని చూసే వేమనకి వొళ్ళు మండి....

'పిండములను చేసి పితరులను తలపోసి
కాకులకు బెట్టు గాడ్దెలార
పియ్యతినెడు కాకి పితరుడెట్లాయరా
విశ్వదాభిరామ వినురవేమ!'

అంటూ పద్యం చదివి, వేమనగార్ని సాయం తెచ్చుకున్నాడు దుర్గ...మిగతా వాళ్ళని గాడిదల్ని చెయ్యడానికి!

"యెవర్నిరా దుర్గా గాడ్దెలంటున్నావ్" అన్నాడు చిన్నన్నయ్య చిర్నవ్వు దాచుకుంటూ.

ఆ మాటని పట్టించుకోకుండా, "కర్మ చెయ్యడం యెందుకు?... మాకూ ఆ పట్టింపులు లేవు" అంటూ వాదనలోకి దిగాడు దుర్గ.

"దుర్గా నువ్వూరుకో... భారతీ అమ్మకి చెప్పు, తెల్లవార్జామునే చీకటుండగానే రిక్షాలో చెరువు గట్టుకి వెళ్ళి వచ్చెయ్యవచ్చని... పంతులుగారు యింట్లో చెయ్యడం మంచిది కాదంటున్నారని కూడా చెప్పు..." అని భారతక్కని రాయబారం పంపాడు చిన్నన్నయ్య.

కర్మ చెయ్యడానికి, బేరాలాడినప్పుడు, యింటి పని విషయంలోనూ జోగడు... జోగారావుగా పిలవబడే ఈ బక్క బ్రహ్మడు... యిలాంటి విషయాల్లో పంతులుగారు... పురోహితుడుగా మార్పు చెందుతున్నాడు. చిన్నన్నయ్య లౌక్యానికి జోహార్లే!

పంచలోకి వెళ్ళిన భారతక్క వెళ్ళినంత సేపు పట్టలేదు వెనక్కొచ్చేసింది.

"అమ్మ చెరువు గట్టుకి వెళ్ళడానికి వొప్పుకోడం లేదు... పంచలోనే వో మూలకి..." భారతక్క నసుగు.

"అమ్మ వొప్పుకోకపోవడం యేమిటి... యింట్లో జరగకూడదని అంతా అంటుంటే..." దుర్గ కోపం...

"అది కాదురా దుర్గా చెరువు గట్టుకి పోయి జరిపించడం ఈ వూరి సాంప్రదాయం. అందరూ చెరువు గట్టుకే పోయి జరిపిస్తారు... మనం వెళ్ళలేదనుకో తప్పు పడతారు."

దక్షిణల బ్రాహ్మడి సమర్ధింపు.

"వూళ్ళో వాళ్ళు తప్పడతారని... చెరుగట్టు కెళ్ళక్కర్లేదు... వూళ్ళో వాళ్ళేమనుకున్నా పర్వాలేదు... కానీ ముందుగా నువ్వలా అన్లే... ఆ కార్యక్రమం యింట్లో జరక్కోడదని బెడిసి కొడుతుందని అన్నావ్..."

"తప్పంటే..." జోగారావు నసుగు.

"తప్పంటే... తప్పే... చెడు జరగడం అంటే మేమేగా పోయేది. మా మంచి ఆవిడకి మాత్రం అక్కర్లేదా. యిక్కడ ఆవిడ యిష్టాయిష్టాలకి తావే లేదు... ఆవిడ చెరువు గట్టుకి రానంటే.. బలవంతాన తీసుకెళ్ళడమే.. " కంఠంలో నిజాయితీ.. పలుకులో నిర్మొహమాటం... దుర్గన్నయ్య ప్రత్యేక గుణాలు. అందుకే దుర్గంటే అందరికీ పరాకు.

"నీ వ్యవహారం చూస్తుంటే.. రేపో పెద్ద సీన్ క్రియేట్ చేసేటట్టున్నావ్... నువ్వు ఫో బైటకి" అన్నాడు పెద్దన్నయ్య.

"యింట్లో జరిగిన అనర్థాలు చాలవనా ఆ కార్యక్రమాన్ని యింట్లో చెయ్యడం.. కూడని పని అయితే అమ్మని చెరువుకి తీసుకెళ్ళడమే..." దుర్గ పలుకు దారుణాఖండల శస్త్రతుల్యమే!

అందరూ మౌనం....

"చెప్పరా జోగా... నీయమ్మ డబ్బెక్కడికీ పోదుగానీ.. మెలిపెట్టి చెప్పకు...." అంటూ దుర్గన్నయ్య రెచ్చిపోవడం అక్కడ కూర్చున్న వాళ్ళందరికీ ఇబ్బంది కలిగించింది.

అందుకే, "దుర్గా నువ్వూరుకో.. ఈ విషయాన్ని భారతి చూసుకుంటుంది... నువ్వెళ్ళరా జోగా. యెలా జరిగితే అలా జరుగుతుంది... అమ్మ యిష్టం..." అంటూ చిన్నన్నయ్య సంభాషణని తెంచేసాడు.

జోగారావు వెళ్ళిపోయాడు... కానీ దుర్గ దిగి రాలేదు. ఆలోచనల్లో చాలా దూరం పోయాడు.

"అమ్మ పేరునున్న ఫిక్స్‌డ్ డిపాజిట్ కేసావా?"

"దుర్గా నువ్వూరుకో..." అంది భారతక్క ప్రాధేయపడ్తూ.

"యేమిటి వూరుకునేది... యిందులో దాపరికం యేముంది?... ఈ యిల్లు యే గుడ్డు గుడిసిపోతే.. ఆ జోగిగాడికేం.. ఆడికి రూపాల్చూపిస్తే.. యే శాస్త్రాన్నేనా మార్చేయగలడు! యింక ఈయన యెక్కడ కాసులు రాల్తే అక్కడ నాకెయ్యడానికి తయారు... అందుకే యిలా వుంది యిల్లు..."

"దుర్గా అట్టే వాక్కు ఫో బైటకి..." చిన్నన్నయ్య కసురు...

"నీ పెత్తనమేంటోయ్... ఈ యింటికి మంచిది కాదు... అంటే మంచిది కాదు... యిక్కడ నీ యిష్టాల ప్రసక్తి యెక్కడొచ్చింది..." దుర్గ రెచ్చిపోయిన గొంతుకతో.

"లమ్డీకొడకా నిన్నెవడ్రా రమ్మన్నాడు?'' చిన్నన్నయ్య కోపంతో పాలేర్లతో మాట్లాడే భాషలోకి వెళ్ళిపోయాడు.

"యెందుకు డబ్బు మీద అంత యావ... మూటకట్టుకు పోతావా? యేమిటి?''

చిన్నన్నయ్యకి డబ్బు మీద మోజుండచ్చు కానీ దాని కోసం అమ్మ యిష్టాన్ని జరిపిస్తున్నాడంటే... నమ్మ బుద్దెయ్యలా, యేదో బెడిసికొడ్తుందని, కుటుంబానికి హాని జరుగుతుందని, అమానవీయంగా అమ్మని బలవంతాన చెరువు గట్టుకి తీసుకెళ్ళవల్సిన అవసరం యేమిటో?... దుర్గకి చెప్తే వింటాడా? విని అర్థం చేసుకుంటాడా? తన మొండి పరిధిలోంచి బైటకి వస్తాడా? అలా వస్తే దుర్గ దుర్గే కాదు...

"దుర్గా నీ కనవసర విషయాల్లో తల దూర్చకు.. మాడు మీదోటుచ్చుకుంటే... తాగిందంతా దిగిపోద్ది!'' - చిన్నన్నయ్య కోపానికి పరాకాష్ట.

దుర్గ కూర్చున్నవాడు లేచాడు.

"నక్క జిత్తులేస్తున్నాడు... యెవరికీ యేమీ తెలీదనుకుంటాడు... వొక్కరు నోరు తెర్చి మాట్లాడ్రే... అందరూ కంత్రీ ముండలే.. ఛావండి...'' అంటూ గొణుక్కున్నాడు.

యెందుకిలా తిట్టాడు? అసహనంతో తిట్టాడా? లేక మేము 'బలే అన్నావు' అంటూ దుర్గకి సపోర్టొస్తాం అనుకున్నాడా? చిన్నన్నయ్యకి తోచింది చేసాడు... అందులో యేది రైటు యేది కాదు అన్నది యెవరు నిర్ణయిస్తారు? ... యేమిటో యీ బంధాలు.. యెవరి కోసం వొబ్లైజ్ చేస్తూ యిక్కడికి చేరాం... ముండలు అన్నది చిన్నన్నయ్య చెవిన పడినట్టుంది.

"యెవర్నిరా తిడుతున్నావ్?... ఈ యింట్లో ప్రతి ఆడదీ నీకు అక్కో, చెల్లో, తల్లో... వదినో అవుతుంది. నోరు దగ్గర పెట్టుకు మరీ వాగు...'' అన్నాడు చిన్నన్నయ్య లాజికల్‌గా.

అదే చిన్నన్నయ్య చేసిన తప్పు.. పోయేవాడ్ని పోనివ్వకుండా, అగ్నిలో ఆజ్యం పోశాడు.

"ఆస్తులు దొబ్బినప్పుడు.. ఆ విషయం తమ బుర్రలోకి రాలేదేమోయ్.. అప్పుడీ బంధుత్వాలు యే గుడ్డు గుడిసాయ్?''

అంతవరకూ తన విషయం కాదన్నట్టు మౌనంగా వున్న చిన్నొదిన... చిన్నన్నయ్యకి సపోర్టెళ్ళింది- "యెప్పుడూ ఆస్తులు పడేసుకున్నాం... అన్నమాటేగానీ... బాధ్యతల మాటెత్తవేం'' అంది గడుసు పోతూ.

యెవరి గడుసులూ దుర్గన్నయ్య దగ్గర చెల్లవు... అదీ మందు మీదుంటే మరి చెప్పక్కర్లేదు.

"యేమిటి బాధ్యత... స్నేహ పెళ్ళి చెయ్యడం అన్న బాధ్యత చాటున మీరాడిన నాటకం యెవరికి తెలీదు. తెరచాటున మీరు దోచేసిన డబ్బు సంగతి యెవడికి తెలీదు.

రెండు లక్షల విలువ చేసే పొలాన్ని తాకట్టు పెట్టుకుని తల్లీ తండ్రికి అప్పిచ్చావు... పెళ్ళి ఖర్చు నువ్వే పెట్టావు...పావలా వస్తువుకొని రూపాయి లెక్క చూపావ్... అఖరికి... నాన్నకి పెళ్ళి ఖర్చు అప్పిచ్చిందానిమీద వడ్డీ లెక్క చూపి ... పొలాన్ని... స్వంతం చేసుకున్నావా? యిదే గావల్సు బాధ్యతంటే? రామం పెళ్ళిలో వూరి వాళ్ళు చదివించిన డబ్బు లెక్క.. యెక్కడికి పోయింది? స్నేహా పెళ్ళికి వూరి వాళ్ళిచ్చిన సరుకులు నీ జేబులో డబ్బెట్టి కొన్నట్టు లెక్కలు చెప్పలా! యిదే గావల్సు బాధ్యతంటే... తప్పుడు లెక్కల్చెప్పి వడ్డీలు కట్టినప్పుడు... కాసుల గలగల వినబడినంతగా... యింట్లో వాళ్ళ బంధుత్వం కనబడ్లా. కొట్టే దగ్గరా.... తిట్టే దగ్గరా పెద్దరికం వెలగబెతున్నాడు...'' అంటూ దుర్గ అన్నయ్య రెచ్చిపోతున్నాడు... యెన్ని సైగలు చేసినా ఆగడం లేదు.

చిన్నన్నయ్య కూర్చున్న చోటు నుండి ఆవేశంగా లేచాడు - కానీ పెద్దన్నయ్య చిన్నన్నయ్యని పట్టుకుని, "వూరుకోరా చిన్నా... తాగుబోతాడి మాటలకేంటి!'' అన్నాడు.

పెద్దన్నయ్య చిన్నన్నయ్యని పట్టుకుంటే... రామం దుర్గన్నయ్య భుజం మీద చెయ్యేసి.. మెల్లగా వీధిలోకి తీసుకెళ్ళాడు... రామానికి పెద్దన్నయ్య అన్నా, చిన్నన్నయ్య అన్నా, భారతక్కన్నా భయం, గౌరవం.. వగైరా.. దుర్గకి యెవరన్నా భయం మాట తర్వాత... గౌరవం కూడ లేదు. నోటికెంత మాటొస్తే అంతా అనెయ్యడానికి .. వెన్దియ్యడు యెవ్వరూ అక్కర్లేదు... యెవర్నీ ఆశించడు. యే పని చెయ్యడానికీ వెనుదియ్యడు.

* * *

రాత్రి....అమావాస్య... చుక్కల వెలుగు... నిరంతరంగా చింత గీర్ల మోత... అప్పుడప్పుడు కుక్కల మొరుగు... వో విధంగా భయం గొల్పుతున్నాయ్...

"స్నేహా దుర్గొచ్చినట్టున్నాడు... చూడు... అన్నం పెట్టు...'' భారతక్క పురమాయింపు.

"యేడక్కా...''

"పారిజాతం గట్టు మీద కూర్చున్నాడు....''

"అన్నయ్యా వడ్డించనా?...''

నా అరుపుకి సమాధానం లేదు... వినబడిందో లేదో అని మళ్ళీ, "అన్నయ్యా''

ముందు వాకిలి నుండి, "యిక్కడికి తేవే'' అన్న విసుగు వినిపించింది.

"కలిపి తెచ్చెయ్యనా?''

"వూ...''

"యేం కలపనూ?''

"ఆవకాయ కలుపు... వుల్లిపాయ కోసి పట్రా...''

"చీకట్లో యేమేనా పడతాయేమో?''

"పర్వాలేదు అవీ తినొచ్చు..."

ఆవకాయ అన్నం కలిపి తీసుకెళ్ళేసరికి... పారిజాతం గట్టు మీద పడుకుని తారల్ని చూస్తున్నవాడు లేచి కూర్చున్నాడు.

"చీకట్లో తిండేంటి... ఈ బుడ్డీ దీపం తీసికెళ్ళవే..." భారతక్క జాగ్రత్త...

"యేం అక్కర్లేదు కూర్చోవే..."

చల్లగా పారిజాతం కింద... చీకట్లో కాంతి పుంజాల కోసం వెదుకుతూ... అన్నయ్య యెదురుగా కూర్చున్నా...

"బాగా కలిపావే.. రుచిగా వుంది... అమ్మ పెట్టిన ఆవకాయలా వుంది... అమ్మ చేతి వంట తిని యెన్నాళ్ళయిందో?...."

"యెందుకన్నయ్యా అలా అయిపోయావ్"

"యెలా?"

"కటువుగా... యెవర్నీ లెక్క చెయ్యకుండా... అదోలా వున్నావ్..."

"నీకది నచ్చుతుందిగా!"

"అంటే"

"భారతక్కకో... లక్ష్మక్కకో నచ్చదు గానీ.. నీకు నచ్చుతుంది కదే..."

"నచ్చుతుంది కానీ... భయం కూడా వేస్తుంది... కొన్ని బయటకి తెలియకపోతేనే మంచిది... అనిపిస్తుంది.... నిజాయితీ అవసరమే కానీ... భరింపలేనంత వద్దు! అనిపిస్తుంది."

"మధు రాలేదా?"

"యిద్దరికీ వొకేసారి శలవు దొరకడం కష్టం... పన్నెండో రోజు వస్తాడ్లే"

"వంచనా... నిన్ను నేను పట్టుకోగల్నులే..."

"తప్పదు... బాగులేదూ"

"చాలా బావుంది"

వెక్కిరింపులా వుంది...

"అందుకే భయం"

"భయం దేనికి?"

"మనసా వాచా కర్మణా అన్నవి మూడు వేర్వేరు కాదు నీకు... అందుకే భయం"

"మరి మీకు కాదా?"

"మా సంగతెందుకు అడుగుతావులే..."

"పోన్లే నీ సంగత్చెప్పు..."

"యేం చెప్పనూ మనసేనాడో సమాధానపడింది... యింతకన్న యింక జీవితంలో యేముంది అన్చెప్పి బతికేస్తున్నా... అప్పుడప్పుడు మధుని చూస్తే చిరాకేస్తుంది. వాడి భయంకర స్వార్థం చూసి చిరాకేసి మనసెదురు తిరుగుతుంది. కానీ యేదో అనూహ్యమైన అసమర్థత.. వెనక్కి నెట్టేస్తోంది. సమాధానపడి రోజులు నెట్టుకొస్తున్నా... నేనే కాదు మేమంతా సమాధానపడిపోయాం..."

"సమాధానపడితే పడు కానీ... యేదో త్యాగం చేస్తున్నానని భ్రమలో పడకు!" దుర్గన్నయ్య చురక.

"నువ్వన్న త్యాగం యేమిటో నాకర్థం కాలేదు... యే భ్రమా లేదు కూడా"

"నేనే సమాధానపడుతున్నానన్న భ్రమ.. జీవితంలో నాకే అన్యాయం జరుగు తోందన్న భ్రమ... అన్యాయాన్ని సహిస్తూ కూడా మంచిగా వుంటున్నానన్న విచిత్రమైన వంచన...."

"నువ్వన్నంత కాదు గానీ... పరిస్థితులకి లొంగుతూ మోరల్ యాస్పెక్ట్ ఆఫ్ మై మైండ్ ఈజ్ ఫీలింగ్ యెకార్డింగ్ టు ది సర్కమస్టెన్సస్"

"చిన్నన్నయ్యలా!"

"అదెలా?"

"వాడింటి కోసం యేం చేసినా కిరాయిచ్చుకుంటాడు... నీ పెళ్ళికి పెత్తనం చేసాడా- శ్రమ కింద రెండెకరాలు జమ రాసేడు. రామం పెళ్ళి జరిపించాడా! కట్నంలో సగం డబ్బెట్టి.. యిల్లు బాగు చేయించాడు... యిల్లెవర్ది, వాడ్దే... అది వాడి మోరల్ యేస్పెక్ట్ ఆఫ్ ది మైండ్... మొన్నటికి మొన్న యెకరం భూమి అమ్మాడా? కొలతల్లో పది సెంట్లు యెక్కు వచ్చింది... రామానికి మాత్రం యెకరానికి డబ్బు ముట్ట చెప్పాడు... పది సెంట్ల సొమ్మూ... అమ్మి పెట్టిన శ్రమకి కిరాయన్న మాట... ఈ కర్మ యెందుకు చేస్తున్నాడు?.. కొన్నాళ్ళాగాక తెలుస్తుంది. మనం తొందర పడకూడదు."

"నువ్వు చెప్పేది వింటుంటే ప్రపంచంలో మనుషులంతా తప్పేమో అనిపిస్తుంది."

"తప్పుకాదు... స్వార్థపరులు... అంతో యింతో తన కోసం తాపత్రయ పడ్తూ వుంటారు... చతుష్పాది ఈ ప్రాణం... ఈ మనసు యెక్కడో దగ్గర సుఖం వెతుక్కుం టూనే వుంటుంది. ధర్మార్థ కామ మోక్షాలలో యేదో వొకదాంట్లో ధర్మంలోనో... కామం లోనో... అర్థంలోనో... మోక్షంలోనో... యెక్కడో దగ్గర యెలాగోలా సుఖం వెదుక్కుంటూనే వుంటుంది..."

"నీ మాటలో కటుత్వం నాకు నచ్చదురా... మమ్మల్నిలా బతకనియ్యి"- నా గొంతులో నీర్సం...

“మాయ... దూదిపింజె యెగుర్తుందెందుకు? దాని మీద గురుత్వాకర్షణ శక్తి పన్చెయ్యదా? స్వప్నం చెరిగిపోతుందెందుకో?... చెరిగెపోయేదాన్ని పట్టుకు వేళ్ళాడి... విచారించేకన్నా... మనసుని తర్కించి చూసి... అర్ధం పర్ధంలేని నాగరిక బురఖా తొలగిస్తే... జీవితం బావుంటుంది. కానీ హిపోక్రసీకే విలువ.. యిస్తాం..”

“నీ అంత ఆలోచన లేదు నాకు...”

“మహత్వ కవిత్వ పటుత్వ సంపదలున్నాయ్”

“యెలాగూ వొప్పుకున్నావుగా, వొక విషయం అడుగుతా యేమనుకోకు... నిజాయితీ ధ్యేయంగా నిర్మొహమాటం ఆయుధంగా కల దుర్గకి... తాగుబోతు బురఖా యెందుకో...?”

దుర్గ మాట్లాడలేదు. దుర్గ మౌనాన్ని బట్టి దుఃఖితుడైనాడేమో అన్పించింది... అది నా కిష్టం లేదు. అందుకే, “రోజులు కృతకంగా యిచ్ఛారహితంగా వెళ్తున్నాయ్... జీవితంలో యేదో లోపించింది. యేదో గుల్లలో బలంగా యిరుక్కుపోయాననిపిస్తోంది....” అన్నా

“గుల్లని తెలిసీ యిరుక్కుని బైటకి రాలేకపోవడం మన దౌర్భాగ్యం... చిన్నన్నయ్య చూడు... హృదయంలో స్వార్థం, పెదవుల చివర్న చిర్నవ్వు తేనె...ప్రవర్తనలో యెదుటి వాళ్లని చకితుల్ని చేసే మెరుపు, వదిన కూడా అన్నయ్యకి యేం తీసిపోదు. యెదురుగా వున్నంతసేపూ యెంత నటన... ఆ నటనకి చిరాకేస్తుంది. ‘యింకాపేయ్’ అంటూ అరవాలనిపిస్తుంది... పుట్టుటయు నిజము పోవుటయు నిజము... నట్టనడిమీ పని నాటకము... దుర్గ పాత్రకి తాగుడు మేకప్ లేకపోతే నాటకం రసాభాస అవుతుంది!...” దుర్గన్నయ్య నవ్వు...

“అన్నయ్యా వో హెల్ప్ చేసి పెట్టవూ?”

“నే చేసే హెల్పులు కూడా వున్నాయన్న మాట... చెప్పు”

“రేపు యింట్లో యేం జరిగినా యెలా జరిగినా పట్టించుకోకు...నిల్దియ్యకు...గొడవ జరగడం తప్ప యింకేం వుండదు...”

“యేం అలా అంటున్నావ్”

“చెరువు కెళ్ళడానికి అమ్మ వొప్పుకోలేదు... యింట్లోనే అన్ని కార్యక్రమాలూ జరుగుతాయ్....”

“వొప్పుకుంటే అది నీకూ నాకూ అమ్మోలా అయింది... యే చెడు జరిగినా... యెవరెలా పోయినా అవిడకేం - ఆవిడ మాటే నిలబడాలి... ఆవిడ్ని నిల్దియ్యకూడదు... అయినా మనమంతా వో కుటుంబం... మనం ఈ కుటుంబమే నిలబెట్టుకోలేక చస్తోంటే... వాడెవడో వసుధైక కుటుంబం అన్నాడు... పిచ్చి సన్నాసి...”

అన్నవాడు పిచ్చిసన్నాసి కాదు...యెమోషన్స్‌ని అర్థం చేసుకోలేనంత బండబారి

పోయాడా? దుర్గన్నయ్య, యేమో అలాగే అనిపిస్తోంది. కాని దుర్గని అలా వదిలెయ్ దల్చుకోలేదు.

"కుటుంబం అన్నది...ఆర్థిక పరిస్థితికి...యిగోలకి... అతీతంగా వుంది. ముఖ్యంగా భావావేశం మీద ఆధారపడి వుంది... ఈ భావావేశం చాలా తీపిగా వుంటుంది.... పూతరేకుల్లా.. విచిత్రంగా పొరల మధ్య దాగున్నతీపి.. యేమిటో? పెద్దన్నయ్య మనల్ని పట్టించుకోలేదు... తనదారి తను చూసుకున్నాడు. చిన్నన్నయ్య అందరి అవసరాలూ తానుగా బాధ్యత వహించి జరిపించాడు... నీ వుద్దేశ్యంలో అలా చేస్తూ అందర్నీ వంచించాడు. యింక భారతక్క యిప్పటికీ తనదేదో ఈ యింటిలో వుండిపోయింది, అన్నట్టు పాకులాడుతుంది. లక్ష్మక్క మొగుడి పేరు చెప్పి రహస్యంగా వడుక్కుంటుంది. దుర్గ యెగ్రసివ్ ప్రవర్తన... రామం మోడస్ట్ బిహేవియర్... యెవరు యెలా వున్నా.. ఎలాంటి వాళ్ళయినా.. వీళ్ళందర్నీ కలుసుకోవాలనే తహతహయేదో యెప్పుడూ వెన్నాడుతూ వుంటుంది. అదే భావావేశం యేమో?" అన్నా ఆవేశంగా.

దుర్గ లోపలి మనిషి కదిలేడు "అదే లేకపోతే... యెందుకొస్తానే..." స్వరం బొంగురు పోయింది.

"మరి వచ్చీ రాగానే దెబ్బలాటకి దిగుతావేం?"

"అదే మీ ఆడవాళ్ళ బలహీనత.." దుర్గ భావావేశం నుండి తేరుకున్నాడు. "వచ్చిం తర్వాత వచ్చినంతసేపు వుండదు... వచ్చానన్న ఆనందం... వీళ్ళందరి హిపోక్రసీ సరి చెయ్యాలనిపిస్తుంది. భారతక్క, లక్ష్మక్క గురించి చెప్పావ్ మరి నీ సంగతో.. అన్నయ్య లెంత చెప్తే అంత, అయామకురాలు, నోరు తెరచి యేదీ అడగదు.... అన్న మంచితనం ఆశ... బురఖా...అందరికీ తెలుసు పైకి కనిపిస్తున్నంత అమాయకురాలివి కాదని... నీ గడుసుదనం తెల్సిన మధుకి... నీ యేకపక్ష మంచితనం నచ్చదు... అందుకే నీతో రాలేదు, వాడు!"

దుర్గ మాట ముగించనే లేదు... రామం యింట్లోంచి వచ్చాడు - "యిక్కడేం చేస్తున్నా" రంటూ...

"అన్నయ్య భోం చేస్తున్నా" డన్నా.

"యేమిటి పారిజాతం పువ్వులా?" అని నవ్వుతున్నాడు.

అప్పటికే కంచంలో... మా చుట్టు పక్కలా పారిజాతం పువ్వులు పడ్డాయి... మేం గమనించలేదు.

"నీకు డబ్బు వాసన యెలా తగుల్తుందిరా?" అన్నాడు రామం దుర్గన్నయ్యని చూసి.

"వందేగా పట్టుకెళ్ళా"

"పూర్తిగా తాగేసావా?"

"........"

"నా బట్టలు తీసేసావ్... డబ్బు తీసేసావ్... యేమిటోయ్ నీ హక్కు."

"హక్కు కాదు స్వేచ్ఛ... పొద్దున స్నానానికి వెళుతూ పెట్టె వెయ్యడం మర్చిపోయావు! సో ఫ్రీడం యట్ యెర్లీ మార్నింగ్..." దుర్గ నవ్వు...

స్వేచ్ఛ!...అందరికీ కావాలి. కాని దాని కోసం తపించినవాడు దుర్గ. చిన్నప్పట్నించి ఆ ప్రత్యేకత దుర్గలో కనిపించేది. తను, రామం, దుర్గ కలిసి స్కూలుకి వెళ్ళేవారు. స్కూలు రైలు పట్టాలకి అవతల వుండేది. ముగ్గురి వయసూ యేడాదులే తేడా... అరమరికలు వుండేవి కావు. యింటి నుండి ముగ్గురం బయలు దేరే వాళ్ళం... అమ్మా, నాన్న చిన్నన్నయ్య మరీ మరీ చెప్పేవాళ్ళు.. రైలు పట్టాలు దాటద్దనీ.. క్రాసింగ్ వరకూ నడుచుకువెళ్ళి.. గేటు వేసుంటే.. గేటు తీసేవరకూ... ఆగి...గేటు తీసాక... క్రాసింగ్ దాటమని... కొన్నాళ్ళ వరకూ అలాగే వెళ్ళాం... కొన్నాళ్ళలో దుర్గ ఆలోచన మారింది.

అంతదూరం నడిచి వెళ్ళడం దండగ... పట్టాలు దాటితే స్కూలు దగ్గరవుతుంది. పట్టాలు దాటిపోదాం అంటూ మా ప్రాణాలు తోడేసాడు. నాకూ, రామానికీ భయం - యెవరేనా చూస్తే నాన్నతో చెప్పేస్తారు... నాన్న చర్మం వలిచేస్తాడు. చిన్నన్నయ్య అయితే బెల్టుతో కొడ్తాడు... ఆ దెబ్బలంటేనే భయం... అంతేకాదు యింట్లో అడిగితే యేం చెప్పాలి? నిజం చెప్పాలా? వద్దా? నిజం చెబితే వళ్ళు తాటదేరిపోతుంది! అబద్ధం చెప్పకూడదనే స్కూల్లో కేప్షన్.. కేప్షన్ మాట యెలా వున్నా అబద్ధం చెప్పి తప్పించుకోగలమా? విచిత్రమైన దువిధ. అందుకే దుర్గ యెన్ని చెప్పినా వినలేదు. దగ్గర తోవ పట్టలేదు.

వో రోజు దుర్గ మమ్మల్ని పట్టించుకోలేదు. రైలు పట్టాలు దాటి స్కూలు కెళ్ళిపోయాడు. అమ్మ అడిగితే యేం చెప్పాలి? దుర్గ రైలు పట్టాలు దాటేడని చెప్పాలా? వద్దా? చెప్పితే దుర్గ తంతాడు, చెప్పకపోతే అమ్మ కోప్పడుతుంది? యేం చెయ్యాలి? అన్న ఆలోచనే కానీ, అమ్మకి గానీ నాన్నకి గానీ ఈ విషయం యెలా తెలుస్తుంది అన్న ఆలోచన రాలేదు... కానీ తెలిసింది. వూరు వట్టి పోలేదు.

పల్లెటూరు - అందరి విషయాలూ అందరికీ కావాలి... సోషల్ బాండ్.. దుర్గ రైలు పట్టాలు దాటాడన్న వార్త నాన్న చెవిలో పడింది. సాయంకాలం యింటి కొచ్చేసరికి నాన్న నిప్పులు చెరుగుతూ, "దుర్గా రైలు పట్టాలు దాటావా?" అంటూ హూంకరించారు... అమ్మ నన్ను పక్కగా తీసికెళ్ళి, "దుర్గ పట్టాలు దాటేడేమిటే?" అంటూ వివరాలడిగింది... యేం చెప్పను మనసులో యెక్కడో యే మూలో దుర్గన్నయ్య చూపించిన స్వేచ్ఛ, చొరవ నచ్చాయి. లేకపోతే రోజూ రైలొచ్చినా, రాకపోయినా, అర కిలోమీటరు దూరం నడవడం చాలా శ్రమతో కూడిన పని... ఆ రోజు దుర్గన్నయ్య దెబ్బలు తిన్నాడు... నాన్న చేతిలో...

చిన్నన్నయ్య చేతిలో...వాటి మహత్యం రెండు రోజులు మాత్రమే వుంది మూడో రోజు మళ్ళీ మామూలే... తనకి నచ్చిందీ... తను నమ్మిందీ... ఆచరించకుండా వుండలేడు దుర్గ... అందుకే వాడ్ని చూస్తే పరాకు అందరికీ!...

ఆలోచనల్లో తేలుతూ... కంచం తీసుకెళ్ళి వంటింటిలో పెట్టి...పక్క మీదికి చేరుకున్నా.... అందరూ అలసి నిద్రిస్తున్నారు. నిద్ర రాలేదు... ఆలోచన్లు ఆగలేదు... రామంకి, తనకు, తల్లి తండ్రి చెప్పారు. పట్టాలు దాటకూడదు అన్న నైతిక కట్టుబాటు... దుర్గన్నయ్యకి యెందుకు లేదు?... ఆలోచనల్లో... ప్రవర్తనలో యింత యెగ్రసివ్‌నెస్ యెలా వచ్చింది?... యెందుకొచ్చింది?

నా ఆలోచన్లకి అడ్డుకట్ట వేస్తూ.. గుసగుసలినిపించాయి. కొంచెం శ్రద్ధగావింటే గుసగుసలే స్పష్టంగా మాటల్లా వినిపించాయి.

"దుర్గా ప్రసాద్‌గారు మాత్రం కొడుక్కాడా యేమిటి? ఆయన్నీ ఖర్చులో నాలుగో భాగం పెట్టమనండి...." పెద్దొదిన వెక్కిరింపు.

"వాడెలా వచ్చాడో చూసావుగా... వాడు యింటిలో అవీ యివీ పట్టుకుపోయి అమ్మేకుండా వుంటే సరి."

"చిన్నాయనేమంటాడూ? మూడేళ్ళ నుండీ పంటలు పోయాయంటూ... నాలుగు వేల శిస్తుకి వొప్పుకొని వెయ్యే చేతిలో పెడుతున్నాడు. "

పెద్దన్నయ్య మౌనం.

"మీ అమ్మగారి పేర్న యేదో ఫిక్సడ్ డిపాజిట్ వుందటగా!"

"మా అమ్మ యింకా బతికే వుంది..." పెద్దన్నయ్య చిరాకు.

"యిప్పుడ్నేనేమన్నానూ... ఆవిడకి ఆ దుర్గన్నా, రామం అన్నా అభిమానం... ఖర్చులన్నీ మన మీద విరుచుకుపడ్తాయి... మిగులూ తగులూ వాళ్ళూడ్చుకెళ్తారు..."

"యిప్పుడా విషయం అనవసరం, వూరుకుందూ..."

"మీరిలాంటి వెర్రివాళ్ళు కాబట్టే... ఆ చిన్నాయన తన కిష్టమొచ్చినట్లు దోచుకున్నాడు..."

ఈవిడ్ని పెళ్ళి చేసుకునేవరకూ పెద్దన్నయ్య వెర్రివాడే కావల్ను... ఈవిడ వల్లే జ్ఞానోదయం అయింది... కాబోలు...

"యెవడూ యెవర్నీ దోచుకోడం లేదు... నువ్వు నోర్మూసుకు పడుకో... స్నేహా, దుర్గా తెలివిగా వున్నారు... వింటారు..."

"వింటే విన్నీయండి... నేనేం తప్పన్లేదు....ఆ మాత్రం బాధ్యత వాళ్ళకి అక్కర్లేదా అన్నానంతే...."

"......"

"అవునూ మీ అమ్మగారి మెళ్ళో గొలుసుండాలి కనబడదేం?"

"నోర్మూసుకు పడుకో...."

"యెందుకంతలా విసుక్కుంటారూ... మీకు తట్టదు... చెపితే విన్రు"

"యేమిటి తట్టేది... తండ్రికి కర్మ చెయ్యడానికొచ్చా...వున్నవాళ్ళని పీక్కు తిండానికి రాలా. నువ్వు నీ తెలివితేట్లు మీ పుట్టింటిలో చూపాల్సింది... పడ్కో..." యేదో బలమైన 'జీన్' అన్నయ్యని యిటు లాగింది.

'దాంతో పెద్దొదిన కసి పెరిగిపోయింది'

"మీ విశాఖపట్నం తమ్ముడికి తెలియచేసారా?"

అన్నయ్యకి సంభాషణ యెటు మళ్ళుతోందో అర్థం అయింది. సమాధానం చెప్పకుండా, విసుక్కుంటూ పక్కకి తిరిగి పడుకున్నాడు...

విశాఖపట్నం అన్నయ్య కూతురే రాజ్యం... విశాఖపట్నం అన్నయ్య మా చిన్నాన్నగారి అబ్బాయి, ఆ విధంగా రాజ్యం శేషుకి అక్కయింది. శేషు కన్న రెండేళ్ళు పెద్దది. ఢిల్లీ యూనివర్శిటీలో పి.హెచ్‌డి. స్కాలర్‌గా జాయిన్ అయి, అది పూర్తి చేసి... అదే డిపార్ట్‌మెంటులో లెక్చరర్‌గా జాయిన్ అయ్యింది.

శేషు యింజనీరింగ్ పూర్తి చేసి 'యంటెక్' చెయ్యడానికి ఢిల్లీ వెళ్ళాడు. యంటెక్ చేసినన్నాళ్ళూ హాస్టల్లో వున్నాడు. శలవుల్లో... రాజ్యం యింటికి వెళ్ళి వచ్చేవాడు. రాజ్యం వాడికి ఢిల్లీలోనే పరిచయం అయింది. అంతకు ముందు యే ఫేమిలీ ఫంక్షనులోనూ కలుసుకోలేదు. యంటెక్ పూర్తవగానే శేషుకి ఢిల్లీలో జాబొచ్చింది. తాత్కాలిక యెడ్జస్ట్మెంట్‌గా శేషు రాజ్యం యెపార్ట్‌మెంటుకి మారాడు. రాజ్యంకి దగ్గరయ్యాడు... యిద్దరూ పెళ్ళి చేసుకున్నారని వినికిడి. యిది జరిగి వో యేడాదేనా అయుంటుంది... ఇప్పటికేనా తండ్రి కోపం తగ్గదా అని వచ్చుంటాడు...

ఆలోచన్లని చెదరకొడ్తూ...దబదబ తలుపు చప్పుడు...

"యెవరో వచ్చినట్టున్నారు..." పెద్దొదిన.

"నే చూస్తాలే.. వొదినా" అంటూ లేచా.

"స్నేహా తెలివిగానే వుంది..." పెద్దొదిన సణుగుడు.

"అందుకే నోర్మూసుకు పడుకోమన్నా" పెద్దన్నయ్య విసుగు.

నడవలో లైటేస్తే అక్కడ పడుకున్న వాళ్ళు లేచిపోతారని... లైటెయ్యకుండా.. మెల్లగా తడుముకుంటూ వెళ్ళి తలుపు తీసా, బయట చిన్న బావ...చీకట్లో వున్నా నన్ను గుర్తు పట్టాడు.

"నేనంటే నీకెంత యిదోయ్ మర్దలూ... నేను నా యిది కూడా చూపించనా..."

సరసం కాబోలు... నేనేమేనా అనే లోపుగా, "యెవరే స్నేహా?" అనడిగాడు

పెద్దన్నయ్య.

"చిన్నబావ."

"లైటెయ్యి"

లైటెలిగింది... చీకట్లో వున్న ధైర్యం చిన్నబావకి వెల్తుర్లో కరువయ్యింది... యిదో జీవి... వెనకాలే పెద్దొదిన అన్నయ్య లేచొచ్చారు.

* * *

తెల్లారేసరికి.... అందరూ దిగేరు.

"అన్నయ్య జీవితానికేం పండు జీవితం..." అంటూ చిన్నాన్నలు.

"బావలా మనమెలా బతగ్గలం" అంటూ మామయ్యలూ యిల్లంతా సందడితో నిండింది.

వీధి వాకిట్లో -

"యేరా చిన్నా ఆ పారిజాతం గట్టు మీద పడుకున్నది దుర్గేనా?.... యేం చేస్తున్నాడూ?" చిన్నాన్న యెంక్వైరీ...

"వాడ్నే అడుగు..." చిన్నన్నయ్య.

"యెలా తయారయ్యాడో... మీ యింట్లో అందర్లోకీ తెలివైనవాడు వాడే.."

"అందుకే... నిన్న బ్రహ్మడి కిచ్చిన దక్షిణలో వో పది రూపాలట్టుకుపోయాడు.." రామం అసందర్భపు హాస్యం...

"తాగుతాడా?" చిన్నాన్న డౌటు.

"యే మీకూ నాలుక పీకేస్తోందా?" పిన్ని యెత్తిపొడుపు.

"నాలుకంటే జ్ఞాపకం వచ్చింది... మీ మాట వింటూ నాలుగ్గీసుకోడం మర్చిపోయా... స్నేహ్ చెంబుతో నీళ్ళు పట్రా..." మావయ్య.

"నీ నోట్లోనూ నాలుకుందేమిటోయ్ బావా" చిన్నాన్న హాస్యం.

"నోట్లో నాలుకుండదేమిటోయ్?" హాస్యం అర్థం చేసుకోకుండా... మావయ్య ఆశ్చర్యం.

"చెల్లమ్మ కాపరానికొచ్చాక... అది నీ నోట్లోనే కరిగిపోయింది అంటారులే అందుకు".

యిల్లంతా హడావిడి.. కళ కళ.. హాస్యాలు..అపహాస్యాలు.. దెప్పి పొడుపులు.. నాన్నని తల్చుకుని కళ్ళు చెమర్చిన సందర్భాలు... యిల్లంతా వో కుటుంబం యింటర్నెట్ వెబ్సైట్లలా.... వుంది. వెబ్ సైట్లో వైరస్లా.. అక్కడక్కడ అలకలూ.. చిన్న చిన్న దెబ్బలాటలూ కూడా వున్నాయి.

వీటన్నింటి మధ్యా యెనిమిదయేసరికి ధర్మోదకాలివ్వడానికి అందరం చెరువు

గట్టుకి చేరుకున్నాం... మధు రాలేదు, రాడు కూడా, పోయిం తర్వాత వెళ్ళి చూసేదేమిటి అంటాడు. బతికుండగా తీరిక లేక రాలేదనే నెపం... సుధీర్ వచ్చాడు... రాగానే 'హాయ్ అత్తా' అంటూ పలకరింపు... యెంతగా యెదిగిపోయాడో... వాడి చూపుల్లో అభిమానం... పిలుపులో మమత, వాడి కంపెనీ మనసుకి యెంత హాయినిస్తుందో! కానీ దుర్గ చూసే చూపులకి తట్టుకోలేం! దుర్గ యెవరి ప్రైవసీ మన్నించడు... మాట కటువు... మనిషి కటువు... ఆ కటుత్వం వెనుక దిగంబరత్వం... అన్ బేరబుల్! శేషు ఆ రోజున పోయినవాడు... మళ్ళీ రాలేదు... వచ్చుంటే తండ్రి కొట్టిన లెంపకాయకన్నా.. దుర్గన్నయ్య వెక్కిరింపుకి... యెక్కువ హర్ట్ అయ్యేవాడు. సుధీరుకా బెదురు లేదు. తననుకున్నది చేసి తీర్తాడు. యెవర్నీ పట్టించుకోడు... "అత్తా" అంటూ వచ్చేస్తాడు... వచ్చేసాడు కూడా... మనసులో యెక్కడో, యే మూలో, వాడ్ని తప్పించుకోవాలని లేదు...ఈ తనువు... ఈ మనసు... యిష్టాలు వేరు... లోకంలో జరుగుతున్న తీరు వేరు అనిపిస్తుంది.

"అత్తా యేంటాలోచిస్తున్నావు? స్నానం చెయ్యవా?"

అనుకున్నంతా అయింది. సుధీర్ దగ్గరగా వచ్చేసాడు. ఆలోచన తెగింది.

చుట్టూ పకపకలు... పరాచికాల మధ్య... చెరువు గట్టు... కోలహలంగా వుంది. ముందుగా పిల్లలు చెరువులో దుకేసారు... కేరింతలు కొడ్తూ నీళ్ళు జల్లుకుంటున్నారు.

గట్టు దిగి నీళ్ళలో అడుగుపెట్టా.. కాళ్ళకి చల్లటి నీళ్ళు జివ్వున్తగిలాయి. నాకన్నా ముందుకి పరిగెత్తి వంగి దోసిల్తో నీళ్ళు తీసి మీద చిలకరించాడు సుధీర్... చల్లటి నీటి చుక్కలు శరీరానికి మిటరాయిడ్స్‌లా తగిలాయి.

అందరు ఆడవాళ్ళూ మెల్లగా నీళ్ళల్లోకి దిగుతున్నారు. చెరువులో నీళ్ళు మోకాళ్ళని దాటి... తొడల వుపరి భాగంకి చేరుకున్నాయ్. చీర కుచ్చిళ్ళు నీటి మీద తేలుతున్నాయి. కుచ్చిళ్ళని తడిపి... మోకాళ్ళ మధ్య బిగించాను. చీర కాళ్ళకి చుట్టుకుని నడవడం కష్టంగా వుంది. కాలు సరిగా నీటి అడుగున నేల మీద పడక తూలి నీళ్ళల్లోకి జారిపోయా... "యేమైందత్తా రాళ్ళున్నాయి కిందని" అంటూ పట్టుకు లేవదీసాడు సుధీర్.. "చెరువు మధ్యకి పద" అంటూ చెయ్యి పట్టుకు లోపలికి తీసుకెళ్ళాడు. నీటి మట్టం బొడ్డుపైకి వచ్చేసరికి... కింద నుండి కాళ్ళు తేలి పోతున్నాయ్. నడవడం కష్టమైపోతోంది. సుధీర్ నవ్వుతున్నాడు. "మున్గవా అత్తా" అంటూ భుజాలు పట్టుకు ముంచేసాడు.

క్షణకాలం... నీళ్ళల్లో వుక్కిరి బిక్కిరైపోయా... బలవంతంగా నీళ్ళలోంచి లేచా... సుధీర్ చెయ్యి భుజాల మీంచి జారిపోయింది. "నే పట్టుకుంటాలే ఈసారి మునుగు" సుధీర్ గాడి హీరోయిజం... వాడు చెయ్యి పట్టుకునుండగానే... మరోసారి మునకేసా.. యిప్పుడంతా గాబరా లేదు. చీరంతా వంటికి అతుక్కుపోయింది. పైట రొమ్ముల మధ్య హత్తుకుపోయి... లోపల బ్రా వెయ్యలేదేమో? సుధీర్ దృష్టిని ఆకర్షించాయ్. ఆ ఆకర్షణ బలమైన కోరిక లేపుతుందా? ఈ అవకాశాన్ని వాడు అనువుగా తీసుకుని యేదేనా సాహసం చేస్తాడా? చేస్తే యేం చెయ్యాలి? నేనివేం గమనించనట్టు మరో మునక

వేసా! సుధీర్ తడబడ్తాడా? సాహసం చేస్తాడా? చేస్తే కోపం చూపించాలా? లేక యేం జరగనట్టు తప్పించుకోవాలా? యేం చేయ్యాలి?..

యేం చెయ్యవలసిన అవసరం రాలేదు. మునక నుండి లేచేసరికి... సుధీర్ అదే నవ్వుతో... చెయ్యి పట్టుకు అలాగే నిలబడ్డాడు. యేదో జరగాలని సుధీర్ యేదో సాహసం చెయ్యాలని అంతర్లీనంగా తన కోరికేనేమో? ఛ! వెధవాలోచన్లు యివొదలటం లేదు. యిదేదో నెవ్యూ కాంప్లెక్స్‌లా వుంది... మనసుకి హాయి నిచ్చే.. అనేక అనుభూతుల్ని.. బూతుల్ని చేసినందుకు ఫ్రాయుడ్ని.. తన్నాలి. ఫ్రాయిడ్‌తో పాటూ దుర్గని కూడా తన్నాలి... వీడూ వీడి నిజాయితీ... అప్పుడప్పుడు మనం మనల్ని మోసం చేసుకుంటే యెంత బావుంటుంది.! సుధీర్‌ని అలా వదిలెయ్యకూడదనిపించింది. కిందకి వంగడం వల్ల పైకి పోయిన జాకెట్ కింద రెండు వేళ్ళూ పెట్టి కిందకి లాగా, పైట పూర్తిగా నీటి మీద తేలుతోంది. జాకెట్టుని పూర్తిగా సర్ది... పైట పిండుకు గుండెల మీద సర్దా... సుధీర్ మొహం పక్కకి తిప్పలేదు. నిశ్చలంగా నే చేస్తున్నదంతా చూస్తున్నాడు.

''అప్పుడే స్నానం అయిపోయిందా? అత్తా'' అని, ''ఈసారి ముక్కు మూసుకోకుండా మునకెయ్యి'' అంటూ భుజాలు పట్టుకు మెరుపు వేగంతో నీళ్ళలో ముంచేసాడు. ఆ చేతులు.. ఆ వేళ్ళ కదలికలు ఆ పట్టులో మార్మికం... అర్థం అయ్యేటప్పటికి... మునకేసి తేలా! ముక్కులోకి గొంతులోకి నీళ్ళుపోయి... దగ్గొచ్చేసింది. సుధీర్ నవ్వుతున్నాడు.

అప్పుడు వినిపించింది - "వొరేయ్ రామం... యేమిటి చూస్తున్నావ్... రాజా చూడు కొట్టుకుంటున్నాడు'' అన్నారెవరో.

రాజా చెరువు మధ్యగా మునక లేస్తున్నాడు. చేతులు కొట్టుకుంటున్నాడు. చేతులూపుతున్నాడు... ఆ వూపులో వొక భయం... వొక ఆతృత... కనిపిస్తున్నాయ్... రామం వొక్క మునకేసి... రాజా దిక్కుగా యీది, రాజాని పట్టుకున్నాడు. అప్పటికే రాజా బాగా నీళ్ళు తాగేసాడు. వాడ్ని తీసుకొచ్చి వొడ్డున పడుకోబెట్టారు. వాడి పక్కకి చేరి భారతక్క యేడ్చేస్తోంది. రామం పర్వాలేదని ధైర్యం చెప్తున్నాడు. రాజా భారతక్క ఆఖరి కొడుకు. రామం వొడ్డున పెట్టిన బట్టలు కట్టుకుని... రాజా నెత్తుకుని... డాక్టరు దగ్గరకెళ్ళాడు... భారతక్క తొందరగా యింటి కెళ్ళింది, తడి బట్టలు మార్చుకోడానికి....

* * *

తిలోదకాలు మొదలయ్యాయి. యింటిపేర్ల వాళ్ళూ... దాయాదులూ తిలోదకాలిస్తున్నారు. అవయాక ధర్మోదకాలు మొదలయ్యాయి. యేదో రాయి పెట్టి నీళ్ళు పొయ్యమన్నాడు జోగారావు. ప్రతి మనిషి పేరు చెప్పి మంత్రం చదువుతున్నాడు. నీళ్ళు పోసి... ఆయనకిచ్చిన దక్షిణ వెంటనే తీసి దాచేసుకుంటున్నాడు. దుర్గంటే హడలు పట్టుకున్నట్టుంది. ధర్మోదకాలయ్యాక మళ్ళీ స్నానం... సుధీర్ దగ్గరకి రాబోయాడు,

మనస్కరించలేదు... స్నానం అయిందనిపించి, వొడ్డుకి చేరుకున్నా... దూరంగా దుర్గ గట్టు మీద కూర్చుని హోమం కోసం పుల్లలు చీరుతూ... చెరువులో వాళ్ళని గమనిస్తున్నాడు.

అందర్నీ వెనక్కొదిలి.... యింటి దారిపట్టా... మళ్ళీ ఆలోచన్లు... ముసురు కుంటున్నాయ్. భారతక్క కొడుక్కెలా వుందో... కాళ్ళకి అతుక్కుపోయిన చీరతో కాలిబాట నుండి, నడవాలంటే... చాలా యిబ్బందిగా వుంది.

"యేమిటే అంత పరధ్యానం..." అంటూ లక్ష్మక్క వచ్చి కలిసింది.

ఈవిడ ఉత్సాహం చూస్తూవుంటే యేవో విశేషాలు చెప్పడానికొచ్చినట్టుంది. అనుకున్నంతా అయింది లక్ష్మక్క నిముషం వేష్టు చెయ్యలేదు.

"చిన్నాన్న తన వంతు వాటా అమ్మినప్పుడు... అమ్మ వున్న పంచ కూడా కలిపి అమ్మేసాడట...."

"........" - మౌనమే శరణ్యం.

"అమ్మని నువ్వు తీసుకెళ్తావటగా?"

"యెవరు చెప్పారు?"

"పెద్దన్నయ్య... వాళ్ళిద్దరూ వుద్యోగం చేసుకుంటున్నారు... తోడుగా వుంటుందని..."

"యింట్లోపనికి, వండి వార్చడానికి..."

లక్ష్మక్క యేదో సందిగ్ధంలో పడింది.... యేదో మాట అనడమూ మానడమూ?అని వూగిసలాడుతోంది. "అలా యెందుకనుకోవాలి... అమ్మ మెడలో నాలుగు పేటల చంద్రహారం వుందిగా."

అదీ అసలు దుగ్ధ. లక్ష్మక్కని వదిలెయ్యదల్చుకోలేదు.

"మరి దుర్గన్నయ్య చెప్పినట్టూ, అమ్మ పేర ఫిక్స్‌డ్ డిపాజిట్ కూడా వుందిగా?"

"అమ్మ చెప్పింది. ముగ్గురు కూతుళ్ళకీ సమానంగా పంచేస్తుందట ఫిక్స్‌డ్‌లో వున్న డబ్బు".

అమ్మ బతికుండగానే పంచేసుకుంటున్నారు. యేం ఆలోచనలో యేమో? ఈ అద్భుతమైన విషయ సేకరణ... బావగారి ఆగమనంతో మొదలయ్యింది అనుకుంటా? లక్ష్మక్కని జడిపించడం యెలాగో నాకు తెలుసు...

"సర్లే నువ్విలా అన్నావని దుర్గన్నయ్యతో చెప్తా నిజం తెల్సుకుంటాడు."

"నీకూ వాడికీ యిదో లంకె..."

"యే లంకె అయితేనేం.. దుర్గన్నయ్య నిజాలు వెలికి తీస్తాడు."

లక్ష్మక్క కాసేపు మౌనంగా వుంది, అది తాత్కాలికమే అని నాకు తెలుసు...

"స్నేహా నిన్ను మీ ఆయన కొడ్తాడే!"

యిలాంటి సబ్జెక్ట్‌లోకి వస్తుందనుకోలేదు. ఆశ్చర్యపోయాను. "యేమిటీ?" అన్నా అప్రయత్నంగా.

"నిన్ను మీ ఆయన కొడ్తాడా?"

నిజం చెప్పాలా? వద్దా? కొడ్తాడా? కాదా? అన్నది కాదు ముఖ్యం. మీ ఆయన సాడిస్టా? మోడస్టా? యేడస్టు? అన్న విషయ సేకరణ. ముసుగులు... తెరలు.. తనకి మధుకి మధ్య వున్న 'ఐరన్ కర్టెన్' యేమిటి? యేదో వుంది?.. అన్నీ సామాన్యంగా జరిగిపోతున్నాయి. తెల్లారి ఆరు గంటల సుప్రభాతం నుండి... రాత్రి మైధునం వరకూ.... అవసరాలు తీరుతున్నాయి. కానీ యెక్కడో యేదో లోపించింది. యేమిటది... మధుకి తను తెచ్చే జీతంతో ముడి... తన మనసంటే మడి... మధు యెవర్నైనా అభిమానించ గలడా?... జీవితం యాంత్రికం అయిపోయింది. దాంట్లో నలగడం స్వభావికం అయిపోయింది.

"బావ కొడ్తాడా?...." - ఛీ అడక్కోడదంటూనే... నోరు జారిపోయింది.

లక్ష్మక్క మౌనం....

అబద్ధం... నటన.... ఆ విషయం తప్ప.... మిగతా విషయాలు చెప్తోంది. పొల్లు కబుర్లు... వాటికి విలువ లేదు... నన్ను మభ్య పెడుతున్నాననుకుంటోంది.... సూటైన సమాధానం రావడం లేదు.

"నేను నా విషయం వాగుకుంటూ పోతున్నా... అసలు వింటున్నావా?" లక్ష్మక్క చిరాకు.

"విని చేసేదేముంది..."

"అదేమిటే అలా విడ్డూరంగా మాట్లాడతావ్"

"యిందులో విడ్డూరం యేముంది... నీ కష్టాలు నీవి... నా కష్టాలు నావి..."

"నువ్వూ, దుర్గా విచిత్రమైన మనుషులే... కష్టాలు చెప్పుకోడానికి కూడా... మనుషులు కరువయ్యారు..."లక్ష్మక్క నిస్పృహ...

అవును నిజం... కష్టాల్ని వినే మనుషులే కరువయ్యారు... కష్టాలు.. కష్టాలు కాకుండా పోయాయి. రోజువారీ సత్యాలై కూర్చున్నాయి.

ఈ ఆలోచనల్తోనే యింటికి చేరి, పొడిబట్టల్లోకి మారి... తల తుడుచు కుంటుండగా.. "అత్తా అత్తా యివేమిటో చెప్పు" అంటూ హడావిడిగా వచ్చి పిడికిలి విప్పి చూపించాడు సుధీర్... వాడి పిడికిట నిండా గురవింద గింజలు.

యేదో మాట్లాడాలి కదా అన్నట్టు "యిన్నెక్కడ దొరికాయి" అన్నా.

"శ్మశానం పక్క పొదల్లో యేరాను."

వాడి గుప్పెట్లో ఎర్రగా... చిన్న చిన్న నల్ల మచ్చల్తో వింతగా వున్నాయి. చచ్చిన మనుషులంతా గురివిందాలై వెలిసారా అనిపించింది... వాళ్ళలో లోపాలే నల్లటి మచ్చ!

"వాటికి నలుపు చుక్క పెట్టి దానందమంతా పాడుచేసాడు దేవుడు" లక్ష్మక్క కామెంటు.

"లేదత్తా నల్లటిమచ్చే వాటికి అందం... యెంత గొప్పరంగయినా, అతి పనికిరాదు."

సుధీర్ పెర్సెప్షన్‌కి ముచ్చటేసింది. నిజమే నల్లమచ్చ లోపం కాదు... సరికదా అందం కూడానేమో.

నా ఆలోచనల్లో నేనుండగానే... రాజా నెత్తుకు భారతక్క... వెనకే రామం యింటి కొచ్చారు.

రాజా మామూలుగా వున్నాడు.

రామంని చూడగానే పిన్ని, "రామం దుర్గున్నాడా అక్కడ...." అనడిగింది.

రామం దుర్గున్నాడో లేదో చెప్పలేదు.

"యేం ఎందుకు?" అంటూ ఎదురు ప్రశ్న వేసాడు.

"మీ చిన్నాన్న సిగరెట్ పేకట్ తేరా అని యాభై రూపాయలిచ్చారు పొద్దున్న..."

"వెధవ సంగతి తెలిసీ యెందుకిచ్చారు...." మధ్య గదిలో వున్నట్టుంది అమ్మ విసుక్కుంది.

"యాభై రూపాయలూ గోవిందా... గోవింద...." అన్నాడు రామం.

* * *

అలా యాభై రూపాయలూ పట్టుకెళ్ళిన దుర్గ... ఆ రోజు రాలేదు... మర్నాడు సపిండీకరణకి రాలేదు. దుర్గ లేకపోవడం వల్ల సపిండీకరణం పేలవంగా జరిగిందనుకుంటే పొరపాటు - దుర్గలేని లోటు ఆవు తీర్చింది. గోదానం చేస్తుండగా ఆవు పెద్దన్నయ్యని డొక్కలో పొడిచింది.

"వాడు చేస్తున్న పన్లకి కోపం వచ్చి అన్నయ్యే ఆవు చేత పొడిపించాడు" అన్నాడు చిన్నాన్న.

అది విని పెద్దన్నయ్యకి కోపం వచ్చింది. కానీ చిన్నన్నయ్య సర్దిచెప్పేసాడు. కానీ తను సర్ది చెప్పుకోలేని రోజు ముందున్నదని తెలుసుకోలేకపోయాడు.

సపిండీకరణం అయిన మర్నాడు... మైల తీరి... ఆశీర్వచనం కోసం పీటల మీద కూర్చునే సమయానికి వచ్చాడు. దుర్గ మంచి మందు మీదున్నాడు... తూలు తున్నాడు. రామం పెట్టె లోంచి తీసి కట్టుకున్న జీన్స్ ఫేంట్సూ.. షర్టూ బాగా నలిగివున్నాయి.

జోగారావు పెద్దన్నయ్యకి వాళ్ళ అత్తారు పెట్టిన బట్టలిప్పించాడు. అలాగే అందరికీ

వాళ్ళ అత్తార్లు పెట్టిన బట్టలు యిప్పించాడు. ఆశీర్వచనం చదివాడు. అందరం ఆశీర్వచనం వింటూ..."మీరూ మీ నాన్నగారి రుణం తీర్చుకున్నట్టే... మీ అమ్మగారి రుణం కూడా తీర్చుకోవాలి..." అంటూ సుద్దులు చెప్తున్నాడు.

పెద్దన్నయ్య - చిన్నన్నయ్య - రామం తలూపారు.

అప్పుడే దుర్గ పెద్దగా, "వొట్టినే తలూపడం కాదు... తల్లి నోర్తెరిచి... నల్లమందో... నిద్రమాత్రలో వేసి రుణం తీర్చేసుకుంటాం... అనాలి..." అన్నాడు.

"నిద్ర మాత్రలా!" అంది భారతక్క ఆశ్చర్యంగా.

"చిన్నన్నయ్యనే అడుగు....నాన్న పోయినప్పుడు నేనేం దగ్గరున్నానా?" అన్నాడు దుర్గ ముద్ద ముద్దగా. మధ్య గదిలో నిశ్శబ్దం.... అందరూ ఆశీర్వచనం కోసం పీటల మీద కూర్చున మూడు గుండ్లని, మూడు పిలకల్ని మార్చి మార్చి చూస్తున్నారు.

ముందుగా తేరుకున్నది చిన్నన్నయ్య "దుర్గా నోరు ముయ్యి" అన్నాడు.

"యిది నీ ఆశీర్వచనమా? బావుంది... అయినా నేనేమన్నానూ.. ముసలాయన మరీ అన్నేళ్ళు బతికేస్తే యెలా? పరలోకాలని గుర్తు చెయ్యద్దూ.. అవసరానికి మించి వో రెండు నిద్ర మాత్రలు యెక్కువేసాడు... కానీ కుదర్లే... మా బాబుది గట్టి పిండం... అయిదారు రోజుల్లో తేరుకున్నాడు... కానీ నిద్ర మాత్రల ధాటికి తట్టుకోలేకపోయాడు... నీర్సపడి మంచం యెక్కేసాడు... యింక తేరుకోలా... పైకి చేరుకున్నాడు."

దుర్గింకా యేదో చెప్తూనే వున్నాడు. చిన్నన్నయ్య ఆవేశంగా "తాగుబోతు లమ్డీకొడకా... నోటికి వచ్చినట్టు వాగావా, మెళ్ళిరగకొడ్తా..." అంటూ పీటల మీంచి లేచాడు.

దుర్గ బెదర్లేదు... గుమ్మం మీద కూర్చుని.. చిన్నన్నయ్యని మత్తుగా చూస్తున్నాడు.

"నువ్వూరుకో చిన్నా... ఆ మందు గొంతు దిగితే... తరతమ బేధం తెలీదు వాడికి... అలాగే వాగుతాడు" అంటూ అమ్మ సరిదిద్దబోయింది.

"వాగడమంటావేమిటీ? పక్కూరు కోమటి చెప్తే... మనూరు కోమటి చేత తెప్పిస్తే.. వూర్లో అందరికీ తెలిసిపోతుందని... పక్కూరు వాడిచేత తెప్పించాడు. వాడికి నా గుండూ, పిలకా చూసేటప్పటికి అర్థం అయింది. మాత్రలు బాగా పన్చేసాయని... 'యెవరు దుర్గా... మీ నాయనే కాలం చేసాడా?' అంటూ వొకటే పరామర్శ..."

దుర్గ మాట ముగియనే లేదు... చిన్నన్నయ్య దురుసుగా పీట దగ్గర్నించి కదిలి... దుర్గ దగ్గరికి వెళ్ళి బుర్రొంచి నాలుగు గుద్దులు గుద్దాడు... మళ్ళీ వచ్చి పీటల మీద కూర్చొన్నాడు.

దుర్గ గుమ్మం మీద కూర్చున్నవాడు నేల మీద పడి దొర్లుతూ నవ్వుతున్నాడు... చిన్న పిల్లాడిలా కేరింతలు కొడుతున్నాడు.

యెందుకా ఆనందం? నాన్న నిజంగా నిద్ర మాత్రల వల్ల కాలం చేసాడా? అందరూ

యేమనుకుంటున్నారు? చిన్నన్నయ్య కెందుకంత కోపం వచ్చింది? దుర్గని చూసినకొద్దీ చిన్నన్నయ్య కోపం పెరిగిపోతోంది. అది చూసి అమ్మ "వూరుకో చిన్నా... తాగుబోతోడి మాటల్తో మనకేంటి పని..'' అంది.

కానీ ఆ సందర్భంలో పట్టు సడలిపోతుందేమో, దుర్గింక యే విషయాలూ కక్కడేమో? అన్న శంకతో అత్త "అందుకే నిన్న కాకి పిడచ ముట్టలేదు... అన్నయ్య మనసులో యేదో బాధుంది'' అంది.

"యేం బాధుంటుంది పిల్లలిలా వొకళ్ళ నొకళ్ళు అనుకోడం కన్నా పిడచలా కలిసి కట్టుగా సఖ్యంగా వుండాలని ఆయన ఆశ... యిలా వెదజల్లిన మెతుకుల్లా వుంటే ఆయనకేం ఆనందం... అందుకే కాకి పిడచ ముట్టి వుండదు.'' అంటూ సర్దేయడానికి ప్రయత్నించాడు చిన్నాన్న.

అది నిజమా... మేమంతా కలిసుండడమే నాన్నకి కావాలా? అదీ పిడచలా కలిసుండాలా? అంతలా తపన పడేవాడా? నాన్న యెంత ఆరోగ్యంగా వుండేవాడు.... నాన్న బతికినన్నాళ్ళూ అందరం ఏదో ఇక్కడ మర్చిపోయాం అన్న తపనతో వచ్చేవాళ్ళం కుటుంబం పేరుతో మనుషుల్ని అన్నింటికి అతీతంగా కలిపివుంచుతోంది.

ఈ గిరులన్నీ మనమే గీసుకున్నాం... చెరిపేసుకోడం మన చేతుల్లోనే వుంది అనుకుంటే పొరపాటు... కొన్ని గిరులు అందమైనవి చెరిపేసుకు యేదో నవ్యత అంటూ ఫ్రాయిడూ... మార్క్సు...సాత్రే... వెనకబడి వెతుక్కుంటూ పోనవసరం లేదేమో? వారి వెంటబడిపోయి యేం సాధిస్తాం? యేం సాధించలేదా?.... సాధించాం... పిడికెడు వ్యక్తి స్వాతంత్ర్యం ... మెదడు మేరా కంఫ్యూషను... యిదెక్కడికి తీసుకెళుతుంది.

నా ఆలోచనల్లో నే వుండగా... యెదురుగా దృశ్యం చాలా దూరం పోయింది. దుర్గ యేమన్నాడో యేమో? చిన్నన్నయ్య దురుసుగా పీట మీంచి లేచి, "లంజా కొడకా నీ... బల్సింది. ఈ రోజు నీ కర్మ గూడా చేసేస్తాను....'' అంటూ దుర్గని కాళ్ళతో కుమ్మి గుండొంచి వీపు మీద గుద్దాడు... చిన్నన్నయ్య కోపం చూసి అందరికీ భయం వేసింది. దుర్గింత సినికల్‌గా యెందుకు తయారయాడో? లేనిపోని కబుర్లెందుకు తెస్తాడో? కొన్ని కబుర్లు తెలియకుండా వుంటేనే మంచిది!

చిన్నన్నయ్య ఆవేశం చూసి, ''చిన్నా వూర్కో....'' అంటూ చిన్నన్నయ్యని పట్టుకున్నాడు చిన్నాన్న.

"యేమిటి చిన్నాన్నా వూరుకునేది... వీడు వాగిందాన్ని బట్టి నాన్నకి నిద్రమాత్ర లేసి చంపేసినట్టుంది. అంతేగాని... నాలుగేళ్ళనుంచి నాన్నను కాసుకుంటూ చేసిన సేవకి విలువ లేకుండా పోయింది. చిన్న పిల్లాడికి చేసినట్టు చేసా... తండ్రి పోయాడని తెల్సి... అందరూ దిగిపోయారు. మనిషి బతికున్నప్పటికంటే... పోయాక కర్చుంటుందని తెలీదు గావల్ను!.. కాసులాకాశం నుండి రాల్తాయనుకుంటారు. నాన్న మంచం మీదుంటే పెద్దాడు

చూడ్డానికొచ్చి అంటాడూ! ఈ యేడాది సిస్తులో సగం నాన్న కర్చుల కింద సరిపెట్టుకోరా అని.... యెంత లెక్కో సగం సిస్తు అయిపోగానే నాన్నకి చేయించే వైద్యం ఆపెయ్యాలి... యెందుకంటే అది ఆయన ఆర్డరు. అంతేకాదు అసలు సిస్తన్నది వుంటెగా కర్చుల కింద సరిపెట్టుకోడానికి... వాడసలు అనుమానం. గడ్డమిమ్మెనా... మట్టమిమ్మెనా డబ్బొచేస్తుందని... వచ్చినప్పుడల్లా నన్నడగడు... వూర్లో కెళ్ళి అడుగుతాడు వ్యవసాయం గురించి, పంటల గురించి... ఇంక దుర్గ దగ్గరున్నదంతా తగలెట్టే దాకా నిద్రపోలేదు. యిప్పుడేమో నోరా తాటి పట్టా అన్నట్టు వాగుతాడు... మేమేదో రొమ్ము విరుచుకు తిరుగుతున్న తండ్రిని నిద్రమాత్రలేసి చంపేసినట్టు పుట్టించాడు. మొన్నటికి మొన్న మంచం యెక్కినవాడు.. పోతాడనుకున్నవాడు... తేరుకున్నాడు. యేం తేరుకున్నాడు... మనఃస్థిమితం లేదు... యేగదేదో తెలీదు.... వెళ్ళి వెళ్ళి నట్టింట్లో మూల కూర్చుని వుచ్చ పోసేసాడు. "అదేంటి నాన్నా" అంటే, "నిన్నిల్లెవడు మార్చమన్నాడు... మక్కలిరగదంతా" అంటూ మీదకొచ్చాడు. యిల్లెక్కడ మార్చాను! లేదే! ఆ రోజు దెబ్బలాటేసుకుని తెల్లవారే వర్కూ వీధరుగు మీద నన్ను, నా పెళ్ళాన్నీ... అమ్మనీ తిడ్తూ కూర్చున్నాడు. లోపలికి రమ్మంటే రాడు... పడుకోమంటే పడుకోడు. వొక రాత్రా, రోజా యిదే పద్ధతి... యే అర్ధరాత్రో లేచి వొకటే సణుగుడు... 'గాడ్దెకొడకా పడుకున్నావా? యిలా పడుకుంటే వ్యవసాయం యేం చేస్తావ్...' అంటూ తిట్లు.. అర్ధరాత్రి అమ్మని లేపి.. 'నువ్వు నాకు తిండి పెట్టావా దరిద్రం ముండా' అంటూ తిట్లూ.... అమ్మ మాత్రం యెంతని భరిస్తుంది.. ఆవిడ వయసేం తక్కువా.. యిప్పుడావిడా మంచం యెక్కితే చేసేదెవరు? పెద్దాడికా కాళీ వుండదు. భారతికి దాని సంసారంతో సరిపోతుంది. లక్ష్మిని వాళ్ళాయన పంపడు... దుర్గిలా తగలడ్డాడు... రామంది టెంపరరీ వుద్యోగం... స్నేహ వుద్యోగం చేసుకుంటోంది... సెలవు దొరకదు. యేమీ లేనివాడ్ని నేనే... యేదో రెండు చెక్కల్ని నమ్ముకుని, యింటిని అట్టిపెట్టుకున్నాను కదా... నేనే... చేయ్యాలి.. అప్పుడు డాక్టర్ని సలహా అడిగితే... రాత్రిపూట రెండు నిద్ర మాత్రలెయ్యమన్నాడు... రాసిచ్చాడు... అవి తెప్పించా...ఆ పాటికే వీడు... ఛీ యెందు కొచ్చిందీ బతుకు అనిపిస్తోంది..." చిన్నన్నయ్య గొంతు బొంగుతుపోయింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి... చిన్నాన్న చిన్నన్నయ్య భుజం చుట్టూ చెయ్యేసి సముదాయింపుగా.... దగ్గరగా తీసుకున్నాడు.

అన్నీ విన్న దుర్గన్నయ్య, "అదీ నిజమేరా..." అన్నాడు. పక్కకి తిరిగి యెముకల్లో తగిలిన బాధకి "వూ" అంటూ మూలిగేడు. అది విన్న చిన్నన్నయ్య నన్ను చూసి, "లోపలికి తీసుకెళ్ళు" అంటూ సైగ చేసాడు... అభిమానం వుందా? యెక్కడో బంధుత్వపు పేగు కలుక్కుమందా?

దుర్గ దగ్గరకెళ్ళి, "అన్నయ్యా" అంటూ భుజం చుట్టూ చెయ్యేసి లోపలికి తీసుకెళ్ళా....

ఆశీర్వచనం ముగిసింది.

పిడచ (రచన, జనవరి 2003)

# తంతు

'నువ్వు చెయ్యి' అంది సాహితి.

'ఏమిటే పెద్దా చిన్నా బేదం లేదూ' అంటూ కసిరింది లత.

నాకు సందర్భం తెలియకపోయినా సాహితి తుందుడుకుతనం తెల్సు, అందుకే అది ఎవర్ని ఏమందో అన్న కుతూహలం పెరిగింది. కానీ ఆ కుతూహలం ఎక్కువ సేపు నిలవలేదు.

"నా నిద్రలెప్పుడో అయిపోయాయి తల్లీ... పండంటి కొడుకుల్ని ముగ్గుర్ని కన్నా... రత్నంలాంటి కూతురుంది. నాతో నిద్రలు చేసినాయన పైకిపోయాడు కూడా..." అంది అమ్మ సాహితికి నాయనమ్మ...

అమ్మ అలా అనగానే... ఆ గదిలో ఆడాళ్ళందరూ ముసిముసిగా నవ్వుకున్నారు. "వూరుకోండి అత్తయ్యగారూ మీరు మరీనూ..." అంది లత ఈసారి గసర్లేక. అమ్మకి వయసు వచ్చినా... చిన్నపిల్లల దగ్గర చిన్నపిల్లలా పెద్దవాళ్ళ దగ్గర పెద్దరికం చూపిస్తూ ఆకట్టుకుంటుంది. తాతగారి సాహిత్యవాసన, నాన్నగారి హాస్యం అమ్మ మనసుకి పట్టేసాయి. అమ్మ కోరిక మీదే దీనికి సాహితీరాణి అని పేరుపెట్టా... పేరుకి తగ్గట్టు సాహిత్యానికి యెన్ని వెర్రిపోకడలున్నాయో సాహితికి కూడా అన్నీ వున్నాయి.

ఎన్ని వెర్రి పోకడ్లున్నా, బామ్మంటే అభిమానం వుంది. అసలు అమ్మగానీ పట్టుపట్టకపోతే దీని పెళ్ళి ఇంత తొందర్లో అయ్యేది కాదేమో?

సాహితి నా మాట వినదనికాదు గానీ, 'ఏంటి నాన్నా ఈ రోజుల్లో కూడా చాదస్తం, ఎప్పుడో అవుతుందిలే పెళ్ళి దాని కెందుకీ హడావిడి? ఇప్పుడేగా చదువయింది' అంది.

చదువుతున్నప్పటినుంచే సోమశేఖర్ దీని చుట్టూ తిరుగుతున్నాడు. దీనికి ఇరవైరెండేళ్ళు వచ్చేసాయి. అది దానికి ప్రోబ్లం కాకపోవచ్చు. కాని నాకు ప్రోబ్లమే! నన్ను చుట్టుప్రక్కల స్నేహితులు, బంధువులు, చెవిలో ఇల్లు కట్టుకు పోరుతున్నారు. ముఖ్యంగా లతని పొడుస్తున్నారు. కొందరు హాస్యం ఆడుతున్నారు కూడా. "మీ అమ్మాయికి ఎదురు కట్నం ఇచ్చి చేసుకుంటారోయ్. నీ కూతురు విప్లవం తీసుకొస్తుంది" అంటూ వ్యంగ్యానికి పోతున్నారు.

వాళ్ళకి ఈ సమాజం, సనాతనత్వం మీద అంత నమ్మకం! ఇవన్నీ అంతో ఇంతో ప్రభావం చూపుతున్నాయి నా మీద. అంతేకాక సాహితి అని కూతురికి పేరు పెట్టా కనుక అంతో ఇంతో చదివే అలవాటుంది దానికి. ఈ రోజుల్లో కథలు చదువుతుంటే పెళ్ళికి ముందు కాపరం మొదలెట్టిన ఆడపిల్లల గురించి ఎక్కువగా వుంది. అది కొంచెం పైత్యం అనిపిస్తుంది. ఆదర్శాలని పక్కకి పెట్టి అమ్మని అడ్డుపెట్టుకుని సాహితిని పెళ్ళికి

వొప్పించేసాను.

నా ఆలోచనల్లో నేనుండగా, అమ్మ లతని పట్టుకు జాడించేస్తోంది.

"మర్చిపోయానండీ" అంటూ లత సంజాయిషి చెప్తోంది.

"ఏమిటి?" అన్న ఎంక్వైరీకి,

"విఘ్నేశ్వరుడి బియ్యం మీదు కట్టలేదు" అంటూ దీనంగా నావేపు చూసింది.

ఇంకిలాంటిదేమేనా జరిగితే అమ్మూరుకుంటుందా? తొండందేవుడు వూరుకున్నా.

బామ్మ జాడింపు విని సాహితి "ఆనందమానందమాయెలే నా పెళ్ళి తప్పిపోయెలే" అంటూ చప్పట్లుకొడ్తూ గెంతింది.

"నీ పెళ్ళెందుకే తప్పిపోతుంది?" అంది అమ్మ.

"మరి తొండం బాబాయ్‌కి బియ్యం మీదు కట్టలేదుగా"

"అయితే పెళ్ళి తప్పిపోతుందా?"

"మరి నువ్వేగా అంటున్నావ్"

"పెళ్ళి తప్పిపోదు విఘ్నం జరుగుతుంది"

"విఘ్నం జరుగుతుందని తెలిసీ పెళ్ళాడ్డం ఎందుకు?"

"పెళ్ళి పెళ్ళే, విఘ్నం విఘ్నమే"

"అలాగైతే అమ్మని తిట్టడం దేనికి?"

"సాహీ అది నీకమ్మ, నాక్కోడల్లు. దాన్నే అనాలి".

"కోడలైతే అనాలన్న రూలు నీకుందేమో గానీ, కోడలైనంత మాత్రాన మాట పడాలన్న రూలు మా అమ్మకి లేదు."

"మీ అమ్మేం పరగణాలు పట్టుకొచ్చెయ్యలేదు. మాట పడకుండా వుండడానికి"

"పరగణా అంటే?"

ఆ మాటతో అందరూ నవ్వారు. కానీ లత అన్నయ్య నా బావమరిది మాత్రం నవ్వలేదు.

"పరగణా పట్టుకొస్తే ఏం మాటలన్నా మీరు పడ్తారా అత్తగారూ?" అన్నాడు ఆయన.

"పరగణా గౌరవమేనా వుంటుంది కదోయ్ అందుకు భరిస్తాం..."

"మరి మీరెన్ని పరగణాలు పట్టుకొచ్చారో?" అంటూ శ్లేషకి పోయాడు.

"నేను పరగణాలు పట్టుకు వచ్చే కాలంలో దాన్ని కాదు. పరగణాలు ఇస్తేగాని రాని కాలంలో దాన్ని... అప్పటికి నువ్వు గుడ్డు తెరవలా" అంటూ అడ్డు కొట్టేసింది అమ్మ.

బావమరిదికి ఇంకేం మాట్లాడాలో అర్థం కాలేదు.

అమ్మ విఘ్నేశ్వరుడి బియ్యం మీదు కట్టించడానికి వెళ్ళాక "అత్తగారితో మాట్లాడ్డం చాలా కష్టమే" అన్నాడు.

"బామ్మతో మాట్లాడమనెవరు చెప్పారు మావయ్యా, అంతా వాదనే..."

"సాహీ! పసుపుతో నలుగు పెట్టించుకుని కుంకుడుకాయతో తలంటుకుంటావే..." అన్నాడాయన సాహితితో నవ్వుతూ.

"తప్పేటట్టు లేదు మామయ్యా, షాంపూలు నిషిద్ధం లాగుంది. బామ్మ నాచేత మాట పుచ్చేసుకుంది. ఈ నాలుగు రోజులు ఆవిడిష్టం...'

"ఏం షాంపుతో రుద్దుకుంటే మీ ఆయన చేసుకోనన్నాడేమిటే?"

"వాడా! వాడెందుకు చేసుకోడు, వాడిముక్కుకి, షాంపూవాసనైనా వొకటే, షికాకాయ్ వాసనైనా వొకటే..."

"ఎవర్నే వాడంటున్నావ్..." అంటూ వచ్చింది అమ్మ.

"ఇంకెవర్ని కాబోయే హబ్బీని..."

"సోమునేనా" అంది అమ్మ.

"ఏం నా హబ్బీని సోము అంటున్నావ్... మంచిది కాదు.. సోంశేఖర్‌గారు అను" అంది సాహితి కోపం నటిస్తూ.

"లెండి లెండి టైమైంది" అంటూ లేపేసింది అక్క. ఈవిడ ఈ ఇంటికి ఆడబడుచు. నా మీద, లతమీద అత్యాచారం చెయ్యగల హక్కు ఆవిడకే వుంది అన్న నమ్మకంతో ఇంతవరకూ జీవిస్తోంది. అది మాటిమాటికి మాకు గుర్తు చేస్తూ వుంటుంది. అందరూ బయట కెళ్లారు. సాహితి పీటమీద కూర్చున్నాక లత, సాహితి పాపిడి బొట్టులో నూనె పెట్టింది.

"అత్తయ్యా రండి" అంటూ పిలిచింది.

"నేనెందుకులే మీరు పెట్టండి" అంది అమ్మ పక్కకి తప్పుకుంటూ.

"అలా కాదు రండి అత్తయ్యా" అంటూ పిలిచి పక్కకి తప్పుకుంది లత.

అమ్మ బాత్రూములోకి వెళ్ళి సాహితి తలమీద నూనె పెట్టింది. సాహితి అప్రయత్నంగా అమ్మ కాళ్ళకి నమస్కారం చేసింది. నాయనమ్మ అంటే అంత గౌరవం. ఆ విషయం అమ్మకే కాదు అందరికీ తెలుసు!

మంగళస్నానం అయి బైటకి వచ్చేసరికి గంటపైనే పట్టింది. సాహితిని, దాంతో పాటు తుషార్ కూతురుకి కొత్తబట్టలు కట్టి రెండు పీటలమీద కూర్చోబెట్టి అందరూ అక్షింతలేసి, హారతిచ్చారు. సాహితిని పెళ్ళి కూతుర్ని చేసేసారు.

"మగపెళ్ళి వారింటి నుంచి ఎవరూ రాలేదా?'' అంది అమ్మ

"సోము వాళ్ళక్క వచ్చింది'' అంటూ సోము అనబడే పెళ్ళికొడుకు అక్క శ్రావణిని తీసుకొచ్చింది లత.

"శ్రావణీ ఇంతాలస్యంగా వచ్చావేమిటి?'' అంటూ నిల్దీసింది అమ్మ.

"అసలెందుకు రావాలి బామ్మగారూ... మీరు పెద్దరికం వహించి ఆడబొడుచు కట్నం లేకుండా గండి కొట్టేసారు'' అంది శ్రావణి.

"లాంఛనాలన్నీ బాగానే పుచ్చుకుంటున్నారుకదే... మళ్ళీ ఆడబొడుచు కట్నం అంటూ మావాడ్ని దోచేస్తారా ఏమిటి?''

"దోచెయ్యడానికి మేమేమయినా దొంగలమా బామ్మగారూ'' శ్రావణి టెక్కు పోయింది.

"దోచడానికి దొంగలే అక్కరలేదే, ఏడు కొండలవాడు దోచుకోడంలే నిలువు దోపిడీలు''

"మీరిచ్చిన ఇరవైవేలల్లో ఇద్దరు అక్కచెల్లెళ్ళు, అమ్మ ముగ్గురం పంచుకోవాలి''

"మీరెంతమంది వుంటే అంత మందికి సరిపోయేట్లు ఇవ్వడానికి... వాడికి మాత్రం కుదరద్దూ...మేమేం లక్షాధికార్లమా?''

పెళ్లి పేరిట జరిగేది సంప్రదాయపు దోపిడి లేదా మోసం లేదా రెండూ కావచ్చు. ఎవరు నిస్సిగ్గుగా వుండగలుగుతారో వారిదే పైచేయి.

దాంతో శ్రావణి ఏదో గొణుక్కుని ఊరుకుంది. ఇంతలో రాములొచ్చాడు. పందిరి రాట పాతే హడావిడి మొదలైంది. అందరూ బైటికి వెళ్ళారు.

అదే అదనుగా "ఏరా సృజన రాలేదేం? ఇవాల్టికి వస్తానంది కదా?'' అంటూ ఆరా తీసింది అమ్మ.

"ఫోను చేసా. ఏదో పనిలో వున్నా రేపటికి వస్తానంది'' అన్నా.

"పిలుపు సరిపోలేదేమో?''

"పిలుపు సరిపోవాలంటే ఏం చెయ్యాలే? నేను, లత అల్లుడి ఇంటికెళ్ళాం పిలిచాం, ఇంతకన్నా ఎలా పిలవాలో నువ్వు చెప్పు'' అన్నా చిరాకుగా.

"చిరాకుల్తో పని జరగదురా అబ్బాయ్''

"నాన్నా నేనెళ్ళి తీసుకురానా?'' అన్నాడు తుషార్.

"మరిక్కడ పన్లెవరు చేస్తారు'' అన్నా బెట్టు తగ్గకుండా.

"పన్లకేం పర్వాలేదు అవే జరుగుతాయి. రాములొచ్చాడుగా వాడు చూసుకుంటాడు. నువ్వెళ్ళరా! ఇంటికి పెద్దది... అది లేకపోతే ఇల్లు చిన్నపోతుంది. అదక్కడా తక్కువ పడుతుంది'' అంది అమ్మ.

"టాక్సీ చేయించుకు వెళ్ళి సాయంకాలానికి వచ్చేయ్…" అన్నా మెత్తబడి.

నిజమే సృజన నా పెద్దకూతురు. అది లేకపోతే ఇంటికి నిండుదనం రాదేమో. సృజన సాహితిలా చలాకీకాదు. పెద్దదన్న మాటేకానీ చాలా కట్టుదిట్టాల్లో పెరిగింది. లతకి నాకూ ఎన్నో పనుల్లో సాయపడేది. తుషార్‌కి పాఠాలు చెప్పేది. పెళ్ళయి నాలుగేళ్ళయింది. సృజనకి తగ్గట్టే రవి ముభావి, ఎప్పుడూ గంభీరంగా వుంటాడు. నేను లతా వాళ్ళింటికెళ్ళి పిలిచినప్పుడు అతనింట్లో లేడు. అందుకే పిలుపు చాలదేమో అన్న అనుమానం. పిలుపు చాలడం అంటే ఏమిటి? ఎలా పిలిస్తే సరిపోతుంది?

రవికి ఏవో ఆశలుండి వుంటాయి. బెట్టు చేస్తే అవి తీరే మార్గం సుగమం అవుతుంది. ఏదీ పైకి చెప్పడు. మోకాలి మీద సెగ్గెడ్డ రకం.... ఎన్నాళ్ళదాకా ఈ అల్లుడి వ్యవహారం?

నా ఆలోచనలో నే వుండగా సాహితిని తీసుకొచ్చారు.

సాహితి పెళ్ళి కూతురయింది....అందరూ అక్షింతలు వేసారు. గద్వాల్ పట్టుచీరలో, నిండుగా వుంది. సృజన వస్తే బావుడ్ను అనిపించింది. మధ్యాహ్నం భోజనాలు అయ్యాయి అనిపించి... కాస్త కునుక్కి వాలా... అంతలోనే హడావిడి.

"అక్కొచ్చింది" అన్న సాహితి అరుపుకి తెలివొచ్చేసింది.

సృజన, దాని రెండేళ్ళ కొడుకూ టాక్సీ దిగుతున్నారు. లత ఎదురెళ్ళి పిల్లాడ్ని అందుకుని ముద్దుపెట్టుకుంటోంది. సృజన చిన్న సూటుకేసుతో దిగింది. తుషార్ టాక్సీ వాడికి డబ్బులిచ్చాడు.

"పొద్దున్నే వస్తావనుకున్నానే…" అంది లత.

"ఆయనకి క్యాంపుందమ్మా, అందుకే రాలేదు రేపొద్దామనుకున్నా. ఈ లోగా తుషార్ వచ్చేసాడు."

"హిపోక్రసి". కొన్ని వొప్పుకో బుద్దెయదు. రేపుకూడా వచ్చి వుండేదికాదు. ఇంతకీ అల్లుడుగారు…

"రవి రాలేదా?" అన్నా. రాడని తెల్సు… కానీ విషయం రాబట్టాలని.

"వస్తారు. క్యాంపునించి వచ్చి, పెళ్ళినాటికి వస్తారు" అంది సృజన.

జీవితం ముడిపడిపోయింది. యెవరి ఇష్టాయిష్టాలకీ విలువలేదు. అందుకే ముసుగు.

"పులిహోర తింటావేమిటే?" అంది లత.

"అలాగే"

సృజనతో కల్సి అందరూ సాహితి గదిలో సమావేశం అయ్యారు. పెళ్ళిచీరలు,

నగలు, పెట్టుబడ్లు అన్నీ చూసుకుంటే ఫర్వాలేదు. పోల్చి చూసుకుంటారు. అక్కడే చిక్కులొస్తాయి. చిక్కులొచ్చాక విడగొట్టడం అసాధ్యంకాదు. కానీ కష్టం.

"సృజనా పెళ్ళికొడుక్కి చేయించిన ఉంగరం చూడే ప్రత్యేకంగా వుంది'' అంది అక్క. అక్కకి దాదాపు యాభైఅయిదేళ్ళూ వుంటాయి. సృజన పెళ్ళయేదాకా "నేనీ యింటి ఆడబొడుచునిరా!'' అంటూ అటు అమ్మని ఇటు నన్నూ నిలబడ్నివ్వలేదు.

పుట్టింటి హక్కులకోసం పోరాటం అది చేస్తే... మేం అలసిపోయేవాళ్ళం.

"ఏం ఉంగరమత్తా'' అంది సృజన.

ఇంతవరకూ దాని ఊసెత్తని లత గతుక్కుమంది. ఆ విషయం ఆడబడుచుకి 'ఎలా తెలిసిందా?' అని ఆశ్చర్యపోయింది.

సృజనది ఎరేంజ్డ్ మేరేజి. సృజన భర్త రవి తల్లిదండ్రులు కంసర్వేటివ్ అంటే సంప్రదాయికులు. కట్నం గీసిగీసి బేరమాడేరు. సృజన పెళ్ళికని వెనకేసిన డబ్బు గురించి వాళ్ళకి ముందే తెలిసుంటుంది. కట్నం గురించి జరిగిన బేరసారాల్లో రెండుమూడు నెలలు గడిపారు. మేము ఆశ వదిలేసుకున్నాం. అప్పుడు ఏదో మా మీద జాలి తలచి పెళ్ళి కొప్పుకున్నట్టు వప్పేసుకున్నారు.

తెలుగునాట పెళ్ళిళ్ళకి, లక్ష్మీదేవి గజగజలాడుతుంది ఎవరింట్లో వుండాలో, ఎవరింటికి వెళ్ళాలో తెలియక? పెళ్ళి ముచ్చటా మురిపెం, రాబడి రభస దిశగా పోతాయి. ఇన్ని బేరాలాడి వొప్పుకున్న మగ పెళ్ళివారు కూడా... సృజన పెళ్ళిలో ఎంత గోల చేసారని! ముఖ్యంగా అలకపాన్పు రోజున ఎంత రాజకీయం నడిచింది.

అలకపాన్పు అంటూ హడావిడి చేసారు. విడిదిలో ఒక చాపవేసి కొత్తదుప్పటి తెమ్మన్నారు.

"అలకపాన్పు వుండదు. అనుకున్నాం కదండీ'' అంది అమ్మ.

"ముచ్చట్లు లేకపోతే పెళ్ళెందుకండీ! మా వాడు మళ్ళీమళ్ళీ పెళ్ళాడతాడా ఏమిటి?'' అంటూ అమ్మ మాటని, లత మాటని కొట్టేసింది రవి పెద్దక్కగారు.

"ఇదేమిటండీ అలకపాన్పు వద్దనుకున్నాం కదా. స్కూటరిస్తానన్నా కదా'' అన్నా వియ్యంకుడితో.

ఆయన నవ్వుతూ, "ఆఁ పిల్లలు ఏదో ముచ్చట పడ్తున్నారు... ముచ్చటకే కదా వాళ్ళని వొదిలేయ్యండి'' అని సమాధానం ఇచ్చాడు.

దుప్పటి కోసం ఇంటికొచ్చిన రవి అక్కగారికి పాత దుప్పటి ఇవ్వబోయింది లత.

"ఒకసారి చేసే ముచ్చటకి పాతదుప్పటి యేంటండీ, కొత్త దుప్పటి ఇవ్వండి'' అంది ఆవిడ.

"కొత్త దుప్పట్లు లేవండి'' అంది లత.

"పాత దుప్పటి అరిష్టం మంచిది కాదు. కొత్త నూలుపోగే వుండాలి. ఓ రౌండొందలు పెడ్తే దుప్పటి. అబ్బాయున్నాడుగా తెప్పించండి'' అంది.

"ముచ్చట మీదయినప్పుడు దుప్పటి మీరే తెప్పించుకోవచ్చుగా'' అంది అమ్మ.

ఇంకో పరిస్థితిలో అయితే రవి అక్క అంతకన్నా పొగరుగా సమాధానం చెప్పేదేమో?

"ముచ్చట కాబట్టే సంప్రదాయకంగా మిమ్మల్ని దుప్పటి ఇచ్చుకోమంటున్నాం బామ్మగారూ. కావాలంటే దుప్పటి ఖరీదు ఇంకో దాంట్లో విరగ్గోసుకోండి. అయినా మీ ఇంటి అల్లుడికి రౌండొందలు పెట్టి ముచ్చట జరిపించలేరా?'' అంటూ నవ్వేసింది.

ఈ తర్కం, ఇందులో వుండే నాజూకుతనం ఎదుర్కోలేం! అప్పటి కప్పుడు తుషార్ని పంపి దుప్పటి తెప్పించింది లత.

ముచ్చట మొదలైంది... విడిదిలో పెళ్ళి కొడుకు కొత్త దుప్పటి మీద కూర్చొని అలిగాడు.

"అలక తీర్చండి అత్తగారూ'' అంటూ లతని, నన్నూ తీసుకెళ్ళింది రవి పెద్దక్కగారు.

అందరూ అతని చుట్టూ సమావేశమయ్యాం. బలవంతంగా అలుగుతున్న అల్లుడ్ని చూసి జాలేసింది నాకు, కానీ అప్పుడర్థం అవలా! కాసేపటికి నన్ను చూసి మిగతావాళ్ళు జాలిపడ్తారని.

అందరూ మౌనంగా వుండటం భరించలేక... "ఏం కావాలో చెప్పి తొందరగా అలక ముగించరా'' అంది వియ్యపురాలు రవి అమ్మ.

"బావుంది వాడే అలిగి... వాడే చెప్పి అలకముగిస్తాడా? మావగారు వాడి మనసు సంతోషపెట్టి అలక మాన్పించాలి గాని'' మగపెళ్ళివారి తరుపునించి వచ్చినావిడ అంది.

"బతిమాలండి అన్నయ్యగారు... మీరు కలుగచేసుకుంటేగాని... మావాడు అలక మానేటట్టులేదు... అప్పుడే మావగారి పక్షం అయేడు...'' అంది వియ్యపురాలు నవ్వుతూ.

మగపెళ్ళి తరపువాళ్ళు నవ్వుతూ తుళ్ళుతూ హాస్యాలాడుకుంటున్నారు. ఆ హాస్యంలో నన్నూ కలుపుకున్నారు. నాకు అపహాస్యం చేస్తున్నట్టుగా అనిపించింది. మేం ఇందులో భాగస్వాములం కాదేమో? అనిపించింది. అయినా అక్కడ బలవంతంగా కూర్చోక తప్పలేదు. నా మౌనం చాలామందికి నచ్చలేదు. హాస్యం పాలు మించింది.

"ఏదో వొకటి తేల్చేయండి అన్నయ్యగారూ, వాడలా ఎంతసేపని కూర్చుంటాడూ'' అంటూ దీర్ఘం తీసింది వియ్యపురాలు.

"ఇంకాసేపు కూర్చున్నాడంటే ఆ నడ్డి కాస్తా పట్టేస్తుంది. రేపు అసలైన కార్యక్రమం వుంది'' అన్నాడు ఎవరో దూరపు బంధువు. అందరూ నవ్వారు.

"చెప్పండి మావయ్యగారూ మా తమ్ముడు ఎంతసేపు కూర్చుంటాడూ'' అంటూ చిరాకు పడింది రవి పెద్దక్క. ఇంక తెగించక తప్పదు. పెళ్లయిపోయింది. ఏం జరిగితే అది జరుగుతుంది. కాస్త మనసు కష్టపెట్టుకుంటారు, అంతే అని...

"ఏం చెప్పను? అలకపాన్పు వద్దనుకున్నాం కదా. స్కూటరు ఇస్తానన్నాను కదా'' అన్నా.

"అది మీరు అల్లుడుకి ఇస్తానన్న వొప్పందం. అదిందులో కలిపితే ఎలా? ఈ ముచ్చట జరగాల్సిందే... మీరేదోకటి ఇవ్వాల్సిందే'' వియ్యపురాలి ధాటీ.

"బావగార్నడగండి. ఈ విషయంలో నేనింతకన్నా ఏం ఇచ్చుకోలేను'' అన్నా.

"బావుంది. ఇంతసేపూ కూర్చున్నది... నడ్డినొప్పికా...'' అంది వియ్యపురాలు.

"అదేంటి మావయ్యగారూ అలకపాన్పు మీద కూర్చున్నందుకేనా... ఏదో ఒక అయిటం ఇవ్వండి. మరీ లక్షలు అరలక్షలూ అడగట్లేదు కదా. అలాగని అయిదంకెలకి తక్కువ చెయ్యకండి. బావుండదు. ఆ తర్వాత మీ ఇష్టం... మీ అల్లుడిష్టం..'' అంది రవి పెద్దక్కగారు.

అందులో హాస్యం ఏముందో, అందరూ నవ్వారు.

కానీ వాళ్ళందరూ కలిసి అపహాస్యం చేస్తున్నారా? అనిపించింది. వాళ్ళు బాగా ప్లాను చేసుకుని, నన్ను ఇరకాటంలో పెట్టారు.

అలా కూర్చోడం నాకూ చిరాగ్గానే వుంది... లత అయితే యిబ్బంది పడిపోతోంది. వాళ్ళు నాతో మాట్లాడుతున్నప్పుడల్లా పెళ్ళి కొడుకు అక్క మాత్రం లతతో 'మీరైనా చెప్పండి అత్తయ్యగారూ' అంటూ లతని ఎగదోసేది. కానీ లతకి తెలుసు కట్నం విషయంలో, లాంఛనాల దగ్గర వాళ్ళు ఎంత బేరాలాడి వసూలు చేసారో. ఇప్పుడిలా ఇరకాటంలో పెడతారనుకోలేదు. వాళ్ళ తెలివితేటలకి ఆశ్చర్యపోతోంది. ఏం చెయ్యలేని పరిస్థితిలో వున్న నన్ను చూసి జాలిపడుతోందేమో కూడా.

"ఏంటి మావయ్యగారూ వయసులో వున్నాడు పెళ్ళి కొడుకు, వాడు అలక నుండి లేవలేదు అంటే యేదో చిన్నవాడు అనుకోవచ్చు... పెద్దవారైయుండీ మీరూ మొండికేస్తే ఎలా? యేదో వొకటి తేల్చేయండి... ఫ్రిజ్జో, టివియో, హోంథియేటరో ఏదో ఇస్తానని చెప్పేయండి వాడు లేచిపోతాడు... సరి'' అంటూ నన్ను మొండివాడ్ని చేసిన పెళ్ళి కొడుకు పెద్దక్కగార్ని.. ఆశ్చర్యంతో చూడ్డం మినహా యేం చెయ్యలేకపోయాను.

మాటాపలుకూ లేని నన్ను చూసి, ఆవిడే నా తరుపుగా ఇరవై తొమ్మిదించీల ఫ్లాట్ స్క్రీన్ కలర్ టెలివిజన్ వప్పేసుకుంది. తమ్ముడ్ని లేపేసింది. దుప్పటి మడత పెట్టుకు పోయింది.

అలా ముగిసింది రవి అలక ముచ్చట.

రవి అలక మాత్రం ముగియలేదు. సృజన్ని ఇప్పటికీ దెప్పుతూనే వుంటాడు.

* * *

అన్ని పెళ్ళిళ్ళూ, అలాగే జరుగుతాయా? సాహితిని పెళ్ళాడ్డాని కొచ్చిన 'సోం' అనే సోమశేఖర్ గాని, వాళ్ళ అక్కలుగానీ అలా చెయ్యలేదు. స్నాతకం అయిపోగానే, తల్లిదండ్రుల హయాం నుంచి సోంని వాళ్ళ అక్కలు పుచ్చుకున్నారు. వాళ్ళ వెనక్కి తగ్గేసరికి కుర్ర జట్టంతా కలిసి 'సోంని' "హారేయ్ కాశీకెళ్ళకురా సాహితి బెంగెట్టుకుంటుంది" అన్నారు. "కాశీ కెళ్ళనుగానీ వెళ్ళినట్టు నటించకపోతే ఎంబాసిడర్ షూస్, బట్టలు, బెల్లంముక్కా, గొడుగూ ఇవ్వరేమోనర్రా" అన్నాడు సోం.

"పెళ్ళిలో ఇస్తారనే కామోసు రెండేళ్ళ నుండి అవే బూట్లు వాడుతున్నాడు" అంది సోం అక్క శ్రావణి.

ఈ హాస్యాల మధ్యే పురోహితుడు తొందర చేస్తే కాశీ యాత్రకి బయలుదేరాడు... సోమశేఖరం గారు.. పాంకోళ్ళతో నడవడం రాక కాలు మెలితిపడి ముందుకి పడ్డాడు. వాళ్ళక్క పట్టుకుంది. ఆ పట్టుకోడంలో వెనక పంచెకట్టు కాస్తా వూడింది. కానీ యాత్ర చూద్దామని వచ్చిన ఆడపెళ్ళివారి ఆడపిల్లలు అక్కడ్నించి విడిదిలోకి పారిపోయారు. శ్రావణి "ఫర్వాలేదు, రండర్రా లోపల వేసుకున్నాడ్లే" అంటూ నిజం చెప్పేసింది.

అప్పుడు పురోహితుడు తీవ్రంగా సోంగాడ్ని పంచె వలిచేస్తున్నట్లు చూసాడు. ఆయనకి ఇలాంటివేమీ నచ్చవు. తుండుగుడ్డా, కండువా, రకం.

విడిది మెట్లు దిగి వీధిలోకొచ్చాడు సోమశేఖర్‌గారు. తుషార్ ఎదురొచ్చాడు.

సోం గెడ్డం కింద బెల్లం ముక్క పెట్టి

"ఓ బ్రహ్మచారిగారూ మీ కాశీప్రయాణం విరమించుకోండి..."

"నేవెళ్లను లేరా బాధపడకు" సోంశేఖర్...

పురోహితుడు గుర్రుగా చూసాడు సోంశేఖర్ వైపు....

"మా సోదర్ని ఇచ్చి వివాహం చేస్తాం గృహస్థాశ్రమాన్ని స్వీకరించండి"

"ఈ రోజుల్లోనూ గృహస్థాశ్రమమేనా, గృహస్థు అపార్టుమెంటును స్వీకరించండి అనాలి. కొంపతీసి మావగారు అపార్టుమెంటు ఇవ్వడంలేదా యేం?"

"అయ్యా బట్టలు, పెళ్లికొడుక్కి బట్టలివ్వండి" అన్నాడు పురోహితుడు

తుషార్ నవ్వుతూ బట్టలిచ్చేసాడు.

సోమశేఖర్‌తో పురోహితుడు "మీరు" అన్నాడు.

"తేవడం మర్చిపోయామండి. తర్వాత ఇస్తాంలేరా" అన్నాడు సోంశేఖర్ నవ్వుతూ వెనక్కి తిరిగిపోవడానికి సిద్ధపడుతూ.

అపుడు సోంశేఖర్ అక్క నవ్వుతూ బట్టలు తీసి "ఒరేయి వేళాకోళం చాలు గానీ బట్టలియ్యి" అంది

బట్టలిచ్చాడు సోంశేఖర్ నవ్వుతూ

అవి రేమండ్ సూట్స్. వాటి ముందు తామిచ్చిన మామూలు ప్యాంట్ షర్టు పీస్‌లు వెలవెల బోతున్నాయి, అనుకున్నాడు తుషార్.

తుషార్ అంటే సోంశేఖర్‌కి అభిమానం. ఇద్దరూ ఫ్రెండ్స్. తుషార్ వల్లే సాహితితో పరిచయం అయింది.

ఇరు కుటుంబాలు చాలా దగ్గరయ్యాయి. ఆ అభిమానాన్ని బావమరిది మీద సోంశేఖర్ ఇలా చూపించాడు.

మగపెళ్ళి వారైయుండీ అభిమానం చూపించడం, తుషార్‌ని కదిలించింది.

అదే విషయం తుషార్ కుందనతో చెప్తుంటే విన్నా.. కుందన మూతి విరవడం నాకు కనిపించకపోలేదు. ఎందుకంటే తుషార్ పెళ్లిలో జరిగిన రభసే దానికి కారణం.

తుషార్ పెళ్లికి ఇద్దరు ఆడపడుచులకి చెరి పదివేలు ఇస్తామని ఒప్పేసుకున్నాడు తుషార్ మావగారు కుందన తండ్రి. పెళ్ళి నాటి వరకూ "ఇదిగో ఇదిగో" అంటూ దాటేసాడు.

పెళ్లినాడు పొద్దున్నే లత మధ్యవర్తితో కబురు పెట్టింది. ఆయన పరిగెత్తుకుంటూ విడిదికొచ్చాడు. "ఏమండి అన్నయ్యగారు మీరే ఒప్పుకున్నారు. ఆడపడుచులిద్దరికి చెరి పదివేలు, అత్తగారికి ఐదు వేలు కట్నం అంటూ ఇవ్వరా" అంది నవ్వుతూ.

"అబ్బే ఎందుకివ్వనండీ భలేవారే... ఆడపడుచు అర్ధమొగుడు అన్నారు. మీకు తక్కువ చేస్తానా?" అంటూ వినయం ఒలకబోసాడు.

ఆ వినయంలో ధూర్తలక్షణం ఏదేనా ఉందా? అన్న అనుమానం వచ్చినా చేసేదేం లేదు కదా అని ఊరుకున్నాం. లత నవ్వుతూ "అయితే ఇవ్వండి. ఎలాగు హైదరాబాద్ వచ్చాంకదా అన్నయ్య పేరు మీద మంచిముత్యాలు కొనుక్కుంటాం అంటున్నారు. అక్కాచెల్లెళ్ళు ఇద్దరూ..." అంది.

"ఇవ్వడానికేం అభ్యంతరం లేదండి.. వాళ్ళకోసం ఆ రొక్కం వేరే పెట్టాను కూడా... ఇవాళ శుక్రవారం... కొంచెం ఆగితే... రేపు ఇచ్చేస్తాను. రేపెళ్ళి కొనుక్కు రావచ్చు. మాకు తెల్సిన షాపుంది. అక్కడ్నించి తెచ్చుకుంటే చవక" అన్నారాయన నసుగుతూ.

అంతకుమించి ఎక్కువ వొత్తిడి తేవడం సభ్యత అనిపించుకోదేమో అని ఊరుకుంది లత. నేనూ అదే అన్నా "ఎవరి పట్టింపులు వారివి... సర్లే ఇవాళకి రేపటికి పోయిందేం లేదు".

ఆ రోజు రాత్రి పెళ్ళి జరిగిపోయింది.

మర్నాడు శనివారం రాత్రంతా పెళ్ళిలో తిరిగి అలసిపోయిన వాళ్ళంతా మధ్యాహ్నం భోజనాల వరకూ నిద్రపోయారు.

మర్నాడు సాయంకాలం సాహితి, సృజన ఇద్దరూ తయారై, మంచి ముత్యాల షాపు కెళ్తూ, “వాళ్ల తరపు నుండి ఎవరినైనా పంపిస్తే బావుండును తేలిగ్గా వెతుక్కోకుండా... తిరిగి రావచ్చు పదండి'' అన్నారు.

వీళ్ల హడావుడి చూసి, నేను వియ్యంకుడికి కబురు పెట్టాను. కబురు పెట్టిన చాలాసేపటి వరకూ ఎదురుచూసాను.

అతను రాలేదు.

నిన్నటి వరకూ మేం ఇక్కడ ఏదనుకుంటే అది తెలుసుకు సమకూర్చిన ఆయన, పిలిస్తే పరుగు పరుగునా వచ్చిన ఆయన... ఎందుకిలా చేసాడో అర్థం కాలేదు.

సాహితి, సృజన తొందర చూసి నేనే ఆడపెళ్ళివారింటికి వెళ్ళాను. ఆయన పందిర్లో కూర్చుని ఫలహారం చేస్తూ ఎవరో బంధువులతో మాట్లాడుతున్నాడు.

నన్ను చూసి 'రండి రండి' అంటూ పిలిచి పక్క కుర్చీలో కూర్చోపెట్టాడు. మళ్ళీ వాళ్ళతో మాటల్లో పడిపోయాడు. పావు గంటవరకూ ఎందుకొచ్చారని అడుగుతాడనుకున్నా కానీ ఆ వూసేలేదు. అలాగని వాళ్ళు సీరియస్ విషయాలు మాట్లాడుకుంటున్నారా, అదీలేదు. ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. నేను రెండు సార్లు దగ్గాను. అయినా అతను అది లెక్క చెయ్యలేదు. ఇంక లాభంలేదని అతన్ని పక్కకి తీసుకెళ్ళి విషయం చెప్పాను.

అతను భారంగా “బావగారూ డబ్బు అవసరమై ఆ మొత్తాన్ని ఇంకో దానికి వాడేసానండి, రేపటిలోగా సర్దుతాను ఏమనుకోకండి'' అన్నాడు.

నిన్నటి వరకూ శుక్రవారం అంటూ దాటేసినాయన ఇవాళ డబ్బే లేదంటున్నాడు. ఏం చెయ్యాలి అతను కావాలని శుక్రవారం నాటకమాడేడో లేక నిజంగా ఏదేనా అనుకోని ఖర్చు వచ్చిందో తెలీదు. ఏదేనా అనుకోని ఖర్చు వస్తే డబ్బు సర్దలేక పోయానన్న విషయం ముందుగా చెప్పాల్సింది. అలా చెప్పలేదు సరికదా డబ్బు ఇవ్వలేక పోయినందుకు బాధకూడా పడ్డంలేదు. అంటే కావాలనే ఇస్తానన్న కట్నం ఇవ్వకుండా ఎగ్గొడదామనుకుంటున్నాడా? నిన్నటివరకూ చూపిన అభిమానం... ఆత్మీయత ఈనాడు కొరవడినట్టుగా అనిపించింది. ఎందుకంటే పెళ్ళి అయిపోయిందిగా.. “అదేంటండి మాటిచ్చి ఇలా చెయ్యడం ఏం బాగోలేదు'' అన్నా.

సృజన, సాహితి చిన్నబుచ్చుకుంటారనే విషయం జ్ఞాపకం వచ్చి “ఏమిటివ్వడం అండీ, ఇవ్వననడం లేదు కదా. ఏదో అర్జెంటు పనుండి వాడుకున్నా అని చెప్తున్నాగా. మీ కట్నాలు ఎక్కడికీ పోవు. సర్దుబాటు అవగానే ఇచ్చేస్తా'' అన్నాడు వియ్యంకుడు కొంచెం గట్టిగా.

నేనే కట్నం అడగడానికి, పెళ్ళివారింటికి వచ్చానన్న విషయం తెల్సి సాహితి, "ఎందుకలా వెళ్ళి అడగడం" అంటూ నా వెనకే వచ్చింది. అదీ ఆ మాటలు వింది.

"రా నాన్నా..." అంటూ నన్ను చెయ్యిపట్టుకు తీసుకెళ్ళింది. ఇద్దరం విడిదిలోకి వెళ్ళాం.

"పర్వాలేదు నే డబ్బిస్తా మీరెళ్ళి రండే" అన్నా సాహితితో.

"వద్దులే అలా మార్కెట్లో తిరిగేసి వస్తాం" అంటూ వెళ్ళారు ముగ్గురూ.

సాహితికి తెలీకుండా లతని డబ్బుతీసుకెళ్ళమని సైగచేసా. కాని నాకు తెలుసు ఏ రెండో మూడో వేలు సరిపెట్టగలదు లత, అంతకుమించి సర్దుబాటు కాదు.

వాళ్ళలా వెళ్ళాక నేను వియ్యంకుడు చేసిన మోసాన్ని నెమరేస్తూ వరండాలో కుర్చీవేసుకు కూర్చున్నా.

అదే అదనుగా లోపలినుంచి బయటకొచ్చిన ఆడపెళ్ళివారి పనిమనిషి...

"అయ్యా మా అయ్యగారు ఏదో మోసం అంటున్నారు..." అంది.

దాంతో ఈ విషయం మాట్లాడ్డం ఇష్టంలేక 'ఏం లేదులే' అన్నా. అయినా అది వదల్లేదు. "ఆయ నలాంటివాడే నండీ" అంది. పనిమనిషితో కష్టసుఖాలేంటి అని నేనూరుకున్నా.

"ఆరు నా కూతుర్నే మోసం చేసే రండి... మీడబ్బో లెక్కా..." అంది.

నేను ఆశ్చర్యపోయా. పనిమనిషేంటి దానికూతురేంటి, మోసం చేయడమేంటి... అంతా సస్పెన్స్.

"అయ్యగారు వ్యవసాయం చూసుకోడానికి మావూరు వస్తుండేవారండి. మేంవారి పొలం చేస్తున్నాం. అక్కడీరి అన్నగారింటిలో నే పన్చేస్తున్నాను. వచ్చినారు నెల రెండు నెల్లు వుండేవారండి. పొలం యెళ్ళేవోరండి. అక్కడే అదీ వుండేదండి. ఈన కన్నా మూడు పదులు సిన్నదండి, దాన్ని లోబరుసుకున్నారండి. దానికిద్దరు పిల్లలు అదే ఆ పొలం అజమాయిషి సేస్తోంది. పెద్దోరుకదా ఏమన్లేక గమ్మున వున్నాం.."

ఇదాయిన అత్తగారన్న మాట. అందుకే మంచి మంచి చీరలు కడ్తోంది. పనాళ్ళ మీద అజమాయిషీ చేస్తోంది.

అప్పటికి నాలో కుతూహలం పెరిగింది. 'మరి వాళ్ళావిడ వూరుకుందా?'

"వూరుకోక ఏం చేస్తుందండీ?"

నిజమే వూరుకోక ఏం చేస్తుంది? వీధిన పడ్తుందా? అల్లరి చేస్తుందా? దానికి తగ్గ ఆర్థిక స్తోమత గుండెధైర్యం వుండాలి. అవేవీ వుండి వుండవు. రెండు మూడుసార్లు దెబ్బలాట వేసుకునుంటుంది. కుదరక సరిపెట్టుకునుంటుంది.

సమాధానపడి వుంటుంది. పిల్లల మీద ఆశలు పెంచుకునుంటుంది.

* * *

మేం అలిగాం అన్న విషయం తెల్సినా ఆడపెళ్ళివారు పట్టించుకోలేదు. మర్నాడు స్నానానికి వేన్నీళ్ళు లేవు. కాఫీలు అంతంత మాత్రం. అప్పటికే చాలామంది వెళ్ళిపోయారు. శోభనానికి వుండిపోయిన మా సంగతిలా వుంది. హడావిడి అంతా ఆడపెళ్ళి వారిదే... మా ప్రమేయం ఇష్టం, ఏమీ లేదేమో అన్పించింది. ఇన్ని జరుగుతున్నా సహించి వూరుకోక చేసేదేముంది అన్పించింది.

ఆడపెళ్ళి వారి వినయానికి లోటులేదు. వున్న లోటల్లా అవసరాలకే. ఈ చిరాకు భరించలేక ఎవరు చెప్తున్నా విన్పించుకోకుండా సాయంత్రం బస్సుకి ఇంటికెళ్ళి పోయింది సాహితి.

మీ ప్రవర్తన వల్లే సాహితికి కోపం వచ్చి వెళ్లిపోయింది అన్చెప్పలేకపోయాను.

ఇంటి దగ్గర గృహప్రవేశం, సత్యనారాయణ వ్రతం ఏర్పాట్లు చూడ్డానికి వెళ్ళిందని అబద్ధాలు చెప్పాం.

"అవునవును " అంటూ ఆడపెళ్లివారు వొప్పుకున్నారు. మొహాలు పక్కకి తిప్పి నవ్వుకున్నారు.

సాయంత్రం ముహూర్తం టైముకి తుషార్ని, కుందనని పీటలమీద కూర్చోబెట్టారు. ఏవేవో చాలా చేసేరు. నేనూ, లత ప్రేక్షకులమే! మా ప్రమేయం లేదు. దంపతులకి బొండాం దానమిచ్చారు. బొండాం మంచం కిందకి విసిరి బైటకి వచ్చా.. కానీ లత రాలేదు. లోపలికి తొంగి చూసాను. అవాక్కయిపోయాను.

లత తుషార్ని పట్టుకు ఏడుస్తోంది. ఎందుకు, ఏం జరిగింది? తన కొడుకు తనవాడు కాకుండా పోయాడనా? ఏమిటీ వైపరీత్యం? తుషార్ మీద మమకారం వుంటే వుండుగాక, వాడేం ఇల్లరికం పోటల్లేదే! మరేమైంది?

తుషార్ పరాయివాడైపోయాడనా? ఎలా అవుతాడు? లత మనసులో ఏముంది? ఏముందో చెప్తుందా? వివరణకి అందని అనుబంధం. ఈ రోజుతో కొత్త బంధాల్లో చిక్కున్నాడు తుషార్!

లతెందుకు ఏడ్చింది? తుషార్ శోభనాన్ని ఏ విధంగా అర్థం చేసుకుంది లత. కోడలికి కొడుకు వశం అయిపోయాడనుకుందా? ఇన్నాళ్ళూ పసిబాలుడు అనుకుందా? అసలెందుకీ అభద్రతా భావం? లత యాభైయోపడిలో వుంది. తుషార్కి ఇరవై అయిదేళ్ళు! వాడూ నిశ్చేష్టుడయాడు.

ఈ రోజు తర్వాత వాడి యాటిట్యూడ్లో మార్పొస్తుందా? వస్తే ఎలాంటి మార్పు, ఆ మార్పువల్ల తమకేం నష్టం? ఎంత సరిపెట్టుకుందామనుకున్నా.. లత తుషార్ని

పట్టుకు ఏడవడంలో ఔచిత్యం కనబడలేదు! కనబడలేదా? ఔచిత్యం లేదా? ఏది సరైనది? సృజన, లతని పట్టుకుంది.

మనసులో అనేక భయాలుండచ్చు.. అనుమానాలూ వుండచ్చు. కానీ ఇరవై అయిదేళ్ళు తనతో పెరిగిన తుషార్ మీద నమ్మకం సడలింది. వాడు మారిపోతాడనే నమ్మకం బలంగా కుదిరిందా? ఈ రోజుకి, ఈ రాత్రికి అంత ప్రాముఖ్యం వుందా! ఈ మార్పుకి ఎవరు కారణం తుషారా? తుషార్ భార్యా? ఎవరు? లత ఆలోచనేమిటో అంతు పట్టలేదు.

తనతో కాపరం నాలో మార్పు తెచ్చిందా? సృజన రవిలో మార్పు తెచ్చిందా? లత తల్లిగా సంకుచితంగా వ్యవహరించిందా? తను, తన కూతుళ్ళూ అందరూ ఆడవాళ్ళే కదా! మరి ఎదుటి ఆడదాని గురించి ఈ అసంబద్ధ ఆలోచన యెందుకు?

ఆడయినా, మగయినా మనకి తెలియని మనిషి మనలో దాగుంటాడేమో? వాడే బయటకొస్తాడా? ఎలా అయినా లత ప్రవర్తన సమర్ధనీయం కాదు, వాళ్ళంతా తుషార్ గురించి ఏమనుకుంటారు?

తుషార్‌దాకా ఎందుకు? తనలా కాకుండా పోయాడా? లతతో పొందుతో తన ఆలోచనల్లో మార్పు.. తన ప్రయారిటీస్‌లో తేడా కనిపించాయా? కనిపించాయో లేదో అమ్మ చెప్పాలి? అమ్మ అలా ఎప్పుడూ కనిపించలేదు. తేడా కనిపించినా సరిపెట్టుకుందా? అర్థం చేసుకుందా? లతెందుకు తేలిపోయింది? అమ్మెందుకు తేలలేదు? చాలా విచిత్రమైన ప్రశ్నలు. వీటికి సమాధానం ఎవరు చెప్తారు? ఏమని చెప్పగలరు?

అలా జరిగింది తుషార్ పెళ్ళి...

తుషార్ భార్య... కుందన తెలివైంది. ఆ తెలివితేటల్లో తేడాలున్నాయి... తండ్రి ఇంట్లో వున్నప్పుడు తండ్రిని సమర్థిస్తుంది. మా దగ్గరున్నప్పుడు మా మాట ఆడుతుంది. ఆ విధంగా కాలం నెట్టుకొచ్చేసింది.

* * *

సోంశేఖర్ స్నాతకం అయింది.

సాయంత్రం అందరూ తోటలో దిగారు. పందిరి కింద సమావేశం అయ్యారు. ఎదురు సన్నాహం అయ్యారు.

పురోహితుడు ఇరువురి తరుపున పెళ్లి కార్డు చదివాడు.

అందర్నీ పరిచయం చేసాడు. ఇరువురూ పెళ్లికి వప్పుకున్నారు. అందరూ పానకం తాగుతున్నారు.

సోమశేఖరం తల్లి అలిగింది. అలిగిందంటే అలగలేదు. పానకం తాగనంది. ఇచ్చిన గ్లాసు వెనక్కి పెట్టేసింది. ఆ విషయం ఆలమేఘాలమీద లత దగ్గరకి వచ్చేసింది. లత

నా దగ్గరకొచ్చేసింది. 'అసలు కారణం ఏమిటో కనుక్కోండి' అన్నాను ఆతృతగా. కారణం తెలియలేదు.

ఈసారి తుషార్ వెళ్ళి అత్తయ్యగారూ అంటూ ఇచ్చాడు. ఆవిడ 'అఖ్ఖర్లేదు అక్కడ పెట్టు' అంది. మొహంలో కోపం లేదు... చికాకు కనిపిస్తోంది. సభ్యత వదిలెయ్యాలా?

ఆవిడ పానకం గ్లాసుని ఎందుకు వద్దంది? అన్నదానిమీద చర్చ జరుగుతోంది. ఎవరూ సరైన కారణం పట్టుకోలేకపోయారు. ఏ కారణం తెలియకుండా ఎలా ఎదురు బడ్డం, ఎదురు సన్నాహం అయిపోయింది కదాని వచ్చేసాం. ఇప్పుడే జరిగింది? ఏం జరిగిందో ఆవిడ చెప్పదు. తెలుసుకోడం ఎలా? పందిర్లో ఇద్దరు ముగ్గురు పెద్దలు పానకం గ్లాసుని ఆవిడ దగ్గరకి తీసుకెళ్ళారు. ఆవిడ తాగలేదు.

ఆఖరికి సోమశేఖర్ తండ్రి పక్కనుండి లేచి "ఏమైందమ్మా పానకం తాగలేదు" అన్నాడు.

వాడికి భయం. ఏ వైమనస్యాలూ లేకుండా పెళ్లి జరగాలని, లేకపోతే సాహితి జీవితాంతం దెప్పుతుంది. అసలే దుందుడుకుది.

కొడుకు బతిమాలేక ఆవిడ ఏదో గొణిగింది. సోమశేఖర్ నిట్టూర్చాడు. వోసారి పానకం బిందె వైపు చూసాడు. తల్లితో "అయిందేదో అయిపోయింది. సరిపెట్టుకో అమ్మా" అన్నాడు.

ఆవిడ కొడుకునో చూపు చూసింది. తుషార్ సోమశేఖరాన్ని "ఏమిటి?" అనడిగాడు.

"ఏం ఫరవాలేదు" అన్నట్టు కొట్టిపారేసాడు సోమశేఖర్.

కానీ ఏదో పరవావుంది అనిపించింది తుషార్కి, "ఫర్వాలేదు చెప్పు" అన్నాడు.

"పానకం బిందె వెండిదివ్వలేదే" అన్నాడు.

"నాకేం తెలుసు వెళ్ళడుగుతా వుండు" అన్నాడు తుషార్.

అప్పటికే పందిరి కింద, పానకం రుచి కన్నా పానకం బిందె కాంట్రవర్సీ గుప్పుమంది.

మగపెళ్లి వార్లో చాలామంది పానకం గ్లాసులు తీసుకోకుండా తిరస్కరించారు.

అప్పటికే లత అక్కడికి చేరుకుంది.

"అదేంటి వదినగారూ అలా చేసారు, ముందుగా మనం ఈ విషయం అనుకోలేదుగా" అంది.

"మనం చాలా విషయాలు అనుకోలేదు... కానీ అవన్నీ జరుగుతున్నాయిగా, ఆ మాత్రం వెండిబిందె ఇవ్వలేరూ?"

"ఫర్వాలేదమ్మా ఎలాగోలా సరిపెట్టుకుందూ..." అంటోంది, సోమశేఖర్ అక్క తల్లి పక్కకి చేరి.

లతకి ఏం చెయ్యాలో తెలీలేదు. "మేం తయారుగా లేమండీ వదినగారూ'' అంది.

"ఇందులో తయారుగా వుండడం, లేకపోడం ఏముంది. మీరేగా పెళ్ళయిపోవాలని హడావిడి చేసారు. అంటే తయారుగా వున్నట్టేగా అర్థం'' లత మాట్లాడలేదు. సోమశేఖర్ తల్లి పక్కకి చేరి బతిమాలుతున్నాడు. ఏ గొడవా లేకుండా సరదాగా జరగాల్సిన పెళ్లిలో ఈ బెట్టు అపశృతి. కానీ తల్లి తన పట్టు విడదు. ఇది సాహితికి తెలిస్తే అదెంత బాధపడుతుందో. సాహితి తిక్కది, ఏ మాటేనా అనేస్తుంది. ఈ పట్టింపులు, మాటలు తూటాల్లా మొదలవుతాయి. అవి మొదలైతే ఆడపెళ్లివారూ, మగపెళ్లివార్ల మధ్య జరిగే తమాషా చూసి మిగతా వాళ్ళు సంతోషిస్తారు.

ఇంతలో లతకో ఆలోచనొచ్చింది. గబగబ వెళ్ళి బీరువాలోంచి రెండు కొత్త వెండిగ్లాసులు తీసింది. సాహితి మావయ్య, దాని పెళ్ళికి కానుకగా ఇచ్చినవి. అవి తీసుకెళ్ళి పానకం వెండి గ్లాసుల్లో పోసి, సాహితికి కాబోయే అత్తగారికి, ఆడబడచుకి ఇచ్చింది.

వియ్యపురాలి మొహం వికసించడంతో లత హృదయం తేలికపడింది. సోమశేఖర్ అక్కడ్నించి తప్పుకున్నాడు. సమస్య సమసి పోయింది. పెళ్ళి కార్యక్రమం ముందు కురికింది. కానీ...

కొందరి ఆలోచనల్లో జరిగిందాని గురించి ఆలోచన మొదలైంది. నిజంగా వెండి బిందెలోనే పానకం కలపాలా?

మగపెళ్ళివారి స్టేటస్ అంత గొప్పదా? దేన్ని బట్టి స్టేటస్ నిర్ణయమవుతుంది? మగపెళ్ళివారి వెండిబిందె స్టేటస్ సాహితి వరకూ వచ్చింది.

సాహితికి ముందు ఏం జరిగిందో, అసలు ఈ తతంగమంతా ఎందుకు జరిగిందో అర్థం కాలేదు. సోమశేఖర్‌తో మాట్లాడాలి అనుకుంది.

సెల్ తీసి ఫోను చేసింది.

ట్రై చేసిన కాసేపటికి సెల్‌లో సోమశేఖర్ గొంతు వినిపించింది.

భోజనాలయి అందరూ విశ్రాంతి తీసుకుంటున్నారు. కానీ మేడమీద అమ్మ గదిలో... అమ్మ మంచం మీద కూర్చుంది. అమ్మ పక్కగా సాహితి, ఎదురుగా కుర్చీలో సోంశేఖర్, పక్కగా తల్లి, తండ్రి, నేనూ, లతా కూర్చుని వున్నాం.

సోంశేఖర్ తల్లికి చిరాకుగా వున్నా సంబాళించుకు కూర్చుంది. అమ్మ మొదలు పెట్టింది.

"పిల్లలకి మీ తత్వాలేవీ నచ్చలేదర్రా, వాళ్లు ఏం చేద్దాం అని సలహా అడిగితే... నేను మిమ్మల్ని పిలిపించా, వాళ్ళు చెప్పింది వినండి. ఆ తర్వాత మీ ఇష్టం.''

"ఏమిటి వాళ్ళు చెప్పింది వినాలి? వాళ్ళు చిన్న పిల్లలు. వాళ్ళకేం తెలీదు'' అంది సోంశేఖర్ తల్లి.

"దేనికమ్మా చిన్న పిల్లలం? ఎందులో చిన్న పిల్లలం? వెండిబిందెలో తప్ప పానకం ఇంకో బిందెలో కలపరని తెలియనందుకు చిన్నపిల్లలమా? వెండి గ్లాసులో పోసి, తాగినంత

మాత్రాన, దానికిది చెల్లు అని తెలుసుకోకపోడంలో చిన్నపిల్లలమా? ఎందులో చిన్న పిల్లలం...?'' అన్నాడు సోంశేఖర్.

“నువ్వు మాట్లాడకురా సోమా.. అనవసరంగా పెద్దవాళ్ళ విషయాల్లో కలగచేసుకోకు. నువ్విలా మాట్లాడావంటే నే వెళ్ళిపోతాను. నీఇష్టం...''

“అమ్మా బెదిరిస్తున్నావా? అది పెద్దరికం అనుకుంటున్నావా?'' సోంశేఖర్ గొంతులో అనిర్వచనీయమైన బాధ.

“సోమా అమ్మ ఎక్కడికీ వెళ్ళదు... ఈ పెళ్ళి జరుగుతుంది. నువ్వు ఏం చెప్పదలుచుకున్నావో అది చెప్పు.'' అన్నాడు సోమశేఖర్ తండ్రి.

“సంప్రదాయసిద్ధంగా... సరదాగా పెళ్ళి జరగాలని సాహితీ... వాళ్ళ నాయనమ్మ గారు పట్టుబడితే.. ఈ పెళ్ళికి వొప్పుకున్నా. లేకపోతే ఇదంతా నాకు చిరాకు. ఏ ఫైవ్‌స్టార్ హోటల్లోనో వొక రోజు పెళ్ళి, సాయంకాలం రిసెప్షన్‌తో కానిచ్చేద్దుం... అప్పుడీ వెండిగిన్నెలు.. ప్రోబ్లం వుండకపోను... అవన్నీ అంత అవసరమా?''

“అవసరమా కాదా అన్నది వేరే ప్రశ్న. అలా వుంటే బావుంటుందని''.

“అవి లేవని అలగడం బాగులేదు... అది అపార్థాలకి తావు తీసింది'' సోం.

“రెండు కుటుంబాలు... రెండు పద్ధతులు, రెండు సంస్కారాలు కలుస్తున్నప్పుడు.. చిన్న చిన్న అపార్థాలూ, కోపాలు తాపాలూ సహజం.. అలా రాలేదనుకో.. ఇరు కుటుంబాలూ మోడెష్టీకి పోతున్నాయన్న మాట... ఎందుకు? ఈ రెండు కుటుంబాలూ బంధుత్వాన్ని పెంచుకోవాలి.. దానికి ఎవరు ఎంత సహనం వహిస్తే అంతమంచిది'' అంటూ వివరణ ఇచ్చాడు సోంశేఖర్ తండ్రి.

అందరూ మరి బదులు చెప్పలేదు. అందరికీ ఆయన లాజిక్ నచ్చింది.

రెండు కుటుంబాలూ ఎవరి సాంప్రదాయాలు వారివి. దాంట్లో తేడాల వల్ల చిన్న చిన్న కోపాలు రావడంలో తప్పులేదు.

సోంశేఖర్ తల్లి, వాళ్ళాయన్ని మెచ్చుకోలుగా చూసింది. సోంశేఖర్ వాళ్ళ నాన్నని ‘ఎప్రీషియేటివ్’గా చూసాడు. “అనవసరమైన హంగామాచేసి... తన తల్లిని దోషిగా నిలబెట్టారు. జగడాలదానిగా ప్రొజెక్ట్ చేసారు'' అంటూ నింద మా మీదకి నెట్టేసాడు.

లత కంగుతింది. తన వెండిగ్లాసులూ పోయాయి, తను మాటపడాల్సి వస్తోంది.

“నువ్వన్నది నిజమేగాని అబ్బాయ్ ఎక్కడో ఏదో తేడావుంది. అంతా మా తప్పు కాదు'' అంది అమ్మ.

“ఇక్కడ ఎవరి తప్పులూ ఎంచడం లేదు బామ్మగారూ... ముందు మీరు పానకం బిందెలు ఎలాంటివి పెట్టాలి అని అడిగితే మేం చెప్పేసుండేవాళ్లం.... గొడవే వుండకపోయి వుండేది... ఇప్పుడు కూడా ఏ గొడవా లేదు..'' అన్నాడు సోంశేఖర్ తండ్రి వుదాత్త స్వభావంతో. తండ్రిని మెచ్చుకోలుగా చూసాడు సోంశేఖర్.

లత కొంచెం కించపడింది. "మిమ్మల్ని ముందుగా అడక్కపోవడం మాతప్పేమో..." అంది.

అంతవరకూ మౌనంగా వున్న సాహితి "మావయ్యగారూ..." అంటూ సోంశేఖర్ తండ్రిని పిలిచింది. ఆయన సాహితి వేపు చూసాడు.

"మీరు కూడా మమ్మల్ని మా సాంప్రదాయం ఏమిటి? అని అడగలేదు కదండీ..." అంది.

"మేమెందుకడుగుతాం?" అన్నాడాయన.

"మనమంతా వొకే కుటుంబం కదండీ. మా ఆచారాలు, అలవాట్లు మీరూ తెలుసుకోవచ్చుగా..." అంది.

సోంశేఖర్ తండ్రికి ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు.

"అంటే ఆడపెళ్ళివారే... మగపెళ్ళివారి ఆచారాలూ, సాంప్రదాయాలూ తెలుసుకోవాలి. మగపెళ్ళివారు మహారాజులు. వాళ్లనే అడగాలి. అయ్యా మీ సాంప్రదాయమేమిటి? మీకు ఏయే అలవాట్లున్నాయి? అవి అన్నీ మేమే అడగాలి. అంతే కదా మీ అభిప్రాయం..." అంది వెటకారంగా.

"ఆడపెళ్ళివారే వొదిగుండాలే. వాళ్ళే అడగాలి" అంది అమ్మ.

"అది మీ కాలంలో బామ్మా... అలాగని ఇప్పుడేదో కాలం పూర్తిగా మారి పోయిందని కాదు... కనీసం పరస్పర సహకారం వుండాలని"

"....." పెద్దలెవరూ మాట్లాడ్లేదు.

"మరి మేమిద్దరం ఇష్టపడి పెళ్ళి చేసుకోవడం ఎందుకు"

"ఇష్టపడి పెళ్ళి చేసుకుంటే సంప్రదాయం వుండక్కరలేదా?" అమ్మ.

"సంప్రదాయం అంటే అలగడం... దెబ్బలాడుకోడం కాదనుకుంటా. అదే సంప్రదాయం అయితే ఆ సంప్రదాయం మాకక్కరలేదు" అంది సాహితి నిక్కచ్చిగా.

ఆ మాటతో అందరూ నోరు మూసేసారు. ఎవరూ మాట్లాడుకోలేదు.

నిజమే! అలకలు, కులుకులు, ఆరాటాలూ, పోరాటాలూ అన్నీ సంప్రదాయాలే... తంతులన్నిటి వెనకా ఆర్థికతత్వం వుంది. దాన్ని కాదనలేకపోతున్నాం. అందుకే. 'ఈ అలక తీర్చాలంటే ఎంత ఖర్చవుతుంది' అన్న వ్యవహారిక సత్యం లేదా తత్వం చాలా ఇబ్బంది పెడుతోంది.

*తంతు* *(విపుల , జనవరి 2008)*

# ఫెమినిటీ

నాన్న ఎన్నో జాగ్రత్తలు చెబుతున్నారు. ఎ.సి టూ టైర్‌లో రిజర్వేషను సంపాదించలేక పోయినందుకు చాలా బాధపడిపోతున్నారు. 'బండొచ్చాక 'ట్రై' చేద్దాంలే అమ్మలూ' అని హామీ ఇచ్చారు. కానీ నాన్నని అటూ ఇటూ పరిగెట్టించడం ఇష్టంలేక, నేనే 'వొద్దులే నాన్నా! ఇక్కడ నుండి మూడు గంటలేగా ప్రయాణం సర్దుకుపోతా'నన్నా... పదిహేనేళ్ల క్రితం పోస్టుగ్రాడ్యుయేషన్ చదవడానికి వెళుతున్నప్పుడు ఏ ఏ జాగ్రత్తలు చెప్పారో, ఇప్పుడూ అవే రిపీట్ అవుతున్నాయ్. నాన్నలో ఏ మార్పు లేదు. రేబాన్ కళ్లద్దాలలోంచి నాన్నని చూసి, ఊ కొడుతూ నిలబడ్డా. మైక్‌లోంచి 'ఫలానా ట్రైన్ కొద్ది నిముషాల్లో ప్లాట్‌ఫారం మీదకి వచ్చును' అని ఎనౌన్స్‌మెంటు వచ్చింది. ఆ 'కొద్ది'కి అర్థం అరగంట. అరగంట తర్వాత ట్రైన్ 'ప్లాట్‌ఫారం మీదకి వచ్చి ఆగింది.

నే ట్రైనెక్కి కూర్చున్నా. కిటికీ అవతలగా నిలబడి నాన్న ఆఖరి జాగ్రత్తల ధోరణి నిరాటంకంగా కొనసాగుతోంది. నే వెళుతున్న ఊరు నాకు కొత్త కాదు. ఇంతకుముందు ట్రైనింగ్ కోసం ఆ ఊళ్లో రెండేళ్లు వున్నా. ఇప్పుడు పదేళ్ళ తర్వాత మళ్ళీ అదే ఊళ్ళో పోస్టింగ్ వచ్చింది. ఇక్కడ నుండి మూడు గంటలు ప్రయాణం. అందుకే త్రీ-టైర్‌లో వెళ్లడానికి సందేహించ లేదు.

రోకలిబండలా కదిలిన రైలు స్పీడందుకుంది. అంతవరకూ సీటు మీదుంచిన సూట్‌కేసు, సీటు కింద పెడదామని లేచా. నా ఎదురుగా కూర్చున్నతను 'నే హెల్ప్ చేసేదా' అంటూ లేచి, నా ప్రమేయం లేకుండానే నా సూట్‌కేసు తీసుకుని, బెర్త్ కింద సర్దేశాడు.

అతని చురుకుతనానికి ఆశ్చర్యం వేసింది. అతన్నోసారి కళ్ళద్దాల్లోంచి దీర్ఘంగా చూశా. వేషభాషల్ని బట్టి ఏదో మిడిల్‌క్లాస్ వాడిలా వున్నాడు. ఇలాంటి వాళ్ళని తరచూ ఆఫీసులో చూస్తూ వుంటాం. నాకు కూడా గత ఏడెనిమిదేళ్ళుగా స్వయంగా పని చేసుకోవడం అన్న అలవాటు తప్పింది. నా ట్రాన్స్‌ఫర్ల వల్ల బాబు చదువు దెబ్బతినకుండా, వాడ్ని నాన్నగారి దగ్గర వదిలేశాను. నే కొత్త చోటుకి వెళ్లి జాయిన్ అయ్యేలోగా వాడ్నోసారి చుద్దామని నాన్న దగ్గరకొచ్చా. లేకపోతే ఎప్పుడూ నాతోపాటు వో అటెండరు వుంటాడు. ఇప్పుడది కుదర్లేదు.

వీడెవడో 'మే ఐ హెల్ప్‌గాడు' నేను పోస్టు చేయబడ్డ ఊర్లో ఆఫీసులో క్లర్క్ అయివుండాలి. నన్ను గుర్తుపట్టాడు.. బాగానే గుర్తుపట్టాడు. అందుకే అవసరం వున్నా, లేకపోయినా 'నే హెల్ప్ చేసేదా?' అంటూ ఎగబడుతున్నాడు అనుకుంటూ నా ఆలోచనల్లోనే బెర్తుమీద కూర్చుందామని వంగాను. బెర్తుకోసం పెట్టిన గొలుసు తలకి తగిలి, జుట్టు చెదిరింది. 'ఆ గొలుసెందుకు తగిలిందా?' అని చూసా. గొలుసు పై

కొక్కెంకి కాక, కింద కొక్కెంకి పెట్టారు. గొలుసుని చూడగానే విసుగొచ్చింది. ముందుగా జుట్టుసరిచేసుకుని, గొలుసు పైకి పెడదామని తయారవుతున్నా. నా ఎదురుగా వున్న సీటతను లేచి 'నే పెడతాలెండి' అన్నాడు. నేనతన్నోసారి చూసి, గొలుసుకి దూరంగా జరిగా.

అతను గొలుసుని పై కొక్కెంకి పెట్టి, తన సీటులో కూర్చుంటూ 'ఇంక తగలదు' అంటూ ఓ వెకిలి నవ్వు నవ్వాడు. వాడి ఉద్దేశంలో నేను పొట్టి. నాకు పైకొక్కెం అందదు అన్న ఆలోచన వుందేమో! కానీ, నేను పొట్టి కాదే, ఆడది అనేసరికి మగాడి మనసులో ఓ అభిప్రాయం ఏర్పడి పోయుంటుందేమో. అందుకే, మాటిమాటికీ 'మే ఐ హెల్ప్' అంటూ స్ప్రింగ్‌లా తన సీటులోంచి లేచిపోతున్నాడు. నేనతన్ని పరిశీలిస్తున్నానన్న విషయం అతనికి తెలియదు. రేబాన్ కళ్ళద్దాల యవనిక చాలా దిట్టమైంది. అందులోంచి కళ్ళల్లో ఏ భావాలు తొంగి చూస్తున్నాయి అన్నది తెలుసుకోవడం కష్టం. కనుకొలకుల్లోంచి అతన్ని గమ నిస్తున్నానేమో, కళ్ళు పీకడంతో దృష్టి కిటికీగుండా సారించాను.

ఎదురుగా పైరు పచ్చవిందు చేసింది. కిటికీలోంచి చూస్తే, యానిమేషన్‌లో పెట్టినట్టు చెట్లు దూరం నుండి పరుగెత్తుకొచ్చి మాయమైపోతున్నాయి. దృశ్యాల్ని నెట్టుకుంటూ, పట్టాల మీద చప్పుడు చేసుకుంటూ రైలుబండి ముందుకి దూసుకుపోతోంది. దూరంగా కొండల్ని కప్పిన మేఘం పులకరించి, చిలకరించింది. ఆ జల్లులే దగ్గరై, ఒక్కసారి వెలిపిరి మొహానికి కొట్టింది. ఆ వెలిపిరికి, ఆ చల్లదనానికి మనసు హాయిపడినా, ఎందుకో ఒక్కసారి వెనక్కి తగ్గా. నాలో ఉలికిపాటు చూసి నా ఎదురుగా కూర్చున్నతను లేచి, చిన్న చిరునవ్వుతో కిటికీ తలుపు మూసేశాడు.

వెలిపిరైతే కొట్టింది గానీ, పూర్తిగా జల్లు రాలేదు. 'నన్నడగకుండా అతనలా చొరవ చూపించి కిటికీ మూసెయ్యడం నాకు నచ్చలేదు. 'ఫర్వాలేదు వెలిపిరే కదా తలుపు తెరవండి' అన్నా.

అతను నన్ను విచిత్రంగా చూస్తూ కిటికీ షట్టరు పైకెత్తాడు. ఈ షట్టర్ల బాధ తప్పి చాలా రోజులయింది. కానీ, ఈ పిల్లపైరు గాలి, సన్నపాటి తుంపర శరీరానికి హాయినిస్తూ మనసుని మత్తెక్కిస్తున్నాయి. ఈ అనుభూతి కరువైపోయింది. చాలా రోజుల తర్వాత 'వాతానుకూల' పెట్టెలో బెడ్ రోల్స్ అడుగునుండి విముక్తి లభించింది. మసక చీకటి నుండి దేదీప్యమానమైన వెలుతురులోకి అడుగుపెట్టినట్టయింది. ఈ కంపార్ట్‌మెంట్‌లో ధూళి బాధ తప్పితే ఇక్కడున్నంత చైతన్యం, అక్కడ ఉండదు. చైతన్యం అనగానే 'మే ఐ హెల్ప్‌గాడు' జ్ఞాపకం వచ్చాడు.

ఎదురుగా కూర్చున్నతన్ని పరిశీలనగా చూశా. వయసు నలభై పడి దాటుంటుంది. ముదిరిన చెట్టు బెరడులా శరీరం కొంచెం మోటుగా వుంది. అతను పెట్టుకున్న కళ్లద్దాలలో గానీ, వేసిన డ్రెస్‌లో గానీ ప్రత్యేకత కనబడ్లా! టేస్ట్ అసలే శూన్యం. రోజూ ఇలాంటి

వాళ్లని చాలామందిని చూస్తా. వీడూ ఆ మందలో ఒకడు! నేను చేసుకోవలసిన ప్రతి పనిలో మధ్యవర్తిత్వం నెరపడం, నా కనుమానాన్ని కలిగించింది. వీడుగాని మా ఆఫీసులో పనిచేసేవాడు కాదు కదా అనిపించింది. చాలామంది స్టాఫ్ ఫ్యామిలీని దూరంగా ఊళ్లలో వుంచి వీకెండ్‌కి అప్ అండ్ డౌన్ చేస్తారు. వీడు మా ఆఫీసులో వాడే... నన్ను పదేళ్ల కిందట చూసినా గుర్తుపట్టాడు. అందుకే అవసరం లేకపోయినా ప్రతి పనిలో వేలు పెడుతున్నాడు, ఇంప్రెషన్ కొట్టెయ్యడానికి. రైల్లో చేసిన సేవలకి ఎప్పుడో ఏదో ఫేవర్ అడుగుతాడు. కానీ వాడు నాకు చేస్తున్న సేవలో అణకువ, వినయం కనబడలేదు. ఎందువల్ల? నేనుకుంటున్నట్టుగా మా ఆఫీసులో పనిచేసేవాడు కాదేమో? మరి వాడెందుకింతలా పడిపడి సేవలు చేసేస్తున్నాడు?

నా ఆలోచనల్లో నేనుండగానే రైలు ఆగింది. ఆ స్టేషను చాలా పెద్దది. ప్లాట్‌ఫారం వైరస్ సోకిన డేటా స్ట్రక్చర్‌లా వుంది. ఇక్కడ ఎక్కువసేపు రైలాగుతుందని అర్థం అవుతోంది. కంపార్ట్‌మెంటులో అందరూ ప్లాట్‌ఫాం మీదకి దిగడానికి సిద్ధం అవుతున్నారు.

నా ఎదురుగా కూర్చున్నతను లేచి, 'నా సీటు చూడండి' అని అప్పగింతలు పెట్టి, ప్లాట్‌ఫాం మీదకి దిగాడు. ఈ ఏబ్రాసి గాడి సీటు చూడాలా? ఎందుకో ఎదుటి సీటు వాడి మీద చెప్పలేనంత కోపం వచ్చింది. వాడు నాకు ఆర్డరేసినందుకే చికాకేసింది. వాడు కిందకి దిగి ఏం చేస్తున్నాడా? అని చూశాను. కంపార్ట్‌మెంటుకి ఎదురుగా నిలబడి గాజు గ్లాసుతో 'చాయ్' తాగుతున్నాడు.

రేబాన్ కళ్లద్దాలు తీసి, వాడ్ని దీర్ఘంగా చూశాను. వాడి చూపుని ఆకర్షించాను. ఆ తర్వాత జరిగేది నాకు తెలుసు. అందుకే వాడు నన్ను చూడగానే కళ్లకి రేబాన్ యువనిక తగిలించాను. వాడు చాయ్ చప్పరిస్తూనే, నేనున్న కిటికీ దగ్గరికి వచ్చి 'మేడమ్! మీరు చాయ్ తాగుతారా?' అనడిగాడు.

తాగుతా అన్నట్టు తెలియజేస్తూ, సుతారంగా తల ఆడించాను. అతడు ఆదరాబాదరాగా పరిగెత్తి, చాయ్ కలిపించి పట్టుకొచ్చాడు. కిటికీ గుండా 'చాయ్' అందించాడు. చాయ్ అందుకుందామని చెయ్యి చాచిన నేను షాక్ తిన్నట్టుగా చెయ్యి వెనక్కి తీసుకున్నాను. 'గాజు గ్లాసుతో తాగను, ఫైబర్ గ్లాసైతే మంచిది' అన్నాను. అతను చకితుడై 'ఫర్వాలేదు తీసుకోండి. రైలు కాసేపు ఆగుతుంది లెండి' అన్నాడు. 'అదికాదు, గాజు గ్లాసు హైజెనిక్ కాదు. ఫైబర్ గ్లాసులో తీసుకురండి' అన్నాను నిశ్చలంగా.

అతను నన్నొకసారి దీర్ఘంగా చూసి, చాయ్‌వాడి దగ్గరికి వెళ్లి, ఏదో చెప్పాడు. చాయ్‌వాడు అతనికేం చెప్పాడో తెలీదుగానీ, అతను నడుచుకుంటూ ఇంకో చాయ్ చేసేవాడి దగ్గరకెళ్లి ఫైబర్ కప్పు తీసుకొచ్చి, దాన్ని చాయ్‌వాడి కిచ్చి, చాయ్ చేయించి, అది నా దగ్గరకి తెచ్చేసరికి రైలు కదిలిపోయింది. అతను పరిగెత్తుకెళ్లి రైలు ఎక్కాడు. ఆయాసంగా వగరుస్తూ వచ్చి, ఎదుటి సీట్లో కూర్చున్నాడు. అతని ఆయాసాన్ని

పెంచుదామని 'చాయ్ బాలేదండీ' అన్నాను.

అతను చాలా బాధపడిపోయాడు. 'ఇంకే స్టేషనులోనూ ఇంతసేపు రైలాగ దనుకుంటా?' అన్నాను.

'ఎందుకూ?' మే ఐ హెల్ప్‌గాడి ఆతృత.

'మంచినీళ్లు కావాలి'

'మీ దగ్గర బాటిలుందా?'

'బాటిలా?' అని వాడ్నాశ్చర్యంగా చూసి, 'స్టేషనులో వాటరు కాదు, మినరల్ వాటర్ కావాలి' అన్నాను.

అతనేం సమాధానం చెప్పలేదు. నేనూ ఏం మాట్లాడకుండా కిటికీలోంచి దూరంగా చూస్తూ రెలిటివిటీ థియరీ జ్ఞప్తికి తెచ్చుకుంటున్నాను.

వెనక్కి పరిగెడుతున్న చెట్లు... పేంట్స్ ఎగదోసుకుంటూ రైలుతోపాటు పరిగెత్తి, రైలు వేగాన్ని అందుకోలేని కసితో రాళ్లు రువ్వుతున్న పిల్లలు.. అంతా వేగం, గతి. ఏదో దేన్నో అధిగమిద్దాం అన్న తపన. కాలం కూడా ఓ పరిగెత్తే రైలుబండి. ఎప్పుడు ఎక్కడ ఆగాలి, స్లో అవాలి, స్పీడు పెంచాలి అన్నది ముందుగానే తెలుసు. కానీ ప్రయాణీకుడు మాయలో పడతాడు. మాటిమాటికి టైము చూసుకుంటాడు. విచిత్రం... నా ఆలోచనల్లో నేనుండగానే రైలు స్పీడ్ తగ్గింది. అంటే, ఏదో స్టేషను వస్తోందన్న మాట. పర్సు తెరిచి పన్నెండు రూపాయలు తీసి ఎదురుగా కూర్చున్నతనికి ఇచ్చాను. అతనా డబ్బులు తీసుకుని లేచాడు.

ఇంతలో దబదబ చప్పుడయింది. వచ్చేది స్టేషను కాదని అర్ధం అయింది.

'బ్రిడ్జి వచ్చినట్లుంది' అన్నాను.

అతనికి అర్ధం కాలేదో, లేక నా అంచనా తప్పనుకున్నాడో, లేచి డోర్ దగ్గరకెళ్లి నిలబడ్డాడు. చిన్న బ్రిడ్జి వచ్చింది. బ్రిడ్జి ఉనికిని గౌరవిస్తూ రైలు మెల్లగా బ్రిడ్జిని క్రాస్ చేసింది.

బ్రిడ్జి క్రాస్ అయిన అరగంట వరకూ స్టేషను రాలేదు. ఎదురుగా కూర్చున్నతను వెనక్కి రాలేదు. అతని అంచనా తప్పయిందని నేను గుర్తించడం అతనికి ఇష్టం లేదు. నా దగ్గర చిన్నబోవడం అతనికి ఇష్టం లేదు. అందుకే వెనక్కి తిరిగి రాలేదు.

వచ్చిన స్టేషనులో రైలు ఎక్కువసేపు ఆగదు. అతను రైలాగగానే దిగి కేంటిన్‌కి పరిగెత్తి, మినరల్ వాటర్ బాటిల్ కొని, పరిగెత్తుకొచ్చేసరికి ట్రైన్ కదిలిపోయింది. వగరుస్తూ వచ్చి నా ఎదుటి సీట్లో కూర్చున్నాడు. అతన్ని చూస్తే జాలేసింది.

ఇతనింతగా కష్టపడుతున్నాడంటే, వీడెవడో సబార్డినేట్ అయివుండాలన్న అనుమానం ధృవపడింది. వీడు రేపట్నించి ఆఫీసులో ఈనాడు తను చేసిన సహాయానికి

ప్రతిఫలం ఆశిస్తాడు అనుకున్నాను. నా ఆలోచనల్లో నేనుండగానే నేను దిగే స్టేషను వచ్చేసింది.

నేను లేచి సీటుమీద ఏదేనా వదిలేనా అని చూసుకుని, బయట వదిలేసిన మినరల్ వాటర్ బాటిల్‌ని సంచిలో సర్దుకుని అతన్ని చూశా, అతను సర్దుకోవడం లేదు. ఇక్కడ దిగేవాడైతే సర్దుకోవాలిగా. ఆ ప్రయత్నం ఏం చెయ్యకుండా, నిశ్చింతగా కిటికీలోంచి బయటకి చూస్తున్నాడు.

నేను కుతూహలం ఆపుకోలేక 'మీరిక్కడ దిగరా?' అని అడిగాను.

'లేదు' అంటూ తను దిగవలసిన ఊరు చెప్పాడు.

నా ఆశ్చర్యం ఎక్కువైంది. 'మరి ఇంతగా హెల్ప్ చేశారే' అన్నాను.

'ఆడవారు కదా! అందులోనూ ఒంటరిగా ప్రయాణం చేస్తున్నారు. అందుకే హెల్ప్ చేశాను' అన్నాడు.

ఆ సమాధానం నాకు చెంపదెబ్బలా తగిలింది.

నేను ఆడదాన్నని నాకు హెల్ప్ చేశాడా? నేనింకా వీడు మా ఆఫీసులో క్లర్క్ ఎవడో అనుకున్నాను. నన్ను బాగా గుర్తుపట్టాడని మురిసిపోయాను. వీడు నన్ను ఆడదానిగా గుర్తించాడా? నేను వాడి హెల్ప్‌ని సబార్డినెట్‌గా, కేజువల్‌గా తీసుకున్నాను. దానికి వాడు నన్ను ఆడదానిగా, అబలగా జమ కట్టాడు. 'ఓరి దరిద్రుడా!' అనుకుని, పైకి మాత్రం 'నా పనులేవి అంత కష్టం కాదే! నేనే చేసుకుందునే, మీరు లేనిపోని శ్రమ తీసుకుని హైరానా పడ్డారు' అన్నాను. కావాలనే 'హైరానా' అన్న పదం దగ్గర నొక్కి పలికా.

'ఇందులో హైరానా ఏముంది? మీరు చేసుకోలేకపోతుంటే చేసి పెట్టాను' అన్నాడతను.

'పుట్టింగ్ సూట్‌కేస్ బిలో ది సీట్, ఎడ్జస్టింగ్ చైన్ హుక్ ఆర్ నాట్ దట్ డిఫకల్ట్, ఎనీ వుమన్ కెన్ డూ' అన్నాను.

అతను అహంకారంగా నవ్వుతూ, 'ఫర్వాలేదు లెండి ఏదో ఆడవారు కదా! అని హెల్ప్ చెయ్యాలనిపించి చేశాను' అన్నాడు మళ్లీ.

ఆ సమాధానంతో మరింత ఒళ్ళు మండింది. అతని కళ్ళల్లో అహంకారం, అతని నవ్వులో లేకిగా కనిపిస్తున్న పురుషతత్వం... నాకు చిర్రెత్తించాయి. నేనతన్ని దీర్ఘంగా చూస్తూ, 'ఐ యామ్ ఫిజికల్లీ ఫెమినైన్, బట్ యు ఆర్ మెంటల్లీ ఫెమినైన్' అన్నాను. అతని రియాక్షన్‌కి ఎదురు చూడకుండా, పెట్టె తీసుకుని ట్రైను దిగి నిలబడ్డా...ఎటెండెంట్ పరిగెత్తుకొచ్చాడు.

‘మిమ్మల్ని ఎ.సి.లో వెదుకుతున్నానమ్మగారు’ అన్నాడు వగరుస్తూ.

ఎటెండెంట్ కళ్లలోకి చూశాను. ఏవిధమైన అహంకారం లేదు. వాడి ప్రవర్తనలో వినయం ఉంది. వాడి బాడీ లాంగ్వేజ్‌లో నమ్రత వుంది. వాడి కళ్లల్లో గౌరవం ఉంది.

వాడికి నా పెట్టె అందించి వాడి వెనకాలే నడుస్తూ కంపార్ట్‌మెంట్‌లోకి చూశా. మే ఐ హెల్ప్‌గాడు తెల్లబోయిన మొహంతో నన్నే చూస్తున్నాడు.

‘ఆడారి వెధవ’ అని నవ్వుకున్నాను. వెంటనే నాలుక కర్చుకున్నాను. నేనూ ఆడతనాన్ని తిట్టుగా వాడినందుకు ఆశ్చర్యపోయా!

ఫెమినిటి *(కథాపత్రిక (సంకలనం) నవంబరు 2002)*

# మండీ

చిన్నప్పుడు ఆటలు ఆడిన వాళ్ళందరికీ 'మండీ' అంటే తెలుస్తుంది. ఆటల్లో మండీ కొట్టడం, ఎదుటివాడు బోర్లాపడితే చప్పట్లు కొట్టడం సహజం. కాని ఆటల్లో ఒకడు ఒకణ్ణే మండీ కొట్టగలడు. ఒకడు పదిమందిని మండీ కొట్టాలంటే వాడు ప్రత్యేకమైన వాడై ఉండాలి.

చీఫ్ ఇంజనీరు రావు గారు అలాంటి ప్రత్యేకమైన వ్యక్తి అనదగ్గ మనిషి. ఈయన చీఫ్ గుణం లౌక్యం. రావుగారి లౌక్యం ముందు రామప్ప పంతులు, ఏనుగు ముందు దోమలా కనిపిస్తాడు. నా లాంటి ఏ కొద్దిమందికో ఆయన లౌక్యం మండీలాగ, ఆయన పవర్‌ని పెళ్ళాడిన చాముండేశ్వరిలా కనపడతారు.

ఆ రోజు రావుగారు అతి ముఖ్య విషయంపై కొలువు తీరారు. ఆయనకి ఎదురుగా కూర్చున్న ఆదివాసులు అమృతం కోసం కాసుకు కూర్చున్న రాక్షసుల్లా, వాళ్ళని చిరునవ్వుతో పరికిస్తున్న రావుగారు అమృతం పంచే మోహిని అవతారంలా ఉన్నారు. ఆయనకి పక్కగా మధుసూదనరావు అమృతం ఎవరికి వెళుతుందో అని ఆలోచనలో పడ్డ దేవేంద్రుడిలా దొంగ వేషంలో దేవతలలో దూరిపోయిన రాహువులా ఉన్నాడు.

ఆదివాసులకి మధ్యగా కూర్చున్న ఒక ఆడకూతురు చెక్కిన శిలా విగ్రహంలా ఉన్నా, ఉలిదెబ్బలు తిన్న బాధతో, దుష్యంతుడు తిరస్కరించిన శకుంతలలా దీనంగా కనిపిస్తోంది.

దుష్యంతుడికి ఫేమిలీ ప్లానింగ్ ఆపరేషన్ సర్టిఫికేట్ దొరకలేదు కాని, మధు సూదనరావుకి ఆ లోటు లేదు. తాను ఫేమిలీ ప్లానింగ్ ఆపరేషను చేయించుకున్నానని, ఆదివాసి ఆడ కూతురుకు గర్భం చేయడానికి తాను అశక్తుడినని, ఆ విధంగా తాను నిర్దోషినని రావుగారికి సర్టిఫికేటు సహితంగా విన్నవించుకున్నాడు.

ఆదివాసి ఆడ కూతురు విన్నపాలు మరొకలా ఉన్నాయి.

మధుసూదనరావు మా ప్రాజెక్ట్‌లో సూపర్‌వైజరు. అతని పని లేబర్‌ని వేసుకోవడం, వాళ్ళకి వారి వారి పనులు పురమాయించడం, వాళ్ళ హాజరుపట్టీ మెయిన్‌టైన్ చేయడం మొదలైనవి.

అతనికి స్వతహాగా స్వతంత్ర ఆలోచనలు ఉన్నాయి. హాజరుపట్టీ భేతాళ మాంత్రికుడు చేతిలో దండం లాంటిదనీ, దానితో బెమ్మిని తిమ్మి, తిమ్మిని బెమ్మి చేయగలిగే పవరు తనకి సంక్రమించిందనీ అనుకునేవాడు.

ఆ కొంచెం అహంకారం తప్పితే మధుసూదనరావు సహజంగా చాలా మంచివాడు. గురివింద గింజకి నలుపు ఉన్నట్లు మన మంచివాడికి ఆడదాని పట్ల చిన్న బలహీనత.

మధుసూదనరావుకి ఆడది ఆపిల్ ముక్కలాగో, కురిడీ చెక్కలాగో కనిపిస్తుంది. ఆపిల్ ముక్కల్నీ, కురుడీ చెక్కల్నీ కొరికితేనే అందమంటాడు. ఏ ఆదివాసి ఆడకూతురైనా, ఆపిల్ చెక్కలాగో, కురిడీ ముక్కలాగో కనబడితే ఆ ఆడకూతురు డ్యూటీ గెస్టు హౌసులో పడేది.

గెస్టు హౌసులో డ్యూటీ అంటే కూజా కడగడం, నీళ్ళు పెట్టడం, టేబులు సర్దడం, అద్దం తుడవడం, పక్కలు మార్చడం, శుభ్రంగా వరండాలో తొంగోడం.

గెస్టు హౌసులో ఉద్యోగం చాలా రెస్టుగా, ఉంటుంది. గెస్టు హౌసు చాలా ప్రత్యేక స్థానం. దాంట్లో పనికి కుదరాలంటే ముందు మధుసూదనరావు కంటికి నదురుగా కనిపించాలి. అటుపైన వయసు పాతికలోపు ఉండాలి. పని చేయాలనుకున్న దానికి పెళ్ళి కారాదు. మధుసూదనరావు ఏ పారాచికాలాడినా చిరాకు పడకూడదు. ఇన్ని క్వాలిఫికేషన్స్ సరిగ్గా సరిపోయాయో లేదో చూసి, ఆడకూతుర్లకి గెస్టు హౌస్‌లో డ్యూటి వేసేవాడు మధుసూదనరావు.

గెస్టుహౌసులో డ్యూటీకి ఏ ఆడకూతుర్నైనా నియమిస్తే రోజూ మధ్యాహ్నం గెస్టు హౌసు ఇన్‌స్పెక్షన్‌కి వెళ్ళేవాడు.

ఇన్‌స్పెక్షన్ ఒక్కొక్కరోజు అయిదు నిమిషాలే ఉండేది. ఒక్కోరోజు రెండు గంటల వరకూ ఉండేది.

ఇన్‌స్పెక్షన్ అయిదు నిమిషాలు ఉన్న రోజు గెస్టు హౌస్‌లో డ్యూటీ ఆడకూతురు డ్యూటీ మారిపోయేది. అంటే సరసాల వరకూ ఒప్పుకున్న ఆడకూతురు ఎడ్వాన్స్‌మెంట్‌కి ఒప్పుకోలేదన్నమాట! అలాంటి ఆడకూతురు మధుసూదనరావుకి అక్కర్లేదు, రాళ్ళు కొట్టడానికి వెళ్ళేది.

ప్రస్తుతం కొలువుకు కారణమైన ఆదివాసి ఆడకూతురు రూంలో మొదట్లో మధుసూదనరావుకి ఆపిల్ ముక్కలాగో, కురిడీ చెక్కలాగో కనబడి ఉంటుంది. వెంటనే గెస్టు హౌస్‌కి డ్యూటీ వేసేశాడు.

ఒక అయిదు రోజులపాటు షవరు కింద స్నానాలు, ఎవరు చూడకుండా డబుల్ కాట్ మీద పడకలు సాగించి, ఒంటికి నునుపు, మొహంలో అందాలు సంతరించుకుంది.

ఈ ఆడకూతుళ్ళ మనస్తత్వం మధుసూదనరావుకి బాగా తెలుసు. అయిదు రోజుల్లో ఝూలోలో వచ్చిన వచ్చిన మార్పు పసిగట్టాడు. ఆరో రోజు గెస్టు హౌసు పనే కదా అని నెమ్మదిగా లేటుగా వచ్చింది.

మధుసూదనరావు మందలింపుగా "ఏమిటి? ఇవాళ ఆలస్యంగా వచ్చావు? గెస్టు హౌసులో ఈ రోజు పని లేదు. క్వారీలో మనుషులు తక్కువగా ఉన్నారు. ఆ తట్ట తీసుకుని క్వారీకి వెళ్ళు'' అన్నాడు.

ఝూలోకి ఇష్టం లేకపోయినా తట్ట తీసుకుని క్వారీకి వెళ్ళింది.

స్వర్గానికి వెళుతున్న ధర్మరాజుకు ఒక్క రోజు నరకం చూపించినట్టు ఝూలో క్వారీలో నలభై డిగ్రీల ఎండ వేడిలో రాళ్ళు మోస్తూ మధుసూదనరావు వంశాన్ని తిట్టని తిట్టు తిట్టకుండా అష్టోత్తర శతనామాల్లో తిట్టింది.

మర్నాడు సరిగ్గా టైముకి డ్యూటీలోకి వచ్చిన ఝూలోని "గెస్టు హౌసులో పనుంది! గెస్టు హౌసుకి వెళతావా? లేక క్వారీకి వెళతావా?'' అని అడిగాడు మధుసూదనరావు నవ్వుతూ.

"గెస్టు హౌసుకి'' అంది ఝూలో.

ఝూలోకి గెస్టు హౌసు డ్యూటీ వేశాడు మధుసూదనరావు. ఆరోజే గెస్టుహౌస్ ఇన్‌స్పెక్షన్‌కి కూడా వెళ్ళాడు.

మధ్యాహ్నం పన్నెండైందేమో, గెస్టు హౌసు అంతా శుభ్రం చేసి విరామ సమయంలో ఎవరూ రారని నిశ్చయించుకున్న ఝూలో బాత్రూంలో దూరి స్నానం చేస్తోంది.

గెస్టు హౌస్‌కు రెండు దారు లున్నాయి. ఒకటి అందరూ ఉపయోగించేది. రెండోది వెనుక పక్క నుండి తోటీలు వచ్చి పాయిఖానా మొదలైనవి శుభ్రం చేయడానికి ఉపయోగించేది. వెనుక తలుపు తాళం ఎప్పుడూ మధుసూదనరావు దగ్గరే ఉంటుంది. ఎవరైనా అతిథులు వస్తున్నారని తెలిస్తే ఆ తాళం తీసి అన్నీ శుభ్రం చేయించి ఆ తాళం తనదగ్గరే పెట్టుకునేవాడు. వెనుక తలుపుకు లోపలి నుంచి గొళ్ళెం కూడా లేకుండా చేశాడు.

ఆ రోజు మధుసూదనరావు వెనుక తలుపుగుండా లోపలికి ప్రవేశించేసరికి, ఝూలో చీర, జాకెట్టు, బ్రా, లంగా సమస్తం గదిలోని మంచం మీద ఉన్నాయి. ఝూలో కూనిరాగం తీస్తూ షవరు కింద స్నానం చేస్తోంది.

గదిలోకి వచ్చిన మధుసూదనరావు చీర, జాకెట్టు మొదలైనవన్నీ తీసి మడతపెట్టి, దిండుకిందపెట్టి ఆ మంచం మీదే పడుకున్నాడు. స్నానం పూర్తిచేసి ఝూలో పరధ్యాన్నంగా గదిలోకి అడుగుపెట్టి మధుసూధనరావు చూసి అవాక్కయిపోయింది. అంతలోనే తను నగ్నంగా ఉన్నానని గుర్తుకొచ్చి పరుగెత్తుకెళ్ళి బాత్రూంలోకి దూరిపోయింది.

మధుసూధనరావు ఎదురుగా మెరుపు మెరిసినట్టయింది. ఆమె శరీరంపైని నీటిబొట్లు నల్లటి రాతి చెక్కడంపైన ముత్యాలు అంటించినట్లు ఉన్నాయి. ఆమె కదలికలో యౌవనాన్ని మోస్తున్న భారం కనిపించింది.

మధుసూధనరావు ముందుగా ఆశ్చర్యం నుంచి తేరుకున్నాడు.

"బయటికి రా!'' అన్నాడు.

"చీర !....'' అంది తడబడుతూ ఝూలో.

చీర విషయం ఎత్తలేదు కాని, మధుసూధనరావు "ఇలా చెయ్యొచ్చా? తప్పు కదూ. ఎవరైనా వస్తే నా ఉద్యోగం ఏం కాను?'' అన్నాడు.

ఝూలో నుంచి సమాధానం లేదు. ఏడుస్తోంది.

"ఏడు పెందుకు? బయటకు రా ఎవరికీ చెప్పనులే!'' అని మళ్ళీ పిలిచాడు లాలనగా.

కాని ఝూలో బయటికి రాలేదు. సగం తెరిచి ఉన్న బాత్రూం తలుపు తీసి ఝూలోని హృదయానికి అద్దుకుని, మెల్లిగా బయటికి తీసుకొచ్చి మంచం వేపు నడిపించాడు.

మధుసూదనరావు శృంగార గాథ ఎన్నడూ శ్రుతి మించలేదు. కాని ఝూలోలోని ఆకర్షణ మధుసూదనరావుని బాగా ఆకట్టుకుంది. కథ చాలా దూరం పోయి ఝూలో గర్భవతి అయింది. సమయం కోసం వేచి చూస్తున్న ఆదివాసులు ఇదే అదనుగా మధుసూదనరావు ఇంటిమీద దాడి చేశారు. కాని రావుగారు కలుగజేసుకోవడంతో పంచాయతీలో చర్చించడానికి ఒప్పుకున్నారు.

ఆడకూతుర్ని అనుభవించడం, కడుపు రావడం రావుగారికి వింతేమీ అనిపించలేదు. కాని ఆ ఆడకూతురు పాతివ్రత్య వ్రతం ఎందుకు స్వీకరించిందా అని ఆశ్చర్యం వేసింది.

ఆ ఆడకూతుళ్ళకి ఏది ఉంటాయన్నా ఒప్పుకుంటారు గాని, శీలం శిలలా ఉంటుందంటే ఒప్పుకోరు - అది ఆయన సిద్ధాంతం. ఇక్కడ రావుగారు తన సిద్ధాంతం వల్లిస్తే పెద్ద రాద్ధాంతం జరుగుతుంది.

అసలే ఆదివాసులు మధుసూదనరావును నరికేస్తామని గొడ్డళ్ళు, కర్రలు, కత్తులు పటుకొచ్చారు. మధుసూదనరావు రాహువు అయినా, కేతువు అయినా అమృతానికి అర్హుడు. అలాంటివాణ్ణి ఆదివాసి ఆడకూతురుకి అప్పగించడం ఎలా? అప్పగించకపోతే, న్యాయం జరక్కపోతే, ఎలుగొడ్డు తేనె పట్టులో తేనె పీల్చినట్టు ఆదివాసులు మొత్తం ఇరిగేషన్ డిపార్టుమెంటునే పీల్చేస్తారు. ఈ పరిస్థితిలో చీఫ్ ఇంజనీరుగా తన పెద్దరికం నిలబెట్టుకోవడం కోసం మధుసూదనరావుని ఆదివాసి ఆడకూతుర్ని పెళ్ళాడమనడం చాలా దారుణం. రావుగారికి మధుసూదనరావు మీద జాలేసింది. ఆ జాలిని తనలోనే అణుచుకుని ఆదివాసి పెద్దని దగ్గరగా రమ్మన్నట్టుగా సైగ చేశారు.

ఆదివాసి పెద్ద లేచి వినయంగా దగ్గరికి వచ్చి చేతులు కట్టుకుని చెప్పడం మొదలుపెట్టాడు.

"బాబూ! ఏడాది క్రితం ఇక్కడ ఏదో పెద్ద కట్ట కడతారంటే సంతోషించాం. ఎందుకు? కూలి దొరుకుద్ది అని. అడవుల్లో పడి బతికే మాకు జీవితంలో ఒక క్రమం ఏర్పడద్దని ఆశించాం: అంతేకాని మా ఆడ కూతుళ్ళని పడుకోబెట్టడానికి కాదు. భయపెట్టి,

బామాలి మా ఆడకూతుళ్ళని పక్కలోకి ఈడ్చిన ఈయన, కడుపు రాగానే పక్కకు తప్పుకున్నాడు. ఆ ఆడకూతురికి దిక్కేది? దాని వల్ల మా కులానికి ఎంత పెడ్డ పేరు? ఈ ఒక్క ఆడకూతురు మొత్తం కులానికి అగ్గెట్టేసింది. మా కుల గౌరవం నిలబడాలంటే మా ఆడకూతురు మీద చెయ్యేసిన ఆయన్ని మేం నరకాల, లేదా ఈ ఆడకూతుర్ని ఆడు మనువాడాల. ఆ బాబు మనువా - అని ఆశ్చర్యపోయాడు. దాని పక్కలో పడుకున్న సుఖం, మనువాడాక ఉండదు కాబోలు. ఆ బాబుని మా కప్పచెప్పేసినా సరే! లేదా మనువుకి ఆ బాబు ఒప్పేసుకున్నా సరే, మీరు పెద్దలు నాయం చెప్పగలరని ఇంతవరకూ ఆగాం.''

రావుగారు ఏం చెప్పగలరు? మధుసూదనరావుకి కడుపు చేసే హక్కు ఉందని చెప్పగలరా? లేక మధుసూదనరావుని ఝూలోని పెళ్ళి చేసుకోమని చెప్పగలరా? అలా చెపితే ముందుముందు రోజూ పంచాయతీ చెయ్యవలసిన అవసరం ఉంటుంది. రావుగారి దృష్టిలో తమది మండీ కొట్టే వర్గం, వాళ్ళది మండీ కొట్టించుకునే వర్గం. తన వర్గం వాడైన మధుసూదనరావు ఆడకూతురికి మండీ కొట్టేడంటే ప్రకృతి సహజం. దాన్ని ఎవరూ ఖండించలేదు. కాని ఈ తెలివి తక్కువ వెధవ మండీ కొట్టి దొరికిపోయాడు. వీళ్ళకి ఏ సమాధానం, ఏ న్యాయం చెపితే వీళ్ళు ఆగుతారో ఆయన లోపలి లౌక్యానికి తెలుసు.

ఆయన మొహం ప్రశాంతంగా చేసుకుని గొంతు సవరించుకుని గంభీరంగా ఇలా అన్నారు. "ఎంత పని జరిగింది! చేతిలో పవరు ఉంది గదా అని అభం శుభం తెలియని ఆడకూతుర్ని పాడుచేయడం (మండీ కొట్టడం) నాకు చాలా బాధ కలిగిస్తోంది. ఎక్కడి నుంచో ఉద్యోగం చేసుకోవడానికి ఇక్కడి కొచ్చి, మీ గ్రామంలో మీ ఆడకూతుర్ని అవమానించడం సహించరాని విషయం! మీరు ఇంత ఆవేశంగా ప్రవర్తించారంటే అందులో వింతగా అనిపించే విషయం ఏమీ లేదు. నా మాట మన్నించి మీరు శాంతంగా ప్రవర్తించినందుకు నా కెంతో సంతోషంగా ఉంది. - ఆవేశాల వల్ల ఎవరికీ న్యాయం జరగదు. ఆడకూతురికి నెల తప్పింది అంటున్నారు. మధుసూదనరావు 'పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్నాను' అంటున్నాడు. కాని ఇలాంటి సర్టిఫికేట్ల విషయం మీ కన్నా నాకు బాగా తెలుసు. డబ్బు పారేస్తే ఎక్కడైనా దొరుకుతాయి.

సభలో నవ్వులు.

"అందుకని ఇతని సర్టిఫికేటు విషయం అలా ఉంచి, ఇతన్ని ప్రత్యేకంగా పరీక్ష చేయడానికి డాక్టరు దగ్గరికి పంపుతాను'' అన్న ఆయన సందేశం ముగియనే లేదు.

రెండు జీపుల్లో పోలీసులు దిగారు. వాళ్ళ చేతిలో తుపాకులు, లాఠీలు ఉన్నాయి. వాళ్ళు శాంతిభద్రతలని కాపాడటానికే వచ్చారు. వాళ్ళ రాక ఆదివాసులకే కాక, ఇరిగేషన్ డిపార్ట్‌మెంటుకి కూడా చాలా ఆశ్చర్యం కలిగించింది. - ఒక్క రావుగారికి తప్ప! రావుగారు

లేచి వెళ్ళి పోలీసు ఇన్‌స్పెక్టర్ని సాదరంగా ఆహ్వానించి తీసుకొచ్చి కుర్చీలో కూర్చోపెట్టారు.

"మధుసూదనరావు సర్టిఫికేటు అబద్ధమని రుజువు చేయాలంటే అతన్ని పోలీసు ఇన్‌స్పెక్టర్‌తో పరీక్షకి పంపుతాను. మీరు పోలీసు స్టేషన్‌లో మధుసూదనరావు మీద కేసు పెట్టండి. ఆవేశంలో మధుసూదనరావుని మీ రేదైనా చేస్తే, మిమ్మల్ని మీరు ఇబ్బందుల్లో పెట్టుకున్నట్టే! ఆ పని చేయడానికి పోలీసు లున్నారు. అది వారి బాధ్యత" అన్నారు రావుగారు.

ఆదివాసులకి పరిస్థితి అర్థమైంది. రావుగారు తమకు న్యాయం చేస్తున్నారని నమ్మాలి. లేకపోతే పోలీసులు తుపాకులు చూపించి నమ్మింపజేస్తారు.

రావుగారు బలవంతపెట్టి ఆదివాసి పెద్ద దగ్గర రాత పూర్వకంగా రిపోర్టు రాయించి స్వంత చేతులతో ఇన్‌స్పెక్టర్‌కి ఇచ్చారు.

ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావుని జీపు ఎక్కించి టౌనుకు తీసుకుని వెళ్ళిపోయాడు. బోర్లపడిన ఆదివాసులు మెల్లగా గ్రామంలోకి వెళ్ళిపోయారు. ఆ రాత్రే మరో పోలీసు జీపులో మధుసూదనరావు ఫేమిలీ టౌను వెళ్ళిపోయారు. మధుసూదనరావుకి ఇంకోచోటికి ట్రాన్స్‌ఫర్ అయిపోయింది.

రావుగారు ప్రాజెక్ట్ పనిలో 'బిజీ' అయి ఎవర్నీ కలవడం లేదు.

మధుసూదనరావు ఒక్క ఆడకూతురుకి మండీ కొడితే, రావుగారు మొత్తం గ్రామానికే మండీ కొట్టారు.

అంటే పదవి పెరిగే కొద్దీ మండీ కొట్టే చురుకుదనం పెరుగుతుంది.

మండీ *(ఆంధ్రప్రభ, 2-8-1989)*

# ది ఫ్రూండ్

సిలికాన్ ఇండియా వర్కర్స్ యూనియన్ ఆఫీసులో వెనగ్గా వున్న గదిలో, ఎనిమిది మంది కార్యవర్గ సభ్యులూ కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్నారు. వాళ్ళకి తెలిసిన ఇన్ఫర్మేషను, ఏమంత వుత్సాహకరంగా లేదు. అందుకే సమావేశమయ్యారు. సమస్యకి ఏదైనా కొత్త తరహా పరిష్కారం వుందా? అన్న ఆలోచనలో పడ్డారు.

సిలికాన్ ఇండియా లిమిటెడ్ హైదరాబాద్‌కి దూరంగా వున్న చిన్న కంపెనీ. ఎలక్ట్రానిక్స్ పార్ట్స్ తయారుచేసే ఈ కంపెనీని, పదేళ్ళక్రితం ఖన్నా అనే ఓ పంజాబీ స్థాపించాడు. ఖన్నాకి దేశంలో వివిధ ప్రదేశాల్లో చాలా కంపెనీలు వున్నాయి. అన్ని కంపెనీల్లాగా ఈ కంపెనీ కూడా మంచి లాభాలు గడిస్తోంది. రమేష్‌చంద్ర ఈ కంపెనీకి ఎక్జిక్యూటివ్ మేనేజర్. ఎక్జిక్యూటివ్ మేనేజరు, మరికొంతమంది ఇంజనీర్స్‌ని వదిలేస్తే, ఈ కంపెనీలో వో రెండువందలమంది టెక్నీషియన్స్, వో వందమంది ఫోర్త్ గ్రేడు స్టాఫూ పనిచేస్తున్నారు. కంపెనీ టౌనుకి దూరంగా వుండడం వలన కంపెనీ కాంపౌండ్‌లోనే మూడు వంతుల దాకా క్వార్టర్స్. కోపరేటివ్ సొసైటీ స్టోర్స్, మొదలైన కనీస సదుపాయాలు చేసింది మేనేజిమెంటు, దాదాపు తొంభైశాతం వర్కర్స్ క్వార్టర్స్ లోనే కాపరం వుంటున్నారు. అక్కడే ఒక క్వార్టర్ని చిన్నమార్పుచేసి యూనియన్ ఆఫీసుగా చేసారు.

అందరి బిజినెస్ మేగ్నెట్స్‌లానే ఖన్నాకి అనేకమైన కలలు వున్నాయి. ఈ కంపెనీని మల్టీనేషనల్ కంపెనీగా తయారుచేద్దామని, దీనిపేరు ప్రపంచంలో మార్మోగిపోయేటట్టు చేద్దామని. గ్లోబులో దీనికో శాశ్వతస్థానం కల్పిద్దామనే, అతని కలలకీ కంపెనీ లాభాలకీ ఎక్కడా పొంతనకుదరటం లేదు. ప్రతీ ఐదేళ్ళకి జీతాలు పెంచమనే పనివాళ్ళతో, ధరలు పెరిగాయి. డి.ఎ. పెంచమనే కంపెనీ స్టాఫ్‌తో... వుల్లిపాయ మార్కెట్లో కనబడకపోతే గిలగిల్లాడిపోయి, ప్రభుత్వం మీద కినుక వహించే ఈ మధ్య తరగతి మందభాగ్యులతో, ఆయనకి కొంత చిరాకు కలిగినమాట వాస్తవమే !

ఆయన చిరాకుకు పరాకు చెయ్యడానికా, అన్నట్టు టెక్నీషియన్స్, ఫోర్త్ గ్రేడు స్టాఫూ కలిసి చిన్న యూనియన్ పెట్టుకున్నారు. ఆ యూనియన్ సభ్యుడికో డెసిబెల్స్ చొప్పున మూడు వందల డెసిబెల్స్ శబ్దంతో కార్మికుల కష్టాల్ని యజమాని చెవివరకూ చేరుస్తుందని వర్కర్స్ ఆశ! కాని నిప్పంటుకున్న హనుమంతుడి తోక లాంటి యూనియన్ అంటే యాజమాన్యానికి బాధే! మార్కెట్లో రూపాయి విలువ పడిపోయి ధరపెరిగినప్పుడల్లా, మేనేజిమెంటు తలుపుతట్టి కనీసం ముద్దదిగడానికి, మేనేజిమెంటు పెంచే కరువుభత్యం అత్యవసరమని గోలపెట్టే యూనియన్, కంపెనీ ప్రగతికి అడ్డు వస్తోందనే యాజమాన్యం ఆలోచనకీ ఎక్కడా పొంతన కుదరటం లేదు.

వీటన్నింటిలో భాగంగానే రెండు నెలల క్రిందట కంపెనీలో జనరల్ స్ట్రయిక్

జరిగింది. కొత్త స్కేళ్ళు ఇవ్వాలని, మెడికల్ ఎలవెన్స్ ఇవ్వాలనీ వో పదహారు కోర్కెలని కోరింది. యాజమాన్యం వాటిని తిరస్కరించడంతో పని ఆపేయడం మినహా మరో దారి లేదనుకుని హర్తాళ్ చేసింది. సమ్మె చేసిన వర్కర్స్‌ని చాలా రోజులు వుపేక్షించిన యాజమాన్యం ఎక్జిక్యూటివ్ మేనేజర్, రమేష్ చంద్రకి అనుమతి ఇచ్చింది. రమేష్ చంద్రతో ఒప్పందం కుదుర్చుకుంది యూనియన్, అంతా సుఖాంతమే అయింది అనుకున్నారు అందరూ! కాని!!!

*　　*　　*

"వాళ్ళు పెట్టిన షరతులన్నీ ఒప్పేసుకుంటే, అది ఒప్పందం ఎలా గయిందయ్యా" అన్నాడు కంపెనీ యజమాని ఖన్నా.

"వాళ్ళకోర్కెలన్నీ కనీసమైనవేనండి, మిగతా కొన్ని కంపెనీలు, ఆ సదుపాయాలు కలుగు చేస్తున్నాయి" అన్నాడు రమేష్ చంద్ర.

"నేను నిన్ను ఒప్పందం చేసుకోమన్నాను గానీ వాళ్ళ షరతుల్ని, కోర్కెల్నీ ఒప్పేసుకోమనలేదు" అన్నాడు ఖన్నా.

"ఒప్పదం అంటే వాళ్ళ కనీస కోర్కెల్ని మనం వొప్పుకోడం, వాళ్ళు వెంటనే సమ్మె విరమించి పనిలోకి వచ్చి, మళ్ళీ అయిదేళ్ళవరకూ కంపెనీలో ఎటువంటి సమ్మె జరగదనీ హామీ ఇవ్వడం అనుకున్నానండి. ఆ విధంగానే ఒప్పందం మీద సంతకాలు చేసామండి" అన్నాడు రమేష్ చంద్ర.

"మళ్ళీ ఐదేళ్ళ తర్వాత ఈ తలనొప్పి వుందన్నమాట. వాళ్ళ కోర్కెలన్నీ వొప్పుకున్న తర్వాత వాళ్ళని పనిలోకి పిలవనక్కరలేదు వాళ్ళే పరిగెత్తుకొస్తారు" అన్నాడు ఖన్నా.

"మరిప్పుడెలాగండి" అన్నాడు రమేష్ చంద్ర.

"ఈ వొప్పందాన్ని జాగ్రత్తగా సేఫ్‌లో దాచు. కోర్కెలు అమలుచేస్తామన్నాము గాని, ఎప్పట్నుంచో చెప్పలేదుగా. అమలుపర్చడాన్ని దాటెయ్యి".

"అదెలాగండి యూనియన్ వాళ్ళు వొప్పుకోవద్దూ" రమేష్ చంద్ర డౌటు

"ఎలాగోలా సర్దిచెప్పుకో, మూడొందలమందికి చెప్పడం కష్టంగాని, వోపది మందికి (ఎక్జికూటివ్ మెంబర్లకి) చెప్పడం తేలిక" అన్నాడు ఖన్నా.

రమేష్‌చంద్ర ఏదో చెప్పబోయాడు, కాని ఖన్నా తనింకేం వినవలసింది లేదు అని లేచి వెళ్ళిపోయాడు.

*　　*　　*

రమేష్‌చంద్రకి యాజమాన్యానికి మధ్య ఏం జరిగిందో, యూనియన్ వాళ్ళకి తెలియలేదు. కాని వొప్పందం అమలులోకి రావడం లేదని జాప్యం జరుగుతోందని

అర్థం అయ్యింది.

ఇదుగో అదుగో అనే దోబూచుల మధ్య నెలరోజులు గడిచాక, యూనియన్ వాళ్ళకి అనుమానం వచ్చి కూపీలాగడం మొదలుపెట్టిన మరో నెలరోజులకి అసలు విషయం పక్కాగా తెలిసింది.

అందుకే ఆరోజు యూనియన్ ఆఫీసులో సమావేశం జరిగింది. యాజమాన్యం వొప్పందం అమలు జరపని పక్షంలో ఏం చెయ్యాలి? అమలుచేస్తున్నామనిగాని, అమలు చెయ్యమనిగాని చెప్పని యాజమాన్యాన్ని ఎలా అంచనా వెయ్యాలి? రెండు నెలల క్రితమే హర్తాళ్ జరిగింది. మళ్ళీ హర్తాళ్ అంటే వర్కర్స్ వొప్పుకుంటారా? తీరా హర్తాళ్ మొదలుపెట్టాక ఇదిగో వొప్పందం అమలు పరిచాం, తొందరపడి హర్తాళ్ చేసారు అంటూ యూనియన్‌వాళ్ళలో కొందరిమీద యాక్షన్ తీసుకోవచ్చు. అదొక్కటే కాదు, మళ్ళీ హర్తాళ్ చెయ్యాలంటే, ఎంత ప్రిపరేషను వుండాలి అన్న విషయాన్ని చర్చించిన యూనియన్ కార్యవర్గసభ్యులకి ఏవిధంగా యాజమాన్యం మీద వొత్తిడి తెచ్చి వొప్పందం అమలులోకి తెచ్చేటట్టు చెయ్యాలో తెలీక బుర్రలు వేడెక్కి పోయాయి.

ఆ సమయంలో కార్యవర్గసభ్యుల్లో చిన్నవాడైన దివాకర్ 'ఫాస్ట్ అన్‌టు డెత్ చేస్తేనో' అన్నాడు.

కార్యవర్గ సభ్యులందరూ అతని వేపు చూసారు.

"ఫాస్ట్ అన్ టు డెత్ అంటే నీ వుద్దేశం'' అని అడిగాడు యూనియన్ ప్రెసిడెంట్.

"మనం వర్కు ఆపద్దు. హర్తాళ్ చెయ్యద్దు. మన కోర్కెల వొప్పందాన్ని అమలు చెయ్యాలని కోరుతూ, మన యూనియన్‌లో వొకడు ఆమరణనిరాహార దీక్ష మొదలుపెడితే, ఈ విషయం మిగతా యూనియన్లకి తెలిసి, అవి మనకి మద్దతు నిస్తాయి. దానితో మనం యాజమన్యంమీద వొత్తిడి తీసుకొచ్చినట్టూ వుంటుంది. మిగతా వర్కర్స్‌ని మళ్ళీ అనవసరమైన రిస్కులో పెట్టినట్టూ వుండదు. మన లక్ష్యం కూడా నెరవేరుతుంది.'' అన్నాడు.

ఆ ఐడియా అందరికీ నచ్చినట్లే అనిపించి "నీ ఆమరణ నిరాహార దీక్ష అయిడియా బాగానే వుంది. కాని అది చెయ్యడానికి ఎవరు ముందుకి వస్తారు'' అన్నాడు యూనియన్ ప్రెసిడెంటు.

అలాంటి ఎక్జిక్యూటివ్ సమావేశాల్లో ఏదేనా సలహ చెప్పడం అంటే, ఆపని తను చెయ్యడానికి సిద్ధంగా వున్నప్పుడే, అలాంటి సలహా చెప్పాలి. ఆ విషయం గత నాలుగేళ్ళుగా దివాకర్‌కి బాగా అర్థం అయింది. దివాకర్ బాధ్యతలు తీసుకొని వాటిని శ్రద్ధగా నిర్వర్తించడం వలనే అతనికి అతిస్వల్పవ్యవధిలో కార్యవర్గంలో స్థానం లభించింది.

"నేను అందుకు సిద్ధం'' అన్నాడు దివాకర్.

ఆమరణ నిరాహార దీక్ష విషయం విస్తృతంగా చర్చించడానికి, ఆ విషయంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోడానికి, యూనియన్‌లో మరికొంత మంది ప్రముఖులతో మర్నాడు సమావేశం అవుదామని తీర్మానించుకుని, ఆ రోజు మీటింగు ముగించారు కార్యవర్గసభ్యులు.

* * *

మీటింగ్ నుండి బయటికి వచ్చిన దివాకర్, యూనియన్ సెక్రటరీ చౌదరి, ఇద్దరూ నడిచి యూనియన్ ఆఫీసుకి దూరంగా వున్న టీ కొట్టుకి వెళ్ళి, బెంచీలమీద కూర్చుని, టీకి ఆర్డరు ఇచ్చారు.

"నువ్వు ఈ విషయం శాంతితో చెప్పు. ఆమె ఏం అంటుందో చూడు'' అన్నాడు చౌదరి. శాంతి దివాకర్ భార్య. దివాకర్ శ్రీకాకుళం పాలిటెక్నిక్‌లో ఎలక్ట్రానిక్స్ డిప్లొమా చేసాడు. వెంటనే హైదరాబాద్‌లో వుద్యోగం వచ్చింది. రెండేళ్ళు అక్కడా ఇక్కడా చిన్న చిన్న వుద్యోగాలూ చేసి, ఈ సంస్థలో జాయిన్ అయాడు. వుద్యోగం వచ్చిన వెంటనే ఇంటిలో పెళ్ళిచేసేశారు. నాలుగేళ్ళ క్రితం కాపరానికి వచ్చిన శాంతికి ఇద్దరు పిల్లలు.

శాంతితో విషయం చెప్తే ఏమంటుంది? వద్దంటుందా? భయపడుతుందా? శాంతిని పుట్టింటికి పంపేసి తను నిరాహారదీక్షలో కూర్చోడం మంచిదేమో! అన్న అనేకమైన ఆలోచనలు వచ్చాయి దివాకర్‌కి. శాంతి చిన్నది. ఈ విషయం విని భయపడకుండా, శాంతికి తోడుగా శాంతి తల్లి తండ్రుల్నిగాని, తన తల్లిదండ్రుల్నిగాని ఇంటి దగ్గర్నుంచి పిలిపిద్దామంటే, వాళ్ళెవరికీ చదువులురావు. ఇలాంటి పరిస్థితుల్లో సహాయకార్లు వుంటారనిపించలేదు.

దివాకర్ ఆలోచనల్లో వుండగానే చౌదరి 'ఛాయ్' తాగడం పూర్తిచేసి, వెళదాం అన్నట్టు దివాకర్ చేతిని పట్టుకున్నాడు. చౌదరి స్పర్శతో ఈ లోకంలోకి వచ్చిన దివాకర్, చల్లారిపోయిన 'టీ'ని గొంతులో పోసుకుని, గ్లాసు ఇచ్చేసి జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించాడు. చౌదరి కూడా సిగరెట్ వెలిగించాడు. ఇద్దరూ మౌనంగా క్వార్టర్స్ వరకూ నడిచారు. దివాకర్ క్వార్టరులోకి వెళ్ళిపోతూ "శాంతితో చెప్తాను. వొక్కసారిగా చెప్తే బెంబేలు పడిపోతుంది.'' అన్నాడు. చౌదరి బుర్రవూపాడు.

చౌదరి దివాకర్ కన్నా పదేళ్ళు పెద్ద. ఇద్దరి అభిరుచులూ కలియడంవల్ల ఇద్దరూ నాలుగేళ్ళుగా మంచి స్నేహితులయ్యారు. ఈ నిర్ణయంతో చౌదరికి దివాకర్ మీద గౌరవం పెరిగింది.

* * *

దివాకర్ ఆమరణ నిరాహారదీక్ష చేస్తాడన్న వార్త శాంతికి ముందు అర్థం కాలేదు. అర్థం అయిన తర్వాత కళ్ళనీళ్ళు పెట్టుకుంది. దివాకర్ ఏం భయంలేదు. చౌదరి వున్నాడు.

మిగతావాళ్ళంతా వున్నారు, అంటూ ధైర్యం చెప్పాడు. అయినా శాంతి మనసు సమాధానపడలేదు. ముభావంగా వుంది.

"ఈ గొడవ అయేంతవరకూ ఇంటికి వెళ్ళివస్తావా?'' అన్నాడు దివాకర్. దివాకర్‌ని వదిలి ఇంటికి వెళ్ళడానికి మాత్రం శాంతి అంగీకరించలేదు. ఇవాళ దిగులుపడుతున్నా రేపటి కల్లా శాంతి మనసు కుదుట పడుతుందిలే అనుకున్నాడు దివాకర్.

* * *

యూనియన్ ఆఫీసు హాలులో ముప్పైమంది దాకా అనుభవజ్ఞులు సీనియర్ వర్కర్సు కార్యవర్గసభ్యులతో సమావేశం జరిగింది. పనిని ఆపకుండా వర్కర్స్‌లో ఎవరో వొకరు ఆమరణ నిరాహారదీక్ష చెయ్యడం, అన్న సలహా అందరికీ నచ్చింది. కాని ఏ వొక్కడో వర్కర్స్ నుండి నిరాహారదీక్షకి కూర్చోడం. కనకానికి నచ్చలేదు. కనకం చాల సీనియర్ ఫ్యాను. తానుకూడా నిరాహారదీక్ష చేస్తానన్నాడు. టెక్నికల్ స్టాపునుండి వొకరు, ఫోర్తుగ్రేడు స్టాఫ్‌నుండి వొకరు నిరాహారదీక్షకి కూర్చోడం అంటే అనుకున్న పని తొందరలో జరిగే అవకాశం వుందని యూనియన్ కార్యవర్గ సభ్యులకి అనిపించి, మర్నాడు కార్యవర్గ సమావేశంలో ఏ నిర్ణయం తీసుకుంటామని దానికి రమ్మనమని కనకాన్ని ఆహ్వానించారు. ఆరోజు మీటింగ్ ముగిసింది.

* * *

అనుకున్న ప్రకారం మర్నాడు సాయంకాలం యూనియన్ ఆఫీసులో మీటింగ్ జరిగింది. మీటింగ్ మొదలవుతుందనగా యూనియన్ ప్రెసిడెంట్ వచ్చాడు. మీటింగ్‌కి వచ్చిన సభ్యుల మొహాల్లో, వెలుగు కాని, చిరునవ్వులు కాని, పరస్పర పలకరింపులు కానీ లేవు. అందరి మొహాల్లో నెత్తురు గూడుకట్టి, వాళ్ళెంత కష్టమైన నిర్ణయాన్ని అమలు చేస్తున్నారో, అన్నది అర్థం అవుతోంది. అందులో ఎవరు నిరాహార దీక్ష చేస్తున్నారని కాదు ప్రశ్న. అందరూ దీక్షలో వున్నట్టే వున్నారు.

మీటింగ్ మొదలవగానే దివాకర్‌ని, కనకాన్ని చూసి పక్కగదిలో కెళ్ళి కూర్చో మన్నాడు ప్రెసిడెంట్. ఇద్దరూ లేచి పక్కగదిలోకి వెళ్ళి కూర్చున్నారు. దివాకర్ ఆ గదిలో వున్న పత్రికలు తీసి చదువుతూ కూర్చున్నాడు. కనకం మాత్రం బెంచీలు దగ్గరగా చేర్చి వాటిమీద పడుకున్నాడు.

ఏక్షన్‌ప్లాను తయారు చేయ్యడానికి, రెండు గంటలు పట్టింది. మీటింగ్ పూర్తవగానే చౌదరి లేచి వెళ్ళిపోయాడు. ప్రెసిడెంటు లేచి దివాకర్ వున్న గదిలోకి వచ్చాడు. "మీ ఇద్దరూ నిరాహారదీక్ష చేస్తున్నారు. రేపు ఆరుగంటలకి నిరాహారదీక్ష మొదలవుతుంది.'' అన్నాడు.

దివాకర్, కనకం ఆయన చెబుతున్న దాన్ని మౌనంగా విన్నారు. చౌదరి డాక్టరు

దగ్గరికి వెళ్ళాడు. డాక్టరు వచ్చాక అతని సలహా తీసుకుని మీరు వెళ్ళిపోదురుగాని అన్నాడు.

ఆరోజు మీటింగ్ అవగానే ఎక్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోలేదు. వాళ్ళకి వెళ్ళాలనిపించలేదు. అందరూ డాక్టరుకోసం ఎదురు చూస్తూ కూర్చున్నారు.

గంట తర్వాత చౌదరి డాక్టరుతో సహా వచ్చాడు. డాక్టరు వచ్చాక అతనికి యూనియన్ వాళ్ళు తమ నిర్ణయం చెప్పారు. డాక్టరు తలవూపి ఎవరు కూర్చుంటున్నారు నిరాహారదీక్షకి అని అడిగాడు. ప్రెసిడెంట్ దివాకర్ని, కనకాన్నీ చూపించాడు.

డాక్టరు ఇద్దరికీ బి.పి. తీసి, టెంపరేచరు చూసాడు. తర్వాత కడుపు చెక్ చేసాడు.

"నిరాహారదీక్షకి కూర్చునేముందు కడుపు ఖాళీగా వుంటే మంచిది'' అన్నాడు.

దానికేముంది రేపట్నించి మొదలుపెట్టేది. ఈ రోజునుండీ ఏమీ తీసుకోకుండా వుంటే మంచిది అన్నాడు కనకం తేలిగ్గా.

డాక్టరు కనకాన్ని వోసారిచూసి, "అది సరే నిరాహారదీక్షకి కూర్చునే టైముకి కడుపులో "ష్టూలు'' వుండకూడదు. అలా వుంటే అది గట్టిబడి తర్వాత చాలా ప్రాబ్లం క్రియేట్ చేస్తుంది'' అన్నాడు.

డాక్టరు సలహాని మౌనంగా విని తలవూపాడు దివాకర్. చౌదరి డాక్టర్ని దిగబెట్టుకుని వెళ్ళాడు.

మిగతా మెంబర్లు, దివాకర్ కనకం, అందరూ బైటికి వచ్చారు. యూనియన్ ఆఫీసుకి తాళం పడింది. ఎవరూ ఎవరితో మాట్లాడుకోడం లేదు. మౌనంగా విడిపోయారు. యూనియన్ ప్రెసిడెంట్ దివాకర్ భుజం మీద చెయ్యివేసి, నిట్టూర్పు విడిచాడు. తర్వాత కనకం చేతిని నొక్కాడు.

"రేపు ఉదయం అయిదు గంటలకి మీరిద్దరూ తయారుగా వుండండి'' అని చెప్పి వెళ్ళిపోయాడు, దివాకర్ కనకం ఎవరింటికి వాళ్ళు బయలుదేరారు.

చౌదరి డాక్టర్ని దిగబెట్టి, నిరాహారదీక్షకి కావలసిన సామాన్లు షామియానా, బెంచీలు, టార్పాలిన్లు తీసుకురావడానికి వెళ్ళాడు.

* * *

దివాకర్ ఒక్కడే నడిచి క్వార్టరు చేరుకున్నాడు. పిల్లలతో కాసేపు ఆడుకున్నాడు. శాంతి కూడా తను ఏదో పనిలో బిజీగా వున్నట్టు వంటింటిలోంచి బైటికి రాలేదు. శాంతి మౌనం దివాకర్ అర్థం చేసుకున్నాడు. కొద్దిసేపు పిల్లలతో ఆడుకుని "శాంతి ఇవాళ భోజనం చెయ్యను'' అని చెప్పాడు.

శాంతి కిచెన్‌లోంచే 'రేపటినుండీ నిరాహారదీక్షేమో' అంది.

రేపటికి ఇవాళిటికి తేడా ఏముంది? డాక్టరు ఈరోజు నుండి ఏమీ తినవద్దన్నాడు.

శాంతి మాట్లాడలేదు. కాసేపటితర్వాత కిచనులోనుండి "పాలు తాగండి. వేడిచేసి పాలు ఫ్లాస్కులో పోస్తాను. తాగండి'' అంది.

'మరి పిల్లలకో' అన్నాడు.

"పర్వాలేదు. వొక్క రోజే కదా ఎలాగోలా గడుపుతాం రేపు....'' ఇంకేదో అనబోయింది. గొంతు గాద్గదికంగా మారడంతో కళ్ళలో తిరిగే నీళ్ళని కనబడ నీయకుండా కిచెన్‌లోకి వెళ్ళిపోయింది.

కిచెన్‌లోకి వెళుతున్న శాంతిని దీర్ఘంగా చూస్తూ, మంచం ఎక్కి దిండుకానుకుని చేరగిలబడి ఆలోచనల్లోకి వెళ్ళిపోయాడు దివాకర్.

దివాకర్ ఆలోచనలకి భంగం కలిగిస్తూ కిచెన్ లోపలనుండి గ్లాసుతో వేడి పాలు తీసుకొచ్చి ఇచ్చింది శాంతి. పిల్లలకి భోజనం పెట్టి, తనింత తిన్నాననిపించి, ఫ్లాస్కుతో పాలు తీసుకొచ్చి టేబులు మీదపెట్టి మంచం ఎక్కి పడుతుంది.

దివాకర్ పడుకున్నా కలత నిద్రపోయాడు. పన్నెండు గంటలకి తెలివి వచ్చినప్పుడు ఫ్లాస్కులో పాలు తాగాడు. మళ్ళీ పడుకున్నాడు. గాఢంగా నిద్రపట్టలేదు. మళ్ళీ రెండు గంటలకి తెలివొచ్చింది. కళ్ళు పొడిపడిపోయాయి. నిద్రపోడానికి ప్రయత్నించినా నిద్రరాలేదు. లేచి లైటువేసి, మంచినీళ్ళు తాగాడు. పక్కమీద శాంతిని చూసాడు. శాంతి నిద్రపోతోంది. రాత్రి చాలా సేపటివరకూ శాంతి నిద్రపోలేదని, నిశబ్దంగా ఏడిచివుంటుందని, ఆమె బుగ్గలమీద కట్టిన చారికలు చెప్పకనే చెబుతున్నాయి. లైటు వెలుతురుకి తెలివొచ్చింది శాంతికి, మంచంమీంచి లేచింది. తన్నే చూస్తున్న దివాకర్‌తో "అప్పుడే తెల్లారిందా?'' అనడిగింది. శాంతికి వశం కాదు కాని సుమతిలా సూర్యోదయాన్ని ఆపేసి వుండేది.

"లేదు. రెండయింది పడుకో'' అని గదిలో లైటార్పేసాడు దివాకర్. పక్కగదిలోకి వెళ్ళి, లైటేసి పుస్తకం తీసుకు కూర్చున్నాడు. చదువుతున్నాడే కాని పుస్తకం బుర్రకి ఎక్కలేదు. చదవబుద్ధి వెయ్యలేదు. గదిలో లైటార్పి, మళ్ళీ పడక గదిలోకి వెళ్ళి పక్కమీద పడుకున్నాడు. నిద్రరాలేదు. ఏవేవో ఆలోచనలు తన శక్తికి మించిన పని తలపెట్టాడేమో అన్న సందేహం. తను చేస్తున్న పనివల్ల తనకేం లాభం. కంపెనీలో అందరూ లాభపడతారు. వాళ్ళందరికీ ఎంత లాభిస్తుందో తనకీ అంతే లాభిస్తుంది. దానికోసం ఇంట్లో శాంతిని బాధపెట్టి తన శరీరాన్ని బాధపెట్టుకుంటున్నాడు. ఇలాంటి పనిచేసి యాజమాన్యం దృష్టిలో పడితే, ఇంక భవిష్యత్తు వుండదేమో ! అన్న ఆలోచన కొంచెం బాధ పెట్టింది.

కంపెనీలో తన భవిష్యత్తు ఎలా వున్నా యూనియన్‌లో తన విలువ పెరుగుతుంది. కాని యూనియన్‌లో తన విలువ పెరగడానికీ, ట్రేడు యూనియన్స్‌లో తన పేరు రావడానికీ తన ఈ నిరాహార దీక్ష ఎంతవరకూ సక్సెస్ అవుతుంది? అన్నదాని మీద

ఆధారపడి వుంటుంది. ఇప్పుడెన్ని ఆలోచించినా చేసేదేం లేదు. నిర్ణయం తీసుకోడం అయిపోయింది. ఇంక వెనక్కి రాలేనంత దూరం ప్రయాణం చేసేసాడు. ఏం జరిగితే అదే జరుగుతుంది! గుండె దిటవు చేసుకుని ముందుకే ప్రయాణం చెయ్యాలి అనుకున్నాడు. అప్పటికి మగతలోకి జారుకున్నాడు. నిద్రపట్టిందో లేదో అర్థం కాలేదు. తలుపు దబదబ చప్పుడైంది. వులిక్కిపడి లేచాడు దివాకర్! గదిలో లైటువేసి టైము చూసుకున్నాడు. అయిదు గంటలయింది.

తన దీక్ష మొదలయింది అనుకున్నాడు. వీధి తలుపు తీయగానే ఎదురుగా చౌదరి "తయారవు'' అంటూ లోపలికి వచ్చి కూర్చున్నాడు.

* * *

దివాకర్‌తో పాటే లేచింది శాంతి. రోజూ లేవగానే వుండే హడావిడి లేదు. పళ్ళు తోముకోగానే, కాఫీ పెట్టక్కరలేదు. టిఫినుకి రెడీ చెయ్యక్కరలేదు. ఏ విధమైన గాబరా లేదు. ఏదో చెయ్యి విరుచుకున్నట్టుగా వుంద శాంతికి. అశాంతిగా ఆ గదిలోంచి ఈ గదిలోకి, ఈ గదిలోంచి ఆ గదిలోకి తిరిగింది. ఆ టెన్షన్‌లో చౌదరిని పలకరించడం మర్చిపోయింది.

పళ్ళు తోముకుని కాలకృత్యాలు ముగించి, వేడినీళ్ళు పెట్టిందేమో అని వంటింట్లోకి వచ్చాడు దివాకర్ కాని శాంతి ఏదో మర్చిపోయిన దానిలా అటూ ఇటూ తిరగడం చూసి, ఇంకేం అడక్కుండా బాత్రూములో దూరాడు. అప్పుడు జ్ఞాపకం వచ్చింది శాంతికి వేడి నీళ్ళు పెట్టాలని. "వేడినీళ్ళు పెడతాను'' అంది బాత్రూము దగ్గరకి వెళ్ళి, "వద్దులే టైమయిపోతుంది'' అంటూ చన్నీళ్ళతో స్నానం ముగించాడు. తయారై చౌదరితో వెళ్ళడానికి బైటకి వస్తోంటే, ఎదురుగా రోజూ శాంతి అగరొత్తులు వెలిగించి, భక్తిగా దండంపెట్టే వేంకటేశ్వరుడి పటం కనిపించింది. దేవుడున్నా లేకపోయినా, తన నమ్మకం సంగతి ఎలా వున్నా, తన ప్రయత్నంలో మనిషి ప్రయత్నానికి మించిన శక్తి వుండాలి! అది తనకి తోడ్పడాలి! దాన్ని ఈ పటంలో దేముడు ఇవ్వగలడా! తనకి శక్తి ఇచ్చినా ఇవ్వకపోయినా, నిన్ను నమ్మిన శాంతిని కాచుకోవలసిన బాధ్యత నీదే, అంటూ మనసులో వేంకటేశ్వరుడికి వో నమస్కారం చేసాడు దివాకర్.

"వెళ్ళొస్తా'' అన్నాడు శాంతితో.

శాంతి గాద్గదికంగా "వూ'' అంది.

తలుపు తెరుచుకుని, చౌదరితో కలిసి రోడ్డు మీదకి వచ్చి, తూర్పు వెలుగులో కలిసిపోయాడు దివాకర్

* * *

ఉదయం ఆరుగంటలకి కంపెనీ గేటు ముందు వేసిన షామియానాలో దివాకర్,

కనకంల ఆమరణ నిరాహారదీక్ష మొదలైంది. నిరాహారదీక్ష చాలా నిరాడంబరంగా ముప్ఫైమంది యూనియన్ సభ్యులమధ్య ప్రారంభమైంది. కనకానికి, దివాకర్‌కి మెళ్ళో పూలదండలు వేశాడు యూనియన్ ప్రెసిడెంట్. షామియానాకి ఇరుపక్కలా నిరాహారదీక్ష దేనికి చేస్తున్నారో, తెలుపుతూ పెద్ద పెద్దవి రెండు బేనర్లు పెట్టారు.

సమయం గడుస్తున్న కొద్దీ, కాఫీకోసం, సిగరెట్‌కోసం నాలుక తహతహ లాడిపోసాగింది దివాకర్‌కి. ఏడయేసరికి రోజూ కడుపునిండా పడే టిఫిను పడక, నీరసం వచ్చింది. రాత్రి కలత నిద్ర పట్టిందేమో అక్కడ దిండుకి అనుకోగానే నిద్ర వచ్చేసింది. కాని నిద్రపూర్తిగా పట్టలేదు. తొమ్మిది గంటలకి తెలివి వచ్చింది. సిగరెట్ కోసం మనసు తపించిపోతోంటే, ఛాయ్ కోసం నాలుక లాగేస్తోంది. కోర్కెలని బలవంతంగా అణచిపెట్టి కనకం వేపు చూసాడు. కనకం వచ్చిపోయే జనాన్ని చూస్తున్నాడు. కనకం తనకన్నా పదిహేనేళ్ళు పెద్దవాడు. కనకం పిల్లలిద్దరూ కాలేజీలో చదువుతున్నారు. ఏ చీకూ చింతాలేని సాఫీ జీవితం. అయితే తనకున్న చీకూ చింతా ఏమిటో? దివాకర్ మనసులో ఏవేవో ఆలోచనలు ముసురుకుంటుండగా పన్నెండయింది లంచ్‌టైమైంది అన్నట్టుగా కంపెనీలో సైరన్ మోగింది.

నిరాహారదీక్ష విషయం వర్కర్స్‌కీ, యాజమాన్యానికీ సర్ప్రైజ్ కలుగజేసింది. ఈ మెరుపునిర్ణయం వర్కర్స్‌లో విశ్వాసాన్ని కలిగిస్తే, యాజమాన్యానికి, దీనిని ఎలా పరిష్కరించాలో తెలియని సందిగ్ధంలో పడేసింది.

లంచ్ అవర్ సైరన్ వినబడగానే వర్కర్లందరూ నిరాహారదీక్ష జరుగుతున్న షామియానా దగ్గరకి వచ్చారు. ఈ దెబ్బతో యాజమాన్యం దిగి వస్తుందని, వొప్పుకున్న కోర్కెలని, అమలు పరుస్తుందని చెప్పుకున్నారు. వచ్చిన ప్రతీవారూ దివాకర్‌ని, కనకాన్నీ, చౌదరిని అభినందించినవారే!

* * *

సాయంకాలానికి నిరాహారదీక్ష సంగతి కాలనీలో ఆడవాళ్ళందరికీ తెలిసింది. యూనియన్ ప్రెసిడెంట్ భార్య, చౌదరి భార్య మరికొందరు కలిసి కనకం ఇంటికి వెళ్ళారు. కనకం భార్యకి వయసు నేర్పిన అనుభవం వలన, ధైర్యంగా వుంది. కనకం ఇంటినుండి దివాకర్ ఇంటికి వెళ్ళారు. వీళ్ళని చూడగానే శాంతి కళ్ళనీళ్ళు పెట్టుకుంది. చిన్నపిల్లల్ని వొళ్ళోపెట్టుకుని, వాళ్ళని సాకుతూ కళ్ళనీళ్ళు పెట్టుకున్న శాంతిని చూసి వాళ్ళ గుండెలు తరుక్కుపోయాయి. ఆమెకి ఎలా ధైర్యం చెప్పాలో తెలియలేదు. కనకం భార్యకన్నా శాంతికే తమ అవసరం ఎక్కువవుంది అనిపించింది వాళ్ళకి.

* * *

ఆమరణ నిరాహారదీక్ష రెండో రోజులోకి అడుగుపెట్టింది. పొద్దున్నే షామియానా వెనగ్గా అమర్చిన చిన్నమరుగులో స్నానాదికాలు ముగించి కూర్చున్న దివాకర్‌ని నిన్న

బాధించినంతగా జిహ్వ కాఫీకి, మనసు సిగరెట్ కోసం తహతహలాడలేదు. నిన్న వున్నంత నీరసంగా కూడా లేదు. కళ్ళుపొడారిపోయినట్టున్నాయి. శరీరం కర్రకట్టినట్టుగా వుంది.

ఆ రోజు పేపర్లన్నీ నిరాహారదీక్షని, దాని వుద్దేశాన్ని న్యూసుగా ప్రచురించాయి. హైదరాబాదులో వున్న మిగతా కంపెనీల యూనియన్లు, ఈ కంపెనీ యూనియన్‌కి మద్దతు తెలుపుతూ సానుభూతి వ్యక్తపరిచాయి. ఇవన్నీ చదువుతూ మధ్యాహ్నం వరకు కాలం గడిపాడు దివాకర్. మధ్యాహ్నం లంచవర్లో నిరాహారదీక్ష శిబిరం దగ్గరకీ నిన్న నొచ్చినంతమంది ఇవాళరాలేదు.

దివాకర్ మనసులో నిన్న వున్నంత వేవరింగ్, అపనమ్మకం ఇవాళలేవు. తను చేస్తున్న పని అందరి మంచికే. ఈ దీక్షలో తను సఫలమవ్వాలి! తను ఏమైపోనీ తమ ఒప్పందానికి అనుగుణంగా పదహారు కోర్కెల్నీ యాజమాన్యం అమలు జరిపినప్పుడే తను ఈ దీక్ష విరమించేది అన్న పట్టుదల చోటు చేసుకుంది.

*　　*　　*

నిరాహార దీక్ష మూడోరోజు, పేపర్లలో దివాకర్ కనకం ఫోటోలు వచ్చాయి. దాంట్లో ఇద్దరి గురించి వివరాలు వున్నాయి. అందులో డాక్టరు రిపోర్టు కూడా వుంది. దివాకర్ బి.పి పడిపోయిందని, పరిస్థితి నాజుగ్గా వుందనిరాసారు. ట్రేడ్ యూనియన్ లీడర్లు కొందరు, నిరాహారదీక్ష చేస్తున్న వాళ్ళమీద సానుభూతి ప్రకటించి గవర్నమెంటు కలుగచేసుకుని వొప్పందం అమలు జరిగేటట్టు చూడాలని విజ్ఞప్తి చేసారు.

ఇవన్నీ చదివిన దివాకర్‌కి మనసులో చిన్నగా గర్వం కలిగింది. యూనియన్ వాళ్ళందరిమీద తనో హక్కు సంపాదించినట్టు ఫీలయాడు. తన మనసులో వున్నది. తనెంత పట్టుదలతో వున్నాడో, చౌదరికి తెలియచెయ్యాలి అనుకున్నాడు. అందుకే తన మనసులో వున్న విషయాన్ని కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు.

"నేనేమైనా అయిపోనీ, నాకేం అభ్యంతరం లేదు. కాని యాజమాన్యం మన వొప్పందం పూర్తిగా అమలు పరిచేవరకూ నేనిక్కడనుండి లేవను, నాకు అన్నివిషయాలూ స్పష్టంగా తెలియాలి" అన్నాడు.

"మేం లోబడిపోతామని ఎందుకనుకున్నావు నీకు మొదట్లో ఆ భయం లేదు. ఇప్పుడెందుకు వచ్చింది. మా మీద నమ్మకం లేదా?" అన్నాడు చౌదరి.

*　　*　　*

మూడో రోజు సాయంత్రం కాలనీలో ఆడవాళ్ళు ఇరవైమంది వరకూ యూనియన్ ప్రెసిడెంట్ ఇంట్లో చేరారు. ఆ రోజు పేపర్లో వచ్చిన విషయాలన్నీ చదవడంవలన అందరి మొహాల్లో గంభీరత కొట్టొచ్చినట్టు కనబడుతోంది. వాళ్ళకి శాంతి, పిల్లల వొంటరితనం, దీనత మనసులో గుబులు పుట్టించాయి. ఇంతకు ముందు శాంతి ఏడ్చేది. కళ్ళనీళ్ళు

పెట్టుకునేది. ఇప్పుడదేం లేదు. అందర్నీ నిర్లిప్తంగా చూస్తోంది. పిల్లలకి అదేం అర్థం కావడంలేదు. రోజూ ఇంతమంది ఏ హడావిడి లేకుండా నిశ్శబ్దంగా తమ ఇంటికి ఎందుకొస్తున్నారు. నాన్న ఎక్కడా? ఎందుకు కనిపించడం లేదు! ఇవన్నీ వాళ్ళకి అర్థం కాని ప్రశ్నలు. అదివాళ్ళ కళ్ళల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ దృశ్యాల్ని చూసినప్పుడల్లా, శాంతి ఇంటికి వెళ్ళిన వాళ్ళ మనసుల్ని కలచివేస్తోంది. అదే వాళ్ళ ఇళ్ళలోనూ ప్రతిబింబించింది.

కాలనీ ఆడవాళ్ళందరికీ దివాకర్‌ని శాంతిని అమాయకుల్ని చేసి బలిపశువులుగా మార్చామా? అన్న సందేహం పీడిస్తోంది. తామంతా కలిసి శాంతికి అన్యాయం చేస్తున్నట్టు అనిపించింది. ఇలాంటి నిరాహారదీక్షలు ఎంతవరకూ సఫలం అవుతాయి. అన్న శంక వాళ్ళని పట్టుకు పీడించి, వాళ్ళల్లో అసహనాన్ని లేపుతోంది.

ఆ అసహనం తాలూకూ ఛాయలు అందరి ఇళ్ళల్లో స్పష్టంగా కనబడుతున్నాయి. అందులో భాగంగా చౌదరి భార్య “ఇలా ఎన్నాళ్ళు జరుగుతుంది?” అన్న ప్రశ్న చౌదరిని అడిగింది.

అవును ఇలా ఎన్నాళ్ళు జరుగుతుంది? నాలుగు రోజులా! ఐదురోజులా? వారం రోజులా? ఎన్నాళ్ళు? ఎవరు చెప్పగలరు? రోజు రోజుకి దివాకర్, కనకం తమనుండి దూరం అయిపోతున్నారు. వాళ్ళల్లో మాత్రం నిరాహారంగా జీవించే శక్తి ఎన్నాళ్ళు వుంటుంది? చౌదరి మనసులోనూ అనుమానాలు శంకలే ఇంక భార్యకి సమాధానం ఏం చెపుతాడు.

యూనియన్ ప్రెసిడెంట్ భార్య “ఇంకో మార్గం లేదా?” అనడిగింది. ఇంకో మార్గం ఏముంది? స్ట్రైక్‌చేసి సాధించిన హక్కుల్ని హేళన చేసేవాళ్ళకి ఏవిధంగా పరాకు చెప్పగలం?

ఆ రోజు రాత్రి కార్యవర్గ సమావేశం జరిగింది. అందరి ఇళ్ళల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోందని అర్థం అయింది సభ్యులకి.

* * *

నిరాహారదీక్ష నాలుగోరోజున నీరసంగా వుండి దిండుకి అనుకుని పడుకున్న దివాకర్ని చూసి, నిరాహారదీక్ష చేస్తున్నవాళ్ళ పరిస్థితి ఏం బాగులేదనే పుకారు పుట్టింది.

ఇక్కడ శిబిరంలో ఏం జరుగుతోందో అని నిఘావుంచిన కంపెనీ యాజమాన్యానికే కాక, ఇతర కంపెనీ యజమానులకి కూడా పరిస్థితి చెయ్యిదాటిపోయి అనుకోని మలుపు తిరుగుతుందేమో? అన్న అనుమానం కలిగింది.

చాలామంది ఇతర కంపెనీ యజమానులు, ఖన్నాకి ఫోనుచేసి, ఒప్పందాన్ని, అమలు చెయ్యమని, ఈ పరిస్థితినుండి బయట పడమని, లేకపోతే దానిప్రభావం ఇతర కంపెనీ యూనియన్లపై పడే అవకాశం వుందని సలహా ఇచ్చారు.

నాలుగో రోజు పేపర్లలో అసెంబ్లీలో ప్రతిపక్షం వాళ్ళు, హైటెక్ పేరుతో ముఖ్యమంత్రి ఇండస్ట్రియలిస్టులకి మద్దతుగా వుండడంవలనే, ఒప్పందాన్ని అమలు చెయలేదని, కార్మికులని ఎవరూ పట్టించుకోవడం లేదని స్టేట్‌మెంట్స్ ఇచ్చారు. ఈ విషయం నగరంలో చర్చించబడడంతో ప్రతిపేపరు మొదటిపేజిలో చిన్న బ్లాకు వేసి, నిరాహారదీక్ష గురించి వార్తలు తక్కువ కబుర్లు ఎక్కువ ప్రచురించడం మొదలుపెట్టారు.

* * *

నాలుగోరోజు సాయంకాలానికి కంపెనీ యాజమాన్యం నుండి ఏ విధమైన సమాచారం రాకపోవడంతో, ఇతర కంపెనీ యజమాన్లు కొందరు ముఖ్యమంత్రికి ఫోను చేసి విషయం చెప్పి, ఆ కంపెనీలో అశాంతి ఇతర కంపెనీలకి ప్రాకకుండా చూడాలని కోరారు!

ముఖ్యమంత్రి విషయం తెలుసుకుంటే సానుభూతి వర్కర్స్ వేపు మొగ్గింది. ఎన్నికలని దగ్గరలో పెట్టుకుని నగరంలోగాని, కార్మికుల్లోగాని ఏ విధమైన అన్‌రెస్ట్ మంచిది కాదని, ముఖ్యమంత్రి పి.ఎ.తో ఆ కంపెనీ యాజమానికి ఫోనుచేసి, ఇరవై నాలుగు గంటల్లో ఏ విషయం తేల్చేయమని లేకపోతే ప్రభుత్వం కలుగచేసుకోవలసి వుంటుందని హెచ్చరించమని చెప్పాడు.

సి.యమ్. ఆఫీసు నుండి ఖన్నాకి ఫోను పోయింది. దాని ఫలితంగా..... అయిదోరోజు పొద్దున్నే రమేష్‌చంద్రను పదవినుండి తొలగించింది యాజమాన్యం. బోర్డ్ డైరక్టర్స్ ప్రెసిడెంట్ ఖన్నా కంపెనీకి వచ్చాడు. యూనియన్ ప్రెసిడెంట్‌ని, సెక్రటరీ చౌదరినీ, ఆఫీసుకి పిలిచాడు.

అడ్మినిస్ట్రేషనుకి, వర్కర్స్‌కి మధ్య అపార్థాలకి కారణం రమేష్‌చంద్రే అని తేల్చారు. ఒప్పందంలో కోర్కెలన్నీ అమలుచేస్తే, ఆ ఖర్చు కంపెనీ భరింపలేదని కాలక్రమాన వాటిని అమలు చేస్తానని హామీ ఇచ్చాడు. ప్రస్తుతం ముఖ్యమనుకున్నవి రెండు కోర్కెల్ని చెపితే వాటిని ఈ రోజునుండీ అమలు చేస్తానని, కోర్కెలన్నీ అమలుచేసి, కంపెనీ నష్టాల్లోకి పోతే, కంపెనీ మూసెయ్యడం మినహా తను చేసేదేం లేదని చిన్న హెచ్చరిక కూడా చేసాడు.

అనేకమైన తర్జన భర్జనలు జరిగాక, వెంటనే కొత్త పేస్కేళ్ళు ఇచ్చేందుకు, స్ట్రయిక్ చేసిన పీరియడ్‌ని ఎర్న్‌డ్ లీవుకింద కన్సిడర్ చేసేందుకు ఒప్పుకుని, మిగతా కోర్కెలని కొత్త ఎక్జిక్యూటివ్ మేనేజరు వచ్చేవరకూ వాయిదా వెయ్యాలని ప్రతిపాదించాడు ఖన్నా.

ఖన్నా ప్రతిపాదనలని చర్చించేందుకు అత్యవసరంగా కార్యవర్గం సమావేశం అయింది. కార్యవర్గంలో అందరూ టెన్షన్ తోనే వున్నారు. ఈ చర్చలు ఆగిపోతే మళ్ళీ ఎప్పుడు జరుగుతాయి. ఈ రోజు నిరాహారదీక్ష అయిదోరోజు! ఖన్నా ప్రతిపాదనని ఒప్పేసుకోడమే మంచిదనే అభిప్రాయానికి వచ్చారు. ఈ ప్రతిపాదనని దివాకర్‌కి

చెప్దామన్నారు కొందరు. అప్పటికే దివాకర్ పట్టుదల తెలిపిన చౌదరి పూర్తిగా వివరాలు తెలియపర్చనవసరం లేదని, నిరాహారదీక్ష ముగిసింతర్వాత కార్యవర్గ సమావేశంలో తెలియచేయవచ్చని చెప్పాడు.

కార్యవర్గ సమావేశం ముగిసింది. యూనియన్ ప్రెసిడెంట్, చౌదరి కార్యవర్గ నిర్ణయాన్ని ఖన్నాకి చెప్పారు. వెంటనే ఖన్నా కొత్త పేస్కేల్స్ ఇంప్లిమెంటు చేస్తూ ఆఫీసు ఆర్డరు జారీ చేసాడు. దాన్ని తీసుకుని దివాకర్ దగ్గరికి వెళ్ళాడు చౌదరి.

* * *

దివాకర్ ఆర్డరు చూసి ఆనందపడలేదు. "అసలు ఏం జరిగిందని" ఖండించి అడిగాడు.

"మన లక్ష్యం నెరవేరింది. మన కోర్కెల వొప్పందాన్ని ఇంప్లిమెంటు చెయ్యడానికి వొప్పుకుంది యాజమాన్యం. బోర్డు ప్రెసిడెంట్ ఆరెంజ్ జూస్ తీసుకువస్తాడు. నువు ఈ రోజుతో దీక్ష విరమిస్తున్నావు" అన్నాడు చౌదరి.

ఈ విషయం చెప్తున్న చౌదరి మొహంలో వుత్సాహంగాని, సంతోషంగాని లేవు. అది దివాకర్‌కి అనుమానం కలుగచేసింది. తను ఆమరణ నిరాహార దీక్షచేసి చనిపోయినా, చేసుకున్న వొప్పందాన్ని అమలు చెయ్యరని అతనికెందుకో నమ్మకం. చౌదరి పూర్తిగా నిజం చెప్పడం లేదని ఎందుకో అనుమానం. తను నిలుచున్న నేల గట్టిదికాదా? బలమైన కెరటానికి కొట్టుకుపోయే ఇసుకపర్రా! తన పాదాలకింద నేల డొల్ల బారిపోయిందా? తను ఎవరికోసం ఈ దీక్ష వహించాడు. వాళ్ళకి తనమీద విశ్వాసం లేదా? ఏవో వొకటి రెండు కోర్కెలు తీరగానే ఎందుకు లొంగిపోయారు? దివాకర్ ఈ ఆలోచనల్లో వుండగా, షామియానా దగ్గర ఖన్నా కారు ఆగింది. అందులోంచి యూనియన్ ప్రెసిడెంట్, ఖన్నా దిగారు. యూనియన్ ప్రెసిడెంట్ చేతిలో పెద్ద ఫ్లాస్క్ వుంది. దానినిండా చల్లని ఆరెంజ్ జూస్ వుంది.

ఇద్దరూ దివాకర్ దగ్గరకి వచ్చారు. యూనియన్ ప్రెసిడెంట్ జూస్‌ని రెండు గ్లాసులలో పోసి, ఖన్నాకి అందించాడు. ఖన్నా జూస్‌ని దివాకర్‌కోగ్లాసు, కనకానికోగ్లాసు అందించాడు.

దివాకర్ జూసుగ్లాసు అందుకొని చౌదరివేపు దీర్ఘంగా చూసాడు. చౌదరికూడా దివాకర్ని ఆత్రుతతో చూసాడు. దివాకర్ ఏం చేస్తాడు? నిరాహార దీక్ష బ్రేక్ చేస్తాడా? చెయ్యడా?

కాని దివాకర్ గ్లాసులో జూస్‌ని సిప్ చేసాడు. కెమెరాలు క్లిక్‌మన్నాయి. అక్కడ చేరిన వాళ్ళంతా చప్పట్లు కొట్టారు. దివాకర్ సిప్‌చేసిన గ్లాసు పక్కని పెట్టక కనకం వేపు చూసాడు. అంతవరకూ కనకం దివాకర్‌నే అబ్జర్వ్‌చేస్తున్నాడు. దివాకర్ జూస్ సిప్‌చెయ్యగానే తనూ తన గ్లాసులో జూస్ తాగేసాడు.

కనకం జూస్ తాగి గ్లాసు పక్కన పెట్టగానే, దివాకర్ షామియానాలో లేచి నిలుచున్నాడు. ఖన్నా కారులో దిగబెట్టిస్తాను రమ్మన్నాడు కాని దివాకర్ "వద్దని" చెప్పి రోడ్డు మీదకి వచ్చాడు. రోడ్డు పక్కల నిలబడివున్న రిక్షాని పిలిచి, అందులో ఎక్కి కూర్చున్నాడు. తనతో వస్తానన్న చౌదరిని కూడా వద్దని, కాలనీలో తనింటికి వెళ్ళిపోయాడు.

ఇంటికి వచ్చిన దివాకర్‌ని ఆనందంతో చూసింది శాంతి. ఆమెకి ముందే కబురు తెలిసిపోయింది.

"శాంతీ కాఫీ పెట్టు" అన్నాడు దివాకర్. దివాకర్‌కి ఎందుకో తను సక్సెస్ అవలేదు అనిపిస్తోంది. తను మోసపోయాననిపిస్తోంది? తనని ఎవరూ మోసం చేసారు? యాజమాన్యమా? యూనియనా? ఎవరు? లేక తనగురించి తనే ఎక్కువ అంచనావేసుకుని తన్ని తనే మోసం చేసుకున్నాడా? దివాకర్‌కి కోపం వచ్చింది. ఏదీ తననుకున్నట్టు జరగలేదు. ఎందుకు? ఏమిటీలోపం?

శాంతి కాఫీ తీసుకొచ్చింది. కాఫీ తాగితే రుచిగా లేదు. అయినా కాఫీ తాగాడు. సిగరెట్ కోసం మనసులాగింది. ఇంట్లోంచి వొంటరిగానే బడ్డీ కొట్టుకి బయలుదేరాడు. సాయంకాలం కావస్తున్నా ఎండ తీక్షణంగానే వుంది. బడ్డీ కొట్టుకి వెళ్ళి బెంచీ మీద కూర్చుని "సిగరెట్ ఇవ్వు" అన్నాడు. అప్పటికే కళ్ళు చీకట్లు కమ్మాయి. లోకం గిర్రున తిరిగినట్టుగా అయింది. స్పృహతప్పి బెంచీమీంచి కిందపడిపోయాడు.

* * *

దివాకర్‌కి స్పృహ వచ్చేసరికి, చౌదరి ఇంట్లో చౌదరి వొడిలో తలపెట్టుకుని పడుకున్నాడు.

దివాకర్ కోపం చూసి దివాకర్‌ని వొంటరిగా వొదిలేసినా, చౌదరి యూనియన్ ప్రెసిడెంట్, కొందరు ఎగ్జిక్యూటివ్ మెంబర్లూ, దివాకర్ క్వార్టరు ఎదురుగా వున్న క్వార్టర్లో చేరి అతన్నే అబ్జర్వ్ చేస్తున్నారు.

దివాకర్ బడ్డీకొట్టుకి వొంటరిగా వెళ్ళడం చూసి అతనివెనకాలే చౌదరికూడా బయలుదేరాడు. చౌదరి వెళ్ళేసరికి, దివాకర్ బెంచీ మీంచి స్పృహ తప్పి పడిపోయి వున్నాడు. అక్కడ చేరినవాళ్ళు సాయంచేయగా దివాకర్‌ని రిక్షాలో పడుకోబెట్టి, తన ఇంటికి చేరారు. కొంత వుపచారం చేసాక తెలివి వచ్చింది దివాకర్‌కి. అయిదు రోజుల వుపవాసప్రభావం అతనిమీద పనిచేస్తోంది. నోరార్చుకుపోతోంది. తలనొప్పితో పగిలి పోతుంది.

తెలివి వచ్చిన తర్వాత లేచి కూర్చున్నాడు దివాకర్. దివాకర్ని గమనిస్తున్నాడు చౌదరి. దివాకర్ ఎవర్నీ చూడడం లేదు. ఎటో చూస్తున్నాడు. గదిలో వున్న వాళ్ళెవరినీ చూడడం లేదు.

దివాకర్ మౌనం భరించలేని చౌదరి, దివాకర్ చేతిని తన చేతిలోకి తీసుకుని, "ఎందుకు కోపం దివాకర్, మేం నిన్ను ఏవిధంగానూ మోసం చెయ్యలేదు. అన్ని కోర్కెలు యాజమాన్యం ఒప్పుకుందో, లేదో అమలు జరుపుతుందో లేదో అర్థం కాని పరిస్థితి. మన ఒప్పందాన్ని కొత్త ఎక్జిక్యూటివ్ మేనేజరు వచ్చి చూస్తాడన్నారు. కొత్త ఎక్జిక్యూటివ్ మేనేజరు అసలు వస్తాడా? అన్నది కూడా అనుమానమే కాని ఇవన్నీ ఆలోచించడానికి మాకు టైమేదీ? నీ ప్రాణం, కనకం ప్రాణం కాపాడడమే మాకు ముఖ్యవుద్దేశ్యమైపోయింది. కాలనీలో ఇళ్ళల్లో మా కోర్కెల సాధనకోసం రెండు కుటుంబాలని శోషణ పెడుతున్నామన్న ఆడవాళ్ళ వత్తిడి, తట్టుకోడం కష్టం అనిపించింది. ఇంక దారేదీ లేక ఒక మెట్టు దిగిరాక తప్పలేదు. మమ్మల్ని నమ్ము మేం బలహీనులమే అయినా నీతోటి వాళ్ళమే ఎప్పటికీ నీతోటి వాళ్ళమే'' అన్నాడు చౌదరి. ఆఖరి మాటలు అంటున్నప్పుడు అతని గొంతు పూడుకుపోయింది. దివాకర్ చెయ్యినిగట్టిగా పట్టుకొని తలవంచుకుని ఏడ్చేసాడు. అతన్ని కంట్రోలు చెయ్యడానికి యూనియన్ ప్రెసిడెంట్ చేసిన ప్రయత్నం ఫలించలేదు.

ఏదేనా సంఘర్షణ జరిగినప్పుడు ఇరుపక్షాలకీ దెబ్బలు తగిలి గాయం అవక తప్పదు! అది మనసుకే అవనీ శరీరానికే అవనీ! అయిన గాయం బాధపెట్టక మానదు. పెద్ద గాయం బలహీనులకే అవుతుంది. అది అందరూ గుర్తిస్తారు. బాధని దిగమింగుకుంటారు. తనూ అంతే. వీళ్ళందరిలోనూ తనూ ఒకడు. తను దెబ్బ తిన్నానని గాయపడ్డానని బాధపడుతున్నాడు. ఆ బాధని అందరూ పంచుకుంటున్నారు. ఆ పంచుకునే తత్త్వమే తమని సంఘటితంగా వుంచుతోంది. మళ్ళీ పోరాటానికి ప్రేరణ కలుగచేస్తోంది. నిరంతరం జరిగే ఈ ఘర్షణలో, ఇదిఒక చిన్న ప్రయత్నం మాత్రమే! అనుకున్నాడు దివాకర్.

అతని కళ్ళ నుండి రెండు కన్నీటి బిందువులు జారిపడినై! ఆ కన్నీటి బిందువులు అక్కడ చేరినవారి మనస్సుల్లో పన్నీటి జల్లులా కురిసింది.

*ది వూండ్* *(కథామహల్ (సంకలనం) 1999)*

# హత్య

శ్మశానంలో చీకటి పడింది.

ప్రపంచంలో విస్తరించిన చీకటికి.... ఇక్కడి చీకటికి చాలా తేడా వుంది. మానవ ప్రపంచంలో విద్యుద్దీపాల దేదీప్యమానం .... ఇక్కడ వుండదు. ఆఖరిగా ప్రేతవనం చేరుకున్న శవాల... దహనం... వాటి కాష్ఠాలే, ఇక్కడి వెలుగులు. తాము జీవించే ప్రపంచం నుండి కలల ప్రపంచంలోకి జారుకుని... సుప్తిని పొంది, అందమైన ప్రాంతఃకాంత సమాగమంతో... కళ్ళు విచ్చుకు.... వొళ్ళు విరుచుకు... సొగసులు పోతారు అక్కడ. కానీ ఇక్కడ అలా కాదు.... ఇవన్నీ సుప్త నిశ్శబ్ద సంపుటాలు.... వీటికి ప్రాతః ప్రసక్తి వుండదు.

ఎదురుగా మంటలు... జ్వాలలు... చిటపట ధ్వనులు... మంటలకి దూరంగా కాటికాపరి... సెగ కాగుతున్నాడు. అతనికా సెగ.. వెచ్చదనం కొత్తకాదు. కానీ అక్కడే నిలబడి మంటల్ని.. జ్వాలల్ని... గమనిస్తున్న వాళ్ళకి, చికాకుగా వుంది. ఇంకా ఎంతసేపు... చచ్చి కాలిపోతున్న మనిషిని... నిలబడి చూసేదేముంది, చూసి చేసేదేముంది.

అప్పుడే... కట్టెల మీది కంకాళం పేలింది...ఫట్ మంది. దాన్ని చూస్తున్న వాళ్ళ గుండె గుభేల్ మంది. మానవుడి మేధస్సుకి...ఆలోచనకి... అహంకారానికి... ఆచరణకి నిలయం... మెదడు, పేలిన కంకాళం నుండి... బయటపడి, నిప్పుతో కలసి సుర సుర లాడింది. మంటలు పైకి లేచాయి.

ఆ క్షణంలో.... కాళ్ళు కట్టెల్ని తప్పించుకు పైకి లేచాయి. చితికి కాస్త దూరంగా... కూర్చున్న కాటి కాపరి, పక్కనే నిలబడ్డ కొడుక్కి సైగ చేసాడు. వాడు వెళ్ళి... కాలుతున్న కట్టెలోంచి... పొడవాటి పేడు తీసి... కాళ్ళమీద 'టపీ' మని కొట్టాడు. కాళ్ళు కట్టెల్లోకి జారిపోయాయి.

పేగులు కాలి... శరీరం రెండుగా విడి మంటల్లో... కట్టెల్లో... కూర్చున్న చప్పుడు... కట్టెలు కిందకి జారుతూ వుంటే... జారిన కట్టెని తీసి, గుండె మీద పెట్టాడు. గుండెలు కాలుతున్నాయి... అభిమానం... ఆర్ద్రత... మమకారం...ప్రేమ అన్న నాలుగు గదులతో చేసిన ఇల్లు ... కాలుతోంది... క్రొవ్వు కరుగుతూ.. కాలుతోంది.

అప్పుడే వాడి ఆత్మ నవ్వింది... 'నీకు కొవ్వెక్కడిదిరా?' అని.. శవ దహనాన్ని చూస్తున్న... మనుషులు... గుసగుసలాడుకుంటున్నారు. "ఇక్కడితో అన్ని కష్టాలూ.. అన్ని అవమానాలూ ఆహుతి... ఇక్కడ ఎవరికీ అన్యాయం జరగదు. ఏ కష్టమైనా... నిష్ఠురమైనా.. ఇక్కడి వరకే... ఏ నిందైనా.. బొంది వున్నంత వరకే... ఇక్కడ...అగ్ని సింహాసనం మీద అందరూ వొకటే... అందరూ ఈ సింహాసనం ఎక్కక తప్పదు...

ఇంక ఇక్కడ వుండి చూసేదేం లేదు పదండి'' అంటూ... తలొంచుకు వెళ్ళిపోయారు.

వాళ్ళు ఇక్కడే పొరపడ్డారు... ఇక్కడ అందరూ సమానం... జీవితంలో శాంతి ఇక్కడే వుంది... లేదా వుంటుంది... అని అనుకుంటే పొరపాటు! చితిని వదిలి మనుషులు నిష్క్రమించగానే... అంతవరకూ... పక్కగా కూర్చుని, బీడి తాగుతున్న కాటి కాపరి చటుక్కున లేచాడు. మంటల కెదురుగా నిలబడ్డ కొడుకుని చూసి, "ఒరై కాలింది చాలుగానీ... డొక్కుతో నీళ్ళట్రా... ఈడి కిన్ని కట్టెలు దండగ...'' అంటూ పైకి కనిపిస్తున్న కట్టెల్ని పక్కకి తీసి... సగం ఉడికి.. కరిగి కాలిన ఛాతీ ముక్కని... మంటల్లోంచి... పైకి నెట్టేసాడు. కాటి కాపరికి మనుషులతో బంధం వుండదు... వాడికి చచ్చిన శవంతోనే బంధం... అదీ ఈ ప్రేతవనంలో...హుతవాహుడి వేడికి తట్టుకుని.. పొడిచి పొడిచి.. ప్రేతాన్ని.. కాలుస్తూ తపించిపోయే... వాడికి... ఈ అగ్ని సంస్కారంలో తనకెంత మిగుల్తుందనే తపనే ఎక్కువ.

మంటల్లోంచి బయటపడ్డ ఛాతి ముక్కని చూసి భయపడ్డాడు..."అదేంటి అయ్యా, అది బాగా కాల్నేదు...'' అన్నాడు వాడి కొడుకు.

కాటికాపరి... చితి నుండి కొరకంచుల్ని తీసి మట్టినేలలో అదిమి... నిప్పుల్ని ఆర్పి... పక్కకి విసురుతూ, "ఒరై మగాడికి గుండె, ఆడదానికి తుంటె, దిట్టంగా వుంటాయి... అంత తొందరగా కాలవు గాని... నువ్వు పో.. పోయి నీళ్ళట్రా... వో మణుగున్నర కర్రలైనా మిగలవా'' అన్నాడు

కుర్రాడు నీళ్ళు తేవడానికి వెళ్ళగానే, ఎదురుగా వున్న చితి నుండి రెండు కొరకంచులు తీసి, మంటల్లోంచి పైకి తోసేసిన ఛాతీ ముక్కని నెట్టుకుంటూ వెళ్ళి, పక్కనే పారుతున్న కాలువలోకి తోసేసాడు. సగం కాలిన కర్రలు తీసెయ్యగా... మిగిలిన చితిని దగ్గరగా కలయ గొట్టి, మంట రాజుకునేటట్టు చేసాడు. కర్రలకి పట్టిన బూడిద వదిలేసరికి... ఎర్రటి మంటలతో... రాజుకుంది చితి. ఇంతలో కుర్రాడు డొక్కుతో నీళ్ళట్టు కొచ్చాడు. పైకి తీసిన కట్టెల మీద నీళ్ళు పడగానే, సుర సుర మంటూ తెల్లటి మేఘంలా... ఆవిరి పైకి లేచింది. మొహం మీదకి వస్తున్న... ఆవిరిని భుజం మీది తుండు గుడ్డతో విసిరేసాడు కాటి కాపరి.

ఆత్మ చివచివ లాడుతున్న... ఆరిపోయిన కట్టెల్ని... కాలీ కాలని తన భౌతిక దేహాన్ని అసహనంగా చూస్తూ కూర్చున్నాడు సింహాచలం. అప్పుడే అతని పక్కన ఎవరో కూర్చునట్టయింది. "అన్యాయం జరిగిందేరా?'' అన్న ప్రశ్న నక్క పెట్టిన వూళలా.. పక్కనే సర్.. మంది.

"నేదు'' అన్నాడు సింహాచలం దృఢంగా. వాడికి తెలుసు.. జరిగిన అన్యాయం వల్ల వాడు నష్ట పోయిందేం లేదు. కాటి కాపరి మణుగున్నర కర్రలు మిగుల్చుకున్నాడు. తన కట్టె చివరి కంటూ కాలేంతవరకూ కూర్చునే భావుకత గల సంబంధాలేం లేవు.

చచ్చి కాలుతున్న శరీరానికి జరిగిన అన్యాయం కన్నా... బ్రతుకంతా జరిగిన అన్యాయం, వాడి ఆత్మని దహిస్తోంది...అందుకే జరుగుతున్న తతంగం.. వాడికి అన్యాయంగా అనిపించలేదు.

"మరి" అంటూ ఆశ్చర్యపోయాడు పూల వేసిన వాడు.

"జరిగిందన్నాయం కాదు.. జరుగుతూ వచ్చిందన్నాయం..." అంటూ చెప్పడం మొదలుపెట్టాడు.

"సక్కని గుడ్డ లేసుకుని... సిన్న బొట్టెట్టుకు... పలక సేత్తో పట్టుకు... స్కూలు కెళుతూంటే... కన్ను కుట్టి... 'ఈడు స్కూలు కెళ్ళి యేటి నేర్చుకుంటాడ్రా...ఆడు నేర్చుకున్నా... నీ కొరిగేదే వుంది.. ఇంటిలో పనుంది... పంపు" అంటూ నా బాబు బుర్ర తినేసాడే పెద్ద కాపు... అప్పుడే అన్నాయం జరిగి పోనాది... పెద్దకాపు సెప్పినట్టా నేనెందు కినుకోవాల...? ... ఈడు నా బుడత... ఈడు బడికెళితే ఆడి కేటి పోద్ది... అన్న యింగితం, నా బాబు బుర్రనోకి రానేదు సూడూ... అప్పుడే జరిగి పోనాది అన్నాయం. నా బతుక్కే అగ్గెట్టేసిన అన్నాయం కదూ... ఆలోసనుంది గానీ... ఏటీ సెయ్యనేక పోనాడు.. అంటావా... ఆ సెయ్యనేక పోడంలోనే ఉంది... అన్నాయవంతా... ఆ సెయ్యనేనన్న ఆలోసన రావడమే అన్నాయం! ఏటీ... సదూకుని ఎవరేటి బావుకున్రు అంటవా?... సదూకుని ఎవరేటి బావుకోనక్కరనేదు. సదూతో.. ఆలోసన మారుద్ది... అదీ ముఖ్యం అద్దరగలా... దొర్లకాళ్ళట్టి.. దూళ్ళకి గడ్డేసి.... ఆళ్ళ యిళ్ళకి కాపుండే బేపిల్ని కడిగి... పన్జేసి... యెట్టింది తిని... తొంగోడమే... బతుక్కి ముక్కమై పోనాది."

"అంటే నువ్వు ఆరో ఏట నుండే పని మంతుడవయావన్న మాట"

"సూడు! మాలపేటలో పుట్టినాళ్ళంతా మడుసులు కారనే... ఆలోసన ఆడి కెంతుందో... మడుసులమేనా అన్న సందేహం ఈళ్ళకీ అంతే వుండాది... మాలపేట మడుసుల్ని పెంపుడు జంతువుల్లా సాకడమేగానీ... ఆళ్ళు సోగ్గా వుంటే సూడలేని సుండాగాళ్ళు యీళ్ళంతా... అస్సలు జంతువులకీ మడుసులకీ తేడా యేటి సెప్పు... ఆలోచన... ఆటికి నేదు... ఈడికుంది... ఆలోసననేది వుంది, అని తట్టనాళ్ళ గురించే నా దిగులంతా... అది సర్లే.

నా బతుకినుకో... వెట్టికి పుట్టినట్టయింది. అక్కడ నా బాబు బుర్ర పన్జేయలా... నా యాస తీర్లా... గుడిసింట్లో పుట్టడం పొరపాటయి పోనాది. పుట్టక కూడా బతుక్కి అవసరం, అన్న ఆలోసనతో బుర్ర గింగుర్లెత్తి పోనాది. ఎందుకు గింగుర్లెత్తి పోనాది అంటావేమో?... వొంట్లో రకతాన్ని వుడు కెత్తించే వయసొచ్చేసినాది... ఏ దొచ్చినా సేసేదేం నేదు. గింగుర్లెత్తిన బుర్ర వూరకున్నదా? నేదు... యెన్నో ఆలోచన్లు. పెద్దకాపు నో యేటు యేసి... జరిగినన్నాయం సరిసేద్దామని! యెందుకంటావేమో... ఆడో రోజు సిన్న కాపుతో ఇకలిస్తూ, "ఇంక ఈళ్ళూ సదూకు అచ్చరం ముక్కలొంటట్టించుకుంటే... మనవీ

వూరొదిలి అడవులట్టి పోవాల... వుత్తర రామాయణంలో సీతమ్మోరిలా! తెలిసిందా?'' అండు.

"అంతేకాదు యేసిన యేటుతో సరిపోదు...మాలపేట మారీ పోదు.. ఆడికో బలగం వుంది. ఆడి కొమ్ముకాసే కులం వుంది... కులానికి పంచాయితీ ప్రెసిడెంటు అండుంది. పెసిడెంటుకి... మంతిరితో... బంధుత్వముంది. ఆడీ కులానికే యెన్ను... ఆడికీ ఈడికీ లచ్చిందేవి దన్ను... మాకు బుర్రుండి లాబవేటి.. దాంట్లో ఆలోసనుందన్న మురుపేటి... నా ఆలోసన్లన్నీ నా బుర్రలోనే వడలిపోనాయి... కానీ కుళ్ళిపోలా... కానీ ఈ ఆలోసన్లే రాని యెదవలెక్కువ... నువ్వాలోసనున్న యెదవ్వి! ఆళ్ళు ఆలోసన్లేని యెదవలు.. ఆళ్ళే సుకంగా వున్నారంటావా? అదీ నిజవే... మా అయ్య గంతకితగ్గ బొంతని సేసుకోరా అండు... యినుకోలా... పోలిని పడేసినా... అది పడిపోనాది... అదే కావల్నని మంకట్టా... మంకుతీరి... పోలి కాపరాని కొచ్చింది. అది సూసే వాళ్ళకి సుతారంగా అగిపించినా, దానొరస సొంగ కార్పించేంత దురుసుగా వుంటది. దాన్దురుసుదనంతో సరసం ఆడిన మగాళ్ళకి, సొగసు మీద మనసు పోడం పరిపాటి!

దీని సురుకుదనం సిన్నదొరకు నచ్చింది. ఆడు దీన్నెలా సదివేడో... అదే సురుకు దనంతో నా కళ్ళల్లో ఎర్రజీరల్ని సదివేసేడు.

అందుకే వోరోజు పిల్సి 'వోరేయ్ నువ్వే నన్ను కాపాడాలి' అండు. ఆడ్ని నే కాపాడ్డవేంటి? అని నే యిస్తు పోయి నోర్ తెర్చినా.. కానీ ఆడంటడూ... ఆడి కోసం బట్టీ యెట్టి సారా వొండే కొండిగాడ్ని పోలీసు లట్టుకెళ్ళిర్రు... ఆడ్నేక సారా యాపారం దెబ్బతింది.... పోలీసోళ్ళకి మడిసైతే సాలు... ఆడు కొండిగాడైతేనేం... సుండిగాడైతేనేం... దొంగ సారా కేసట్టుకున్నావని ఆళ్ళూ.. యిలాటి దొంగపన్లు సేసినాళ్ళకి సిచ్చేసేనని జడ్జి బాబూ.. సంతోష పడాలంట... అందుకే నన్నాడి సోట్లోకెళ్ళమన్నాడు. వో యేడాదో.. రెండేళ్ళో జైలేస్తరు... నీకు పోయిందేం నేదు. మళ్ళీ తిరుగొచ్చి.. ప్రభుత్వం వారు నీ బాబు కిచ్చిన పొలం సూసుకుందుగాని... నువ్వు తిరిగొచ్చేనోగా అందులో బోరేయిస్తా... నీ పొలానికి నీటెద్దడి వుండదు' అండు.

సినకాపు పిలిసి చెప్పేడంటే... దాన్కి తిరుగేనేదు. కాదంటానికి నేదు.. అని... ఆ వూర్లొ సేసేదీనేదు. సినకాపుకి మనిట్టంతో పన్లేదు.. ఆడు సెప్తడు... మనం యినుకోవాల.

వో యేడాది జైలు కెళ్ళినా...

వొచ్చి సూసేవాడు నేడు... సూసే వాళ్లుంటే మాత్రం, యే వొరుగుద్దిలే.. పల్లే సిన కాపు జైలులా వుంటే.. జైలు కాకీ నిక్కరుగాళ్ళ కండకావరంలా వుంది.

నా మనసంతా పోలి మీదే వుంది... పోలేటి సేస్తోందో...పొలం సూసుకుంటోందా?... వూర్లో సోకులొలక బోత్తోందా? యేటి సేస్తోంది. అమ్మ అయ్య ఎప్పుడో కాలం సేసిర్రు... ఆళ్ళని సూసే అవకాశం దానికి దేవుడియ్యనేదు.

ఏడాది తర్వాత వూర్లో అడుగెట్టినా.. నాకు తెలిసిందేటంటే.. పోలి సిన కాపింటికి

సేరుకుందని... పొలం సంగతి సినకాపే సూసుకుంటుండనీను. సెప్పినాళ్ళు సెప్పొరుకున్నారా? ఇకయికలూ పకపకలూ జోడించి మరీ సెప్పిన్రు!

పొలం కెళ్ళి సూసినా.. దాన్నిండా యేపుగా యేవో సెట్లు పెరిగిన్నై.. వాటి సుట్టూ జొన్న సేను యేపుగుంది... ఆటి మద్దెన యెకరం పఁర్రా.. దొంగతనం సేసి దాగున్నట్టుంది. యెకరం పఁర్రలో యే పంటేసారో తెలియకుండింది. ఆడ్నించి సిన కాపింటికెళ్ళినా.. సిన కాపింట్లో గొడ్ల సావిడ్లో పోలి గొడ్డులా పడుంది. దానాకారం మాడట్టిపోయిన సిల్వరి బొచ్చెలా వుంది... నన్ను సూడగానే వచ్చి సుట్టుకు పోనాది... యేడ్నేదు... మర్సిపోయుంటాది.

సినకాపు... నాను... అటూ యిటూ రెండ్రోజుల తేడాగా పుట్టినం. ఆడి బతుకెందు కలా యెలిగి పోనాది.. ఆడెందు కలా యిర్రయిగిపోతండు... నా నెందుకిలా యిరుసుల మద్దె సెరకులా నలిగి పోతన్ను. యిదంతా పుట్టకల తేడానా?.. పుట్టక్కి యింత బలం వుందంటే... నమ్మ బుద్దేయలా! మరేంటి నమ్మ బుద్దేసింది, అంటవేమో అది బుర్రకి తట్టనేదు.

సిన కాపు నన్ను సూసి 'యేరా యెప్పుడ్రావడం' అంటూ యికిలించాడు. ఆ యెమ్మట్నే యిసయాని కొచ్చేసిండు. 'నీ బంజరు సెక్కలో పంటేసినా.. అదో యేడాది వరకూ అలానే వుంటది. నీకుద్దోగం సూసా - పట్నం యెల్లిపో.. ఆళ్ళుండడాన్కి సిన్న యిల్లు గూడా యిస్తారు' అండు

దేవుడు మాసెడ్డాడు.

వున్నూరొదిలి.. స్వంత పఁరిడిసి.. యీడు సెప్పినట్టూ పట్నం యెల్లాలా?... యెందుకు? ఆడి మాటెందు కినాలి?.. అని నిల్దీసే దమ్ములూ యివ్వనేదు. అడిగిం తర్వాత, యెదరయ్యే తుపాన్ని తట్టుకునే దుమ్ములూ యెట్టనేదు!

ఆ పాట్నే నానూ పోలీ పట్నం పారొచ్చినాం... పట్నం వచ్చేసినాక పోలి సెప్పిన యిసయం బుర్ర గింగుర్లెత్తి పోనాది.

'ఆ యెకరం పఁర్రా ఆడబ్బగారి సొమ్మా యేటి ప్రభుత్వం వారిమ్మంటే... ఆడి కొచ్చింది. ప్రభుత్వం అంటే ఎవరూ మావే... అన్నాడంట సినకాపు. అని గమ్మునున్నాడా?.. నా యకరం పఁర్రలోనూ గంజాయి సెట్టేయించినాడంట. ఆ సెట్టే యిస్తే ప్రభుత్వం వొప్పుకోదంట... ప్రభుత్వానికి తెలిస్తే.. ఆ పఁర్రే నాది కాదు... యేరిదో... ఆ సెట్లెవరేసిన్రో... అని సినకాపు తప్పుకోవచ్చుట.. ఆ పఁర్ర నాదే కాబట్టి పోలీసొళ్ళు నన్నట్టుకోవచ్చుట... అందుకే సినకాపు దూరం ఆలోచించి... నాకీ వుద్దోగం వేయించాడట... వో యేల పోలీసులొస్తే... ఆ సెక్కగలాడు పరారీలో వుండు. యేడుండో నాకు తెల్దు... అంటూ తప్పించు కోవచ్చుట... మేలే సేసిండు వొల్లకుండు...' అంటూ పోలి ఇచ్చకాలు సెప్పి... దానికేదో తెలియరాని విషయం తెల్సినట్టూ... అది సెప్పి నాకు సాయం సేసినట్టూ...

గొప్పలు పోనాది.

సినకాపు ఆలోచన్లు ఆడికి పనికొత్తున్నాయ్ మనకి ఆలోసన్లు రాడవే కరువు... వో యేళ వొస్సి సచ్చినా, వొల్లకుండాల. నేకపోతే, బతికి బట్టకట్టడం కల్ల... నా నేటి సేయనేను గాబట్టే పన్లో కెల్తన్నా వత్తన్నా... యీడా సుకం నేదు. వొళ్ళు వూనం అయిపోతాంది. కానీ యీడకీ ఆడకీ వో సిన్న తేడా నేకపోనేదు. ఆడేటంటే... ఆడ వూరూ నాదే... పఙ్రా నాదే... కానేదో భయం... నాను నాను కాదన్న భయం... నా నేరి కోసమో అన్న దిగులు... దొర్ల నీడ... పడగ నీడలా... జీవితాంతం యెంట తరిమి... బతుకెందు కంత పరాదీనం అయిపోనాదో అర్దం కానేదు!

ఈడా బాద నేదు... పనిసేస్తున్నంత సేపూ.. ఆడు సెప్పినట్టినుకోవాల.. ఆ తర్వాత ఆడెవరో, మన వెవరమో?...

ఈడికి మనాలోసనతో పన్లేదు... మన హాజరీ తోనే పని... సాలా యిసిత్రం యేటంటే... నువ్ తిన్నావో... కక్కావో.. యీళ్ళు కక్కర నేదు... పట్టించుకోరు... కులపూసుండదు... ఈళ్ళు కక్కరనేదు.

ఆడనా కాదు... నీ పెళ్ళాం నీళ్ళోసుకున్నా వూళ్ళో కబురే.. వొళ్ళిరుసుకున్నా వూళ్ళో వూసే... నువ్వెవడిదన్న దెవడికి అక్కరనేదు.... నీ కులవే నీ అక్కర! నీ పుట్టకేటి అన్న గోకు డెక్కువ... అదే మనగడకి తల్లేరు అన్న బ్రమ వదన్నేదు లమ్డికొడుకులికి! పెద్దకుల పాళ్ళెవ్వరూ వదల్నివ్వరు! ఎందుకూ? అది ఆళ్ళకి అచ్చొచ్చిన అబ్బగారి సొమ్ము! అందుకే మనవే యేదోటి సెయ్యాల... సంపడం వల్ల కసితీరుద్ది... ఆశ తీరదే.. మరేటి సెయ్యాల.... సదువు... నాకేటి తక్కువై పోనాదో దాన్ని... నాబొట్టిగాడి కమర్చాల... అదీ నా ఆలోచన... ఈడ నా ఆలోసన్ని కాదన్నాడెవడూ కనబడ్నేదు కానీ... పల్లెలో వొర్ణం వొంకెట్టి జీవితాన్ని కసాబిసా తొక్కేసే వుండాకోర్లుంటే... పట్నంలో మరో రకం దగా కోర్లెక్కువ...

ఎలా అంటవేమో? ఆడో రైల్వే కంట్రాక్టరు బాబున్నడు... ఆడికందని ఇంజనీరు నేడు.. పొందని కాంట్రాక్టూ నేదు. ఆడికీ ట్రాకు ఇన్‌స్పెక్టరుకూ దోస్తీ.. 'అదంతా డబ్బు దోస్తీ... అ దాడికి ముట్ట సెప్పి... ఆడు సెయాల్సిన పనిని మీ సేత కానించేస్తుండు...' "యెర్రి యెదవ్వల్లారా మీకు గ్రహింపు తక్కువ'' అంటాడు అప్పలసామి. అందుకే కంట్రాక్టరు అప్పలసామితో మంచి గుండి... సెయ్యి తడిపి, తనక్కావలసిన పన్లన్నీ గేంగోళ్ళ సేత సేయించుకుంటాడు.

అప్పలసామి కంట్రాక్టరు దగ్గర వాడి కేసిందాంట్లో కొంతెట్టి గేంగోళ్ళకి కాపు సారా పోయిస్తడు.. అదే ఈళ్ళ కొచ్చిన నాబం... సాకిరీకి దక్కుడూను.

పల్లెలో సినకాపుకి... పట్టనంలో కంట్రాక్టరుకి తేడా నేదు... ఇద్దరదీ వోటే పట్టు.. కాపోతే.. సినకాపు మడిసికి గంటెట్టి... రకతం జుర్రేస్తడు... అంబలి జుర్రినట్టు! ... ఈడు సన్నపాటి సూత్తో పొడిసి... రకతం పీలుస్తడు!

అయితే ఆడికీ ఈడికీ తేడా నేకపోనేదు. అదేటంటే ఆద్భుప్పుతే సింవాసనం మీద రాక్షసుడు కూకొని యెకిలించి నట్టుంటది, మరీడో? ఆడా మగా కాని సుండగాడు పోకిరీ పోయినట్టుంటది... దాంతోడు మెళ్ళో పులిగోరు పతకం.. నుదిట్న ఎఱ్ఱటి బొట్టూ!

ఈళ్ళ తేడా పసి గట్టినా, ఈడ్ని సదివేసినా. కానేటీ సెయ్యనేని బతుకే... అందుకే గుంటడికి నాలుగచ్చురం ముక్కలు సెప్పించినా!

ఈడికి నాలుగచ్చురం ముక్కలూ వంటబట్టినయో? లేదో? రైల్వే కంట్రాక్టరు మా యింటి కొచ్చిండు "వోరేయ్ ఈడు సదివిన సదూ సాలు గాని... నా దగ్గర కంపరా వుద్దోగం యిచ్చి పన్నేర్పుతా..." అండు.

ఆడట్టనగానే... నాగుండెల్లో గుబులట్టినాది... బయవేసింది.... బయం దేనికని అడుగుతవేమో? ఆడు నేర్పే పనేటో నాకు తెల్సు... దొంగ నెక్కలు... సేసే పన్లో బొక్కలు.. ఆడి రోజారీ జీవితం... అదే యీడికి నూరిపోస్తడు... ఆపదొస్తే... యీడ్ని ముందుకి తోసి... ఆడు తప్పుకుంటాడు... అదీ ఆడి వుద్దేశం... అదే గుంటడికి సెప్పినా... అదీడి బుఱ్ఱకెక్కనేదు... ఎందుకెక్కుద్దీ... ఈడాలోసనేటంటే... నెల కెంతోకొంత వొచ్చి జేబులో పడిపోవాల... ఈడికి సంపాదన తప్ప మరోటి కళ్ళకి కనబడ్లా... నాను నెత్తీ నోరూ బాదుకు సెప్పినా... ఆడంటడు... 'మరి గవర్నమెంటు వుద్దోగం సూపించు' అని.. ఆడికి గవర్నమెంటుద్దోగం నేనేడ సూపించనూ... అంత పరపతేడ్నుంచి పుట్టుకొస్తుంది?

సానా యేళ్ళ తర్వాత సిన కాపు దగ్గర కెళ్ళినా... ఆడంతా యినుకొని 'గవర్నమెంటుద్దోగాలు... యిప్పు డెక్కడేడుస్తయ్యిరా... ఆడ్ని నా దగ్గర కంపు... యేడో దగ్గర నే కుదురుస్తాగా' అండు.

కానీ యీడ్ని ఆడి దగ్గర కంపడం నా కిట్టంనేదు. యేల్నంటే.. ఆడి దగ్గరికి తోలేసినా.... ఈడి దగ్గర కుదిర్చినా గుంటడి బతుకంతా... రొచ్చు పాలే... ఆడిదే కాదు, ఆడి తరతరాలవర్కూ ఆ రొచ్చు గుంట నుండి తప్పుకోనేరు.

అయితే గవర్నమెంటుద్దోగంలో యేటూడబడి పోనాది అంటావా?... ఆడా వూడ బడి పోయేదేటీ నేదు... కానీ మన ఆలోసన్ల మీద.. బతుకుల మీద సవారీ జర్గదు... నాకా అద్రుట్టం అట్టనేదా? .. పఱ్ఱ పోయినా వుద్దోగం వల్ల కాస్త వూపిరి పీల్చుకోనేదా?... నాకు సదువు లేదు అన్న నిరాస పోయి... గుంటడికి సదువొచ్చిందే అన్న ఆశగా మారనేదా? కానీ సివర్న అర్థం అయిందేటంటే... సదువున్నా గూడా సాలదని! మరైతే యేటుండాలంటవేమో? వూపుండాల! యిది నా బతుకు... దీని మీద యెవడ్నీ సవారీ సెయ్య నివ్వను!... అన్న ఆలోసనుండాల! అది గవర్నమెంటు వుద్దోగంనోనే వుంది... అన్న యిసయం... నానీడ కొచ్చి, గేంగులో అడుగెట్టి నాకే బుఱ్ఱ కెక్కినాది.

ఈడికి వుద్దోగం సూపించినాననుకో... ఈడి బతుకు యెటు పరుగుచ్చుకుంటుందో? ఆడి బతుకుని ఆడే సమర్దించు కోవాల... ఆడికా అవకాశం యియ్యాల...

అది సిన్న కాపు నీడనో నేదు.. కంట్రాక్టరు అండలో కుదర్దు... అదీ నా ఆలోచన!

ఈడికి గవర్నమెంటు వుద్దోగం యిప్పించే పలుకుబడి నాకు నేదు. మా గేంగులో అప్పలసావి అన్నట్టు... 'సట్టం రూల్సూ యెవడకీ పనికిరావు దాన్లో లొసుగులే... మడుసుల్ని ఆదుకుంటాయ్! సట్టం... రూల్సు... పాటించాలని... అదే సరైన దారి అని యెవడేనా సెప్పచ్చు.. కాని సట్టాన్నీ రూల్సునీ...కన్నుకప్పక పోతే బతకలేవని జీవితం సెపుతుంది' అంటడు. ఆడి మాట్లు అప్పుడప్పుడు బుర్రకెక్కుతయ్!

అందుకే రోజూ నిలేసి 'నువ్వేటి సెయ్యగలవ్ యేటీ సెయ్యనేవు' అనడుగుతున్న గుంటడ్నీ ఆడికి వంత పాడుతూ 'ఈడుండి మనకేటి వొరు గుద్ది... ఆడివల్లేటి జరగదు... నీ దారి నువు సూసుకోరా!' అంటున్న పోలిని సూసేసరికి... జీవితంలో తెగింపొచ్చేసినాది.

గుంటడి మాటలో నిజవుందనిపించినాది. నేనేటి సెయ్యలేను... నేనుండీ అడ్డాదు కోనేకపోతన్నాను.. కానప్పుడే మెరుపు లాంటి ఆలోచనొచ్చింది... నా నుండేటీ సెయ్యనేను... కానీ పోతే సెయ్యగల్ను.. నాను డూటీలో పోతే... యీడికి గవర్నమెంటుద్దోగం యిస్తది. ఈడికి అచ్చరం ముక్కొచ్చు గాబట్టి... నాలా సుత్తట్టుకు ట్రాకులంట తిరగక్కర నేదు. ఈడికుద్దోగం వస్తే... కంట్రాక్టరు ఈడ్ని మర్సిపోతాడు... అదే నా ఆలోసన... నా ఆలోసనెవడూ పట్టనేడు!!!

అందుకే ఆ రోజు తెలుసుండీ... మలుపులో కెళ్ళినా... అదే యేళకి గోదారి బండి మలుపు తిరుగుద్దని... అది దాని రోజారీ డూటీ అని నాక్తెల్సు! దాని డూటీ కడ్డొచ్చి నాళ్ళని అది చమించదు. దాని కడ్డొద్దామని కాదు నా వుద్దేశం... మరేంటంట వేమో? దాని కెదురెళ్దామని... నా ఆలోసన.. ఆలోసన్లో అట్టడుగునున్న వుద్దేశం యేరు.... అంటవేమో... నిజవే... నేను సేసిన పని నాక్కలిసొస్తదా?... రాదా? అన్న ఆలోచనతో బుర్రేడెక్కి పోతాంది. కానీ యింతకన్న నువ్వేటి సెయ్యగలవు? అని నిల్దీసి అడిగే గుంటడి ఆకారం తుపాను గాలిలా సుళ్ళు తిరుగుతూ కళ్ళ ముందు గిరికీలు కొడుతోంది.... ఆడ్ని....ఆడి తుపాను గాలిని... తట్టుకు నిలబడ్డం కట్టంగా వుంది.

నా ఆలోచన్లో నేనుండగానే...'గోదారి' మలుపు తిరిగిపోనాది... గుద్దేసినాది.. అది గుద్దిన గుద్దుకి గుండెలవిసి పోనాయి. గుండెలవిసిపోనాయి అని తెలిసీ సరికి, నాను పట్టాల మీద పడిపోనాను... చేతిలో సుత్తి కేడ పడిందో?.. నోట్లోంచి కారుతున్నదేటో... అర్దమయ్యేనోగా ఇనపసెక్రం ఈడ్చేసింది... యెంత దూరం ఈడుస్తుంది?...అది దాని కీలుపడ్డు! కోసేసింది... ఈడల్లే గదా... రోజూ పట్టాల మీద, చేమంగా తిరుగుతున్నానన్న యింగితం నేకపోనాది దానికి... దాని కేటి నా బొట్టెడికీ నేదు.... యెప్పుడు 'నీకు సదూ నేదు... ఆలోసన్నేదు' ... అంటూ దెప్పడమే! సరి! కోసేసిన గోదారి రెండుగా సేసి... దాని మనానది పోనాది. అదీడ్సిన నిముసం బరింపరాని నరకం... తర్వాత... అన్ని బాదలకీ మందు.. అన్ని పీడలకీ యిరుగుడు. సావు!

గంటో... రెండు గంటల్తర్వాతో.. గేంగోళ్ళు నన్నెతుక్కుంటూ మలుపులో కొచ్చిర్రు... ఆళ్ళందర్లోకీ అప్పలసావి అనుమానించిండు... ఆడికి అంతో ఇంతో నేనడుతున్న బాధ మనసునో కింకింది... ఆడే గొణుక్కుండు 'ఈడిందుకా రోజూ గవర్నమెంటు రూల్సు అడిగిండు' అనుకుని గమ్మునూరుకుండు!

మిగతావాళ్ళు ముక్కలైన శరీరాన్ని... రైల్వే హాస్పటలుకి తోలుకుపోయి, వొకటిగా సేసి కుట్టించి... కాల్సేసినారు.

ఈడి సావు... ఈడి కుటుంబానికి నట్టం ఆళ్ళకి తీరని కట్టం... అన్జెప్పి అప్పలసావీ... ఆడితో పాటూ యూనియన్లూ... "ప్రబుత్వాన్ని తింటారా? ప్రబుత్వం నా కొడుక్కి వుద్దోగం ఇవ్వక తప్పదు!.. ఏవంటావ్?''

"నేనేవంటాను... ముగ్గురూ కల్సి నిన్ను హత్య చేసేరంటాను''

ఆశ్చర్యపోయింది సింహాచలం ఆత్మ "అదెట్టా... సినకాపు... కంట్రాక్టరు.. కలిసి నా బతుక్కి అగ్గెట్టే సారంటే... కొంత వరకూ సబబుగా వుంది కానీ ఈ మూడో వాడెవడూ?...అని''

"నువ్వు చస్తే గాని, నీ కొడుక్కి మనుగడ కల్పించని ప్రభుత్వం... అది సృష్టించిన రూల్సు... ప్రజా ప్రభుత్వం..... డెమొక్రసీ... కాదు డెమన్స్ కసి! నీ చావుకి అదే కారణం! నిన్ను హత్య చేసిందదే!''

"నిజవా?'' అంటూ ఆశ్చర్యంగా పక్కకి తిరిగింది సింహాచలం ఆత్మ!

పక్కనే వూళేస్తూ మాట్లాడినవాడి జాడ ఎక్కడా కనబడలేదు. ఎక్కడో పత్తి పంటేసిన వాణ్ణి వెతుక్కుంటూ పోయుంటాడు... వాడి కథ వినడానికి!

హత్య *(రచన, అక్టోబరు 2000)*

# దహాతి

తిరుపతి రెడ్డి అరుగు మీదున్న నులకమంచం తీసుకొచ్చి ఆరుబయట వాకిటిలో వేసుకు కూర్చున్నాడు. జేబులోంచి చుట్ట తీసి దాని వెనుక భాగాన చిన్న కొరుకు కొరికి ఉమ్మేశాడు. చుట్టని నోట్లో పెట్టుకొని జేబులు తడుముకున్నాడు. జేబులో అగ్గిపెట్టె లేదు. 'ముసల్ది ఏ పొయ్యి అంటించడానికో తీసి, ఎక్కడో గూట్లో పెట్టేసింది. అనుకున్నాడు. లేచి వెళ్ళి అగ్గిపెట్టె వెతుక్కు తెచ్చుకునే ఓపిక లేక అక్కడే అలా కూర్చున్నాడు. అలాంటి సమయాల్లో రాజా జ్ఞాపకం వచ్చేడు. రాజా ఉంటే "నే తెస్తా నాన్నా" అని వెళ్ళి తీసుకొచ్చేవాడు.

రాజా జ్ఞాపకం రాగానే వీధి గుమ్మం వేపు చూశాడు. తిరుపతి రెడ్డి. పదేళ్ళ నుంచి ఆ గుమ్మం వేపు అలా చూస్తూనే ఉన్నాడు.

రాజా ఉరఫ్ రాజాశేఖర్ రెడ్డి ఆ గుమ్మంలోంచి పదేళ్ళ క్రితం బైటకి వెళ్ళాడు. అదీ తండ్రి మీద కోపంతో. కోపం తగ్గాక వాడే వస్తాడన్నారు చాలా మంది. కానీ, రాజా తిరిగిరాలేదు. వస్తాడు, వస్తాడు అనుకుంటుండగానే పదేళ్ళ గడిచాయి. మొదట్లో తిరుపతి రెడ్డికీ నమ్మకం ఉండేది రాజా వస్తాడని, ఏర్పడ్డ వైమనస్యం తొలగిపోతుందని. కానీ, రోజులు గడిచేకొద్దీ ఏవేవో అస్పష్టమైన వార్తలు వినిపించసాగాయి. ఆ వార్తల్లో నిజం ఎంతో, అబద్దం ఎంతో, దానికి తనెంతవరకూ బాధ్యుడో అని ఆలోచించి ఆలోచించి అంతు తెలీని మానసికక్షోభకి గురయ్యాడు.

తిరుపతి రెడ్డికి పదేళ్ళక్రితం అరవైఏళ్ళు. అతను ఊరికి పెద్ద కర్రపట్టుకుని, కిర్రు చెప్పులేసుకుని నడిస్తే, దారినపోయే ఊరి జనం గౌరవంగా పక్కకి తప్పుకునేవారు. ఆ ఊర్లో అతను మోతుబరి రైతు. ఊరిని శాసించగల దిట్ట. ఇప్పుడదంతా గతం.

పదేళ్ళలో ఎంత మార్పు జరిగింది. ఈ పదేళ్ళతో రెడ్డికి డెబ్బై ఏళ్ళు నిండాయి. కానీ, ఇప్పుడు తిరుపతిరెడ్డి తొంబైయేళ్ళవాడిలాగ కనిపిస్తాడు. చూపులో గాంభీర్యం పోయింది. పలకరించిన వాళ్ళకి హుందాగా సమాధానం చెప్పే రెడ్డిని ఇప్పుడు ఎవరూ పలకరించరు. అతని నడకలో నెమ్మది, ఠీవి పోయాయి. వాటి స్థానంలో చిన్న తొందర, అస్తవ్యస్తమైన నడక చోటు చేసుకున్నాయి. కనిపించిన వాళ్ళని గాంభీర్యంగా కుశలమడిగే తిరుపతి రెడ్డి, ఇప్పుడు ఎవర్నీ పలకరించడం మానేశాడు. గ్రామంవాళ్ళు కూడా అతన్ని గుర్తించడం మానేశారు. అన్నిటినీ మించి పదేళ్ళలో రాజా కోసం ఎదురు చూసి ఎదురు చూసి చూపులు వెదికే చూపులుగా మారిపోయాయి. ఆ వెదకులాటలో కూడా తీవ్ర ప్రకృతి అతని చూపులు పిచ్చి చూపులైపోయాయి. అతను ఎవరి రాక కోసమో ఎదురు చూస్తున్నట్లు ఊరిపొలిమేరల్లో, బస్టాండ్‌లో, రైల్వే స్టేషన్‌లో పరధ్యానంగా తిరగడం,

వచ్చిన ప్రయాణికుల్ని పిచ్చిగా పరిశీలించడం చూసి కొందరు అనుమానంగా చూశారు. ఆ తర్వాత అతన్ని పట్టించుకోవడం మానేశారు.

రెడ్డి కనిపించినా, అతని గురించి ఎవరేనా విషయం ప్రస్తావించినా ఊరిలో జనం బాధపడడం మినహా ఇంకేం చేయలేకపోతున్నారు. రెడ్డిని ఇంట్లోనే ఉండేటట్లు చేద్దామనుకున్న ఊరి పెద్దల ప్రయత్నం ప్రయత్నంగానే ఉండిపోయింది. రెడ్డి ఎవరికీ ఎదురు చెప్పడం కాని, విపరీతంగా ప్రవర్తించడం కాని చేసేవాడు కాదు. పదిరోజులు రెడ్డిని ఇంట్లో కట్టడి చేస్తే ఇంట్లో బుద్దిగా కూర్చునేవాడు. కానీ అందరూ 'ఇంక పర్వాలేదు' అనుకునే సమయానికి ఇంట్లోంచి మాయం అయిపోయేవాడు.

ఆ రకంగా ఒకరోజు ఆయన పక్కనున్న ఊళ్ళోకి వెళ్ళి తిన్నగా చెప్పుల దుకాణంలోకి వెళ్లాడు, అక్కడ షోకేసులో పెట్టిన చెప్పు తీశాడు. షాపు యజమాని వచ్చేలోగా ఆ చెప్పుతో నెత్తిమీద గబగబా కొట్టుకున్నాడు. "అరె రెడ్డిగారు ఏమిటిది" అని పట్టుకున్న కొట్టు యజమానిని చూసి "ఏం ఆడవాళ్ళ చెప్పుతో గాని కొట్టుకోకూడదా" అని ఆడవాళ్ళ చెప్పు తీసి కొట్టుకున్నాడు. షాపు యజమాని చెప్పు లాక్కుని "అరెరె, తప్పండీ రెడ్డిగారూ" అన్నాడు.

"ఏం నువ్వే కొడతావా? కులానికి మాదిగవాడివైనా, చెప్పులు కుట్టడమేకాదు, చెప్పుతో కొట్టే హక్కు కూడా సంపాదించావు. కొట్టవోయ్. కొట్టే. లేకపోతే రాజాని కాదంటానా? నీ కూతుర్ని తిరస్కరిస్తానా? కులం మదంగాణ్ణి! తప్పులేదు కొట్టు" అంటూ షాపు యజమాని ముందు చతికిలబడ్డాడు. ఆ షాపు యజమాని కళ్ళనుంచి రెండు కన్నీటి బొట్లు రాలినై. ఆ రోజు అతను పట్నంలో ఉన్న కూతురికి షాపులో జరిగింది రాశాడు.

"నాన్నా ఇదంతా రెడ్డి గారి భ్రమ. దానికి కారణం రాజా తండ్రితో నా విషయం తీసుకొచ్చి ఘర్షణ పడడం! ఇల్లు వదిలి వెళ్ళిపోవడం! రాజాకున్న ఆదర్శాలూ, స్వప్నాలూ వేరు. అందులో నేను ఒక పాత్రని మాత్రమే. ఇద్దరి అభిప్రాయాలూ కలియడం వల్లనే అతనికీ, నాకూ మధ్య పరస్పర అనురాగం ఏర్పడింది. ఇద్దరం కలిసి ఏదేనా ఆదివాసీ గ్రామంలోకి వెళ్ళి అక్కడే నివసిస్తూ ఆ గ్రామాన్ని, ప్రజల జీవితాన్ని అభివృద్ధి చేద్దాం అనుకున్నాం. మా ఇద్దరి పెళ్ళికి రెడ్డి గారు అనుమతించలేదు అంటే రాజా కోపం తెచ్చుకున్న మాట నిజం కానీ, విరక్తి కసి అన్నవి రాజా జీవితంలో లేవు! ఇంక రాజా తీవ్రవాది అయ్యాడా లేదా అన్నది చిక్కు వీడని ప్రశ్న. అన్నీ తెలిసి తెలీని వార్తలే. రెడ్డిగారి పరిస్థితికి జాలిపడ్డం మినహా మనం చేయగలిగిందేముంది? రాజా ఏమిటో నీకూ తెలుసు..." అంటూ ఆమె తండ్రికి తిరుగు ఉత్తరం రాసింది.

ఒక రోజు భార్య ఆరేసిన ఎర్ర చీర ఎత్తుకుపోయాడు తిరుపతి రెడ్డి. ఆ ఊర్లో

ఉన్న పోలీసు స్టేషన్‌కు వెళ్ళాడు. ఆ చీరంతా ఒంటికి చుట్టబెట్టుకుని పోలీసుస్టేషన్‌కు ఎదురుగా నిలబడి "రండిరా రండి! కాల్చండి. లేకపోతే ప్రజల బతుకులు మార్చేస్తా! పేదోళ్ళ రాజ్యం తెచ్చేస్తా! వీలైతే ప్రభుత్వాన్ని పడగొట్టేస్తా! హ హ హ ! రండి కాల్చండి!" అంటూ శివతాండవం చేశాడు. మెదట్లో పోలీసులు గాభరాపడ్డా ఆ తర్వాత అతన్ని పట్టించుకోవడం మానేశారు. అంతేకాదు అతని భార్య ఎర్ర చీర బయట ఆరేయడం మానేసింది.

రెడ్డిగారి మీద గౌరవంతో ఆ ఊరి పోలీసు ఇన్‌స్పెక్టర్ తన పరిధిలో ఎంక్వైరీ చేశాడు కానీ, పోలీసుల నుంచి, ఆదివాసీ గ్రామ ప్రజల నుంచి స్పష్టమైన కబురు ఏదీ తెలియలేదు.

ఆరోజు సంక్రాంతి. పొద్దున్నే నులకమంచం మీద కూర్చున్న రెడ్డికి గుమ్మంలో కొమ్మదాసరి పాట వినిపించింది...

'తెలుగు రైతుల చేల ధాన్యాల రాశి
చేతి నిండగ దానధర్మంబులయ్యా
వాసికెక్కును నీ దాన గుణంబు' అంటూ.

రెడ్డి నులక మంచంమీంచి చటుక్కున లేచాడు. కొమ్మ దాసరి దగ్గరకు వెళ్ళాడు. "బస్తా ధాన్యం ఇస్తాను పట్టుకెళ్తావట్రా" అని అడిగాడు. కొమ్మ దాసరి ఇదేం పట్టించుకో లేదు. "ఏరా, పిడికెడు కోసం దేవురించకు. బస్తా మోసుకెళ్ళగలవా? నేనూ అంతే. బస్తాల కోసం ప్రార్థించాను. బస్తాలతో ఇల్లు నిండింది కానీ, అసలువాణ్ణి దాచేశాడ్రా దేవుడు. లోపలికెళ్ళి నీక్కావలసింది పట్టుకుపో" అని మళ్ళీ నులక మంచం దగ్గరకెళ్ళి దానిమీద కూర్చున్నాడు.

అతని భార్య కొమ్మదాసరిని లోపలికి పిలిచింది "సాయంకాలం బండి వేసినప్పుడు రెడ్డిగారి నోటమ్మట వచ్చినట్టూ బస్తా ధాన్యం పంపిస్తాను. ఇల్లు ఎక్కడో మా పాలేరుకు చెప్పు" అంది.

పూర్వపు రెడ్డి ఏమిటో తెలుసు కొమ్మ దాసరికి. ఆ ఇల్లేమిటో తెలుసు. కళ్ళ నీళ్ళతో ఆవిడకి నమస్కరించి, మరి తిరగడానికి మనస్కరించక ఇంటికి వెళ్ళిపోయాడు. ఆ సాయంత్రం కొమ్మ దాసరి ఇంటికి బస్తాడు ధాన్యం చేరాయి.

ఈ విషయం ఊరిలో తెలిసింది. రెడ్డి సంగతి ఊరందరికీ తెలుసు. ఇదంతా అతని ఉన్మాదంగా, విరక్తిగా ఏవేవో కారణాలు చెప్పుకున్నారు కానీ, తెల్లవారేసరికి తమకో బస్తా ధాన్యం వస్తాయేమో అని అతని గుమ్మం ముందు ఊరివాళ్ళందరూ కొమ్మ దాసర్ల వేషం వేసి నిలబడలేదు. ఎదుటివారి లోపాలు తమ సోపానాలుగా చేసుకునే పట్నం ప్రజల ప్రకృతి వారికి అలవడలేదు.

ఒక రోజు రెడ్డి ఊరికి పదిమైళ్ళ దూరంలో ఉన్న స్టేషన్‌కి వెళ్ళాడు. స్టేషన్‌లో రైలాగి ఉంది. స్టేషన్‌లో గంట కొట్టారు. స్టేషన్ మాస్టర్ రెండు జండాలూ పట్టుకువచ్చి, సిగ్నల్ కోసం తొంగి చూశాడు. సిగ్నల్ ఇచ్చేశారు.

రెడ్డి తిన్నగా స్టేషన్ మాస్టర్ దగ్గరికి వెళ్ళాడు. చేతిలో రెండు జండాలూ లాక్కుని దూరంగా విసిరి పారేశాడు "ఒరేయ్. జండాలు చూపించి రైలాపడం కాదురా, నీకు దమ్ముంటే చేత్తో రైలాపు" అంటూ పరుగెత్తి ఇంజను ముందుకెళ్ళి రెండు చేతులతోనూ రైలును పట్టుకున్నాడు. అది చూసిన స్టేషన్ మాస్టరూ, కొందరు పోర్టర్లూ అతని వెనకాలే పరిగెత్తారు. సిగ్నల్ ఇచ్చేశారు. రైలు స్టార్ట్ చేశారేమో అని అనుమానం వచ్చిన ఒక పోర్టరు తన షర్ట్ విప్పి పైకి పెట్టి ఇంజన్ డ్రైవరుకి కనిపించేటట్టు ఊపాడు. ఈలోగా అక్కడికి చేరిన స్టేషన్ మాస్టర్, మిగతావాళ్ళు రెడ్డిని పట్టుకుని బలవంతాన పట్టాల పక్కకి తీసుకొచ్చారు. ఇంతలో ఎవరో రెండు జండాలూ తీసుకొచ్చి స్టేషన్ మాస్టరుకి ఇచ్చారు. ఆయన పచ్చ జండా ఊపి రైలుని పోనిచ్చేశాడు.

రెడ్డి మాత్రం పట్టుకున్నవాళ్ళని విదిలిస్తున్నాడు. "ఆపుతా! జండాతో కాదు, సొంత చేత్తో ఆపుతా! నేను రెడ్డి బిడ్డణ్ణిరా!" అంటూ పెనగులాడుతున్నాడు.

రైలు వెళ్ళిపోయింది. రెడ్డిని వదిలేసి అందరూ ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు. కానీ, రెడ్డి వెళ్ళిపోలేదు. తిన్నగా స్టేషన్ మాస్టరు గదిలోకి వెళ్ళాడు "మళ్ళీ రైలు ఎప్పుడు వస్తుంది" అని అడిగాడు.

"ఎందుకండీ" అని శాంతంగా తిరిగి ప్రశ్నించాడు స్టేషను మాస్టరు.

"మళ్ళీ రైలుని చేత్తో అపడానికి" అంటూ పకపకా నవ్వాడు కుర్ర క్లర్కు. స్టేషన్ మాస్టరు మాత్రం నవ్వలేదు.

"కాదు" అని అరిచాడు రెడ్డి కుర్ర క్లర్కు నవ్వాపేశాడు.

"రైలుని ఆపలేకపోయాను. రైల్లో వెళ్ళలేకపోయాను. ఇంక రైలు కింద నలిగిచావడమే ఈ జీవితానికి మిగిలింది. ప్చ్.... రైలు వెళ్ళిపోయింది" అంటూ సీరియస్‌గా స్టేషన్‌లోకి వెళ్ళిపోయాడు. స్టేషన్ మాస్టరుకి బెంగ పట్టుకుంది. ఇంతకుముందు ఎప్పుడు స్టేషన్‌కి వచ్చినా రెడ్డి కొడుకు కోసం కంపార్టుమెంటుల్లో వెదకడం, సిమెంటు చప్టా మీద కూర్చుని కొడుకు కోసం పిచ్చిగా ఎదురు చూడడం తప్పించి ఇలాగ ఎప్పుడూ ప్రవర్తించలేదు. వయసు పెరిగినకొద్దీ కొడుకు సంస్కారాన్ని తిరస్కరించాననే తపన రెడ్డి మనసులో పెరిగి, అది మెల్లమెల్లగా తీవ్ర ప్రకృతిలోకి మారుతోంది. ఈ స్థితిలో రెడ్డి ఏం చేసినా చెయ్యవచ్చు అనుకుని, పోర్టర్లని పిలిచి రెడ్డిని మంచి మాటలతో స్టేషన్ నుంచి పంపెయ్యమన్నాడు.

పోర్టర్లు రైలు వచ్చే టైమ్‌కి ఇంటికి వచ్చి చెప్తామని చెప్పి రెడ్డిని వాళ్ళ ఊరికి తీసికెళ్ళి దిగబెట్టేశారు.

* * *

తిరుపతి రెడ్డి చెరువు గట్టు మీద నుంచి నడుస్తున్నాడు. చెరువుగట్టుకి కొంచెం దూరంగా చాకలివాళ్ళు నీళ్ళ చెలమ చేసి బట్టలు ఉతుకుతున్నారు. చెరువు గట్టున దుంగ పాతి, దానికి తాడు కట్టి దానికి చిన్న నావని కట్టారు. చెరువులో పడుతున్న చిన్న అలలకి నావ ఒడ్డుకి కొట్టుకుంటున్నది. ఆ నావకి దూరంగా ఒక యువకుడు చేపలు పడుతున్నాడు. గాలం చెరువులో వేసి పుస్తకం చదువుకుంటున్నాడు. అతని గాలానికి చేప దొరికినట్టుంది. గాలాన్ని లాగి దానికి చిక్కుకున్న చేపని తప్పించి, ఒడ్డుమీద పడేశాడు. మళ్ళీ కొక్కేనికి చిన్న చేపని తగిలించి గాలాన్ని నదిలోకి విసిరేసాడు.

ఒడ్డున పడ్డ చేప పైకి ఎగిరిపడుతోంది. విలవిలా కొట్టుకుంటోంది. తిరుపతి రెడ్డి వెళ్ళి చటుక్కున చేపని తీసి చెరువులో పారేశాడు. ఆ కుర్రాడు ఆశ్చర్యపోయాడు.

"ఏమండి, ఏమిటది'' అంటూ లేచాడు ఆదుర్దాగా.

"ఒడ్డున ఉన్న మనము చాలమురా రోజూ కొట్టుకుంటూ చావడానికి, మనకి తోడు చేపలు కూడానా'' అంటూ ఆ యువకుడి చేతిలో ఫిషింగ్ రాడ్ లాక్కున్నాడు. ఆ యువకుడు రెడ్డిని ఒక్కతోపు తోశాడు. రెడ్డి కింద పడిపోయాడు.

ఆ యువకుడు ఈ ఊరివాడైనా చిన్నప్పటినుంచీ పట్నంలో చదువుకుంటున్నాడు. రెడ్డి గురించిగానీ, గ్రామంలో విషయాలుగానీ ఏమీ తెలియవు.

కిందపడిపోయిన రెడ్డిని "పిచ్చొడులాగున్నాడు'' అనుకొని రెడ్డి చేతిలో ఫిషింగ్ రాడ్ లాక్కున్నాడు. బలంగా రెడ్డి మంకుపట్టు పట్టలేదు. పసిపిల్లాడిలా చూశాడు ఆ యువకుణ్ణి. ఆ యువకుడు రెడ్డిని తోసెయ్యడం, చేతుల్లోంచి ఫిషింగ్ రాడ్ లాక్కోవడం చూసిన ఇద్దరు ముగ్గురు చాకలి వాళ్ళు పరిగెత్తుకు వచ్చారు. కిందపడిపోయిన రెడ్డిని లేపి "మీరు వెళ్లండి బాబూ'' అంటూ రెడ్డిని అక్కడ నుంచి పంపించేశారు.

ఆ కుర్రాడికి ఆశ్చర్యం వేసింది అంత గౌరవం ఉన్నవాడు అలా ప్రవర్తించాడు ఏమిటి అని. కానీ, చాకలివాళ్ళతో "ఆయన నే కష్టపడి పట్టిన చేపని చెరువులోకి విసిరేశాడండి'' అన్నాడు.

"బాబూ, ఆయన మనసు చెదిరింది. ఒకానొకప్పుడు ఈ ఊరికి పెద్ద, వయసులో ఉన్న కొడుకు జాడ తెలీకుండా పోయాడు. ఆ కొడుకుపోయిన శోకంతో మీద పడ్డ వయసుతో ఆయన ఇలా తయారయ్యాడు. వివరాలు మీ నాన్నగారికి తెలుసు బాబూ. వెళ్ళి అడగండి చెప్తారు'' అని తమ పనుల్లోకి వెళ్ళిపోయారు చాకలాళ్ళు.

రెడ్డి గురించి అడిగిన కొడుకుని చూసి "అవున్రా, రెడ్డి ఈ ఊరికి పెద్ద, మోతుబరి. దేనికీ లోటు లేదు. అతనికి ఒక్కడే కొడుకు. అసలు కథంతా రాజా ఎవరినో పెళ్ళి చేసుకుంటానన్నాడు. కులం కాని అమ్మాయిని చేసుకోవడానికి వీల్లేదన్నాడు రెడ్డి. రాజా కోపగించి, తండ్రితో ఘర్షణ పడి ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. ఊరి పెద్దలు "రాజాయే మారుతాడు. కొన్నాళ్ళకు తిరిగివస్తాడు'' అన్నారు. కానీ రాజా చదువుకు స్వస్తి చెప్పి ఒక ఆదివాసీ గ్రామంలోకి వెళ్ళి అక్కడ నివసించడం మొదలు పెట్టాడన్న కబురు తెలిసింది. రెడ్డి కొన్నాళ్ళు బింకంగా ఉన్నాడు. కానీ, రాజా గురించి చిత్రవిచిత్రమైన కబుర్లు తెలిసేవి. నక్సలైట్లతో సంబంధాలు పెట్టుకున్నాడని, వాళ్ళతో తిరుగుతున్నాడని, ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడని వగైరా వగైరా. ఇవన్నీ వార్తలు- నీలివార్తలే! నిజం ఎవరూ చెప్పలేకపోయారు. ఈ వార్తలు భరించలేని రెడ్డి విషయం తెలుసుకు రావడానికి మనుషుల్ని పంపాడు. కానీ, వాళ్ళు కూడా ఏవేవో వార్తలు తెచ్చారు. పోలీసులు మాకేం తెలియదన్నారు. రాజా మాత్రం మరి కనబడలేదు. తిరిగి రాలేదు. ఊరివాళ్ళంతా ఇలా చేస్తే బావుండేది. అలా చేస్తే బావుండేదీ అనేవారే కానీ, రాజావి, ఆ అమ్మాయివి ఒకే ఆదర్శాలని, రెడ్డి పెళ్ళికి ఒప్పుకున్నా రాజా, ఆ అమ్మాయి అదేదారిలో ప్రయాణించేవారని చాలామంది అభిప్రాయం, కాకపోతే అప్పుడు పరిస్థితి మారి ఉండేదేమో? లేదా రాజా శవాన్ని కళ్ళతో చూసి ఉంటే, రెడ్డికి ఈ తపన ఉండేది కాదేమో? సానుభూతులు, పరామర్శలూ, వదంతులతో రెడ్డి మనసు విచలితమై పోయింది. తిరిగి రాని సమయాన్ని, తన నిస్సహాయతని తలచుకు, తలచుకు రెడ్డి ఇలా తయారయ్యాడు. ఈ మధ్య కొంచెం విపరీతంగా ప్రవర్తిస్తున్నాడని వింటున్నాం. విని బాధపడ్డం మినహా చేసేదేముంది'' అన్నాడు ఆ కుర్రాడి తండ్రి బాధతో.

అప్పుడే "వివిధ్ భారతి''లో లతా మంగేష్కర్ ఘోషిస్తోంది.

"బడా కంజోర్‌హై ఆద్మీ అభి లాఖోంహై ఇస్‌మే కమీ''.... అంటూ.

"అవును ఎన్ని లక్షల బలహీనతల్ని కలిగున్నాడో కదా ఈ మానవుడు'' అనుకొన్నాడు ఆ పట్నం కుర్రాడు.

తెలతెలవారుతోంది. ఊరిలోనున్న గుడి మైకులోంచి ఘంటసాల భగవద్గీత వినిపిస్తోంది. సాంఖ్యయోగం చదువుతున్నాడు.

"నైనం చిన్దంతి శస్త్రాణి, నైనం దహతి పావకః'' అంటూ.

పరమేశ్వరశాస్త్రి నోట్లో పందోంపుల్ల పెట్టుకుని ఇంటి అరుగుమీదికి వచ్చాడు. ఎదురుగా ఆవరణలో తులసికోటను ఆనుకొని కూర్చున్న తిరుపతి రెడ్డి కనిపించాడు. శాస్త్రిని చూడగానే తిరుపతి రెడ్డి లేచాడు.

"శాస్త్రీ ఏమన్నావ్, ఆత్మ కోయబడదు, దహించబడదూ అనా? కాదురా శాస్త్రీ

నా రాజా నన్ను దహిస్తున్నాడు. ఏడీ, ఏ శాస్త్రకారుడూ నైనం దహతి పుత్రః అన్నాడా? ఎవడైనా అంటే చెప్పు!'' అంటూ వీధిలోకి వెళ్ళిపోయాడు.

పరమేశ్వరశాస్త్రికి రెడ్డి చిన్నప్పటి నుంచీ తెలుసు. "ఇద్దరిదీ ఒకే ఊరు. ఇద్దరూ ఆ ఊరికి మూలస్తంభాలలాంటివారు. ఇప్పుడు మూలస్తంభం మూలమే కదిలిపోయింది. పుత్రశోకం మనిషిని విచలితుణ్ణి చేసినట్టుగా మరో శోకం దహించదు. అదీ డెబ్భైఏళ్ళకి, ఎదురుగా రాజా పోయి అతని చావును ఆ క్షణంలో అనుభవించి ఉంటే రెడ్డి మనసు ఇంతగా తపించకపోనేమో! సజీవంగా కోపంతో తనని తిరస్కరించి వెళ్ళిపోయిన కొడుకు రూపం రోజురోజుకీ మనసులో పెరిగి రెడ్డి మనసును దహించేస్తోంది.! ఇది చల్లారేది చితిమీదే ఏమో! అనుకున్నాడు, శాస్త్రి నిట్టూరుస్తూ. దూరంగా పెళ్ళి పందిరిలో మైకు నుంచి "నెనరెల్ల అనలాన నీరైననాడు నెమ్మది నాకింక కనరాదు''.... అన్న పాట వస్తోంది.

*దహతి* *(ఇండియా టుడే, 21 ఏప్రిల్ 1998)*

# టచ్

చలికి వేళ్ళు కొంకర్లుపోతున్నాయి. చీర చెంగు ముసుగులా కప్పుకుని బస్ స్టాండ్‌లో నిలుచుంది సావిత్రి. నిన్న నిలుచుంది, ఇవాళ నిలుచుంది. రేవు నిలుచుంటుంది.

ఇదే విధంగా గత పదేళ్ళుగా నిలుచుంటోంది. రోజూ బస్‌కోసం చూడడం దుర్భరంగా ఉంది. ఈ దుర్భరత, అసహనం, ఒక్క బస్‌స్టాండులోనేకాక.. ఆఫీసులో, ఇంటిలో... ఎక్కడ ఉన్నా సావిత్రిని అగ్నిజ్వాలల్లా వెంటాడుతున్నాయి.

ఆఫీసులో వెంకట్రావు, మార్గరెట్ ఒకేసారి రికార్డురూములోకి ఎందుకువెళతారో? అని తలచుకున్నప్పుడల్లా అసహనం... ఈ అసహనం వెనుక, తను కూడా రికార్డు రూములోకి పిలువబడాలనే ఆశ ఎక్కడేనా ఉందేమో? కాని ఆ కోర్కెకి స్పష్టత లేకపోవడం వల్ల... దానిని అదుపులో పెట్టాలనే మానసిక వత్తిడివల్ల శరీరంలో ఎక్కడో కంపనం.... మనస్సులో భయం.

పదేళ్ళ క్రితం, తనని మావయ్య బాత్రూములో ఒడిసి పట్టుకున్నప్పుడు... శరీరం కంపించింది. అతికష్టం మీద మామయ్య నించి తప్పించుకుంది. మావయ్య చూపులో ఆరాటం..... మాటల్లో లాలన.... నిజమనుకుంది కాని పెళ్ళి అయిన తర్వాత ఏ సరసాలేనా అని స్పష్టంగా చెప్పేసింది. మామయ్య ఎంత కమ్మని కలలని సృష్టించాడు? కాని పెళ్ళి విషయం ఎత్తేసరికి మొహం చాటు చేసాడు. తాను నల్లగా ఉంటుందట... ఫోటో తీస్తే నెగిటివ్‌లో తెల్లగా పడతానట. బాత్రూములో సరసాలు ఆడినప్పుడు, అర్ధరాత్రుళ్ళు తన మంచం దగ్గరకి వచ్చి తనని కరుణించమని... నువ్వు లేందే బ్రతకలేనని... బతిమాలినప్పుడు.... తన శరీరంలో నలుపు.... ఆకారవికారాలు కళ్ళకి కనిపించలేదేమో?

మావయ్య పెళ్ళి జరిగిపోయిందని తెలిసి అమ్మ శాపనార్థాలు పెట్టింది... తనకి పెళ్ళి, పచ్చటి సంసారం అనే కల కరిగిపోయింది.

జీవితంలో నిస్సహాయత, నిరాశ ప్రవేశించి... శేషజీవితాన్ని భయంకరంగా మారుస్తున్నాయి. ఈ జీవితానికి ఇవేమి చాలవు అన్నట్టు... తనకో చెల్లెలు. అది తనలాంటి అందకత్తే! అంటే నెగిటివ్‌లో తెల్లగా పడుతుంది. జమున తనకన్నా పదేళ్ళు చిన్నది. దానికి చదువు అబ్బలేదు.... చదువు లేక ఉద్యోగం దొరకలేదు.... తగినంత కట్నం, అందం... రెండూ లేక మొగుడు దొరకలేదు.

“నీ జీవితం ఇలా అయింది. దానికేనా ఏదో గంతకి తగ్గ బొంతని చూసి కట్టిపడేస్తే బావుండును” అంటుంది అమ్మ.

తనంటే డబ్బు పెట్టగలదు! కాని మొగుడ్ని ఎక్కడ వెతకగలదు? తన ఇంటిలో తన జూనియర్ ఒకటి తయారు అవడం తనకి ఇష్టమా? చెల్లెలి జీవితం కూడా పదును

ఎరగకుండా చిమిడిపోతుందా ? ఇప్పుడు తను పడుతున్న బాధ తనకి తెలుసు! ఆఫీసులో తోటివారి సంసారిక కథలు... మార్గరెట్ చెప్పే అసంసారిక కథలు, రాత్రుళ్ళు నిద్రలేకుండా చేస్తున్నాయి. మార్గరెట్ భాషలో చెప్పాలంటే తను "టచ్" కోసం పరితపించి పోతోంది. అందుకే అప్పుడప్పుడు "ఫిట్స్" లా రావడం... వేళ్ళు కొంకర్లు పోవడం... నిద్రలేమి... వీటిన్నిటికీ సమాధానం "టచ్" అంటుంది మార్గరెట్! మార్గరెట్ తనకి తాను "టచ్" ఏర్పాటు చేసుకోగలదు... ఎదుటివారికి ఏర్పాటు చేయగలదు కూడా! తనకి నైతిక విలువలపై గల అభిప్రాయాల్ని... మార్గరెట్ భయం అంటుంది. ఒక్కొక్కప్పుడు అది నిజమేమో అనిపిస్తుంది.

రాత్రి పదినుండి తెల్లవారేవరకూ... అమ్మ గుర్రు... చెల్లెలు నిద్రలో పెట్టే మూలుగులు... ఇంటి పైకప్పుమీద ఆడే నీడలు... తోడురాగా... భారంగా తెల్లవారుతుంది.

సావిత్రి పెళ్ళి తప్పిపోయిం తరువాత సావిత్రి తల్లి రెండు మూడు సంబంధాలు చూసింది. కానీ అవేవీ అక్కరకు రాలేదు. సావిత్రికి ఉద్యోగం వచ్చింది. సావిత్రి ఉద్యోగంలో చేరిన తరువాత పెళ్ళి విషయం వెనుకబడింది. సమయం గడిచిపోయింది. ఆ సమయంలోనే జమున పెరట్లో మొక్కలాగ పెరగసాగింది. జమునకి చదువు చెప్పిద్దామని సావిత్రి చేసిన ప్రయత్నాలు ఏవీ సాగలేదు. తల్లి చేస్తున్న పెళ్ళి ప్రయత్నాలు కలిసి రాలేదు. కట్నం, అందం కావలసినంత లేకపోవడం వల్ల ఏ సంబంధమూ పొసగలేదు. ఈ విషయంలో సావిత్రి తల్లి తన తమ్ముడితో బంధుత్వం కలుపుకోక తప్పలేదు. మామయ్య రాకపోకలు సావిత్రికి మొదట్లో ఇబ్బందికరంగా అనిపించినా... రోజులు గడిచిన కొద్దీ, పరిస్థితులు సర్దుకుని, సావిత్రి మామూలుగా మారిపోయింది. తను పడ్డ బాధ జమున పడకూడదు. అదే సావిత్రి ఆలోచన. మావయ్య జమునకి సంబంధం చూస్తే బావుండును. ఒకనాడు మావయ్య తనని కోరాడు. తనని తను ఎక్కుగా అంచనా వేసుకుందో... లేక భయమో మావయ్యని కాదంది. పెళ్ళి చేసుకోమంది. కాని మావయ్య ఉద్దేశంలో తను పెళ్ళి చేసుకోబడేంత విలువైనది కాదు. ఆనాటి మావయ్య తిరస్కారం, తనని తమ తెలుసుకునేటట్టు చేసాయి. ఆనాడు పెళ్ళి... నీతి.... మీద ఉన్న అభిప్రాయాలు, అర్థం లేనివిగా కనిపిస్తున్నాయి. ఇప్పుడు తన శరీరానికి అయితే వయసు వచ్చింది కాని... తన మనసుకి వయసు రాలేదే! ఆనాటి ఆవేశం.... కోర్కె తనని వెంటాడుతున్నాయి.

సావిత్రి మావయ్య పట్నంలో ఏదో పనిమీద సావిత్రి ఇంటికి వచ్చాడు.

సావిత్రి మావయ్యని చూసినప్పటి నుండి తెలిసీ తెలియని ఆలోచనలు పొంగుకు వస్తున్నాయి.

మావయ్యకి జమున పెళ్ళి గురించి బలంగా చెప్పాలంటే తను మావయ్యకి దగ్గరవాలి! అంటే జమున జీవితం బాగుపడాలంటే తను మావయ్యకి లొంగిపోవాలి.

ఒకనాడు మావయ్య తనని కోరాడు. ఈనాడు తను లొంగిపోతే సంతోషిస్తాడు. జమున విషయంలో సహాయం చేస్తాడు. జమున కోసం తను ఈ త్యాగం చేసి తీరాలి!

తను నిజంగా జమున కోసమే, మావయ్యకి లొంగిపోతోందా ? లేక తనలో పొంగు తున్న ఈ సంఘర్షణని తగ్గించుకోడానికి తన కోర్కెని తీర్చుకోడానికి, తను చేస్తున్న పనికి, జమున పేరుపెట్టి సమర్థించుకొంటోందా ? కాదు జమున కోసమే తను నీతిని విడిచి మావయ్యకి లొంగిపోతోంది! తనకి ఉద్యోగమేనా ఉంది. జమునకి అదీ లేదు! ఈ రాత్రి మావయ్యకి స్వర్గాన్ని చూపాలి. తనలో ఈ నరాలతీపు, నిద్రలేని రాత్రుల నుండి పడుతున్న బాధ నుండి విముక్తి పొందాలి. ముఖ్యంగా తన ఈ త్యాగం వల్ల మావయ్య నుండి జమున విషయంలో సహాయం పొందాలి.

ఈ రోజు రాత్రి మావయ్య దగ్గరికి వెళ్ళాలి అనే దృఢ నిశ్చయానికి రాగానే ఆఫీసుకి సగం దినం శెలవు పెట్టింది. ఆఫీసు నుండి రిక్షా మీద మెయిన్‌రోడ్డుకి వెళ్ళింది. మార్కెట్‌లో ఒక డజను అరటిపళ్ళు.... కె.జి. స్వీట్లు కొంది. ఫ్యాన్సీ షాపులో ఇంటిమేట్ సెంట్ కొంది. మెడికల్ షాపులోకెళ్ళి మాల-డి మాత్రలు కొంది. అన్నీ తీసుకుని రిక్షాలో ఇంటికి చేరుకుంది. ఇంట్లో తల్లి ఏ ప్రశ్నలూ వేయకపోయినా, జమున మాత్రం ఇంత తొందరగా వచ్చేశావేం అక్కా అని అడిగింది.

సావిత్రి ఉలిక్కిపడింది. జమున తన మనసు పట్టేసింది అనిపించింది.

"ఎప్పుడూ ఆఫీసులో చచ్చిపోవాలా? తొందరగా ఇంటికి వస్తే తప్పా"? అని జమునని ఒక్క కసురు కసిరింది.

జమున మరి మాట్లాడకుండా, కటకటాల గదిలోకి వెళ్ళిపోయింది.

సావిత్రి స్నానం చెయ్యడానికి బాత్రూములోకి వెళ్ళింది. స్నానం చేసినంతసేపూ ఆలోచన, తన చేయబోయే పని మంచిదా? కాదా? అమ్మకి తెలిస్తే? ఏమనుకుంటుంది? అసలు మావయ్య తనని అనుగ్రహిస్తాడా? పదిహేనేళ్ళ క్రితం ఉన్న వేడి మావయ్యలో ఈనాడు లేకపోవచ్చు..... ఎంతవారలైనా కాంతదాసులే! అని తనంతట తను కోరి వెళ్తే నిరాకరిస్తాడా? ఎన్నటికి నిరాకరించడు! మావయ్య మీద ఆలోచనలో కొట్టుకుంటున్న సావిత్రికి, ఈరోజు ఆలస్యంగా చీకటి పడినట్టు అనిపించింది.

ఊరిలో పని పూర్తి చేసికొని రాత్రి ఆలస్యంగా ఇంటికి చేరాడు మావయ్య.

భోజనాల దగ్గర "ఏమిటి సంగతి స్వీట్లు తెచ్చావు?" అని అడిగాడు మావయ్య, తన మనసుని మావయ్య పసికట్టినట్టు అనిపించింది. ఏమయితే అయింది. గొంతెత్తి "నీ మీద మోజుతో" చెప్పాలి అని అనిపించింది. కాని నోరు పెగల్లేదు. కొంచెం సేపు సందిగ్ధంలో కొట్టాడి "డి.ఎ. ఎరియర్స్ ఇచ్చారు" అంది.

భోజనాలు అయిపోయాక తల్లి, మావయ్య, జమున వాకిట్లో మంచాలు వేసుకుని

కబుర్లు చెప్పుకుంటున్నారు. సావిత్రి ఎప్పుడూ కబుర్లలో జోక్యం కలుగజేసుకోదు. సావిత్రి మధ్యగదిలో, నవల తెరచి చదువుకుంటూ కూర్చుంది. నవల మీద దృష్టి నిలవడం లేదు... టైము గడవడం లేదు. వాళ్ళ మధ్యకి వెళ్ళి కూర్చోవాలని అనుకుంది. కాని సాధ్యం కాలేదు. అలా ఎన్నడూ వెళ్ళలేదు! ఇప్పుడు వెళితే? జమున, మావయ్య, తనలో మార్పు పసికట్టిన వాళ్ళలా, ప్రశ్నలు వేస్తారు. ఏ పని చేయాలన్నా తనలో ఇంత భయం... ఆలోచనా ఎందుకో?

అందరూ పడుకుంటే బావుండును. ప్రపంచం అంతా నిద్రించినా వీళ్ళు తన శత్రువుల్లా మేల్కొని ఉన్నారు. తనలో సహనం చచ్చిపోతోంది. దేని కోసమేనా ఎదురు చూడడం, ఎంత దుర్భరమో తెలిసి వస్తోంది. నిన్న తనకీ ఆలోచనలేదు. తను లైటార్పి పడుకుంది. నిద్ర పట్టిందో లేదో తెలీదు. ఏ రోజు నిద్రపడుతుందో! ఏ రోజు పట్టదో? అంతా అర్థంకాని అయోమయం. కాని ఈ రోజు తను ఈ నిర్ణయం తీసుకున్న తరువాత, సమయం గడుస్తున్నట్టు లేదు. ఎంతకీ రాత్రి చిక్కబడుతున్నట్టు లేదు. సావిత్రి వాకిట్లోకి చూసింది. ముగ్గురూ కబుర్లలో మునిగిపోయారు.

టైము చూసింది. రాత్రి పది అయింది. సావిత్రి లేచి తన గదిలో లైటు ఆర్పి.. మంచం మీద పడుకుంది.

ఆ ఇంటికి మూడే గదులు. వెనుకపక్క పెద్ద వాకిలి. ఇంటి ముందుగా చిన్న కటకటాల గది, దాని తరువాత పెద్ద గది, దాని వెనుక వంటగది. వంటగదినుండి వాకిట్లోకి ద్వారం ఉంది. ఇంటికి అతిథులు వస్తే కటకటాల గదిలో పడుకుంటారు. అతిథులు వచ్చిన్నాడు జమున, తల్లి వంటగదిలో పండుకుంటారు. సావిత్రి మధ్యగదిలో పడుకుంటుంది.

సావిత్రి మావయ్య కటకటాల గదిలో పడుకున్నాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

సావిత్రి లేచి టైము చూసింది. పదకొండున్నర అయింది. తల్లి గుర్రు వంటగది లోంచి వినిపిస్తోంది.

సావిత్రి బెడ్‌లైటు వత్తి తగ్గించి, మెల్లగా మునికాళ్ళ మీద వెళ్ళి వంటగదికి మధ్య గదికి మధ్య ఉన్న తలుపు గడియ పెట్టింది. లైటు వేయడమా? మానడమా? అని కాసేపు ఆలోచించింది. లైటు వేయకపోతేనే మంచిది అనే నిర్ణయానికి వచ్చి బెడ్‌లైటు తీసి డ్రెస్సింగ్ టేబుల్‌పై పెట్టింది. వత్తి పెద్దది చేసింది. గదిలో వెలుతురు ఎక్కువ అయింది. పల్చటి టూబైటూ జాకెట్లోంచి నల్లటి శరీరపు ఎత్తులు సావిత్రికి తృప్తి కలిగించాయి.

తనని తాను వెనుక నుండి ముందు నుండి అద్దంలో చూసుకుని, తన రూపం తృప్తి కలిగించాక పెట్లోంచి "మాల-డి'' మాత్ర ఒకటి తీసి వేసుకుంది. టేబులు మీద ఉన్న బెడ్‌లైట్ వెలుతురు తగ్గించి... ఆ చీకటిలో అరనిముషం టేబులు దగ్గరే నిలబడింది.

వంటింటి గదిలో నుండి తల్లి గుర్రు వినిపిస్తోంది. వెళ్ళవలసిన సమయం వచ్చేసరికి, సావిత్రిలో ఉద్వేగం పెరిగింది. అరచేతుల్లో చెమట్లు పోసాయి.

పెద్దగదికి కటకటాల గదికి మధ్యగా ఉన్న తలుపు దగ్గరికి వచ్చి ఆగింది, తలుపు మీద చెయ్యి వేసి తెరిచింది. కాని తలుపు తెరచుకోలేదు. బెత్రువల్ల తలుపు బిగిసిందేమో అని తలుపుని కొంచెం గట్టిగా నెట్టింది. కాని తలుపు తెరచుకోలేదు. తలుపుకి అవతలి పక్క గడియ పెట్టబడి వుంది.

సావిత్రి నిశ్చేష్టురాలైంది. ఆమెలో పంతం తల ఎత్తుకుంది. ఈ రాత్రి ఏ అల్లరైనా, ఎవరికి తెలిసినా... ఎవరు ఏమనుకున్నా తను అనుకున్నది చేసి తీరుతుంది.

సావిత్రి దృఢ నిశ్చయంతో వంటింటి తలుపు తెరచి వంటింటినుండి వాకిట్లోకి తలుపు తెరిచింది.

అమావాస్య రాత్రి అవడం వల్ల ఆకాశంలో చుక్కలు చమక్... చమక్ అంటున్నాయి. వాకిట్లోంచి పక్కనున్న సందుగుండా, మండువాలోకి వచ్చింది. కటకటాల గది వరకూ వచ్చిన సావిత్రికి కటకటాల గదిలోంచి, గుసగుసలు వినిపించాయి. ఉండి ఉండి గాజుల శబ్దం.... నిట్టూర్పులు వినిపించాయి.

కటకటాల్లో గాజుల శబ్ధం ఎలా వచ్చిందో అర్థం కాలేదు సావిత్రికి.

కటకటాల గదిలో ఉన్నది ఎవరు? తను కాదు. తను ఆలస్యం అయిపోయింది. తనకన్నా ఎవరో ముందుజాగ్రత్తపడ్డారు? ఎవరు?

సావిత్రికి ఏదో గుర్తుకి వచ్చిన దానిలా గబగబా ఇంటిలోకి వెళ్ళి గదిలో బెడ్‌లైటు తీసుకుని వంటింటిలోకి వెళ్ళింది. తల్లిప్రక్కన జమున లేదు. శూన్యంగావున్న పక్కబట్టలు, సావిత్రి అలంకారం వేపు వెక్కిరిస్తూ చూసాయి.

*టచ్* *(స్వాతి, 3 మార్చి 1989)*

# గోరంత దీపం

స్ట్రైకులు, వాకౌట్లు, డౌన్ డౌన్‌లూ, మహాత్ముడి నుండి మనకి అబ్బిన అహింసా అస్త్రాలు. ఆ రోజు స్కూల్లో మహాత్ముడ్ని ఆదర్శంగా తీసుకుని తమకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా పదో తరగతి విద్యార్థులు క్లాసు బాయ్‌కాట్ చేసారు. హెడ్ మేష్టారి గది చుట్టూ చేరారు. హెడ్ మేష్టారు. వాళ్ళని శాంతంగా ఉండమన్నాడు. కాని అప్పుడప్పుడు అశాంతంగా కేకలు వెయ్యవద్దని అనలేదు కదా! ఆ తేడా ఆ వాతావరణంలో కనబడుతోంది.

అసలు స్ట్రైకు ఎందుకు? అనే అనుమానం ఎవరికేనా రావచ్చు. పదోక్లాసు చదువుతున్న విద్యార్థిని, ఇంట్లో తండ్రి అనుమతి తీసుకుని, మధ్యాహ్నం క్లాసుకి రాకుండా, సినీమాకి వెళ్ళింది. మర్నాడు మిగతా మేష్టర్లకి, విషయం తెలిసి మౌనంగా ఊరుకున్నారు. ముందు రోజు జరిగిన పాఠం ఏమిటో చెప్పి నోట్సు కూడా ఇచ్చారు.

కానీ చండశాసనుడు అని పేరు గాంచిన తెలుగు మేష్టారుకి, సినిమా అనే అల్ప కారణం వల్ల క్లాసుకి రాకపోవడం అన్నది నేరంగా కనిపించింది. అమ్మాయిని చెడమడా తిట్టారు. ఆ అమ్మాయి తండ్రిని విసుకున్నారు. ఆయన క్లాసు తర్వాత ఆ క్లాసు కెళ్ళిన కొందరు యువతరం మేష్టర్లకి, ఆ అమ్మాయి శోకం భరించరానిదిగా అనిపించింది. ఆ అమ్మాయి తప్పు ఏదీ లేనట్టుగా భావించి సానుభూతి చూపించారు.

'శతకోటి లింగాల్లో నీది బోడిలింగం అన్నట్టు, అంత మందిలో ఈయనకే డిసిప్లిన్ కావలసి వచ్చిందా ? అన్న అనుమానం, విద్యార్థులకి వచ్చి, క్లాసు బాయ్‌కాట్ చేసి, హెడ్ మాష్టారికి ఫిర్యాదు చేసి, తెలుగు మాష్టారి చేత క్షమార్పణ చెప్పించమన్నారు. హెడ్‌మేష్టారు తెలుగు మాష్టార్ని పిలిపించాడు.

ఇంక తెలుగు మాష్టారికి తన మీద గల ఉద్దేశం ఏమిటంటే, తనలా పాఠం చెప్పగల వాడు, ఆ జిల్లా మొత్తం మీద లేడు. పిల్లలకి క్రమశిక్షణ, దైవ భక్తి, నిజాయితీ ఉండి తీరాలి లేదా నేర్పాలి. పిల్లల భావి ప్రవర్తనకి తల్లిదండ్రుల తర్వాత గురువే బాధ్యుడు వగైరా... వగైరా.... ఇలాంటి ఇక్ష్వాకుల కాలం నాటి ఆలోచనలతో ట్వెంటీఫస్ట్ సెంచరీ విద్యార్థుల్లో గొంతు దిగని కషాయం అయాడు. అది అవసరం అంటాడు కూడా!

ఆయన పాఠం కూడా అంత దార్ష్టీకంగానే చెపుతాడు. క్లాసుకి వచ్చి, కుర్చీ త్యజించి, టేబులు మీద మఠం వేసుకు కూర్చుని పండిత పామరులకి, అంటే ముందు బెంచీ వాళ్ళకి వెనుక బెంచీ వాళ్ళకి చెవులూరించేటట్టు పాఠం చెప్పి మరీ క్లాసులోంచి కదుల్తాడు. ఆయన పాఠం చెప్తున్నంత సేపూ, పక్కవాడిని గోకకూడదు. ఎదుటివాడిని గిల్ల కూడదు. నవ్వకూడదు. ఆయన తిడితే ఏడవకూడదు. 'ఈయన మిలట్రీకి తగునోయ్ అంటారు' చాటుగా!

తెలుగు మేష్టారు, హెడ్‌మేష్టారి రూముకి వచ్చి జరిగింది తెలుసుకుని అవాక్కయిపోయారు. హెడ్‌మేష్టారికి కూడా తెలుసు. ఈ గొడవ వెనక కుర్ర మాష్టర్ల ప్రోత్సాహం ఉందని. "వాళ్ళిలా పోతే ఈయనకేమి! ఈయన ఏమైనా వాళ్ళని ఉద్ధరించాలా? లేనిపోనిది నెత్తికి తెచ్చుకున్నాడు" అన్నారు, కొందరు మాష్టర్లు. "తనే బాగా పాఠం చెప్తానని అహం. తన మాటకి విద్యార్థులు ఎదురు చెప్పరని గర్వం. తగిన శాస్తే జరిగింది". అంటూ కొందరు మాష్టర్లూ.... వివిధ ఆలోచనలతో కామెంట్లతో, స్కూలు వాతావరణం గందరగోళంగా ఉంది.

తెలుగు మాష్టారు వీటితో వేటితోనూ సంబంధం లేనట్టు ఆలోచిస్తున్నారు. ఆ ఆలోచన ఎంతకీ తెగలేదు. అందరూ అమ్మాయి తండ్రే పొమ్మన్నాడటగా సినిమాకి, క్షమార్పణ చెప్పేయండీ ! ఎందుకొచ్చిన గొడవ! అని సలహా చెప్తున్నారు. కొంతసేపటికి తెలుగు మాష్టారు, ఏదో నిర్ణయించుకున్నట్లు, గదిలోంచి బైటకి వచ్చారు.

విద్యార్థుల్ని దీర్ఘంగా చూసారు.

"నేను ఆ అమ్మాయిని కోప్పడ్డాను. నిజమే! ఆ అమ్మాయిని కఠినంగా శిక్షించాను. ఆ అమ్మాయి క్లాసు వదిలి సినిమాకి వెళ్ళడం తప్పనుకున్నాను. ఆ అమ్మాయి తండ్రి అనుమతితో సినిమాకి వెళ్ళానంది. అయినా నాకు తప్పేమో అనిపిస్తోంది. ఆ అమ్మాయి తండ్రి వచ్చి, తను ఆ అమ్మాయికి సినీమాకి వెళ్ళడానికి అనుమతి ఇచ్చానని చెప్పి నేను ఆ అమ్మాయిని అనవసరంగా శిక్షించానని అంటే నేను ఆ అమ్మాయికి క్షమార్పణ చెప్పుకుంటాను" అన్నారు, గంభీరంగా.

విద్యార్థుల్లో తెలుగు మాష్టారి చేత ఎలాగైనా క్షమార్పణ చెప్పించాలన్న పట్టుదల పెరిగింది. కొందరు విద్యార్థులు ఆ అమ్మాయిని తీసుకుని వాళ్ళింటికి వెళ్ళి ఆ అమ్మాయి నాన్నగారిని తీసుకు వచ్చేరు.

హెడ్ మాష్టారు ఆ అమ్మాయి తండ్రిని తన రూములోకి తీసుకెళ్ళారు. ఆయనతో పాటు ఆ అమ్మాయి, ఇద్దరు విద్యార్థి నాయకులు హెడ్ మాష్టారి రూములోకి వెళ్ళారు.

అక్కడ హెడ్‌మాష్టారు సంగతంతా, అమ్మాయి తండ్రికి వివరించారు. మొత్తం పరిస్థితి అంతా అర్థం అయింది. ఆయన తెలుగు మాష్టార్ని దీర్ఘంగా చూసాడు. తర్వాత హెడ్ మేష్టారితో, "క్షమార్పణ చెప్పడం కోసం మనం బైటకి వెళ్ళాలేమో" అన్నాడు.

అందరూ లేచి భారంగా బైటకి వచ్చారు. క్షమార్పణ చెప్పిం తర్వాత తెలుగు మాష్టారి ముఖం ఎలా ఉంటుందా? అని విద్యార్థులు నిశ్శబ్దంగా ఆతృతతో ఎదురు చూస్తున్నారు.

**అప్పుడు....**

ఆ అమ్మాయి తండ్రి అమ్మాయి చెంప ఛెళ్ళుమనిపించాడు. అనుకోని సంఘటనకి

విద్యార్థులంతా ఆశ్చర్యపోయారు. ఆ అమ్మాయి తెలుగు మాష్టారి కాళ్ళ మీద ఉంది.

ఆ అమ్మాయి తండ్రి రెండు చేతులూ ఎత్తి తెలుగు మాష్టారికి నమస్కారం చేస్తూ "మాష్టారూ నా తప్పు క్షమించండి. ఇంకెప్పుడూ స్కూలు ఉన్న రోజుల్లో, ఇలాంటి తప్పుడు పెర్మిషన్లు ఇవ్వను. ఈ పరిస్థితికి కారణం అయిన మా అమ్మాయిని క్షమించండి" అన్నాడు.

అనుకోకుండా జరిగిన ఈ సంఘటనకి విద్యార్థులు తెల్లబోయారు. మెల్లగా అక్కడ నుండి జారుకున్నారు. కాని మిగతా మేష్టర్లకి అర్థం అయింది. తమకీ తెలుగు మాష్టారి నిజాయితీకి ఉన్న తేడా!

*గోరంత దీపం* *(రచన, మే, 1998)*

# హింస

ఫిరయలాల్ షాపింగ్ సెంటరు నుండి మండు టెండలో ట్రాఫిక్ తప్పించుకొంటూ స్టేట్ బేంక్‌కి వెళ్ళాలంటే చిరాకు. కష్టం కూడా. అందుకే రిక్షా మాట్లాడుకుని రిక్షాలో వెళ్ళడం తప్పనిసరి.

రిక్షావాడు నా సుకుమారమైన మొహం, చేతిలో కేష్ బేగ్ చూసి, రిక్షా అద్దె మూడు రూపాయలు అడగడం పరిపాటి. కానీ లోకం పోకడని బట్టి రిక్షావాడికి రెండు రూపాయలే ఇవ్వాలి. అంటే రిక్షావాడు నన్ను ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నాడేమో అన్న శంకతో, ఒక చిరునవ్వు రిక్షావాడి మొహం మీద నవ్వి, రెండో రిక్షావాడ్ని అడిగాను. వాడూ మూడు రూపాయలకి తగ్గనన్నాడు. వీళ్ళదంతా యూనియన్! కాని నేను పట్టు విడవని విక్రమార్కుడిలా ప్రయత్నించి, ఆ చివరి ఒక రిక్షావాడ్ని పట్టుకున్నాను. వాడికి బేరం వదులుకోడం ఇష్టం లేదు. రెండు రూపాయలకి రిక్షా కట్టడం ఇష్టంలేదు. వాడు రిక్షా అద్దెకి తీసుకున్న దగ్గర్నించి ఒక్క బేరం తగ్గల్లేదు. అదివాడి ఘోష! నాకు వీడ్ని ఎక్స్‌ప్లాయిట్ చెయ్యొచ్చు అనిపించింది.

"రాను పోనూ నాలుగు రూపాయలిస్తాను, బేంకులో నా పని ఐదు నిమిషాలకన్న ఎక్కువ ఉండదు. వస్తావా" అన్నాను.

ఒకవేపు అయితే రెండు రూపాయలు తక్కువ. అయితే, రానూ పోనూ నాలుగు రూపాయలు మంచి బేరంగా అనిపించి రిక్షా కట్టడానికి ఒప్పుకున్నాడు. కాని నా ఉద్దేశం వేరు. అక్కడికి వెళ్ళి రెండు రూపాయిలిచ్చి, "తొందరగా వస్తే సరి. లేదా నా గురించి ఎదురు చూడకు వెళ్ళిపో"! అని చెప్దామనుకున్నాను.

కాని అక్కడికి వెళ్ళాక చూసుకుంటే నా దగ్గర రెండు రూపాయల నోటు లేదు. చెదురుమదురుగా ప్రయత్నం చేసాను కాని చిల్లర నోట్లు దొరకలేదు. రిక్షావాడి దగ్గర పూర్తి చిల్లర రూపాయలూ లేవు. రిక్షావాడికి రెండు కన్నా ఎక్కువ ఇవ్వబుద్ధి పుట్టలేదు.

నేను బేంక్ లోకి వెళ్ళిపోయాను.

రిక్షావాడు వెనుక నుండి, "బాబూ తొందరగా వచ్చేయండి" అంటున్నాడు.

నేను "అలాగే" అన్నట్లు తల ఊపి, బేంకు లోకి వెళ్ళిపోయాను. నేను బేంకు లోకి వెళ్ళిన రెండు నిముషాల్లో, నా పని అంత తొందరగా పూర్తి అవదు అని అర్థం అయింది. కాని నా ప్రయత్నం నేను చేసాను. బేంక్ మేనేజరుని కలిసి నా రసీదు గురించి అడిగాను.

ఆయన "ఎంత మొత్తం"? అని అడిగాడు.

"ఐదు వేలు" అన్నాను.

ఆయన చికాకుగా మొహం పెట్టి బయట నిలబడ్డ నలుగుర్ని చూపించి "వాళ్ళ

మొత్తాలు మీ మొత్తం కన్నా చాల ఎక్కువ. వాళ్ళూ రసీదు కొరకే నిలబడ్డారు. కాస్త వెయిట్ చెయ్యండి'' అన్నాడు. అతని కళ్ళల్లో “ఓరి ఐదు వేల.... రసీదుకి ఇంత హంగామానా! అన్నట్టు అనిపించింది.

బయటికి వచ్చి బెంచి మీద కూర్చున్నాను. అప్పుడు గుర్తుకి వచ్చాడు రిక్షావాడు, ఒక్క రూపాయి కోసం నేను ఎంత హంగామా చేస్తున్నాను అనిపించింది. నేను చేసిన పనికి, నాకే చిన్నతనం అనిపించింది. రిక్షావాడికి మూడు రూపాయలూ ఇచ్చేసి వెళ్ళిపొమ్మని చెబుదామని బైటకి వచ్చాను. రిక్షావాడు కనబడలేదు. నా అహంకారం ప్రకారం రిక్షావాడు నన్ను గుర్తుపట్టాలి. కాని ఏ రిక్షావాడూ నా దగ్గరికి రాలేదు. నాకు రిక్షావాడి మీద కోపం వచ్చింది, మళ్ళీ బేంక్‌లోకి వెళ్ళిపోయాను.

బెంచీ మీద కూర్చున్న నాకు ఎదురుగా బేంక్ మేనేజరు. “వెధవ ఐదు వేలకి ఎందుకింత హంగామా?'' అంటున్నాడు. కానీ అదే స్థానంలో లేకున్నా రిక్షావాడు 'వెధవ మూడు రూపాయలకు, ఎందుకీ తాపత్రయం బాబూ'! అంటున్నాడు.

రిక్షవాడిని ఎక్స్‌ప్లాయిట్ చేద్దామని, వాడ్ని గెస్సింగ్ గేమ్‌లో పెట్టి, వంచిద్దామనుకోడం, నేను చేసిన పెద్ద పొరపాటులా కనిపించింది.

రిక్షావాడు అక్కడే ఉన్నాడేమో? నేను సరిగ్గా వెదకలేదేమో? అన్న ఆలోచన వచ్చి, మళ్ళీ బైటకి వెళ్ళాను.

ఈసారి రిక్షాలన్నీ చూసాను. నేనొచ్చిన రిక్షా సీటు కవరు ఎరుపుది. దానికోసం వెదికి ఎర్ర కవరు సీటున్న రిక్షావాడినల్లా, వివరాలు అడిగాను. కాని వాళ్ళెవ్వరూ కాదు. రిక్షావాడు దొరకకపోయేకొద్దీ మూడు రూపాయల భారం నా జేబులో పెరిగిపోతోంది.

ఈ విషయం శ్యామలతో చెపితే మీరెప్పుడూ ఇంతే, వందలకి వందలు ఖర్చు పెడతారు, రూపాయి దగ్గర పీక్కుంటారు అంటుంది. ఆ 'పీక్కుంటారు' అన్న మాట చాల కష్టం కలిగిస్తుంది.

నిజంగా నేను పిసినారివాడ్ని కాదు. కష్టపడ్డవాళ్ళ మీద సానుభూతి ఉంది. వీటన్నిటితో పాటు అతిజాగ్రత్త కూడా ఉందేమో! ఎదుటివాడు నన్ను ఎక్స్‌ప్లాయిట్ చేయకుండా, జాగ్రత్త పడదామనుకుంటాను. అది కాస్త “అతి'' అయి కూర్చుంటుంది.

నేనేం వెదుకుతున్నానో అక్కడి రిక్షా వాళ్ళందరికీ అర్థం అయింది. ఎవడేనా అబద్ధం చెప్పి ఆ మూడు రూపాయలు తీసుకున్నా బావుండును. కాని ఎవడూ ముందుకి రాలేదు. అంతేకాక ధీమాగా చుట్టంటించి “ఎవఁడ్రా ఈ స్టేండ్ వాడేనా?'' అని వాళ్ళల్లో వాళ్ళు చర్చించుకుంటున్నారు.

ఛీ, రిక్షావాడి ముందు నేనెంత చిన్నబోయాను! అనిపించింది. వాడికేదో బేరం తగిలి, నన్ను తిట్టుకుంటూ వెళ్ళి పోయుంటాడు. నా రెండు రూపాయలు తీసుకోకుండా వాడు వెళ్ళిపోవడం వాడి తప్పుకాదు. వాడికి మూడు రూపాయలివ్వలేక పోవడం తప్పు!

నాకు ఉడుకుమోత్తనం వచ్చేసింది. రిక్షావాడి గొప్పతనం ఒప్పుకో బుద్దేయలేదు. కాని రిక్షావాడి, రెండు లేదా మూడు రూపాయలు నా దగ్గరున్నంత వరకూ, వాడే గొప్పవాడు. వాడే ధనవంతుడు. రిక్షావాడు రెండు రూపాయలు నాకు వదిలేసి మానసికంగా నన్ను అధఃపాతాళానికి మొత్తేసాడు. లేదా వామనావతారంలా నన్ను నీచాతి నీచమైన గతుల్లోకి కుమ్మేసాడు. ఒకవేపు రెండు రూపాయలకి వాడు రానంటే, ఇంతలా రూపాయి కోసం అడ్డదిడ్డంగా ఆలోచించి, బుర్రపాడుచేసుకుని, నేను తెలివైన వాడినని ఎవరికి నిరూపించాలి?

అప్పుడు అనిపించింది. "ఒక్క రూపాయి మిగుల్చుకుని, ఈ సంఘటన మరుపున పడేంత వరకు ఎంత హింస భరించాలో కదా!"

*హింస* *(రచన, నవంబరు 1998)*

# ట్రిబుల్ ఎక్స్ గర్ల్

రిసెప్షన్‌లో అడుగుపెట్టిన మరుక్షణం వారుణి నన్ను చూసి పరుగెత్తుకొచ్చింది. "అంకుల్! ఇంత ఆలస్యంగానా రావడం?'' అంటూ బుంగమూతి పెట్టి పలంకరించింది. బుంగమూతితో వారుణిని చూసిన నాకు చాలా ముచ్చటేసింది.

వారుణి నా కొలీగ్ కూతురు. నే వెళ్ళింది ఆమె పెళ్ళి రిసెప్షన్‌కే. వాత్స్యాయనుడు చెప్పిన శరీరము, ఆవర్తము, గంధము, ఛాయ, సత్వము, స్వరము, గతి, వర్ణము అన్న అష్ట లక్షణాలూ ఉన్న బ్యూటీ పాప వారుణి. వారుణికి బ్యూటీపాప అన్న పేరు నేనే పెట్టాను. "పాపా! మీ ఆయనేడీ?'' అని అడిగాను. వారుణి చిన్నగా సిగ్గు అభినయించింది. ఇంతలో కొలీగ్ నా దగ్గరికి వచ్చి "రావోయ్ రా''! అంటూ నన్ను సూటేసుకున్న కుర్రాడి దగ్గరికి తీసుకెళ్ళి ఆ అబ్బాయికి నన్ను పరిచయం చేస్తూ ఈయన రావుగారని కంప్యూటరు డిపార్టుమెంటులో ప్రొఫెసర్! వారుణి అంటే చాలా అభిమానం!'' అన్నారు. ఆ అబ్బాయే వారుణి భర్త అని తేలికగా తెలుస్తోంది.

ఆ అబ్బాయి నన్ను చూసి "నమస్కారం అంకుల్'' అన్నాడు.

"కంగ్రాట్యులేషన్స్!'' అన్నాను. "వెల్‌కమ్!'' అంటూ. "బైదిబై దేనికి అంకుల్?'' అని ప్రశ్నించాడు.

"వారుణిని లైఫ్ పార్టనర్‌గా కొట్టేసినందుకు!'' అన్నాను.

"ఓహ్...!'' అంటూ తెగ నవ్వేడు సాగర్. ఈలోగా మా కొలీగ్ వారుణిని పిల్చాడు. నన్నూ శ్రీమతినీ దంపతులకి ఇరుపక్కలా నిలబెట్టి ఫోటో తీయించాడు. ఫోటో తీస్తున్నప్పుడు సాగర్ వారుణి భుజంమీద చెయ్యి వేసి దగ్గరగా లాగాడు. వారుణి నవ్వుతూ మృదువుగా సాగర్ చెయ్యి భుజంమీద నుంచి తీసేసింది. కొంచెం ఎడంగా జరిగింది.

"లైక్‌పోల్స్ రిపెల్''! అన్నాను.

వెంటనే సాగర్ "మేమిద్దరం లైక్ పోల్స్ ఎలా అయ్యాం అంకుల్?'' అన్నాడు.

"అందమూ, చదువూ ఇద్దరిదీ సమానస్థాయిలో ఉన్నాయి. జోడీ అనేకన్నా జోడా అంటే బాగుంటుంది. అందుకే లైక్ పోల్స్ అన్నాను.''

బ్యూటీ పాపని నేను పదేళ్ళనుండి ఎరుగుదును. నేను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జాయిన్ అయిన మూడోరోజే, మా క్వార్టరు తలుపు కొట్టారు ఎవరో. నేను తలుపు తీశాను. ఎదురుగా వారుణి నిలుచుని ఉంది.

"హూ ఆర్ యు?'' అని అడిగాను.

"మా నాన్నగారు వస్తారట, మీకు చెప్పమన్నారు!" అంది బ్యూటీపాప.

ఓ... తెలుగువాళ్ళే అన్నమాట అనుకున్నాను మనసులో. నా మౌనం చూసి, "ఏం అంకుల్ ఎక్కడికైనా వెళ్తారా?" అంది.

"లేదు, మీ నాన్నగారి కోసం వెయిట్ చేస్తానని చెప్పు" అన్నాను.

మెరుపులా మాయమైంది, బ్యూటీపాప. ఆ రోజున మొదటిసారిగా చూశాను బ్యూటీపాప అందాన్ని. బ్యూటీపాప అందం నన్ను థ్రిల్ చేసింది. అదే విషయం శ్రీమతితో అన్నాను "పక్క క్వార్టర్లో తెలుగువాళ్ళే ఉంటున్నారు. వాళ్ళ పాప వచ్చింది. చాలా బాగుంది!" అని.

అప్పుడు బ్యూటీపాపకి పన్నెండేళ్ళు పైగా ఉంటాయేమో, సిల్కు గౌను, బాబ్డ్ హెయిర్, చిన్న నోరూ, తీక్షణమైన గుండ్రని కళ్ళూ...

పరివేషమ్ములగట్టి పూ శకల ప్రాయంబులై, అంత బంగరు గోలీల నతిక్రమించి... అని తిరుపతి వేంకటకవులు చెప్పినట్టుగా, ఆమె శరీరం మీద వికసిస్తున్న నూత్న యవ్వనం నన్ను ఆకర్షించింది.

రెండో రోజు వారుణితో కలయిక విచిత్రంగా జరిగింది. సాయంకాలం నేను కాలేజీ నుండి ఇంటికి వచ్చేసరికి, క్వార్టరు తలుపులు తీసున్నాయి. నేను తిన్నగా లోపలికి వెళ్ళిపోయాను. డైనింగ్ హాల్లో టేబిలు దగ్గర వారుణి కూర్చుని ఉంది. శ్రీమతితో ఏవో కబుర్లు చెప్తోంది. శ్రీమతి వంటింట్లో టీ పెడుతోంది. ముందురోజే వారుణిని చూశాను. ఆ పాప అందాన్ని ప్రశంసించాను.

ఎదురుగా వారుణిని చూడగానే పాప గురించి వివరాలు తెలుసుకుందామని పించింది. డైనింగ్ టేబుల్ దగ్గర మరో కుర్చీ లాక్కుని కూర్చున్నాను.

"నీ పేరేమిటి పాపా?" అని అడిగాను.

"వారుణి" అంది కానీ, సిగ్గుపడలేదు.

"అంటే మీ ఇంట్లో నీళ్ళకి ఇబ్బంది లేదన్నమాట"! అన్నాను నవ్వుతూ.

వారుణి నవ్వలేదు. నా ప్రెజెన్స్‌లో ఇబ్బంది ఫీలయింది.

"ఆంటీ! వస్తాను!" అంటూ లేచింది.

కిచెన్‌లో నుండి శ్రీమతి "ఉండు, వారుణీ! చాయ్ తాగి వెళ్ళు"! అంది.

వారుణి ఏమనలేక ఇబ్బందిగా కుర్చీలో కూర్చుంది.

"ఏం చదువుతున్నావు?" అని అడిగాను. వారుణిని మాటల్లో దింపాలని.

"ఎయిత్ స్టాండర్డ్!" అంటూ ముభావంగా సమాధానం చెప్పింది.

తర్వాత ఏం మాట్లాడాలో నాకు అర్థంకాలేదు. ఇద్దరం రాబోయే చాయ్ కోసం

ఎదురుచూస్తున్నాం.

శ్రీమతి రెండు కప్పుల్లో చాయ్ తీసుకొచ్చి ఇద్దరికీ ఇచ్చి, తను కిచెన్‌లోకి వెళ్ళి తన కోసం మరో కప్పు తెచ్చింది. ఇద్దరి మౌనం చూసి, "ఇద్దరూ మాటా పలుకూ లేకుండా అలా కూర్చున్నారేమిటి?" అంది.

"మీ బ్యూటీపాప నాతో మాట్లాడదట!" అన్నాను వారుణిని ఉడికించాలన్న ధోరణితో.

"ఏం వారుణీ?" అంది శ్రీమతి నవ్వుతూ.

"అదేం లేదు ఆంటీ"! అంది వారుణి కంగారుగా.

ఆ రోజు నుండి వారుణి కనబడినప్పుడల్లా నేను ఏదో అనడం, వారుణి దానికి జవాబు చెప్పడం జరిగాయి. వారుణి టెన్త్‌లో ఉండగా లెక్కలు చెప్పమని వచ్చేది. నేను లెక్కలు చెప్పేవాడిని, హాస్యాలూ ఆడేవాడిని. ఆ రోజుల్లోనే వారుణిని చూడగానే నా కళ్ళల్లో వెలిగే వెలుగు గుర్తుపట్టింది వారుణి. అంతవరకూ నేను హాస్యమాడితే మౌనంగా భరించే వారుణి తను కూడా హాస్యమాడటం మొదలుపెట్టింది. చనువు తీసుకుంటోంది.

నేను ఏ పని చేస్తున్నా వారుణి వచ్చిందనగానే, ఆ పనిని కట్టిపెట్టి, వారుణితో కబుర్లకి దిగేవాడిని. అందుకే శ్రీమతికి అలుసైపోయాను. "మీ వారుణీ వచ్చింది!" అంటూ దీర్ఘం తీసేది.

నేను శ్రీమతి దీర్ఘాన్ని తేలిగ్గా కొట్టిపారేసాను "వారుణి వారుణే! నీ, నా ఎప్పుడూ అవదు!" అనేవాడిని.

వారుణి టెన్త్ క్లాస్ పాసయింది. తొంభైశాతం మార్కులు వచ్చాయి. అప్పుడు అర్థం అయింది. వారుణికి అందం ఒక్కటే అలంకారం కాదనీ, బ్రెయిన్స్ కూడా భూషణమే! అని అర్థం చేసుకున్నాను.

వారుణి ప్లస్ టూ లో జాయిన్ అయింది. చాలా బిజీ అయిపోయింది. అయినా అప్పుడప్పుడు సాయంకాలంపూట వస్తూ కబుర్లు చెప్తుండేది.

వారుణి సీనియర్ ఇంటర్‌లో ఉండగా నాకు జబ్బు చేసింది. నేను హాస్పటల్లో ఉండవలసివచ్చింది. హాస్పటల్లో నేను ప్రత్యేకమైన గదిలో ఉన్నా హాస్పటల్ వాతావరణం వల్ల చాలా దైన్యంగా చికాకుగా ఉండేది. శ్రీమతి రోజంతా హాస్పటల్లో నా దగ్గరే ఉండేది. చదువుకోడానికి బోల్డు నవలలు ఉండేవి. నేను హాస్పటల్‌లో ఉన్నానని కొందరు కొలీగ్స్ వచ్చి చూసి వెళ్ళేవారు. అయినా విసుగ్గా ఉండేది.

శ్రీమతి చెప్పే మాటల్ని బట్టి వారుణి శ్రీమతికి చాలా సాయంగా ఉంటోంది. తోడుగా పడుకుంటోంది. వారుణి కబుర్లు వింటున్నకొద్దీ వారుణిని చూడాలనే కోరిక బలంగా పెరిగిపోయింది. నేను రమ్మన్నానని చెప్పమని శ్రీమతితో వారుణికి కబు

రంపాను. డైరెక్ట్‌గా కాలేజి నుండి వచ్చిందేమో, యూనిఫారమ్‌లో వచ్చింది. వారుణిని చూడగానే శ్రీమతి "ఇద్దరం కలిసి వెళ్ళిపోదాం, నాకు బజారు పనుంది. వెళ్ళి వస్తాను. నువ్వు అంకుల్ దగ్గర కూర్చో"! అంటూ సంచి తీసుకుని బజారుకి వెళ్ళిపోయింది.

వారుణి పక్కనున్న స్టూలు మీద కూర్చుంటూ, "ఏమిటి అంకుల్ రమ్మన్నారట"? అంది.

"ఏం, అంకుల్ అంటే కోపం వచ్చిందా వారుణీ!" అన్నాను తలగడాకి ఆనుకుని కూర్చుంటూ.

"లేదే"! అంది ఆశ్చర్యంగా.

"మరి చూడటానికి రాలేదేం"? అన్నాను "చదువు అంకుల్! ఓ... వాటే ప్రెషర్! అంది. నేను మౌనంగా ఉండిపోయాను.

"అంకుల్! ఎందుకు పిలిచారో చెప్పలేదు?" అంది వారుణి స్టూల్‌ని మంచం దగ్గరగా లాగి కూర్చుంటూ.

"ఏం లేదు, నీతో కబుర్లు చెప్పాలనిపించింది. అందుకే పిలిచాను.!" అన్నాను.

"ఓహ్, అంతేనా?" అంది తేలికగా.

"అంతే కాదు, వారుణీ! ఇంకా ఉంది!" అన్నాను.

"ఏమిటీ?" అంటూ ఆశ్చర్యపోయింది.

"నీ పేరు వాహ్ + రుణి నువ్వు అందరికీ రుణపడ్డావు. అందులో ముఖ్యంగా అంకుల్‌కి మరీనూ! అన్నాను.

"ఎలా?" అంది నవ్వుతూ.

"నీ అందంతో, నీ అందం చూసేవాడి కంటికి, మనసుకి గొప్ప రిలీఫ్‌నిస్తుంది.!" అన్నాను.

వారుణి డంగై పోయింది. ఏ ఆడపిల్లనైనా తన తోటి యువకుడో, భర్తో అందాన్ని పొగిడితే బాగుంటుందేమో! నా పొగడ్తకి, నా కొంటెతనానికి కొంచెం తొట్రుపాటుపడింది. నా కొంటెతనం అసహజంగా, బహిరంగ పరచకూడనిదేదో బహిరంగ పడిపోయినట్లు ఫీలయింది. తను నాపట్ల చూపిస్తున్న చనువుని తప్పుగా అర్థం చేసుకున్నాను అనుకుంది. స్టూలుమీంచి లేచి, కిటికీ దగ్గరికి వెళ్ళి నిలబడింది...

నాకూ ఎక్కువ చనువు చూపించానేమో అనిపించింది. ఏవైనా కొన్ని విషయాలు బహిరంగపరచకుండా ఉంటేనే బావుంటాయేమో? నేను తొందరపడ్డానా? అనుకున్నాను.

వారుణి మనసులో ఏముందో, ఏమో? మరి సంభాషణ ముందుకి జరుగలేదు. శ్రీమతి బజారు నుంచి రావడంతో ఇద్దరూ ఇంటికి వెళ్ళిపోయారు.

ఆ తర్వాత వారుణిని చాలారోజుల వరకూ చూడలేదు. నేను హాస్పటల్లో వారుణి అందాన్ని మెచ్చుకోవడం వల్ల వారుణికి నా మీద అనుమానం కలిగిందనుకుంటాను. ఆ వయసులో వారుణికి అలా అందాన్ని కామెంట్ చేసేవాళ్ళు రోడ్‌సైడ్ రోమియోలే అని అవగాహన ఉండి ఉంటుంది. నన్ను హౌస్‌సైడ్ రోమియో అనుకుందేమో, తప్పించుకు తిరుగుతోంది అనుకున్నాను. శ్రీమతి మనసులో ఏముందో తెలుసుకుందామని "వారుణి రావడంలేదు"? అని అడిగాను.

"వారుణి ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ ప్రిపేరవుతోంది. అసలు టైము సరిపోవడంలేదట!" అంది.

ఆ విధంగా వారుణికి ఇంజనీరింగ్ సీటు వచ్చేవరకూ నాకు కనిపించలేదు. వారుణికి మంచి రాంక్ వచ్చింది. మా కాలేజీలోనే కంప్యూటర్ సైన్స్‌లో సీటు వచ్చింది. ఆ ఆనందంలో పాత విషయం మర్చిపోయిందేమో, స్వీట్స్ పట్టుకుని మా ఇంటికి వచ్చింది. బాగా కబుర్లు చెప్పి వెళ్ళిపోయింది.

వారుణి ఇంజనీరింగ్ చదివిన నాలుగేళ్ళూ చాలా తొందరగా జరిగిపోయాయి. ఆ నాలుగేళ్ళలో వారుణితో సన్నిహితం పెరిగింది. వారుణి నాతో డేటాస్ట్రక్చర్, ప్రోగ్రామింగ్ మెథడ్స్ చెప్పించుకుంది. మా ఇంటికి వచ్చినప్పుడల్లా గంటా రెండు గంటలు కూర్చుని కబుర్లు చెప్పేది.

వారుణితో ఎంత కాలక్షేపం చేసినా తనివితీరేది కాదు. ఆ నాలుగేళ్ళలో నేను వారుణిని మెరుపు తీగవి అన్నాను. ఎలక్ట్రాన్‌వి అన్నాను. చెవులకి పెట్టుకున్న రింగులు బాగలేవు బుట్టలు పెట్టుకో అన్నాను. ఈ డ్రెస్ బాగాలేదు. నీ డ్రెస్ ఈ విధంగా కుట్టించుకో! అని ఎన్నో సలహాలు, కామెంట్లు చేశాను. అన్నింటినీ వారుణి చిరునవ్వుతో స్వీకరించింది. ఈ నాలుగేళ్ళలో వారుణిలో చాలా మార్పు వచ్చింది. చీర్‌ఫుల్ మరియు గ్రేస్‌ఫుల్ బిహేవియర్‌ని డెవలప్ చేసుకుంది.

వారుణి ఫైనల్ ఇయర్‌లో ఉండగా నేను కొంటెగా "వారుణీ! ఎవరూ వెంటపడలేదా? అని అడిగాను. "ఊ!" అంటూ బుర్రూపి ఒక లవ్ లెటర్ నాకు చూపించింది.

"అంకుల్! నాన్నతో చెప్పకండి ! డిసిప్లిన్ ఇష్యూ అవుతుంది.!" అంది నవ్వుతూ.

వారుణిలో వచ్చిన మెచ్యూరిటీకి, ఆమె చూపించిన గ్రేస్‌ఫుల్ బిహేవియర్‌కి నేనాశ్చర్యపోయాను.

ఇంజనీరింగ్ అయిపోగానే, వారుణిని వాళ్ళ నాన్న ఉద్యోగం చెయ్యొద్దని చెప్పి మంచి సంబంధం చూసి పెళ్ళి చేసేశారు. పెళ్ళయ్యాక వారుణి బెంగుళూర్ వెళ్ళిపోయింది.

వారుణి బెంగుళూరు వెళ్ళిపోయాక సాయంత్రంపూట కబుర్లు చెప్పేవాళ్ళు కరువయ్యారు. చాలారోజుల వరకూ వారుణిని మర్చిపోలేకపోయాను.

వారుణి వెళ్ళిపోయిన రెండేళ్ళకి, నాకు బెంగుళూరు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సెమినార్ ఆహ్వానం వచ్చింది. నేను బెంగుళూరు వెళ్దామనుకున్నాను. బెంగుళూరు అనగానే వారుణి జ్ఞాపకం వచ్చి, వెంటనే కొలీగ్ దగ్గరికి వెళ్ళి, వారుణి అడ్రెస్ తీసుకున్నాను.

నా బెంగుళూరు ట్రిప్ నాకు సెమినార్ ట్రిప్ మాత్రమే అనుకున్నాను కానీ, వారుణితో గొప్ప అనుభవం కలుగుతుందని అనుకోలేదు. నేను బెంగుళూరు చేరుకునేసరికి సాయంకాలం అయింది. ఆటోలో బయలుదేరి అతి తేలికగా వారుణి ఇల్లు పట్టుకున్నాను. నన్ను చూసి వారుణి చాలా సంతోషించింది. సాగర్ కూడా సంతోషించాడనే అనుకుంటాను. ప్రయాణం వల్ల బాగా అలసి ఉండడంతో తొందరగా స్నానం చేసి, భోజనం అయిందనిపించి నిద్రపోయాను.

మర్నాడు సోమవారం, నేను నిద్ర లేచేసరికి సాగర్, వారుణి తయారై ఆఫీసుకి వెళ్ళడానికి రెడీ అయిపోయారు. వారుణి ఆఫీసుకి వెళ్ళిపోయింది. నేను తయారయ్యాక సాగర్ నన్ను తీసుకెళ్ళి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైయిన్స్ దగ్గర దింపాడు. రోజంతా సెమినార్‌తోనే గడిచిపోయింది. సాయంకాలం అయిదు గంటలకి ఆటోలో ఇంటికి చేరాను. ఇంటికి తాళం వేసి ఉంది.

నేను రోడ్డుమీదకు వచ్చి హోటల్లో కాఫీ తాగి, కాసేపు రోడ్డుమీద షాపులు అవీ చూస్తూ గడిపాను. వారుణికి అయిదుగంటలకి ఆఫీసు అయిపోతుంది అని చెప్పింది. మరి ఇంటికి రాలేదేం? తన ఆఫీసు నుండి సాగర్ దగ్గరకి వెళ్ళి ఇద్దరూ కలిసి వస్తారేమో, వారుణి సాగర్‌కి ఏ అనుమానం రాకుండా జాగ్రత్త పడుతోందేమో? ఇద్దరం ఇంట్లో ఒంటరిగా ఉండే పరిస్థితి రాకుండా జాగ్రత్త తీసుకుంటోందేమో అన్న అనేకమైన ఆలోచనలు మెదడులో ముసరగా, ఒకవేళ అదే ఉద్దేశ్యమైతే రేపు హోటల్‌కి షిఫ్ట్ అయిపోవాలి అనుకున్నాను.

ఏడుగంటల వరకూ రోడ్డుమీద గడిపి, ఇంటికి చేరుకున్నాను. బెల్ కొట్టగానే వారుణి వచ్చి తలుపు తీసింది. లోపలికి వెళ్ళిన నాకు సాగర్ స్కూటర్ కనబడలేదు.

"సాగర్ రాలేదా?" అని అడిగాను.

"లేదంకుల్! వచ్చేసరికి బాగా లేటవుతుంది. మీరు ఎన్నిగంటలకి వచ్చారు?" అంది.

నేను చెప్పాను.

"సారీ అంకుల్! ఆఫీసు నుండి బజారు కెళ్ళాను. అందుకే వచ్చేసరికి లేటయింది!" అంది.

అంతవరకూ నా మనసులో ఉవ్వెత్తు తరంగాలుగా లేచిన అపోహలన్నీ

తొలగిపోయాయి. వారుణి గబగబా వంట చేసింది. నేను స్నానం చేసి వచ్చేసరికి "మీరు భోజనం చేసేయ్యండంకుల్!" అంది.

నేను పగలంతా సెమినార్ వల్ల అలసిపోయి ఉన్నానేమో, భోజనం చేసేశాను. భోజనం చేయగానే కళ్ళు బరువెక్కాయి. డ్రాయింగ్ హాల్లో పక్కవేసుకుని పడుకున్నాను. సాగర్ పది గంటలకి వచ్చాడు. స్కూటరు లోపల పెట్టాడు. వారుణి తలుపు తీసింది. నాకు నిద్ర చెదిరింది. సాగర్ స్నానం చేశాక ఇద్దరూ డైనింగ్ టేబుల్ దగ్గర చేరారు. ఇద్దరూ సరసాలాడుకుంటూ భోజనాలు చేశారు. తర్వాత ఇద్దరూ బెడ్‌రూమ్‌లో దూరిపోయారు.

మరుసటిరోజు తెల్లవారుజామునే నాకు తెలివి వచ్చేసింది. నేను తలుపు తీసుకుని, మార్నింగ్ వాక్‌కి వెళ్ళి వచ్చాను. అప్పటికి సాగర్‌కానీ, వారుణి కానీ లేవలేదు. ఇద్దరూ ఏడుగంటలకి లేచారు. ఎనిమిది గంటలకి వెళ్ళవలసినవాళ్ళు, ఏడుగంటలకి లేచారేమిటా? అనుకున్నాను. వారుణి కాఫీ పెట్టింది. ముగ్గురం తాగాము. సాగర్ స్నానానికి అంటూ బాత్రూమ్‌లో దూరాడు. వారుణి టిఫెన్ చేయడానికి కిచెన్‌లోకి దూరింది. నేను ఆ రోజు పేపరు చూస్తూ డైనింగ్ టేబుల్ దగ్గరే కూర్చున్నాను.

వారుణి టిఫిన్ చేసి, స్టౌ ఆర్పి, టవల్ తీసుకుని బాత్రూమ్ తలుపు తట్టింది. నేను కాజువల్‌గా "సాగర్ ఇంకా బయటకి రాలేదు"! అన్నాను.

నే చెప్పింది విన్నా, వారుణి పట్టించుకోలేదు. మళ్ళీ బాత్రూమ్ తలుపు తట్టింది. సాగర్ తలుపు తీశాడు. బాత్రూమ్‌లో దూరిపోయింది వారుణి. నేను అవాక్కయిపో యాను. రాత్రి భార్యాభర్తలు బెడ్‌రూమ్‌లో దూరి తలుపేసుకుంటే ఎబ్బెట్టుగా ఉండదు గానీ, పగలు ....... అదీ మూడోవ్యక్తి చూస్తుండగా, ఎంత దంపతులైనా బాత్రూమ్‌లోకి వెళ్ళి తలుపు వేసుకుంటే కొంచెం ఆశ్చర్యం వేసింది.

బాత్రూమ్‌లోంచి మాటలు వస్తున్నాయి. "షవరు ఆన్ చేయ"మని. "నా జుత్తు తడిపేశావు. వారుణీ!" అంటున్నాడు సాగర్. మళ్ళీ నీళ్ళ చప్పుడు తప్ప ఇంకే మాటలూ వినపడటంలేదు. రెండు నిమిషాల తర్వాత వారుణి కిసుక్కున నవ్వింది.

నేను పేపరు చదువుతున్నానే గానీ, దానిమీద మనసు నిలువలేదు. నేను అక్కడుండ గానే ఇద్దరూ లోపలకు దూరారు. వచ్చేటప్పుడు కనీసం వారుణి సిగ్గుపడుతుందేమో అనుకున్నాను. బాత్రూమ్‌లో స్పష్టంగా మాటలు వినబడకపోయినా గుసగుసలు వినబడుతున్నాయి. రిసెప్షన్‌లో ఫోటో తీసినప్పుడు వారుణి సాగర్‌కి ఎడంగా జరగడం జ్ఞాపకం వచ్చింది.

పావుగంట తర్వాత వారుణి నైటీ తొడుక్కుని బెడ్‌రూమ్‌లో దూరింది. వారుణికి వెనగ్గా సాగర్ కూడా మొలచుట్టూ టవల్ చుట్టబెట్టుకుని, బెడ్‌రూమ్‌లో దూరాడు. మళ్ళీ ఇద్దరూ బెడ్‌రూమ్‌లో దూరారు అనుకున్నాను. బెడ్‌రూమ్‌లోనుండి బట్టల సెలక్షన్ కబుర్లు

వినబడుతున్నాయి. ఐదు నిముషాల తర్వాత వారుణి తయారై బయటకు వచ్చింది. కిచెన్‌లోకి వెళ్ళి తనకి, సాగర్‌కి టిఫిన్ పాక్ చేసింది. నాకు టిఫిన్ ప్లేటులో పెట్టి తెచ్చి, డైనింగ్ టేబుల్ మీద పెట్టింది. నేను టిఫిన్ తింటూండగా ఇద్దరూ బయలుదేరడానికి సిద్ధమయ్యారు.

"అంకుల్! కీస్ మీ దగ్గరే ఉంచుకోండి. మీరు ముందు వచ్చేస్తారుగా. నా దగ్గర కూడా ఉంది!'' అంది వారుణి ఇంటి తాళం నా కిస్తూ. నేనా కీ తీసుకుని జేబులో పెట్టుకునే లోపల ఇద్దరూ మాయమయ్యారు.

నా కళ్ళముందు జరిగిన సంఘటనల్ని నేను మర్చిపోలేకపోయాను. ఎవరూ లేనప్పుడు ఇద్దరూ ఎలా ప్రవర్తించినా చెల్లేదేమో! ముఖ్యంగా వారుణి మూడో మనిషి ఉండగా ప్రవర్తించిన తీరు నేను హరాయించు కోలేకపోయాను. వారుణిని ఈ విషయం అడగాలనుకున్నాను. తను చేసిందంతా స్వేచ్ఛ అనే ముసుగులో కప్పిపుచ్చేస్తుందేమో! లేదు లౌక్యంగా, "టైము సరిపోదు అంకుల్''! అంటుందేమో! టైమ్ సరిపోకపోతే కొంచెం ముందు లేవవలసింది అనుకున్నాను. ఇలా అనేకమైన ఆలోచనలతో టిఫిన్ ముగించి, తయారై సెమినార్‌కి వెళ్ళిపోయాను.

సెమినార్ ముగిశాక, ఇంటికి వెళ్తే వారుణి ఎలాగూ ఉండదని ఓ కొలీగ్ ఇంటికి వెళ్ళి కాసేపు కబుర్లు చెప్పి, ఇంటికి బయలుదేరాను. మర్నాడు వారుణిని సెలవు పెట్టమనాలి. షాపింగ్ చెయ్యాలి, వారుణితో మాట్లాడాలి అనుకుంటూ ఇల్లు చేరాను. వెళ్ళేసరికి వారుణి వంటచేసి రెడీగా ఉంది. ఇద్దరం డ్రాయింగ్ హాల్లో కూర్చుని మర్నాటి ప్రోగ్రామ్ ఫిక్స్ చేసుకున్నాం. వారుణి మధ్యాహ్నం హాఫ్‌డే సెలవు తీసుకుని వస్తానంది. సెమినార్ ముగించి నేను ఒంటిగంటకు వస్తానని చెప్పాను. నేను సాగర్ కోసం వెయిట్ చేస్తుంటే సాగర్ ఇండస్ట్రీ స్టార్ట్ చెయ్యడానికి ప్రయత్నాలు చేస్తున్నాడని, వచ్చేసరికి లేటవుతుందని చెప్పి నాకు భోజనం పెట్టేసింది. నేను భోజనం చేసి డ్రాయింగ్ హాల్లో పక్క వేసుకు పడుకున్నాను.

మూడవరోజు తెల్లవారుజామునే నిద్రలేచి, మార్నింగ్ వాక్‌కి వెళ్ళి వచ్చాను. ఈరోజు ఏమవుతుందా అన్న ఆలోచనలతో పేపరు పట్టుకుని డైనింగ్ టేబుల్‌ని ఆశ్రయించాను.

సాగర్ కాఫీ తాగడం ముగించి, బెడ్‌రూమ్‌లోకెళ్ళి చిన్నగా "డింగరీ! సెవన్ ట్వంటీ అయింది!'' అన్నాడు. వారుణి టవల్ కోసం వెతుకుతూంటే "ఇదుగో, నా దగ్గరుంది!'' అంటూ బాత్రూమ్‌లో దూరాడు. తలుపు మాత్రం వేయలేదు. వారుణి కాజువల్‌గా అతని వెనకే బాత్రూమ్‌లోకి దూరి తలుపు వేసేసింది.

మళ్ళీ అవే గుసగుసలు, నవ్వులు, నాకు డైనింగ్ టేబుల్ దగ్గరనుండి కదలబుద్ధి వేయలా! ఈ వ్యవహారం రోజూ ఉంటుందనుకుంటా, టైము లేకపోవడం అంటే ఇదేనా? నేను నా ఆలోచనల్లో ఉండగా, వారుణి ఒంటికి అతుక్కుపోయిన నైటీ వేసుకుని

బెడ్‌రూమ్‌లోకి వెళ్ళింది. వెనకే సాగరూ బెడ్‌రూమ్‌లోకెళ్ళి తలుపు వేసేశాడు. బెడ్‌రూమ్‌లోంచి సాగర్ మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. "డింగరీ! ఈ బ్రాకి హుక్‌లేదు. ఇంకో బ్రా వేసుకో!" అని, "డింగరీ! జాకెట్ బాగా సర్దనా?" అనో.

కొంచెం సేపటికి బెడ్‌రూమ్ తలుపు తెరుచుకుంది. ఇద్దరూ బయటకు వచ్చారు. వారుణి నాకు టిఫిన్ ఇచ్చి, తమ టిఫిన్ బాక్సులు తీసుకుంది. ఇద్దరూ స్కూటర్ మీద మెరుపువేగంతో మాయమయ్యారు.

మధ్యాహ్నం రెండుగంటలకు నేను ఇంటికి వచ్చేసరికి వారుణి ఇంట్లోనే ఉంది.

"వారుణీ! భోజనం చేశావా?" అని అడిగాను.

"ఊఁ, కాంటీన్‌లో చేసేశాను. అంకుల్"! అంది కాని మర్యాదపూర్వకంగా నన్ను తిరిగి అడగలేదు.

మూడుగంటలకల్లా ఇద్దరం ఫ్రెష్ అయి షాపింగ్‌కి బయలుదేరాం. ఇద్దరం కావేరీ ఎంపోరియమ్‌కి వెళ్ళి డెకొరేటివ్ ఆర్టికల్స్ కొన్నాం. తర్వాత రెండు మూడు సిల్క్ ఎంపోరియమ్‌లు తిరిగి, రెండు బెంగుళూరు సిల్కు చీరలు కొన్నాను. షాపింగ్ అయిపోయాక వారుణి నన్ను విధానసౌధవైపు తీసుకెళ్ళింది. విధానసౌధముందు ఆవరణ అంతా పచ్చికమయంగా ఉంది. పచ్చికకి దూరంగా రోడ్డుకి పక్కగా చాలా ఫాస్ట్‌ఫుడ్ షాపులున్నాయి. అక్కడ అన్నీ దొరుకుతాయి. తిరిగి తిరిగి అలసిపోయావేమో, రెండు మసాలా దోసెలు వేయించి పేపర్ ప్లేట్లలో పెట్టుకుని తెచ్చుకుని పచ్చికలో కూర్చున్నాం.

నేను దోస తింటూ వారుణివైపు చూసి, "వారుణీ! మగాడు సిగ్గుపడతాడు, ఆడది సిగ్గు నటిస్తుంది అనుకుంటా?" అన్నాను.

"లేదంకుల్! ఈ ఫాస్ట్ లైఫ్‌లో సిగ్గుపడటానికి టైమ్ చాలదు!" అంది.

నేను చిన్నగా నవ్వి ఊరుకున్నాను. నేను అడుగుదామనుకున్నది వేరు. దానికి పై కామెంట్ ఉపోద్ఘాతం మాత్రమే.

"వారుణీ! నేను మీ ఇంట్లో ఉండి మీకు ఇబ్బంది కలుగజేశాను కదూ!" అన్నాను.

"అదేం లేదే!" అంది.

"ఎందుకు లేదూ, మీకున్న ప్రైవసీని పాడుచెయ్యలేదూ"! అన్నాను.

నేనే విషయంలోకి వస్తున్నానో అర్థం చేసుకుంది. "లేదంకుల్!" అంది ముభావంగా.

నేను రెట్టిస్తూ "ఎందుకు లేదూ? ఇద్దరికీ అసలే టైముండదు. అందులో, పొద్దున్నే మీ తొందర చూస్తే, తెలుస్తోంది!" అన్నాను.

వారుణి చాలాసేపు మౌనంగా ఉంది. దోసె తినడం పూర్తిచేసి లేచి వెళ్ళి ఇద్దరికీ రెండు గ్లాసులతో మంచి నీళ్ళు తెచ్చింది. తర్వాత నేను లేచి వెళ్ళి రెండు డిస్పోజబుల్ కప్పులతో కాఫీ తెచ్చాను.

ఇద్దరం కాఫీ తాగుతూ కూర్చున్నాం. మెల్లగా చీకట్లు కమ్ముకుంటున్నాయి. నేను మళ్ళీ సంభాషణకు ఉపక్రమిస్తూ, "నువ్వు చెప్పడం లేదు గానీ, మీరు ఇబ్బంది పడ్డారు!" అన్నాను.

వారుణి అప్పటికీ మౌనంగానే ఉంది. నేను కొంచెం సాహసం చేసి, "సిగ్గు అనేది భూషణం అన్నారు. కానీ ఈ రోజుల్లో సిగ్గు దూషణలా ఉంది!" అన్నాను.

వారుణి నా మాటలు వింటోంది కానీ పెదవి విప్పలేదు. ఇద్దరం కాఫీ పూర్తిచేసి, విధానసౌధ ఎదురుగా ఉన్న రోడ్డు మీదికి వచ్చి, ఆటో తీసుకుని ఇంటికి వచ్చేశాం. అప్పటికి ఎనిమిది అయింది. చీకటి చిక్కబడింది.

ఇంటికి రాగానే, వారుణి డ్రెస్ మార్చి కిచెన్‌లోకి వెళ్ళింది. నేను సామాన్లు సర్ది, స్నానం చేసి డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని టీ.వీ. ఆన్ చేశాను. కానీ నా మనసు టివీ మీద లేదు. వారుణి మునుపటిలా కాదు. నేను రెట్టించినా, దేనికీ సమాధానం కూడా చెప్పలేదు. ఇంక రేపు పొద్దున్న వెళ్ళిపోయేవరకూ, వారుణితో ఏ విషయమూ మాట్లాడకూడదు అని మనసులో తీవ్రంగా నిర్ణయించుకున్నాను.

వారుణి వంట పూర్తిచేసి స్నానం చేసి, టైట్‌గా జడ వేసి, మెడచుట్టూ పౌడరు పూసుకుని, నైటీ వేసుకుని డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చి కూర్చుంది. నేను మాట కలుపుతానేమో అని ఎదురు చూసింది కానీ, నేను సీరియస్‌గా టీవీ చూస్తున్నట్లు నటిస్తున్నాను. ఇద్దరికీ తెలుసు రాత్రి పదయితే గానీ సాగర్ రాడు. ఇద్దరికీ మాట్లాడుకోడానికి బోలెడు సమాచారం అయితే ఉంది. వారుణి తన షెల్ బద్దలు కొట్టుకుని, నేను అడిగిన ప్రశ్నలకి సమాధానం చెప్పదు. ఆమె దగ్గర సమాధానం లేదు కూడా! ఇద్దరిలో ఎవరు బ్రేక్ చేస్తారో చూడాలి అన్నట్టుగా గదిలో నిశ్శబ్దం ఎదురు చూస్తోంది.

"అంకుల్ ! కోపం వచ్చిందా?" అంది వారుణి

నేను సమాధానం చెప్పలేదు.

"అంకుల్ ! టీవీ అంత ఇంట్రెస్టింగ్‌గా ఉందా?" అంటూ నన్ను సీరియస్‌గా చూసింది.

ఆ మాటతో టీవీ కట్టేశాను. ఏమిటి చెప్పమన్నట్టుగా వారుణి వైపు చూశాను.

వారుణి ఎదురుగా ఉన్న వాల్ హేంగింగ్ చూస్తూ, "మీరడిన ప్రశ్నలు కొత్తవేమీ కావు. అమ్మా, నాన్న ఇక్కడికి వచ్చి, మీలాగే ఇబ్బంది పడ్డారు. నాన్న అమ్మచేత చెప్పించారు. 'మీరిద్దరూ చేస్తున్న పని ఎబ్బెట్టుగా ఉందే వారుణీ!' అంది అమ్మ.

"టైము చాలదే అమ్మా!" అన్నాను.

"నువ్వు కొంచెం ముందుగా లేవచ్చు కదా?" అంది అమ్మ.

అమ్మకేం సమాధానం చెప్పను? ఇద్దరం బెడ్ మీదకి వెళ్ళేసరికి పదకొండు గంటలవుతుంది. పొద్దున్నే లేవడానికి ఏడుపొస్తుంది. కళ్ళు విడవు. నిద్ర చాలకపోతే రోజంతా చికాకుగా ఉంటుంది. నేను అమ్మకి ఏం సమాధానం చెప్పాలి?

ఈ విషయం సాగర్‌కి చెప్తే తను కొట్టిపారేశాడు. మనం ఎందుకు ఇబ్బంది పడాలి? ఓన్లీ టు మేక్ దెమ్ హేపీ?! ఏం అవసరం లేదు. పట్టించుకోకు! అన్నాడు. ఇద్దరం పట్టించుకోవడం మానేశాం. పది రోజులకి అమ్మా, నాన్న సమాధాన పడిపోయారు. నిజానికొస్తే ఇదేం పెద్ద ఇబ్బందిపడవలసినది కాదు. ఇంతకన్నా ఇబ్బందికరమైన పరిస్థితులే డే టు డే జీవితంలో ఎదురవుతున్నాయి. మొన్న నా బాస్ ఆఫీసులో "వారుణీ! ఇంటికేనా? మెజెస్టిక్ థియేటర్ దగ్గర దింపుతా పద!'' అంటూ తన కారులో నన్ను మెయిన్ రోడ్డు మీదకి తీసుకెళ్ళి, ఓ షాపు దగ్గర ఆపాడు. "వారుణీ! చిన్న పర్చేజ్ ఉంది. అది పూర్తి చేసి పోదాం! కారులో నీకు బోర్ కొడుతుందేమో, నువ్వూ రా!'' అని పిలిచాడు.

బాస్‌తో షాపులోకి వెళ్ళక తప్పలేదు. అది రెడీమేడ్ బట్టల షాపు. బాస్ తిన్నగా ఓ కౌంటర్ దగ్గరకి వెళ్ళి బ్రాస్ చూపించండి! అని అడిగాడు షాపువాడు "సైజు?'' అని అడిగాడు బాస్ నన్ను చూపించాడు. ఆ క్షణంలో చాలా ఇబ్బంది పడ్డాను. షాపులోంచి బయటకి పోయి, బస్సులో ఇంటికి పోవలసింది అనుకున్నాను. బాస్ మనసులో ఈ ఉద్దేశం పెట్టుకునే నాకు లిఫ్ట్ ఇచ్చాడు. ఎంత చలాకీగా వ్యవహరించాడూ? అనిపించింది. కారులో కూర్చున్నంతసేపూ బాస్ మనసులో ఏముందో ఊహించుకుంటే ఒళ్ళు కంపరం ఎత్తిపోయింది. కానీ ఇలాంటి ప్రవర్తన్లకి అలవాటు పడిపోతాం. మరీ సెన్సిటివ్‌గా ఆలోచిస్తున్నకొద్దీ మనస్తాపమే కానీ, ఈ అతితొందర ప్రపంచంలో మిగిలేది ఏదీ లేదు!

"అంకుల్ ! మిమ్మల్నే తీసుకోండి. మిగతావాళ్ళలా సీరియస్ బిహేవియర్‌తో పెద్దరికం నిలబెట్టుకుందామని తాపత్రయపడరు. చిలిపిగా, కొంటెగా అందర్నీ ఉడికిస్తూ, ఆడపిల్లల్ని కూడా టీజ్ చేస్తూ మోడ్రన్‌గా ఉంటానని మీ మీద మీకు అభిప్రాయం. కానీ కొందరు మీ ప్రవర్తనని వెకిలి అంటే మీరు ఒప్పుకోరు. అలాగే, పరిస్థితుల్ని అర్థం చేసుకుని వాటికి ఎడ్జస్ట్ అవుతూ, అవసరానికి కావలసిన విధంగా నన్ను నేను ఎడాప్ట్ చేసుకుంటున్నాను. ఆ మాత్రం అర్థం చేసుకోలేరా?'' అంది వారుణి ఆవేశంగా.

"అదికాదు, వారుణీ...'' అంటూ సర్ది చెప్పబోయాను.

"ప్లీజ్, అంకుల్! ఇలా అన్నందుకు ఏమీ అనుకోకండి. ఇందాకటినుంచి మీరు 'సిగ్గు సిగ్గు' అంటున్నారు. ఎదుటివాళ్ళని ముఖ్యంగా... ఆడవాళ్ళని కన్సర్వేటివ్ ఫ్రేమ్‌లో బిగించి ఎందుకు విలువ కడతారో అర్థం కావడంలేదు. కెన్ ఐ గో బాక్? నెవర్....! పాత విలువలకి కొత్త డెఫినిషన్ చెప్పాలేమో! అలా చెప్పలేక, మోడ్రన్ అనుకుంటున్న మీలాంటి వాళ్ళు కూడా...'' అంటూ 'కూడా' దగ్గర ఆపుచేసింది వారుణి.

కానీ ఆ తర్వాత వాడేమాట 'అహంకారం' అని నాకు తెలుసు. నేను అహంకారాన్ని

చూపానా? చాలా విచిత్రంగా ఉంది. వారుణి మాటలవల్ల అర్థం అయింది ఏమిటంటే డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని, లేనిపోనివి అబ్జర్వ్ చేయడమే నా తప్పు అన్నట్టుగా ఉంది.

నేను సాయంకాలం నుండి కొట్టుమిట్టాడుతున్న అపోహకి సమాధానం దొరికి నట్టయింది. వారుణి ఆవేశాన్ని తగ్గిస్తూ వాతావరణాన్ని తేలిక చేస్తూ "వారుణీ యు ఆర్ ట్రిబుల్ ఎక్స్ గర్ల్!" అన్నాను నవ్వుతూ

"మూడో ఎక్స్ దేనికి"? అంది.

వారుణికి కాలేజీలో డబుల్ ఎక్స్ గర్ల్ పేరుంది. మార్కులు తొంభైశాతం కన్నా ఎక్కువ వస్తే, దానిని ఎక్సలెంట్ గ్రేడ్ అంటారు. ఫస్ట్ ఇయర్‌లో వారుణికి మాథ్స్ వన్, మాథ్స్ టూ రెండింటిలో తొంభైశాతం దాటాయి. రెండు ఎక్సలెంట్‌లు వచ్చాయి. ఇలా ఎక్సలెంట్ గ్రేడ్ వచ్చిన బాయ్‌ని గానీ, గర్ల్‌ని గానీ విద్యార్థులు ముద్దుగా ఎక్స్‌బాయ్, ఎక్స్‌గర్ల్ అంటారు. ఆ వారుణిని డబుల్ ఎక్స్ గర్ల్ అనేవారు. కానీ ఆ పిలుపులో కొంటెదనం వారుణి పసిగట్టింది.

"డబుల్ ఎక్స్ గర్ల్ అంటే ఇంకో అర్థం అంకుల్?" అని అడిగింది.

"ఊ ఉంది!" అన్నాను.

"ఏమిటీ?" అంది ఆశ్చర్యంగా.

"అందానికి ఒక ఎక్సలెంట్, తెలివికి రెండో ఎక్సలెంట్!" అన్నాను.

"ఓహ్... అంతేనా!" అంటూ తేలికగా నవ్వేసింది. తర్వాత క్లాస్‌మేట్స్ ద్వారా 'ఎక్స్' కి డెఫినిషన్ తెలుసుకుంది. అది దృష్టిలో పెట్టుకుని "మూడో ఎక్స్ దేనికి, అంకుల్?" అంది.

నేను నవ్వుతూ, "అండర్‌స్టాండింగ్ అండ్ ఎడ్జస్ట్‌మెంటాలిటీకి!" అన్నాను.

వారుణి నవ్వింది.

"ఇంత తొందరగా మార్పుని స్వీకరిస్తావనుకోలేదు. వారుణీ!" అన్నాను.

"తప్పదు అంకుల్! ఫిటెస్ట్ విల్ సర్వైవ్" అంది.

మర్నాడు నేను డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చోలేదు. అన్ని కార్యక్రమాలూ ముగించుకుని ఎనిమిదిగంటలకల్లా నేను సామాన్లతోనూ, వాళ్ళు టిఫిన్ బాక్సులతోనూ బయటకు వచ్చాము.

నేను వాళ్ళకి "బై బై !" చెప్పాను.

వారుణి సాగర్ స్కూటర్ మీదనుంచే "బై అంకుల్!" అని చెప్పింది. మెరుపు వేగంతో మాయమయ్యారు జనంలోకి ఇద్దరూ !

ట్రిబుల్ *(కథాప్రభ (ఆంధ్రప్రభ), 27 సెప్టెంబరు 1999)*

# బతుకు భయం

తుఫాను గాలికి తాటాకులు శబ్దం చేస్తున్నాయి. తాటాకుల కప్పు కన్నాల్లోంచి చిన్నచిన్నగా నీటిబొట్లు టప్....టప్...మని రాలుతున్నాయి. నీటిబొట్లు నేల మీదపడకుండా, అవి పడే చోట బాల్చీ, రెండు సిల్వరు గిన్నెలూ వున్నాయి. పాకలో ఓ మూలగా కిరసనాయిలు బుడ్డి దీపం దగ్గర పెట్టుకుని ఇనప గొట్టంతో పొయ్యి వూదుతోంది పోలమ్మ. ఈదురు గాలికి పొయ్యి సరిగ్గా రాజుకోడం లేదు. పక్కనున్న బల్ల తీసి పొయ్యికి అడ్డు పెట్టింది. గాలి తాకిడి తగ్గింది. పొయ్యి రాజుకుంటోంది. పాకలో ఇంకో మూల గోడకానుకుని కూర్చున్న కొండడు జేబులోంచి చుట్ట తీసి, వెనక పక్క చిన్నగా కొరికి, బైటకి వుమ్మేశాడు. కొరికిన వైపు నోట్లో పెట్టుకుని, అగ్గిపుల్లతో చుట్ట అంటించడానికి రెండు సార్లు గీశాడు అగ్గిపుల్ల. అది వెలిగినా గాలికి ఆరిపోయింది.

"పోలీ అగ్గిరవ్వొట్టుకు రావే చుట్టెలగట్లా" అన్నాడు.

"నేనిక్కడ ముద్దుడక బెట్టడానికి మంటెట్టలేక చస్తోంటే, మద్దిన నీ సుట్ట వైభోగం ఏంటి? ఈడ కొచ్చి ఎనిగించుకో నేవూ" అంటూ దీర్ఘం తీసింది పోలమ్మ.

"సర్లే, పొయ్యి కాడకే వత్తున్నా. యెచ్చగా వుంటది" అంటూ కూర్చున్న చోటు నుంచి లేచి, పొయ్యి దగ్గరికి వెళ్ళి, పోలమ్మ ఎదురుగా పొయ్యికి పక్కగా చతికిలబడ్డాడు. పోలమ్మ పొయ్యి లోంచి కొరకంచు తీసి చుట్టంటించింది. తిరిగి కొరకంచు పొయ్యిలోకి తోసింది. అక్కడే స్థిరపడి పోయాడు కొండడు.

"ఈ ముసురు ఎన్నాళ్ళుంట?" అనడిగాడు కొండడు.

"మూణ్రోజులేనా ఉంటుంది. ఈ యేళేగా మొదలయింది. రేడియోలో చెప్పిండంటగా రేపు సాయంకాలానికి గాని తీరం దాటద్దంట! అందుకే ఈ మద్యాహ్నం నించీ గాలెక్కువైంది. వానా ఎక్కువైంది. ఈ ఏళే కొంప కార్తోంది. మరి రేపేటవుద్దో!" అంటూ విచారం వెలిబుచ్చింది. పోలమ్మ.

"ఏమవదులే మొన్నట్టుకొచ్చిన రబ్బరు గుడ్డలు, రేపు పాక మీదేస్తాను" అన్నాడు కొండడు.

"ఏంటి ఆ పెంటకుప్ప మీంచి అట్టుకొచ్చిన గుడ్డలేనా? అవెక్కడ ఆగుతయి, ఆగవు" అంది పోలమ్మ.

చిన్న పిల్లల పొత్తిళ్ళలో వేసి, చిరిగిపోయి బైటపారేసిన రబ్బరు గుడ్డల్ని పాక కన్నాల్లో వేసి కప్పడానికి తెచ్చాడు కొండడు. తెచ్చినాడు సణుక్కుంది పోలమ్మ కాని ఇప్పుడు అవే పనికి వస్తాయని తెలిసి గమ్మున వూరుకుంది.

గాలికి కిరసనాయిలు దీపం 'రాక్ అండ్ రోల్' నృత్యం చేస్తోంది. వెలుగు నీడలు

పాకలో వస్తువుల మీద పడి వింత భయాన్ని గొలుపుతున్నాయి. ఆ వెలుగు నీడల దోబూచులాటలో పాకలో ఓ మూలగా వున్న పెద్ద గంపని చూశాడు కొండడు.

"పోలీ కూరలు తెచ్చావేంటీ?" అన్నాడు.

"ఆ పొద్దున్నే సంతకెళ్ళి కూరలట్టుకొచ్చినా, పొద్దున్నే విశాకపట్టానికి తుపానెళ్ళుద్దని కబురు తెలిసి, సేను కట్ట గుండా సంతలోకెళ్ళి నాలుగు కిలో లొంకాయలు, మూడు కిలోల దొండకాయలు, రెండు కిలోల బంగాలా దుంపలు, పది అరటికాయలు" అంటూ పోలమ్మ చెప్పుకు పోతుంది.

కొండడు పోలమ్మ మాటలకి అడ్డొచ్చి "ఏటి దినవారా లెట్టడానికా ఈ కూరలన్నీ" అన్నాడు.

"నీకేం అట్టా కట్టుగా వున్నావు. నీ దినవా లకేటి తొందరొచ్చింది గానీ రేపు మురలీ నగరం ఎల్లి ఒక్క తిరుగు తిరిగానంటే బుట్ట కాళీ అయిపోదూ" అంది.

"ఏంటీ! ఇంత ముసురులో బుట్టట్టుకుని మురలీ నగరం యెల్తావా?" నీకేమైనా మతుందా?" అన్నాడు కొండడు ఆశ్చర్యంగా.

"మతుంది కాబట్టే తొందరడ్డాను. రెండు మూడ్రోజుల వరకూ కాలనీలో వాళ్ళెవ్వరూ ఎక్కడికీ కదన్నేరు. ఆళ్ళ కాడకేదొస్తే అది కొనేస్తారు. అసలు మామూలు రోజుల్లోనే ఆళ్ళెక్కడికీ కదల్రు. ఆడ ఆడోళ్ళుంటరు. ఇంక ఈ ముసుర్లో ఎక్కడ కెళ్తరు? ఈళ్ళెళ్ళినా కూర్నేటి దొరుకుతయి"

"పోలీ, ఇన్నేసి కూరలు కొన్నావు, ఈ ముసురులో కూరలు తడిసి, ఎలానూ ఎండవు. ఆళ్ళూ కొనకపోతే, నాబం గూబల్లోకొచ్చి, మొత్తం సొమ్మంతా సింహాద్రప్పన్న పరం అయిపోవు గదా!" అన్నాడు కొండడు నవ్వుతూ. కాని ఆ నవ్వులో హాస్యం కన్నా పోలమ్మ చేసిన తెలివి తక్కువ పనిమీద జాలే ఎక్కువుంది.

"నువ్వేటి అలాగంటవు. రెండేళ్ళ నుంచీ మురలీ నగరంలో నే కూరనమ్మటం లేదా? ఏటీ? మురలీ నగరం ముంగిట వుంటాడు చూడూ లాయరు బాబు! ఆళ్ళింటికెళ్తే ఆయమ్మ గారికి వంకాయలు పేనం. కిలోకి తక్కువ కొన్దు. నేనా వంకాయలు అయిదేసి సొప్పన వుచ్చుకున్నానా? పదికేనా అమ్మకపోను. ఆ పక్కగా ఇంజనీరు గారున్నారు సూడు! నే కూరలట్టుకెళ్ళగానే ఆవిడతో పాటు ఆయనా వొచ్చేస్తాడు. బొజ్జ కిందకి లుంగీ వుంటుందా? వూడుద్దా? అన్నట్టుంటది. ఆ బాబుకి ఈ ముసుర్లు, వానలు వస్తే పండగ. పన్లోకెళ్ళక్కర నేదు. ఆ బాబు బైటకి వస్తుంటే కోటిగాడి సారాకొట్టు నడిచి వచ్చేస్తున్నట్టుంటది. ఆ బాబుకి బజ్జీలవసరం. అరటికాయలు, బంగాళాదుంపలు చూస్తే వదలు! ఆ పక్కగా గుమస్తా బాబున్నాడా! ఆయనకి వూరంత బయం, గట్టిగా ఎండ కాస్తే బయం వానొస్తే బయం.గుంటలు స్కూలుకెళ్తే బయం. ఇంటో కూకుంటే బయం,

కూరల దానికి ఎక్కువ డబ్బు పోసి పెళ్ళాం కూరలు కొంటుందేమో అని బయం. బజారు కెళ్ళి కూరలు తెచ్చుకుంటే స్కూటరుకి పెట్రోలయిపోద్దని బయం. చల్లపెట్టెలో తింటే పడిసెం బయం. బయట వదినేస్తే కుల్లిపోతాయని బయం. కూరల్ది రాకపోతే బయం. వస్తే ఎక్కువ ధరలు సెప్తుందేమో అన్న బయం. కాని ఎంత ధరేనా పెట్టి ఆ అమ్మకొనక మాన్దు. ఆ పక్కగా ఆఫీసరు గారి పెళ్ళాం వుంది సూసావు! ఆయమ్మ యమ డేంజరు. ఓ పట్టాన బేరం తేల్చదు. మనల్ని తట్టెత్తుకు పోనివ్వదు. అరకిలో వొంకాయలు కొని, పావుకిలో వంకాయలు కొసరేయించుకుంటది. అందుకే ఆయమ్మ దగ్గర జాగ్రత్తగా వుండాల. తూసేటప్పుడు, కడ్డీకాడ సెయ్యేట్టి, తక్కువ తూసాల. తర్వాతో రెండు కాయలెయ్యాల. అది ఆయమ్మకి సంతృప్తి. ఆయమ్మ దగ్గర మాత్రం జాగ్రత్త గుండాల. మన కన్ను మరుగయిందో, మనం సూడకుండా బుట్టలోంచి నిమ్మకాయో, పచ్చిమిరపకాయలో, అల్లం ముక్కో మాయం సేసే సేతివాటం వుంది'' అంది పోలమ్మ ఆయాసం తీర్చుకుంటూ, పొయ్యిలో నెగడు ఎగదోసింది.

"నీ దగ్గరెప్పుడేనా కొట్టేసిందేటి''

"ఆ! ఆయమ్మ గార్ని మంచి నీళ్ళడిగినా, మంచి నీళ్ళిచ్చింది. నేనరుగు మీద మంచి నీళ్ళు తాగతావుంటే, వో నిమ్మకాయ తీసి దాచేసింది. ఆ యింటి నుండి ఇంకో ఇంటికెళ్ళి సూద్దునా! మూడు నిమ్మకాయలకీ తట్టలో రెండే వున్నాయి''.

"ఈళ్ళందర్నీ వొడకట్టేసేవన్నమాట. అయినా అంత డబ్బుండీ ఆ బుద్దులేటే!'' అన్నాడు కొండడు విచారంగా.

"మామూలు రోజుల్లో కూరలట్టుకెళ్ళి మధ్యాహ్నం వరకూ తిరిగి అమ్మితే వంద రూపాయుల వరకూ అమ్ముడవుతాయి. అందులో గిట్టుబాటు ముప్పై రూపాయిలుండచ్చు. రేపు నీకు కూలి ఎనాగూ వుండదు. అది కూడా గిట్టుబాటవాలంటే వానో, తుపానో! కూరల బుట్టొట్టుకు పోడమే'' అంది పోలమ్మ తన ముందాలోచనకి తానే మురిసిపోతూ.

నిజమే అనిపించింది కొండడికి. పోలమ్మ తన కష్టానికి తోడుండబట్టి ఈ చిన్న పాక వేశాడు. ఉండడానికి పైకప్పు దొరికింది. నాలుగేళ్ళ క్రితం ఏ రోజు వచ్చిన డబ్బులు ఆరోజు బియ్యం కొని రైల్వేస్టేషను పక్కగా నాలుగు రాళ్ళు పోగేసి పొయ్యి చేసి వండుకు తినేవాడు. పోలమ్మ తగిలిన దగ్గర్నించీ, ఇద్దరి సంపాదనా పెరిగినా, పాకేసుకునేంతగా డబ్బు చేరలేదు. రైల్వే స్టేషను పక్కగా ప్రహరీ గోడకి ప్లాస్టిక్ షీట్ కట్టి దానికిందే ఏడాది గడిపారు. పోలమ్మ కూరలమ్మడం మొదలెట్టేక రోజూ ఎంతో కొంత రాబడి వుంటూ వస్తోంది. దాంతో టౌనుకి దూరంగా సింహాచలం వెళ్ళే దారిలో, చాలా మంది కూలీలతో కలసి వో చిన్న పాక వేశారు. పోలమ్మకి ఆలోచన ఎక్కువ. అందుకే రెండు రోజులు ముసురుందని తెలిసి ఎక్కువ కూరలు తెచ్చింది. రోజూ సంపాదించే ముప్ఫయి నలభయి

రూపాయలకి బదులు అరవై డబ్భై రూపాయలు కిట్టొచ్చు. ఈ ముసురులో తనకి కూలి ఎలాగూ వుండదు. అది కూడా కూరలమ్మి కిట్టిద్దామని పోలమ్మ ఉద్దేశం. అసలు ఇన్ని కూరలు కొనటానికి పోలమ్మకి సొమ్ము ఎక్కడిదో! ఆ అనుమానం రాగానే...

"పోలీ కూరలకు సొమ్మెక్కడిదే" అనడిగాడు. "సింహాద్రప్పన్న ముడుపు వాడుకున్నా. మళ్ళీ సాయంకాలం కట్టేస్తాలే" అంది పోలమ్మ.

"దైవ సహాయం అంటే అదే గావాల్సు మన డబ్బు మన కిచ్చి సాయం సేస్తూండు. అప్పన్న రేపు కూరలు ఆళ్ళ సేత కొనిపించేసి సాయం సేస్తే బావుణ్ణు" అన్నాడు కొండడు.

"అప్పన్న సొమ్మేగా! కూరలు కొనిపించేస్తాడులే"! అంది పోలమ్మ నవ్వుతూ.

పొయ్యి తగ్గించింది. పొయ్యి తగ్గేసరికి, ఈదురు గాలికి చలి వేసింది పోలమ్మకి.

"ఏదీ సుట్టియ్యి" అంటూ కొండడి వేపు చెయ్యి చాచింది. సగం వరకూ కాలిన చుట్టని పోలమ్మ కిచ్చాడు కొండడు. చుట్టని నిప్పున్న వేపు నోట్లో పెట్టుకుంది పోలమ్మ.

"అడ్డపొగొద్దని ఆస్పత్రిలో పెద్ద కాగితం పెట్టారు సూడ్నేదేటే, కేన్సరో, బోన్సరో ఒస్తుందట!" అన్నాడు కొండడు చిరాగ్గా, చుట్ట పొగలోంచి కొండడ్ని విచిత్రంగా చూసి పొయ్యి మీంచి సిల్వరు గిన్నె దించింది పోలమ్మ.

* * *

తుఫాను గాలి మనిషిని నిలబడనివ్వడం లేదు. నెత్తి మీద తట్టని పెట్టుకుని నడవటం కష్టంగా వుంది. తట్టలోంచి చిన్న చిన్న నీటి బొట్లు ఒంటి మీద పడి ఒళ్ళంతా తడిసింది. ఒకసారి కాలనీ అంతా తిరిగింది. అందరూ ఖరీదు ఎక్కువ అన్నవాళ్ళే, కాని ఏరి ఏరి కొనేసుకున్నారు. రెండోసారి మళ్ళీ కాలనీకి మరో పక్కగా వెళ్ళింది. రెండోసారి తిరుగుతున్నప్పుడు కొనేవాళ్ళకి, బేరమాడే అవకాశం ఇచ్చింది. దాంతో మొదటిసారి కన్నా ఎక్కువగా అమ్ముడుపోయాయి. మూడోసారి తిరుగుతూ తెలిసిన వాళ్ళ గడప ఎక్కి, కూరలు కావాలా! అనడిగింది. అందులో గుమస్తా గడప కూడా వుంది.

"ఏమిటీ! అరటికాయ రెండు రూపాయిలా?" అంది గుమస్తా పెళ్ళాం.

"అవునమ్మా తుపానుకి మార్కెట్లో రేటు పెంచేశారు. మాదేముంది ఆడ కొంటాం వో పావలా యేసుకుని అమ్ముతాం. ఇలాంటి తుపాన్లో కూరలు తేవడమే కట్టం". అంది పోలమ్మ.

"ఎందుకూ! అంత ఖరీదు పెట్టి కొనడం? రెండు రోజులు ఫ్రిజ్‌లో వున్న వాటితో జరుగుబాటు చెయ్యి" అన్నాడు వెనగ్గా వచ్చిన గుమాస్తా.

"వొకళ్ళా, ఇద్దరా? ఎంతమందికని జరుగుబాటు చెయ్యడం? ఈ తుఫాను తగ్గి మీ బద్ధకం తీరి, బజారుకెళ్ళే సరికి చాలా రోజులవుతుంది. ఫ్రిజ్‌లో వున్నవి ఎందుకూ

చాలవు. ఏదో కూర తీసుకుంటే సరి. బజార్లో అయినా వొకటో, రెండో రూపాయలు తక్కువ వుంటుంది. ఎలాగూ గుమ్మంలోకి వచ్చాయి కదా'' అంటూ లోపలి కెళ్ళి నాలుగు అరటికాయలు తీసుకుంది గుమాస్తా పెళ్ళాం.

రూపాయి అరటికాయని రెండు రూపాయలకి కొన్నందుకు గుమాస్తాకి చిరాకేసింది. మాటిమాటికీ 'మీరు బద్ధకం' అని పెళ్ళాం అనేసరికి కోపం వచ్చింది. ఆ ముసురులో గొడుగేసుకుని, బజారుకి బయలుదేరాడు. బజార్లో కూరలు తక్కువగా వున్నాయి. కొనే వాళ్ళూ తక్కువగా వున్నారు. ఇంటి దగ్గర కొచ్చిన కూరల మనిషి చెప్పిన ధరకన్నా రూపాయి, రెండు తక్కువగా వున్నాయి.

కూరల సంచీతోనూ, బలంగా వీస్తున్న గాలికి ఎగిరిపోతున్న గొడుగుతోనూ, పడుతున్న వానతోనూ సమన్వయం కుదరక మూడొంతులు తడిసి, నాలుగు కూరలు పట్టుకొచ్చాడు గుమస్తా.

"బజార్లో కూడా కూరలు తక్కువ వున్నాయి. కాని కూరల్ది ఇచ్చిన ధర కన్నా తక్కువే. వంకాయలు కూరల్ది పది రూపాయలు చెప్పింది. బజార్లో ఎనిమిదికే ఇచ్చాడు'' అన్నాడు గుమాస్తా గర్వంగా, పొడి బట్టల్లోకి మారుతూ,

"వర్షంలో తడుస్తూ ఇంటింటికీ తిరిగి అమ్ముకునేది ఆమాత్రం రూపాయో, రెండో వేసుకోకుండా వుంటుందా?'' అంది అతడి పెళ్ళాం. అంతేగాని గుమస్తా తుఫానులో చేసిన సాహసాన్ని మాత్రం మెచ్చుకోలేదు.

తనని మెచ్చుకోకపోగా, కూరల్దాన్ని సమర్థించినందుకు గుమస్తాకి కోపం వచ్చింది.

'వీళ్ళకి అర్థం కాదు. బజార్లో ఎనిమిదికి వస్తున్న వస్తువుని పది పెట్టి ఇంటి దగ్గర కొనటం ఎందుకో?' అని సణుక్కున్నాడు.

సాయంకాలానికి గుమస్తాకి తుమ్ములు మొదలయ్యాయి. రాత్రి జ్వరం వచ్చింది. అర్ధరాత్రికి నిద్రలో పిల్లి కూతలు మొదలు పెట్టాడు. ఆమె జడసిపోయింది. పక్కింటి కెళ్ళి ఇంజనీరు గార్ని పిలిచింది. ఆయన వచ్చి ఎగవూపిరి వస్తున్న గుమాస్తాని చూసి "ఆస్మాటిక్ ఎటాక్ అంటూ తనింటి కెళ్ళి అక్కడ నుంచి అంబులెన్స్‌కి ఫోన్ చేశాడు. ఆస్పత్రి నుంచి అంబులెన్స్ వచ్చింది. తెల్లారేసరికి అతడు ఆస్పత్రిలోనే వున్నాడు.

డాక్టర్ల కృషి ఫలితంగా రెండు రోజుల్లో నెమ్మదించింది గుమాస్తాకి. అలా నెమ్మదించడం మొదలు మళ్ళీ పెళ్ళాన్ని సతాయించడం ప్రారంభించాడు. "మందులు, టెస్టులకయిన ఖర్చులు, డాక్టరు ఆస్పత్రికయిన ఖర్చంతా చూపించే బిల్లులు సిద్దం చేయి'' అంటూ పదే పదే హెచ్చరించడం మొదలుపెట్టాడు.

అతని భయం ఆ డబ్బు అనవసరంగా ఖర్చు చేశానని, తన ఆరోగ్యానికి బాధ్యత ప్రభుత్వానిదేనని అతని ఆలోచన. అంతే కాదు తనని, తన సీనియారిటీని గుర్తించి

ప్రమోషన్ ఇవ్వటం, ధరలు పెరిగితే దానివల్ల తనకి ఏ విధమైన కష్టమూ కలుగకుండా డి.ఎ. పెంచడం, తన వినోదం కోసం లీవ్ ట్రావెల్ కన్సెషన్ ఇవ్వడం, తన జబ్బుకయిన ఖర్చు అంతా భరించి తనని ఆరోగ్యవంతుణ్ణి చేయడం మొదలైన వాటిన్నింటికీ ప్రభుత్వమే బాధ్యురాలని అతని గట్టి నమ్మకం.

తుపాను తగ్గాక అతని కొలీగ్స్ కొందరు, బంధువులు కొందరు ప్రభుత్వాస్పత్రికి వచ్చి అతడిని చూశారు.

"ఏమిటోయ్! ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లో జాయినవ్వలేక పోయావా?'' అనడిగిన దానికి సమాధానంగా-

"అక్కడ రిఎంబర్స్‌మెంటు వుండదు, ఇక్కడ ఇచ్చిన బిల్స్ మాత్రమే చెల్లుతాయి'' అన్నాడు గుమస్తా.

వారం రోజులకి గుమస్తాకి నెమ్మదించింది. మర్నాడు డిశ్చార్జి అవుతాడనగా, మెడికల్ ఆఫీసర్ దగ్గర డిస్చార్జ్ సర్టిఫికెట్ తీసుకోవడానికి వెళ్ళింది అతడి పెళ్ళాం. సర్టిఫికేట్ తెచ్చుకుంటూ, రోగులున్న వార్డులోంచి నడుస్తుండగా తెలిసున్న మొహం కన్పించింది, ఎవరా? అని పరికించి చూసింది. బెడ్‌లకి పక్కగా కిందనే ఓ బెడ్ వేసి వుంది. దాని మీద ఎముకలకి చర్మం అంటించినట్టుగా, కళ్ళు లోతుకి పోయి, చింపిరి జుత్తుతో గోడకి దిండు పెట్టుకొని, దానికి అనుకుని కూర్చుంది కూరలమ్మే మనిషి పోలమ్మ.

"నీకేమయిందే?'' అనడిగింది ఆశ్చర్యంగా.

"వర్షంలో రెండు రోజులు తడుస్తూ, కూరలమ్మేనమ్మగారూ! నిమోనియా జ్వరమంట. పండబెట్టేసింది'' అంది పోలమ్మ నీరసంగా.

"ఇప్పుడెలా వుంది?'' అనడిగింది సానుభూతిగా ఆమె.

"తగ్గే సూచనలు ఏవీ కనపడటం లేదమ్మా... రాత్రయేసరికి వణుకూ, జొరం వచ్చేస్తున్నాయి.'' అంది పోలమ్మ దీనంగా.

ఆమెకు దాన్నెలా ఓదార్చాలో తెలియలేదు. అక్కడ్నించి కదిలి వెళ్ళిపోయింది.

పోలమ్మ ఆలోచనలు పూర్తిగా పారలేదు. కూరలన్నీ ఒకేరోజు అమ్ముడు పోలేదు. రెండో రోజు కూడా కాస్త ఎక్కువగా తిరిగి వర్షంలో తడుస్తూ కూరలన్నీ అమ్మేసింది. ఆ అలసట వల్ల వర్షంలో తడవడం వల్ల ఆ రాత్రికి జ్వరం వచ్చేసింది. రెండు రోజులూ తుపాను వల్ల కొండడు పనిలో కెళ్ళలేదు. చుట్టలు కాలుస్తూ పాకలోనే కూర్చున్నాడు. జ్వరం వచ్చిన్నాడు రాత్రి కషాయాలతో కాలం గడిపింది పోలమ్మ. కాని జ్వరం తగ్గిన సూచనలేవీ కనపడలేదు. మర్నాడు తెరిపిచ్చాక కొండడు మునిసిపల్ ఆస్పత్రికెళ్ళి మాత్రలు పట్టుకొచ్చి మింగించి, కూలికి పోయాడు.

సాయంకాలం కూలి నుంచి ఇంటికి తిరిగి వచ్చేసరికి, పోలమ్మ పక్కమీద ఎగ వూపిరితో అవస్థ పడుతోంది. పక్కలు ఎగిరెగిరి పడుతున్నాయి. ఏం చేయడానికీ తోచక అతి కష్టం మీద ఆస్పత్రికి తీసుకొచ్చాడు కొండడు.

పోలమ్మ ఆస్పత్రిలో జాయినయింది. డాక్టర్లు ఆమె జబ్బును 'న్యుమోనియా' అన్నారు. నాలుగు రోజులు ఆస్పత్రిలో వున్న తర్వాత పోలమ్మకి ఎగ వూపిరి తగ్గింది కాని జ్వరం తగ్గలేదు. రోజులు గడుస్తున్న కొద్దీ కొండడి రాకపోకలు తగ్గిపోయాయి. రోజూ సాయంకాలం వచ్చేవాడు. నాలుగురోజుల కొకసారి, వారం రోజుల కొకసారి వస్తున్నాడు. వచ్చినప్పుడు పోలమ్మ చేతిలో అయిదో పదో పెడ్తున్నాడు. పోలమ్మకి నెమ్మదించే సరికి, ఆలోచనలు బతుకు మీదకి పోయాయి. రేపేమిటి? అని ఆలోచిస్తోంది. కొండడు పాకలోకి ఎవర్తినేనా తెచ్చి పెట్టాడా? తన గతి ఏమిటి? తను సంపాదిస్తోంది అంటేనే కొండడికి తనంటే ఇష్టం వుంటుంది. ఈ జబ్బు తర్వాత తనకి ఇంటింటికీ తిరిగి కూరలమ్మే సత్తువుంటుందా? ఇంతకు ముందు ఎన్ని సార్లు వర్షంలో తడవలేదు తను? మరిప్పుడు ఆస్పత్రి పాలయ్యింది. తన ఆరోగ్యం పాడయింది. తనకి వయసు అయిపోయిందా?

ఆకలంటే భయం లేదు. ఆకలికి అంతకు ముందూ భయపడలేదు. ఇప్పుడూ భయం లేదు. ఒంట్లో సత్తువ వున్నన్నాళ్ళూ ఏ ఇంట్లో అయినా పాచి పని చేసుకు బతికేస్తుంది. నాలుగేళ్ళుగా ఒడ్డున పడ్డ జీవితం మళ్ళీ పొందిక లేకుండా పోతుందా? తను కొండడితో కష్టపడి కట్టుకున్న పాక, తన ప్రయత్నం నిష్ఫలమైపోతుందా? తను అటు సంతలోనూ, ఇటు కాలనీలో కూరలమ్మి సంపాదిస్తుందే? కొండడికి తనంటే ఇష్టం వుండదా? బతుకులో పొంచి వున్న అపాయానికి పోలమ్మ భయపడుతోంది. ఈ అపాయంలో ఆదుకుని పూచీ పడేవాళ్ళెవరు? ఈ జీవితానికి పూచీ పడే వాళ్ళెవరు? అందుకే భయం. ఆకలికి, దరిద్రానికి భయం లేదు. దేవుడిచ్చిన రెక్కలు ఆడుతున్నన్నాళ్ళూ వీటికి భయం లేదు. కాని భయమల్లా కొండడికి కూడా సరిపోయేటట్టు సంపాదించగలనా? లేదా? అనే. అదీ భయం. రెక్కల్లో, ఒంట్లో సత్తువణిగి, రెక్కలు చచ్చుబడిపోతే అప్పుడేమిటి? ఎవరు పూచీ వహిస్తారు? అదీ భయం!

ఆస్పత్రి సిబ్బంది "రొట్టె... రొట్టె.." అంటూ అరుస్తూ ప్రతి బెడ్ దగ్గరకూ వచ్చి పంచుతున్నారు. కానీ పోలమ్మకి ఏమీ వినపడటం లేదు.

*బతుకు భయం* *(ఆంధ్రజ్యోతి, 26 ఫిబ్రవరి 1999)*

# బురద బ్రాండ్ మసాలా!

నాకు నా క్రింది క్వార్టరులో ఉంటున్న రాజుగారికి దోస్తీ లేదు. అలాగని శత్రువులమూ కాదు. ఇద్దరిదీ ఒకే డిపార్టుమెంటు. ఇద్దరం అటూ ఇటూగా ఒకేసారి ఉద్యోగంలో చేరేం. ఇద్దరిలోనూ ఒకే ప్రోబ్లెం ఉంది. నేను వాడ్ని వెర్రివెధవ క్రింద జమకడతాను. వాడు కూడా నన్ను వెర్రివెధవ క్రింద జమకడతాడేమో తెలీదు. అది వాడికే తెలియాలి. కాని ఇద్దరం ఎదురెదురుగా ఉన్నప్పుడు గొప్ప మర్యాదస్తుల్లా మాట్లాడుకుంటాం! అది పెరిగిన పట్నం నాగరికతకి నమూనా! అయితే అవకాశం దొరికినప్పుడల్లా ఒకడ్ని ఇంకొకడు మాటల్తో మండీకొట్టడం (కాళ్ళల్లో కాలుపెట్టి పడగొట్టడం) అలవాటు. కాని వెధవ చదువు సంస్కారం అడ్డొచ్చి, చురుకుదనంతో వెనకనుంచి దెబ్బతీయడమే కాని, ఎదురుపడి కొట్టుకుచచ్చి, మనసులో కుళ్ళు, వెళ్ళగక్కుకునే కుసంస్కారం లేదు.

మా ఇంట్లో ఒక పనికుర్రాడు ఉండేవాడు. వాడు నా దగ్గర చిన్నప్పటినుండీ పని చేస్తుండేవాడు. వాడికి అవసరం అయినంత జీతం ఇవ్వలేను కద. నాలుగేళ్ళుగా పనిచేస్తున్న కుర్రాడి తండ్రికి మిగతా వాళ్ళు ఏం చెప్పారో ఏమో! తెలీదు గాని, వాడు ఇప్పుడిస్తున్న జీతం సరిపోవడం లేదని, ఏదైనా చిన్న ఉద్యోగం తన కొడుక్కి చూసిపెట్టమని, రోజూ నాతో పోరడం మొదలుపెట్టాడు. నాకూ అది కొంతవరకూ సబబు అనిపించింది. వాడికి మా కాలేజీ హాస్టలు మెస్‌లో సప్లయర్ ఉద్యోగం చూసిపెట్టి పొమ్మన్నాను. అది మా ఆవిడకి ఇష్టం లేదు. వాడడిగిన జీతం ఇవ్వడం నాకు ఇష్టం లేదు. ఆ సంఘటన విలువ అక్కడితో అయిపోయి ఉంటే ఈ కథే ఉండకపోను. కాని అలా జరగలేదు. వాడిని పనిలోంచి తీసేసినందుకు, చాల బాధపడ్డ మా ఆవిడ, లేడీస్ క్లబ్బు మీటింగ్‌లోనూ, పిట్టగోడల సమావేశంలోనూ, తన బాధంతా వెళ్ళబోసుకుంది. ఆడాళ్ళందరూ సానుభూతి చూపి మంచి పనిమనిషిని చూపెడతామని ప్రతిజ్ఞ చేశారు. వాళ్ళ సానుభూతి అలాగుంటే, ఒక రోజు మా కొలీగు ఒకతను “మీ ఇంట్లో పని అబ్బాయిని మానిపించేసేవట కదోయ్, మంచి పని చేసావ్, మంచి ముందాలోచనే” అన్నాడు.

“ఇందులో ముందాలోచన ఏముంది?” అన్నాను.

“ఇంట్లో ఎదిగొస్తున్న పిల్ల ఉంది కదా! ఈ రోజుల్లో టి.వి.లూ, సినిమాలు అన్నీ పాడే, అదీ ముందాలోచన అంటే” అన్నాడు కొలీగ్.

“నాకేం అర్థం కాలేదు పూర్తిగా చెప్పు” అన్నాను నేను ఆశ్చర్యంగా.

“రాజుగారు చెప్పార్లే, నిన్ను మెచ్చుకున్నారు కూడానూ, మీ అమ్మాయి ఎదిగి వస్తోంది. ముందు ముందు అవాంఛనీయమైన సంఘటన ఏదీ జరగకుండా ఉండాలని,

మీ ఇంటిలో పని అబ్బాయిని మానిపించేసేవట కదా" అన్నాడు ముసిముసిగా నవ్వుతూ కొలీగ్.

కొలీగ్ ముసిముసి నవ్వులు ఎలా ఉన్నా, రాజుగారి ప్రచారం మాత్రం, దారుణంగా ఉంది. అయినా ఇలాంటి ఆలోచన నాకు గాని, మా ఆవిడకి గాని రాకపోడం, చాల ఆశ్చర్యం కలిగించింది. మా అమ్మాయి ఎదిగి వస్తున్న మాట నిజమేగాని, దానికి తెలుగు సినీమా హీరోయిన్ బుద్దులు రాలేదు. మా ఇంట్లో పని అబ్బాయిని పని అబ్బాయిగానే చూసేది గాని హీరోగా చూసేది కాదు. ఇదంతా మా ఆవిడ పిట్టగోడ దగ్గర గోడుకి అస్తవ్యస్తపు అర్థాలు తీసారన్నమాట! దానిని రాజుగారు ఈ విధంగా ప్రచారం చేస్తున్నాడన్నమాట. రాజు గారంటే కసి పెరిగిపోయింది.

రాజుగారిని, వాళ్ళింటి వాతావరణాన్ని బాగా అబ్జర్వ్ చేసాను. రాజుగారి అమ్మాయి మా అమ్మాయి ఈడుదే. మంచిది కూడా! ఆ అమ్మాయి కన్నా చిన్నదే పనిపిల్ల, వాళ్ళింట్లో పనిచేస్తుంది. ఆ విషయంలో రాజుగారు మార్కులు కొట్టేసారు. నేను టిట్ ఫర్ టేట్ అన్నట్టు, ఏ కాంట్రవర్సీ రేగేటట్టు చూడలేను, మరి ఏం చేయాలీ? అని తెగ ఆలోచించాను. మానవుడి బ్రెయిన్ చాల విచిత్రమైంది. సమస్యలూ అందులోనే ఉన్నాయి. సమాధానాలూ అందులోనే ఉన్నాయి. ఆ విధంగా పెద్ద కష్టం లేకుండా సమాధానం దొరికింది. రాజు గారింటిలో పనిచేసే పనిపిల్ల తండ్రి, మా కాలేజీలోనే ఇంకో డిపార్టుమెంటులో ప్యూనుగా చేస్తున్నాడు. ఒకసారి వాడ్ని పిలిపించాను. వాడు వచ్చాడు.

"మీ అమ్మాయేనా రాజుగారింట్లో పనిచేస్తోంది?" అని అడిగాను.

"అవును బాబూ" అన్నాడు వాడు.

"చాలమంచి అమ్మాయి. ఎదిగివస్తోంది కదా, ఇంకా ఎన్నాళ్ళు పనీపాటలు చేయిస్తావు. పెళ్ళాలోచనేం లేదా?" అని అడిగాను.

వాడి అమ్మాయి ఎదిగి వస్తోందని నేననడం వాడికి నచ్చలేదు. ఆఫ్‌కోర్స్ ఏ తండ్రికీ నచ్చదు లెండి.

వాడి మొహంలో జరుగుతున్న మార్పులు గమనిస్తూ "ఎందుకేనా మంచిదని చెప్పాను. అందులోనూ మా రాజుగారు మంచి సరసుడు, క్రింది క్వార్టరేగా! గమనిస్తూ వుంటాను. సరెలే నువ్వెళ్ళు" అన్నాను.

వాడు వెళ్ళిపోయాడు. నేను ప్యూను బుర్రలో ప్రవేశపెట్టిన ఆవగింజంత అనుమానం, పెనుభూతమై వాడి బుర్ర తినేయడానికి ఎక్కువకాలం పట్టలేదు.

నెలరోజుల తర్వాత రాజుగారింట్లో పనిపిల్ల పని మానేసింది. ఆ విషయం వాళ్ళావిడ, శోకవదనంతో చెపుతుండగా, విని ఆనందించిన వాళ్ళల్లో నేను కూడా ఉన్నాను.

ఈ విషయం కాలనీలోని ఆడవాళ్ళూ, ఆఫీసులో మగవాళ్ళూ గుసగుసలుగా చెప్పుకోడానికి, కావలసిన "మసాలా" అందించినందుకు గర్వించాను కూడా!

*బురద బ్రాండ్ మసాలా* *(సాహిత్యలహరి : కథాలహరి)*

# ఇదీ ఓక తెలివే.....

రావుగారి కూతురి పెళ్ళిచూపులు. చాలా ఆర్భాటంగా ఏర్పాటు చేశారు. ఒక్కర్తే కూతురు. ఆయన ఏం చేసినా, ఘనంగా చేస్తారు అన్నదానికి నిదర్శనం ఈ పెళ్ళిచూపులు.

రావుగారి కూతురు పావని చదువుకుంది. తెలివైంది. ఆమెకి అందమూ, దానికి తగ్గ ఆకారమూ అన్నీ ఉన్నాయి. అందుకే రావుగారికి తన కూతురుకి పెళ్ళి కాదనే బెంగ లేదు. ఆయన బెంగల్లా సరైన సంబంధం రాదేమోనని!

పావనికి మంచి సంబంధం చూసి చేద్దామనే తపన వల్ల చెవిలో పడ్డ అల్లాటప్పా సంబంధాలన్నీ ఆయన కొట్టిపారేశారు. ఈ వెతుకులాటలో ఆయనకి నచ్చిన సంబంధం ఆయన భార్యకి నచ్చక, ఆయన భార్యకి నచ్చిన సంబంధం కూతురికి నచ్చక, రెండు మూడు సంబంధాలు పెద్ద ప్రోగ్రెస్ అవకుండానే తెగిపోయాయి. ఆ వరుస క్రమంలోదే ఈ సంబంధం. పెళ్ళి చూపుల ముందు స్క్రూటినీలో పెళ్ళికొడుకు, అతని రిలేటెడ్ ఇన్‌ఫర్మేషనూ రావుగారికీ, వారి భార్యకీ, పెళ్ళికూతురికీ అన్ని విధలా నచ్చాయి. అలాగే పెళ్ళి కూతురి తాలూకా ఇన్‌ఫర్మేషన్ పెళ్ళి కొడుకు తరపు వాళ్ళకి నచ్చింది.

పెళ్ళిచూపులు చాలా ఘనంగా, ఆహ్లాదరకమైన వాతావరణంలో జరిగాయి. పెళ్ళికొడుకు వారి బంధువర్గం రావుగారితో బంధుత్వం కలిపేశారు. పెళ్ళిచూపులకి పెళ్ళికొడుకు సంబంధీకులందరూ వచ్చారు. పెళ్ళికొడుకు రావుగారిని "మావయ్యగారూ!" అంటూ పిలిచాడు. పెళ్ళికొడుకు తల్లి రావుగార్ని "అన్నయ్యగారూ!" అంటూ అభిమానం చూపింది. పెళ్ళికొడుకు తండ్రి "బావగారు పెళ్ళిచూపులు చాలా ఆర్భాటంగా ఏర్పాటు చేశారు!" అంటూ మెచ్చుకున్నారు. పెళ్ళికొడుకు వదిన గారు "చెల్లమ్మా!" అంటూ పావనిని ఉక్కిరిబిక్కిరి చేసేసింది. దాంతో రావుగారూ, వారి భార్యా, కొంచెంగా వారి కూతురూ మురిసిపోయారు. అభిమానాలకీ, ఆనందమయ జీవితానికీ ఇది నాందీప్రస్తావన అని అభిప్రాయపడ్డారు.

పెళ్ళి చూపులు పెళ్ళిచూపుల్లా టెన్షన్‌తో జరుగలేదు. ఫామిలీ గెట్ టుగెదర్ లా జరిగాయి.

పెళ్ళి చూపులు జరిగిన నాలుగు రోజులకి పెళ్ళికొడుకు అన్నగారూ, పెళ్ళికొడుకు వదినగారూ రావుగారింటికి వచ్చారు. "మా ఫామిలీ అంతా సినిమాకి వెళ్తున్నామండీ. పావనిని తీసుకెళ్దామనుకుంటున్నాం. ప్లీజ్... పంపించడి!" అన్నారు.

రావుగారు సందిగ్ధంలో పడ్డారు. పెళ్ళిచూపులు అయ్యాయి. ఉభయులకి ఒకరంటే ఒకరు నచ్చారు. నిజమే కానీ, పెళ్ళి జరిగే రీతి రివాజు, కట్నకానుకలు మాట్లాడుకుని నిశ్చయతాంబూలాలు పుచ్చుకోకుండా పావనిని వాళ్ళతో పంపడానికి రావుగారికి

మనస్కరించలేదు.

కానీ రావుగారి మౌనాన్ని పెళ్ళికొడుకు వదినె అర్థం చేసుకుంది."ఫర్వాలేదు, బాబాయిగారూ! మేమంతా ఉంటాంగా, మా అత్తగారూ, మామగారూ మాతోనే ఉంటారు. మీరేం సందేహాలూ పెట్టుకోకుండా పంపండి!'' అంటూ బతిమాలింది.

వాళ్ళంత బతిమాలుతుంటే పంపకపోవడం బావుండదేమో అన్న అనుమానం వచ్చింది. అయినా ఈ కాలంలో పిల్లలు ఎవరికీ చెప్పకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తున్న తీరు ఆయనకు తెలుసు. పావని అలాంటిది కాదు కాబట్టే సరిపోయింది. పెద్దవాళ్లు కూడా ఈ కుర్రకారుతో సినిమాకి వెళ్తున్నారులే! అన్న తర్జనభర్జనతో కొంత ఊరట చెంది, పావనిని సినిమాకి వెళ్లమని చెప్పాడు రావుగారు.

పావని హుషారుగా తయారైంది. పెళ్ళికొడుకు అన్నా, వదినలతో సినిమాకి వెళ్ళిపోయింది.

సినిమాకైతే పంపించారు గానీ రావుగారి మనసు మనసులో లేదు. ఎందుకు పంపానా? అని బాధపడ్డారు. కానీ పావని వెళ్ళిపోయాక ఏమీ చెయ్యలేరు గనుక రాత్రి పదిగంటలవరకూ కలవరపడ్డారు.

రాత్రి పది గంటలకి హుషారుగా ఇంటికి వచ్చిన పావనిని చూశాక రావుగారి మనసు నెమ్మదించింది. కానీ లోపల ఎక్కడో ఏదో శంక దోబూచులాడుతోంది. పెద్దవాళ్ళు తోడుగా ఉన్నా హాస్యాల నెపంతో ఇద్దరినీ సన్నిహితం చేయడానికి ప్రయత్నించారేమో ననే అనుమానంతో పావనిని పిలిపించారు. పావని డ్రెస్ మార్చుకుని వచ్చింది.

"అమ్మా.... సినిమా ఎలా ఉంది?'' అని అడిగారు.

"బావుంది, నాన్నా!'' అంది పావని.

రావుగారు సినిమాతో మొదలుపెట్టి పావనిని అనేకమైన ప్రశ్నలు తరచి తరచి వేశారు. పావని ఓపిగ్గా సమాధానాలన్నీ చెప్పింది. పావని చెప్పిన సమాధానాల్నిబట్టి రావుగారికి అర్థం అయిందేమిటంటే, పావనిని పెళ్ళికొడుకు తల్లీ, వదినగారూ తమతోనే తిప్పుకున్నారు. పెళ్ళికొడుకుతో ఏకాంతాన్ని కలుగనివ్వలేదు. పెళ్ళికొడుకు కూడా పావనితో లేనిపోని చనువు తీసుకోలేదు. అంతకుమించి పెళ్ళికొడుకు తండ్రి సినిమాలో కనపడ్డ పరిచయస్తులందరికీ పావనిని తమ రెండో కోడలుగా పరిచయం చేశాడు.

ఇవన్నీ విన్నాక పెళ్ళికొడుకు తల్లిదండ్రులమీద, వాళ్ళ సంస్కారంమీద గొప్ప నమ్మకం ఏర్పడింది రావుగారికి అందుకే ఏదో పేరంటం ఉంది, సరదాగా మాతో కలిసి ఉంటుంది, అని పావనిని పిలిచినా, ఫామిలీ అంతా పిక్నిక్ వెళ్తున్నాం అని పావనిని తీసుకెళ్ళినా రావుగారు దేనికి అభ్యంతరం చెప్పలేదు.

"పావనికి పెళ్ళి కుదిరింది కదటోయ్!'' అని రావుగారి స్నేహితులు రావుగారిని, "పావని పెళ్ళి కుదిరిందా?'' అని రావుగారి భార్య పరిచయస్తులు, బంధువులు రావుగారి

భార్యని అడిగితే రావు దంపతులు పావనికి పెళ్ళి చేసేసినంత సంబరపడిపోయారు.

నిశ్చితార్థం చేసుకోవడానికి శూన్యమాసం అడ్డు వచ్చినా, పెళ్ళికొడుకు కుటుంబంతో కలిసిమెలిసి తిరగడానికి సామాన్యమాసంగానే అనిపించింది రావుగారికి.

శూన్యమాసం వెళ్ళిపోయింది. రావుగారి మనసు నెమ్మదించింది. నిశ్చితార్థం చేసుకుని, పెళ్ళికి తయారవడమే తరువాయి అన్న ఆలోచనతో ఓ రోజు పెళ్ళికొడుకు తండ్రి దగ్గరకు వెళ్ళారు.

పెళ్ళికొడుకు తండ్రి రావుగారిని సాదరంగా ఆహ్వానించాడు. మళ్లీ ఇంటిల్లిపాదీ సమావేశమయ్యారు. పావనిని తెగపొగిడారు. అమ్మాయిని మంచి క్రమశిక్షణలో పెంచినందుకు రావుగారిని ప్రశంసించారు. అన్ని మాటలు అయి ఇచ్చు పుచ్చుకునే విషయంలోకి వచ్చారు.

రావుగారికి చాలా ఆనందంగా ఉంది. వాళ్లు చాలా మంచివాళ్ళు, పావని అదృష్టవంతురాలు. పెళ్ళికొడుకు తరుపువారు ఏమడిగినా అమలు జరిపించాలనుంది రావుగారికి, ఆ సమయంలోనే పెళ్ళికొడుకు తండ్రి "ఏముందండీ.... మాకేం పెద్ద ఆశలు లేవు. అబ్బాయిని ప్రైవేటుగా మెడిసిన్ చదివించాం, దాని ఖర్చులు పది లక్షలు దాకా అయ్యాయి, అవి ఇప్పించేయండి!'' అన్నాడు.

ఆ మాటలు రావుగారికి అర్థం అయ్యేలోగా, పెళ్ళికొడుకు తల్లి "బావుంది, మీ కొడుకు మీద ఖర్చు పెట్టింది, మీరు వసూలు చేసుకుంటున్నారు. మరి ఇన్నాళ్లూ వాడ్ని అభిమానంగా సాకినందుకు నాకేమిస్తారూ! చూడండి. అన్నయ్యగారూ! ఈ రోజుల్లో అభిమానాలకి అంత విలువ లేదు గానీ, ఓ లక్షయినా అత్తగారి లాంఛనాలకింద ఇవ్వాలి'' అంటూ వగలుపోయింది.

"తమ్ముడు పెళ్ళి తర్వాత ఈ ఇంట్లో మనది పెద్ద శుభకార్యం అని ఏం జరుగుతుంది చెప్పండి మావయ్యగారూ? ఆడబడుచుకట్నంగా'' నాకు యాభై వేలైనా ఉండాలి'' గారాలుపోయింది పెళ్ళికొడుకు అక్కగారు.

దానికి పెళ్ళికొడుకు తండ్రి "అలాగేనమ్మా రావుగారు ఇవ్వనన్నారా ఏమిటి, ఆయనకి మాత్రం కూతురి పెళ్ళి ఘనంగా చెయ్యాలని ఉండదూ!'' అంటూ రావుగారి తరపున వకాల్తా పుచ్చుకున్నాడు.

రావుగారు వీళ్ల కోరికలు విని, ముందుగా వీళ్ళంతా హాస్యాలు ఆడతున్నారను కున్నారు. కొంచెం సేపటికి అవి హాస్యాలు కాదని తెలిసింది.

పది లక్షలు ఒక్కసారిగా ఆయన జీవితంలో ఎప్పుడూ చూడలేదు. రిటైర్ అవగా వచ్చిన ప్రావిడెంట్ ఫండ్‌తో ఇల్లు కట్టుకున్నాడు. ఇన్సూరెన్స్‌లూ అవీ కలిపి ఓ రెండు లక్షలు బ్యాంకులో వేశారు. దాంతో పావని పెళ్ళి అయిపోతుందనుకున్నారు. కానీ

మార్కెట్లో రేట్లు ఇంత తొందరగా పెరిగిపోతాయని, డబ్బు విలువ ఇంతలా పడిపోతుందనీ అనుకోలేదు.

పదకొండు లక్షలు వీళ్లకి ముట్టజెప్పి మరో లక్షపెట్టి పెళ్లి చెయ్యాలి? అన్న విషయం ఆయనకి ఎక్కడా కొరుకుడు పడలేదు. ఈ సంబంధం మనకి కలిసిరాదని ఆయన అనుకున్నారు.

"మీరు మరోసారి ఆలోచించుకోండి, నేను ఇంత ఇచ్చుకోలేను!" హీనస్వరంతో అని ఇంటికి వచ్చేశారు కానీ, ఈ విషయాన్ని పావనికి తెలియనివ్వలేదు.

"వాళ్లు అడినంత కట్నం మనం ఇచ్చుకోలేం"! అంటూ భార్యకి చెప్పారు.

కట్న కానుకల విషయం మాట్లాడుకున్న తర్వాత పెళ్లికొడుకు తరుపువారు ఎవరూ రావుగారింటివైపు తొంగి చూడలేదు. పావనిని తీసుకెళ్ళడానికి రాలేదు. రావుగారి ఆత్రుత పెరిగిపోతోంది. కట్న కానుకల విషయంలో వాళ్లు తగ్గకపోతారా! ఏదో విధంగా సర్దుకుపోతే బావుండును అనే ఆయన ఆలోచన ఆయన దగ్గరే పదిలంగా ఉంది. రోజులు మాత్రం దొర్లిపోయాయి. నెలరోజులైనా మగపెళ్లివారి దగ్గరనుండి కబురు రాకపోయేసరికి, మరొకసారి బతిమాలి ఏ విషయం తేల్చుకుందామని రావుగారు పెళ్లికొడుకు ఇంటికి వెళ్లారు.

మెట్ల దగ్గరే ఆయనకి లోపల మాటలు వినిపించాయి. అదీ తన పేరు ఆ మాటల్లో వినిపించేసరికి గుమ్మం దగ్గరే ఆగిపోయారు రావుగారు.

"రావుగారు గానీ వచ్చారా?" పెళ్లికొడుకు తండ్రి.

"లేదండీ"! పెళ్ళికొడుకు తల్లి.

"ఆయనే వస్తాడు! మన సంబంధం కాదని ఆయనెక్కడికి పోతాడు? పావని మన రెండో కోడలని ఊరందరికీ తెలుసు. మన ఇంట్లో, మనతో చనువుగా తిరిగిందని ఈ ఊళ్ళో ప్రతి పెళ్ళికొడుకు తండ్రికీ తెలుసు. ఇల్లు అమ్మేసి అయినా డబ్బు పట్టుకొస్తాడు!" అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

హాల్లో కూర్చున్న మిగతా సభ్యులు, మయసభ మడుగులో పడ్డ దుర్యోధనుడ్ని చూసినట్టు నవ్వారు.

రావుగారు ఇంక లోపలకి వెళ్ళలేదు. అక్కడనుండి ఇంటికి వచ్చేశారు.

పావనిని చూడటం, నచ్చిందని చెప్పడం, మా కోడలు అంటూ ప్రచారం చెయ్యడం, పావనిని తమతో తిప్పుకోవడం... అన్నీ పకడ్బందీగా, పెద్ద ప్లానింగ్‌తో చేసినట్టు అనిపించింది ఆయనకి, తనను, అమాయకంగా తన పరిస్థితిని ఇబ్బందుల్లో పెట్టుకున్నాడు. పావనిని ఇబ్బందుల్లో పెట్టాడు అన్న ఆలోచన రావుగారిలో అసహనాన్ని లేపింది కానీ, రావుగారు ఏం చేయలేక, నిస్సహాయంగా ఉండిపోయారు.

ఎవరి దగ్గరకైనా వెళ్ళి పావనికి సంబంధం చూడమంటే వాళ్లేమంటారు? ఆ ఊళ్ళో ప్రతి అణువుకి తెలుసు పావనికి పెళ్ళి కుదిరిందని, ఆమె పెళ్ళి కొడుకు కుటుంబంతో స్వేచ్ఛగా తిరిగిందని. పై ఊరునుండి పావనికి ఏ సంబంధం తీసుకొచ్చినా ఆ సంబంధం తాలూకా ఏ బీరకాయ పీచు చుట్టాలో ఈ ఊళ్ళో ఉండక మానరు. ఈ విషయం బయటకి రాక మానదు. ఇన్ని ఆలోచనలతో సతమతమవుతున్న రావుగారి మనస్సుకి పావని బంధువర్గం దృష్టిలో పవిత్రంగా లేదని, ఆమెకి పెళ్లి ప్రయత్నాలు చెయ్యడం కష్టం అని అర్థం అయింది. పది లక్షలు ఇచ్చి ఈ సంబంధం కుదర్చడం కష్టం.

ఇంతవరకూ జరిగిన ఈ నాటకాన్ని పావని మనస్సునుండి కానీ, తన మనస్సునుండి కానీ చెరిపెయ్యడం అంత తేలికైన పని కాదు. పెళ్లి చూపులతోనే కట్నకానుకల విషయం తేలిపోయి ఉంటే, అక్కడితో ఈ సంబంధం వదులుకుని ఇంకో సంబంధం వెదుక్కునేవాళ్ళు! ఇప్పుడు ఏం చెయ్యాలి? ఏం చెయ్యగలరు? అనేకమైన ప్రశ్నలతో మనస్తాపం చెందుతున్న రావుగారికి పావని మావయ్య గుర్తుకొచ్చాడు.

శంకరంగారు పావనికి స్వయానా మేనమామ అవుతారు. చాలా తెలివైనవాడని, లౌక్యుడని ప్రసిద్ధి. ఆయనకి రావుగారి దంపతులు చెప్పిందంతా అర్థం అయింది. అందుకే, మొత్తం విషయం అంతా విని, "ఇదీ ఒక తెలివే! ఈ రకం తెలివితేటలు ఈ మధ్య ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనికి ఏదో విరుగుడు చేయకపోతే వీళ్ల ప్రవర్తన పేట్రేగిపోవచ్చు. వీళ్ల సంఖ్య కూడా పెరిగిపోయి, పిల్లతరపు వాళ్లు ఇబ్బందులు పాలుకావచ్చు. పావని పెళ్ళి విషయం నేను చూసుకుంటాను గానీ, పెళ్ళికొడుకు తండ్రిని మరి కలవకు! ఒకవేళ పాత పెళ్ళికొడుకు తండ్రి మిమ్మల్ని కలిసినా, ఫోను చేసినా, మా శంకరం గారు ఈ విషయం చూసుకుంటున్నారు, ఆయనే వచ్చి మీతో ఏ విషయం వివరంగా మాట్లాడతారు!' అని చెప్పండి. ఆయన కఠినంగా ఏం మాట్లాడినా పెద్ద పట్టించుకోకండి!" అన్నారు.

శంకరం గారు పావని పెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టిన వారం రోజులకి పాత పెళ్ళికొడుకు తండ్రి రావుగారికి ఫోను చేశాడు. ఫోనులో రావుగారితో చాలా దార్పికంగా మాట్లాడుతూ, "మీకు సంబంధం నచ్చకపోతే, లేక ఇష్టం లేకపోతే తెగతెంపులు చేసుకుని పోవాలి గానీ, ఇలా తప్పుడు ప్రచారాలు చేయకండి!" అంటూ ఇంకా ఏదేదో మాట్లాడాడు. అతను మాట్లాడినవన్నీ రావుగారు మౌనంగానే విన్నారు. ఆఖర్న 'మా శంకరం బావగారు పావని పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. వారొచ్చి మీతో ఏ విషయం మాట్లాడుతారు లెండి"! అని ఫోను పెట్టేశారు.

పెళ్ళికొడుకు తండ్రి ఫోను చేసిన వైనం శంకరంగారికి చెప్పారు. "మీరేం దిగులు పడకండి. నే వెళ్ళి అన్ని విషయాలూ మాట్లాడతాను. ఈ ఆదివారం నాడు వెళ్లొద్దాం. మీరూ వస్తే మంచిది!" అని రావుగారిని శాంత పరిచారు.

అనుకున్న ఆదివారం కాస్తా వచ్చింది. శంకరంగారికి విషయం తెలియడం వల్ల ఆదివారం పొద్దున్నే పెళ్ళికొడుకింటికి రావుగారితో సహా వెళ్లాడు.

పెళ్ళికొడుకు ఇంట్లో అందరూ వీళ్లని చూసి మొహాలు గంటు పెట్టుకున్నారు. ఎవరూ సరిగ్గా పలకరించలేదు. ఆ విషయాన్ని శంకరం గారు గానీ, రావుగారు గానీ పట్టించుకోలేదు.

శంకరంగారు పెళ్ళికొడుకు తండ్రిని చూసి, "మీరు మొన్న మా బావగారితో ఏదో అన్నారట. దానికి మా బావగారు చాలా బాధపడుతున్నారు. విషయం ఏమిటో ఇప్పుడు చెప్పండి!'' అన్నారు సావధానంగా.

"ఏమిటి విషయం చెప్పేదీ? పెళ్ళికొడుక్కి మూర్ఛరోగం అని ప్రచారం చేస్తున్నారట, ఇవ్వలేకపోతే కట్నం ఇవ్వలేమని సంబంధం తెగ్గొట్టుకోండి. అంతేగానీ ఈ లేనిపోని అబద్ధపు ప్రచారాలు ఎందుకు?'' అంటూ పెళ్ళికొడుకు తండ్రి శంకరంగారి మీద విరుచుకుపడ్డాడు.

శంకరంగారు తాపీగా సోఫాలో జారగిలబడి, "చూడండి, పెళ్ళిచూపులనాడే మీ మనసులో కోర్కెలు రావుగారికి చెప్పుంటే ఆ రోజుతో మీ రెవరో, మే మెవరమో అన్నట్టు విడిపోయి మేం వేరే ప్రయత్నాలు చేసుకునే వాళ్ళం. కానీ అలా జరుగలేదు. రావుగారు నన్ను పిలిచి మీరడిగిన కట్నకానుకల విషయం చెప్పి ఈ సంబంధం మనమింక చేయలేం. ఇంకో సంబంధం వెదికి పెట్టమని చెప్పారు. నేను సరే అన్నా ఇంకో సంబంధం వెదకపోయాను. ఎవరింటికెళ్లినా పావని... అదే... ఫలానా రావుగారి అమ్మాయికి సంబంధం కుదిరిపోయింది కదా, మళ్లీ ఈ ప్రయత్నాలేమిటి? అన్న ఆశ్చర్యమే గానీ, సరైన సమాధానం ఏదీ రాలేదు. ఒకళ్లిద్దరి దగ్గర వాళ్లడిగిన కట్నం మేం ఇచ్చుకోలేక పోయాం. అందుకే మరో సంబంధం వెదకుతున్నాం అని నేను చెప్పిన సమాధానం వాళ్లకి నచ్చలేదు. ఇన్నాళ్లూ వాళ్లింట్లో మనిషిలా, కోడలిలా చనువుగా తిరిగిన పావనిని, కట్నకానుకలు మాట్లాడుకోకుండా నిశ్చితార్థం చేసుకోకుండా రావుగారు స్వేచ్ఛగా వదిలేశారంటే, వినేవాళ్లకి అనుమానం కలిగించింది. అలాగని పది లక్షల కట్నం పుచ్చుకుని మీ దగ్గరకు వచ్చే స్థితిలో మేము లేము. ఈ పరిస్థితుల్లో పావనికి చెడ్డ పేరు రాకుండా, ఏదో చిన్న అబద్ధం చెప్పవలసి వచ్చింది. అందుకు మమ్మల్ని క్షమించండి!'' అన్నారు.

"మీరు అబద్ధాలు ప్రచారం చేసినట్టే మేము మీ అమ్మాయి మీద లేనిపోని అబద్ధాలు ప్రచారం చేస్తే?'' అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి కోపంగా.

"మేం మీ లోపం తెలుసుకుని సంబంధం వదులుకున్నామని, మీరు ఈ తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పుకుంటాం!'' అన్నారు శంకరంగారు నిశ్చింతగా.

పెళ్ళికొడుకు తండ్రికి ఏం చెయ్యాలో అర్థం కాలేదు. కానీ అక్కడే కూర్చుని సంభాషణ అంతా వింటున్న పెళ్ళికొడుకు తాపీగా.

"శంకరంగారూ! ఒక తప్పుకి, అంటే నాన్న చేసిన తప్పుకి సమాధానం ఇంకో తప్పు చెయ్యడమేనా?" అని అడిగాడు.

పెళ్ళికొడుకు అడిగిన ప్రశ్నకి లౌకికుడైన శంకరంగారు ఖంగు తిన్నాడు.

"నిజమే, బాబూ! కాదు, కానీ తప్పని పరిస్థితుల్లో నేను..... " అంటూ మిగతా మాటల్ని నమిలేశారు.

పెళ్ళికొడుకు రావుగారివైపు తిరిగి, "మావయ్యగారూ! పెళ్ళికి సిద్దం చేసుకోండి. మీ తాహతుకు తగ్గట్టే పెళ్లి చేయండి!" అన్నాడు.

రావుగారి నోటమ్మట మాట రాలేదు. పెళ్ళికొడుకు తండ్రి ఏదో చెప్పబోయాడు కానీ పెళ్ళికొడుకు"నాన్నా! జరిగిందేదో జరిగిపోయింది. ప్లీజ్... నా మాటకి ఎదురు చెప్పకండి!" అన్నాడు.

పెళ్ళికొడుకు తండ్రి మరి మాట్లాడలేదు. ఇంట్లో ఎవరూ మాట్లాడలేదు. కానీ శంకరంగారు లేచి, పెళ్ళికొడుకు దగ్గరకు వెళ్ళి, "బాబూ! ఈ కాలం పిల్లల దగ్గర పాతకాలపు లౌక్యం, తెలివితేటలూ ఎందుకూ పనికిరావు. సమస్య ఇంత తేలిగ్గా తేల్చేస్తావని నేను అనుకోలేదు. చిన్నవాడివైనా నే చేసిన తప్పుకి క్షమార్పణ కోరుతున్నాను. క్షమించు!" అన్నారు.

ఆ తర్వాత శంకరంగారూ, రావుగారూ ఇంటికి వచ్చేశారు.

శంకరంగారు ప్రయాణం అవుతూ, "బావగారూ! పావని పెళ్లి నాకు గుణపాఠం నేర్పింది. తప్పుకి తప్పు విరుగుడు కాదు. ఎంత నేర్చుకున్నా జీవితాంతం నేర్చుకోడానికి ఏదో మిగిలిపోతూనే ఉంటుంది!" అని రాని చిరునవ్వుని పెదవి మీదకి తెచ్చుకుని, పావనికి "బెస్ట్ ఆఫ్ లక్"! చెప్పి ఇంటి ముందు నిలబడ్డ ఆటో ఎక్కి వెళ్ళిపోయారు.

*ఇదీ౯ాక తెలివే* *(ఆంధ్రప్రభ, 15 మే 2000)*

# మార్పుకి మూలం...

ఏమని ఏడవనూ? కానీ, ఏడవాలి! తెల్లవారితే అందరికీ కబురు వెళ్ళిపోతుంది. బంధువులూ, స్నేహితులూ అందరూ వచ్చేస్తారు. వారేమైనా అనుకుంటారు. అందుకు ఏడవాలి. నాకైతే ఏడవడానికి కారణం కనపడటంలేదు. ఎదురుగా చచ్చిపడున్న మొగుడికీ, పదేళ్లకాలం బతికున్న మొగుడికీ పెద్ద తేడా లేదు. వాడు లేకపోతే బొట్టు పెట్టుకోనివ్వరేమో? పసుపు రాసుకోనివ్వరేమో? అంతకు మించి పెద్ద మార్పు నాకేం కనపడటంలేదు.

చచ్చిపడున్న వాడి తల్లి, నా అత్తగారు ఏడుస్తోంది. కానీ ఆవిడ ఎందుకు ఏడుస్తోందో నాకు తెలుసు. రోజూ కొడుకు తాగుడులోకి తెచ్చుకునే పకోడీలు దొంగతనంగా తీయడం కుదరదని ఏడుస్తోందేమో! లేకపోతే వాడు బతికుండగా తల్లికి ఒక చీర తెచ్చిన పాపాన పోలేదు. అభిమానంగా రెండు కబుర్లు చెప్పినట్టు చూడలేదు. అయినా ఏడుస్తోంది. ఎందుకు... కొడుకు కాబట్టి! పెద్దకొడుకు ఆమెని ఓదారుస్తున్నాడు. ధైర్యం చెబుతున్నాడు. నా మొగుడు తాగి, అడ్డమైన ముండలనూ మరిగి, గుండె జబ్బులూ - ముండ జబ్బులూ తెచ్చుకుని ఒళ్లు గుల్లచేసుకుని చస్తే.... దానికి నేనే కారణం అంటాడు బావగాడు.

ఆ చచ్చినవాడికి, బతికున్న అత్తగారికీ, మొసలి కన్నీళ్లు కారుస్తున్న బావగారికీ... వీళ్ళందరికీ వంతపాడే అక్కగారికీ నేనేనాడైనా మనిషిలా కనిపించానా?

నా కష్టాలన్నిటికీ నా అమాయకత్వం, అవిద్య కారణాలని అమ్మ, నాన్న నాకు సర్దిచెప్పేవారు కానీ, నా బాధలన్నింటికీ ఈ ఇంట్లో ఉండే మనుషుల రాక్షస ప్రవృత్తే కారణం అని నాకు కాలక్రమేణా అర్థం అయింది.

పెళ్లయిన దగ్గర్నుంచీ సుఖం అన్న రుచి తప్ప జీవితంలో అన్ని రుచులూ, వాసనలూ చూపించిన గొప్ప కుటుంబం ఇది. ఈ చచ్చిపడున్న మొగుడు సుఖాన్నిచ్చే మనిషికాదు కదా, అలాంటి యంత్రం కూడా కాదు.

తాగి మత్తెక్కగానే వీడికి పెళ్ళాం అవసరం వస్తుంది. మీదపడ్డ వాడి నోటిలోంచి వచ్చే తాగుడు వాసనకి వాడికి మైకం, నాకు కంపు కొట్టేవి. అది భరించలేక ముఖం పక్కకి తిప్పితే బుగ్గని నంజేసుకునే రాక్షసుడు. అలాంటివాడు ఇప్పుడు శవంగా పడి ఉన్నాడు. కాకపోతే ఒకటే తేడా! తన పని అయిపోగానే పక్కకి తిరిగి పడకుని పెట్టే విజయ దుందుభి లాంటి గుర్రు ప్రస్తుతం వినపడటం లేదు.

రాత్రి మొగుడి సుఖం ఇలా ఏడిస్తే, పగలు అత్తగారు ఇంట్లో తిట్టే తిట్లకి, కాలిన మనసు కమిలిపోయేది. ఈ కమిలిన మనస్సుని, మొగుడి నంజుళ్ళతో కుళ్ళిన రొమ్ముల్ని చూసి చొంగకార్చే బానవారు ఒక జాతి చండాలుడు. నా వెనకే తిరిగి నేను పెట్టినవి తిని, నామీద చాడీలు చెప్పే వాడికొడుకు, ఆ కుర్ర వెధవ బుర్ర కుళ్ళుపర్ర.

చచ్చినవాడు స్మశానానికి వెళ్ళి, బూడిదై రెండు రోజులైనా కాలేదు, ఇంట్లో గుసగుసలు మొదలయ్యాయి. ఆ గుసగుసల మూలార్థం ఏమిటంటే నాకు ఎలాగూ పిల్లలు లేరు కాబట్టి నేను బావగారి కొడుకుని పెంచుకుంటే, మా ఆయన ఉద్యోగం వాడికి ఇస్తారు. ఇది మా బావగారికి వచ్చిన దూ(దు)రాలోచన, ఆయన దూరాలోచనల్లో నా బతుకు చితిమంటల్లో కాలుతున్న భోగి పిడకలా కనిపించింది.

ఇప్పుడు ఈ కుర్రవెధవకి ఉద్యోగం వస్తే, ఉత్తరోత్రా నేను బావగారి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడక తప్పదు. పగలల్లా ఇంట్లో చాకిరీ చేసి, వాళ్ళు పడేసిన ముద్ద తిని ఆ గుంటడ్ని చూసి కొడుకని మురిసిపోవాలి కాబోలు. ఉద్యోగంలో వాడు స్థిరపడిన కొన్నాళ్ళకి నా ఒంటిమీద తేలేవాతలూ, తలమీద పడే మొట్టికాయలూ భరించలేక పిచ్చికుక్కలా రోడ్డున పడితే, తిండి మిగిలిందని పెద్దలూ, ఉద్యోగం సంపాదించి పెట్టిన పెంపుడు తల్లి రుణం తీరిపోయిందని గుంటడూ ఆనందిస్తారు. కానీ ఏం చేయను? అంతా వాళ్ళు అనుకున్నట్టే జరుగుతోంది. నిస్సహాయంగా చూడటం తప్పించి ఏమీ చేయలేకపోయాను.

"అమ్మా! వెంకటిగాడ్ని తమ్ముడు పెంచుకున్నట్టు, వాడి పెంపుడు తండ్రి చనిపోయాడు కాబట్టి కంపెనీలో తగు ఉద్యోగం పెంపుడు కొడుక్కి ఇవ్వవలసిందిగా దరఖాస్తు పెట్టాను!'' అన్నారు బావగారు నా వైపు చూస్తూ.

"దానికి కంపెనీ వాళ్ళు ఒప్పుకున్నార్రా?'' అత్తగారి అనుమానం.

"వాళ్ళు ఒప్పుకునేదీ, లేనిదీ మరదలు మీద ఆధారపడి ఉంది. వాడే నాకు దిక్కని, వాడ్ని మా ఆయనా, నేనూ పెంచుకున్నాం అని మరదలు చెప్తే పని సవ్యంగా జరిగిపోతుంది!'' అన్నారు బావగారు నావైపు అదోలా చూస్తూ.

"అదెందుకు చెప్పదూ! అయినా నీ ఏర్పాట్లు నువ్వు చెయ్యి!'' అంటూ నా తరపున అత్తగారు హామీ ఇచ్చేసింది.

"ఆ ఏర్పాట్లన్నీ చేశానమ్మా. మేనేజర్‌కి... వాడికి ఇవ్వవలసిన రొక్కం వాడికి ముట్టచెప్పాను. దాన్ని మేనేజరు దగ్గరికి తీసుకెళ్ళినప్పుడు అతనడిగిన ప్రశ్నలన్నింటికీ 'ఊఁ' కొడితే చాలు!''

"ఎందుకు 'ఊఁ' కొట్టదురా! దానికి మాత్రం ఎవరున్నారూ, ఎక్కడికి పోతుందీ? జీవితాంతం ఇక్కడే మనందరితో ఉండాలా! నా చిన్నకొడుకా నన్ను మోసం చేసి తన దారి తను చూసుకున్నాడు. ఇది అలా చేయదురా!'' అంది అత్తగారు ధీమాగా. అత్తగారి మాటల్లో బెదిరింపు తెలుస్తూనే ఉంది.

వీళ్ళకి నా మంచితనం కావాలి. దాన్ని వాళ్ళు బెదిరించైనా తీసుకోగలరు. వీళ్ల దగ్గర డబ్బు తిన్న మేనేజరు, నా గోడు వింటాడా? నా బాధ అర్థం చేసుకుంటాడా? ఈ

జీవితానికి రోడ్లమీద అడుక్కోవడం, చెత్తకుప్పల మీద ఏరుకోవడం రాసిపెట్టి ఉంటే ఆ దేవుడు మాత్రం ఏం చేయగలడు?

నా ఆలోచనల ఊబిలో నేను ఉండగా, రావలసిన రోజు వచ్చింది. నన్నూ వెంకటిగాడ్ని మేనేజరు దగ్గరికి తీసుకెళ్లారు. నేను వెళ్లేముందు అత్తగారు కరాఖండిగా చెప్పేసింది.

"మీ వాళ్లు ఇచ్చిన కట్నకానుకలేమీ విరగబడి పోవటలేదు. ఈ ఇంట్లో నీకు ఇంత ముద్ద తినాలన్న ఆశ ఉంటే, పెద్దవాడు చెప్పినట్లు చెయ్యి! అంతేగానీ కల్లబొల్లి ఏడుపులకి పోకు! తెలిసిందా?'' అంటూ హెచ్చరించింది.

మేం ముగ్గురం ఆఫీసుకి వెళ్లి ఓ మూల కూర్చున్నాం. మేం వెళ్లిన గంటకి మేనేజరు మమ్మల్ని రమ్మనమని పిలిచాడు. ముగ్గురం ఆయన గదిలోకి వెళ్లాం "నువ్వెందుకూ?'' అంటూ బావగార్ని బయటకు పంపేశాడు మేనేజరు.

బావగారు బయటకు వెళ్లిపోయాక మేనేజరు నావైపు తిరిగి, "ఏం అమ్మా! మీ ఆయన సర్వీసులో పోయినందుకు ఈ కంపెనీ రూల్స్ అనుసరించి మీ ఇంట్లో ఎవరికైనా... అంటే సర్వీసు చేస్తున్నవాడి భార్యకో, కొడుక్కో, కూతురికో ఉద్యోగం ఇస్తాం. నీకు చదువెలాగూ లేదు. ఉద్యోగం చెయ్యలేనని దరఖాస్తులో రాసుంది. కానీ నీకు సంతానం కూడా లేదు. నువ్వు ఈ అబ్బాయిని పెంచుకున్నావట కదా! అందుకే ఇతనికి ఉద్యోగం ఇవ్వదలిచాం. నీకు ఇష్టమేనా?'' అని అడిగాడు.

ఏమిటి నా ఇష్టం? నేను ఉద్యోగం చెయ్యలేనని దరఖాస్తు పెట్టానా? వీడికి ఉద్యోగం ఇస్తే నన్ను కన్నతల్లిలా చూసుకుంటాడా? అన్ని విషయాలూ మేనేజర్ చెప్పేస్తున్నాడు. ఇంక నా బతుకింతేనేమో అన్న ఆలోచనతో బాటు కళ్లల్లోంచి బొటబొటా కన్నీళ్లు కారాయి. అది చూసిన మేనేజరు "ఏడవకమ్మా! ఏం చేస్తాం.... ఇంత చిన్న వయసులోనే మొగుడు పోవడం చాలా బాధపడవలసిన విషయం. నీ కొడుక్కి ఉద్యోగం ఇస్తున్నాంగా... బాధపడకు!'' అన్నాడు.

నా ఏడుపు మేనేజరుకి అర్థమైన తీరు తెలుసుకున్నాక, ఆ వచ్చే ఏడుపు కూడా ఆగిపోయింది.

వాడికి ఉద్యోగం ఇస్తున్నారనే నా ఏడుపంతా! నన్ను దగా చేస్తున్నారనే నా ఏడుపంతా! అని గట్టిగా చెబ్దామనుకున్నాను. ఆ సమయంలోనే బావగారు చెప్పిన విషయం గుర్తుకు వచ్చింది. మేనేజరుకు ముట్టచెప్పవలసింది ముట్టచెప్పానన్నాడు. అందుకే మేనేజరు నా ఏడుపుకి అర్థం అలా తీశాడు.

ఆ సాయంకాలం మేనేజరు మా ఇంటికి వచ్చాడు "నీ పని తొంభైశాతం అయిపోయిందయ్యా! నువ్వు నీమాట మీద నిలబడాలి మరి! మూడు నెలల జీతం నీ

చేతుల్లోకి రాదు, తెలిసిందా?'' అన్నాడు.

బావగారు, అత్తయ్యగారు "మీ ఇష్టం... తమ దయ!'' అంటూ నక్క వినయాలకి పోయారు.

"ఈ ఫైలు మేనేజింగ్ డైరెక్టర్ దగ్గరకి పంపించాను. ఆయన సంతకం పెట్టేయడమే తరువాయి!'' అంటూ నన్ను చూసి నవ్వాడు.

ఒక ఆడదాన్ని మోసం చెయ్యడంలో గల పైశాచిక ఆనందాన్ని పంచుకున్నారు. ఇంటిల్లిపాదీ నవ్వులు కక్కుతూ.

కొన్నాళ్ళకి మేనేజరు పరుగెత్తుకుంటూ వచ్చాడు. "మేనేజింగ్ డైరెక్టర్ సంతకం పెట్టలేదు! ఆవిడ్ని చూస్తానన్నాడు!'' అంటూ చెప్పాడు.

ఇంట్లో అందరూ గాభరా పడ్డారు. వీళ్ల గాభరా చూసి, "నేను లేనూ...! అంతా చూసుకుంటాను. మేనేజింగ్ డైరెక్టరు మంచి పనిలో ఉన్నప్పుడు తీసుకురండి. అంతగా ఏమైనా ప్రశ్నలు అడిగితే నేను జవాబు చెప్పుకుంటాను. ఆవిడ్ని ఏం మాట్లాడవద్దనండి!'' అన్నాడు.

"దాని మొహం! అదేం మాట్లాడుతుందిలెండి! మీరు కొంచెం కాయండి!'' అన్నాడు బావగారు. ఇంతమంది మగవెధవల నిర్వాకం చూశాను. ఇంకొకడిది చూస్తాను. మొగుడు మొగుడి హోదాలో కొట్టాడు. పెంపుడు కొడుకు కొడుకు హోదాలో తల్లికి తక్కువ చేయకూడదని కొడతాడు. ఇంక ఈ ఇంటితో రుణం తీరిపోయింది. దినదిన గండం దీర్ఘాయుష్షు అన్నట్టు.... ఈ ఇంటిలో బతికే బదులు ఏ సముద్రపు లోతుల్లోనో శాంతిని వెతుక్కోవడం మంచిది.

"చూస్తాను.... చూస్తాను...!'' అన్న మేనేజింగ్ డైరెక్టర్ ఎదురుగా నిలబడ్డాను. ఆయన చాలా చికాకుగా ఉన్నాడు. ఫైలు తెరిచి చూశాడు. "ఇప్పుడే రావాలా? తీరిక సమయంలో రాలేరూ!'' అంటూ నన్ను విసుగ్గా చూశాడు.

'ఎప్పుడొస్తేనేం జరిగేది ఒకటేగా?' అనుకున్నాను.

"ఏం అమ్మా, పిల్లలు లేరా?'' అని అడిగాడు.

"అవునండీ, లేరు. అందుకే వాళ్ళ బావగారి అబ్బాయిని పెంచుకుంది!'' అంటూ మేనేజరు జవాబు చెప్పాడు.

"ఈ అబ్బాయికి ఉద్యోగం ఇస్తే, నీ జీవితం సుఖంగా వెళ్ళిపోతుందంటావ్!'' మేనేజింగ్ డైరెక్టరు ప్రశ్న.

'సుఖం అన్న మాటకి పకాలున నవ్వాలనిపించింది. ఇంక జీవితంలో నిత్యసుఖం, బతికితేనే కదా బాధలన్నీ!' అని అనుకున్నాను.

"అవునండీ..... ఆ అబ్బాయి చిన్నప్పటి నుంచీ ఈమె దగ్గరే పెరిగాడు. పదేళ్లుగా

ఈమెనే తల్లిలా చూసుకుంటున్నాడు.....!" అంటూ మేనేజరు ఏమేమో చెప్తున్నాడు. వాటన్నింటితోనూ 'ఈమెనే పీక నులుముదామనుకుంటున్నాడు' అని చేరిస్తే ఎంత సహజంగా ఉండును! నా నిస్సహాయతకి నాకు మళ్లీ ఏడుపొచ్చేసింది. ఎంత ఆపుకుందామన్నా కళ్లమ్మట నీళ్లు ఆగలేదు. రెండు కళ్లమ్మట కన్నీళ్లు ధారాపాతంగా బుగ్గల మీదకి కారాయి. మేనేజింగ్ డైరెక్టరు నన్నే గమనిస్తున్నాడు.

నా కన్నీళ్లు చూసిన మేనేజరు "చూశారా... అబ్బాయి గురించి చెప్తేనే చాలా బాధపడిపోతోంది. ఆ అబ్బాయికి ఉద్యోగం ముఖ్యం సార్!" అన్నాడు.

మేనేజింగ్ డైరక్టరు మేనేజర్ని ఓసారి దీర్ఘంగా చూసి, నా వైపు తిరిగి, "మీరు వెళ్లవచ్చు!" అన్నాడు.

నేను బయటకు వచ్చేశాను.

వస్తుంది వస్తుంది అనుకున్న ఉద్యోగం రోజైనా రాలేదు, రెండు రోజులైనా రాలేదు, నెలరోజులైనా రాలేదు. బావగారూ, అత్తగారూ గాభరా పడిపోతున్నారు. ఆ విషయాన్నే మేనేజరు దగ్గర మొరపెట్టుకున్నారు.

మేనేజరు నన్ను మేనేజింగ్ డైరెక్టరు దగ్గరికి తీసుకెళ్ళాడు. మేనేజింగ్ డైరెక్టరు ఎదురుగా ప్రాథేయపడి అడగమంటారు అత్తగారూ, బావగారూ, అది నాకు ఇష్టం లేదు. అలా చేయడం వల్ల నాకేమైనా ఒరుగుతుందా అంటే అలాంటిదేమీ లేదు. అందుకే మేనేజింగ్ డైరెక్టరు ముందు ప్రాథేయపడటం, దేబిరించడం నాకు ఇష్టం లేదు.

మళ్లీ నేను మేనేజింగ్ డైరెక్టర్ ఎదురుగా ఉన్నాను. ఈసారి మొదటిసారి ఉన్న బెరుకు లేదు. గదంతా పరిశీలించాను. చాలా ఆధునికంగా అలంకరించిన గది, గదిలో చల్లగా ఉంది. ఈ కంపెనీ అంతా ఆయనదేనట. చిన్నవాడైనా తెలివైనవాడని చెప్పుకుంటారు.

మేసేజింగ్ డైరెక్టరు నన్ను చూసి, "ఏమిటి?" అని అడిగాడు.

"వాళ్ళ అబ్బాయికి ఉద్యోగం ఇస్తానన్నారు. ఆ విషయం అడగడానికి వచ్చింది సార్!" అన్నాడు మేనేజరు.

మేనేజింగ్ డైరెక్టర్ నా మొహంలోకి ప్రశ్నార్థకంగా రెండు నిమిషాలు చూసి, "ఓహ్... అదా! ఫైలు పట్రండి సంతకం చేసేస్తాను! అవునమ్మా, లేటయిపోయింది!" అన్నాడు సౌమ్యంగా.

మేనేజింగ్ డైరెక్టరు గొంతులోని 'అవునమ్మా, లేటయిపోయింది' అన్న అనునయ వాక్యాలు నాలో అనేక ఆలోచనలు రేపాయి. ఇంతదూరం వచ్చాక, ఇంక నేనేం చెప్పగలను? ఏం చెప్పినా మేనేజరు పడనిస్తాడా? ఏం జరిగితే అది జరుగుతుంది. మేనేజింగ్ డైరెక్టర్‌తో నా పరిస్థితి చెప్పుకోవాలి. ఇతనూ అందరిలాగా ఆలోచిస్తే మన

ఖర్మ అని సరిపెట్టుకోక తప్పదు. నా ఆలోచనల్లో నేను ఉన్న సమయంలోనే మేనేజరు ఫైలు తీసుకురావడానికి గదిలోంచి బయటకు వెళ్లిపోయాడు.

ఇంక నేను ఆలోచించి, ఈ అవకాశాన్ని పాడుచేసుకోదలచుకోలేదు. చటుక్కున వెళ్ళి మేనేజింగ్ డైరెక్టర్ కాళ్ల దగ్గర కూలబడ్డాను.

"ఈ కొడుకుని నేను పెంచుకోలేదు. వీడొక రాక్షసుడు. వీడికి ఉద్యోగం ఇచ్చి నన్ను కష్టాలపాలు చేయకండి!'' అన్నాను. ఇంక మాట్లాడటానికి నోటమ్మట మాట రావడం లేదు. నాలుక పిడచకట్టుకుపోయింది. కళ్ళమ్మట నీళ్ళ ధారాపాతంగా వస్తున్నాయి.

మేనేజింగ్ డైరెక్టర్ నిమిషం సేపు అవాక్కయిపోయాడు. వెంటనే తేరుకున్నాడు.

"నేను అనుకున్నది నిజమే నన్నమాట! ఆ రోజన నీ కళ్ళల్లో జీరలకి, కన్నీళ్ళకి, మేనేజరు చెబుతున్న అర్థానికి సమన్వయం కుదరలేదు. ఈ విషయం ఏదో పూర్తిగా తెలుసుకుని కానీ నిర్ణయం తీసుకోకూడదని అపాయింట్‌మెంట్ ఆర్డరుమీద సంతకం చేయలేదు. కానీ ఏ విషయం తెలుసుకోవడానికి టైమే లేకపోయింది. అది సరే. ఈ విషయం ఆ రోజే ఎందుకు చెప్పలేదు?''

"మేనేజరుగారు మా ఇంటికి వస్తారు. ఆయన, మా బావగారూ కలిసే ఈ పెంపుడు నాటకం ఆడుతున్నారు!'' అన్నాను నా కన్నీళ్లని అర్థం చేసుకున్న మనిషి ఒకరున్నారని ఆనందిస్తూ.

"ఓహో....!'' అని సాలోచనగా, "నువ్వు లే, అక్కడ నిలబడు!'' అన్నారు.

నేను మళ్లీ యథాస్థానంలోకి వచ్చేశాను.

మేనేజరు గదిలోకి వచ్చాడు. నా కళ్ళల్లో నీళ్ళు చూశాడు. నీకీ కన్నీళ్లే పర్మనెంట్ ఆస్తిగా చేసే ఏర్పాట్లు చేశాను అనుకున్నాడేమో? తనలో తాను చిన్నగా నవ్వుకున్నాడు.

మేనేజింగ్ డైరెక్టరు గురించి మేనేజరు చెప్పగా విన్నాను. చాలా తెలివైనవాడని, మేనిప్లేటివ్ టాక్టీస్ ఉన్నవాడని. కానీ నా విషయంలో ఆ తెలివితేటలు ఎంతవరకూ పనిచేస్తాయి? ఆఖరి నిముషంలో నా పరిస్థితి చెప్పుకున్నాను. నా ఆలోచనల్లోనే ఉండగానే, మేనేజింగ్ డైరెక్టరు నా ఫైలు తిరగేస్తూ, కొన్ని చోట్ల ఆగి దీర్ఘంగా చదువుతున్నాడు.

"నే నవన్నీ బాగా స్టడీ చేశాను. సార్!'' అన్నాడు మేనేజరు.

మేనేజరు అన్నదానికి సమాధానం చెప్పకుండా "అబ్బాయి వయసెంత?'' అని అడిగాడు మేనేజింగ్ డైరెక్టర్.

"ఇరవై ఏళ్లు''

"అబ్బాయి చదివాడా?''

"ఉద్యోగం ముఖ్యం అని చదువాపేస్తున్నాడు. సార్!''

"ఊహుం అబ్బాయికి ఇరవై ఏళ్లు. మేజరు. ఈ దత్తత చెల్లదు.''

మేనేజరు అవాక్కయి మేనేజింగ్ డైరెక్టర్‌ని చూస్తూ ఉండిపోయాడు. రెండు నిమిషాల తర్వాత తేరుకుని. " ఈ దత్తత ఎప్పుడో జరిగిపోయింది. సార్!" అన్నాడు.

"ఎప్పుడు? ఈమె పెళ్ళయి పదేళ్ళయింది. అయిదేళ్ళలో పిల్లలు పుట్టరని పదహారేళ్ళ అబ్బాయిని పెంచుకుందా! ఇంపాజిబుల్! అన్ బిలీవ్‌బుల్!" అంటూ మేనేజర్‌కి సమాధానం చెప్పి, నా వైపు తిరిగి, "ఈ దత్తత చెల్లదమ్మా! ఈ అబ్బాయికి ఉద్యోగం రాదు!" అన్నాడు మేనేజింగ్ డైరెక్టర్.

మేనేజరు గొంతులో వెలక్కాయ పడింది. ఆయన ఆశ్చర్యపోతూ మేనేజింగ్ డైరెక్టర్‌ని చూశాడు.

ఆ సమయంలోనే మేనేజింగ్ డైరెక్టర్ సాలోచనగా నా వైపు చూస్తూ, "చూడమ్మా...! మీ అబ్బాయికి ఉద్యోగం రాదు. నీకు ఉద్యోగం ఇవ్వగలం. అందుకు కంపెనీ రూల్సు ఒప్పుకుంటాయి. కానీ నీకు చదువు లేదు. నువ్వే చెప్పు, మమ్మల్నేం చెయ్యమంటావో! ఆ సహాయం నేను నీకు చేస్తాను!" అన్నాడు.

ఆ క్షణంలో నేను ధైర్యం చూపించకపోతే, అవకాశం చేతులు దాటిపోతుంది. అందుకే ధైర్యంగా, "అయ్యా! నేను ఐదో క్లాసు వరకూ చదివాను. ఆ చదువు చాలు కదూ, ఆఫీసు తుడవడానికి, మంచినీళ్ళు అందించడానికీ, ఫైల్సు మోయడానికీ! ఆ ఉద్యోగం ఇచ్చి నాకు సాయం చేయండి!" అన్నాను. ఇది చెప్తున్నప్పుడు ఏడుపు రాలేదు కానీ, మేనేజరుకి అనుమానం రాకుండా ఏడ్చాను.

"అవునవును, నీకు ఉద్యోగం ఇచ్చినా మీ కుటుంబానికి సాయం చేసినట్టే. ఇదిగో, ఈ తెల్లకాగితం మీద సంతకం చెయ్యి!" అంటూ ఒక తెల్లకాగితాన్ని నాకు అందజేశాడు మేనేజింగ్ డైరెక్టరు.

నేను ఆ కాగితం అందుకుని సంతకం చేశాను. దాన్ని మేనేజర్‌కి ఇస్తూ. "దీని మీద అటెండర్ ఉద్యోగానికి అప్లై చేస్తున్నట్లు దరఖాస్తు రాసి పట్రండి"! అన్నాడు.

"అలాగే, సార్! ఇప్పుడు మీకు పనుందన్నారు, రేపు రాసి పట్టుకొస్తాను"! అన్నాడు మేనేజరు నీళ్ళు నములుతూ.

"నా పనులన్నీ తర్వాత చూసుకుంటాను. రేపు ఈమె ఆఫీసులో జాయిన్ అవ్వాలి. ఇప్పటికే ఆలస్యమైంది!" అంటూ చెయ్యవలసిన పనులన్నీ పురమాయించాడు మేనేజర్‌కి, మేనేజింగ్ డైరెక్టరు.

*మార్పుకి మూలం* *(ఆంధ్రప్రభ, 28 ఫిబ్రవరి 2000)*

# చివరికోరిక

ఇంటికి ఎదురుగా ఆగిన ఆటోరిక్షా లోంచి దిగిన కొడుకు సంపత్‌ని చూడగానే ఆశ్చర్యపోయారు శాంతమ్మ, రవణయ్య మేష్టారు. శాంతమ్మ శాంతగా, రవణయ్య మేష్టారు రవణగా చలామణి అవుతున్న రోజుల్లో పుట్టిన ఒకే ఒక్క కొడుకు సంపత్. ఏదో డేకుతూ డిగ్రీ వరకు చదివాడు. పట్నంలో ఉద్యోగం చేస్తున్నాడు. రవణ రవణయ్య మాష్టారుగా మారి, పట్నంలో చేస్తున్న మాష్టరుగిరీ నుంచి రిటైరై పట్నానికి దూరంగా, సబర్బన్‌లో ఓ రెండు గదుల ఇల్లు కొనుక్కొని, గవర్నమెంటు పెన్షన్‌తో కాలం వెళ్ళదీస్తున్నారు.

సంపత్‌కి ఉద్యోగం దొరకగానే పెళ్ళయిందనిపించారు. వచ్చిన కోడలు వేరుందామని ఒప్పించింది మొగుణ్ణి. సంపత్, సంపత్ పెళ్ళాం జయంతి పట్నంలో కాపరం పెట్టారు. సంపత్‌కైతే తల్లి, తండ్రిని వదిలి వెళ్ళాలని లేదు. అది తల్లి మీది ప్రేమ, తండ్రికి వచ్చే పెన్షను మీద అభిమానం, అద్దె లేకుండా ఇల్లు దొరికిందన్న ఆర్థిక అంతరాత్మ ప్రలోభం కావచ్చు గానీ, కొత్త గడపలో అడుగు పెట్టిన జయంతికి అత్తగారు పెత్తనానికీ, మావగారు అథారిటీకీ ఉన్నారనే అనవసరపు ఆలోచనలతో, స్వేచ్ఛని కోరి కాపురాన్ని పట్నం పట్టుకుపోయింది.

పట్నంలో స్వేచ్ఛ అయితే ఉంది గానీ ఇల్లు ఎవడూ వట్టినే ఇవ్వడు సరికదా, గది అద్దె అయిదొందలు, నీళ్ళుంటే వంద, కరెంటు ఉంటే యాభై, పక్కనే కూరల బజారుంటే మరో యాభై అంటూ పెంచుకుపోవడమే కాక, దగ్గర్లో బైస్కోపు ఉంటే యాభయో, వందో అద్దె పెరిగే స్కోపు కూడా లేకపోలేదు.

ఇవన్నీ మనం అధికంగా ఖర్చు చెయ్యాలి కదా అని సంపత్ వాపోతే, మీరేం గాబరా పడకండి. నేను ఉద్యోగం చేస్తానూ అంటూ చిన్నసైజు ఉద్యోగంలో జాయిన్ అయింది జయంతి.

ఇద్దరూ ఉద్యోగాల్లో ఇమిడిపోవడం వల్ల సరైన సౌకర్యం లేక పురుషుడైన సంపత్ ఇబ్బందిలో పడ్డాడు. ఎందుకంటే, ఎల్లప్పుడూ తల్లి చాటునే పెరిగిన సంపత్‌కి తల్లి సుఖం బాగా తెలుసు.

శాంతమ్మ శాంతగా ఉన్న రోజుల్లో, గడుసుదనంలో వెనకబడ్డ శాంతని లోకం తనతోపాటు శాంతని కూడా వెనక్కి నెట్టేసింది. అందుకే శాంత 'తన' అనే పరిధిలో పెరగక తన మొగుడూ, పిల్లాడే సర్వస్వం అనే లంపటంలో పడి, లోకంలో జరుగుతున్న మార్పు తనకోసం కాదు, తన పిల్లాడి కోసం అన్న వెర్రితనంలో పడ్డా, వెర్రి శాంతమ్మగా కాక తల్లి శాంతమ్మగా మారిపోయింది.

తల్లి శాంతమ్మలో చిన్నప్పటి ఒడి వెచ్చదనం, పెద్దయ్యాక చేతి కమ్మదనం రుచిచూసిన సంపత్‌కి, తల్లిని విడిచి హోటల్లో టిఫిన్లకి, ఆదరా బాదరాగా వండిన జయంతి వంటకాలకి ఎరకావడం ఇష్టం లేకపోయినా తప్పనిసరి అయింది.

తల్లికి, తండ్రికి దూరంగా పట్నంలో కాపరం ఉంటున్నా, వారాంతానికి తల్లి దగ్గరికి వచ్చేసేవాడు. అతని వెనకే గొణుక్కుంటూ జయంతీ వచ్చేది. జయంతి గొణుగుడు సణుగుడై, సంపత్‌ని పట్టి పీడించింది. కొన్నాళ్ళకి ఆ సణుగుడు, రణరణ ధ్వనుల రూపం చెందకుండా సంపత్ తల్లితండ్రుల దగ్గరకు రావడంలో ఎడాన్ని పెంచి, జయంతికి కాస్త ఊరట కలిగించాడు.

అలాగని జయంతికి శాంతమ్మ, రవణయ్య మేష్టారంటే ఏదో శత్రుత్వం ఉందని అనుకోకూడదు. కానీ జీవితంలో ఆదివారాల్లో మాత్రమే స్వేచ్ఛ దొరుకుతున్న తమకు, తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళి కాలాన్ని వృథా చేసుకోవడం ఇష్టంలేదు అంతే.

జయంతి ఆదివారాల్లో సినిమాకి వెళ్ళి అందులో తల్లిదండ్రుల కోసం, చెల్లెళ్ళ కోసం, ప్రియురాలి కోసం మూడు గంటల పాటు కసరత్తులు చేసిన అభిమాన హీరోని ఇష్టంగా చూసి, కాసిన్ని కన్నీళ్ళు కార్చేయడం శ్రేష్టం అనుకుంటుంది. సినిమా లేని రోజుల్లో సాయంకాలాలు సముద్రపు ఒడ్డున ఐస్‌క్రీం చప్పరిస్తే కాని, వారం రోజులూ చేసిన చాకిరీతాపం తీరేది కాదు.

రోజులు ఎప్పుడూ ఒక్కలా గడవ్వు. లేదా గడుస్తున్న రోజులు ఎప్పుడూ ఒక్కలా ఉండవు. ఉండాలని అనుకోవడం పొరపాటు.

ఇలా సాఫీగా జరిగిపోతున్న జీవితానికి అడ్డకట్ట వేస్తూ సంపత్‌కి కడుపులో చిన్న నొప్పి బయలుదేరింది. ఇంట్లో సాధనాలకి కడుపునొప్పి తగ్గినట్లు కనబడ్డా మళ్ళీ ఉధృతంగా వచ్చింది. ఈసారి డాక్టరు దగ్గరికి వెళ్ళక తప్పలేదు.

కేసు గురించి వింటే వంద, చూస్తే రెండొందలూ పుచ్చుకునే డాక్టరు దగ్గరికి వెళ్ళారు. వెళ్ళక తప్పలేదు. అంతకన్నా మంచి డాక్టరు ఆ చుట్టుపక్కల లేడని లోకం కోడై కూస్తోంది మరి!

డాక్టరు తాను చూడగలిగింది చూసి ఓ కాగితం మీద తాను చూడలేని అనేక విషయాల్ని ప్రశ్నిస్తూ... ఈ టెస్టుల వల్ల తన నాలెడ్జి పెరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశాడు. అతని టెస్టుల అభిప్రాయపు చిట్టాలో చివర్న ఓ క్లినికల్ లేబొరేటరికి వెళ్ళండి. వాళ్ళు చాలా చవగ్గా టెస్టులు చేస్తారు అని చెప్పాడు.

జయంతి, సంపత్ డాక్టరు చేసిన సహాయానికి వంగి వంగి నమస్కారాలు చేసుకుంటూ బైటకి వచ్చి, చూపించుకున్న పుణ్యానికి రెండొందలూ చెల్లించి ఆటోలో ఆయన చెప్పిన క్లినికల్ లేబొరేటరీకి వెతుక్కుంటూ వెళ్ళి, ఆటోవాడికి ఓ యాభై రూపాయలు సమర్పించుకుని, క్లినికల్ లేబొరేటరీ బెంచీ మీద గంటసేపు కూర్చుని

తమ టర్న్ వచ్చాక రక్త పరీక్ష, ఎక్స్‌రే, మోంటెక్స్ ఆదిగాగల టెస్టులు చేయించుకుని, డాక్టరుగారు చుట్టుపక్కలున్న క్లినికల్ లేబొరేటరీలని వదిలి, తమని రక్త పరీక్షలకి ఇంతదూరం ఎందుకు పంపించాడా అని ఆశ్చర్యపోయారు.

క్లినికల్ లేబొరేటరీవాడు చేసిన టెస్టులకి ఎక్కువ తీసుకున్నాడో, తక్కువ తీసుకున్నాడో తెలీదుగానీ, ఆటోవాడికి మాత్రం అదనంగా వందరూపాయలు వదిలినై, లేబొరేటరీ రిజల్టు అలవోకగా చూసి, ఇ.ఎస్.ఆర్ పెర్సంట్ ఎక్కువగా ఉంది. అంటే జబ్బు ఏక్టివ్‌గా ఉంది అంటూ నాలుగు రకాల ఏంటీ బయోటిక్స్ రాశాడు డాక్టరు.

ఇంకేముంది, మందులతో జబ్బు తగ్గిపోతుందన్న నమ్మకంతో తమకి తెలిసున్న అప్పులు పెట్టే మందుల దుకాణంకి వెళ్ళి, మందులు అడిగారు. ఈ డాక్టరు రాసిన మందులు తన దుకాణంలో లేవన్నాడా దుకాణంవాడు. మళ్ళీ వాళ్ళిద్దరూ డాక్టరు దగ్గరికి వచ్చి, ఆ మందులు తమకి తెలిసిన దుకాణంలో దొరకడం లేదని వాపోయారు.

డాక్టరు చిరునవ్వు నవ్వి, "మీరు ఎక్కడికో ఎందుకు పోయారు. నా ఆస్పత్రి పక్కనున్న దుకాణంలో ఈ మందులన్నీ దొరుకుతాయి'' అంటూ చిదంబర రహస్యం చెప్పాడు.

జయంతికి, సంపత్‌కి ఆ దుకాణంలో మందులు డబ్బెట్టి కొనక తప్పలేదు. వెయ్యి రూపాయల దాకా వదిలాయి. రెండు కోర్సుల మందులు కడుపులో కెళ్ళాయి. ఇంక కడుపునొప్పి దాని బాబుతో సహా వదిలిపోతుందని సంపత్ అనుకుంటే, కడుపునొప్పి ఇంకోలా అనుకుంది. మందులకి తాత్కాలికంగా నెమ్మదించినా, నెలరోజులు తిరక్కుండానే మళ్ళీ నొప్పి మొదలైంది. ఈసారి అదే డాక్టరు దగ్గరికి వెళ్ళాడు సంపత్.

డాక్టరు మళ్ళీ చూడ్డానికి కన్సల్టెన్సీ ఫీజు రెండొందలు తెమ్మన్నాడు. "నెల ముందే కదా ఇచ్చాను'' అని సంపత్ అంటే, "దానికి ట్రీట్‌మెంట్ చేశాను కదా'' అన్నాడా డాక్టరు. కానీ, నా నొప్పి తగ్గలేదని సంపత్ అంటే, ప్రతీ ప్రత్యేకమైన కన్సల్టెన్సీకి ప్రత్యేకంగా ఫీజు ఇచ్చుకోవలసిందే అని రెండొందలు పుచ్చుకుని ఈసారి పాతిక టెస్టులు రాశాడు. ఈసారి టెస్టులకి వెయ్యి దాకా ఖర్చయింది దంపతులకి. ఆ టెస్టులన్నీ అరగంట సేపు అటూ ఇటూ చూసి, "మీరో స్పెషలిస్టు దగ్గరికి వెళ్ళండి'' అని చెప్పి తనకి తెలిసిన గాస్ట్రో ఎంట్రియాలజిస్ట్ పేరు రాసిచ్చాడు.

మాయా బజారులో కృష్ణుడు చెప్పినట్లు చిన మాయాను పెనుమాయ అది స్వాహా! ఇది స్వాహా! అని స్పెషలిస్టు ముందుగా అయిదొందల ఫీజుచ్చుకుని డేటిచ్చాడు. ఆ డేటుకి సంపత్, జయంతి గాబరాగా వెళ్ళారు 'పెను మాయ' డాక్టరు దగ్గరకు. ఆయన తన వంతు పరీక్షలు కానిచ్చి, ముందు డాక్టరు చేసిన పరీక్షలేవీ పనికిరావని, తన వంతుగా పరీక్షలన్నీ తనకు నచ్చిన అచ్చివచ్చిన క్లినికల్ లేబొరేటరీలో చేయించి, వాటిని అరగంట పరీక్షించి, పరిశీలించి, పరిశోధించి, ఆ టెస్టులేవీ పనికి రావని తేల్చాడు. అయితే, సంపత్‌ని

పట్టి పీడిస్తున్న జబ్బు ఏమిటి? దంపతులిద్దరూ డబ్బు వదిలి జబ్బు వదలకపోయేసరికి అయోమయంలో పడ్డారు.

స్పెషలిస్టు చివరగా తాను డౌటనుకున్నట్టుగా బయోప్సీ చేయించాడు.

అది పాజిటివ్ అన్న రిపోర్టు వచ్చింది. డాక్టరు దంపతులిద్దర్నీ కూర్చోపెట్టి, తాను కనుక్కున్న సత్యం వాళ్ళకి చెప్పాడు.

సినిమాల్లో క్యాన్సర్ తప్ప మెడికల్ వరల్డులో క్యాన్సరు ఆటుపోటులు తెలీని జయంతి తరువాతి సీనులో సంపత్ చచ్చిపోతున్నట్లుగా కనబడి ఏడ్చేసింది. సంపత్ గూడా విచారంగా ముఖం పెట్టాడు.

అది చూసి డాక్టరు, "ఈ రోజుల్లో క్యాన్సరుకి భయపడవలసిన పనిలేదని, సంపత్ క్యాన్సరు ఏ స్టేజిలో ఉందో ఎస్టిమేట్‌చేసి, దానికి ట్రీట్‌మెంటు చేయగల సత్తా, హైద్రాబాద్ డాక్టర్లకుందని, మీరక్కడికి వెళ్ళండని తనకు తెలిసిన నర్సింగ్ హోమ్ అడ్రసు ఇచ్చి అక్కడ ట్రీట్‌మెంటుకి ఎంత అవుతుంది'' అన్న సంపత్ ప్రశ్నకి సమాధానంగా, ఓ యాభై వేల వరకూ ఖర్చువుతుందని తేల్చాడు.

సంపత్, జయంతి ఆలోచనలో పడ్డారు. యాభైవేలూ ఎక్కడ పుడతాయి? ఇద్దరి ఉద్యోగాలూ చిన్నవే. జయంతి ఓ రోజు ఉద్యోగానికి వెళ్ళకపోతే, ఆరోజు జీతం దొరక్కపోవచ్చు. అలాంటిది యాభైవేలు ఎలా పుట్టిస్తుంది? ఇంక సంపత్ ఎన్ని లోన్లు పెట్టినా పదివేల కంటే ఎక్కువ రాలవు. సంపత్‌కున్న గ్రూపు ఇన్సూరెన్సులు, లైఫ్ ఇన్సూరెన్సులూ, లైఫున్నంత కాలం అందుబాటులోకి రావు. అలాంటప్పుడు యాభైవేలు ఎలా పుడతాయి? ఈ జబ్బు గురించి తెలిస్తే, అప్పు పెట్టేవాళ్ళు కూడా జంకుతారేమో? ఎవరు అప్పు పెడతారు? తగ్గుతుందన్న ఆశతో అప్పుచేసి హైదరాబాదు వెళ్ళడమా? లేక చావుకోసం ఎదురుచూస్తూ ఈ పట్నంలోనే కూర్చోవడమా? ఏదీ తేల్చుకోలేకపోయారు.

ఆ సమయంలో జయంతికి ఈ విషయాన్ని మామగారికి చెప్పి సలహా తీసుకుందామనే ఆలోచన కలిగింది. సంపత్‌కి కూడా ఈ విషయాన్ని తల్లికి కాకపోయినా, తండ్రికి చెప్దామనే ఆలోచన వచ్చింది.

ఆదివారం నాడు ఇంటికి వచ్చిన కొడుకూ, కోడల్ని చూసి ఆనందపడింది శాంతమ్మ. విషయం తెలుసుకుని విషాదంలో కూరుకుపోయారు రవణయ్య మాష్టారు.

కొడుకూ, కోడలూ ఈ విషయం తనకి చెప్పడంలో అంతరార్థం 'యాభై వేలూ సర్దమని' కూడా కలిసుందని ఆయనకి తెలుసు.

కొడుకూ, కోడలూ రెండు రోజులు ఆఫీసుకి సెలవు పెట్టి వచ్చారు. అది తెలిసి ముందాశ్చర్యపోయినా, కొడుకూ, కోడలూ, భర్తా రహస్యంగా మాట్లాడుకోవడం, తాను

వెళ్ళగానే మాటలు ఆపేయడం, కోడలి బుగ్గలమీద కన్నీటి చారికలు, కొడుకు దీనవదనం, భర్తలో కనిపిస్తున్న పరధ్యానం ఆమెకి అనుమానం కలిగించాయి. కొడుకు మెదడులో ప్రతీ న్యూరాను ఎడ్రసూ ఆవిడకి తెలుసు. అలాంటి శాంతమ్మ రెండో రోజు భర్త, కొడుకూ కూర్చొనుండగా, "విషయం ఏమిటి? నాకు చెప్పరా" అంటూ కొడుకుని, భర్తని నిలదీసి అడిగింది. వాళ్ళు తటపటాయిస్తూంటే, "నీలో నువ్వు ఎందుకు బాధపడతావే? నలుగురితో చెప్పుకుంటే సగం సమస్య తీరుతుంది. అసలు విషయం ఏమిటో మాకు చెప్పు" అంటూ కోడల్ని నిలదీసింది.

కోడలు చెప్పిన విషయానికి శాంతమ్మ షాక్ తింది. ఏడవడం మర్చిపోయింది. ముప్పై ఏళ్ళ కొడుకు క్యాన్సరుతో బాధపడుతున్నాడన్న విషయం ఆవిడ బుర్రలోకి ఇంకడానికి చాలా సమయం పట్టింది.

ఆ తర్వాత శాంతమ్మ రవణయ్య మేస్టార్ని ఎలాగేనా డబ్బు కూర్చండి అన్న విన్నపం చెయ్యనక్కరలేకుండానే రవణయ్య మేస్టారు తేరుకున్నారు. "ఈ రోజుల్లో క్యాన్సరేం పెద్ద జబ్బు కాదు లేవోయ్. అది హైదరాబాద్‌లో బాగు చేస్తారు. అక్కడికి వెళుతున్నారు" అన్నారు.

రవణయ్య మాస్టారు నడుం బిగించి, ఆఫీసుల చుట్టూ తిరిగి, తన పెన్షన్ పూర్తిగా అమ్మేస్తే, కొడుకు అవసరం తీరుతుందని తెలుసుకుని, పెన్షన్‌ని పూర్తిగా అమ్మేసి, యాభైవేలూ తీసుకొచ్చి కొడుకు చేతిలో పెట్టారు. రోజు గడవడం కోసం ఓ చిన్న ప్రైవేటు స్కూల్లో మాస్టరు గిరీకి కుదురుకున్నారు.

యాభై వేలు చేతిలో పడేసరికి జబ్బు తగ్గిపోయినంత ఆనందం వేసింది సంపత్‌కి. సంపత్, జయంతి హైదరాబాద్ వెళ్ళారు.

హైదరాబాద్‌లో సంపత్‌కి కెమోథెరపీ మొదలైంది. జుత్తూడింది. శరీరం కమిలినట్టయింది. కళ్ళ కింద నల్లటి చారలు తేలాయి. కడుపులో మేలిగ్నన్ గ్రోత్‌తో అభివృద్ధి చెందుతున్న కణాలు నాశనమయ్యాయో, లేదో తెలీదు గానీ, తీసికెళ్ళిన డబ్బు యాభైవేలూ కరిగిపోయాయి.

జబ్బు తగ్గిందో లేదో అర్థం కాలేదు. డాక్టర్లు కెమోథెరపీ ఇంకా సాగాలంటున్నారు. ఆ సమయంలో అసలు విషయం డబ్బు కొదవ గురించి డాక్టర్లకి చెప్పుకుని, తన సంగతేమిటో తేల్చి చెప్పమని మొరపెట్టుకున్నాడు సంపత్.

డబ్బుకి కొదవ లేదంటేనే ఈ రోజుల్లో డాక్టర్లు ట్రీటుమెంటుగాని, డబ్బుకి కొదవ ఏర్పడితే ట్రీటుమెంటు డైరెక్షన్ కూడా మారిపోతుంది. హైదరాబాద్ డాక్టర్లు సంపత్‌తో "బొంబాయి జస్లోక్ హాస్పిటల్లో దీనికి తగ్గ విధంగా ట్రీట్ చేసి, రోగం ఏ పరిస్థితిలో ఉన్నదీ అంచనా వేసి చెప్పగలరని, బొంబాయి వెళ్ళమని" సలహా ఇచ్చారు. కానీ బొంబాయి వెళ్ళడానికో ముప్ఫైవేలు కావాలన్నారు.

ఆ ముప్ఫై వేల కోసం జయంతి రవణయ్య మేస్టార్ని ఆశ్రయించక తప్పలేదు. ఆయనకి కూడా డబ్బు పుట్టించడం కష్టం అయింది. ఇల్లు తాకట్టు పెట్టి, తక్కువ వడ్డీకి ముప్ఫై వేలూ కూర్చి జయంతి చేతిలో పెట్టాడు.

డబ్బు తీసుకుని జయంతి, సంపత్ బొంబాయి వెళ్ళారు. అక్కడ విషయ పరిశీలనకి సగం డబ్బు ఖర్చయిపోయింది. రాకపోకలకి మిగతా సగం ఖర్చవగా, క్యాన్సరు స్పెషలిస్టు సంపత్‌ని, జయంతిని కూర్చోపెట్టి, "సంపత్ జబ్బు తగ్గే సూచనలు ఏవీ లేవని, చాలా ఎడ్వాన్స్‌డ్ స్టేజిలో ఉందని, సంపత్ రెండు నెలలు మించి బతికే అవకాశం లేదని, కెమోథెరపీ కంటిన్యూ చేస్తే మరో రెండు నెలలు ఎక్కువ బతకచ్చేమో'' అంటూ నిజాన్ని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పాడు.

చేతిలో డబ్బు ఖర్చు అయిపోయి, రెండు నెలల జీవితాన్ని పదిలంగా పట్టుకుని ఇంటి కెళ్ళడానికి రైలెక్కాడు సంపత్.

తాను ఇంకా రెండు నెలలు జీవిస్తాడు అంటే నమ్మబుద్ధి వెయ్యలేదు. కానీ నమ్మక తప్పదు. ఈ రెండు నెలల్లో ఏం చెయ్యాలి? అప్పచెప్పడానికి ఆస్తులు, అప్పగింతలు పెట్టడానికి పిల్లలు లేరు. తాను పోయినా జయంతి ఉద్యోగం చేసుకు బతికేస్తుంది. లేదా తల్లితండ్రుల దగ్గరికి వెళ్ళిపోతుంది. జయంతికి అన్యాయం చేసి వెళ్ళిపోతున్నాడా? ఏదేనా తన చేతుల్లో ఏముంది? విధి తన ఆధీనంలో ఉండేటట్లయితే వీళ్ళందర్నీ వదిలి వెళ్ళేవాడా? జీవితం అంత తీపి ఇంకేదీ లేదు. అందుకే క్యాన్సరు లాంటి దాన్ని వెళ్ళగొట్టడానికి లక్షరూపాయలు ఖర్చు చేశాడు. అమ్మ, నాన్న ఎంత సహాయం చేశారు! అమ్మ పట్టుపట్టకపోతే నాన్న పెన్షన్ అమ్మేవారా? ఇల్లు తాకట్టు పెట్టేవారా? తమ భవిష్యత్తు ఏమిటి? అని ఎప్పుడూ ఆలోచించలేదు అమ్మ. జయంతి ప్రవర్తనలో పెళుసుదనం అమ్మకి కొంచెం బాధ కలిగించినా, ఎంతో ఉదారంతో 'వాళ్ళు చిన్నపిల్లలు. పట్నంలో వాళ్ళకి మనసు కుదురుతుంది. మనలా ముసలివాళ్ళయ్యాక ఈ ఇంటికే వచ్చి ఉంటారు'' అంటూ "పర్వాలేదు వెళ్ళండి. అక్కడేం ఇబ్బంది పడకండి. ఇబ్బందేదేనా తెలియ చెయ్యండి'' అని తనని, జయంతిని పట్నం కాపురానికి పంపింది.

ప్రతీ ఆదివారం వచ్చే తాము ఎడం పెంచేమని, నెలకోసారి, రెండు నెలలకోసారి వస్తున్నామని గుర్తించినా ఇంటికి వెళ్ళే సరికి "ఏరా ఎక్కడెక్కడికి తిరిగారు? ఏవి సినిమాలు చూశారు'' అంటూ కబుర్లు చెప్పి చెప్పించుకుని, తామున్న ఒక్క రోజూ ఎంత హడావిడి చేసేదో! తండ్రికి బాధ్యతలు ఎక్కువ. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు, తమ్ముళ్ళ చదువులతో తన సంపాదన కరిగిపోతున్నా, అమ్మ అండ కొండంతగా ఉండడం వలన ఏనాడూ తన భవిష్యత్తు ఏమిటి? అని ఆలోచించలేదు. స్వార్థానికి పోలేదు. డాక్టరు తన జీవిత పరిధి రెండు నెలలు అని చెప్పిందగ్గర్నుంచీ అమ్మే జ్ఞాపకం వస్తోంది సంపత్‌కి. ఆ ఆలోచనలోనే మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఆలస్యం చెయ్యలేదు. రైలు త్రీ టైర్‌లో అందరూ

పడుకున్నారు. ఎదురుగుండా బెర్త్ మీద జయంతి మంచి నిద్రలో ఉంది.

బెర్త్ మీంచి లేచాడు సంపత్. కూర్చోవడానికి లేదు. పై బెర్తువాడు పడుకుని ఉండడం వల్ల వంగి బెర్త్ మీద కూర్చోవలసి వచ్చింది. అలా వంగి కూర్చునే జయంతిని లేపాడు. తుళ్ళిపడి లేచింది. జయంతి లేవగానే గాబరాగా, “ఏం వాంతి అయేటట్టు ఉందా'' అనడిగింది.

లేదన్నాడు సంపత్. ఏమిటి అన్నట్టు చూసింది.

“జయా! చచ్చిపోయేవాళ్ళకి చివరి కోరిక అంటూ ఉంటే తీరుస్తారు కదా, సినిమాల్లో చూపించినట్టు ఉరి తీసే ముందు చివరి కోరిక ఏమిటి అనడుగుతారు'' అన్నాడు.

జయంతి ఏం మాట్లాడలేదు. ఏం మాట్లాడడానికి ఏముంది? ఇంత అర్ధరాత్రి లేపి, ‘చివరి కోరిక’ అంటూ మాట్లాడుతున్న మొగుణ్ణి అవాక్కయి చూస్తుండడం మినహా ఏం చెయ్యలేకపోయింది.

సంపత్ చివరి కోరిక గురించి చెప్పవలసిన ఉపోద్ఘాతం అంతా చెప్పి “జయా, ఈ రెండు నెలలూ నాకు అమ్మ దగ్గర ఉండాలనుంది'' అంటూ తన చివరి కోరిక చెప్పాడు.

జయంతి కళ్ళంట నీళ్ళొచ్చాయి. అవుననలేదు, కాదనలేదు, తన కళ్ళ నీళ్ళు ఏడుపు పైకి తెలియనీయకుండా బెర్తుమీద అటు తిరిగి పడుకుంది.

చివరి కోరిక చెప్పిన తర్వాత సంపత్ మనసు శాంతించింది. జయంతి తన చివరి కోరికని మన్నిస్తుంది అన్న ఆలోచన తృప్తి కలిగించగా బెర్తు మీద పడుకుని, తన మీద దయ చూపని నిద్రా దేవిని ఆహ్వానిస్తూ కళ్ళు మూసాడు.

ఇంటెదురుగా ఆగిన ఆటోరిక్షా లోంచి దిగిన సంపత్‌ని, జయంతిని చూసి శాంతమ్మ, రవణయ్య మాస్టారూ ఆశ్చర్యపోయారు.

జబ్బు పూర్తిగా తగ్గి కొడుకింటికి వచ్చాడని సంబరపడింది శాంతమ్మ. విషయం తెలిసి రవణయ్య మాస్టారు తన మొహంలో విషాదఛాయల్ని దాచుకోలేకపోయారు. లోకంలో జరిగే వింతల్ని చూస్తూ మౌనంగా ఉండిపోయారు.

సంపత్ ఉద్యోగానికి వెళ్ళడం లేదు. జయంతి, రవణయ్య మాస్టారూ ఉద్యోగాలకి వెళ్ళి వస్తున్నారు.

సంపత్ ఆరోగ్యం పాడయినప్పుడల్లా ఏవో మందులు వేసి తాత్కాలిక ఉపశమనం కలిగిస్తున్నారు.

పరిస్థితిలో తేడా పసిగట్టింది శాంతమ్మ. కొడుక్కి బాగయినట్టా? కానట్టా? మొగుణ్ణి నిలదీసి అడిగింది. “అసలు సంగతేమిటి? వాడికి తగ్గిందా? తగ్గితే ఇక్కడికి వచ్చి ఎందుకుంటున్నాడు? వాడు ఉద్యోగానికి ఎప్పుడు వెళతాడు'' అంటూ రవణయ్య మాస్టార్ని నిలబడనివ్వలేదు.

రవణయ్య మాస్టారు కూడా దాచదలచుకోలేదు. ఇప్పుడే నిజం చెప్పేస్తే శాంతమ్మలో 'విషాదపు లావా' ఉధృతం కాలక్రమాన తగ్గుతుందని, ఆఖరి నిజాన్నీ కొడుకు చావునీ తట్టుకోగల ధైర్యం చేకూరుతుందని, "శాంతా, నీ కొడుకు రెండు నెలలే బతికుంటాడు. వాడి చివరి కోరికగా ఆఖరి రోజులు నీ దగ్గర గడుపుదామని వచ్చాడు'' అంటూ జరిగిందంతా శాంతమ్మకి వివరంగా చెప్పారు.

శాంతమ్మ నిశ్శబ్దంగా ఏడ్చింది. ఎంత ఏడుపు దాచుకున్నా, ఉత్తేజితమైన హృదయంలో లావాపొంగి, కన్నీరుగా కారి, వాటి చిహ్నాలని బుగ్గల మీద చారికలుగా మిగులుస్తున్నాయి. ఆమె ముఖం దుఃఖం తీవ్రతకి వడలిపోయింది. అందుకే విచారాన్ని మరుగు పర్చలేకపోయింది.

అది గమనించిన సంపత్ తండ్రిని, "అమ్మకి అసలు విషయం చెప్పావా నాన్నా'' అని అడిగాడు. తండ్రి అవునన్నట్టు తలూపాడు. తల్లిని ఏమని ఓదార్చాలి? ఏమని ధైర్యం చెప్పాలి? ఏం చేస్తే ఆవిడలో దుఃఖం తీరుతుంది? అన్నీ ఆలోచనలు, ప్రశ్నలు. తల్లిని పలకరించాలంటేనే ధైర్యం చాలడం లేదు సంపత్‌కి.

అడిగిన సేవ చేసి కొడుకుని అపురూపంగా చూసుకునే శాంతమ్మ కూడా అన్ని పనులూ మౌనంగా చేసుకుపోతోంది. చేస్తున్న ఏ పనిలోనూ మనసు నిలవడం లేదు. ఆమెకి ఈ సత్యం మనసులో ఇంకక ముందే, ఆమె మనసుకి తగిలిన దెబ్బ చాలదన్నట్టు ఓరోజు మధ్యాహ్నం ఇంటి మీద అప్పిచ్చినవాడు వచ్చాడు నెల వడ్డీ కోసం, ఈనెల కొడుకూ, కోడలూ ఇక్కడే ఉండడం వల్ల ఖర్చు ఎక్కువై ఈనెల వడ్డీ కట్టలేకపోతున్నామని, వచ్చేనెల నుండి కట్టేస్తామని చెప్పింది శాంతమ్మ. కానీ, వాడొప్పుకోలేదు. నోటికి వచ్చినట్టూ అన్నాడు. "తాను అసలు అడగడం లేదని, వడ్డీ కట్టడానికి ఇంత గింజుకుంటారేమిటీ'' అనుకుంటూ వెళ్ళిపోయాడు.

నీకు అసలెందుకు నాయనా. ఇల్లే పుచ్చుకునే ఉద్దేశంలో ఉన్నావు. ఇంక మేం గింజుకోవడం నీ వడ్డీ కట్టలేక కాదు అనుకుంది. తన మనసు ఎందుకు గిలగిల్లాడుతోందో ఆమెకి తట్టేసరికి దుఃఖం వరదలా కొట్టుకొచ్చేసింది శాంతమ్మకి.

కొడుకు ఆఖరి రోజులు తన దగ్గర గడుపుదామని వచ్చాడు. కొడుకుని వెళ్ళిపోమని చెప్పలేదు. రవణయ్య మాస్టారు ఈ వయసులో పడుతున్న కష్టాన్ని చూసి ఓర్చనూలేదు.

ఈ ఆర్థిక సమస్య నుంచి బయటపడాలంటే కొడుకూ కోడలు వెళ్ళిపోవాలి. కొడుకింకెక్కడకి వెళతాడు? భగవంతుడి దగ్గరకే వెళ్ళేది. కొడుకు వెళ్ళిపోయాక కోడలు ఎలానూ ఉండదు వెళ్ళిపోతుంది. ఈ బంధం అక్కడితో సరి. కొడుకు ఆరోగ్యం బాగుపడుతుందని చేసిన ఖర్చంతా బూడిదలో పోసిన పన్నీరైంది. ఇంక ఏ ఆశ మిగిలింది? తానూ, మాస్టారు అప్పిచ్చినవాడి చేతుల్లో ఇల్లు పెట్టి, రోడ్లు పట్టి పోవలసిందే. తమని ఎవరాదరిస్తారు? ఎవరేనా ఆదరించడానికి అందరి సంసారాలూ అంతంత మాత్రమే.

ఇంతవరకూ తిన్నా, తినకపోయినా ఓ గూడంటూ ఉంది. ఇప్పుడది కూడా కరువైపోతుంది. కొడుకుతో పాటు తాము గూడా ఆ దారే పట్టేస్తే ఎంత బావుణ్ణు. కానీ అలా జరగదు. భర్తని తలచుకు దిగులపడింది. శాంతమ్మ తాను కాపురానికి వచ్చిన దగ్గర నుండీ సుఖపడ్డం ఎరుగని భర్త, ఈ ముసలితనంలో నిలువ నీడ లేక రోడ్లమ్మట పడిపోవలసి వస్తోంది. కొడుకు చనిపోతాడనే దుఃఖం కన్నా ముందు ముందు వయసుడిగి నిలువ నీడ లేక భర్త పడే యాతన, పీడ తలపుకు వచ్చి దుఃఖం మూడింతలు పెరిగింది.

శాంతమ్మ దుఃఖం మనసు పొరల అడుగున పడి, ఆమె హృదయం కాక, మెదడు పనిచేసేసరికి పది రోజుల దాకా గడిచాయి.

అప్పటికి సంపత్ మరీ నీరసంగా తయారయాడు. ఏం తిన్నా కడుపులో ఇమడడం లేదు. అతని పరిస్థితిని అర్థం చేసుకున్న శాంతమ్మ 'ఎవరు ఏమనుకుంటేనేం? తాను ఇంక ఆలస్యం చెయ్యకూడదు' అనుకుంది.

ఆరోజు రమణయ్య మాస్టారూ, జయంతీ ఉద్యోగాలని టౌను వెళ్ళిపోయాక, మెల్లగా కొడుకు దగ్గరికి చేరింది. మంచం పక్కగా నేలమీద కూర్చుని, "బాబూ" అని పిలిచింది.

సంపత్ నీరసంగానే "ఏమిటమ్మా" అని పక్కకి ఒరిగి చూశాడు.

నీరసంగా, దీనంగా ఉన్న సంపత్ ముఖం చూడగానే అడుగుదా మనుకున్నది మర్చిపోయి, ఆమె కోరే కోరికలో నిర్లజ్జకి ఆమె గుండెలు ఆవిసి, దుఃఖం పెల్లుబికి, మంచం దండెకి తల దబదబ బాదుకుని, వెక్కివెక్కి ఏడ్చింది శాంతమ్మ. ఎంతైనా తల్లి మరి!

తల్లి ఎందుకలా ఏడ్చిందో అర్థం కాలేదు సంపత్‌కి. ఇన్నాళ్ళూ అణిచి పెట్టుకున్న దుఃఖం పెల్లుబికి తల్లి ఏడుస్తోంది అనుకున్నాడు సంపత్. కళ్ళల్లో నీళ్ళు తిరగ్గా "మన చేతిలో ఏం లేదమ్మా" అన్నాడు.

కొడుకు ఎందుకలా అన్నాడో అర్థం అయింది శాంతమ్మకి ఏడుస్తూనే, "అది కాదురా" అంది.

సంపత్‌కి ఆశ్చర్యం వేసింది "మరి" అంటూ మంచం మీంచి లేచి కూర్చున్నాడు.

అప్పటికీ శాంతమ్మ దుఃఖం తీరలేదు. వెక్కిళ్ళు వస్తూనే ఉన్నాయి. మంచం దండెకి తల ఆన్చుకు కూర్చుంది.

"చెప్పమ్మా! నీ మనసులో ఏముందో చెప్పు, అన్నాడు సంపత్ ఆత్రంగా", కొడుకు చావు కన్నా మించిన దుఃఖం తల్లికి ఏం ఉంటుందో అతని బుర్రకి తట్టలేదు.

సంపత్ బాగా బలవంతం చేసిన మీదట, 'సంపత్ హైదరాబాద్ ట్రీటు మెంటు కోసం భర్త పెన్షనమ్మేసి, చిన్న ఉద్యోగంలో చేరిన విషయం, బొంబాయి ప్రయాణం కోసం ఇల్లు తాకట్టు పెట్టి వడ్డీకి డబ్బు తెచ్చిన విషయం చెప్పి ఇంటిమీద తెచ్చిన

అప్పుకి వడ్డీ కట్టలేని పరిస్థితిలో ఇల్లు అప్పులవాడికి వదిలి వీధిన పడవలసి వస్తుందని, ఈ వయసులో మీ నాన్న పడుతున్న యాతనని చూడలేకపోతున్నానని, అదే తన దుఃఖం అని చెపుతూ "నువ్వేదైనా సహాయం చెయ్యరా కనీసం మమ్మల్ని వీధిన పడకుండా కాపాడు'' అంది. అంటూ దుఃఖం నల్లటి మేఘంలా కప్పేయగా వెక్కివెక్కి ఏడ్చింది శాంతమ్మ.

తల్లి మనసులో మాట తెలియగానే అవాక్కయి, ఆలోచనలో పడిపోయాడు సంపత్.

దూరంగా పక్కింటివాళ్ళ రేడియోలో మంగళంపల్లి మార్దవంగా 'విన్నపాలు వినవలె వింత వింతలూ... పన్నగపూ దోమతెర పైకెత్తవేమయ్య' అంటూ వెంకటేశ్వరుణ్ణి వేడుకుంటున్నాడు.

''నిజమే, తన ఆలోచనల్లో తానున్నాడు. తనదే దయనీయమైన స్థితి అనుకుంటున్నాడు. కానీ తల్లిని, తండ్రిని తనకంటే దీన స్థితిలో వదిలిపోతున్నానని అర్థం చేసుకోలేకపోయాడు. తాను పోయాక జయంతి తన తండ్రి దగ్గరికి చేరుకోవచ్చు. లేదా ఉద్యోగం చేస్తుంది. ఆమె ఒంట్లో ఆ సత్తువ ఉంది కానీ, తల్లి, తండ్రి ఒంట్లో ఆ సత్తువ లేదు. ఉద్యోగం చేసి సంపాదించి ఇల్లు విడిపిస్తాననే నమ్మకం లేదు.

చివరి దశలో వాళ్ళని అన్యాయం చేసి, తన దారి తాను చూసుకోకూడదు. జయంతి మీద నమ్మకం లేక, తల్లి తనని ఈ కోరిక కోరలేదు. జయంతికి జరుగుతున్న అన్యాయానికి జయంతి తట్టుకు నిలబడగల ధైర్యం, వయసూ ఆమెకి ఉన్నాయి. అన్నీ ఉడిగిపోయినా, ఇంకా జీవితంలో ఘర్షణ పడవలసిరావడం తల్లితండ్రుల దౌర్భాగ్యం. తాను ఏం చేస్తే తల్లి కోర్కె తీర్చగలడు? జయంతితో చర్చించాలి! జయంతితో చర్చిస్తే ఆమె ఏం అనుకుంటుందో? ఎలా అర్థం చేసుకుంటుందో? అసలు జయంతి మీద నమ్మకం ఉంటే, రేపోమాపో కనబడకుండా పోయే కొడుకుని సిగ్గు వదిలి అడుగుతుందా అమ్మ? తానే ఏదో ఏర్పాటు చెయ్యాలి' అని నిర్ణయించుకున్నాడు సంపత్.

తల్లి మనసులో మాట బైటపెట్టిన వారం రోజులకి ఓ ఆదివారం నాడు సంపత్ మంచం మీద కూర్చుని, అందర్నీ తన దగ్గరికి రమ్మనమని పిలిచాడు. అతని చేతిలో కాగితాలున్నాయి. అందరూ వచ్చాక...

"జయంతీ ! నా పరిస్థితి నీకు తెలుసు..... "అంటూ మొదలు పెట్టాడు "నాకు ఏ ఆస్తులూ లేవు. ఉన్నదానితోనే గడిపామని నీకు తెలుసు. చేసిన అప్పులు పోగా, నా ఆఫీసు నుండి నా పేర్న ఉన్న ప్రావిడెంట్ ఫండ్, గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యూటీ నీ పేరున వస్తుంది. మా ఆఫీసువాళ్ళు నీకు ఉద్యోగం కూడా ఇవ్వచ్చు. నీ గురించి నాకు బెంగలేదు. కానీ, నా జబ్బు నయమవుతుందన్న నమ్మకంతో తన పెన్షన్ అమ్మి, చిన్న ఉద్యోగంలో జాయిన్ అయి, ఇల్లు కుదువపెట్టి, దానికి అయిన వడ్డీ కట్టలేక, వీధిన పడిపోతామన్న దిగులుతో ఏం చెయ్యలేని స్థితిలో ఉన్న అమ్మానాన్నల గురించే నా

బాధంతా. అందుకే నా ఇన్సూరెన్స్ పాలసీని అమ్మపేరుతో నామినేట్ చేశాను. దానివల్ల వచ్చే అరవైవేలూ అమ్మ తీసుకుంటుంది. దానికి అభ్యంతరం చెప్పవని ఆశిస్తాను'' అన్నాడు ఆయాసంగా.

శాంతమ్మ, రవణయ్య మాస్టారూ నిశ్శబ్దంగా, ఏదో తప్పు చేసినట్టు, నేలచూపులు చూస్తూ కూర్చున్నారు.

సంపత్‌కి ఏం జరుగుతుందా అన్న ఆదుర్దా ఎక్కువైంది. జయంతి తల్లితండ్రుల్ని అసహ్యించుకుంటుందా? కొడుకు చావుబతుకుల మధ్య ఉంటే, తల్లి, తండ్రి సిగ్గు విడిచి డబ్బుకి దేవురించారు అని ఈసడించుకుంటుందా? ఆ డబ్బు కూడా నా హక్కే ఎవరేనా ఎలా తీసుకుంటారో చూస్తాను అని సవాలు చేస్తుందా? ఏం చేస్తుంది జయంతి? ఎలా అర్థం చేసుకుంటుంది? ఎన్నో అనుమానాలు, అపార్థాల మధ్య తన ఆఖరి క్షణాలు గడుస్తాయా? తల్లి కోరిక తీర్చాలనే తన చివరి ఆశయం తీరకుండా, అందరి మనసుల్నీ బాదపెట్టి, తాను బాధపడి, చివర్లో మనశ్శాంతి కరువవుతుందా? అన్న ఆలోచనలతో సంపత్ జయంతినే దీర్ఘంగా చూస్తున్నాడు.

జయంతి మౌనాన్ని వేరుగా అర్థం చేసుకుని అనవసరపు ఘర్షణ ఎందుకులే అని, "ఎందుకురా, రోజులు ఎలాగోలా వెళ్ళిపోతాయి. నువ్వేం బాధపడకు....'' అంటూ గొణిగారు రవణయ్య మాస్టారు.

అంతవరకూ దూరంగా గోడకానుకుని, సంపత్ చెప్పింది ఆశ్చర్యంగా వింటున్న జయంతి, శాంతమ్మనీ, రవణయ్య మాస్టార్నీ క్షణం పాటు తేరిపారచూసి, కూర్చున్న చోటు నుండి లేచి, సంపత్ మంచం దగ్గర నేలమీద కూర్చుని, సంపత్ చేతిని తన చేతిలోకి తీసుకుంది.

"సంపత్ నువ్వేం దిగులు పడకు. నువ్వు మీ అమ్మగారికిచ్చిన సొమ్ము వేపు నేను కన్నెత్తైనా చూడను. నేను వాళ్ళ నిస్సహాయతని అర్థం చేసుకోగలను. నీ ఆరోగ్యం కోసం తన భవిష్యత్తు ఏమైపోతుంది అని ఆలోచించకుండా, డబ్బెత్తి ఇచ్చిన మావగారి ఔదార్యాన్ని వెలకట్టగలిగే శక్తి నాకు లేదు. నువ్వు వాళ్ళ గురించి ఏం బెంగపెట్టుకోకు. నువ్విచ్చిందే కాదు, నాకు చేతనైన సహాయం కూడా చేస్తాను'' అంది. అలా అంటున్నప్పుడు ఆమె గొంతు వణికింది. మంచం దిండుకి తల ఆన్చి, కళ్ళంట ఉబికివస్తున్న కన్నీళ్ళని దాచేసింది. ఈ రెండు నెలల్లో ఆమె జీవితంలో ఏది ముఖ్యం? అన్నది నేర్చుకుంది. మనిషిలో మంచి మనిషికి కలిగించినంత సుఖాన్ని జీవితంలో మరే అనుభవం కలిగించలేదని అర్థం చేసుకుంది.

ముగ్గురు శ్రోతలూ తమ చెవుల్ని తామే నమ్మలేకపోయారు. శాంతమ్మ గోడకి చేరబడి వెక్కుతూ ఏడుస్తోంది. రవణయ్య మాస్టారి కళ్ళల్లో నీళ్ళు చిమ్మి, ఎదురుగా ఉన్న మనుషులు మసకబారిపోయారు.

జయంతి మనసు తెలపడంతో, సంపత్‌కి జయంతి చూపిన ఔదార్యానికి, అభిమానానికి మనసు తేలికపడి హాయినిచ్చింది.

తన చివరి క్షణాల్లో తల్లి కోరిక తీర్చగలిగాననే తృప్తితో అతను వెనక్కి దిండుకు ఆనుకుని, ఆనందంతో కళ్ళు మూసుకున్నాడు.

ఆ జీవికి అంతకన్నా ఏం కావాలి?

*చివరి కోరిక* *(ఇండియాటుడే, 30 మే 2000)*

# ముల్లు

దొంగతనం జర్గింది......... వూర్లో ........

వూర్లో దొంగతనాలు కొత్తకాదు. ఏవో చిన్నాచితకా దొంగతనాలు జరుగుతూనే వుంటాయి.... దొంగ దొరకడు.... ఏ పైవూరు వాడో అయివుంటాడు. వూళ్ళో వాడెవడూ ఆ వూర్లో దొంగతనం చెయ్యడు. అది నీతి.

పై వూరివాడికి ఈ వూరు ఆనుపానులు తెలియవు. అందుకే చిన్న చిన్న దొంగతనాలే జరుగుతాయి. అదీ వూరి వాళ్ళ నిర్లక్ష్యం వల్లో... అప్రమత్తంగా లేకపోవడం వల్లో జరిగిందని తెలిసిపోతూ వుంటుంది.

కానీ ఇప్పుడు జరిగిన దొంగతనం వేరు..... అదీ రాయుడింట్లో జరిగింది.

ఆ వీధంతా మోతుబర్లే..... ఇళ్ళల్లో పాలేర్లుంటారు.... ఇళ్ళకి పెద్ద పెద్ద పెరడ్లుంటాయి. లోపలికి జొరబడితే బైటకి రావడం కష్టం. అంతా ఆరుబయట పడుకున్నారు. దొంగతనం జర్గింది. అంటానికి లేదు. అది చలికాలం కాదు గాని..... రాత్రుళ్ళు చల్లగా వుంటుంది. అందరూ లోపలే పడుకున్నారు.

అయితే రాయుడింటి వెనక తలుపు రిపేర్ కొచ్చింది. గడియ పడ్డం లేదు దగ్గరగా వేసి వుంచుతున్నారు. షరాబుని పిల్చాడు రాయుడు. వాడికేదో పనుండి వూరెళ్ళాడు.... రాలేదు..... వాడొచ్చి చేసేస్తాడు, ఈలోగా ఆలస్యం అవదులే అనుకున్నాడు రాయుడు. చాలా ఆలస్యం అయింది అని నిరూపించాడు దొంగ.

అదే పెరటి గుమ్మంలోంచి లోపలికి ప్రవేశించి, రాయుడు కూతురి మెళ్ళోగొలుసు, కాళ్ళ వెండి మువ్వల పట్టీలు 'గోవిందా' అనిపించాడు.

పెరటి తలుపు రిపేరు కొచ్చింది. తేలిగ్గా తెరుచుకుంటుంది. అని వాడికి ముందే తెల్సన్నట్టుగా అతి సునాయాసంగా దొంగతనం చేసాడు. అదీ అందరి ఆశ్చర్యానికి కారణం.

అయితే ఈ దొంగతనం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తే...... రాయుడికి ఆశ్చర్యం.... దుఃఖం...... రెండూ కలిగాయి..... దొంగకి వుప్పందించిన వాళ్ళెవరు? రాయుడింటికి వొక పక్క గోవిందం నాయుడు రెండో పక్క గోపాల్రాయుడు వున్నారు.... రాయుడ్లిద్దరికీ 'దోస్తీ' వుంది. అలాగని గోవిందం నాయుడితో 'దుష్మనీ' లేదు. కలిస్తే స్నేహితుడు లేకపోతే లేదు. ఇద్దరి పొలాలూ పక్కపక్కనే...... పొలానికి సంబంధించి ఏదేనా 'గుర్రు' మనసుల్లో వుందేమో? బయటికి తేలరు. ఎందుకంటే వూరి పెద్దలు కదా!

దొంగతనం జరిగిన్రోజు రామాలయంలో పంచాయితీ జరిగింది. గ్రామంలో చాలా మంది చేరారు. చర్చ జరిగింది. ఎన్ని బేరీజులు వేసినా దొంగతనాన్ని గుర్తించారే తప్ప.....

దొంగని గుర్తించలేక పోయారు.

గ్రామానికి పూర్వాశ్రమంలో మున్సబుగిరీ చేసిన పాపారాయుడు నిక్కచ్చిగా మాట్లాడుతూ..... "ఈ దొంగతనం గురించి.... ఆ వీధిలో ఎవరోకరికి తెల్సి తీరాలన్నాడు. ఎవరో దొంగకి సాయం చేసుండచ్చు అన్నాడు. నిజమే ఎవరా అన్నది తేల్చలేదు.... ఎవరా అన్నది తేలుతే..... వాళ్ళని పట్టుకు..... దొంగ వివరాలు తెల్సుకోవాలి.... ఎవరు అన్నది వాళ్ళంతట వాళ్ళు చెప్తారా?....... చెప్పరు. ఎవరి బుర్రలో ఏముందో ఎలా తెలుస్తుంది. కానీ అన్ని బుర్రలూ కల్సే జీవించాలి.... అదీ సొసైటీ!......

గోవిందం నాయుడి మనస్తత్వం అందరికీ తెల్సు..... నక్క బొక్కలు వెదుకును నాయుడు చిక్కులు వెదుకును... అన్నట్టుగా వుంటుంది. గోవిందం నాయుడు చిక్కులు పన్నేవాడే కానీ.... దొంగతనం చేయించాడంటే నమ్మబుద్ధికాదు...... ఈ దొంగతనం వల్ల నాయుడికొరిగిందేమిటి? నాయుడి కొరగక్కర్లేదు...... ఎదుటివాడికి తరిగింది కదా! అదే నాయుడికి ఆనందమా? విచిత్రమే!

అంతేకాక నాయుడెవరి చేతైనా దొంగతనం చేయిస్తే..... వాడెవరో తెలియాలి! వాడ్ని పట్టుకోవాలి! వాడికీ నాయుడికీ వున్న లంకె కనిపెట్టాలి? లంకెందుకు కనిపెట్టాలి? అంటే..... జాతి దుష్మనీని పైకి తీయాలి!

సమాజంలో జాతులుండక తప్పదు.... వాటి నీతి ఇంకోజాతిని సహించకపోవడం.... జాతికి జాతికి పడకపోవడం కొత్త రీతి. పాత రివాజులో ఈ దుష్మనీ లేదంటారు.... యెందుకులేదో చెప్పరు..... ఇప్పుడూ అదే వృత్తి.... అప్పుడూ అదే వృత్తి..... ఇప్పుడూ అదే భూమి అప్పుడూ అదే భూమి అప్పుడు ఇప్పుడు వొకటి కానిది భూమి ధర!..... భూమి వుపయోగం......! అదే రాజకీయానికి నాంది! దొంగవొక పావు మాత్రమే!

దొంగతనం జరిగిన పదిరోజులకి వూర్లోకొచ్చాడు ముల్లు అప్పారావు. ఆ విషయం ధనంజయసెట్టి రాయుడు చెవిలో వేసాడు.

ముల్లు అప్పారావుకి పదిహేడేళ్ళు పైనే వుంటాయి. తల్లీతండ్రీ లేరు. ఏదో చుట్టుపక్కల వూరివాడే ఈ వూర్లో ధనుంజసెట్టి కొట్లో పనికి కుదురుకున్నాడు పొట్లాలు కట్టేవాడు. సెట్టి లేనప్పుడు బెల్లం, అటుకులు, వేయించిన శనగపప్పు బొక్కేవాడని అనుమానం, ఒకటి రెండు సిగరెట్లు కూడా మాయం అయేవి. ఇవన్నీ దుకాణం కొచ్చేవాళ్ళకి సెట్టి చెప్పుకున్నాడు కూడా..... కానీ పనిలోంచి తీసెయ్యాలా.... ఎందుకంటే..... వాడిచేత అంతకంత పనీ చేయించుకునేవాడు.

ధనుంజయసెట్టి చెప్పింతర్వాత ఆలస్యం చెయ్యకుండా ముల్లు అప్పారావుని పట్టుకున్నాడు రాయుడు. రాయుడు బెదిరించినా, వూరి పెద్ద మనుషులు బెదిరించినా ముల్లు అప్పారావు నోరు తెరువలేదు. జేబులువెదికితే మూడొందలు దాకా రొక్కం దొరికింది. దాంతో వూరివాళ్ళ అనుమానం బలపడింది.

"ఈ డబ్బెక్కడిదిరా?

"కూలి డబ్బులు దొరా".

"కూలి డబ్బులెక్కడివి?"

"పట్నం పోయి కూలి చేసుకున్నానండీ"!

"ఎన్నాళ్ళ కూలేటి?"

"ఆర్రోజుల కూలి దొరా"

"నీకు పట్నంలో కూలి దొరుకుతుంది ఎళ్ళరా అని ఎవరు చెప్పార్రా?"

"గోవిందంనాయుడు గారు దొరా"

అదీ లింకు.... కానీ ఆ లింకు సరిపోదు.... మరి....

''ఆర్రోజులకూలి చేసి మూడొందలు సంపాదించావ్.... ఏం తిన్నావ్... ఎక్కడున్నావ్?'' జవాబులేదు.......

వాడే దొంగతనం చేసాడని అర్థం అవుతోంది. కాని వస్తువు చెయ్యి జారి పోయింది. వాడ్ని తన్నినా...... దొంగతనానికి క్లూ ఎవరందించారో చెప్పలేదు. గోవిందంనాయుడు వాడ్ని దొంగతనానికి ప్రేరేపించాడా? లేదా అన్నది తేలలేదు. ధనుంజయసెట్టి వాడ్ని పన్లోంచి తీసేసాడు. వాడూ వూరొదిలిపోయాడు.

కానీ వూర్లో దొంగతనాలు మొదలైయ్యాయి. చిన్న చిన్న దొంగతనాలు... అంటే కోళ్ళు... ధాన్యం.... మినువులు.... బట్టలు... అప్పుడప్పుడు బంగారు గొలుసులు.... వొకటేమిటి అన్నీ.... వీటన్నింటినీ ముల్లు అప్పారావే చేస్తున్నాడని వూర్లోవాళ్ళకి అర్థం అయింది. దొరికినప్పుడు కొట్టేవారు. చీకటికొట్లంలో వేసి.... రెండ్రోజులు కడుపు మాడ్చేవారు. అంతేకానీ వాడ్ని మార్చలేకపోయారు. తన్ని కసి తీర్చుకున్నారు ప్రజలు... తిన్న ప్రతి తన్నుకి కసి పెంచుకున్నాడు ముల్లు అప్పారావు.... చీకటికొట్టు వాడ్ని మరింత చీకటిలోకి నెట్టేసింది. కడుపుమాడుతున్న కొద్దీ తెగింపు, తెంపరితనం పెరిగాయి.

వాడి దొంగతనాన్ని జనం సీరియస్‌గా తీసుకోలేదు. ఎందుకంటే మినువులు మూట పోయినా, ధాన్యం దోచుకున్నా.... గిన్నెలెత్తుకుపోయినా వూర్లో జనం బీదవాళ్ళయిపోలేదు.! ముల్లు అప్పారావు కామందయి పోలేదు. ముల్లు అప్పారావు దొరికిన్నాడు. వొళ్ళుహూనం చేసి. "పనిస్తాం రారా" అంటూ పొలానికి తీసుకుపోయేవారు. రెండు మూడ్రోజులు పని చేయించుకు.... పాత లెక్కలు చెప్పి.... అంటే నెల క్రితం 'మా యింట్లో మినువుల మూట ఎత్తుకెళ్ళావు కదరా దానికిది చెల్లు'.... అనేవారు. అది వాడిలో కసి రేపింది.

తదాది నాలుగు తిట్లు ఎక్కువేనా తినేవాడు కాని పనిలో కొచ్చేవాడు కాదు. దొంగతనాల్లో కూడా మార్పొచ్చింది. ఇంతకుముందు దొంగతనంలో నేర్పు..... వోర్పు

వుండేవి. ఇప్పటి దొంగతనాల్లో సాహసం కనిపిస్తోంది.

ప్రజలు వాడ్ని మార్చారు. కానీ యెలా మార్చారు? వాడెలా మారేడు అన్నదే వాళ్ళు పట్టించుకోలేదు... చిన్న చిన్న దొంగతనాలకి ఇంతకుమించి యేశిక్ష వేస్తాం!.... అనుకున్నారు...... వాడి పట్ల జాలి చూపించామనుకున్నారు. అంతేకాని వాడ్ని తమవాడుగా చేసుకోలేకపోయారు.... వొకలా చూస్తే ప్రజలకి వాళ్ళ నైతిక జీవితం మీద విశ్వాసం యెక్కువ! అది అహంకారంగా కనిపించి.... సవాల్ చేసింది ముల్లు అప్పారావుని.

ఆరుబయట పడుకున్న ఆడవాళ్ళ ముక్కుసత్తులు, చెవిజూకాలు లాక్కుని పట్టుకుపోడం మొదలు పెట్టాడు.... దీంతో ముక్కులు తెగి.... చెవుల కన్నాలు తెగి.... వాళ్ళంతా లబోదిబో మనేవారు. డాక్టరు దగ్గరకి పోడమో! నాటుమందు వాడ్డమో చేసేవారు. దీంతో జనానికి వీడంటే విసుగొచ్చేసింది. వీడి దొంగతనాన్ని తట్టుకోలేని స్థితికి వూర్లో వాళ్ళు చేరుకున్నారు.

వో కులం కట్టుబాటు లేదు! పెద్దల అదుపాజ్ఞలు లేవు! దేనికి జడుస్తాడు వాడు? అదీ వూరి సమస్య!

వూరి సమస్యల్ని వూరి పెద్దలు పరిష్కరించాలి. అది వాళ్ళ బాధ్యత. ముల్లు అప్పారావు వూరికి సమస్యగా మారేడు. ..... "వాడికి పెద్దల భయం లేదు. దెబ్బల భయంలేదు. ఇలాంటి వాడ్ని పోలీసుల కప్పచేస్తే వాళ్ళే వాడ్ని మారుస్తారు.'' అన్నాడు పాపారాయుడు. అది వూరి పెద్దలలో చాలా మందికి నచ్చింది.

ఆ చుట్టు పక్కల కొన్నివూళ్ళకి కలిపి వొక పోలీస్టేషను, అక్కడే యస్సై వుంటాడు. అయిదారుగురు కానిస్టేబుల్స్ వుంటారు. వాళ్ళకి ముల్లు అప్పారావు గురించి తెలియకపోలేదు. కానీ వూర్లో జరిగే తగూలు తాము తీర్చలేమని కాదు. వూర్లో పెద్దలు తీర్చుకుంటేనే మంచిది..... అని వాళ్ళ వుద్దేశం.... అయితే ఇప్పుడు వూరి పెద్దలే ఫిర్యాదు చేసారు. ఫిర్యాదు చేసి వూరుకోలేదు. వాడ్ని పట్టించారు కూడా....

పోలీసోళ్ళ భయంతో ముల్లు అప్పారావు చెప్పినట్టు వింటాడనుకున్నారు. పోలీసోళ్ళంటే ఎవరికేనా ఎందుకు భయం వుండాలి! అనాలోచించలేదు. ఎందుకంటే పోలీసోళ్ళ డ్రస్సుచూసి భయపడ్తారా? వాళ్ళ నీతికి భయపడ్తారా? వాళ్ళ లాఠీకి భయపడ్తారా? లేక వాళ్ళకున్న పవర్స్‌కి భయపడ్తారా? దేనికి వాళ్ళని చూసి భయపడ్తారు?......

అదీ ముల్లు అప్పారావు లాంటి వాళ్ళు దేనికి భయపడ్తారు? అని వీళ్ళాలోచించు కోలేదు. వాడు పోలీసోడు, వీడు దొంగ, వీడ్ని వాడు పట్టుకోవాలి. అంతే! అందుకే వాడ్ని పట్టించారు.

ఇంక పోలీసోళ్ళు ముల్లు అప్పారావుతో మాట్లాడారు. ఎలా అంటే లాఠీతో మాట్లాడేరు..... బూతుల్తో మాట్లాడేరు.... ఎప్పుడేది అవసరం వస్తే దాంతో మాట్లేడేరు.

పోలీసుల దండన....... ప్రజల దండనలో తేడా కనిపించింది ముల్లు అప్పారావుకి....

పోలీసులు కొట్టే కొ ట్టుడు తహతహ పుట్టిస్తోంది. అప్పుడప్పుడు భయం వేస్తోంది. ప్రజలు కొట్టినా, అందులో సుద్దులపాలు ఎక్కువా... కొట్టుడు తక్కువా!

పోలీసులు భయపెడ్తారు. వాళ్ళు ఎందుకు భయపెడ్తున్నారంటే దొంగసొమ్ము వివరాల కోసం.... తను దొంగసొమ్ము ఎలా రొక్కం కింద మార్చుకుంటున్నాడన్న విషయం వాళ్ళకి కావాల... అంతే గాని తను కాదు.

సొమ్మాపేక్ష వాళ్ళని కరకుగా, కఠినంగా తయారుచేసింది..... కాకపోతే వాళ్ళు గవర్నమెంటోళ్ళు! కానీ వాళ్ళకీ కావల్సింది సొమ్మే! తన్నొట్టుకు భయపెట్టో, బామాలో దొంగతనం మాన్పిద్దామనే ఆలోచన ఆళ్ళకి నేదు. వుందని యేకోశానా అనిపించలేదు, వుండాలని యే కాంస్టిట్యూషనులోనూ లిఖించలేదు!.

అయితే ఈ తతంగం అంతా దేనికి? దొంగసొమ్ము కోసం..... అని ఎలాగూ తెలుస్తూనే వుంది. ఆళ్ళు భయపెడ్తే భయపడిపోతామా? భయపడ్తాం! దేనికి భయపడ్తాం... ఆళ్ళకున్న పవర్స్‌కా? కాకీదుస్తులుకా? ఆళ్ళ నీతికా? ఇవేవీ కావు. మరి దేనికి? వాళ్ళు పెట్టే హింసకి భయపడాలి? వాళ్ళ భాషలో హింస, చేతల్లో హింస, ఆ డ్రస్సులోనే హింసుంది. హింసెందుకు పెడ్తారు? భయపడ్డానికి.... తను చేసే దొంగతనానికి ప్రజలు భయపడ్లేదు..... తన సాహసానికి ప్రజలు భయపడ్డారు. అందుకే పోలీసుల కప్పచెప్పేరు. తను లొంగి వస్తాడనుకున్నారు..... భయపెడ్తే ఎవరేనా లొంగొస్తారా? ప్రజల్ని భయపెడ్తే లొంగొస్తారా.... ప్రజల్ని కంపరం యెత్తించాలి... అనుకున్నాడు ముల్లు అప్పారావు....

ముల్లు అప్పారావు ఆలోచన్లతో పనిలేకుండా... వాడ్ని కుళ్ళబొడిచారు పోలీసులు. వాళ్ళ చేతుల తీట తీరిందో లేదో చెప్పలేం కాని చేతులు నొప్పెట్టాయి. వీడు నోరిప్పలేదు.

కొన్నాళ్ళకి ఈడు దొంగసొమ్ము అమ్మకు కర్చెట్టేసాడని నిర్ణయాని కొచ్చారు.

ఆళ్లకి ఇంకో కేసు తగిలింది... వీడ్ని మర్చిపోయారు... కానీ వూరివాళ్ళు వీడ్ని మర్చిపోలేదు... ఇన్‌స్పెక్టర్‌కి కొంత ముట్టచెప్పి కేసు బనాయించి... జైల్లో పెట్టించారు... తాత్కాలికంగా వీడి పీడ విరగడ అయిందనుకున్నారు.

అయితే అదెన్నాళ్ళు.... వాడు కాస్తా విడుదలయాడు.... వదిలేసే ముందు పాపారాయుడు దగ్గరకెళ్ళి "ఎప్పుడో ఇంగ్లీసాడు చెప్పినట్టు ఈడు 'థార్న్ ఇన్ ది ఫ్లెష్' అంటే మీ వూరికి ముల్లు లాంటి వాడు. ముల్లేటిసేద్ది? గుచ్చుకుంటుంది. అద్దాని సహజగుణం. దానికేం సెయ్యలేం. కాసింత జాగ్రత్త గుంటే సరి'', అంటూ ఇకలించి-

ఓ యాభై రూపాయలు నాన్‌రిటర్న్‌బుల్ అప్పుచేసి చేతులు దులిపేసుకున్నాడు ఇన్‌స్పెక్టర్.

జైల్లో కెళ్ళొచ్చాక ముల్లు అప్పారావు ముల్లప్పిగాడు, జైలు ముద్ర పడి

దొంగప్పారావు... దొంగప్పిగాడు అయాడు.

జైల్లో కెళ్ళిన దొంగప్పిగాడు... జైల్లోంచి బైటకొచ్చిన దొంగప్పిగాడు వొకటి కాదని పోలీసులకెలా అర్థంకాలేదో... వూళ్ళో వాళ్ళకీ అర్థం కాలేదు. మనిషి వాడే. మనసు మాత్రం వేరు. హింస మీద గురి కుదిరింది! పోలీసులు వాడ్ని పెట్టిన హింసకి... వాడి మనసు రాటుదేరింది. ప్రజలు దేనికి లొంగుతారో అర్థం చేసుకున్నాడు! లేదా ప్రజల్నెలా లొంగదీయాలో అర్థం అయింది. భయపెట్టి లొంగదీయాలి. హింసకి జడుస్తారు! క్రూరత్వానికి లొంగుతారు? భయపడ్తారు. అయితే వాళ్ళని భయపెట్టడం ఎలా? ఎంతాలోచించినా ప్రజల్ని ఎలా భయపెట్టాలో దొంగప్పిగాడికి అర్థం కాలేదు.

ఆ సమయంలోనే పంతులు టీకొట్టు దగ్గర "ఏరా దొంగప్పిగా వెధవాలోచన్లు పెట్టుకోక. మున్సీబుదొర బొక్కలో తోయించీ గల్డు" అన్నాడో కాపు.

వూరివాళ్ళకి మున్సీబు దొర అండ... అతడే వీళ్ళ ధైర్యం... ఆడే తనని పట్టించాడు.... మున్సీబుదొర్కి గట్టి దెబ్బ తగిల్తే గాని... వీళ్ళకి అడ్డకట్ట వెయ్యలేం.... అనుకున్నాడు, దొంగప్పిగాడు.

ఆ రోజునుండి మున్సీబుదొరింటి దగ్గర కాపేసాడు... దొర్ని అనుసరించాడు.

రోజూ రాత్రి ఎనిమిదయేసరికి మున్సబు వీధరగు మీద మంచం వేసుకు కూర్చుని చుట్ట వెలిగిస్తాడు. ఆ చుట్ట అయేక విశ్రమిస్తాడు. మున్సబు కా అలవాటు ఎప్పట్నించో వుంది. అయితే ఈ మధ్య దోమల బెడద ఎక్కువై మంచం చుట్టూ దోమతెర కట్టుకు మరీ పడుకుంటున్నాడు. దోమతెర కట్టడం వల్ల, మంచం మీద కూర్చుని చుట్ట కాల్చడం కష్టం అయిపోతోంది. అందుకే అరుగు మీద స్థంబాని కానుకు కూర్చుని చుట్టపని ముగిస్తున్నాడు.

దోమ తెర్లో పడుకోడం వల్ల మున్సబు నిద్రపోయిందీ... లేన్దీ అంత తేలిగ్గా తెలీదు. పడుకున్నాక మున్సబు దొర్ని దెబ్బ తీయాలి... అదీ దొంగ దెబ్బ తీయాలి... దెబ్బకి జనం భయపడాలి. భయపడ్డం కాదు ఠారెత్తి పోవాలి. అదీ దొంగప్పిగాడి ఆలోచన....

ఓ అర్ధరాత్రి మున్సబుదొర మంచి నిద్రలో వుండగా, పిల్లికాళ్ళ దొంగప్పిగాడు మున్సబు పడుకున్న మంచం దగ్గరికి చేరుకున్నాడు. చాలా మంది ఆరుబయటే పడుకున్నారు. కానీ వీడి బుర్రలో మున్సబును దొంగదెబ్బ తీద్దామనే ఆలోచనే తప్ప ఎలా దొంగదెబ్బ తీద్దాం అన్నది వూహకి అందకపోడం వల్ల చేతిలో ఏ ఆయుధం లేకపోయింది. అప్పుడే పక్కింటి ప్రహరీ గోడమీద వదులుగా వూడొస్తున్న రాయి కనిపించింది. అది తీసుకొచ్చి మున్సబు దొర నెత్తికేసి కొట్టాడు. ఆ తర్వాత ఏమయింది? అన్నది చూసుకోలేదు. పారిపోయాడు.

మామూలు పరిస్థితిలో అయితే.... రాయి దెబ్బకి మున్సబు 'హరీ' అనుండే వాడే. కానీ దోమ తెరవల్ల.... ఆ రాయి సూటిగా నెత్తికి తగల్లేదు. కానీ తెల్లారేసర్కి మున్సబు

దొర్ని దెబ్బ తీసారని, వూరంతా పొక్కింది. అదృష్టవశాత్తు ప్రాణాపాయం లేదు, దవడా, కన్నూ.... దెబ్బ తిన్నాయన్నారు.

దొంగతనం వేరు.... దొంగదెబ్బ వేరు, దొంగతనానికి అందరూ స్పందించరు... అజాగ్రత్త వల్ల దొంగతనం జరిగింది అనుకుంటారు... పోయినవాడి మీద జాలి పడ్తారు.... దొంగదెబ్బ అలాకాదు. అందులో సందేశానికి జడుపు.... దొంగదెబ్బలో వొడుపుకి, తెగువకి... మొత్తం వూరికి వో సందేసం అందుతుంది.... వూరిలో అనిర్వచనీయమైన ప్రమాద సూచికని యెగరవేస్తుంది. వూరు యేకమయి పరిష్కారం ఆలోచిస్తుంది. అది రాజకీయ పరిష్కారమే!

నాల్రోజుల తర్వాత వూర్లో కొచ్చిన దొంగప్పిగాడ్ని, అనుమానంగానూ, భయం తోనూ, చూసారు వూర్లో వాళ్ళు. వాడు వూర్లో కొచ్చిన రెండ్రోజులకి దొంగప్పిగాడ్ని పోలీసులు పట్టుకెళ్ళారు. వాళ్ళకి తెల్సు వాడే విషయం చెప్పడని, ఓ రోజల్లా స్టేషన్లో వుంచి లాఠీతో సత్కరించి పంపేసారు. వాళ్ళకీ అర్ధంకాలేదు దొంగప్పిగాడి వల్ల వూర్లో వచ్చిన మార్పు!

దొంగప్పిగాడు వూరు చేరేసరికి వాతావరణంలో మార్పొచ్చింది.

దొంగకి అంటే దొంగప్పిగాడికి భయపడ్తున్నారు. బెదిరిపోతున్నారు. దొంగప్పిగాడు దొంగతనం చేసే విధానం కూడా మార్చాడు. ఇప్పుడు వాడు సూదిగా చెక్కిన దుడ్డుకర్ర, దగ్గరుంచుకుంటున్నాడు.... దొంగతనం చేస్తున్నప్పుడు... అడ్డువచ్చిన వాళ్ళని నిర్దాక్షిణ్యంగా మోదెయ్యడం, సూదిములుకుతో పొట్టలో పొడవడం చేస్తున్నాడు....

వొకడికి కాలిరిగింది.... ఇంకోడికి చెయ్యిరిగింది... మరోడికి పొట్ట చిల్లుపడి కుట్లు పడ్డాయి... దాంతో వూరి జనానికి దొంగప్పిగాడంటే హడలు పట్టుకుంది. దొంగతనం చేస్తే చేసాడు.... ఈ దెబ్బ లెవరు భరిస్తారు... అనుకున్నారు.

ఈడ్ని పోలీసుల కప్పచెప్పి... ఈ లాఠీ దెబ్బలు అలవాటు చేసామా? అవి మనమీద ప్రయోగిస్తున్నాడు.... అనుకున్నారు కూడా!

పోలీసులు దొంగప్పిగాడి కోసం తిరిగినా వాడు దొరకలేదు. దొరికిన్నాడు దెబ్బలు తిన్నా... పదో పరకో పోలీసులకి ముట్టచెప్పి... విముక్తి పొందుతున్నాడు.

జనం దొంగప్పిగాడి భయానికి అలవాటు పడిపోయారు. దొంగతనానికి ఎప్పుడో అలవాటు పడిపోయారు.

దొంగప్పిగాడు మునుపటి దొంగప్పిగాడు కాదు... చేవదేరాడు. కండల్తో వయసుతో అతిశయించాడు. ఆ సమయంలో.... దొంగతనానికి వో యింటిలో దిగిన వాడి కళ్ళకి... నీలినీడలు కనబడ్డాయి. అది చూసి తానెందుకొచ్చాడో మర్చిపోయాడు. .....అవాక్కయాడు. వాడిలో కొత్త వుద్వేగం బయలు దేరింది. సీత్కారాలూ... నిట్టూర్పులు... నీలి నీడల కదలికలు .... వాడి అవసరాన్ని తట్టిలేపాయి.

జనంతో వాడికున్న సంబంధం బట్టి... వాడి అవసరం తీరడం కష్టం అయి

కూర్చుంది.

ఓ రోజులో మంచిగా మారలేదు. ఎవరికీ దగ్గర కాలేదు. శరీరం, మనసు వాడి చెప్పుచేతల్లో లేకుండా పోయాయి. నీలినీడల ప్రపంచం... వాడ్ని నిలవనివ్వలేదు.

అలాంటి పరిస్థితుల్లో వాడికి పొలాల మధ్య... గడ్డి మేట్ల మధ్య దొరికిన రెండు మూడు అవకాశాలు... చెంపదెబ్బలుగా మారాయి.

వూర్లో దొంగప్పిగాడికి మొగాళ్ళు భయపడినంతగా ఆడాళ్ళు భయపడ్లేదు. అదీ దోపిడీయే.... ఇదీ దోపిడీయే... దోపిడీలో మానం పోగొట్టుకోడానికి సిద్ధపడలేదు ఆడవాళ్ళు. అయితే తిరస్కారం ఎక్కువవుతున్న కొద్దీ... వాడికి కసిపెరిగింది. టౌను పోయి డబ్బిచ్చుకు కక్కుర్తి పడ్డా... అది వాడికి సరిపోలేదు.

రాత్రుళ్ళు ఇళ్ళలో జొరపడ్డ వాడికి పరిస్థితులు అనుకూలించాయి. కానీ ఆడాళ్ళ మీద చేతులేస్తున్నాడని జనం సహించలేకపోయారు. వాడంటే వున్న భయం కాస్త సడలింది.

దొంగప్పిగాడు కేవలం దొంగతనానికి కాక, ఇలాంటి చిల్లర మల్లర చిలిపిపన్లకి కూడా తన నేర్పు.... వొడుపు చూపుతున్నాడు.

ఇక్కడే వాడి ఆలోచన దెబ్బతింది.... వూళ్ళోవాళ్ళు దొంగతనానికి చలించలేదు... హింసకి తట్టుకున్నారు. అంటే ఆర్థికంగా జరిగే నష్టానికి, శరీరకంగా జరిగే హింసకి పెద్దగా స్పందించని సమాజానికి యే భౌతికశాస్త్ర దృక్పథాన్నో... పద్ధతినో యెలా అన్వయించడం... కుటుంబ స్త్రీ పై జరుగుతున్న అత్యాచారాన్ని... సమాజికంగా జరిగే అవమానానికి తట్టుకోలేక పోయారు. వూరు చలించింది. అంటే వూర్లో వీడిగురించి, పరిష్కారం దిశగా రాజకీయమైన ఆలోచన మొదలైంది అన్నమాట!

వాడీ ప్రయత్నంలో గోవిందంనాయుడు లేని సమయంలో... ఆ ఇంట్లో జొరబడ్డాడు... వాడి వుద్దేశం దొంగతనం కాదు. గోవిందంనాయుడి కూతురు.... రెండేళ్ళుగా కాపరం వదిలేసి తండ్రి దగ్గరే వుంటోంది. వూర్లో ఏవో గుసగుసలున్నాయి. అదే వాడ్ని ప్రేరేపించింది.

అయితే దొంగప్పిగాడి కోరిక తీర్లేదు. పెద్ద గొడవ అయింది. దొంగప్పిగాడు తప్పించుకుపోయాడు.

కానీ గోవిందంనాయుడు సంగతి వాడికి తెల్సు... వూరుకోడు..... కోపం ఎక్కువ.... పరువు తక్కువైపోయిందనే దుగ్ధతో.... పోలీసులకి పట్టిస్తాడా? తనే పట్టుకు కొడ్తాడా? అన్న ఆలోచనతో వారంరోజులు ఎవరికీ కనబడకుండా పోయాడు.

కానీ వాడి ఆటలేం సాగలేదు..... గోవిందంనాయుడు తన మనుషుల్తో మాటేసి... దొంగప్పిగాడ్ని పట్టుకొన్నాడు. వాడ్ని దూరంగా పొలాల్లోకి తీసుకెళ్ళి చెట్టుకు కట్టేసారు. గోవిందంనాయుడు కొట్టగలిగినంత కొట్టాడు... ఆయాసం వచ్చాక పక్కనున్న పాలేరు చేత

కొట్టించాడు. కానీ ఈ కొట్టుళ్ళకి వీడు మారడని తెల్సు .........

ఈ ఇల్లు కాకపోతే ఇంకో ఇంట్లో ప్రవేశిస్తాడు.... వీడు వూర్లో ఆడాళ్ళకి.... ప్రమాదకారిగా మారేడు... ఎంతకొట్టినా మాటాపలుకూ లేకుండా గుడ్లురిమి చూస్తున్న దొంగప్పిగాడి... కళ్ళు పొడిచేద్దామనుకున్నాడు. కానీ అలా చేస్తే మరీ రాక్షసం అవుతుందేమో! అని జంకేడు. కానీ వీడిచేత, ఈ పని మాన్పించడం ఎలా? అదీ గోవిందంనాయుడి ఆలోచన.....

ఆలోచనల్లో ఆలోచనగా మెరుపులాంటి పరిష్కారం తట్టింది గోవిందనాయుడికి....

వాడ్ని కొడుతున్న పాలేర్ని ఆపి వాళ్ళ చేతుల్లో బలమైన బండకర్ర పుచ్చుకుని.... దొంగప్పిగాడి మోకాలిమీద కొట్టాడు. ఆ కొట్టుడికి దొంగప్పిగాడి మోకాలి ఎముక చిట్లి పోయి కాలు వేలాడింది.

దొంగప్పిగాడు అరచిన అరుపుకి, అందరి వొళ్ళూ జలదరించింది. అప్పటికి గోవిందంనాయుడి మనసులో ఏముందో అర్థం చేసుకున్న పాలేర్లు .... గోవిందంనాయుడ్ని పట్టుకున్నారు. లేకపోతే వాడి రెండోకాలు విరిగేదో.... బుర్రపగిలేదో....

కాలిరిగిన దొంగప్పిగాడ్ని హాస్పటల్లో జాయిన్ చేసారు. వాడి విషయం మర్చిపోయారు.

రెణ్ణెల్లపాటు వూరు వూపిరి పీల్చుకుంది.

దొంగప్పిగాడి కాలు బాగవలేదు. మోకాలి చిప్ప బాగా దెబ్బతింది. దొంగప్పిగాడు కుంటప్పిగాడై వూర్లో కొచ్చేసరికి, వూరు నిశ్చింతగా వుంది. కానీ కుంటప్పిగాడి మనసు రగిలిపోతోంది.

కుంటప్పిగాడికి దొంగతనాలు చెయ్యడం కష్టం అయిపోతోంది. అప్పుడో కోడి.... అప్పుడప్పుడు బట్టలు దొంగతనం చేసినా వాడి తీట తీరటం లేదు.

అన్నింటికీ మించి వూరు వాడికి భయపడ్డం మానేసింది. దీనంతటికీ కారణం గోవిందంనాయుడు. నాయుడిమీద కసి తీర్చుకోవాలి! అప్పుడు మళ్ళీ వూరు భయ పడ్తుంది....... అదీ వాడి ఆలోచన.....

కుంటప్పిగాడి సైతాను బుర్ర చాలా చురుగ్గా పనిచేసింది. ఏవేవో ఆలోచన్లు.... ఏవేవో కసి తీర్చుకునే మార్గాలు కనిపెట్టాడు. వాడికి కాలం కలిసొచ్చింది. గోవిందం నాయుడు కుటుంబంతో సహా తిరుపతి పోయాడు. ఇంటికి తాళం పెట్టాడు. ఇంటి కాపలాకి వో పాలేర్ని పెట్టాడు. పదిరోజుల వరకూ రాడు. అదీ వాడికి దొరికిన అవకాశం....

పాలేరు సంగతి కుంటప్పిగాడికి తెలుసు. ఇంటిదగ్గర చుక్క..... ముక్క దొరికిన్నాడు... వీడు కాపలా కెళ్ళడు. దొంగప్పిగాడు... కుంటయిన దగ్గర్నించి దొంగతనాల భయం కూడా తగ్గింది.

పాలేర్ని గమనిస్తున్న కుంటప్పిగాడికి ఎదురుచూసిన రోజు వచ్చింది. ఆ రోజు రాత్రి పాలేరు నాయుడింటికి వెళ్ళలేదు. కుంటప్పిగాడు రంగంలోకి దూకాడు. గోవిందంనాయుడు ప్రహరీలోకి ప్రవేశించాడు. ఇంటిచుట్టూ తిరిగాడు. ఎక్కడా ఏ కిటికీ రెక్కా తెరిచి మరచిపోయిన జాడలేదు. వాడికి ఇంటి సంగతి తెల్సు.

ఇంటి చుట్టూ తిరిగి, గోవిందంనాయుడి పడకగది కిటికీ దగ్గర చేరి.... ఆ తలుపు రెక్క తోసాడు. అది తెర్చుకోలేదు. గోవిందంనాయుడు అందం కోసం తలుపు రెక్కల పైన గాజు ప్లాంక్స్ వేయించాడు. అందులో వొక ప్లాంక్ విరగ్గొట్టాడు అప్పిగాడు. ఆ విరిగిన తలుపులోంచి గదిలోకి టిన్నుతో తెచ్చిన కిరసనాయిలు అంతా వంపేసాడు. కిరోసిన్ అంతా గదిలో పోసాక, ఓ చిన్న కర్రముక్కకి గుడ్డచుట్టి, మిగిలిన కిరోసిన్‌లో ముంచి, అగ్గిపుల్ల గీసి అంటించి, కిటికీలోంచి లోపలికి పడేసాడు. గదంతా మంటతో గుప్పుమంది. గదంటుకుంది. పక్కలు పరుపులు, బట్టలు అంటుకున్నాయి... కాల్తున్నాయి.... మంటలు రేగుతున్నాయి. మంటలు పూర్తిగా రేగి, పక్కింటి వాళ్ళకి, వీధిలో వాళ్లకి తెల్సేసరికి, గదిలో చాలా భాగం కాలిపోయింది.

తెల్లారేసరికి వూరంతా గుప్పుమంది గోవిందంనాయుడి ఇల్లు కాలిపోయిందని.

గోవిందంనాయుడిది డాబాఇల్లు... ఎలా కాలిందీ అంటే ఎవరూ చెప్పలేకపోయారు. ఎవరేనా కావాలని చేసారా? అంటే.... చూసిన ప్రతీ వాళ్ళూ చెప్పేయగలరు. ఎవరో కావాలనే ఇల్లు కాల్చారని, ఎవరై వుంటారో కూడా అందరికీ తెలుసు. అలాంటి సైతానుబుర్ర వున్నది వొక్క కుంటప్పిగాడికే... అందుకే ఈ పని కుంటప్పిగాడి పనే అన్నది కూడా నిశ్చయం అయిపోయింది.

ఇల్లు కాలిన రెండోరోజుకి గోవిందంనాయుడు గుండుతో సహా వూర్లో కొచ్చాడు. ఇంట్లో కెళ్ళాక పడకగదిని చూసే సరికి గుండెలవిసి, వెన్ను జలదరించింది.

ఇల్లంతా పొగవాసన.... గది చమురుకంపు. సగం కాలిన పరుపు.... మసిబారిన గోడలు. గదంతా భయంగొల్పేట్టుగా వుంది. అదే గదిలో ఎవరేనా పడుకుంటే... వాళ్ళు కూడా కాలిపోయుండేవారా! కుంటప్పుడు గ్రామానికి ప్రమాదకారిగా మారాడని అర్థం చేసుకున్నాడు. కుంటివెధవైనా సైతాన్ బుర్ర. వీడ్నేం చెయ్యాలి? ..... దెబ్బలకి జడవడు... పోలీసోళ్ళ భయంలేదు. ఎప్పుడే వూర్లో వుంటాడో తెలీదు. .... ఇంతకు ముందు దొంగతనం వల్ల వాడికి లాభించేది.

ఇప్పుడు లాభనష్టాలతో పనిలేదు. కసి! కాలిరగగొట్టినందుకు కసి పెట్టుకున్నాడు. ఎన్నాలోచించినా.... వాడ్నేం చెయ్యాలో.... ఎలా వదిలించుకోవాలో అర్థం కాలేదు. వూర్లో అందరికీ గోవిందంనాయుడిల్లు కుంటప్పిగాడు కాల్చేసాడని తెలిసిపోయింది. చాలా మంది చూడ్డాని కొచ్చారు. చూసి వాడు చేసిన ఘాతుకానికి భయపడ్డారు.

పోలీసులొచ్చారు. జరిగిందంతా చూసారు. కుంటప్పిగాడ్ని పట్టుకుంటామన్నారు.

పోలీసులెంత వెదికినా వాడు దొరకలేదు. దొరికినా పోలీసోళ్ళు వొళ్ళు హూనం చేసి వదలిపెడ్తారు. ఆ దెబ్బలు వాడికి ఖాతరు లేదు. గోవిందంనాయుడు ఇన్‌స్పెక్టర్ని కలుసుకుంటే... అదే చర్చ కొచ్చింది. వాడు బతికుండగా వూరికి ముప్పే అన్నది, ఇద్దరికీ అర్థం అయింది. ముప్పు పెంకుటిళ్ళు, డాబా ఇళ్ళు వున్న వాళ్ళకి కొంతే అయినా గుడిసెల్లో వాళ్ళకి మరీను, వీడిళ్ళు కాల్చేస్తే మొత్తం పేటంటుకుంటుంది. చాలా మంది జీవితాలు బుగ్గిపాలై పోతాయి. ప్రజలంతా టెర్రరైజ్ అయిపోయారు, అనుకున్నారిద్దరూ, "మీ వూరంతా కల్సి వాడ్ని ఏం చేసినా, మేం పట్టించుకోం' 'బెటర్ టు ఎన్‌కౌంట్ హిజ్ ఫూలిష్‌నెస్...." అన్నాడు ఇన్‌స్పెక్టరు.

వూరంతా కల్సి వాడ్నేం చెయ్యాలి? ఏదేనా చెయ్యడానికి వూరంతా కలుస్తుందా? వూరసలే భయపడింది. గోవిందంనాయుడు మొత్తం గుడిసెలో వాళ్ళని పిలిచి విషయం వివరించాడు.

..... వీళ్ళ అవసరం యెంతేనా వుంది... నష్టపోయింది గోవిందంనాయుడే. కానీ అది వూరందరి కష్టంలా చూపించాలి... సానుభూతి సంపాదించాలి... జరిగిన సంఘటన వొకడి సమస్యా.... వూరందరిదా?.... ఇదే రాజకీయం... ఎవరూ ఏం చెప్పలేకపోయారు.... కానీ వాడివల్ల వూర్లో వాళ్ళకి ప్రమాదమే అన్న సంగతి వొప్పుకున్నారు. గుడిసెల్లో వాళ్ళు మరీ బెంబేలెత్తిపోయారు. ఇలా వాడి గురించి చెడుగా చెప్పుకున్నాం అని తెలిస్తే! వాడేం చేస్తాడో? గుడిసెల్లో వాళ్ళు కాపలాకి, వో మనిషిని పెట్టుకున్నారు. అయినా భయం తీర్లేదు.

ఆ సమయంలో కుంటప్పిగాడు పక్కూర్లో దొరికిపోయాడు. గోవిందంనాయుడు వాడ్ని వూరి పొలిమేరకి పట్టుకురమ్మని పాలేర్లకి చెప్పి.... వూర్లో వాళ్ళకి కబురెట్టాడు. వూరంతా కూడి కుంటప్పిగాడ్ని చేరుకునే సర్కి, పాలేర్లు వాడ్నో చెట్టుకి కట్టేసారు.

వాడికి దొరికిన భయంలేదు సరికదా... గోవిందంనాయుడ్ని చూసి వెర్రి నవ్వొకటి నవ్వాడు. గోవిందంనాయుడ్కి వొళ్ళు మండింది.

"నీకు రోజులు దగ్గర కొచ్చేసాయిరా లమ్డీకొడకా"! అంటూ చేతికర్రతో వొకటేసాడు.

వాడ్నేం చెయ్యాలి? వాడుండగా గ్రామానికి ముప్పే..... అన్న చర్చ జరిగింది. అప్పటికి చీకటి పడింది. కాగడాలొచ్చాయి.

చర్చలో భాగంగా ఎవరో 'కళ్ళుపొడిచెయ్యండర్రా... ఆడికి లోకం చీకటై పోద్ది. ఆడు కసి తీర్చుకోనేడు.... ఇంకాడి బ్రతుకంటారా? వూళ్ళల్లో అడుక్కుతింటాడు..... ఏం పర్వాలేదు". అన్నారు.

తనని నిస్సహాయంగా చెట్టుకి కట్టి కళ్ళు పీకుదామా? కాళ్ళిరగకొడదామా? అని చర్చించుకుంటున్న ప్రజల్ని చూస్తే వొళ్ళు మండింది.... వాడికి కొంచెం భయపడ్డాడు కూడా...

'హొరేయ్ కళ్ళుపీకేసినా, మీరెవరో నాకుతెల్దా... మీ ఇళ్ళకి అగ్గెట్టేస్తా... అర్ధరాత్రి అగ్గెట్టేస్తా జాగ్రత్త' ! అంటూ బెదిరించాడు.

అక్కడ చేరిన జనానికి అదొట్టి బెదిరింపు కాదని అర్ధం అయింది. 'ఆడన్నంత పనీ చేస్తున్నాడు. సైతాన్ ముండాకొడుకు. ఇంకా ఆలోచననేందిరా... ఏసెయ్యండి.. తర్వాత చూసుకుందాం' అన్నారు ఎవరో...

అప్పటికే కోపంతో వూగిపోతున్న జనంలో వొకడు వీడు బతికుండగా మన ప్రాణానికి ముప్పు తప్పదు అంటూ నాలుగు దెబ్బలేసాడు. అందులో వొకటి కుంటప్పిగాడి నెత్తిమీద పడింది... వాడు బుర్ర వేళ్ళాడేసాడు.

'ఆడు చస్తే కేసవుద్ది.... లేనిపోని గొడవ.... నా కళ్ళెంలో కట్టెలున్నాయి... తెచ్చి అంటించేయండ్రా' అన్నాడు గోవిందంనాయుడు.

'నిజమే వీడు బతికుంటే భయం.... చస్తే కేసు.... ఎందుకొచ్చిన లంపటం... అతుకెట్టేయండి పీడా పోద్ది.''.... అనుకున్నారు.

కట్టెలొచ్చినయ్.... డబ్బాడు కిర్సనాయిలొచ్చింది. కట్టెలు వాడిచుట్టూ వేసి కిర్సనాయిలేసి మంటపెట్టేసారు. మంటలు పైకిలేచాక, వాడికి తెలివొచ్చింది. వాళ్ళు తనని కాల్చేస్తున్నారని అర్ధం చేసుకున్నాడు. గింజుకున్నాడు. తాళ్ళు రాలేదు. వాడ్ని తాళ్ళతో కట్టలేదు. వైర్లతో కట్టారు. వైర్లు కాలవు........ వొదులవ్వు..... తిడుతున్నాడు. .....కసితీరా తిడుతున్నాడు. పచ్చినిజాలు తిట్లుగా తిడుతున్నాడు.

"నేనూ మీవాడ్నేరా లండీకొడుకుల్లారా.... వదలండ్రా'' అంటూ గింజుకుంటూ, కాసేపటికి వుడికి, దహించుకు పోయి.... మాడి.... మసైపోయాడు.

పెట్రోమాక్సు లైట్లొచ్చాయి..... వాడ్ని కాల్చేసిన 'నిషానా' లేకుండా చేసేసారు.

తెలతెలవారుతుండగా ఎవరిళ్ళకి వాళ్ళు చేరుకున్నారు.

ముల్లప్పారావుని అతుకెట్టేసినట్టు..... ఇన్స్పెక్టర్‌కి కబురందింది.... ఎవరెవరు చేసారో కూడా పోలీసులకి యెరుకయ్యింది..... కానీ.... వారి ధర్మానికి లోటు రానివ్వకుండా... జీపేసుకు వచ్చి..... ఎంక్వరీ చేసారు. ..... ఎంక్వైరీ చేస్తూనే వున్నారు. ఫైలు మూసేసే వరకూ ఎంక్వైరీ చేస్తూనే వుంటారు.

వూరికి ముల్లు బాధ తీరింది ఎలా? అన్నదే ఆలోచించవలసిన విషయం...........!

ముల్లు *(విపుల, ఫిబ్రవరి 2009)*

# స్వీకృతి

రోహిణి శాయి ప్రేమించే పెళ్ళి చేసుకున్నారో, పెళ్ళిచేసుకుని ప్రేమించుకున్నారో తెలీదుగాని, పెళ్ళయ్యాక పాతకాలం వాళ్ళ దృష్టిలో పాలునీళ్ళల్లాగ, కొత్తతరం వాళ్ళ దృష్టిలో విస్కీసోడాలుగా కలిసిపోయి, కానివాళ్ళ కళ్ళల్లో నిప్పులు, అయినవాళ్ళ మనసుల్లో ముచ్చట పడేంత అందమైన, అనుకూలమైన జంటగా ప్రసిద్ధి చెందారు. అందుకే వీళ్ళకో వరాలపంట సిద్ధం.

ఇద్దరి అన్యోన్నాన్ని చూసి ముచ్చట పడేవారి లిస్టులో యెదురింటి పిన్నిగారొకరు. పిన్నిగారింటిలోనూ వో వరాల పంట సిద్ధమౌతోంది. వరసలు కలిపేసే వరవడికలవారి తరంలోది కాబట్టి, రోహిణిని కూతురి స్థానంలో కూర్చోబెట్టి, తన కోడలు, కూతురు వరాల పంటల్ని ఎప్పుడిస్తారా! అని ఆనందంతో తబ్బిబ్బవుతోంది. ఆవిడ, ఆనందానికి తగ్గట్టుగానే రోహిణికి ఎదురింటి పిన్నిగారంటే గౌరవం. ఆవిడిచ్చే పిండివంటలు రుచిగా వుంటాయన్న అభిప్రాయమూ వుంది.

కోడలి కోసం యేం చేసినా యేం తెచ్చినా "నా కూతురి వాటా" అంటూ రోహిణి వంతు ఠంచనుగా రోహిణికిచ్చి తన పెద్దరికం, అభిమానం ఢంకా మోగించి చూపేది పక్కింటి పిన్నిగారు.

పక్కింటి పిన్నిగారు రోహిణికి యేం యిచ్చినా రోహిణి కన్నా ముందు, శాయి రుచి చూడడం పరిపాటి. శాయి పక్కింటి పిన్నిగారి వంటకాలకి అలవాటు పడి "ఈ రోజు మీ పిన్నిగారు యేం పంపలేదా?" అంటూ వాకబు చెయ్యడం... "చూసావా పెళ్ళాం కడుపుతో వుండడం నీకే లాభం.... రుచి అన్న పేరుతో మూడొంతులు నువ్వే తినేస్తున్నావు" అంటూ రోహిణి దెప్పడం... "నీ కేరియింగ్‌కి సగం కర్తని నేనే కదోయ్, నీ కొచ్చే వన్నింటిలో సగం వాటా నాదే" అంటూ శాయి సినిమా స్టయిల్లో గడుసుపోడం ఆ యింట్లో నిత్య వేడుకైంది.

అయితే శాయి గడుసుతనాన్ని దెబ్బతీయగల సత్తా రోహిణికుందని శాయికి తెలీదు. అందులో భాగంగానే "శాయీ పిన్నిగారు మల్లెచెండిచ్చారు. సగంనీది కదా నాకంటే జడుంది. పెట్టుకుంటా! నీకెక్కడ పెట్టను. సుల్తానుగారు చెప్పినట్టు తలకి మేకు కొట్టి పెట్టనా?" అనడిగేది నవ్వుతూ.

యింకోసారి శాయి నిద్రలేచేసరికి చేతికి గలగల్లాడుతూ గాజులు కనిపించాయి "యిదేమిటి?" అని ఆశ్చర్యపోయిన శాయిని చూసి "యెదురింటి పిన్నిగారు వాళ్ళ కోడలికి గాజులేయించారు. నాకూ వో డజను గాజులిచ్చారు. అందులో సగం నీకు కదా నీ సగం నీకు తొడిగేసా, ఫర్వాలేదు వుంచుకో" అంటూ చిలిపిపోతున్న రోహిణి, శాయి మనసుకి హాయిని, వూహలకి కలల దూకుడ్ని కలిగించి, యిద్దర్నీ మరిగించి, మరుకేళి

రసానందంలో ముంచెత్తేవి.

ఇద్దరి అందమైన కలా రంగుల చిత్రంగా రూపుదిద్దుకుంటున్నదనే ఆనందపు వూహాలకి, పక్కింటి పిన్నిగారి అభిమానపు పోకడ్లు శాపంగా వెన్నాడతాయని తట్టలేదు. తట్టే అవకాశం లేదు కూడా!

రోహిణికి తొమ్మిదోనెల రాగానే, పల్లెటూర్లో సరైన ఆస్పత్రి సదుపాయాలు వుండవని, పురిటికి సాయంకోసం, అత్తగార్నే తమ దగ్గరకు రప్పించాడు శాయి. రోహిణి తల్లి రోహిణికి పురుడుపోసిన తర్వాత, వో పదిరోజులు మాత్రం రోహిణి దగ్గర ఉండి, పురిటి స్నానం అవగానే రోహిణిని చూడ్డానికి వచ్చిన బంధువులతో వెళ్ళిపోయింది.

రోహిణి పాపకి "కృప" అని పేరు పెట్టింది. తెల్లటి పొత్తిళ్ళలో విడీవిడని పిడికిళ్ళతో కృప నిజంగా కృపారసం మూర్తీభవించినట్టుగా వుంది.

రోహిణికి పురుడొచ్చిన రెండోరోజే, యెదురింటి పిన్నిగారి కోడలు, మగపిల్లవాడ్ని కంది. పిన్నిగారు మనవడ్ని చూసుకోవాలని తొందరపడడంతో, కోడలు పుట్టింటివారు బాబుకి నెలరోజులు దాటకుండా తీసుకొచ్చి దిగబెట్టారు.

రోహిణి కష్టాలు పురిటినొప్పులతో తీరాయో, మొదలయాయో అర్థంకాలేదు. రోజులు గడుస్తున్నా కృప తనంతట తాను పాలు తాగే ప్రయత్నం చెయ్యలేదు. యెన్నోసార్లు కృపనోట్లో రొమ్ము పెట్టి, చప్పరించేటట్టు చేయడానికి ప్రయత్నం చేసింది రోహిణి, కానీ కృపలో ఆ ప్రయత్నం యేదీ కనిపించలేదు!

యెదురింటి బాబు రావడంతో కృప పాలు తాగలేకపోతోందన్న అనుమానం, బాబుని గమనించి తెలుసుకోవచ్చని రోహిణికి తట్టింది. గుండెల్ని తడుముతూ పాలు తాగే బాబు చిలిపి చేష్టలు, కళ్ళవెలుగూ, కృపలో లోపించాయని అర్థం చేసుకుంది. అదే విషయం శాయితో చెప్పింది. "అందరు పిల్లలూ వొకలా వుండరు" అంటూ రోహిణి అనుమానాన్ని కొట్టిపారేసాడు శాయి.

కానీ శాయిని హెచ్చరించడానికా అన్నట్టు కృప ఆరోగ్యం చెడింది. యిన్‌డైజెషన్ వల్ల విపరీతంగా విరోచనాలు అయాయి. కృప ఆరోగ్యం చెడడానికి కారణం పోతపాలేమో అన్న అనుమానం వచ్చింది యిద్దరికీ, యెదురింటి పిన్నిగారు కూడా అదే అనుమానాన్ని వెలిబుచ్చారు. కానీ రోహిణి చెప్పినట్టు కృపకి పాలు తాగడం రాలేదు అన్న సమర్థనని పట్టించుకోలేదు. "చిన్న పిల్లలకి నాలుగైదు రోజుల నుండి చీకడం అలవాటవుతుంది. పాలు తాగకపోడం యేమిటి! రోహిణి అందం పాడైపోతుందని పిల్లకి పాలివ్వకుండా, పోతపాలు అలవాటు చేసి యిలా చెప్తోంది. ఈవిడ అందం మాట యెలా వున్నా, పిల్ల ఆరోగ్యం చెడగొట్టారు" అంటూ కోడలి దగ్గర బాధపడింది పిన్నిగారు.

డాక్టరు కృపని పరీక్షచేసి విరోచనాలకి మందిచ్చి కృపకి రిఫ్లెక్స్ యేక్షన్స్ సరిగా లేవని యేదేనా న్యూరోసర్జెన్ దగ్గరకి తీసుకెళ్ళమని సలహా యిచ్చాడు.

కృపకి అజీర్ణం తగ్గింది కానీ మామూలు పిల్లల్లా లేదు. కృపలో లోపం యిద్దరినీ కృంగదీస్తోంటే.... యెదురింటి పిన్నిగారు "మనవడు బోర్లాపడ్డాడు" బొబ్బట్లు చేసాం అంటూ దంపతులిద్దరికీ చెరి రెండు బొబ్బట్లు తెచ్చి యిచ్చింది.

రోహిణికి బోర్లాపడ్డం అంటే యేమిటో అర్ధం కాలేదు. వెళ్ళిచూసింది. బాబు కేరింతలు కొడుతూ అతి కష్టం మీద బోర్లా పడ్తున్నాడు. యెటు బోర్లా పడ్తున్నాడో ఆ పక్క చెయ్యి పొట్టకింద వుండిపోతోంది. దాన్ని తీసుకోడం సాధ్యం కాక, కేర్ కేర్ మంటున్నాడు. రెండురోజులు బోర్లాపడ్డా చెయ్యి తీసుకోలేక "కేర్ కేర్" మన్న బాబు మూడోరోజు నుండీ చెయ్యి పొట్ట కింద నుండి తీసి కాళ్ళూ చేతులూ గాలిలో వూగిస్తూ, ఆనందపడుతున్నాడు, యేదో సాధించానన్న వాడి ఆనందం కళ్ళల్లోనూ, నోటిలోంచి జారుతున్న చొంగలోనూ, వాడి కేరింతల్లోనూ స్పష్టంగా కనబడుతోంది.

నాలుగైదు రోజులుగా బాబుని గమనిస్తున్న రోహిణి, బాబులో చురుకుదనం, కళ్ళల్లో మెరుపు కృపలో వెదుకుతోంది. కృప బోర్లాపడ్డం లేదు సరికదా యెక్కడ పడుకోబెడ్తే అక్కడ నిర్లిప్తంగా చూస్తూ పడుకుంటోంది. కృప కళ్ళు వెలుగుతున్న దివిటీల్లాకాక ఆరిపోయిన గాజు బల్బుల్లా వున్నాయి. తను ప్రయత్నం చేస్తే కృప బోర్లాపడ్డం నేర్చుకుంటుందేమో? అని కృపని బోర్లా తోసింది. కృప బోర్లాపడింది. కానీ పడ్డది పడ్డట్టే వుంది. పొట్టకింద చెయ్యి తీసుకోలేదు. చెయ్యి నొప్పెట్టిందని యేడవనూ లేదు. అన్నింటికీ మించి బాబు శరీరంలో నిగారింపు, చేవ కృప శరీరంలో కనిపించలేదు. కృప శరీరం జవ జవలాడుతూ జజ్జుపడి మెత్తగా వుంది. యేదో బల్లినో తొండనో ముట్టుకున్న అనుభూతి కలిగింది రోహిణికి.

కృప విషయంలో ఆందోళన చెందుతుండగా, మళ్ళీ కృప ఆరోగ్యం చెడింది. డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళారు. డాక్టరు యెక్కువ శ్రమతీసుకోకుండా "కృప మెంటల్లీ రిటార్టెడ్. ఈ తరహా సమస్యలు సామాన్యం" అని చెప్పాడు.

డాక్టరు నిర్ధారించి చెప్పిన విషయం ఇద్దరికీ షాక్‌లా తగిలింది. కృప ఆ విధంగా పుట్టడం తమ బ్లడ్ కల్చర్‌లో లోపమే అని తెలిసి కుంగిపోయారు. "కృప మెంటల్లీ రిటార్టెడ్" అన్న నిజం మనసులో యింకడానికి చాలా సమయం పట్టింది. యింక పిల్లల కోసం ప్రయత్నం చెయ్యకూడదనే నిర్ణయానికొచ్చారు యిద్దరూ!

కృప విషయంలో నిరుత్సాహపడక మంచి ఫిజియో థెరపిస్టుకి చూపించారు. కృపని చాలా రకాలుగా పరీక్షచేసి, "కృపలో ఐక్యూ యాభై శాతం మాత్రమే వుందని, యిలాంటి వాళ్ళని మోడరేట్లీ డిజేబుల్డ్ లెక్కలో వెయ్యొచ్చని అంచేత కృపని స్లో లెర్నర్‌గా పరిగణించవచ్చని, యిలాంటి పిల్లలకి మామూలు పిల్లలకంటే భిన్నంగా మైల్ స్టోన్స్ చాలా ఆలస్యంగా అలవడతాయని, వాళ్ళల్లో ప్రేరణ, గ్రహణశక్తి తక్కువగా వుంటుంది. కాబట్టి ప్రతి పనినీ వొకటికి పదిసార్లు ప్రాక్టీసు చేయిస్తే వాళ్ళు నేర్చుకుంటారని" చెప్తూ

కృపచేత చేయించవలసిన యెక్సర్‌సైజెస్ కొన్ని చెప్పాడు.

ఆ రోజు నుండీ రోహిణీ, శాయి కృప మీద శ్రద్ధ చూపిస్తూ, ప్రతి విషయం నేర్పడం మొదలుబెట్టారు. అందులో భాగంగా కృప కూర్చోడం నేర్చుకుంది.

నేర్చుకోడం, నేర్పడం క్రియల్లో తేడా ప్రకృతి, వికృతి! వికృతి ఎప్పుడూ వికృతే, వికృతిలో మొండితనం, వెకిలి వుంటాయి. అందుకే తనకిష్టం లేనప్పుడు కూర్చోపెడితే కీచుపెట్టి అరిచేది. కూర్చోనని మొండికేసేది.

అదే సమయంలో యెదురింటి పిన్నిగారు, మనవడు పాకురుతున్నాడు పాకుండలు చేసాము అంటూ షీలు బాక్సునిండా పాకుండలు తెచ్చి యిచ్చింది. యిచ్చింది యిచ్చినట్టూ వూరుకోకుండా "మీ కృప యేం చేస్తోంది?" అంటూ వివరాలడిగింది.

"కృప ఆరోగ్యం బాగుండడంలేదు కదండీ, మెల్లగా నేర్చుకుంటుందట డాక్టర్లు చెప్పారు" అంటూ సమాధానం చెప్పింది రోహిణి.

ఆ సమాధానం యెవర్ని సమాధానపరచడానికి, పిన్నిగారి మొహంలో "ఆ! యింకేం నేర్చుకుంటుందిలే..." అన్న అపనమ్మకం తొంగి చూస్తే.... రోహిణి మనోకుహరాల్లో తను చెప్పిన సమాధానం మీద తనకెంత నమ్మకముంది? అన్న అనుమానం తచ్చాడింది. ఆ అనుమానం నిట్టూర్పులా మారే ప్రమాదాన్ని నివారించడానికా అన్నట్టు, పెదవుల మీద చిన్న చిర్నవ్వు అతికించుకునేది.

పక్కింటి బాబు రోహిణికి మనఃశాంతి లేకుండా చేసాడు. రోహిణిని చూపించి, పక్కింటి పిన్నిగారు బాబుతో "అత్తకి జేజి పెట్టామ్మా" అని చెప్తే బాబు తన చిన్నారి చేతుల్ని నుదిటి మీద పెట్టుకు, తలవంచి రోహిణికి జేజి పెడ్తూ పోయిన పోకడలు.... ముద్దులు మూటకట్టేవి!

అదే విధంగా కృప చెయ్యెత్తి బొటనవేలు నోట్లో పెట్టుకు, తల వంచేది. ఆ తల వంచడంలో వెకిలితనం, కళ్ళల్లో లేకితనం స్పష్టంగా కనబడి, రోహిణి మనసు వూసూరుమనేది.

కానీ వుసూరుమంటున్న మనసుకి వూరట కలిగించుకునే విధానం కనిపెట్టింది. అందులో భాగంగానే "శాయీ నీకో గుడ్ న్యూస్" అంటూ యెదురెళ్ళింది శాయికి వో సాయంత్రం.

అలసి సొలసిన శరీరానికి వుపశమనం మానసికోల్లాసమే! అదీ కృపలో లోపంతో కృంగిన రోహిణి వుత్సాహంతో యెదురవడం అతని కెంతో ఆశ్చర్యం కలిగించింది.

సోఫాలో కూర్చుంటూ "యేమిటి చెప్పు" అన్నాడు.

రోహిణి వుత్సాహంగా "మీ అమ్మాయికి సమయానికి పాలివ్వకపోతే కోపం వస్తోంది. పాలడబ్బా చూపించి టైమైంది పాలివ్వవేం అన్నట్టు గదమాయిస్తోంది.... " అంది.

శాయికి కుతూహలం పెరిగి "యేం జరిగింది" అంటూ ప్రశ్నించాడు. కృప కొంచెం తెలివితేటలు చూపిందన్నా, అతని మనసు సంతోషిస్తుంది.

తన అవసరాలను గుర్తించే బుద్ధికుశలత కృపలో పెరిగిందీ అంటే అతనికి మహాదానందంగా వుంది.

శాయి ప్రశ్నకి కుతూహలానికి సంబరపడిన రోహిణి "కృపకి పాలు కలుపుదామని అన్నీ తెచ్చి సెంట్రల్ టేబుల్ మీద పెట్టి, టి.వి. చూడ్డంలో మునిగిపోయా, కాసేపటికి కృప నా చీర చెంగు లాగుతూ చేతిని సెంట్రల్ టేబుల్ వేపు చూపించి కేరుస్తోంది. యేమిటా అని చూస్తే కృపకి పాలివ్వలేదని తట్టింది" అంది.

ఇది అందమైన చిత్రం.... సహజమైన చిత్రానికి తేడా వుంది. కృప డిజేబుల్డ్ అనే కన్నా స్లో లెర్నర్ అనచ్చు.... వూహ పెరగడం ఆలస్యం కాని అవిటితనం మాత్రం కాదు. ఆ ఆలోచనే అతనికి ఆనందాన్నిచ్చింది.

యేడాది తిరక్కుండానే మా బాబు అడుగు లేస్తున్నాడంటూ అరిసెలు పట్టుకొచ్చింది, పక్కింటి పిన్నిగారు. రోహిణికి యెవరో నెత్తిమీద మొట్టినట్టయ్యింది. యేడాదయేసరికి కృపకి కూర్చోడం మాత్రం వచ్చింది. దానితో పాటూ వెకిలి చేష్టలు కూడా వచ్చాయి. రోహిణి కృపతో యెన్నో ప్రాక్టీసు చేయిద్దామనుకుంది. కాని కృప నేను చెయ్యను అంటూ బుర్రూపేది. ఆ వూపడానికి అంతంటూ వుండేది కాదు. బుర్రూపకుండా ఆపడానికి చిన్న దెబ్బేసేది. ఆ దెబ్బ పడగానే కృప మంకుగా యేడుస్తూ కూర్చునేది. ఆ యేడుపు, వెకలితనం చూసి రోహిణికి ఏడుపొచ్చేది. కాని ఏడుపు వల్ల తీరే సమస్య కాదని అర్థం అయాక కృపని అనునయించి, లాలించి, వూరుకోబెట్టేది.

యే రోజైనా కృప మూడు బావుండి, తల్లి చెప్పినట్టు వింటే, ఆ రోజు రోహిణికి పండగే, రోహిణికి పండగైతే శాయికి చిందులే!

కృప విషయంలో చిన్న చిన్న విషయాలు కూడా విశేషాలయేవి. అందులో భాగంగా "శాయీ, మీ అమ్మాయికి బొమ్మలు కావాలట" అంది.

"దానికి మాటలే రావు బొమ్మలెలా అడుగుతుంది. నీక్కావాలేమో, ఆడుకోడానికి..." అన్నాడు శాయి రోహిణిని హాస్యం చేస్తూ... హాస్యం పట్టించుకోకుండా "కాదు ఎదురింటి బాబు చేతిలో నుంచి బొమ్మ లాక్కుంది. వాడు ఒకటే ఏడుపు. వాళ్ళమ్మ "బొమ్మపట్టుకు దాని దగ్గరకెళ్ళకురా. పాకరడం అంటే రాలేదు గాని, బొమ్మతో ఆడుకోవాలని వుండదా?" అంది. నేను కృప దగ్గర నుండి బొమ్మ తీసుకుని బాబు కిచ్చేసాను. నేను బొమ్మ తీసుకుంటే కృప వొకటే ఏడుపు....." అంటూ యేవేవో చెప్తోంది రోహిణి. కృప చేస్తున్న డిమాండ్‌కి సంతోషంతో పొంగిపోతోంది. కృప కూడా మిగతా పిల్లల్లా పుట్టి పెరిగితే రోహిణి ఆనందం హద్దులు దాటేదేమో! పిల్లల పసితనపు చేష్టలకి, వాళ్ళ అమాయకపు డిమాండ్లకి యే తల్లితండ్రులు సంతోషించరు. కృపలో పసితనపు అందాల్ని,

గడుసుదనపు వూహల్ని వెదుక్కోవలసి వచ్చినందుకే యీ బాధ. అలాకాక కృప ఆనందంగా అల్లరి చేస్తూ యింట్లో తిరిగితే యింటికి అందాన్ని, మనసుకి హాయిని కలిగించేది కదా అనుకున్నాడు శాయి. కానీ అసలు సమస్యని అర్థం చేసుకోలేకపోయాడు.

గోడలు పట్టుకు నడుస్తున్న బాబు వాళ్ళ ఫ్లాటు దాటి మెట్లవేపు వెళ్ళిపోయాడని పక్కింటి పిన్నిగారు చేసిన హడావిడి, వాడు యింట్లో వస్తువుల్ని లాగేస్తూ, వాళ్ళమ్మని నిలబడనీయకుండా చేస్తున్న అల్లరిని.... పక్కింటి పిన్నిగారు వర్ణిస్తోంటే... రోహిణి మనసు గింగుర్లెత్తి, కుంపట్లో వేసిన మిరపకాయల్లా సురసురలాడిపోయింది.

కాలిన పెనంమీద నీటి చుక్కలా బాబులో చురుకుదనం, రోహిణి మనసుని కలవరపెట్టేది. కృపలో ఆ చురుకుదనం వెదికేది. ఆ క్షణం కృప మామూలు పిల్లకాదు అన్న విషయం మర్చిపోయేది. చురుకుదనంకి బదులు వెకిలి చేష్టలు, మంకుతనం ఆమె మనసుని కృంగదీసేవి. పిల్లనిచ్చి దేవుడు విధించిన శిక్షా అనిపించేది. కృప మంకుతనం మితిమీరడంతో కొట్టేది. అది శాయికి బాధ కలిగించేది. అన్నీ తెలిసీ సహనం కోల్పోవడం... అతనికి నచ్చలా... అందుకే రోహిణికి యెన్నోవిధాల నచ్చ చెప్పాడు. శాయి చెప్తున్న నీతులు, సహన పాఠాలూ చాలా రోజులు వింది. కానీ వో రోజు శాయితో "నాకు తెలుసు నువ్వేం చెప్పనక్కరలేదు'' అంటూ యెదురు తిరిగింది.

"నీకు తెలిస్తే మరెందుకలా ప్రవర్తిస్తున్నావ్'' అన్నాడు శాయి రోహిణి సమాధానానికి ఆశ్చర్యపోయి.

"నువ్వు ఇంట్లో కూర్చుని దానికి సేవ చెయ్యి..... అప్పుడు చెప్పు నీతులు'' అంది విసురుగా.

"అంటే నేను కృపని పట్టించుకోడం లేదనా? నీ వుద్దేశం'' అనడిగాడు. తను రోహిణి వెనక వుండి యెంత సాయం చేస్తున్నా.... రోహిణి ఈసడిస్తూ మాట్లాడ్డం కష్టం వేసింది శాయికి. రోహిణి జవాబు చెప్పలేదు తనకేదో పనున్నట్టు అక్కడ్నించి తప్పుకుంది.

శాయికి రోహిణి మీద కోపం వచ్చింది. రోహిణి జవాబు చెప్పనందుకు కాదు. రోహిణి దగ్గర జవాబు లేదని అర్థం చేసుకున్నాడు. పాపం! రోహిణి యిలా యెందుకు ప్రవర్తిస్తోందో అతనికి తట్టలేదు. కాని అలా ప్రవర్తించడం మూర్ఖం అని అనుకున్నాడు. కృప అలా పుట్టడం దాని తప్పా? కృపని అర్థం చేసుకోమంటే అదేదో తన తప్పు అన్నట్టు, తన మీద విరుచుకు పడుతుందేం? మిగతా పిల్లలకన్నా కృపకి యెక్కువ సేవ చేయాల్సి వచ్చేసరికి, తనేదో గొప్ప త్యాగం చేస్తున్నట్టు యెందుకనుకుంటోంది. కృప విషయంలో రోహిణి తనకి సహకరిస్తే, తనకి ఆనందం కాదా! కృప ప్రకృతి సిద్ధంగా అవిటిదైతే, రోహిణి అవిటిదాన్లా ప్రవర్తిస్తోంది! అసహనం అనే అవిటితనం రోహిణికి సంక్రమించి నట్టుంది అని అనుకున్నాడే గాని, రోహిణి మనసుని పట్టుకోలేకపోయాడు.

శాయి ఆలోచనల్లో మునిగి తేలుతుండగానే... రోహిణి పని ముగించుకు వచ్చి గదిలో లైటార్పింది. అప్పుడే కృప మంచం మీద లేచి కూర్చుని మూలిగింది. ఆ మూలుక్కి అర్థం రోహిణికి బాగా తెలుసు. ఇక తప్పదురా భగవంతుడా అని వూసూరుమంటూ.... కృప మంచం దగ్గరకెళ్ళి కృపని లేపి బాత్రూంకి తీసుకెళ్ళి శుభ్రం చేసి తీసుకొచ్చి, బీరువాలోంచి మరో డ్రాయరు, జుబ్బాతీసి తొడిగి తను పడుకునే మంచం మీద పడుకోబెట్టింది.

రోహిణి చేసే పనులన్నీ శ్రద్ధగా గమనించాడు శాయి. కృపకి సేవ చెయ్యడం, మాటల్లో పలికినంత తేలిక కాదు, అయినా బింకం చెడకుండా "కృపకి నేచర్ కాల్‌కి వచ్చినప్పుడు ఎలా తెలియచెయ్యాలో చెప్పి ప్రాక్టీస్ చేయిస్తున్నానన్నావు కదా" అన్నాడు.

రోహిణి శాయికి సమాధానం చెప్పలేదు. చెపితే నిజం చెప్పాలి. నిజాన్ని చెప్పి తనే తట్టుకోలేదు. పై వాళ్ళని మభ్యపెట్టడం చాలా తేలిక, తనని తాను మభ్య పెట్టుకోడం చాలా కష్టం. యెంత చేసినా యేదో లోపం, మనసులో వెలితి, అది కృప విషయంలోనే అలా అనిపిస్తోంది. యెదురింటి పిన్నిగారి కోడలు, యింత సేవా చేస్తుంది కానీ ఆ బాబు నవ్వే చిరునవ్వుకి, చేసే చిలిపి చేష్టలకి మురిసి, సేవ చేసిన శ్రమంతా మర్చిపోతుంది. కానీ కృప.... కృపని తలచుకుంటే హృదయంలోంచి దుఃఖం తన్నుకొచ్చింది. యెంత ఆపుకుందామన్నా ఆగక యేడుపు బైటకి వచ్చేసింది. మంచం మీద పడుకుని వెక్కివెక్కి యేడ్చేసింది.

తను విసుక్కున్నందుకే రోహిణి యేడుస్తోంది అనుకున్నాడు శాయి. అనునయంగా రోహిణి భుజం మీద చెయ్యేసి దగ్గరగా లాక్కున్నాడు. రోహిణి అతనిలోకి వొదిగినా దుఃఖం తగ్గలేదు. శాయికి కూడా యేం మాట్లాడాలో తెలియలేదు. సహనం గురించి మాట్లాడ బుద్ధేయ లేదు. కాసేపటికి రోహిణే తేరుకుంది. శాయి చేతులు విడిపించుకు లేచి బాత్రూములోకి వెళ్ళి బేసిను దగ్గర చన్నీళ్ళతో మొహం కడుక్కుని, బెడ్‌రూమ్‌లోకి వచ్చి లైటేసింది. లైటు కళ్ళమీద పడేసరికి, లేచి కూర్చున్నాడు శాయి.

"ఇల్లు మారిపోదాం శాయీ" అంది రోహిణి, శాయి ఆశ్చర్యపోయాడు. "యెందుకూ ఈ ఇల్లు బాగానే వుందిగా!" అన్నాడు.

"ఈ ఇల్లు కాదు బాగులేంది. ఈ వాతావరణం బాగులేదు. ప్రతి నిముషం చిత్రహింస పెడుతోంది. కృపని చూసినప్పుడు, కృప లోపాన్ని తలుచుకున్నప్పుడు కృప మీద యెంతో జాలి కలుగుతోంది. యిలా పుట్టడం దాని తప్పా? దాన్ని విసుక్కుని, కోపగించుకుంటే వున్న లోపం పోతుందా? వెర్రిది, దాన్ననవసరంగా బాధపెడుతున్నానేమో అనిపిస్తోంది. దానిలో వూహ పెరిగిందని, అది స్లో లెర్నర్ అని నన్ను నేను మభ్యపెట్టుకు, నీకెన్నో అబద్ధాలు చెప్పి నిన్ను మభ్యపెట్టాను. యెందుకలా చేస్తున్నానో అన్నది నాకే అర్థం కావడం లేదు, లేక అర్థం అవుతున్నా పట్టించుకోలేదు. కృప మీద జాలి, అభిమానం

యెదురింటి బాబుని చూసినప్పుడల్లా యెక్కడికో తప్పుకుంటున్నాయ్! నన్ను నేను మభ్య పెట్టుకునే స్థితికి దిగజారినందుకు కోపం, యేదో తెలియని కసి చోటు చేసుకుంటున్నాయ్. ఈ ఇంట్లో కృపని సానుభూతితో అర్థం చేసుకోడం కుదరదు. ప్లీజ్ శాయి ఈ ఇంట్లోంచి పోదాం యెక్కడికేనా, ప్రత్యేకంగా వుండే యింటికి, అక్కడ నేనూ కృపా నువ్వూ తప్ప యింకెవ్వరూ వద్దు.''

రోహిణి చెప్పిన దాన్ని నోరప్పగించి విన్నాడు శాయి. కొంత అర్థం అయింది కొంత అర్థం కాలేదు. అర్థమయినంత మేరా బాధపడ్డాడు. రోహిణి మీద జాలిపడ్డాడు. యిల్లు మారడానికి నిశ్చయించుకున్నాడు.

యిల్లు మారిన తరువాత రోహిణి పరిస్థితి మెరుగుపడింది. కృపని తొందరపెట్టే వాళ్ళు లేరు. పోల్చి చూసుకోడానికి పక్కయిళ్ళల్లో చిన్న పిల్లలు లేరు. యెవరేనా బంధువులు వచ్చినప్పుడు మాత్రం కృప స్లో లెర్నర్ అని చెప్పేవాళ్ళు. ఆ మాత్రం ఆత్మవంచన తప్పలేదు. కానీ వచ్చినవాళ్ళు తమ మాట నమ్మలేదని తెలుసు. అందుకే పరవంచన కాలేదు.

కృపకి మూడేళ్ళకి నడక వచ్చింది. వయసుతో పాటూ మొండితనం పెరిగింది. విచిత్రంగా ప్రవర్తిస్తూండేది. పళ్ళు తోముకుంటూ టూత్‌పేస్ట్ తినేసేది. నీళ్ళు పోసుకుంటూ సబ్బుని డ్రమ్ము నీళ్ళల్లో పడేసేది. యెవరూ లేకుండా చూసి శాయి పుస్తకాలు చింపేసేది. స్నానం చేసి బట్టలేసుకోకుండా యిల్లంతా తిరిగేది. వయసు పెరిగాక ఈ చేష్టలు చిలిపి చేష్టలుగా కాక మొండి చేష్టలుగా కనపడ్డాయి.

ఈ మొండి చేష్టలు మాన్పించే ప్రయత్నం రోహిణి చెయ్యకపోలేదు. కానీ కృపకి నచ్చేవికావు. ఆ నచ్చకపోవడం అన్నదాన్ని రోహిణి మీద వుమ్మో, తనని గిల్లుకునో, కరచుకునో, అరిచో చూపించేది. వొక్కొక్కప్పుడు రిపిటీటివ్‌గా అరిచేది.

రోహిణి మీద కోపంతో వంటింటిలో టమాటాలు, తినుబండారాలు తెచ్చుకు తిన్నన్ని తిని మిగిలినవి యిల్లంతా పోసేది. అలా తినడం వల్ల విరోచనాలు పట్టుకునేవి.

కృప పెరుగుతున్న కొద్దీ, రోహిణి సమస్యలు పెరిగాయి. యిల్లు మారినంత మాత్రాన కృప మీద అభిమానం పెరుగుతుందని అనుకుంది. కాని కృపలో వెకిలితనం భరించలేని స్థితికి చేరుకుంది. కృపకి భయం నేర్పడం కోసం, కోపగించేది. తల్లి కోపాన్ని విసుగుని కృప అర్థం చేసుకుంటోంది అనుకునే సమయానికి ప్రకృతి మరోసారి వికటంగా నవ్వింది.

గుడిపాటి వెంకటాచలం గారు చెప్పినట్టు, చదివి చదివి గుడ్డివైన కళ్ళు, సబ్బుతో శుభ్రపడే సంస్కృతి, మర్యాద కట్టుకున్న కళ్ళు, మనసుని వశం చేసుకు నలిపేస్తున్నాయి. లేకపోతే రోహిణి ఆ రోజు అన్నం కలిపి తెచ్చి కృపకి తినిపిస్తూ.... అప్‌సెట్ అయి అన్నంతో సహా కంచాన్ని కృప నెత్తిమీద బోర్లించెయ్యదు. పెరిగిన నాగరికతకు సింబల్

డ్రాయింగ్ హాల్, అందులో సోఫా! ఆ సోఫా పాడయింది.

తల్లి తన నెత్తిమీద పళ్ళాన్ని యెందుకు బోర్లించిందో అర్థం కాలేదు కృపకి. కృపకి చాలా అర్థం కావు. నెలానెలా రుతుస్రావం అవుతుందని ఆమెకి తెలీదు. అప్పుడు జాగ్రత్తగా వుండాలని తెలీదు. ముఖ్యంగా అలా యెందుకవుతుందో తెలీదు! తెలీదు! యేదీ తెలీదు!

అదే రోహిణి సమస్య! కృపలో వచ్చిన ఈ మార్పుకి కృపకి యేవిధంగా చెప్పాలి? యెలా చెప్తే అర్థమవుతుంది? చిన్నప్పటి మైల్‌స్టోన్స్ కూర్చోడం, పాకడం, నిలబడి అడుగులెయ్యడం అయితే నేర్పింది. ప్రాక్టీసు చెయ్యించింది. రుతుస్రావం గురించి యే భాషలో చెప్పాలి? యెలా ప్రాక్టీసు చేయించాలి? అన్నది తలచుకు తలుచుకు కంపరం యెత్తిపోతోంది.

యెంత కనిపెట్టుకు చూస్తున్నా కృప పీరియడ్స్ చాలా యిరాటిక్‌గా వున్నాయి. యెప్పుడువుతోందో? యెలాంటి పరిస్థితుల్లో అవుతోందో? తెలియడం లేదు. యింత వరకూ నిద్రలో అయి పక్కబట్టలే పాడుచేసింది. కానీ యిప్పుడు సోఫా పాడయింది. ఆ మచ్చపోదు. అది హాల్లో వుంచలేదు. సోఫా కవరు మార్చలేదు. సోఫా కవరు మార్చాలి. ఇంకో కవరు వెయ్యాలి? ఈ సమస్య యెలా తీరుతుంది? కృపని సోఫాలో కూర్చోపెట్టకుండా, యింకో కుర్చీలో కూర్చోపెడితే వూరుకోడం లేదు. వచ్చి సోఫాలో తల్లి పక్కనో తండ్రిపక్కనో కూర్చుంటోంది! ఇలా యిన్నాళ్ళు? యేది దారి? కృప యెన్నాళ్ళకి తెలుసుకుంటుంది? ఈ నరకం నుండి విముక్తి యెప్పుడు? మామూలు పిల్లలకే యెవరూ చెప్పలేం, కాలక్రమాన వూహ పెరిగి తెలుసుకుంటారు.

ఈ విషయాన్ని సిగ్గుతో కొందరు, అసహ్యంతో కొందరు, జుగుప్సతో కొందరు సీక్రెసీ మెంటెయిన్ చేస్తారు. సీక్రెసీ యెవరికి తెలియకుండా? ప్రతి ఆడదానికి ఈ విషయం, దీని బాధ తెలుసు. మరి, మగాడికి తెలియకుండా యెందుకు? ఈ విషయంలో యేదో ఇన్ఫీరియారిటీ వుందా? యేమిటీ తేడా? యెందుకో కృప రజస్వల అయిన దగ్గరనుండీ శాయి దూరంగా ఉంటున్నాడు. అది సహజమే అన్నట్టు, తనూ వూరుకుంది. వొంటరిదైపోయింది. ఈ మూడ్రోజులు కృపని శుభ్రం చెయ్యడం, తయారు చెయ్యడం తన బాధ్యతే! ఈ మూడురోజుల సేవ వికారాపెడ్తోంది! జుగుప్స కలిగిస్తోంది! కాని యేది దారి? శాపంలా తగిలింది. శాయికి చూచాయగా తను పడ్తున్న బాధని చెప్పింది. శాయి విన్నా యేమి చెయ్యగలడు? పరిష్కారం లేని సమస్య యిది. అందుకే ఇంక శాయికి కూడా చెప్పడం మానుకుంది. అతలాకుతలంగా పైకి వస్తున్న భావాల్ని అణచిపెడ్తోంది. దానివల్ల అప్పుడప్పుడు కోపం, విసుగు హద్దులు మీరుతున్నాయి. వాటిని కృప మీద చూపిస్తోంది. అంతా అయాక పశ్చాత్తాప పడుతోంది. దాన్ని శాయితో చెప్తే, యింతకుముందులా సహనపాఠాలు చెప్పలేదు శాయి. "మామూలు పిల్లల్నయినా,

తల్లితండ్రులు కొట్టరా, కోప్పడ్రా... కొట్టినా, కోప్పడినా కృప గ్రహించలేదు. అందుకే బాధ! కొట్టడం, కోప్పడ్డం మన రిఫ్లెక్స్ యాక్షన్సేగాని, పిల్లలంటే యిష్టం లేక కాదుగా!'' అంటూ అనునయిస్తున్నాడు. ఈ అనునయాలు, శాంతవచనాలూ, మలి మెన్‌స్ట్రుయేషన్ వరకే, యెక్కడో యేదో మరుపు పొర. దీనికి విముక్తి యెప్పుడు? అసలు విముక్తి వుందా?

బృహతి రోహిణికి అక్కవుతుంది. దంపతులిద్దరూ రోహిణింటికి వచ్చారు. బృహతికి, బృహతి మొగుడికీ యిద్దరికీ కృప గురించి తెలుసు. అందుకే వాళ్ళ రాక యే యిబ్బందీ కలిగించదు.

కానీ కృపలో వెకిలివేషాలు యెవర్నైనా కదిలిస్తాయి. కృపని చూసి వాళ్ళు నవ్వినప్పుడల్లా రోహిణికి, శాయికి యిబ్బంది కలిగేది.

కృపని సంస్కరించడానికి తామెన్ని కష్టాలు పడ్డామో, వారిద్దరికీ వివరించడం మొదలుపెట్టారు.

యింటికి వచ్చినవాళ్ళకి గుడ్‌మార్నింగ్, గుడ్‌బై చెప్తోందని, నిద్రలేచాక పక్క బట్టలు మడత పెడ్తోందని, యేం వూసిపోకపోతే చక్కగా తయారై వచ్చి కూర్చుని టి.వి. పెట్టుకు చూస్తోందని, వంటింటి పనుల్లో సాయం చేస్తోందని, యిలా ఎన్నో చెప్పారు, చెప్తున్నారు. చెప్పినవే చెప్తున్నామని గుర్తించలేకపోయారు. యేదో తప్పుచేసి సంజాయిషీ చెప్పుకున్నట్టు వుంటోందని గుర్తించలేకపోయారు.

బృహతి, ఆమె భర్తా వెళ్ళిపోయే రోజొచ్చింది. ఆ రోజున అక్కకి చీర పెడ్దామని, ఒక పళ్ళెంలో చీర, పళ్ళూ, పసుపు కుంకుమ పెట్టి, బృహతికి తాత్కాలికంగా యిచ్చిన గదిలోకి వెళ్దామని బయలుదేరింది. గది తలుపేసుంది. లోపలనుండి మాటలు వినపడుతున్నాయి. సంస్కారం అనిపించకపోయినా, ఆ మాటల్లో కృప ప్రస్తావన రావడంతో... తలుపు బైటే నిలబడిపోయింది. రోహిణి.

"నాకెలాగూ చీరపెడుతుంది రోహిణి, మనం కూడా ఏదేనా కొని కృపకి యిస్తే బావుండేది'' అంది బృహతి.

"యేం కొనిస్తాం? యేం కొనిచ్చినా విలువేం వుంటుంది. ఆ వెర్రిది రెండ్రోజుల్లో పాడుచేస్తుంది'' అన్నాడాయన.

"మెల్లగా మాట్లాడండి, రోహిణి వింటుంది''

"మెల్లగా మాట్లాడినా గట్టిగా మాట్లాడినా కృప మెంటల్లీ రిటార్డెడ్. మీ చెల్లీ అతనూ కృప గురించి యెన్ని చెప్పినా, నిజం దాగదు! కృప చేసే చేష్టలు మనం నాలుగు రోజులనుండీ చూస్తున్నాం. వాళ్ళు చెప్పిందేదో నమ్మేస్తాం మనం వెర్రివాళ్ళం అనుకుంటే అది వాళ్ళ భ్రమ''

"పోన్లెండి నమ్మకండి. నమ్మినట్టు నటిస్తే యేం పోయింది? మిమ్మల్ని వెర్రివాళ్ళని

చెయ్యడం వాళ్ళ వుద్దేశం కాదు'' అంది బృహతి మొగుడి నిక్కచ్చితనం నచ్చక.

"అందుకే కృపకి యేదో కొనిచ్చేకన్నా, డబ్బులు దానిచేతిలో పెడితే, వాళ్ళే వాడుకుంటారు. వాళ్ళకి తృప్తి కూడా. వాళ్ళకి తెలియదా అది నార్మల్ పిల్ల కాదని, అంతేకాదు బృహతీ, యిలాంటి పిల్లలు యెక్కువకాలం బతకరు.... ఈ రుణం యింకెన్నాళ్ళో....'' ఆయనింకేదో చెప్తూనే వున్నాడు.

ఆఖరి వాక్యం విన్న తరువాత రోహిణి మనసంతా పాడయింది. లోపలికి వెళ్ళ బుద్దెయ్యలేదు. డ్రాయింగ్‌హాల్లోకి వచ్చి పళ్ళెం సెంట్రల్ టేబుల్ మీద పెట్టి సోఫాలో కూర్చుంది. "యిలాంటి పిల్లలు యెక్కువ కాలం బతకరు'' అన్న వాక్యం చెవుల్లో మార్మోగుతోంది.

దగ్గర వాళ్ళు కూడా యిలా ఆలోచిస్తారని అనుకోలేకపోయింది. యిది శాయికి తెలిస్తే యేమంటాడు? రోహిణి ఆలోచనల్లో సతమతమవుతూండగానే, బెడ్‌రూంలోంచి శాయి, గెస్ట్‌రూంలోంచి బృహతి, ఆమె భర్తా డ్రాయింగ్‌హాల్‌లోకి వచ్చారు.

డ్రాయింగ్ హాల్లో కూర్చున్న రోహిణిని చూసి "అదేమిటి అవి యిస్తానని గెస్ట్‌రూంకి వెళ్ళావు, యివ్వలేదా?'' అన్నాడు.

రోహిణి జవాబు చెప్పలేదు. కానీ బృహతి వులిక్కిపడింది. రోహిణిని జాగ్రత్తగా పరిశీలించింది. మ్లాన వదనంతో వున్న రోహిణిని చూడగానే, ఆమె తమ మాటలు విందని అర్థం చేసుకుంది. ఆమె భర్త మాత్రం ఇవేం పట్టించుకోలేదు. శాయితో మాటల్లో పడిపోయాడు.

రోహిణి అక్కకు బొట్టుపెట్టి, చీర, జాకెట్టు, పళ్ళు అందించింది. అవన్నీ తీసుకు బేగ్‌లో పెట్టుకుంది బృహతి. అది గమనించిన బృహతి భర్త జేబులోంచి రెండొందలు రూపాయలు తీసి బృహతికిచ్చాడు. బృహతి వాటిని పుచ్చుకుని, అప్రయత్నంగా రోహిణి మొహంలోకి చూసింది. రోహిణి యెటో చూస్తోంది. జరిగేదేదో నాకు తెల్సు అన్నట్టుగా వున్నాయి ఆమె ముఖకవళికలు. సోఫాలో కూర్చున్న కృప సీరియస్‌గా టి.వి. చూస్తోంది.

తను తీసుకున్న రెండొందలూ తిరిగి మొగుడి జేబులో పెట్టేసింది బృహతి. ఆయన ఆశ్చర్యపోయి బృహతిని ప్రశ్నార్థకంగా చూసాడు. బృహతి చిర్నవ్వు నవ్వి, కృప దగ్గరకెళ్ళి, కృప చెయ్యి పట్టుకు గెస్ట్ రూములోకి తీసుకెళ్ళింది.

పదినిముషాల తర్వాత కృప, బృహతి బైట కొచ్చారు. బైట కొచ్చిన కృప మొహంలో మార్పొచ్చింది.

తల్లిని చూడగానే వో వెర్రినవ్వు నవ్వింది. ఆ వెర్రి నవ్వులో ఆనందం వుంది. అది తేలికగా పసిగట్టగలిగింది రోహిణి.

అంత వరకూ బృహతి చెవులకున్న బుట్టరింగులు యిప్పుడు కృప చెవులకున్నాయి.

బృహతి చెవులు కాళీగా వున్నాయి.

రోహిణికి బృహతిని చూడగానే దుఃఖం ఆగలేదు. "అక్కా" అని కౌగిలించుకుంది. ఆ తర్వాత మాటలురాక గొంతు పూడుకుపోయింది. అక్క చూపిన అభిమానానికి, ఆప్యాయతకి, రోహిణి చలించింది.

రోహిణి భుజం మీద ఆప్యాయంగా తట్టి, కృపని బుగ్గమీద ముద్దుపెట్టుకుని "తీరిక చేసుకుని ముగ్గురూ మా వూరు రండి మరిదిగారూ" అంటూ శాయికి వీడ్కోలు చెప్పి, మొగుడి వెనకాల బయలుదేరింది బృహతి.

స్వీకృతి *(ఇ-పత్రిక, 2004)*

# ప్రేతాత్మ

తెల్లవారేసరికి చెడువార్త. ఎవరో పనివాడు మెట్రోరైల్వే కోసం తవ్విన కందకంలో పడి చచ్చిపోయాడు. అదీ మా ఇంటి ఎదురుగా, వో! వొకటే జనం. పదిహేనేళ్ళుగా కలకత్తాలో ఇంత ఇబ్బంది ఎప్పుడూ పడ్లేదు. రోడ్ల మధ్య తవ్వేసారు, మెట్రోరైలు వేస్తారట! ఎనిమిది గంటలకి ఆఫీసుకని బైటకొచ్చా, చచ్చిన వాడి శవాన్ని తియ్యలేదేమో? అందరూ మెట్రోవాళ్ళు తవ్విన కందకంలోకి చూస్తున్నారు. ఆ రోజు పని ఆపేసారు. మిషన్ల రణగొణ ధ్వని తగ్గింది. మరో పదిరోజుల వరకూ ఈ చుట్టు పక్కల పనుండదు, అనుకున్నా....

నే బయటకొచ్చేసరికి బోసు నవ్వుతూ జనాన్ని తప్పించుకు బైటకొచ్చాడు "దాదా మరో పదిరోజులు పనుండదు" అన్నాడు నాతో. నిజమే మిషన్లహోరు, పనివాళ్ళ కేకలతో చాలా చికాకుగా వుంటోంది. కానీ మట్టి, చీదర ఎప్పుడు వదుల్తుంది?

ఇరవై అయిదేళ్ళుగా కలకత్తాలో, కలకత్తా కాళిక ఛత్రఛాయకింద, ఇదో విచిత్రమైన జీవితం. రసగుల్లాల్లా మెత్తగా, తీయగా వుండదు. భాష జాతి అభిమానాల మధ్య నలిగినట్టుంటుంది. కానీ ఇప్పుడలాలేదు. ఏదో వచ్చీరాని బంగభాషతో రోజులు గడుస్తున్నాయి. రాజాకి, రమణికి బంగభాష తప్ప తెలుగు రానే రాదు.

కమ్యూనిస్టుల రాజ్యం కదా గోతిలోపడి చచ్చిన కార్మికుడికి జరిగే న్యాయంకన్నా, కంట్రాక్టరుకి జరిగే శోషణ ఎక్కువగా వుంటుంది. పార్టీ ఫండ్ వసూలైతేగాని, గోతిలో పడి చచ్చినవాడి ఆత్మ శాంతించదు. నేను సాయంత్రం ఇంటికొచ్చేసర్కి, శవాన్ని తీసెయ్యడం జరిగింది. కానీ తత్తిమ్మా వసూళ్ళు కాకపోవడం వల్ల పని ఆగిపోయింది.

ఇంట్లో అడుగుపెట్టేసర్కి, ఇంట్లో జనం- అంటే లత, పిల్లలూ, అమ్మా, తమ్ముడు మాధవ అందరూ మధ్య హాల్లో కూర్చుని..... దెయ్యాల గురించి మాట్లాడుకుంటున్నారు. ఈ విధంగా చచ్చినవాడు దెయ్యమవుతాడా? అవడా? ఇంతకుముందు యెవరెవరు ఇలా చచ్చి దెయ్యాలయ్యేరు? ఇలాంటి దెయ్యాలు మంచివా? చెడ్డవా? అమ్మ నూతిలో పడిచచ్చిన ఆడకూతుర్లు దెయ్యాలై చేసిన ఆగడాలు చేప్తే, లత కాలిపోయిన ఆడకూతుర్లు దెయ్యాలై చేసిన ఆగడాలు చెప్పింది. ఈ విషయం గురించే చర్చించారుగానీ, అసలు ఆడకూతుర్లే నూతుల్లో పడతారెందుకు? కాల్చబడతా రెందుకు? అన్న విషయం చర్చించలేదు, చర్చించినా ఫలితం లేదు.

యేది యేమయితేనేం, చచ్చినవాడి ధర్మమా అని ఆ రాత్రి మిషన్ల రణగొణధ్వని లేకపోడంతో అందరికీ హాయిగా నిద్రపట్టింది. ఆరోజేకాదు అలా వారం రోజులూ మా నిద్రకే ఆటకం కలుగలేదు, కానీ.......

"ధన్ ధన్' మని చప్పుడవుతూ వుంటే తెలివొచ్చింది నాకు. తెల్లారిపోయింది.

మాధవ ఆఫీసుకెళ్ళడానికి తయారై, వీధి గుమ్మం దగ్గర నిలబడి, గడియ తీసాడు. కానీ తలుపులు బిగుసుకున్నాయి. రాలేదు వాటిని తీసే ప్రయత్నంలో, అయిన చప్పుడికే నాకు తెలివొచ్చింది.

మాధవ పొద్దున్నే ఆఫీసుకెళ్ళి పోతాడు. అప్పటికి ఇంట్లో ఎవరూ లేవరు. తన కార్యక్రమాలన్నీ ముగించుకుని, ఆఫీసుకెళ్ళి అక్కడే టిఫిన్ చేస్తాడు. వాడి వెనకే గంట తర్వాత నేనూ వెళ్తా ......కానీ, అప్పటికే లత లేచి కాఫీ, టిఫిన్ చేస్తుంది. అమ్మ ఆలస్యంగా లేస్తుంది. ఇంక రాజా, రమణి వాళ్ళెప్పుడు లేస్తారో వాళ్ళకే ఎరుక. లేదా లతకి ఎరుక.....

ఆ రోజు మొత్తానికి తలుపొచ్చింది. కొంత కష్టం ఖర్చయింది. మాధవ ఆఫీసుకెళ్ళి పోయాడు. వాడి వెనకాలే నేనూ తయారై ఆఫీసుకి వెళ్ళిపోయా.....

సాయంకాలం ఇంటికొచ్చేసర్కి పరిస్థితి వేరుగా వుంది. అమ్మ, లతల కళ్ళల్లో ఆదుర్దా కనిపిస్తోంది. అంటే నాకేదో చెప్పడానికి తయారుగా వున్నారు.

మెట్రో గోతుల దగ్గర ఏదేనా గొడవయి వుండొచ్చు, చచ్చిన వాడి తాలూకా అని చెప్పుకుని ధర్నాలు చేసేవాళ్లుండచ్చు, రోజంతా వీళ్లకి, బైటగొడవతోనే సరిపో యుండవచ్చు. ఇవన్నీ వినే వోపిక, సహనం ప్రస్తుతం లేవు. అందుకే, తిన్నగా గదిలోకి వెళ్ళి ఆఫీసుబట్టలకి అతుకున్న శరీరాన్ని వేరుచేసి, లుంగీలో దూరి, బాత్రూములో ఫ్రెష్ అయి, హాల్లో అడుగుపెట్టేసరికి అమ్మ వాళ్ళందరికీ ఆంధ్రుల అభిమాన దెయ్యం 'పింగళారిపేకి' కథ చెబుతోంది. అందరూ చెవులు రిక్కించి వింటున్నారు. నే సోఫాలో విశ్రమించేసర్కి లత కాఫీ తీస్కొచ్చింది. కాఫీ సిప్ చేద్దామని నోటి దగ్గర పెట్టుకున్నాను.

'మీరు చెప్పండి అంటే మీరు చెప్పండి' అని లత, మాధవ, అమ్మకి సైగ చేస్తున్నారు. అమ్మ నా వైపు ఆతృతగా చూస్తూ 'ఈ ఇంట్లో దెయ్యం వుందిరా బాబు!' అంది. నాతో చెప్పడంతో ఏదో పెద్ద భారం దిగి పోయినట్టు అందరూ 'ఆ'!!! అన్నారు.

నాకు పొలమారినట్టనిపించినా సంబాళించుకున్నాను. కాఫీ పూర్తిచేసి పక్క బల్లమీద పెట్టి, అమ్మని చూస్తూ, "ఇంట్లో దెయ్యం వుండడం ఏమిటే?" అన్నా నవ్వుతూ.

'లేదన్నయ్యా ఏదో అయింది ఈ ఇంటికి' అన్నాడు మాధవ. వాడిమొహం మీద చిర్నవ్వులేదు.

"ఏమిటయింది?" అనడిగా వాడి బెదురుకి చిరాకుపడుతూనే..... లత, పిల్లలూ అంటే యే కలల వల్లో, అమ్మ చెప్పే కథల వల్లో, పక్కవాళ్ళ కబుర్ల వల్లో, జరిగిన సంఘటన వల్లో, మెట్రోరైల్వే తవ్వకాల్లో పడ్డవాడి గురించి ఆలోచించి ఆలోచించి బెంబేలెత్తిపోయుంటారు. మాధవ కేమయింది? నా ఆలోచనల్లో నేనుండగానే, అమ్మ "పొద్దున్న ముందు గుమ్మం తలుపు బిగుసుకుపోయిందా, మాధవ కష్టపడి తెరిచాడా...., తులసికి నీరు పోద్దామని దొడ్డిగుమ్మం తలుపు తెరిచాను. అది తెరుచుకోలేదు. బిగుసుకు పోయింది. ఎంత ప్రయత్నించినా రాలేదు. అప్పుడు బైటనుండి కార్పెంటర్ని

తీసుకొచ్చి తలుపు తెరిపించి చిత్రిక పట్టించాల్సివచ్చింది. రోజూ చాలా సామాన్యంగా వచ్చేసే తలుపు ఎలా బిగుసుకుంది? ఎందుకు బిగుసుకుంది? అంతా అయోమయం అయిపోయింది అనుకో....'' అంటూ అమ్మ ముగించనేలేదు........ లత ఆత్రుతగా "వొక్క దొడ్డి తలుపేనా అత్తయ్యా, ఈయన బెడ్‌రూము కిటికీ కూడా బిగుసుకుంది. ఎంత తీసినా రాకపోతే అలాగే వదిలేసా. మళ్ళీ కార్పెంటర్ని పిలవడం కష్టం అని....'' అంది మొహంలో బెరుకు స్పష్టంగా వుంది.

'నేను ముందునుండి చాలా ప్రయత్నించి సుత్తితో కొడితే వచ్చిందా తలుపు' అన్నాడు మాధవ.

రాజా, రమణి సోఫాకి అతుక్కుపోయి, మాటలన్నీ శ్రద్ధగా సీరియస్‌గా వింటున్నారు.....,

"యేవో తలుపులు బిగుసుకున్నంత మాత్రాన దెయ్యం అయిపోతుందా?'' ....అన్నా వాతావరణాన్ని తేలిక చేద్దామని.

"అదికాదురా బాబూ...., వాడెవడో మెట్రో గోతిలో పడి చనిపోయి వారం కూడా తిరగలేదు. ఈ విధంగా జరగడం అనుమానంగా వుంది.'' అమ్మ అనుమానం............

"మెట్రోగోతిలో వాడు పడి చావడానికి, ఇంటి తలుపులు బిగుసుకు పోవడానికి సంబంధం ఏమిటే? అన్నా చిరాగ్గా.

"చచ్చినవాడికి మనిల్లే దొరకాలా? మనింటి ఎదురుగానే పడి చావాలా?'' అంది లత

"నీకు తెలీదురా చచ్చిన వాడి ఆత్మ జీవితం మీద ఆశ తీరక ఆ ప్రదేశంలో తిరుగాడుతుంది''. అంది.

అమ్మ తన మాట నమ్మనందుకు చిరాగ్గా............

''అలాగని ఎవరు చెప్పారే ? అన్నా చిర్నవ్వుతో వాతావరణాన్ని తేలిక చేద్దామని............,

'ఎవరూ చెప్పక్కర్లేదు. రాజు మావయ్య పోయినప్పుడు, మా నాన్నగారు గరుడ పురాణం చదివించారు. అదంతా వింటే ఆ రోజుల్లో వెన్ను జలదరించింది'' అంది అమ్మ.

అమ్మ గరుడపురాణం అంటూ, ప్రేతాత్మల కథలతో అందర్నీ అదరగొట్టిందేమో, అనిపించింది. అమ్మ చెప్పే కథలకి ఎదురుగా నిదర్శనం తలుపులు బిగుసుకుపోవడం కనిపిస్తూనే వుంది. నా ఆలోచనల్లో నేనుండానే.....

"చనిపోయిన తర్వాత జీవుడు ఆ ఇంటిని, ప్రదేశాన్ని వదిలిపోదు. ఆ శరీరం ఎక్కడవుండేదో ఆ ప్రదేశాని కెదురుగా తారట్లాడుతుంటుంది. పదకొండోరోజు పిండాలు

పెట్టాక ఆ నీళ్ళు, ఆ పిండాలే ఆహారంగా, వూర్ధ్వ లోకానికి ప్రయాణం చేస్తుంది. అందుకే మాసికాలు పెట్టడం. నెలనెలా దారిపొడుగునా మనం అగ్నిలో పెట్టే పిండాలే దానికి ఆహారం. వీడిక్కడ. మనింటి దగ్గరే వాడాత్మ అసహనంతో తిరుగుతోందన్నమాట.... "అమ్మ లాజిక్... అమ్మ మాట ముగించనే లేదు..... లత సపోర్ట్‌గా....

"నిజమే అత్తయ్యా మా అమ్మపోయినప్పుడు ఆఖర్న ఆవిడ్నుంచిన నడవలో దీపం పెట్టాం...., రాత్రుళ్ళు ఆ నడవలోకి వెళ్ళడానికి భయం వేసేది. అక్కడ మా అమ్మ కూర్చుని, జుత్తు చిక్కు తీసుకుంటున్నట్టు, పెట్టెతెరుస్తున్నట్టు, శబ్దాలు అయేవి" అంది....

ఇదంతా వింటుంటే ఇంట్లో ప్రేతాత్మ వుందో లేదో తెలీదు కానీ వీళ్ళ మనసుల్లో ప్రేతాత్మ స్థిరపడి పోయింది. యేమనుకున్నా చేసేదేం లేదు.... ఇల్లు కాళీ చెయ్యడం అంత తేలిక కాదు..... కానీ.... కథక్కడితో ఆగితే బావుండేది, వో రోజు తేడాలో బాత్రూములో నీళ్ళు వెళ్ళలేదు. ఎంత తోసినా వెళ్ళలేదు. రాజావో రమణో యే కాగితం ముక్కలో, పళ్ళతొక్కలో వేసారేమో? అన్న అనుమానం వొకవేపు, బాత్రూములో అలాంటివి ఎందుకు పారేస్తారనే ఆలోచన మరోవేపు వచ్చాయి. సరే వుమ్మడి బాత్రూం వుంది కదా అని దాంట్లో కెళ్తే అక్కడా అదే ప్రోబ్లం, నీరు సరిగా వెళ్ళడం లేదు. ఎందుకో అర్థం కాలేదు. బైటనుండి ఇనుప వూస తెచ్చి, గ్రేటింగ్ తీసి తూములో పొడిచి చూసా......, కొద్దిగా నీళ్ళు కదిలాయి కాని వేగంగా వెళ్ళలేదు. టైమయిపోడం వల్ల గబగబ స్నానించి, తయారై ఆఫీసు కెళ్ళి పోయా....

సాయంకాలం ఇంటికొచ్చేసర్కి లత, అమ్మ, నా మీద విరుచుకుపడ్డారు. "అదేంటండీ తూములన్నీ పూడుకుపోయాయి. 'ఎంత తోసినా నీళ్ళు పోవే. ఆఖరికి అన్నీ ఎత్తిపారపోయించాం." అంది లత. "వొరే, వెళ్ళి ఘోష్ గారని ఎవరో భూత వైద్యుడున్నాడట తీసుకురా.... విషయం ఏమిటో తేలుస్తాడు". అంది అమ్మ.

ప్రేతాత్మలు తూముల్లో నీళ్ళడ్డుకుంటాయని ఎక్కడా విన్లేదు.... చూడ్లేదు. ఈ సంఘటనకి, ఎదుట గోతిలో పడి చచ్చిన వాడి ఆత్మకి యే సంబంధం? మా ఇంటిలో తూముల్లో నీళ్ళు అడ్డు కుంటే వాడికి లాభం యేమిటి? అమ్మతో ఇలా వాదిస్తే 'గరుడ' పురాణం పూర్తిగా చెబుతుంది. దాంతో రాజా, రమణి ఇద్దరూ బెంబేలెత్తిపోతారు. అయితే ఏ విషయమూ తేల్చి చెప్పకపోతే అమ్మ వూరుకోదు, సణుగుతుంది.

"రేపెళ్ళి ఘోష్ గార్ని పిలుస్తాలే.... ఇవాళకి కుదర్దు..." అంటూ వోరోజు దాటవేసా, అమ్మ తన మాట నమ్మినందుకు సంతృప్తి పడింది.

అలా అన్నానేగాని ఘోష్‌ని పిలవడం ఇష్టంలేదు. ప్రేతాత్మలు ఎలా ప్రవర్తిస్తాయి? అన్నది తెలీదుకానీ, ఇలా అల్లరి పెట్టవేమో అన్న అనుమానం, కానీ......

జీవితం యాంత్రికంగా తయారై చాలా యేళ్ళయింది. పొద్దున్నే లేవడం, తయారవడం, ట్రామో, బస్సో, ఫెర్రీయో పట్టుకు ఆఫీసుకు చేరడం... ఆఫీసులో తీరికలేని

పని... తిరుగు ప్రయాణం... విపరీతమైన అలసట... స్నానంతో కాస్త సేదతీరినా... ఆరోజు రాత్రి రేపటి భయం, బెంగతో... మంచం మీదకి చేరి దిండుకానుకనే సరికి, అలవోకగా నిద్రలోకి... కానీ.... యే అర్ధరాత్రో కలలాంటి మెలుకువ... మెలుకవలో మత్తు, వెచ్చగా శరీరాన్ని చుట్టేది. ఆ వెచ్చదనానికే మెలుకువ ఆ మెలుకువలో రేపటి జీవితం లేదా జీతం పరుగులు గుర్తుకు వచ్చేవికావు.

వెచ్చటి చేతులు గుండెలపై సంచరించి... నన్ను గాఢంగా అదుముకునేవి.... ఆ వెచ్చని పొందు... ఆ పొందుతో మనసు మైమరపు.... మరపు కలగా మారి సిల్కీ పెదాల స్పర్శ... కచ్చగా పొదవిన నేను... పైన చల్లని ఫేనుగాలి.... మమ్మల్ని నీడలు చేస్తున్న జీరోవాట్ బల్బు.... మరో లోకంలోకి అదిమేవి.... ఆ లోకంలో శరీరాల వెచ్చదనం.... సరాగాల కమ్మదనం.... తనివితీరని పరువపు పరుగు.... పరుగుపుంతలో లతచూపే స్నేహం... మోహం... మచ్చిక... ఇంద్రజాలంలా యెప్పుడూ అద్భుతమే!.... అద్భుతమైన మైకం.... మమేకం చెంది....... లతని చిన్నగా ముద్దు పెట్టుకున్నా.... లత మత్తుగా కళ్ళు తెరవకుండానే చిర్నవ్వు నవ్వింది... గాఢంగా హత్తుకుంది.... మత్తుగా నా కళ్ళు మూతబడ్డాయి...

వొక్క తట్టుతట్టి లేపింది లత,..... గదిలో లైటు లేదు. ఏం జరిగిందో తెలీక పక్కకి తిరిగా లత మంచంమీద కూర్చుంది. "ఏమిటి?" అన్నా బద్ధకంగా.

'మాట్లాడకండి, వినండి' అంది గుసగుసలాడుతున్నట్టుగా.... ఏమిటా? అని రెండు నిముషాల టెన్షన్.... యేమీ లేదు. లతకేదో కలొచ్చి వుంటుంది. దాంతో బెంబేలెత్తి పోయింది. కొన్ని కలలు మన పిరికితనాన్ని తట్టిలేపుతూ చాలా భయంకరంగా వస్తుంటాయి. అవి నిజాలు అన్న భ్రమ కూడా కలిగిస్తాయి. భయం మన మనసులో పుడుతుందా లేక వేస్తుందా? భయం పుడుతుంది. దానికి అనేక కారణాలు వుండచ్చు. మన వొంటరితనం మనకి భయం పుట్టిస్తుంది. ఏవో కారణాలు తెలియని వింతవింత అనుభవాలు మనకి భయం పుట్టిస్తాయి. చీకటి కూడా భయానికి కారణమే. నా ఆలోచనల్ని బ్రేక్ చేస్తూ....... 'బుళక్' ..... అన్న శబ్దం. లత చెయ్యి నా భుజం మీద పడింది. ఆలోచనల్లో పరధ్యానంగా వుండడం వల్ల శబ్దం విన్నానా లేదా?..... అనిపించింది. కానీ ఆ శబ్దాన్ని లత స్పష్టంగా వింది. అందుకే నన్ను పట్టుకుంది. ఈసారి పరధ్యానం లేదు. చెవులు రిక్కించి ఏ శబ్దమేనా వినబడుతుందా అని ఎదురు చూసాం. ఎక్కువసేపు ఎదురు చూడవలసిన అవసరం కలగలేదు.

'బళక్.... బళక్' మన్న శబ్దం వినిపించింది, స్పష్టంగా.

శబ్దం ఎక్కడ్నించి వస్తోంది అన్న విషయం అర్థం కాలేదు. కానీ ఎక్కడో దూరం నించి వచ్చింది. లత చెయ్యి భుజం మీద బిగుసుకుంది. లత చెయ్యి తీసి, పక్కకి పెట్టి, లేచి వెళ్ళి లైటేసాను. లైటేస్తే కాస్త భయం తగ్గుతుంది. లతకి ధైర్యం రావచ్చు. అప్పుడా

శబ్దం ఎక్కడ నుండి వస్తోందో తెలుసుకోవచ్చు... లైట్ వెయ్యగానే సర్దుకు లేచింది.

నా ఆలోచనల్ని లత పసిగట్టేసింది. 'మీ రెక్కడికీ వెళ్ళకండి నాకు భయం' అంది.

'ఆ చప్పుళ్ళు ఎక్కడ్నించి వస్తున్నాయో తెలీడం ఎలా?

"తెలియనక్కరలేదు, చప్పుళ్ళు వస్తున్నాయా? లేదా? అదీ నీళ్ళ చప్పుడు అంటే బాత్రూములోంచో, వంటింటిలోంచో" అంటూ నన్ను బెడ్రూములో కట్టిపడేసింది.

మాగదిలో లైటెలిగిన పది నిముషాలకి రాజా, రమణి, బిక్కుబిక్కుమంటూ, మా గదిలో కొచ్చారు. అక్కడితో ఇంటి విషయం సీరియస్‌గా ఆలోచించవలసివచ్చింది. ఇంటిని నిజంగా ప్రేతాత్మ ఆవరించి ఇవన్నీ చేస్తోందా? లేకపోతే నిన్నటివరకూ ఏ సమస్యాలేని ఇల్లు, ఇన్ని సమస్యలతో సతమతమైపోడం వూహ కందడం లేదు. ఈ ఇంటిని ప్రేతాత్మ ఆవరించి వుంటే ఇంట్లో వాళ్ళకి కనబడ్డం లేదు, ఇంట్లో వాళ్ళకి హాని చెయ్యడం లేదు. లేక ముందుముందు హాని చేస్తుందేమో, అది జరక్కుండానే ఇల్లు కాళీ చేసేస్తే? ఈ మహానగరంలో ఇల్లు కోసం వెదకాలంటే ఎంత కష్టం. అంత టైము, వోపిక, లేవు.

వారానికొక్క ఆదివారం, అది కాస్తా ఇల్లు వెదకడానికి వెచ్చిస్తే వారం అల్లా విశ్రాంతికి కరువే. ఏ బ్రోకరునైనా పట్టుకుంటే ఇల్లు దొరుకుతుంది కానీ డబ్బు వదుల్తుంది. ఇంట్లోకి వెళ్ళేకా... కానీ ఆ ఇంటికి యెన్ని లోపాలున్నాయన్న సంగతి తెలీదు......

నా ఆలోచన్లకి అడ్డకట్టవేస్తూ బాత్రూములోంచి నీళ్ళల్లో ఎవరో నడచి వెళ్తున్న చప్పుడైంది. చెవులు రిక్కించి విన్నాను. వొకళ్ళు కారు, ఇద్దరు. నీళ్ళల్లోంచి నడిచి వెళ్ళేంత నీళ్ళు బాత్రూములోకి ఎలా వచ్చాయి. ఏ మాధవో, అమ్మో బాత్రూము కెళ్ళినా... బాత్రూమునిండా నీళ్ళెలా వచ్చాయి? ఎందుకేనా మంచిది పరిశీలించి చూద్దామని బెడ్ మీంచి లేవబోయా. నా మనసుని గ్రహించిన లత గట్టిగా నా జబ్బ పట్టుకుంది వద్దంటూ సైగచేసింది. "వెళ్ళి చూడకపోతే ఎలా తెలుస్తుంది?'' అన్నా విసుగ్గా.

"పొద్దున్న చూద్దురుగాని లెండి. ఇప్పుడొద్దు' అంది.

చీకటి భయం. ప్రేతాత్మలు పగలేం చెయ్యవా?..... ఇంతలా చప్పుళ్ళవుతున్నా మాధవ ఏం చేస్తున్నాడు. వాడిదో మొద్దునిద్ర. అలసి పడుకుంటాడు. నన్ను లత లేపకపోతే నేనూ లేచి వుండేవాడ్ని కాదు. ఈ చప్పుళ్ళ సంగతి తెలిసేది కాదు. ....... వెళితే విషయం తెలుస్తుంది అనుకుంటే లత కదలనివ్వదు, లైటేసుకు కూర్చుంటే నిద్రరాదు. అందుకే, ముగ్గుర్నీ పడుకోమని, సైగచేసి గదిలో లైటార్పేసాను. లైటార్పేసి పడుకున్నాక రెండుమూడు సార్లు నీళ్ళల్లో ఎవరో నడుస్తున్న చప్పుడు..... ఈసారి స్పష్టంగా అది బాత్రూములోంచే వచ్చింది. 'బుళక్.... బుళక్' అన్న చప్పుళ్ళు వచ్చాయి. కాసేపటికి నిద్ర పట్టింది.

'కెవ్వు' మన్న కేకకి తెలివొచ్చింది. నన్ను పట్టుకుని పడుకున్న రాజా, రమణి, లత

కూడా కేకకి తుళ్ళిపడి లేచారు. అప్పటికి బాగా తెల్లారిపోయింది. అరిచింది 'అమ్మ'. అమ్మే అందరికన్నా ముందు లేస్తుంది. అయితే యెందుకరిచింది? ఏం చూసింది?.... అందరం లేచి వరండాలోకి వచ్చాం. అమ్మ బాత్రూము ముందు నిలబడుంది. చేతిలో పేష్టుంది. అందరం బాత్రూము దగ్గరికి వెళ్ళాం. బాత్రూము నిండా నీళ్ళు. దాన్నిండా అసహ్యంగా వుమ్ములు అవీవున్నాయి, నిన్న వచ్చిన నీళ్ళ కన్నా చాలా ఎక్కువ. అవి చూడగానే లత, నా భుజం పట్టుకుంది. అందరం ఆశ్చర్యపోయాం. ఇన్ని నీళ్ళెలా వచ్చాయి. ఇదంతా ప్రేతాత్మల పనేనా?

"బాబు, ఇంకాలస్యం చెయ్యకు. ఇంకో ఇల్లు చూసుకుపోదాం. అంతేగాని ఇలాంటి ఇంట్లో వుండలేం. ........." అంటూ ఇంటివెనక పెరట్లోకి మొహం కడుక్కోడానికి వెళ్ళిపోయింది.

జరిగిందాన్ని పక్కకి పెట్టి, అందరం పెరట్లో మొహం కడిగేసుకున్నాం, ............ కానీ స్నానానికి ఇబ్బందే, నే పెరట్లో స్నానం చేసా. కానీ లత, అమ్మ అందరూ ఇబ్బంది పడ్డారు. అందుకే, ఓ పనిమనిషిని పెట్టి నీరు తోడించేసాం. మళ్ళీ తూము పొడిపించా..... ఆఫీసు కెళ్తూ "సాయంకాలం తొందరగా వచ్చి ఇంటివోనర్ని తీసికొచ్చి చూపిస్తాను. బాత్రూములోకి మురుగు నీళ్ళొస్తే తోడించెయ్యకండి. మాధవ బాత్రూములో అంతగా నీళ్ళు రావడం లేదుకదా, అది వాడుకోండి. నీరు పోకపోతే వదిలెయ్యండి, అన్చెప్పి ఆఫీసుకెళ్ళిపోయా.... సాయంకాలం వరకూ ఈ సమస్యని దాటెయ్యచ్చు అనుకున్నా కాని అంతవరకూ ఆగదని నాకప్పుడర్థం కాలేదు.

మధ్యాహ్నం పన్నెండు గంటలకి లత ఫోను చేసింది. లత గొంతు భయపడ్డట్టు గాబరాగా వుంది. "యేవండీ వెంటనే రండి... వచ్చేటప్పుడు ఇంటి వోనర్ని తీసుకురండి...." అంది.

"మళ్ళీ బాత్రూములోకి నీళ్ళొచ్చాయా?" అనడిగా................

"కాదు మీరు వెంటనే రండి........ మాకెందుకో భయంగా వుంది" అంది విసుగ్గా.

పగలే భయపడేంత విషయం ఏమిటా? అని ఎంత ఆలోచించినా తట్టలేదు. ఇంటి వోనరు దగ్గరికి వెళ్ళాలంటే మా ఇల్లు దాటి వెళ్ళాలి. ముందుగా ఇంటికెళ్ళి యేం జరిగిందో తెలుసుకుని ఇంటి వోనర్ని పిలుచుకొచ్చి ఈ రోజుతో అటోఇటో తేల్చేసుకోవాలి అనుకున్నా. ఆఫీసుకి హాఫ్డే శలవు పెట్టి ఇంటికి బయలుదేరా......

ఇంటికెళ్ళేసరికి అమ్మ, లత బైటే కూర్చున్నారు. నేను రాగానే అమ్మలేచి "సందేహం లేదురా బాబూ, ఈ ఇంటికి ప్రేతాత్మ పట్టింది. ఇంకీ ఇల్లు ఆగదు. కూలిపోతుంది....." అంది.

ముగ్గురం లోపలికెళ్ళాం. అమ్మ తన బెడ్రూము కిటికీ దగ్గర గోడమీద చూపించింది. ఆ గోడ పగిలి వుంది. చాలా విచిత్రంగా కిటికీ సిల్ దగ్గర మొదలై

నలభైయిదు డిగ్రీల వాలుగా పై వరకూ గోడ పగులుంది. ఒక్క ఆ కిటికీ దగ్గరే కాదు బైట సింహద్వారం దగ్గర వెనక పెరటి ద్వారం దగ్గరా ఇంట్లో చాలా చోట్ల పగుళ్ళు స్పష్టంగా కనిపించాయి. అవి అంతకుముందు లేవు. చిన్న చిన్న ట్రిక్కులకి వీళ్ళు భయపడటం లేదనుకుందేమో ప్రేతాత్మ. ఇంటినే పడగొట్టేద్దాం అనుకుంది.

ఇంక ఆలస్యం చేస్తే మంచిది కాదు అని ఇంటి ఓనరు దగ్గరికి వెళ్ళా. నే చెప్పిందంతా విని 'భూతో' అని ఆశ్చర్యపోయాడు. భూతం బెంగాలీలో 'భూతో' అవుతుంది కాబోలు నా వెనకే బయలుదేరాడు. బెంగాలీ వాళ్ళు ప్రతీదానికి "ఓ" తగిలిస్తారు. 'భూత్' కి కూడా 'ఓ' తగులుకుంది.

ఇద్దరం ఇంటికొచ్చాం, ఇల్లంతా పరీక్షించి చూసాడతను. ఇదెప్పట్నించి అనడిగాడు. గత రెండుమ్మూడోజులుగా అన్చెప్పాం, గబగబా ఫోన్లు చేసాడు. అట్నుంచి ఏం సమాధానం వచ్చిందో తెలీదుగానీ 'భూత్' న అంటూ నాతోపాటు సోఫాలో కూలబడ్డాడు.

నేనేదో చెప్పబోతే "రెండునిముషాల్లో ఇంజనీరు వస్తాడు. విషయం తెలుస్తుంది." అన్నాడు ఏ ఇంజనీరు? ఇంజనీరు వచ్చి ఏం చేస్తాడు. అసలు ఇంటిలో భూతానికి ఇంజనీరుకి సంబంధం ఏమిటి? బెంగాల్లో భూతాల్ని ఇంజనీర్లే వెళ్ళగొడ్తారు కాబోలు అని పరిపరివిధాల పోతున్న మనసుని తొక్కిపట్టి వాడితో పాటు సోఫాలో కూర్చున్నాం.

వస్తాడు వస్తాడు అనుకున్న ఇంజనీరు భూతవైద్యుడు ఇద్దరిముగ్గురితో సహా ఇల్లు వెదుక్కుంటూ మరీ వచ్చాడు. మేం చెప్పిందంతా విన్నాడు. గోడమీద పగుళ్ళు అవీ చూసాడు. ఫోటోలు తీసాడు. బాత్రూము, పెరడు అన్నీ పరీక్షించాడు.

వాడు చేస్తున్న పన్లన్నీ చాలా శ్రద్ధగా గమనించా. వాళ్ళలా పరీక్షిస్తుంటే ఇంటి ఓనరు మేం భూత్ అనుకున్నామని మా అనుభవాలన్నీ చెప్పాడు...... మా అనుభవాలన్నీ విన్నాక, వచ్చిన ఇంజనీర్లు తెగ నవ్వారు. వాళ్ళంతా మెట్రో ఇంజినీర్లు.....

మా ఇంట్లో దెయ్యం వుంటే వాళ్ళకి సరదాగానే వుంటుంది, అనుకున్నా కానీ నా ఆలోచన్లని కొట్టిపారేస్తూ మెట్రో ఇంజనీరు..... "అది దెయ్యం కాదండి. మీ ఇంటి ముందు మెట్రో రైలు వెయ్యడానికి పెద్ద కందకం తవ్వారు. ఆ తవ్వకం అయిపోగానే దాని ఇరువైపులా ఒడ్డులకి అమర్చిన "డయాఫ్రమ్ వాల్" కందకంలోకి ఒరిగిపోకుండా సపోర్ట్ (దాపులు) పెట్టాలి. కాని తవ్వకాలన్నీ పూర్తయాక అందులో ఒకడు పడి చచ్చిపోయాడు. పనాగిపోయింది. సరైన సమయంలో దాపులు పెట్టకపోవడం వల్ల.... డయాఫ్రమ్ వాల్ ముందుకి ఒరిగింది. దానితో పాటు మీ ఇంటిపునాదులూ ముందుకి ఒరిగాయి. అందుకే మీ ఇంటి తలుపులు బిగుసుకుపోయాయి. ఇక ఇల్లు మొత్తంగా కందకంలోకి ఒరగడం వల్ల ఇంటి వెనక భాగంలో వున్న బాత్రూములో నేల మట్టం మారిపోయింది. అందుకే నీరు తూముల్లోకి పోలేదు. రోజురోజుకీ నేలమట్టం మారుతూండడం వల్ల, నీరు తూముగుండా పోకపోగా, వాడిన నీరు తిరిగి బాత్రూములోకే వచ్చేసేది' అంటూ

వివరించాడు. మెట్రో ఇంజనీరు.

"మరి అర్ధరాత్రి బాత్రూములోంచి విచిత్రమైన శబ్దాలొచ్చేవి, "వాటి సంగతేమిటి?" అంటూ ప్రశ్నించింది లత అనుమానంగా.

"వాటి సంగతి చెప్పడం కష్టం... 'అంటూ నీళ్ళు నమిలేడు ఇంజనీరు. దాని గురించి అనేక తర్జన భర్జన్లు జరిగాక" అవి ఎలకలేమోనర్రా?" అంది అమ్మ...... అది నిజమేనేమో అనిపించింది. తూములు పొడవడానికి గ్రేటింగ్ తీసి, మరి పెట్టలేదు. ఎలుకలు వచ్చి వుంటాయి....... అవి నీళ్ళల్లో ఆడిన ఆటలే దెయ్యంగా భ్రమపడ్డామేమో అనిపించింది.

"అది సరే మరి మిగతా ఇళ్ళకి ఈ సమస్య లేదా?" అనడిగా

"అన్ని ఇళ్ళకీ ఈ సమస్య ఉండదు, మీ ఇంటి పునాదిని బట్టి సమస్య తీవ్రం అయింది అంతే" అన్నాడు మెట్రో యింజినీరు..........

ఇది జరిగిన నాల్గురోజులకి మెట్రోవర్కు మొదలయింది. మా ఇంటి బాత్రూము బాగయింది. ఇంట్లో దెయ్యం మాయమయింది.

ప్రేతాత్మ *(ఆంధ్రజ్యోతి, ఆదివారం అనుబంధం 12 సెప్టెంబరు 2004)*

# అయిదో దొంగ

"ఇది మీ తాత కథరా?" అంది మామ్మ బోసిగా నవ్వుతూ.

మామ్మకి తాత పెద్ద హీరో! ఆ విషయం బోసి నవ్వులో స్పష్టంగా కనబడేది. కథ మొదలయింది.....

మీ తాతకి తెల్లవారుఝామునే లేచి పళ్ళ మధ్య చుట్ట బిగించి చెరువు గట్టుకి పోడం అలవాటు. ఆ రోజు అలానే జరిగిపోతుందని ఆయన అనుకున్నారు. పక్షుల కలకలారావంతో తెలివొచ్చి దొడ్లోకి వెళ్ళి, కర్ర తీసుకుని దొడ్డి గుమ్మంలోంచే చెరువు గట్టుకి వెళ్ళిపోయారు. కానీ వీధి గుమ్మంలో ఇంత పెద్ద విపత్తు వచ్చిపడుతుందని అనుకోలేకపోయారు.

తూర్పు తెల్లవారింది. వెలుగు రావడంతో చిట్టి కళ్ళాపు తీసుకుని వీధి గుమ్మం వేపు వెళ్ళింది. లంగా పైకి ఎగ్గట్టి కళ్ళాపు జల్లింది. అష్టదళపద్మం పెట్టింది. ముగ్గు పెడుతున్నప్పుడు చిట్టి మీదకి కావిడి రంగడు నీళ్ళు చిలకరించాడు కాబోలు, లోపల సంతోషపడుతూనే, పైకి వాడ్ని తిట్లు తిట్టింది.

చిట్టి వేసిన ముగ్గులోకి బలి పశువులా వచ్చాడు జానకి రామయ్య మొహం అంతా పీక్కుపోయి ఉంది. ఏదో పోగొట్టుకున్న దైన్యం మొహంలో స్పష్టంగా కనిపిస్తోంది. ఇరవై మైళ్ళు నడిచి వచ్చిన అలసటకి గుండెలు ఎగసిపడుతున్నాయి.

"సీతారామ్ ఉన్నాడా?" అన్నాడు ఆతృతగా. చిట్టి సమాధానం చెప్పకుండా, "అమ్మగారూ" అంటూ నన్ను కేకేసింది.

పొద్దున్నే చెవి తెగిన మేకలా ఇది కేకేసింది అంటే రంగడు ఏదో మోటు సరసం ఆడి ఉంటాడు అనుకున్నాను. ఆ రంగడు ఏకాంతంలోనూ, చీకట్లోనూ దాన్నేదో మోటు సరసం ఆడుతూనే ఉంటాడు. అది వెలుగులోకి వచ్చి వాడ్ని తిడుతూనే ఉంటుంది. అలాగని వాడికి ఒంటరిగా దొరక్క మానదు.

"ఏమైందే!" అంటూ బైటకి వచ్చిన నాకు ఎదురుగా జానకిరామయ్య గారు కనిపించారు.

"రండి రండి అన్నయ్యగారూ" అంటూ ఆహ్వానించాను. చిట్టి లోపలి నుండి నులక మంచం తెచ్చి అరుగు మీద వేసింది.

"ఏమిటి ఇంత పొద్దున్నే ఇలా వచ్చారు? అని అడిగాను.

నన్ను చూసిన వెంటనే ఆయన భుజం మీది కండువాతో మొహం కప్పుకున్నాడు. చెట్టంత పెద్ద మనిషి నా ఎదురుగుండా ఏడవడం బావుండదేమో అనుకుని ఉంటాడు.

"ఆయన లేరు, కూర్చోండి అన్నయ్యగారూ! కాఫీ తెస్తాను" అంటూ లోపలికి వెళ్ళాను.

నేను లోపలికి వెళ్ళాను. ఆయన దొడ్డి గుమ్మంలోంచి వచ్చారు.

"జానకి అన్నయ్యగారు వచ్చారు" అని చెప్పాను.

మీ తాత "ఎందుకూ?" అంటూనే పందోపుల్ల పళ్ళ మధ్య పెట్టుకుని వీధి గుమ్మంలోకి వెళ్ళారు.

గుమ్మంలో "ఏరా జానకీ? బావున్నావా?" అని ఆయన అడగడం జానకిరామయ్య భోరని ఏడవడం వినిపించాయి.

"సర్లే ఊరుకో - ఆడదానిలా ఏడుపేమిటి? ఏం జరిగిందో చెప్పు" అంటూ మీ తాత నోట్లో పందోపుల్ల నములుతూ "చిట్టీ, నీళ్లు పట్టుకురా!" అని కేక పెట్టేరు.

జానకిరామయ్య కాసేపటికి తేరుకుని, "ఇదుగో ఇది చదువు" అంటూ చిన్న కాగితం ఇచ్చేరు. ఆ కాగితం తీసుకుని చూసిన మీ తాత నిశ్చేష్టులైపోయారు.

ఆ కాగితం బాగా నలిగి ఉంది. దాని నిండా మరకలు, మట్టి అంటుకుని వున్నాయి. కాని కాగితంలో ఉన్న రెండు వాక్యాలూ ఆటంబాంబంత శక్తివంతమైనవి. ఒక ఆడదాని రెండు కన్నీటి బొట్లు - "నాన్నా - నన్నీ నరకం నుండి తప్పించు. లేదా నేను యే నుయ్యో గొయ్యో చూసుకుంటాను - అమ్ము".

అమ్ము జానకి రామయ్య కూతురు. ఈ ఊరికి పదిహేను మైళ్ళ దూరంలో అంబకండిలో దాని అత్తారు. ఊరులన్నీ వేరయినా మేమంతా బీరకాయ పీచు చుట్టాలమే. అమ్మూని అత్తారు ఆరళ్ళు పెడుతోందని చెప్పుకోడమే గాని అది ఇంతవరకూ వొస్తుందని అనుకోలేదు.

"అసలేం జరిగింది?" అని అడిగారు ఆయన.

మొన్న రాజయ్య అమ్ము అత్తారింటికి వెళ్ళారట. అమ్ము కనిపించనే లేదట. అత్తగారే అమ్ము క్షేమంగానే ఉందని చెప్పి పంపించారట. అంతలో వీధి గుమ్మంలోకి వచ్చిన రాజయ్య గారికి అమ్ము వచ్చి ఈ కాగితం ఇచ్చి ఏం చెప్పకుండానే వెళ్ళిపోయిందట. కానీ అమ్ము ఆకారానికి, ఆ కాగితం ముక్కకీ భేదమే లేదట. అమ్ము కట్టుకున్న చీర చీరలా కాక నల్లగా తాటి చెట్టు బెరడులా ఉందట. తైల సంస్కారం లేని జుత్తు అట్టలు కట్టి ఉందట. అమ్ము పదహారేళ్ళ అమ్మాయిలా కాక సమాధిలోంచి లేచి వచ్చిన అస్థిపంజరంలా ఉందిట. ఇదంతా చెప్పి రాజయ్య కళ్ళంట నీళ్ళు పెట్టుకున్నాడు - "నేను ఇప్పుడు ఏం చెయ్యగలను? ఎక్కడికి వెళ్ళను? అమ్ము అత్తగారుందే, రాక్షసి! ఇంతకు ముందు దాన్ని కష్టాలు పెడుతోందని తెలిసి వెళ్ళి పిల్లని పంపించమని అడిగాను. కానీ 'పెళ్ళిళ్ళు చేసింది మీ ఇంట్లో ఉంచుకోడానికా, వెళ్ళు వెళ్ళు' అని కఠినంగా

మాట్లాడింది. నాకేం తోచడం లేదు. ఏం చెయ్యలేని నిస్సహాయుడ్ని. అమ్ము మొగుడా అమాయకుడు. దాన్ని ఆదుకునే స్థితిలో లేడు. ఆఖరి ఆశగా నీ దగ్గరికి వచ్చాను. నీదే భారమంతా! నా అమ్ముని బతికించు!'' జానకి రామయ్య గొంతుక బొంగురు పోయింది. మాట్లాడలేకపోయాడు.

మీ తాత మొహం కడుక్కోవడం పూర్తిచేసి కంచుగ్లాసుతో కాఫీ తాగుతూ, ఆలోచనలో పడిపోయారు. అమ్ము సంసారాన్ని కాపాడాలి. అమ్ముని బతికించాలి. ఇదీ ఆయన ఆలోచన!

కాఫీ తాగడం పూర్తిచేసి "జానకీ, అల్లుడ్ని నీ దగ్గరే ఇల్లరికం పెట్టుకుంటావేమిటిరా?'' అని అడిగారు.

"అమ్ముని బతికించరా అంటే అల్లుడు ఇల్లరికం అంటావేమిటోయ్? అంది చచ్చాక వాడెందుకూ నా నెత్తి మీదకి'' అన్నాడు జానకిరామయ్య చికాకుగా.

"అదికాదు జానకీ! అమ్ముని, అల్లుడ్ని నీ దగ్గర ఉంచుకుంటావా అని!''

"ఇద్దరూ వస్తే ఎందుకు ఉంచుకోనూ! అందుకు అభ్యంతరం ఏముంటుంది?'' జానకిరామయ్య ఆశ్చర్యంగా అన్నాడు.

"ఇద్దరూ వస్తారా? వెళ్ళి తీసుకురావాలి.'' అని నవ్వి నీ అమ్ము కొచ్చిన కష్టం ఏం లేదుగాని వెళ్ళి స్నానం చేసి చిన్న కునుకు తియ్యి... చిట్టీ వేడి నీళ్ళు పెట్టు'' అని పురమాయించారు. మీ తాత. ఆయన్ని అనుమానంగా చూస్తూనే జానకిరామయ్య స్నానం చెయ్యడానికి ఇంట్లోకి వెళ్ళేరు.

మీ తాతతో వచ్చిన చిక్కే అది. ఆయన ఏం ఆలోచిస్తున్నారో, ఏం చేస్తారో కూడా ఎవరికీ చెప్పరు. కానీ ఇంతవరకూ ఆయన తలపెట్టిన పనిని పూర్తి చెయ్యకుండా వదిలిపెట్టలేదు!

వీధిలో కూర్చునే "రంగడూ!'' అని కేకసారు. పెరట్లోంచి రంగడూ, వంటింటిలోంచి నేనూ ఒకేసారి వీధిలోకి వెళ్ళాం. కానీ నేను రావడం చూసి "రంగా, సెట్టి కొట్టుకు వెళ్ళి చుట్టలు పట్రా'' అన్నారాయన.

రంగడు చుట్టలకి వెళ్లబోతూంటే "ఒరేయ్ ఆ పట్టునే వెళ్ళి వీరనాయుడ్ని నేను అర్జెంటుగా పిలిచానని చెప్పి తీసుకురా'' అన్నారు.

వీరనాయుడు వచ్చేసరికి మధ్యాహ్నం అయింది. మీ తాత, వీరనాయుడు వీధిలో కూర్చుని చాలాసేపు గుసగుసలాడారు.

"అరగంట తర్వాత అన్నీ తోట దగ్గర సిద్ధం చేయిస్తాను. మీరు రెండు గంటలకల్లా వచ్చేయండి'' అని వెళ్ళిపోయాడు వీరనాయుడు.

మీ తాత భోజనం చేసి కాస్త ఆయాసం తీర్చుకుని, "నేను అంబకండి వెళుతున్నాను.

రాత్రికి గానీ రాను. జానకి రామయ్యని ఉండమని చెప్పు!'' అన్నారు.

"మీ తాత, చేతిలో కర్ర, నోట్లో చుట్ట అన్నీ అంబకండి వెళ్ళాయి.

"నా పుట్టిల్లు అంబకండే. మా అమ్మగారింటికి, అమ్మ అత్తవారిల్లు రెండు మూడు ఇళ్ళ దూరం. వాళ్ళు మా చుట్టాలే. ఈయన అక్కడికి వెళ్ళి ఏం అల్లరి పెడతారో అని నా గుండె గుబగుబలాడింది. అన్నింటికీ ఆ భగవంతుని మీదే భారం వేశాను. అలా అంబకండి వెళ్ళిన మీ తాత తిన్నగా మా అమ్మ - అంటే ఆయన - అత్తవారింటికి వెళ్ళారు''.

"ఏమోయ్ ఇలా వచ్చావు?'' అన్న మామగారికి ఏదో సమాధానం చెప్పి 'ఎలాగూ వచ్చాను కదా అందర్నీ పలకరించి వస్తాను' అని అమ్మ ఇంటికి వెళ్ళారు. అమ్మ అత్తగారు లోపల ఏదో పనిలో ఉంది. ఆయన గబ గబా అమ్మ కోసం వెతికారు. అమ్మ పెరడులో కనిపించింది.

అమ్మ దగ్గరికి వెళ్ళి "అమ్మా! సాయంత్రం ఆరు గంటలకి పెరటి తలుపు తీసి అక్కడ నిలబడు. అక్కడికి ఒక మనిషి వచ్చి సీతారామయ్యగారి తాలూకా అని అడుగుతాడు. అతని వెనుక వెళ్ళిపో. వెనక్కి తిరిగి చూడకు -'' అని చెప్పారు. ఆ వెంటనే వెనక్కి వచ్చి వంటింటిలోకి వెళ్ళి అమ్మ అత్తగార్ని " ఏం దొడ్డమ్మా బావున్నావా?'' అని పలకరించారు.

"ఎవరూ సీతారాముడా? ఎప్పుడొచ్చావోయ్,'' అంటూ అమ్మ అత్తగారు అభిమానంగా పలకరించింది.

"బాబాయిగారు ఏరీ?'' అన్నారు మీ తాతగారు.

"ఆయన మావిడి తోట అమ్మకం విషయమై పక్క ఊరికి వెళ్ళారు. రాత్రికి గాని రారు'' అందావిడ.

"దొడ్డమ్మా నీకు కథల పిచ్చి తగ్గిందా, లేదా'' అని అడిగారట మీ తాత నవ్వుతూ.

అమ్మ అత్తగారు పొంగిపోతూ, "నువ్వు వచ్చాక అదెక్కడికి పోతుంది? కూర్చో కథ చెప్పి వెళుదువుగాని'' అంటూ పీట వేసింది.

"అదికాదు దొడ్డమ్మా! అందర్నీ పలకరించి రాత్రికి ఊరెళ్ళి పోవాలి. ఇంకో గంటలో నువ్వు మా అత్తగారింటికి రా. అక్కడ రాత్రి ఏడు వరకూ కథలు చెప్పుకోవచ్చు. వస్తాను'' అని చెప్పి మీతాత తిరిగి అత్తారింటికి వచ్చేసారు. సాయంత్రం ఐదు గంటలకి అమ్మగారింటిలో సమావేశం జరిగింది. కాస్త ఆ మాటలూ, ఈ మాటలూ అయాక..... "కథ చెప్పవోయ్ సీతారామ్'' అంది అమ్మ అత్తగారు.

"మీ తాత కథ మొదలు పెడితే అది సమ్మోహనాస్త్రమే. ఆ రోజాయన నలుగురు దొంగల కథ ఎన్నుకున్నారు. వాళ్ళ పేర్లు, శత డబ్బు, సహస్ర డబ్బు, ఆకాశ డబ్బు,

అంతరిక్ష డబ్బు. వాళ్ళు దొంగతనంలో తమ సామర్థ్యాన్ని పరీక్షించుకోవాలనుకున్నారు. శత డబ్బు లీలలే అరగంట పట్టాయి. సహస్ర డబ్బు లీలలు సగానికి రావడానికే అంతకంటే ఎక్కువ సేపు పట్టింది.

అప్పుడు

వీధిలోంచి "సీతారామయ్యగారూ" అన్న పిలుపు వినబడింది. మీ తాత లేచి బయటకు వెళ్ళారు. వీధిలో నిలుచున్న మనిషి 'అయ్యా వచ్చిన పని అయిపోయింది" అన్నాడు. దానికీయన, "మీరు మెల్లగా నడుస్తూండండిరా. నేను వెనకాల వస్తాను" అని వాడిని పంపించి, లోపలికి వచ్చారు. కథ పూర్తి చేస్తారేమో అని అనుకున్నారు - దొడ్డమ్మ గారు, అత్తగారు. కాని ఈయన లోపలికి వస్తూనే, "అత్తయ్యా! నేను బహిర్ ప్రదేశానికి వెళ్ళాలి. చెంబుతో నీళ్ళు ఇవ్వు" అన్నారు.

మా అమ్మ నీళ్ళు తేవడానికని లోపలికి వెళ్ళింది.

"దొడ్డమ్మా ఇప్పుడే వచ్చి కథ పూర్తి చేస్తాను. ఎక్కడికీ వెళ్ళకేం! మళ్ళీ మీ ఇంటికి వచ్చి కథ చెప్పడానికి నాకు టైముండదు" అన్నారు.

"అలాగే నాయనా నాకు పనేం లేదు. రాత్రి ఎనిమిది దాటితేగానీ ఆయన, సీతప్పరారు. అంతవరకూ ఖాళీయే" అంది దొడ్డమ్మ గారు నవ్వుతూ.

చెంబుతో దొడ్లోకి అని బయలుదేరిన మీ తాత ఇంట్లోంచి బయటకి రాగానే చెంబులో నీళ్ళు రోడ్డు పక్కని పోసి గబగబా నడిచి ఊరి పొలిమేర చేరుకున్నారు. అక్కడ మొదటి జోడీ కర్రలు పట్టుకుని నిలబడి ఉన్నారు.

"ఏరా ఏమైంది?" అని అడిగారీయన వాళ్ళని. "పల్లకీ వెళ్ళి అరగంట అయింది దొరా!" అన్న వాళ్ళ సమాధానం విని, "సరే బయలుదేరండి" అని వాళ్ళతో బయలుదేరారు.

మరి కొంతదూరం వెళ్ళేసరికి కర్రలు పట్టుకుని నిలబడ్డ రెండో జోడీ కనిపించారు.

"ఏరా పల్లకీ వెళ్ళి ఎంతసేపయింది?"

"ఇప్పుడే దాటింది దొరా"!

"గొడవేం జరగలేదు కదా?"

"లేదు దొరా"

"సరే మీరిక్కడ ఒక అరగంట దాకా ఉండి వచ్చేయండి" అని చెప్పి వేగంగా నడిచి పల్లకీని అందుకున్నారు. పల్లకీ తొందరగానే సాగుతోంది.

ఈయన లోపలికి తొంగిచూసి పల్లకీలోది అమ్మి అని నిర్ధారించుకున్నాక పల్లకీ వాళ్ళతో, "ఎవరేనా పల్లకీలో ఎవరు అని అడిగారు ఏమిట్రా?" అని అడిగారు.

"ఒకరిద్దరు అడిగారు దొరా! కానీ, జమీందారుగారి తాలూకా అని చెప్పడంతో మరే ప్రశ్న వేయలేదు''

"సరే మీరు మెల్లగా రండి'' అని ఈయన ముందుగా ఈ ఊరు వచ్చేసారు. ప్రతి మైలుకి జోడు మనుషుల్ని పెట్టి పల్లకీని ఎవరూ అడ్డగించకుండా జాగ్రత్త పడడం వల్ల అమ్మ విషయంలో ఆయనకి పెద్ద విచారం లేకపోయింది.

ఆ రకంగా అమ్ము మా ఊరు వచ్చేసింది.

అక్కడ ఎదురుచూసి ఎదురు చూసి, ఈయన ఎంతకీ రాకపోయేసరికి దొడ్డమ్మ గారికి అనుమానం వచ్చి ఇంటికి వెళ్ళి ఇల్లంతా వెదికింది. అమ్ము ఎక్కడా కనబడలేదు. పెద్దపెద్ద కేకలు వేస్తూ మీ తాతని నానా తిట్లూ తిట్టింది. పాలేరుని పిలిచి వెళ్ళి చూసి రమ్మని పంపింది. వాడు ఊరి పొలిమేరల్లో మీ తాతగారు నిలబెట్టిన మనుషులని కలుసుకుని అమ్ము గురించి, మీ తాత గురించి ప్రశ్నించాడు. వీళ్ళిద్దరికీ వాడి మీద అనుమానం వచ్చి వాడితో లేనిపోని తగాదా పెట్టుకుని వాడ్ని అక్కడ్నించి కదలకుండా చేసారు.

అమ్ము మనింటికి వచ్చిన మర్నాడు పొద్దున్నే అంబకండి నుండి దొడ్డమ్మగారు పంపిన పాలేళ్ళు వచ్చారు. అప్పటికి ఈయన వీధిలో కూర్చుని మొహం కడుక్కుం టున్నారు.

వచ్చిన పాలేళ్ళు "అయ్యా! చిన్నమ్మగారు ఇక్కడికి వచ్చారాండి?'' అని అడిగారు.

ఈయన లేని కోపం తెచ్చుకుని ఆశ్చర్యపోతూ "అమ్ము ఇక్కడెందుకుంటుంది? ఇన్నాళ్ళూ దాన్ని బాధలు పెడుతున్నారనే విన్నాం. కొంపదీసి దాన్ని చంపేసేరేమిటి? పోలీస్టేషన్‌లో పెట్టిస్తా, వెధవల్లారా! ఏమనుకున్నారో - ఒక ఆడదాన్ని, అదీ అభం శుభం తెలియని పిల్లని చంపేస్తా్రా? సాయంకాలంలోగా ఆ సీతప్పని, వాళ్ళ నాన్నని నేను రమ్మంటున్నాని చెప్పి పిలిపించండి. లేకపోతే పోలీసులతో నేనే అక్కడికి రావలసి ఉంటుంది'' అంటూ కేకలు వేసి వాళ్ళని హడలుగొట్టి పంపేసారు.

ఆ సాయంత్రం సీతప్ప, వాళ్ళ నాన్న మా యింటికొచ్చారు. ఆ రాత్రి ఇక్కడే ఉండిపోయారు. ఆ రోజు పొద్దున్నే అమ్ముకి తలారా స్నానం చేయించి, సాంబ్రాణి పొగవేసి, తెల్ల చీరకట్టి, జడలో సంపెంగలు ముడిచి సిద్ధంగా ఉంచాను. పెద్దవాళ్ళందరూ మాట్లాడుకుంటుండగా సీతప్పని అమ్ముకి అప్పచెప్పేసి బైటకి వచ్చేసాను. సీతప్ప తండ్రి మొదట కొడుకు ఇల్లరికం ఉండటానికి ఒప్పుకోలేదు కానీ కొన్నాళ్ళే అని చెప్పేక అయిష్టంగానే తలూపాడు. మర్నాడు అమ్మునీ సీతప్పనీ తీసుకుని జానకిరామయ్య వాళ్ళ ఊరు వెళ్ళిపోయాడు. సీతప్ప తండ్రి వాళ్ళ ఊరు బయలుదేరగా ఈయన, "దొడ్డప్పగారూ ఈ చెంబు మా అత్తగారింట్లో ఇచ్చేద్దురూ! మా అత్తగారు బెంగ పెట్టుకుని ఉంటారు''! అని ఆ దొడ్డి చెంబును ఈయన చేత మా అమ్మగారి ఊరు పంపించారు.

అప్పుడు నేను మీ తాతతో, "మీరు నలుగురు దొంగల కథ వాళ్ళకి చెప్పారు కాని అయిదోదొంగ కథ నాకు తెలిసింది!" అన్నాను.

"అమ్మని వాళ్ళ నాన్నకి అప్పగిస్తే అది దొంగతనమా?" మీ తాత చిరాకు పడ్డారు.

"అమ్మ గురించి కాదు. మా అమ్మ చెంబును మీరు దొంగిలించారుగా - మీరు చెంబుదొంగ" అన్నాను.

"మీ తాత మంచి ఉత్సాహంగా, 'అయితే అయిదో దొంగ కథ నువ్వు చెప్పుకో' అన్నారు నవ్వుతూ.

"పతివ్రతను కదా - ఆ పనే చేస్తున్నాను మరి!" అంటూ మామ్మ నావంక చూస్తూ బోసినోటితో నవ్వింది.

ఆ నోరు బోసిదే కావచ్చు. కానీ అందులోంచి ఎంత రసవత్తరమైన కథ బయటకి వచ్చిందీ!

*అయిదో దొంగ* *(రచన, ఆగష్టు 1995)*

# విలువలు

తాతగారి లీలలు అడక్కుండా చెప్పడం అలవాటే కదా - ఆ రోజు మామ్మ ఇంకో కథ ప్రారంభించింది....

"అమ్మగారూ'' అన్న చిట్టి కేకకి ఉలిక్కిపడి పెరట్లోకి వెళ్ళాను. దూడల మధ్య రంగడికి అందకుండా తప్పించుకు తిరుగుతోంది చిట్టి. రంగడు చేతిలో ఏదో పట్టుకుని చిట్టిని వెంటాడుతున్నాడు. నన్ను చూసినా రంగడు వెళ్ళిపోలేదు, అంటే చిట్టి వాడ్నేదో అనే ఉంటుంది. "ఏమైందిరా రంగడూ?'' అన్నా.

"చూడండి అమ్మగారూ నేను పిన్నులగర్ర వాయించుకుంటోంటే, ఇది వచ్చి 'బృందావనంలోని కృష్ణమూర్తి కరణంగారింట్లోకి ఎలా వచ్చాడబ్బా?' అంది. ఆపట్టునే నేను - 'నీతో వసంతం ఆడ్డాని కొచ్చాడే' అన్నాను. నా సేతిలో రంగుని చూసి ఎర్ర బట్టని చూసిన గొడ్డులా బెదిరిపోతోంది'' అన్నాడు రంగడు నవ్వుతూ.

రంగడు నా వేపు తిరిగి మాట్లాడుతుండగా, చిట్టి మెల్లగా తప్పించుకో ప్రయత్నించింది. కానీ రంగడు దాన్ని ఒకకంట కనిపెడుతూనే ఉన్నాడు. చిట్టి దగ్గరగా రాగానే రంగు నెత్తి మీంచి పోసేసాడు. చిట్టికి కోపం వచ్చింది. బుంగమూతి పెట్టి వాళ్ళింటికి వెళ్ళిపోయింది. వీళ్ళ ముచ్చట చూస్తుండగానే పూజ గదిలోంచి గంట వినబడింది. చిట్టి, రంగడు గొడవలో పడి, ఆయనకి - అదే మీ తాతకి భోజనం వడ్డించడం మర్చిపోయాను. వంటింట్లోకి వెళుతూ చూసాను. ఇంటి ముందర సింహాద్రి కూర్చున్నాడు. ఎంతో ఆశగా ఇంటిలోకి చూస్తున్నాడు. మీతాత కోసమే అనుకుంటా! 'సరిలే కాసేపు కూర్చుంటాడులే' అనుకున్నాను.

మీ తాత దేవతాపీఠం ముందు నుంచి లేచారు. ఆయనకి వెండి కంచం పెట్టి, వడ్డించి విసిన కర్ర పుచ్చుకుని విసురుతూ కూర్చుని. "మాలపల్లె నుండి సింహాద్రి వచ్చాడు'' అని చెప్పాను.

"అలాగా'' అని తల ఊపారు.

మీ తాత భోంచేసి కచేరీ గదిలోకి వెళ్ళిపోయారు. సింహాద్రిని రమ్మని కబురుపెట్టారు.

సింహాద్రి వినయంగా కచేరీ గదిలోకి వెళ్ళాడు. దరిద్రం అన్నది అఖ్ఖర్లేని వరం లాంటిది. అలాంటి వరం పొందిన వాళ్ళలో సింహాద్రి ఒకడు. ఆరునెల్ల క్రితం ఈయన ఎంతో కష్టపడి పోరంబోకులా పడి ఉన్న రెండు ఎకరాల భూమిని సింహాద్రికి ఇప్పించారు. సింహాద్రి ఆ భూమిని బాగుచేసుకుని ఆకాశం వైపు వర్షం కోసం ఎదురుచూస్తుండగా, భూమిమీద నాయుడు గారి కంచె మెల్లమెల్లగా నడిచి, సింహాద్రి రెండు ఎకరాల భూమినీ

ఆక్రమించుకుంది.

నాయుడు ఆ ఊరికి పెద్ద కామందే కాక, కాంగ్రెసులో తిరగడం వలన, పెద్ద పెద్ద వాళ్ళతో కాస్త పరిచయం ఉంది. అంతేకాక నాయుడు తప్ప ఊర్లో అందరూ సామాన్య గృహస్తులే కావడం, ఎకరం రెండు ఎకరాల గాళ్ళే కావడం వలన, నాయుడుగారి నాయకత్వం, ఔద్ధత్యం అందరికీ అంగీకారమే! నాయుడుగారు కూడా చెప్పుకోతగ్గంత చెడ్డవాడు కాదు. కానీ ఆయనకి ఇష్టమైంది, మనసుకు తోచింది, చేసి తీరతాడు. కాని ఆయన పేరు పెట్టుకుని అనేక మంది తమ స్వంత పనులు చేసుకుంటారు.

"ఏమోయ్ సింహాద్రీ - ఇలా వచ్చావ్?'' అన్నారు ఈయన.

ఈయనకి తెలుసు సింహాద్రి కిచ్చిన రెండెకరాలూ నాయుడు ఆక్రమించు కున్నాడనీ, ఎప్పుడో సింహాద్రి వచ్చి ఫిర్యాదు చేస్తాడనీ! అన్యాయం జరిగింది అని గట్టిగా, నమ్మకంగా తెలిసినా పంచాయితీ పెట్టి నాయుడ్ని నిలదీసేంత సత్తా, ఈ ఊళ్ళో ఎవరికీ లేదు. ఒకవేళ అలా చేసినా ఊరు రెండుగా చీలిపోతుంది. లేనిపోని కక్షలు బయలుదేరతాయి. ఇంతకీ ఇలా జరిగిందని నాయుడికి తెలుసో తెలీదో, నాయుడు పాలేర్లలో ఎవరికైనా సింహాద్రి మీద కోపం ఉండి వీడి భూమిని కూడా ఆక్రమించారేమో? లేక ఈ విషయం తెలిసీ నాయుడికి ఇష్టమై ఊరుకున్నాడేమో? దీనిని ఎలా పరిష్కరించాలా అన్న ఆలోచనతో నాలుగు రోజుల్నించి సతమవుతున్న ఈయనకి, సింహాద్రి చేసిన ఫిర్యాదు విని సలహా చెప్పవలసిన అవసరం వచ్చింది.

ఇంక నాయుడికి, మీ తాతంటే గౌరవం. ఆ గౌరవం ఎలాంటిదంటే నాయుడి నాయకత్వాన్ని స్వీకరించిన మీ తాత తెలివితేటల మీద ఉన్న గౌరవం. నాయుడ్ని ఎదిరించినా నాయుడ్ని ప్రశ్నించినా ఆ ఊరిలో బతకడం కష్టం. అయితే, నాయుడికి తెలిసో, తెలియకో జరిగిన తప్పుని సవరించడం ఎలా?

ఈ పని తెలివితేటల వల్లా, ఘర్షణ వల్లా జరగకూడదు. కానీ నాయుడు దగ్గర్నించి రెండెకరాలూ సంపాదించాలి. ఎలా? ఈ ధర్మసంకటం మీ తాతని చాలా ఆలోచించేటట్టు చేసింది. మీ తాతకి ఇంకో అనుమానం కూడా వచ్చింది. ఈ కరణంగాడు, నా పొలం పక్కనున్న పొలాన్ని, నన్నడగకుండా వాడెవడో ముక్కూ మొహం ఎరగని సింహాద్రికి ఇస్తాడా - అనే అహం కూడా ఉందేమో? తను పొలం గురించి అడిగితే ఏం జవాబు చెప్పాలో నాయుడు బాగా ఆలోచించి పెట్టుకుని ఉండాలి. ఒకసారి ఏ సమాధానమైనా వస్తే దానికి తిరుగు జవాబు ఉండదు. తనేం చేసినా ఘర్షణ క్రిందే వస్తుంది. ఎంత ఆలోచించినా మీ తాతకి ఏం చెయ్యాలో తెలియలేదు.

అని మామ్మ కథని మధ్యలో ఆపింది. మామ్మ గొంతుకలో మార్పు వచ్చింది - "మీ తాత మనిషిరా, జాలి, దయ కల మనిషర్రా'', అంటూ మళ్ళీ కొనసాగించింది.

"సింహాద్రి మీద చాలా సానుభూతి ఉంది. ఆయన ఏమాలోచించారో గానీ -

దేవతా పీఠం దగ్గర ఉన్న రాగి చెంబులో నీళ్ళు తీసేసారు. ఉద్ధరిణి తీసి దేవతా పీఠం పక్కగా పెట్టారు.

"చిట్టీ" అని పిలిచారు.

చిట్టి వచ్చింది. చేతిలో చెంబు చిట్టి చేతికి ఇచ్చి తోమమన్నారు. అది శుభ్రంగా తోమి తీసుకొచ్చింది. దానిని దేవతా పీఠం దగ్గరుంచి నిశ్చింతగా నిద్రపోయారు.

మర్నాడు యథావిధి కార్యక్రమాలు జరిగిపోయాయి. ఏడు గంటలకి స్నానం చేసి పూజ చేసుకుని ఆ పట్టుపంచెతోనే చెంబు తీసుకుని బయలుదేరారు.

"అయ్యగారు నేనూ రానండీ" అన్న రంగడ్ని వద్దని ఆపు చేసారు.

మీ తాత తిన్నగా నాయుడు గారింటికి వెళ్ళి వాకిటి గుమ్మం దాటి, సింహద్వారం దగ్గరికి వెళ్ళి నిలబడ్డారు. ఇద్దరు పాలేర్లు "పంతులుగారూ కూర్చోండి" అన్నారు. మీ తాత కూర్చోలేదు. సింహద్వారం దగ్గరే నిలబడ్డారు. ఇంతలో లోపలికి కబురు వెళ్ళింది. నాయుడు గారు బైటకి వచ్చారు.

నాయుడిగార్ని చూసిన వెంటనే, మీ తాత, 'కాస్త బిక్ష పెట్టండి" అన్నారు.

"ఏమండీ కరణంగారూ ! ఇంట్లో ఏదైనా పూజా ఏమిటి? ఇలా బిక్ష కొచ్చారు" అని నవ్వారు నాయుడు గారు.

మీ తాత నవ్వకుండా, "కాస్త బిక్ష పెట్టండి" అన్నారు.

"బిక్ష ఇంట్లో వాళ్ళు పెడ్తారు కానీ మీరు కాస్త కూర్చోండి" అన్నారు నాయుడు గారు, అరుగు మీద కుర్చీలో కూర్చుంటూ.

"ఇది ఇంట్లో వాళ్ళు పెట్టే బిక్ష కాదు- మీరు పెట్టేది!" అన్నారీయన కూర్చోకుండా.

"నేనేం బిక్ష పెట్టగలనండీ" అన్నారు నాయుడు గారు ఆశ్చర్యంతో.

"చెరువు గట్టుని ఆనుకుని ఉన్న రెండెకరాల పొలం - దానికి మీరు కంచె వేయించారట గదా. అది ప్రభుత్వం వారిది. సింహాద్రికి ఇచ్చాను. దానిని బిక్షగానైనా నాకు..... అంటే సింహాద్రికి ......................"

నాయుడు గారి మొహం రెండు నిముషాలు కోపంతో, ఆ తర్వాత ఆశ్చర్యంతో ఎర్రబడింది. కనుబొమల మధ్య నున్న ఎర్రటి బొట్టు నలిగింది.

"ఈరిగా" అని పిలిచాడు.

"ఏం దొరా" అంటూ ఈరిగాడు వచ్చాడు.

"చెరువు గట్టు దగ్గర పొలానికి కొత్తగా కంచె వేసావా?"

"చిత్తం దొరా",

"సింహాద్రి పొలాన్ని కూడా కలిపావా?

“.............”

మౌనానికి అర్థం తెలిసింది నాయుడికి.

“సింహాద్రి పొలాన్ని వేరు చేస్తూ మళ్ళీ కంచె మార్చి వెయ్యి” అన్నారు కోపంగా. అలా అని లేచి లోపలికి వెళ్ళిపోయారు. మీ తాత వేపు చూడనైనా లేదు.

నాయుడుగారికి కోపం వచ్చింది అనుకున్నారు మీతాత. తను తప్పుగా ప్రవర్తించానేమో అని అనుమానించారు. నాయుడుగార్ని అన్ని విధాలా అంచనా వేయడానికి ప్రయత్నించారు. తన ఈ ప్రవర్తన ఏదేనా విరోధం క్రింద దారి తీస్తుందేమోనని బాధ పడ్డారు.

ఆ మధ్యాహ్నం నాలుగు గంటలకి వీధి చావిడిలో అలజడిగా అనిపించి నేను బైటకి వెళ్ళాను. బైట నాయుడుగారి తల్లి వచ్చి ఉన్నారు. ఆవిడకు డెభ్భై ఏళ్ళు ఉన్నా ఆరోగ్యంగానే ఉంటారు. చాలా ఏళ్ళ నుండి ఆవిడ ఎక్కడకీ వెళ్ళడం లేదు, ఎందుకొచ్చారో నాకు అర్థం కాలేదు. “రండి రండి” అంటూ ఎదురు వెళ్ళేను.

ఆవిడ వచ్చి వసారాలో కుర్చీలో కూర్చుని, “పంతులుగారున్నారా?” అని అడిగారు.

ఆసరికి, మీ తాత లోపలి నించి వసారాలోకి వచ్చి, “నమస్కారం అండీ, మీరు శ్రమ తీసుకుని రావడం దేనికి? నన్ను పిలిపించక పోయారా?” అన్నారు. ఆవిడంటే ఈయనకే కాదు ఆ ఊరిలో వారందరికీ గౌరవమే!

అందుకే ఆవిడని ఇలా ఊరి రోడ్డు మీద నడుస్తూ చూసి, హడావిడి అయింది.

“పంతులుగారూ, మా అబ్బాయికి, నిజంగా సింహాద్రి పొలం మీంచి కంచె పడిందని తెలీదు, మీరు నమ్మండి” అన్నారు ఆవిడ.

మీ తాత కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి “క్షమించండి అమ్మా, తప్పయిపోయింది. - ఆ విషయం నాకూ అక్కడకి వచ్చాకనే తెలిసింది.” అన్నారు.

నాయుడుగారి తల్లి లేచి, వంటింటి గది దగ్గరికి వెళ్ళి దేవతా పీఠానికి నమస్కరించి తిరిగి వెనక్కి వెళ్ళిపోయారు.

మామ్మ కథాపేసినా, మేమెవరం కదల్లేదు.

“కథింతేనర్రా.......... ఏమిటో ఆ కాలం మనుషులు! విలువల కోసం తెగ పాటు పడేవారు” అంది మామ్మ కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ.

విలువలు *(రచన, సెప్టెంబరు 1996)*

# కష్టం

చంటి అన్నం తిననని మొండిపట్టు పట్టాడు. అమ్మ బతిమాలుతోంది. నాన్న వచ్చి బతిమాలుతున్నారు. అందరూ అన్ని పనులూ ఆపేసి వాడ్ని బతిమాలుతున్నాం. కాని వాడు ఎవరి మాటా వినడం లేదు. మంకుపట్టు ఎక్కువ అయింది.

అప్పుడు మామ్మ వచ్చింది. కొంతసేపు బతిమాలి, వాడు వినకపోతే "నువ్వు తినకపోతే నేనూ తిననురా చంటీ" అంది. చంటి ఏమనుకున్నాడో, ఏమో? రోజూ మామ్మ ఇచ్చే పది పైసలూ, పావలాలూ దొరకవనుకున్నాడో ఏమో? భోజనం చెయ్యడానికి ఒప్పుకున్నాడు.

నేను మామ్మ దగ్గరికి చేరి "బలే మంత్రం వేసావే మామ్మా" అన్నాను.

"అదేం మంత్రం తంత్రం కాదర్రా" అంది గొంతు సవరించుకుంటూ. మామ్మ గొంతు సవరించుకుంది అంటే, కథ చెప్తుంది అన్నమాట. ఆరోజు ఆదివారం అవడం వల్ల, చంటిగాడి సమస్య తీరిపోవడం వల్ల, అందరం మామ్మ చుట్టూ, చేరేం. నాన్న కూడా గోడకి అనించిన పీట తీసుకొచ్చి వేసుకుని దాని మీద బాసినపెట్టి కూర్చున్నారు.

మామ్మ కథ చెప్పడం మొదలు పెట్టింది.

ఆ రోజు ఇంకా తెల్లవారలేదు. కాని రంగిగాడు "పంతులు గారూ, పంతులు గారు," అంటూ దబదబా తలుపు బాదేస్తున్నాడు. విసుగ్గా లేచి "ఏమైందిరా రంగిగా" అంటూ తలుపు తీసాను.

"నాయుడు గారు పోయారు" అని చెప్పాడు.

"ఏమిటీ?' అన్నాను ఆశ్చర్యంతో, ఆ సమయానికే మీ తాత లేచి వచ్చేసారు.

"పంతులుగారూ! నాయుడుగారు పోయారు" అని చెప్పాడు ఆతృతగా రంగిగాడు.

"అదేమిట్రా నిన్న కలిసాను. బాగానే ఉన్నారే" అన్నారు మా తాత ఈ కబుర్ని నమ్మలేనట్టు.

"రాత్రి భోజనం చేసినప్పుడు గుండెల్లో నొప్పిగా ఉందన్నారంటండీ, అర్ధరాత్రి నిద్రలో పెద్దగా మూలిగారట, నిద్రలోనే ప్రాణం పోయుంటుందని అనుకుంటున్నారండి" అన్నాడు రంగిగాడు.

మీ తాతకి ఈ కబురు షాక్‌లా తగిలి ఉంటుంది. ఇంకేం ఆలోచించక కమీజు వేసుకుని, నాయుడు గారింటికి వెళ్ళిపోయారు. అప్పటికి తెలతెలవారుతోంది.

నాయుడుగారింటి దగ్గర జనం మెల్లగా చేరుకుంటున్నారు. నాయుడు గారి ఇద్దరు కొడుకులూ పట్నంలో ఉద్యోగం చేసుకుంటున్నారు. వాళ్ళకి టెలిగ్రాములు వెళ్ళినై.

మీ తాతని చూసి నాయుడుగారి తల్లి భోరున ఏడ్చింది.

"ఇంత అపసవ్యం జరుగుతుందని నేను అనుకోలేదండీ పంతులుగారూ! నా కొడుకు నన్ను మోసం చేసి వెళ్ళిపోయాడు. ఇంత వయసూ వచ్చి నేను బ్రతికుండడం ఏమిటి? వాడు పోవడం ఏమిటి?'' అంటూ వాపోయిందావిడ.

డాక్టరు చెప్పిన ప్రకారం రాత్రి నిద్రలో గుండెపోటు వచ్చి పోయారు. టెలిగ్రాం వెళ్ళి, కొడుకులు వచ్చేసరికి, మధ్యాహ్నం ఒంటిగంటో, రెండో అవుతుంది. ఆ లోపల మిగతా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఊరిలో జనం అంతా నాయుడి గారింటి ముందు చేరారు. పెళ్ళిళ్ళలోనో, దేవుడి ఊరేగింపులోనో, మరో విషయంలోనో, ఊరిలో భేదాలు, తగువులు, అభిప్రాయ భేదాలు వస్తాయేమో లేదా వచ్చాయేమో కాని 'చావులో మాత్రం ఊరంతా ఒకటి! ఉలిపికట్టెలు వెదికినా కనబడవు.

మనిషి చనిపోయిన తర్వాత, మంచే మిగుల్తుంది. అని నమ్మేవాళ్ళలో, ఆ ఊరి వాళ్ళున్నారు. అందరూ నాయుడి మంచితనాన్ని మెచ్చుకుంటున్నారు. ఆయనతో తమకున్న పరిచయాన్ని నెమరు వేసుకుంటున్నారు. ఊరిలో ఆడామగా అందరూ వచ్చి చూసి వెళ్ళారు. ఒంటి గంటయింది. రెండయింది. నాయుడిగారి అబ్బాయిలు మాత్రం రాలేదు.

ఊరి పెద్దలలో ఆతృత ఎక్కువ అయింది. ఊరిలో శవం ఉండగా, ఏ ఇంటిలోనూ పొయ్యి వెలగదు, అందరూ ఏకత్రాటి మీద నడుస్తూ, ఆ సంప్రదాయాన్ని పాటిస్తారు. చిన్న పిల్లలకు కోమటి దుకాణంలో దొరికినవి, ఇంటిలో ఇంతకు ముందు చేసినవి పెట్టి వాళ్ళని ఏమారుస్తున్నారు. అక్కడ అంత్యక్రియలకి శవం లేవాలి, స్నానం చేసి పొయ్యి వెలిగించాలి. 'ఎవడ్రా పెట్టేడీ నియమం?' అని ఎవరేనా ప్రశ్నిస్తే వాడ్ని తప్పు పడతారు. గ్రామంలో సామాన్యుడి చావుకే ఇలా జరిగితే, ఇంక నాయుడు ఊరికి పెద్ద దిక్కు! ఊరిలో కష్టానికి, సుఖానికి కలిసి వచ్చిన మనిషి! అతని ఎడల ఇంకా శ్రద్ధాసక్తులు ఎక్కువగా ఉంటాయి. ఈ విషయం తెలిసిన పెద్దలకు ఆతృత ఎక్కువైంది. ఇదిగో వస్తారు. అదిగో వస్తారు. అనుకుంటున్న నాయుడు కొడుకులు మాత్రం రాలేదు. సాయంత్రం నాలుగు గంటలయింది. ఏ విషయం తేల్చకపోతే రాత్రి అయిపోతుంది. ఊరంతటికీ అటు చూస్తే నుయ్యి, ఇటు చూస్తే గొయ్యి అన్నట్టుగా ఉంది.

అప్పుడు నాయుడిగారి తల్లి యాభై ఏళ్ళుగా ఆ ఊరిలో గడిపి, ఆ ఊరి మంచి చెడ్డలు, కట్టుబాట్లు తెలిసినావిడ మీ తాతని పిలిచింది. మీ తాత ఆమెకి ఏ విషయం చెప్పనవసరం లేకపోయింది.

"పంతులుగారూ నా ప్రారబ్దం. వాడి చేత కొరివి పెట్టించు కోలేకపోయానేమో అని, కాని వాడి తలరాత కూడా అలాగే ఉందేమో! మీ ఏర్పాట్లు మీరు చెయ్యండి. ఊరిని శోష పెట్టడం మంచిది కాదు'' అంది.

నాయుడుగారి అంత్యక్రియలు మొదలయాయి. శవం లేచింది. స్మశానానికి కదలింది. దాని వెనక ఊరంతా వెళ్ళింది.

మీ తాత దహన కార్యక్రమాలన్నీ పూర్తి చేసి, రాత్రి దీపం చూద్దామని నాయుడి ఇంటికి వెళ్ళేసరికి, అక్కడ నాయుడి గారి కొడుకులు ఇద్దరూ వచ్చి ఉన్నారు. మీ తాతని చూసి విరుచుకుపడ్డారు.

"మీరెవరండీ మా ఇంటి నిర్ణయాలు తీసుకోడానికి, ఒక రాత్రి శవాన్ని ఉండనిస్తే మీకేం పోయింది'' అంటూ మీ తాతమీద కోపాన్ని వెళ్ళగక్కారు.

మీ తాత దేనికీ సమాధానం చెప్పలేదు. మౌనంగా వాళ్ళ మాటలన్నీ విన్నారు. ఆయనకి చాలా బాధ వేసింది. తన ఎదుట పుట్టి పెరిగిన పిల్లలు తనని తూలనాడితే, అసహ్యించుకుంటే బాధ కలిగింది, కాని వారి కష్టంలో వారు ఉన్నారు. ఆఖరిసారిగా తండ్రిని చూసుకోలేకపోయారు అని సమాధానపర్చుకుని, ఇంటికి వచ్చి స్నానం చేసి, పొద్దిటి నుండి పచ్చి మంచినీళ్ళైనా తాగలేదేమో, కొంచెం ఫలహారం చేసి పడుకున్నారు.

మర్నాడు అందరం ఆలస్యంగా లేచాము. చిట్టి కూడా ఆలస్యంగానే వచ్చింది. కళ్ళాపు జల్లుదామని వీధి వాకిలి తలుపు తెరిచింది. అరుగు మీద నాయుడి గారి కొడుకులిద్దరూ కూర్చుని ఉన్నారు. ఆ విషయం నాతో చెప్పింది. నేను వెళ్ళేను.

"ఏమైంది బాబూ ఇలా వచ్చారూ''! అని అడిగాను. ఆ గొంతుకలో నిన్న జరిగిన దానికి నిరసన, వెక్కిరింపూ ఉన్నాయని నాకు అర్థం అయింది.

ఇద్దరూ ఏడ్చేశారు. 'మావయ్య గార్ని'.... ఆ తర్వాత వారి నోటి నుండి మాట రాలేదు. "ఎవరే వచ్చిందీ?'' అంటూ మీ తాత అరుగు మీదకి వచ్చారు. వారిని చూస్తూనే నాయుడు కొడుకులు మీ తాత కాళ్ళ మీద పడిపోయారు. "మావయ్య గారూ క్షమించండి'' అంటూ

"ఏమైందర్రా క్షమించడం దేనికీ?'' అన్నారు మీ తాత సహజంగానే.

"మా బామ్మ చెప్పిందండి. ఒక ఇంట్లో శవం ఉండగా, ఊరిలో ఏ పొయ్యీ వెలగదని. అందుకే ఇలా చెయ్యవలసి వచ్చిందని, ఇందులో ఒకరి నిర్ణయానికి ఎదురు చూడవలసింది లేదని. మా తెలివి తక్కువతనానికి, తొందరపాటుకి సిగ్గుపడుతున్నాం. మావయ్యగారూ'' అన్నారు ఇద్దరూ.

"ఇందులో తొందరపాటు ఏ ముందర్రా, తండ్రిపోయాడు. ఆఖరి నిమిషంలో చూసుకోలేక పోయాం అన్న తపన అందరిలోనూ ఉంటుంది...... అంతమాత్రానికి క్షమార్పణలు ఎందుకూ?'' మీ తాత సమర్థింపు.

"అది కాదు మావయ్యగారూ, మేం బయలుదేరేసరికి మధ్యాహ్నం పదకొండు అయింది. పిల్లలు ఆకలని మారాం చేస్తుంటే, ఏం చేయాలో తోచలేదు. ఇంక ఇక్కడికి

వస్తే ఈ పరిస్థితుల్లో ఏవిధంగానూ కుదరదని బస్‌స్టాండ్‌లో పిల్లలకి ఫలహారం పెట్టించాం. వాళ్ళతో పాటు మేము కూడా తిన్నాం. అప్పుడు ఒక బస్సుని వదిలి వేయవలసి వచ్చింది కూడా. ఆ సమయంలో మా మనసుల్లో ఇక్కడ కార్యక్రమాల్లో పడ్డాక ఏమైనా తింటాం తినకపోతాం, కార్యక్రమాన్ని సరిగా చేయలేకపోతామేమో? అన్న ఆలోచనేగానీ, మొత్తం గ్రామం పొయ్యి వెలిగించదనీ, మీరు శ్మశానంలో కార్యక్రమం అయ్యే వరకూ మంచి నీళ్ళైనా తాగలేదని తెలిసి చాలా సిగ్గు వేసింది. మేమెక్కిన బస్సు సగం దారిలో చెడిపోయింది. అందుకే ఇక్కడికి రావడం ఆలస్యం అయింది కూడా...... మొదటి బస్సు ఎక్కి ఉంటే, సమయానికి చేరుకునే వాళ్ళమేమో''.... అంటూ ఏవేవో కబుర్లు చెప్పి వెళ్ళిపోయారు.

వెళ్ళిపోయిన వాళ్ళ వంక చూస్తూ "గ్రామం వదిలేసి పట్నం వెళ్లిన వాళ్లకి నాగరికత పెరుగుతుందా? తరుగుతుందా?'' అని ప్రశ్నించాను నేను.

దానికి మీ తాత, "పట్నం నాగరికత పట్నంది. గ్రామం సంప్రదాయం గ్రామంది. పోల్చకూడదోయ్! అయ్యో మన నాగరికత విలువ కోల్పోయిందే, అని నీకు కష్టం వేసినట్టు, అయ్యో గ్రామం చూపించిన పాటి అభిమానం మనం చూపించలేకపోయామే, అని వారికీ కష్టం వేసింది'' అన్నారు మీ తాత.

అంటూ కథ ముగించింది మామ్మ.

"అలాగే చంటాడు తినను అని అలిగితే, నాకు కష్టం వేసింది. మీకది మామూలుగా అనిపించి బతిమాలారు, వాడి అమ్మ కోప్పడింది. కాని నువ్వు తినకపోతే నేనూ తినన్రా చంటీ అని నేనంటే ఆ చిన్న మనసుకి కష్టం వేసిందర్రా, అందుకే మంకుతనం వదిలేసాడు'' అంటూ అప్పుడే భోంచేసి వచ్చిన చంటిగాడ్ని వడిలోకి తీసుకుంది మామ్మ.

కథ అయిందని తెలిసి లేచి వెళుతూ వొడిలో, ఉన్న చంటోడ్ని చూసి నవ్వుతూ "ఏరా కష్టం వేసిందా?'' అంటూ మొట్టికాయ వేసారు నాన్న. చంటాడు ఏడుపు మొహం పెట్టి మామ్మని చూసాడు.

"ఒరేయ్ రామ్మూర్తీ నీ చెయ్యి ఊరుకోదేమిట్రా'' అంటూ కొంగు నుండి పావలా కాసు తీసి చంటాడికిచ్చింది మామ్మ. అది తీసుకుని చంటాడు వీధుల్లోకి తుర్రుమన్నాడు.

వాడ్ని చూసి "అదీ వాడి కష్టం, ఈ రోజుకి వాడి కష్టాలన్నీ గట్టెక్కినట్టే'' అన్నారు నాన్న నవ్వుతూ.

కష్టం *(రచన, నవంబరు 1999)*

# అతిధి మానవోభవ

రాత్రి ఎనిమిది గంటలకి చదువు ముగించి భోజనాలు చేసి అందరం మామ్మ మంచం చుట్టూరా చేరాం "మామ్మ! కథ చెప్పవా? " అంటూ

మా అందరికీ తెలుసు మామ్మ తాత కథ గానీ చెప్పదు. హీరో తాత ఈసారి ఏం చేశాడో తెలుసుకోబుద్ధి వేసింది. మామ్మ మంచంకింద నుండి మంచినీళ్ళ గ్లాసు తీసి, కాసిని మంచినీళ్ళు తాగింది. మళ్ళీ గ్లాసు మంచంకింద పెట్టేసింది. మామ్మ గుటక వెయ్యడం మాకు వినిపించింది. అంటే కథ మొదలవుతుందన్నమాట!

"ఏం కథ చెప్తావే అమ్మా?" అంటూ నాన్న కూడా వచ్చి మాతో పాటు వెనగ్గా కుర్చీమీద కూర్చున్నాడు.

అప్పుడు మామ్మ కథ మొదలుపెట్టింది.

"మా కాలంలో బస్సులు అవీ ఉండేవి కావు. పక్కనున్న గ్రామాలకి, పట్నాలకి వెళ్ళాలంటే పొద్దున్నే లేచి, తరవాణి తిని, కర్ర చేత్తో పట్టుకు నడుచుకుంటూ పోయేవారు. ఊరు దూరమైతే మధ్యాహ్నం నాటికి ఏ ఊరు చేరితే ఆ ఊళ్ళో తమ వర్ణం గల వారిల్లు కనుక్కుని వారికి అతిధులై పోయేవారు.

ఒకసారి మీతాత, మున్సబు కచేరీ పనిమీద దూరప్రయాణం చెయ్యవలసి వచ్చింది. ఇద్దరూ తెల్లవారుజామునే, బయలుదేరి దీర్ఘంగా నడకసాగించి, మధ్యాహ్నం సమయానికి ఒక ఊరు చేరుకున్నారు. అక్కడ ఊరి వాళ్ళని అడిగి, దగ్గర్లోనే మన వర్ణానికి చెందిన ఒకళ్ళ ఇంటి అరుగుమీద చతికిలబడ్డారు. ఆ ఇంటిలో ఉన్న వాళ్ళు ఎవరో వచ్చిచూసి, లోపలికి వెళ్ళిపోయారు. ఇంటివాళ్ళు మన రాకని గుర్తించారు కదా! మళ్లీ 'మేం మీ అతిథులం' అని చెప్పుకోడం ఎందుకు అని మీ తాత ఉద్దేశం. అదే ఉద్దేశ్యంతో అరుగు మీద ఎంతసేపు కూర్చున్నా లోపలినుండి పిలుపు రాలేదు. ఇంటాయన బయటకి వచ్చి కనీసం పరిస్థితి చెప్పలేదు. మీ తాతకి దీర్ఘ ప్రయాణ బడలిక వల్ల నీరసంగానూ, ఆకలిగానూ ఉంది. కొంతసేపు ఎదురు చూసి ఇక సహనం పోగా, మీ తాత తలుపు తీసుకుని లోపలికి ప్రవేశించారు. అక్కడ దృశ్యం చూసి మీ తాతకి వళ్ళు మండింది. అక్కడ వంటగది బయట వసారాలో ఇంటాయన, మరి ముగ్గురు భోజనానికి కూర్చున్నారు. వడ్డన పూర్తి అయింది. ఇంక తినడమే తరువాయి. మీ తాత ఇంటాయనతో మాట్లాడలేదు. ఇంటావిడతో "అమ్మా! కాస్త చెంబుతో దాహం ఇప్పించండి!" అన్నారు.

ఆవిడ ఇంటాయనవేపు ఒకసారి చూసి లోపలకి వెళ్ళి, చెంబుతో నీళ్ళు తీసుకొచ్చి మీ తాతకి ఇచ్చింది. ఇంటాయన మౌనంగా కూర్చున్నాడు. మీ తాత మంచినీళ్ళు తాగి

వెళ్ళిపోతే, వాళ్ళు భోజనం చేయడం మొదలు పెట్టవచ్చని, అందరూ భోజనం దగ్గర మౌనంగా కూర్చున్నారు. నీళ్ల చెంబు పుచ్చుకున్న మీతాత వసారాలో మూలగా ఉన్న తూము దగ్గర కెళ్ళి నోటిలో నీరు పోసుకుని చప్పుడయ్యేటట్టు పుక్కిలించి ఆ తూములోకి ఉమ్మసాగారు. ఈ పని ఇంటాయనకి, భోజనం దగ్గర కూర్చున్న వాళ్ళకి ఇబ్బంది కలిగించింది కానీ మౌనంగా కూర్చున్నారు. మీ తాత చెంబు నీళ్లు అయిపోయిన తర్వాత మళ్లీ చెంబునీళ్లు పుచ్చుకుని, మళ్లీ అలాగే చేయసాగారు. ఇంటాయనకి కోపం వచ్చింది. కానీ ఏం మాట్లాడలేదు. సహించారు. మీ తాత కూడా ఆగకుండా అయిదు చెంబుల నీళ్లు పుక్కిలించి ఉమ్మారు.

అక్కడితో ఇంటాయనకి సహనం పోయింది.

"ఇదేమి మనిషివయ్యా, మంచీ మర్యాదా లేదా?'' అని అడిగాడాయన.

"నువ్వేం మనిషివయ్యా, మంచీ మర్యాదా లేదా? అన్నారు'', మీ తాత కోపంగా, ఇలా ఇద్దరూ ఒకరి తప్పులు ఒకరు పట్టుకుంటూండగా, ఇంటావిడ పంపున ఊళ్ళోకి వెళ్ళి ఊరి పెద్దల్ని వెంటబెట్టుకొచ్చాడు వాళ్ల అబ్బాయి. ఊరి పెద్ద వచ్చి "ఏమిటోయ్ ఏమయింది?'' అని అడిగారు ఇంటాయన్ని.

ఇంటాయన మీ తాత చేసిందంతా నేరంలా చెప్పాడు. ఊరి పెద్దలకి ఆశ్చర్యం వేసింది.

"ఏమండీ మీ రెవరూ? ఏ వూరు''? అని అడిగారు.

దానికి మీ తాత "మీరు ఆ వివరాలైనా అడిగారు, ఈయన అదీ అడగలేదు, ఎంత గొప్పవాడండీ?''! అంటూ వివరంగా చెప్పారు.

"మేం, అంబకండీ గ్రామస్తులం, పనిమీద రాజాం వెళ్తూ మధ్యాహ్నానికి ఇక్కడ చేరాం. ఈయన మన వర్ణంవాడే అని తెలిసి, ఈయన ఇంటి అరుగు మీద కూర్చున్నాం. అతిథులు అని తెలిసి కూడా ఈయన మమ్మల్ని పలకరించలేదు. భోజనానికి రమ్మనలేదు. అసలు అతిథ్యం అంటే ఏమిటో తెలియనవాడిలా, తలుపేసుకుని తన భోజనం తను పెట్టుకుని తింటున్నాడు. మీ ఊరి మర్యాద చాలా గొప్పగా ఉంది!'' అన్నారు.

ఊరి పెద్దకి చాలా తప్పు జరిగిపోయింది అనిపించింది. "ఏరా నిజమేనా?'' అని అడిగారు ఇంటాయన్ని. ఇంటాయన అవునన్నట్టు తలూపి దీనంగా "ఏం చెయమంటావ్ బాబాయ్! ఇంట్లో తిండిగింజలు నిండుకున్నాయి. దొరగారింటి నుండి ఈ పూటకి సరిపోయినన్ని తెచ్చాను. ఒక కూర లేదు, పప్పులేదు, చింతకాయ పచ్చడి, కరివేపాకు పచ్చడి, నిన్నటి మజ్జిగ. వీటితో అతిథులని పలకరించడం అంటే క్షేమ సమాచారాలు

అడగడం కాదుగా, భోజనానికి లెండి అనాలి! ఆ తాహతు లేకే మౌనంగా ఉండిపోయాను!" అన్నాడు. ఆయన కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. పరిస్థితి నలుగురి ఎదురుగా చెప్పుకోవలసి వచ్చినందుకు. అంతా విన్న ఊరి పెద్ద ....ఇంటాయన వైపు రెండు నిమిషాలు మౌనంగా చూసి, "అయినా నీదే తప్పురా! నీ ఇంట్లో నువ్వు అతిథి సత్కారం చేయలేనప్పుడు నీ ఇంటి గడపలో కూర్చున్న అతిథికి ఇంకో ఇంట్లో ఏర్పాటు చేయడం నీ బాధ్యత.... ఇలా చేస్తే తప్పు పట్టరూ? ఏమైనా తప్పు....." అని ఇంటాయన్ని మందలించి, మీ తాతతో "అయ్యా, తప్పు జరిగిపోయింది. వాడి తరుపున నా క్షమార్పణలు. మీకు సరైన అతిథి మర్యాద చేయలేననే సందేహంతో మిమ్మల్ని పిలువలేదు. అంతేకానీ, మిమ్మల్ని నిర్లక్ష్యం చేయాలని, అవమానించాలని కాదు. మా ఇంటికి రండి!" అని మీ తాతతో అన్నాడు.

మీ తాతయినా జరిగిందేదో జరిగిపోయింది అని వదిలి వేయవచ్చా?" అలా కాదు... "మీ ఇంటికి రాను. ఈ ఇంట్లోనే అతిథ్యం స్వీకరిస్తాను!" అన్నారట మొండిగా.

"అదేవిటండీ, వాడు ఏమీ పెట్టలేను అంటున్నాడు. ఆ వండిందా చల్లారిపోయింది!" అని మీ తాతకి నచ్చచెప్పాలని చూశాడట ఊరిపెద్ద. మీ తాత ససేమిరా వినిపించుకోలేదు. అప్పుడు ఊరిపెద్ద "ఒరేయ్ పిల్లలూ! మీరు మా ఇంటికి పదండి!" అని పిల్లల్ని వాళ్ళింటికి తీసుకెళ్ళి మీ తాతకి అక్కడే ఆతిథ్యం ఏర్పాటు చేశారు.

ఇంటాయనతో కూర్చుని మీ తాత, తాతతో వెళ్ళిన మున్సబు, చింతకాయ పచ్చడి, కరివేపాకు పచ్చడితో భోజనం అయిందనిపించారు. ఈ సమయంలోనే ఊరి పెద్ద ఇంటినుండి అరటిపళ్ళు, తాంబూలం వచ్చాయి. అవన్నీ ఇంటావిడ పళ్ళెంలో పెట్టి మీ తాత దగ్గర పెట్టిందట. ఆయన వాటి వేపైనా చూడకుండా తులసికోట దగ్గరకెళ్ళి తులసిని తెంచి నోట్లో వేసుకున్నారట!

"వస్తానయ్యా!" అని ఇంటాయనతో చెప్పి, ఇంటావిడ దగ్గరకెళ్ళి "నాలా దబాయించి అతిథ్యం పుచ్చుకున్న వాళ్లు చాలా దగ్గర బంధువుల కింద లెక్క! పెద్దవాడ్ని ఆశీర్వాదంగా ఇస్తున్నాను. పుచ్చుకో తల్లీ"! అని జేబు నుండి పది రూపాయలు తీసి ఆవిడ చేతిలో పెట్టారు" అని బామ్మ కథ ఆపేసింది.

నాన్నకి కథ నచ్చినట్టు లేదు.

"బావుంది, అలా చేయొచ్చా అమ్మా?" అన్నారు నాన్న.

"అలా చేయొచ్చో, లేదో తెలీదు కానీ, అబ్బాయ్! ఇది జరిగిన నాలుగు రోజులకి ఆ ఇంటి కామందు మీ తాతని వెతుక్కుంటూ మన ఇంటి కొచ్చాడు. ఆయన చెప్పిన ప్రకారం ఆ రోజు జరిగిన సంఘటన ఊళ్ళో గుప్పుమంది. ఊరి పెద్ద దొర సాయంకాలం రచ్చబండ దగ్గరికి ఆరోజు తగువు చెప్పిన పెద్దని పిలిచి, ఊళ్ళో ఉన్న మనిషి తింటున్నాడో,

లేడో అనే విషయం పట్టించుకోనందుకు చీవాట్లు వేశాడట. తర్వాత అతనికి తన ఇంట్లో లెక్కలు రాసే పని అప్పగించి, రోజూ తలసరి ఆదాయం వచ్చే ఏర్పాట్లు చేశాడట. ఇదంతా చెప్పి, "అయ్యా ! ఇల్లు దరిద్రంగా ఉంది! నా ఇంటి అతిథిని ఆదుకోండి!' అని ఇంకో ఇంటికి వెళ్ళి ఏం చెప్పుకుంటాం చెప్పండి!" అని వాపోయాడు ఆయన.

దానికి, "అవునోయ్, మనమే డబ్బుకి విలువ పెంచేసి మనం దరిద్రులుగా మిగిలిపోతున్నాం. జీవితం దుర్భరం చేసుకుంటున్నాం! అన్నారు మీ తాత!" అంటూ కథ ముగించింది మామ్మ.

నాన్న మరి మాట్లాడలేదు.

*అతిథిమానవోభవ* *(ఆంధ్రప్రభ 26 జూలై 1999)*

# వలస

జీవితంలో వెనుక జరిగిపోయిన సంఘటనలు, అనుభవాలు చెప్పుకుని ఆనందించని మనుషులు అరుదు. కాని ఎన్నిసార్లు ప్రశ్నించినా, నా ప్రశ్నకి సమాధానంగా కథో - బాధో వెళ్ళబుచ్చుని బామ్మని చూస్తే నాకు ఆశ్చర్యం వేసింది. అయినా నేను పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నిస్తూనే వున్నాను. ఆ రోజు కూడా అదే ప్రశ్న వేశాను.

"బామ్మా, అంతమంచి వూరొదిలేసి, విజయనగరం వచ్చేసారేం తాతగారూ?'' అని

"ఒరేయ్ చెప్పిన కథలు వినడమే కాని మీరు అడ్డదిడ్డమైన ప్రశ్నలు వేయకండి'' అంటూ కసురుకుంది.

నాన్నగారు కూడా ఆ కథపై పెద్ద ఆసక్తి చూపించలేదు. "బామ్మా చెప్పు బామ్మా' అంటూ బతిమాలేను. కొంతసేపు విసుక్కున్నా కథ చెప్పడానికి రాజీ కొచ్చింది బామ్మ.

"ఈ కథ చెప్పకూడదనుకున్నాన్రా. మీరు మరీ మంకు పెట్టేస్తున్నారు'' అంది పక్కబట్టలు సర్దుకుంటూ. జరిగిన సంఘటన బామ్మకి కష్టం కలిగించి వుండవచ్చు. అందుకే ఆ కథ చెప్పనంటోంది. కాని మా పట్టుదలని చూసి కాదనలేక, కథ చెప్పడానికి వుపక్రమించింది బామ్మ. మేము బామ్మ మంచం చుట్టూ చేరాము.

ఓ రోజు పొద్దున్నే చిట్టి పరిగెత్తుకుంటూ వచ్చి "పాపినాయుడ్ని వాడి కొడుకు కొట్టిండమ్మా. చావ బాదిండు'' అంటూ చెప్పింది.

"పాపినాయుడ్ని వాడి కొడుకు కొట్టడమేమిటే? ఎందుకూ?'' అని అడిగాను ఆశ్చర్యంగా.

"అవునండి అమ్మగోరూ, ఈడూ పట్నంలో వుద్యోగం సేస్తుండు గదా. అదే తాసీల్దారు ఆఫీసంట చేస్తుండు. ఈడికి బైట డబ్బులు బాగానే ముడ్తాయంట!

సొమ్మెట్టి ఇల్లు కొనాలనుకుండంట. దానికి డబ్బు సరిపోలా, ఆపాళాన వాడి బాబు దగ్గరకొచ్చి పొలం అమ్మేసీ అదీ ఇదీ యేసి ఇల్లు కడ్తనన్నడంట! ఆడి బాబుకి ఇది గిట్టలా! ఒరేయ్ నువ్వు పట్నంలో ఇల్లుకడ్తావు సరి, మా ముద్ద సంగ్తేటి? నేను నా పత్ర అమ్మనేహే' అని కొడుకు మాటని కొట్టి పారేసిండు.

ఆ పాల్న కొడుకంటడు 'నీ ముద్ద సంగతేటుంది, నేనెట్నా''. కాని అమ్మగోరూ పాపినాయుడికి, ఆడిమీద నమ్మకం కసింత కూడా నేదు. పాపినాయుడంటడు "ఈడు ఈరోజు ముద్దెడతడు రేపెడతడు, బతికున్నంతకాలం ఎడతడని నమ్మకం ఏంటి? ఈడు ముద్దెట్టకపోతే ఈడమ్మ దేవుడి గుడిమెట్ల మీద, నేను ప్రభుత్వం వారి రైళ్ళలోనూ

అడుక్కు తిండమే. అంచేత నేను పొలం చస్తేగాని అమ్మను'' అని మంకుపట్టు పట్టిండండి.

ఆమట్న ఆడికి కోపమొచ్చి 'ఇస్తవా? ఇవ్వవా?' అంటూ పాపినాయుడ్ని సితక బాదిండు' అంటూ చిట్టి దానికి అర్ధం అయిన విషయమంతా టూకీగా చెప్పింది చెప్పి, పాచి పనిచేయడానికి పెరట్లోకి వెళ్ళింది చిట్టి.

పాపినాయుడికి లేక లేక ఆలస్యంగా ఒక కొడుకు పుట్టాడు. పాపినాయుడు వాడ్ని అపురూపంగా పెంచాడు. వాడ్ని పట్నం పంపించి చదువు చెప్పించాడు. అందుకోసం వున్న నాలుగెకరాల్లో రెండు ఎకరాలు తెగనమ్ముకున్నాడు. కొడుకుని చదివిద్దామనే ఆదుర్దాయేకాని, చదువుతున్నాడా? లేదా? అని చూసుకోలేదు. అలా చూసుకోవాలని తట్టలేదు. పాపినాయుడు కొడుకు డబ్బంతా తగలేస్తున్నాడని, సరిగ్గా చదవడం లేదని కబుర్లు తెలిసేవి, కాని అన్నీ పుకార్లుగా కొట్టిపారేసేవాడు, పాపినాయుడు కొడుకు. కొడుకు మాటల్లో తీయదనానికి లొంగిపోయేవాడు పాపినాయుడు. పాపినాయుడి కొడుక్కి పట్నంలోనే చిన్న ఉద్యోగం వచ్చింది. ఆ వుద్యోగంలో ప్రభుత్వం నుంచి, ప్రజలనుంచి సంపాదన మొదలు పెట్టాడు. ఎందుకంటే ఇది ప్రజాప్రభుత్వం కదా!

పాపినాయుడి కొడుకు అక్కడితో ఆగలేదు, తన ఆఫీసులో పనిచేస్తున్న అమ్మాయిని స్నేహితుల సమక్షంలో పెళ్ళిచేసుకున్నాడు. తల్లితండ్రిని పిలవను కూడా లేదు. వీళ్ళ మట్టిగుడ్డల్నీ, బక్కదేహాల్నీ తల్లితండ్రి అని చెప్పుకోడానికి నామోషి కావల్ను!

వాడికి వుద్యోగం వచ్చిన నాటినుండి తల్లిదండ్రికి వో గుడ్డముక్క కూడా తెచ్చిన పాపాన పోలేదు. కొడుకు ఇన్ని చేస్తున్నా పాపినాయుడు నోరు ఎత్తలేదు. ఇంక పాపినాయుడి కోడలు 'పల్లెటూర్లంటే నా కసహ్యం. నేను అక్కడకి రాను' అందిట! దాంతో ఈ ముసలి వాళ్ళిద్దరూ ఇక్కడ నుండి కదల లేదు. వాడు వాళ్ళను రమ్మనలేదు. వాడు రానూ లేదు.

పాపినాయుడు కొడుకుని చదివిద్దామన్న తాపత్రయంలో రెండెకరాలు తెగనమ్ముకున్నాడు. ఇంక రెండెకరాలు మిగిలాయి. కొడుకు వ్యవహారం చూస్తుంటే వీడికి నాగరికత అబ్బింది కాని, సంస్కారం మాత్రం అబ్బలేదు.

పల్లెటూర్లో వార్త, తెల్లవార్జామున కోడికూత లాంటిది. కొడుకు పాపినాయుడ్ని కొట్టాడన్న విషయం వూరంతా పాక్కింది. ఎంత బక్క రైతైనా పాపినాయుడు కాపు కులస్తుడు. డెబ్బై ఏళ్ళ ముసిలాడు. అలాంటివాడ్ని కొడుకు పట్టుకు కొట్టాడంటే! ఆ కులపాళ్ళే గాక, మొత్తం గ్రామమంతా బాధపడ్డారు. పాపినాయుడి కొడుకుని తన్ని గ్రామంలోంచి తగలెయ్యగలరు, కాని వాడికి వాడి వయసులో వున్న వాళ్ళలో పట్టువుంది. వీడి నేస్తుల్లో గ్రామ సర్పంచ్, కొత్త కరణం అందరూ వున్నారు. వీళ్ళు పట్నం వెళ్ళినప్పుడల్లా, మందు కొట్టించడం, కక్కలు, ముక్కలు పెట్టిచండం వల్ల పాపినాయుడు కొడుక్కి వూర్లో వున్న కాపు యువకుల్లో పట్టు వుంది. ఎంత లేదన్నా వూళ్ళో కుర్రకారు ప్రవర్తన

వుధృతం బాగానే వుంది. తమ పట్టు జారిపోతుందని తెలిసినా పెద్దవాళ్ళు ఏం చెయ్యలేక కుర్రకారు విలువలకి, సమాధాన పడిపోతున్నారు. కాని సమాధాన పడని వాళ్ళు బాధపడుతున్నారు. కాని వాళ్ళని అడ్డుకోలేకపోతున్నారు.

వీడు కుర్రకారు అండ చూసుకుని తండ్రిమీద తిరగబడ్డాడు. ఆ చుట్టుపక్కల పెద్దవాళ్ళు ఏం చెప్పినా వినడం లేదు.

ఇంక మీ తాత కరిణీకం వొదిలేసారు. పొద్దున్నే లేవడం, కాలకృత్యాలూ, దేవతార్చన, పదకొండు గంటలకి భోజనం, కాస్త విశ్రాంతి, మధ్యాహ్నం రెండు గంటలకి చదరంగం బల్ల, పావులు తీసుకుని మున్సబు గారింటి ముందు ఆట వేసుకునేవారు. అలా కాలక్షేపం చేస్తున్నారు.

అలాంటి సమయంలో వార్త పొక్కిన రోజు సాయంత్రం లచ్చుంనాయుడు, వీర్నాయుడు పాపినాయుడ్ని వెంట బెట్టుకుని ఈయన దగ్గరికి వచ్చారు. జరిగింది చెప్పారు.

మీ తాత వాళ్ళు చెప్పిందంతా విని "నేనేం చెయ్యనర్రా! ప్రస్తుతం కరణాన్ని కూడా కాదు, అమ్మకం ఆపించడానికి. అంతా కుర్రకారు చేతుల్లో వుంది. నే చెప్తే మీ వాడు వింటాడని నమ్మకం ఏమిటి? మనల్ని పొమ్మంటాడు. అప్పుడేం చేస్తాం, మనం వాడితో కలబడతామా? అయినా నా మాట వినేవాడయితే, వాడు మీ మాటే విన్ను" అన్నారు.

కాని పాపినాయుడు "మీరే కాపాడాలి. ఏదో దారి చూపించండి. వాడొచ్చినప్పుడల్లా నాదే కదా - పొలం ఇయ్యి అమ్ముక పోతానంటుండు. మరి నా సంగతేట్రా అంటే నేను నెల నెలా నీకు డబ్బు పంపుతా అంటడు. ఆడికి పొలం ఇచ్చేస్తే వాడది అమ్ముకుపోతడు. నేను కాటికి పోవాల, ముసల్దానితో సహా" అంటూ కళ్ళంట నీళ్ళు పెట్టుకున్నాడు పాపినాయుడు.

అది చూసి మీ తాత మనసు కరిగింది. ఇన్నాళ్ళుగా తల్లీతండ్రిని చూడని కొడుకు ఇప్పుడు చూస్తాడనుకోవడం కల్ల. పాపినాయుడికి తను చేయగల సాయం కొంచెమైనా చేద్దామనిపించింది.

'రేపు రచ్చబండ దగ్గర పెద్దలందర్నీ చేర్చు. కుర్రకారు వుధృతం తగ్గించాలంటే, మనం కలిసికట్టుగా, కొంచెం తీవ్రంగా మీ వాడికి సమాధానం చెప్పాలి' అన్నారు. కాని అలా చేసినా పాపినాయుడి కొడుకు పెద్దల్ని మన్నిస్తాడన్న నమ్మకం మీ తాతకి లేదు. అదే నిజం అయింది కూడా! ఆ రాత్రి రంగిగాడు కబురు పట్టుకొచ్చాడు.

"పెద్దాళ్ళూ లేదు, గిద్దోళ్ళూ లేదు. ఆ ముసలి కరణం నన్నేం చెయ్యగలడు. మొత్తం లెక్కకడితే, ఆడి కులపాళ్ళ గడపలు నాలుగు గూడా లేవు. వీడి పెద్దరికం ఏమిటో నేనూ చూస్తాను' అన్నాడట పాపినాయుడి కొడుకు.

అది విన్న మీ తాత ఏం మాట్లాడలేదు. పెద్దనాయుడు పోయాక వూరంతా వొక తాటి మీద లేదు. వూరిలో అనేక మార్పులొచ్చాయి. అందులో వొకటి పెద్దవాళ్ళని, వాళ్ళ పెద్దరికాన్ని పట్టించుకోకపోవడం!

ఏం చేయాలా? అని ఆలోచిస్తున్న మీ తాతకి సింహాద్రి జ్ఞాపకం వచ్చాడు. సింహాద్రికి ప్రభుత్వం వారి పోరంబోకు భూమి రెండెకరాలు ఇప్పించారు మీ తాత. ఆ భూమిని బాగుచేసి, దాంతో ఇల్లు గడిచేసరికి, వాడి ఆలోచనలు, వుద్దేశాలు కొంచెం కొంచెంగా బయటకి వచ్చాయి. ఆ పేటలో కుర్రవాళ్ళందర్నీ చేర్చాడు. వాళ్ళందరికీ 'దళిత సేన' అని పేరు పెట్టాడు. వాళ్ళని కార్యోన్ముఖుల్ని చేసాడు. వాళ్ళతో తమ వాడలో లేని సదుపాయాలన్నీ స్వయంకృషితో ఏర్పరచి, వాటిని బాగుచేసాడు. పక్క వూర్లోంచి సానుభూతిపరులైన టీచర్లను రప్పించి రాత్రిబడి అంటూ, ఆ పేటలో వాళ్ళకి చదువు చెప్పించడానికి ప్రయత్నించాడు. ఈ ప్రయత్నాలన్నింటికీ మీ తాత సాయం చేసారు. అందుకే సింహాద్రికి మీ తాత అంటే గౌరవం. అభిమానమూ. ఈ సమయంలో పాపి నాయుడి కొడుకు స్నేహబృందం వుధృతాన్ని అరికట్టాలంటే సింహాద్రి సహాయం ఎంతైనా అవసరం. ఇలా ఆలోచించి సింహాద్రికి కబురు పెట్టారు మీ తాత!

సాయంత్రం సింహాద్రి వచ్చాడు. వాడికి విషయం చెప్పారు మీ తాత. అంతా విన్న తర్వాత 'మీ కెలా మంచిదనిపిస్తే అలా చెయ్యండి కరణంగారూ, మీ వెనక మేం వున్నాంగా'' అంటూ హామీ ఇచ్చాడు సింహాద్రి.

మర్నాడు రచ్చబండ దగ్గర పెద్దలంతా సమావేశమయ్యారు. పాపినాయుడు కొడుకు, వాడి మిత్రబృందం గొంతులు పెంచి రెచ్చిపోయారు. దానికి దీటుగా సింహాద్రి, వాడి "సేన'' రెచ్చిపోయి, పాపినాయుడి కొడుకు మిత్రబృందాన్ని మాట్లాడకుండా చేసారు. మీ తాత, వూరిపెద్దలు పాపినాయుడి పొలాన్ని ఎవరూ కొనకుండా కట్టుబాటు చేసారు. మీ తాత అక్కడితో ఆగక పాపినాయుడి పొలాన్ని సింహాద్రి కౌలుకి చేసుకునేటట్టు ఏర్పాటు చేసారు. ఇప్పుడు ఆ పొలాన్ని విక్రయించాలంటే సింహాద్రిని సంప్రదించాలి. రచ్చబండ దగ్గర జరిగినవన్నీ చూస్తున్న పాపినాయుడి కొడుక్కి పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టయింది. ఇంక పొలం అమ్మకం కుదరదని తెలిసిపోయింది. మర్నాడు పట్నం వెళ్ళిపోయాడు.

పాపినాయుడు కొడుకు వెళ్ళిపోయాక, కాపుల తగాదాలో దళితుడ్ని కలుగ చేసుకోనివ్వడం ఏం సబబుగా లేదు అంటూ దుమారం లేవదీయబోయారు కొందరు. కాని ఆ కాపుల్లోనే కొందరు 'వాడు మన సహాయానికి వచ్చాడు. మన కుర్రకారుకే మన పెద్దరికం మీద గౌరవం లేదు. ఇంకా నయం వాడికైనా వుంది' అంటూ దుమారాన్ని చల్లార్చేసేరు.

వూర్లో దుమారం చల్లబడింది. జరిగిన విషయం మరుపున పడింది. ఆ సమయం

లోనే వొక రోజు పొద్దున్న పది గంటలకి మన ఇంటిముందు పోలీసు జీపు ఆగింది. అందులోంచి పోలీసు కానిస్టేబుల్, మీ తాత పేరు చెప్పి, ఇల్లు ఇదేనా అని అడిగాడు. మీ తాత బైటకి వచ్చి ఏమిటి సంగతి అని అడిగారు. దానికి కానిస్టేబుల్ 'అయ్యా రాజాం పోలీసుస్టేషను ఇన్‌స్పెక్టరు గారు మిమ్మల్ని వెంటనే తీసుకు రమ్మన్నారండి' అన్నాడు.

"దేనికీ?" మీ తాత ప్రశ్న

"తెలీదండి! మిమ్మల్ని వెంటనే తీసుకురమ్మని జీపు పంపారండి" అన్నాడు. మీ తాత 'సరే వస్తాను వుండు' అని చెప్పి లోపలికి వచ్చి, భోజనం చేసి, పదకొండు గంటలకి జీపులో రాజాం వెళ్ళిపోయారు.

జీపు రాజాం వేపు వెళ్లగానే, ఈ వార్త గ్రామంలోకి వెళ్ళిపోయింది. మెల్లిగా వొకళూ వొకళూ గ్రామంలో పెద్దలంతా మా అరుగు మీద చేరారు. మీ తాత పోలీసుస్టేషనుకి వెళ్ళడం గురించి రకరకాలుగా వూహాగానాలు చేసారు. నాకు ధైర్యం చెప్పారు. ఎదురు చూసి, ఎదురుచూసి ఎంతకీ మీ తాత రాకపోయే సరికి ఎవరింటికి వాళ్ళు వెళ్ళిపోయారు.

చీకటి అవుతున్న కొద్దీ మాలో భయం ఎక్కువ అయింది. రాత్రి ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది, పదకొండు, మీ తాత జాడలేదు. అప్పుడు మున్సబు గారు ఇద్దరు పిల్లల్ని పక్క వూరికి పంపి రామ్మూర్తికి అంటే మీ నాన్నకి టెలిగ్రాం ఇమ్మన్నారు. అప్పుడు రామ్మూర్తి విజయనగరంలో వుద్యోగం చేస్తున్నాడు. అక్కడితో వూరుకోక రంగిగాడ్ని రాజాం పంపేరు మున్సబుగారు.

ఆ రాత్రంతా నేను జాగరం చేసాను. తెల్లవారింది. ఏ కబురూ, ఏ విషయమూ తెలియలేదు. ఇటు రాజాం వెళ్ళిన రంగిగాడూ రాలేదు. అటు రామ్మూర్తీ రాలేదు. బాగా పొద్దు వచ్చాక అన్యమనస్కంగా పనులన్నీ పూర్తి చేసుకున్నాను. ఈ రోజు మీ తాత లేక, మువ్వల చేతికర్ర మూల నుండి కదల లేదు. దేవతార్చన దగ్గర గుళ్ళి చెంబులోంచి వుద్ధరిణి కదలలేదు. హారతి గంట వినబడలేదు. దేవుడి ముందు దీపం వెలగలేదు. కాలం గడిచి గడిచి మధ్యాహ్నం పన్నెండు గంటలయింది. ఇంట్లో వంట చేయలేదు. కాలం గడుస్తున్న కొద్దీ నాలో వుద్వేగం ఎక్కువ అయింది. ఏడుపు రావడమే తరువాయి. అదీ కబురు తెలిసి వచ్చిన అన్నయ్యని చూసేసరికి అది వుప్పెనలా వచ్చేసింది.

అంత పెద్దదాన్ని ఏడవడంతో అందరికీ జాలి కలిగించింది. అన్నయ్య నన్ను సముదాయించాడు. అంతకు మించి వాడు ఏం చేయలేడు. నాకు తెలుసు.

ఆ రోజున ఇంకొకళ్ళ ఇంటి నుంచి నాకు భోజనం తెచ్చారు. తినబుద్ధి వెయ్యలేదు. అన్నయ్య బలవంతం మీద ఏదో తిన్నాననిపించాను. ఆ రోజు కూడా సాయంత్రం వరకూ ఏ కబురూ రాలేదు. ఆ రాత్రి కూడా ఏ కబురూ రాలేదు. మర్నాడు సింహాద్రి వచ్చి ధైర్యం చెప్పాడు. తను రాజాం వెళుతున్నానని, ఏం గాబరా పడవలసిన పనిలేదని.

ఈ సమయానికి రామ్మూర్తి గారికీ విషయం తెలిసే వుంటుందని చెప్పి తను రాజాం బయలు దేరాడు.

మూడో రోజు కూడా ఏ సమాచారమూ తెలియకుండానే గడిచిపోయింది. వొకలా చెప్పాలంటే నేను బెగిలిపోయాను. అన్నయ్య కూడా ధైర్యం చెప్పడం మానేసాడు. ఇంటిలో భయంకరమైన నిశ్శబ్దం తాండవిస్తోంది.

నాలుగోరోజు పొద్దున్నే రామ్మూర్తి వచ్చాడు. వచ్చీ రాగానే "అమ్మా బట్టలు సర్దుకో" విజయనగరం వెళుతున్నాం అన్నాడు.

'మీ నాన్నరా' అన్నాను నేను నా గొంతు బొంగురు పోయింది.

'బాగానే వున్నారు. విజయనగరంలో వున్నారు' అన్నాడు రామ్మూర్తి.

ఇంక నేనేం మాట్లాడలేదు. మీ తాతని చూడాలన్న ఆదుర్దాతో నాలుగు చీరలు నావి, రెండు పంచెలు మీ తాతవి తీసుకుని విజయనగరం బయలుదేరాను.

విజయనగరంలో రామ్మూర్తి ఇంటిలో మీ తాతని చూడగానే నా గుండె తరుక్కు పోయింది. మనిషి పదిరోజులు లంకణాలు చేసిన మనిషిలా కనిపించారు.

మీ తాతని చూసి "ఇంక ఇంటికి రారా' అన్నాను.

నా ప్రశ్నకి మీ తాత 'ఇదే నా యిల్లు' అన్నారు దృఢంగా. నాకు ఆశ్చర్యం వేసింది. ఇంతకు ముందు రామ్మూర్తి చాలా సార్లు 'నాన్నా వొక్కరూ ఈ పల్లెటూర్లో ఏముంటారు? నాతో విజయనగరం వచ్చేయండి' అంటూ పిలిస్తే-

"ఎందుకులేరా ఇక్కడ బాగానే వుంది. అక్కడ అన్ని వసతులూ బావుంటాయి గాని, ఇక్కడున్నంత స్వభావికంగా వుండవు. నాకు నచ్చదు. ఇబ్బందిగా వుంటుంది. నేను రాను" అంటూ ఆ పల్లెటూరును వదిలి రావడానికి ఇష్టపడని మనిషి ఈ వొక్క సంఘటనతో ఇంతలా మారిపోతారని అనుకోలేదు.

మర్నాడు సావకాశంగా మీ తాత కునుకు తీస్తుండగా రామ్మూర్తి చెప్పిన విషయం ఏమిటంటే రంగిగాడు రాజాం బస్‌స్టాండ్‌లో మీ నాన్నని కలిసి విషయం అంతా చెప్పాడట! విషయమేమిటో తెలియక ఆదుర్దాగా గ్రామానికి బయలుదేరిన మీ నాన్న, విషయం తెలిసాక ఇంక గ్రామానికి రాకుండా రంగిగాడ్ని తీసుకుని, పోలీసు స్టేషనుకెళ్ళారట. పోలీసు స్టేషనులో మీతాత పక్కగా వొక బెంచీ మీద కూర్చుని, కునికిపాట్లు పడుతున్నారట. ముందురోజు రాత్రంతా పోలీసుస్టేషన్‌లో బెంచీ మీద పడుకోడం వల్ల వసతిగా లేక చాలీచాలని నిద్రవల్ల, మొహం పీక్కుపోయి వుందట. మీ నాన్నని చూసి కళ్ళునీళ్ళు పెట్టుకున్నారట మీ తాత.

స్టేషల్లో, రైటర్ని "ఎందుకు తీసుకొచ్చారయ్యా" అని ప్రశ్నిస్తే, "మాకు తెలీదండి ఇన్‌స్పెక్టరు గారు తీసుకురమ్మన్నారు. తీసుకొచ్చాం" అన్నారట.

"ఇన్‌స్పెక్టరుగారేరి" అంటే

"ఇంటికి వెళ్ళిపోయారండీ" అంటూ జవాబిచ్చారట.

మీ నాన్న ఇన్‌స్పెక్టరు గారింటికి వెళ్లి, నేను ఫలానా అని పరిచయం చేసుకుంటే "రేపు పొద్దున్నే స్టేషన్‌కి రండి మాట్లాడదాం" అన్నాడట ఆ ఇన్‌స్పెక్టరు. కాని విషయం చెప్పలేదట. మీ తాతని వొదిలెయ్యమని రామ్మూర్తి అంటే వీలు కాదు" అంటూ విసుక్కున్నాడట ఇన్‌స్పెక్టరు.

ఇన్‌స్పెక్టరు ప్రవర్తనలో తేడా కనిపెట్టిన మీ నాన్న వెంటనే విజయనగరం వచ్చి అక్కడ పోలీసు కమీషనర్‌తో విషయం మాట్లాడారట. ఆయన రాజాం పోలీసు స్టేషనుకి ఫోను చేసి మీ తాతని తీసుకుని ఇన్‌స్పెక్టర్ని విజయనగరం రమ్మన్నారట.

ఆ విధంగా మీ తాత, పోలీసు ఇన్‌స్పెక్టరు విజయనగరం వచ్చారు.

"ఆయన్ని పోలీసుస్టేషన్‌కి ఎందుకు తీసుకొచ్చారు" అన్న కమీషనర్ ప్రశ్నకి-

ఇన్‌స్పెక్టరు "ఒకతను వీళ్ళ గ్రామం వాడే. ఈయనకి నక్సలైట్లకీ సంబంధాలు వున్నాయని దాన్ని వుపయోగించి ఈయన గ్రామంలో వాళ్ళని భయపెడుతున్నాడని రిపోర్టు చేసాడండి" అన్నాడు.

"గ్రామంలో వాళ్ళని ఎలా భయపెడుతున్నాడో వివరణ ఇచ్చాడా రిపోర్టులో?"

"ఆ! ఇచ్చాడండి. వారం రోజుల క్రితం పాపినాయుడు అనే అతను తన భూమి అమ్మి కొడుక్కి డబ్బిద్దామనుకున్నాడటండీ, ఈయన రచ్చబండ దగ్గరికి అందర్నీ పిలిచి వూర్లో పాపినాయుడి పొలం అమ్మకం కాకుండా కట్టడి చేసి సింహాద్రి అనే అతనికి కౌలుకి ఇప్పించాడట సార్"

"ఈ రిపోర్టులో నిజం ఎంతుందో ఎంక్వైరీ చేసారా?"

"లేదు సార్. ఎంక్వైరీ చేద్దామనుకుంటున్నాను"

"ఎంక్వైరీ చేయకుండా ఈయన్ని స్టేషనుకు ఎందుకు తీసుకొచ్చారు?"

"ఈ విషయం హెడ్‌క్వార్టర్స్‌కి రిపోర్టు చేసారా?"

"ఈయన్ని తీసుకొచ్చి రెండు రోజులైంది. మీరు హెడ్ క్వార్టర్సుకి రిపోర్టు చేయలేదు, ఎంక్వైరీ చేయలేదు. ఈయన్ని ఎందుకు తీసుకొచ్చారో కనీసం ఆయనకి చెప్పలేదు. మీ నెగ్లిజెన్స్‌కి మీమీద ఏక్షన్ తీసుకోవలసివుంటుంది" అన్నాడు పోలీస్‌కమీషనర్ కోపంగా.

ఇన్‌స్పెక్టర్ నీళ్ళు నములుతూ "తప్పయిపోయింది సార్ క్షమించండి" అన్నాడు.

ఇంకేం చెయ్యడానికి లేక పోలీసు కమీషనర్ ఇన్‌స్పెక్టర్ని మరోమారు హెచ్చరించి వెళ్ళిపొమ్మన్నాడు.

ఇన్స్పెక్టరు వెళ్ళిపోయాక కమీషనరు మీ నాన్నతో 'ఇన్స్పెక్టరు కావాలని మీ తాతని ఇబ్బందుల్లో పెట్టాడని, అలా చెయ్యడానికి రిపోర్టుతో పాటు వందో, రెండొందలో ఇన్స్పెక్టర్కి ముట్టచెప్పి వుంటారని, ఇంకా సాగదీస్తే లేనిపోని రభస అవుతుంది అని చెప్పి మీ తాతని తీసుకు వెళ్ళమన్నారట''

ఆ రకంగా మీ తాత రామూర్తి ఇంటికి చేరారు. ఆ సాయంకాలం "నాన్నగారూ గ్రామం వెళతారా?'' అన్న రామ్మూర్తి ప్రశ్నకు మీ తాత "లేదురా ఇంక అక్కడికి వెళ్ళను. ఇక్కడే వుండి పోతాను'' అన్నారట.

ఆ మర్నాడు రామూర్తి, గ్రామం వచ్చి నన్ను విజయనగరం తీసుకొచ్చాడు. అప్పట్నించి ఇక్కడ పడున్నాం. మళ్ళీ వూరి మొహం చూడలేదు.

"మేం గ్రామం వదిలి శాశ్వతంగా ఇక్కడికి వచ్చేసాం అని తెలిసి గ్రామం నుండి పెద్దలంతా వచ్చారు. తిరిగి గ్రామం రమ్మని బతిమాలారు. కాని మీ తాత దేనికీ వొప్పుకోలేదు. కాలక్రమాన గ్రామం ప్రజలు మీ తాతని మర్చిపోయారు. మీ తాత గ్రామాన్ని మర్చిపోయారు'' అంది బామ్మ కథ ముగిస్తూ ....

వలస *(ఆంధ్రప్రదేశ్, మార్చి 1999)*

# మోడరన్ గిరీశం లెక్చర్స్



వెల్చేరు చంద్రశేఖర్

హాపీహోమ్ పబ్లికేషన్స్
**HIG-II-39 SFS (Upstairs)**
**(Near Saibaba temple)**
**Housing Board Colony, P.M. Palem,**
**VISAKHAPATNAM - 530 041**
**velcherucs@rediffmail.com**




**హాపీహోమ్ పబ్లికేషన్స్**

**HIG-II-39 SFS (Upstairs)**
**(Near Saibaba temple)**
**Housing Board Colony, P.M. Palem,**
**VISAKHAPATNAM - 530 041**
**velcherucs@rediffmail.com**

వెల్చేరు చంద్రశేఖర్ 'పిడచ' ఓ అద్భుతమైన అనుభవం, చదివినప్పటి నుండి నన్ను వెన్నాడుతోంది. కుటుంబ వ్యవస్థా స్వరూపం మీద వివిధ కోణాలలో ఆలోచనలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఈ కథను తెలుగు పాఠక సమాజం స్వీకరిస్తుందా - అని సందేహం కలుగుతోంది. ఉద్దేశిత ధర్మం మీద, నిషేధిత కామం మీద, యోగ్యమైన అర్థం మీద మనం బట్టలన్నీ విడిచి చూడగలమా? చూసి భరించగలమా? భరించి మనలని మనం మార్చుకోగలమా? చూడాలని, భరించాలని, మార్చుకోవాలనీ చంద్రశేఖర్ ఈ కథ రాసి ఉండొచ్చు - మార్చుకోవాలంటే మనం ఏం చెయ్యాలి - భరించలేని వృద్ధాప్యాన్ని బలవంతంగా ముగించాలా- కామానికి నిషేధాలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలా - అర్థ సంబంధాలు కేవలం స్థిర, చరాస్థులకు మాత్రమే పరిమితం చేసుకోవాలా? - ఈ ప్రశ్నలు రచయితకి కూడ కలగకపోవచ్చు. కలిగినా సమాధానాలు (పరిష్కారాలు) ఈయన దగ్గర ఉండకపోవచ్చు. ఐనా, ఈ కథల్లాంటివి మనకు కావాలి. ఇవి మన లోపల్లోపలడొల్లను మన కంటి ముందు నిలుపుతాయి. సకల నిషిద్ధాల మీదా మనకొక మానవీయ దృష్టిని కలిగిస్తాయి. అందుకోసమైనా మనం వీటిని ఆహ్వానించవలసిందే.

ఒక బ్రాహ్మణ కుటుంబం నేపథ్యంగా సాగిన ఈ కథా వస్తువుకు భారతీయ సమాజానికి వర్తించే సార్వజనీనతా గుణం ఉంది. శీర్షిక, వస్తువూ ఇందులో సరిగ్గా అమిరాయి. ఏదైనా చిన్ని లోపం ఎంచవలసి వస్తే అది కథ చెప్పే పాత్ర పరిమితులను (లింగ పరిమితులతో సహా) చంద్రశేఖర్ గారు కొంచెం మీరారేమోనని పిస్తుంది. కథనంలో మరి కొంత బిగువును సాధించే అవకాశం ఉంది. ఇంత మరువ రాని కథను రాసిన రచయిత శ్రమ ఫలించింది. వారికి సాటి రచయితగా అభినందనలు. పాఠకుడిగా కృతజ్ఞతలు.

- వివినమూర్తి (బెంగుళూరు)